శ్రీమద్రామాయణసారోద్ధారము

సుందరకాండ-శ్రీపాదుకా వ్యాఖ్యతో

మూలం

మునుకుట్ల నృసింహోధాని (పాకయాజి)

వ్యాఖ్యాత

'శ్రీపాదుక'

ఆచార్య కొల్లూరు అవతారశర్మ (కాశీవాసి)

శ్రీరామాయణసారోద్ధారము – సుందరకాండ

(శ్రీపాదుకావ్యాఖ్యతో)

మూలం

బ్రహ్మశ్రీ ములుకుట్ల నృసింహావధాని (పాకయాజి)

వ్యాఖ్యాత

'సాహిత్యవిద్యాప్రవీణ', 'రాష్ట్రభాషాప్రవీణ' 'సంస్కృతభాషాకోవిద'

'విద్యావారిధి (పి. హెచ్.డి. వ్యాకరణ శిక్షాశాస్త్రములు)

"శ్రీపాదుక" ఆచార్య కొల్లూరు అవతార శర్మ

ఎం.ఏ. (సంస్కృతం)., ఎం.ఏ. (తెలుగు), బి.యస్.సి., బి.ఇడి., పి .హెచ్.డి. అలంకారశాస్త్రము

ఆంధ్రవిశ్వవిద్యాలయ స్వర్ణపతక గ్రహీత, శ్రీపీఠపురస్కారగ్రహీత,

శ్రీకల్యాణానందభారతీపురస్కారసమ్మానితుడు, విశ్రాంత సంస్కృతాచార్యులు,

కాశీవాసి.

విశ్వావసు చైత్రమాసం (శ్రీరామనవమి ఏప్రిల్–2025)

సర్వస్వామ్యములు గ్రంథకర్తవి

శ్రీరామాయణసారోద్ధారము - సుందరకాండ

ప్రథమ ముద్రణ : విశ్వావసు చైత్రమాసం(ఏప్రిల్ 2025)

ప్రతులు : 500

మూల్యము : **యథాశక్తి -యథామతి**
(ఇచ్చిన విరాళము గ్రంథముద్రణకు మాత్రమే వినియోగించబడును)

డి.టి.పి. : "శ్రీపాదుక"

ప్రాప్తి స్థానము : 'శ్రీపాదుక' ఆచార్య కొల్లూరు అవతారశర్మ
హైదరాబాద్ చిరునామా -
ప్లాట్.నం. 104, శ్రీనిధి టవర్స్,
స్ట్రీట్.నం.1, తార్నాక,
సికింద్రాబాద్-500017, (తెలంగాణా), ఇండియా.

వారణాశి చిరునామా -
'శివానందలహరి'
ఇంటి నం-11
శ్రీకాశీ ముముక్షుభవన్, బి1/ 87,
అస్సీ-వారణాసి-221 001, (ఉత్తరప్రదేశ్), ఇండియా.
ఫోన్స్ : +91 7207193951
+91 8179807932

ముద్రణ : మణికంఠ ఎంటర్‌ప్రైజస్
(పోతార్లంక రాము)
అమీర్‌పేట, హైదరాబాద్-500016.
ఫోన్ : 9248783711

అంకితం

పట్టాభిరాముని పాదారవిందములకు

'శ్రీపాదుక'

అస్మత్పితరా వన్దే

సదాశివ సమారంభామ్

వ్యాసశంకరమధ్యమామ్

అస్మదాచార్యపర్యంతామ్ వన్దే గురుపరంపరామ్

పరమేష్ఠిగురువులు



పరమగురువులు

స్వగురువులు

గుర్వంబానుగ్రహాలబ్ధ
సుకృతులు

శ్రీపాదుకా దంపతులు

గ్రంథముద్రణకు సహకరించిన వదాన్యులు

శ్రీమతి & శ్రీ బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి, రమాలీల దంపతులు

శ్రీమతి & శ్రీ సరస్వతుల సత్యనారాయణ, లలిత దంపతులు

శ్రీ రామాయణ సారోద్ధారము -
సుందరకాండ

అభిజ్ఞుల

ఆశీరభినందనలు

అవధూత దత్త పీఠము

శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమము

దత్తనగర్, మైసూరు - 570 025

***దూరవాణి:* 0821 2486486** e-mail: mail@dattapeetham.com

అవధూత దత్తపీఠాధిపతి జగద్గురు పరమపూజ్య

శ్రీశ్రీశ్రీ గణపతిసచ్చిదానంద స్వామీజీవారి

ఆశీస్సందేశము

యత్రాస్తి భోగో న హి తత్ర మోక్షః యత్రాస్తిమోక్షో న హి తత్ర భోగః ।
శ్రీమారుతేస్సేవనతత్పరాణాం భోగశ్చమోక్షశ్చ కరస్థ ఏవ ॥

ఎక్కడ భోగముంటుందో అక్కడ మోక్షముండదు. ఎక్కడ మోక్షముంటుందో అక్కడ భోగముండదు. కానీ ఆంజనేయసేవాతత్పరులకు భోగమోక్షాలు రెండూ కూడా అరచేతిలో ఉంటాయి. సులభంగా సిద్ధిస్తాయి.

అంతటి హనుమత్స్వామికి సంబంధించిన ఈ సుందరకాండ మొత్తము ఇరువదినాల్గు ఆర్షరామాయణాలలోని సుందరకాండలయొక్క సారం. 1930వ సంవత్సర ప్రాంతాలలో **పాకయాజి** అయిన శ్రీములుకుట్ల నరసింహావధానులుగారు **"శ్రీరామాయణసారోద్ధారము"**ను రచించారు. ఇందులో శ్రీరామచరిత్ర అంతా సంగ్రహించబడి, పూరణీయాంశాలన్నీ పూరించబడి లోకంలోకి అవతరించబడింది. దీనికి నాటి కాలంలో పండితులందరూ బ్రహ్మరథంపట్టి పూజించారు. ఆ స్తుతులన్నీ మనకు మూలగ్రంథంలో దర్శనమిస్తాయి.

అంతటి ఈ రామాయణమంతా కూడా నాటి నుంచి నేటి వరకూ పాకయాజిగారు రచించినట్లుగానే గీర్వాణము, తెనుగు గ్రాంథికభాషలకు, పండిత లోకానికి మాత్రమే పరిమితమై ఉంది. కానీ నేటి కాలం వారికి

మాత్రం అలభ్యమై, దుర్గ్రాహ్యమై ఉంది. అయితే ఇంతకాలానికి ఆ కొరతను తీర్చటానికి అవతారశర్మగారు పూనుకొన్నారు. అందుకు మాకు చాలా సంతోషంగా ఉంది.

వారు మొదటగా శ్రీమద్రామాయణంలో సుందరకాండకు శ్రీకారం చుట్టి శ్రీపాదుకావ్యాఖ్యను సంతరించి, లోకానికి అందించి మహోపకారం చేశారు. కనుక ఈ సుందరకాండను అందుకొని ఇందులోని అంతరార్థాలను గ్రహించి ధన్యులు కండి. లోకోపకారంకోసం ఇంత గొప్పగా పరిశ్రమ కావిస్తున్న అవతారశర్మగారికి శ్రీరామచంద్రమూర్తి ఆయురారోగ్యాదులను ఇచ్చుగాక ! వారు మిగిలిన కాండలను కూడా త్వరలోనే లోకానికి అందించెదరు గాక! అని ఆశీర్వదిస్తూ.. **ఓం నమో హనుమతే నమః**

22-03-2025 మీ

మైసూరు. స్వామీజీ

అవధూత దత్త పీఠము

శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమము

దత్తనగర్, మైసూరు - 570 025

దూరవాణి: **0821 2486486** e-mail: mail@dattapeetham.com

అవధూత దత్తపీఠాధిపతి జగద్గురు పరమపూజ్య శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానందస్వామీజీవారి కరకమలసంజాతులు, దత్తపీఠ ఉత్తరాధిపతి పరమపూజ్య పరమహంసపరివ్రాజకాచార్యవర్య

శ్రీశ్రీదత్త విజయానంద తీర్థస్వామీజీ వారి

ఆశీస్సందేశము

వేదవేద్యే పరే పంసి జాతే దశరథాత్మజే ।
వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాద్రామాయణాత్మనా ॥

శ్రీమద్రామాయణం వేదం వంటిది. కనుకనే ఇందులో చతుర్వింశతి బీజాక్షరాలుగల గాయత్రీమంత్రం నిబద్ధమై ఉంది. అందుకే ములుకుట్ల నరసింహావధాని పాకయాజిగారు గత కాలంలో ఇరవై నాలుగు ప్రసిద్ధమైన రామాయణాలలోని విషయాలను యథాతథంగా గ్రహించి అందించారు. అందులోనిదే ఈ సుందరకాండ.

"సుందర" శబ్దం బ్రహ్మవాచకము. అందుకే ఈ సుందరకాండ పరబ్రహ్మకు సంబంధించిన **"సత్యం, శివం, సుందరం"** అనే మూడు గుణాలతో ఉంది. అందుకే దీనికి బ్రహ్మవిషయాన్ని తెలిపే కాండ అనే పేరు కూడ ఉంది. కనుకనే నరసింహావధాని పాకయాజి గారు ఈ సత్యవిషయాన్ని పట్టుకొని తమ సారోద్ధారపీఠికలో **"సర్వసుందర గుణగణపరిపూర్ణ ఏవ సుందరో హనుమాన్"** హనుమంతుడు మూర్తీభవించిన సుందరతత్త్వ సమన్వితుడు అని చాటారు.

అయితే అంతర్దృష్టి గల వాల్మీకి మహర్షులవారు హనుమత్స్వామిని పరబ్రహ్మగా చాటిన ఘట్టాలేవి? అంటే – అవి మనకు ఇలా దర్శనమిస్తాయి.

కిష్కింధాకాండలో హనుమద్బ్రహ్మ **"శోచ్యాశోచసి కం శోచ్యం"** (21సర్గ–3శ్లోకం) అంటూ వాలి మరణానికి శోకిస్తున్న తారాదేవిని ఓదార్చాడు. తరువాత ఈ శ్లోకాన్నే శ్రీకృష్ణపరమాత్మ స్వీకరించి **"అశోచ్యానన్వశోచస్త్వం"** అని ప్రారంభించి గీతను బోధించాడు.

సుందరకాండలోని మొదటిసర్గలో సురసాదేవిఘట్టంలో వాల్మీకి మహర్షులవారు **"సుసంక్షిప్యాత్మనః కాయం బభూవాంగుష్ఠమాత్రకః"** అంగుష్ఠమాత్రపురుషుడిగా వ్యంగ్యధోరణిలో తెలిపారు.

లంకాదహనమైన తరువాత మహర్షులవారు రాక్షసులందరి నోటి ద్వారా **"అనంత మవ్యక్తమచింత్య మేకం స్వమాయయా సాంప్రత మాగతం వా..** (54 సర్గ 38 శ్లోకం)'' అంటూ హనుమంతుడి యొక్క పరబ్రహ్మస్వరూపాన్ని తెలిపారు.

అలాగే శివరామాయణము, పరాశరసంహిత, ఉమాసంహిత, శౌనకసంహిత గ్రంథాలు కూడా **"హనుమంతుడు పరబ్రహ్మ"** అని ప్రతిపాదించాయి. అందుచేత పరమయోగి అయిన హనుమంతుడు సాక్షాత్తు బ్రహ్మపదార్థము. ఆయనకు పరబ్రహ్మకు భేదం లేదు అనేది నిర్వివాదాంశము. అదే పాకయాజిగారి సుందరకాండలో నిరూపితమైనది.

అందుకే బ్రహ్మాండపురాణం –

శ్రుత్వాతు పంచమం కాండం హనుమద్విజయాంకితమ్ ।

ఆంజనేయ ప్రసాదేన బ్రహ్మలోకం స గచ్ఛతి ॥

హనుమంతుడి విజయాన్ని తెలిపే సుందరకాండను విన్నవాడు ఆంజనేయుడి అనుగ్రహంతో బ్రహ్మలోకాన్ని పొందుతాడు.

కాండస్య సుందరాఖ్యస్య శ్రవణాత్పఠనాదపి ।

మాం ప్రాప్నుయాత్ జగద్ధేతుం నాత్ర సందేహ ఇష్యతే ॥

పవిత్రమైన సుందరకాండను విన్నా, చదివినా, పరమాత్ముని పొందగలరు. ఇందులో సందేహం లేదు– అని తెలిపింది.

దీని పేరే **"శ్రీరామాయణసారోద్ధారము."** కనుక ఇందులోని సుందరకాండలో ప్రసిద్ధమైన చతుర్వింశతి రామాయణాలలోని తత్త్వరహస్యాలు మరెన్నో ఉన్నాయి. వాటినన్నిటినీ కూడా అవతారశర్మగారు నేటి కాలానికి తగినట్టుగా తమ **శ్రీపాదుకా వ్యాఖ్య**తో మెరుగులు దిద్ది లోకానికి అందించారు. కనుక ఈ హనుమద్విజయాన్ని భక్తిశ్రద్ధలతో కూడిన ఆధ్యాత్మికదృష్టితో అందుకొని పారాయణ చేసి ధన్యులు కండి. ఇష్టార్థసిద్ధిని పొందండి.

శ్రీహనుమత్స్వామి మరియు గురుదేవులు శ్రీగణపతిసచ్చిదానంద స్వామీజీవార్ల అనుగ్రహం, అవతారశర్మగారు వారి కుటుంబంపై పరిపూర్ణంగా ప్రసరించుగాక! వారు సంకల్పించిన ప్రణాళికానుసారంగా గ్రంథాలన్నీ కూడా త్వరలోనే లోకంలో ప్రకాశించుగాక! అని ఆశీర్వదిస్తూ... జయగురుదత్త.

ఇతి

22-03-2025 — శ్రీదత్తనారాయణ స్మరణమ్

మైసూరు. — **శ్రీదత్త విజయానందతీర్థ స్వామీజీ**

SREE SIDDHEWSWARI PEETA MANASAMSTHAN

SRI SIDDHESWARI PEETAM

(Mouna Swamy Mutt)

COURTALLAM, TENKASI DISTRICT - 627 802

TAMILNADU

Peetadhipati: Paramahamsa, Parivraajakaachaarya, Jagadguru
His Holiness Sri Sri Sri Siddheswarananda Bharathi Maha Swami

ఆశీర్వాద శ్రీముఖము

ఆచార్య కొల్లూరు అవతార శర్మ గారు – కాశీవాసి దైవభక్తులు. భక్తిపరిపూర్ణమైన వారి హృదయంలో పరమేశ్వరి ప్రకాశిస్తున్నది. విశ్వనాథుడు విలసిల్లుతున్నాడు. శ్రీరాముడు విరాజిల్లుతున్నాడు. **“ఏకం సత్ విప్రా బహుధా వదంతి”**.

సర్వాణి రూపాణి విచింత్యధీరః
నామాని కృత్వాభివదన్ యదాస్తే

అన్న వేదతత్వమే వీరి అంతర్గత నిష్ఠితమైనది.

సారస్వతోపాసకులైన వీరి లేఖినినుండి ఇప్పటికి ఎన్నో గ్రంథములుదయించినవి. అన్నీ భక్తి,జ్ఞాన,వైరాగ్య ప్రబోధకములే. కవితాపాండిత్య పరిమళోల్లసితములే. ఇప్పుడీ రామాయణసారోద్ధారవ్యాఖ్య కూడా అటువంటిదే. విజ్ఞాన వికాసోల్లసితమైన యీ రచన రామభక్తులకు, హనుమద్భక్తులకు అత్యంత ప్రీతిప్రదాయకమైనది. **“సుందరే సుందరో రామః సుందరో హనుమాన్ స్మృతః”**–అన్నట్లు ఈ గ్రంథము కూడా సుందరమైనదే. ఇటువంటి ఉత్తమ రచన చేసిన అవతారశర్మ గారికి–వారి యిష్టదేవతలు శభములు ప్రసాదింతురుగాక!

నారాయణ స్మరణతో

సిద్ధేశ్వరానంద భారతీస్వామి

Main Office, Courtallam-94431 84738 Camp Office-94402 08103, 91609 16006

జై గణేష్ జై రాధేశ్యామ్

చైతన్య తపోవన్

శ్రీ శివకేశవ్ పీఠం సంస్థాపక పీఠాధీశ్వరి

పూజ్యశ్రీ శ్రీ శ్రీ మాతా శివానంద సరస్వతీ వారు.

డో.నెం.14-27/1, ఎమ్మార్వో ఆఫీసు దగ్గర, శివకేశవ్ నగర్, తాడేపల్లి-522 502, ఆం.ప్ర

ది. 7-3-25

ఓం శ్రీ గురుభ్యో నమః ! ఓం శ్రీ హనుమతే నమః

యత్ర యత్ర రఘునాథకీర్తనం । తత్ర తత్ర కృతమస్తకాంజలిం ।
బాష్పవారి పరిపూర్ణలోచనం । మారుతిం నమత రాక్షసాంతకమ్ ॥

శ్రీ మద్రామాయణ సారోద్ధారమంటూ రసోద్ధారాన్ని చేసి, సుందరకాండలోని సుందరత్వాన్ని హేతుబద్ధంగా నిరూపిస్తూ, మనబోటి సామాన్యులకు కూడా రసాస్వాదనయందు అనురక్తి కలిగించే అవతారులు మన బ్రహ్మశ్రీ అవతారశర్మగారు. వీరిని ఎంతగా అభినందించినా అల్పమే. అందుకే అభివందనాలు సమర్పిద్దాము.

భాషలో, భావంలో, భక్తిలో, శక్తిలో హృద్యంగా పద్యంగా గద్యంగా అలరించే శ్రీపదమే “శ్రీపాదుక”. బాహ్యంలో యజ్ఞయాగాదులు, జపపారాయణాది సత్కర్మానుష్ఠానం చేస్తూ, మానసికంగా దేవతోపాసన చేస్తూ, బౌద్ధికంగా ఎన్నో రచనలు చేస్తూ, ఆంతర్యంలో ఆత్మానందానుభూతిలో ఉంటూ, శరీర ప్రారబ్ధం మరేదైనా కానీ, “తానూ తన ధర్మం; తానే ఆ బ్రహ్మం” అనే బాహ్యాభ్యంతరాలలో ధర్మ బ్రహ్మల సమన్వయ జీవన్ముక్తులు.

కవిసామ్రాట్టులు శ్రీ విశ్వనాథగారు, శ్రీదాశరథిగార్ల సంభాషణను గుర్తుచేస్తూ తమ వినయాన్ని విధేయతను అభివ్యక్తం చేశారు.

రామాయణ కాలం నాటి మహాజ్ఞాని బ్రహ్మర్షి వశిష్ఠులవారు, కవికోకిలగాను, సింహనాదంగానూ రామాయణాన్ని కీర్తించి గర్జించిన వాల్మీకి మహర్షివారు,

శ్రీశంకరభగవత్పాదులవారు, గౌడపాదులవారూ వీరిలో మనకు దర్శనమిస్తూంటారు. ఈ కలికాలంలో కూడా ఆయా అంశలు సాధకులకు సహకరించేలా అక్కడక్కడా అవతరించిన వారిలో వీరొకరు. అందుకే మాకు అత్యంత ఆత్మీయాభిమానులైన సద్గురువులు వీరు.

ఇంతకూ హనుమంతుడు సర్వదేవతా స్వరూపుడు, సర్వదేవతారాధ్యుడు, అట్టి ఆంజనేయస్వామిని ఈ సారోద్ధార సుందరకాండ హవన-పారాయణల ద్వారా అందరూ ఆరాధించి, అభీష్టసిద్ధిని సుఖశాంతులను పొందుదురు గాక! యని హనుమంతుని ప్రార్థిస్తూ, శ్రీపాదుకవారికి అభినందనానంద మందార వందనాలతో.....

మాతా శివానంద

ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు,
తెలుగువిభాగం–కాశీహిందూవిశ్వవిద్యాలయం

ఆముఖం

ఆచార్య కొల్లూరు అవతారశర్మగారిని చూచినప్పుడల్లా నాకు రఘువంశంలోని ఈ శ్లోకం గుర్తుకు వస్తుంది.

**"తామభ్యగచ్ఛద్రుదితానుసారీ
కవిః కుశేధ్మాహరణాయ యాతః।
నిషాదవిద్ధాండజదర్శనోత్థః
శ్లోకత్వమాపద్యత యస్య శోకః ॥"** (రఘు 14 స–70 శ్లో)

ఇది సీతను లక్ష్మణుడు అరణ్యంలో వదిలివెళ్ళిన తరువాత వచ్చిన వాల్మీకి నుద్దేశించి కాళిదాసు అన్న మాటలు. అడవికి సమిధలు, దర్భలు తెచ్చుకుందామని వెళ్ళినవాడు, ఎక్కడో ఏడుపు వినిపిస్తే, వెళ్ళిన పని విడిచి ఏడుపు వెంట పరుగెత్తాడు. ఎందుకంటే ఆయన స్వభావమలాంటిది. పూర్వం ఇలాగే బోయవాడు కొట్టిన పక్షిని చూస్తే ఉద్బుద్ధమైన శోకం ఆయన నోట శ్లోకంగా మారింది.

కాశీవాసం కోసం వచ్చి, ముముక్షు జీవనాన్ని గడుపుతూ, జపతపాలతో నిరంతరం పరమేశ్వరానుగ్రహ కక్ష్యలో తిరిగే మా అవతారశర్మగారు నిరంతరం సదుపాస్యగ్రంథాన్ని రాయటం చూస్తే అది ఆస్తికజనుల ఆర్తిని చూచి తరుణోపాయాన్ని చూపే ఋషి హృదయస్పందనలా అనిపిస్తుంది.

సర్వపూర్వర్షిహృన్నిష్ఠభావరూపిణి బ్రహ్మశ్రీ ములుకుట్ల నృసింహావధానిగారి "శ్రీరామాయణ సారోద్ధారము". నా చిన్నప్పుడు మా ఇంట్లో మా నాన్నగారి చేతులలో నిత్యమూ కనిపించేది. ఇప్పుడు నాకు నాన్నగారూ లేరు. ఆ పుస్తకమూ లేదు కానీ ఇప్పుడు ఆ రెండూ నాకు పూజ్యశ్రీ అవతారశర్మగారి రూపంలో లభించాయి.

ఇరవై నాలుగువేల శ్లోక పరిమితిగల వాల్మీకి రామాయణ హృదయాన్ని, రామతత్త్వాన్ని ఎందరో మహర్షులు తమ శక్తి కొలదీ వ్యాఖ్యాన రూపంలోనో,

మరో రామాయణ రూపంలోనో వ్రాశారు. వాటిలో 24 రామాయణాలలో ఆయా ఋషులు ప్రతిపాదించిన రామతత్త్వాన్ని, శ్రీరాముని కళ్యాణగుణాలను సంగ్రహించి, క్రోడీకరించి రాశారు. వారి భాష గ్రాంథిక భాష అనటం కంటే సంస్కృతాంధ్రమిశ్రితమైన భాష. ఈనాటి చదువరులకు అంత సులభంగా బోధపడేదికాదు. అందులోని సుందరకాండను పూజ్యులు శ్రీ అవతారశర్మగారు సరళీకరించి, శిష్టవ్యావహారికంలోకి మార్చి రాయటం ఆస్తికజనులైన రామదాసులకే కాదు జ్ఞానవాసులకూ అత్యంత మోదాస్పదమైన అంశం.

"సుందరే కిం న సుందరమ్ " – అన్న ఖ్యాతిని గడించిన సుందరకాండను ఇహపరతారకంగా భక్తకోటి పారాయణ చేస్తుంది. సుందరకాండ వాల్మీకి రామాయణానికి హృదయం. రామాయణమే గాయత్రీగర్భితమని లోకవ్యవహారం. బ్రహ్మాండపురాణం రామాయణాన్ని మహామంత్రమని **'సమస్తమంత్రరాజోయం ప్రబలోనాత్ర సంశయః'** – అని, **'అస్య సుందరకాండస్య సమం మంత్రం న విద్యతే... ఏ తత్పారాయణాత్సిద్ధిర్యది నైవ భవేద్భువి, నకేనాపి భవేత్సిద్ధిరితి బ్రహ్మానుశాసనమ్'** – అని పేర్కొన్నది. అంటే సుందరకాండతో సమానమైన మంత్రమే లేదని, దానిని పారాయణ చేయటం చేత కలిగే సిద్ధి భూమండలంలో దేనిచేతనూ కలగదని, నిజమే అలా సిద్ధిపొందిన ఉదాహరణలు కొల్లలు.

సుందరకాండలో సీతమ్మకు వాడిన ఉపమానాలు పరాశక్తికి అన్వయిస్తాయి. ఈ సుందరకాండ ఉపాసకులకు కుండలినీయోగమే! త్రిజటా స్వప్నము గాయత్రీమంత్రమే! ఆ దృష్ట్యా పరిశోధన చేసినవారు కూడా ఉన్నారు. శ్రీ,దీప్తి, హ్రీ, శాంత్యాది శబ్దాల అర్థం పర్యవసించే దేవీసౌందర్యం ఈ కాండంలో పరుచుకొనియుండటం చేత దీనిని సుందరకాండ అన్నారని దేవీభక్తులు సుందరకాండను ఉపాసిస్తారు. మరికొందరు అంజనాదేవి తన ముద్దుబిడ్డకు పెట్టిన అసలు పేరు సుందరుడని ఇలా... పలువిధాలుగా సుందరకాండను భావన చేసి ఉపాసిస్తున్నారు. అటువంటి సుందరకాండ సారాన్ని మనకోసం ఉద్ధరిస్తున్న పూజ్యులు శ్రీ అవతారశర్మగారు మనందరి నమస్సులకు పాత్రులు.

కేవలం శిష్టవ్యావహారికంలో అందించటమే కాకుండా స్పష్టతకై అక్కడక్కడా శ్రీపాదుక వివరణనీయటం గమనార్హం. అందులో చెప్పిన విషయాలు కూడా భక్తకోటికి మార్గదర్శకాలు. ఉదాహరణకు షష్ఠసర్గలో 29 నుండి 32వ శ్లోకం వరకు గ్రంథకర్త అగస్త్య రామాయణ శ్లోకాలను వాల్మీకీయంతో కలిపి పేర్కొన్నచోట చేసిన శ్రీపాదుక వ్యాఖ్యను చూడండి.

"నదేవాదండమాదాయ రక్షన్తి పశుపాలవత్ ।
యం తు రక్షతుమిచ్ఛన్తి బుద్ధ్యా సంయోజన్తితమ్ ॥"

– అంటే పశుపాలకుడు దండహస్తుడై పశువును వెన్నంటి తిరుగునట్లుగా దేవతలు భక్తులను రక్షించుటకై వారి వెంబడి చరించరు. వారెవరిని రక్షింపదలచెదరో వారికి సకాలములో సద్బుద్ధి ననుగ్రహింతురు. ఆ అనుగ్రహము ఆ భక్తుని కార్యసిద్ధికి కారణమవుతుంది. (పుట–145)

ఇటువంటి శాస్త్రోక్త మర్మాలెన్నో పూజ్యుల లేఖిని నుండి ఆయా సందర్భాలలో ఈ గ్రంథంలో శ్రీపాదుక వ్యాఖ్య రూపంలో చోటు చేసుకున్నాయి. వాటిని చదివి భక్తకోటి అనుష్ఠాన వేదాంతులు కావాలని నా ఆకాంక్ష.

అక్కడక్కడ కనిపించే చిత్రశ్లోక వివరణలు, సందేహమందేహులమైన మనకు కలిగే ధర్మసందేహాలకు జవాబులు ఏది యేమిటో తెలియక మాట్లాడుకునే మనకు ఏది యేమిటో తెలియజెప్పే చర్యలు (అశోకవని – శింశుపావృక్షములనే రెండింటి చర్చ (పుట. 133), ఆచారవ్యవహారాల విశిష్టతలు... ఇలా ఎన్నో విశేషాలు ఈ శ్రీపాదుకలో దర్శనమిస్తాయి. అవన్నీ చదివి మనం జీవిత పరీక్షలో ఉత్తీర్ణులం కావాలి.

తే.గీ ॥ "ఒక తపోలక్షణంబుండునుజ్జ్వలాత్ము
లందభివ్యాప్తమై పొల్చునద్ది బహుళ
పరిసరంబులందు సమతపః ప్రభావ
లక్షణము గల్గు మృదుభావులన్ స్పృశించు "

(కల్పవృక్షం, సుందర, పరరాత్ర ఖండం–12వ పద్యం)

ఆచార్య అవతారశర్మగారి తపోతేజోవలయంతో స్పర్శితమయ్యే పరిసరాలలో అటువంటి తపనతోనే జీవించే అస్మదాదులను తరింపజేయటానికే ఇటువంటి మున్నుడులను వారు మానుండి కోరడం. ఇది మాకు వరము, పరమూ రెండూను. అందుకు వారికి వినయ వినమితశిరస్కులమై 'అంజలి గావించెద, భూసురాన్వయమణీ! సద్బంధుచింతామణీ!'– అనటమే మేము చేయగలిగింది.

విశ్వావసు

శ్రీరామనవమి **– బూదాటి వేంకటేశ్వర్లు**

Samavedam Shanmukha Sarma

‘శ్రీపాదుక’ అనే నామంతో తన వ్యక్తిత్వాన్ని శ్రీ మాతృపాదార్పణం చేసుకున్న మహనీయులు బ్రహ్మశ్రీ అవతారశర్మ గారు ఎన్నో ఆర్ష గ్రంథాల హృదయావిష్కారం చేస్తూ బహుగ్రంథాలను రచించారు. వారి వాఙ్మయతపస్సు, ఉపాసనానిష్ఠ రెండూ అమోఘమైనవి. వాటి బలంతోనే ప్రస్తుత పుస్తకాన్నికూడా వెలువరించారు. రామాయణతపస్వి అయిన బ్రహ్మశ్రీ ములుకుట్ల నృసింహావధానులు గారు రచించిన **‘శ్రీ రామాయణ సారోద్ధార’** మనే గ్రంథం ఒక అద్భుత దివ్య రచన. అందులోని **‘సుందరకాండ’** మరో ప్రత్యేక వాఙ్మయం.

ఆ సుందరకాండను “సరళమైన శిష్ట వ్యవహారిక బాషలో ఆంధ్ర పాఠకులకు తెలియజేయటమే ఈ గ్రంథము యొక్క ప్రధాన లక్ష్య”మని విన్నవించుకున్న శ్రీ శర్మగారు, ఆ ప్రధానలక్ష్యాన్ని ప్రశస్తంగా సాధించారు. అంతేకాదు, తనదైన వాఙ్మయపరిశీలనని, భావనని కూడా కలబోసి రచించారు. గ్రంథ పరిశీలకులకు సులభంగానే స్పష్టమౌతుంది. వీరి ఏ రచనలోనైనా ఉపోద్ఘాతం ఒక ప్రత్యేక గ్రంథమని చెప్పవచ్చు. అలాగే ప్రస్తుత రచనకి కూడా చక్కని ఉపోద్ఘాతాన్ని అందించారు. ఋషుల దృష్టి, హృదయం సంపూర్ణంగా ఎరిగిన దార్శనికులు కనుక తన విశిష్టానుభూతిలో పట్టాభిరామపాదార్పణంగా ఈ గ్రంథరత్నాన్ని సమర్పించుకున్నారు. భక్తి, విజ్ఞానం కలబోసిన భావనతో హనుమత్తత్త్వాన్నీ, రామబ్రహ్మతత్త్వాన్నీ ఎంతో చక్కగా మధురంగా సాక్షాత్కరింపజేసిన **‘శ్రీపాదుక’**కు ప్రణమిల్లుతూ...

బుధజన విధేయుడు

సామవేదం షణ్ముఖశర్మ

Sri Lalitha Dhamam, Plot No.299/300, Road No.8, Phase-I, Saket Colony.
ECIL Post, Secunderabad - 500 062 | Mobile : 94403 82028
Email : samavedam@rushipeetham.org | www.saamavedam.org

అభినవ మల్లినాథ' 'అవధానప్రాచార్య'
'పురాణవాచస్పతి' 'పద్యకళాతపస్వి'
ధూళిపాళ మహదేవమణి
'విశ్రాంతాచార్యులు
రాజమహేంద్రవరం. సెల్ 9494002247.

సుందరే కిం న సుందరమ్

ఆర్షగ్రంథార్థ విద్వజ్ఞా-మవతార సుధీ సుతాం।
వందే శ్రీమజ్జగన్మాతుః-పాదుకా మార్ష వేదికామ్॥

ఇప్పటికే ఎన్నోసార్లు శ్రీపాదుకా కింకిణీ శ్రుతులు నేను ఎంతగానో ఆస్వాదించాను. అవి శ్రవః పేయాలు. హృదయంగమాలు. రహస్యార్థ మరందాలు.

ఈపాదుక అవతరించి దాదాపు మూడు దశాబ్దాలు కావస్తోంది. అప్పటికీ ఇప్పటికీ ఒకేబాట. ఒకేదీక్ష. ఆర్షహృదయాంతర్గతాల్ని బాగా ఆస్వాదించి రమ్యంగా ఆస్వాదన చేయించడమే ఈ శ్రీపాదుకా లక్ష్యం. ఇదిగో ఇప్పుడీ సారోద్ధారానికి పాదుకలు తొడుగుతోంది. ఇదంతా అమ్మవారి కారుణ్యం. ఆ కాశీనాథుని అనుగ్రహం. ఆ లబ్ధిని పొందిన వారే శ్రీ కొల్లూరు అవతార శర్మగారు.

నిజానికి శర్మగారివంటి పాండిత్యం కలవారు చాలామందే ఉన్నారు. కవనోపాసకులకీ లోకంలో లోటులేదు. కానీ చాలా మంది ఆత్మోద్ధారకులే. శ్రీశర్మగారు అలాకాదు. స్వపరోద్ధారకులు. ఇప్పటివరకూ జగత్పితరులైన శివాశివుల గ్రంథౌఘాన్ని మథించి భావామృతాన్ని అందించారు. ఇపుడిలా సుందరావతారుడైన హనుమత్ప్రసాద సారోద్ధార సారాన్ని అరచేతిలో పెడుతున్నారు. ఇది మహానందం.

శర్మగారిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

బ్రహ్మశ్రీ ములుకుట్ల నృసింహావధానిగారు 24 రామాయణాల సారంతో ఉద్ధరించిన రామాయణ సారాద్ధారంలో సుందరకాండ కిది రమణీయ

సరళ వ్యాఖ్యానం. పండిత పామరుల నందర్నీ రంజింపజేసే వ్యాఖ్యాపీయూషం ఇది. అవతారశర్మగారు పడిన కష్టానికి తగిన ఫలం లభించింది. ఆ హనుమత్స్వామే అండదండలయ్యాడు స్వయంగా వీరికి. లేకపోతే వయో రాక్షసి ముసిరినా, శరీర పాటవం కసిరినా , మనశ్చైతన్యం ఇలా ఉసిగొల్పినా వ్యాఖ్యా వ్యవసాయం చేసి సస్యసారాన్ని పొందగలగడం సాధ్యం కానే కాదు. శర్మగారు ఈవిషయంలో పూర్ణకాములయ్యారు.

ఇక వీరు ఈగ్రంథంలో మూలాన్ని తెలుగులో సరళీకరించడంతోబాటు తమ వివేవచనతో ఎన్నో క్రొత్త విశేషాల్ని ఆవిష్కరించారు.

తతో రావణనీతాయాః అన్నశ్లోకంలో హనుమ "చారణాచరితేపదిథి"లో అన్వేషణ ప్రారంభించినట్లుంది. అక్కడ చారణ శబ్దానికి చాలామంది అనేక రసమార్గాల్లో వ్యాఖ్యానించారు. శ్రీ అవతారశర్మగారు "చారయంతి ఆచారయంతి ధర్మాన్" అని నిర్వచిస్తూ ధర్మమార్గాన్ని ప్రవర్తింపజేసే పూర్వాచార్యులని విశేషార్థం చెప్పడం ఎంతోబావుంది. (36 వ పుట)

అలాగే "తతోరావణ నీతాయాః" అని సుందరకాండను యగణంతో ప్రారంభించడంలోని విశేషాన్ని చెబుతూ–

ప్రకృత్యా యగణో నిత్యం శ్రీకరః కథ్యతే బుధైః ।
కరోత్యర్థా నాదిలఘు ర్యగణో వారిదైవతమ్ ॥

అది శ్రీకరమనీ, ఆదిలో లఘువుతో ప్రారంభించడంవలన సకల ప్రయోజనాలూ నెరవేరుతాయనీ, యగణం అయితే జలదేవతా వాచకమనీ ఛందఃకారుల ప్రమాణంతో చెప్పడం అపురూపమైన వ్యాఖ్య. (పుట 34)

ఈగ్రంథంలో హనుమకు సాక్షాత్తూ బ్రహ్మగారే వచ్చి సుందర హనుమన్మంత్రాన్నీ 27 హనుమ నామాల్నీ చెప్పడం జరిగింది. అవి పఠిస్తూ ఉపాసించిన వారికి కరోనా మున్నగు మహామారక అంటురోగాల్నీ, కర్కటీరాక్షసి యొక్క నానా పీడలూ ఉండవని చెప్పబడింది. మనం అంతా ఆ కరోనా విలయాన్ని చవిచూసినవారమే కదా. ఇది ప్రపంచం లోని వారికందరికీ మహాప్రయోజన కారి. మనం అంతా తప్పకుండా ఆ ఫలాన్ని అందుకొని సుఖశాంతులతో చిరంజీవులం కావాలి. (పుట 77 & 78)

ఇందు 4వసర్గ 3శ్లోకం వ్యాఖ్యలో ఆనాటి దూరమానం అంగుళం

నుండీ ఆమడ వరకూ ఈనాటి దూరమానం సెంటీమీటర్ నుండీ కిలోమీటర్ వరకూ వివరంగా చెప్పడం ఉభయ పాఠకులకూ చాలా ప్రయోజనకరమే. (91వపుట)

ఇందులో వీరు "హనుమ బ్రహ్మచారా? లేక గృహస్థా?" అన్న విషయాన్ని సలక్ష్యంగా వివేచించిన రీతి ప్రశసనీయం (96 & 97 పేజీలు)

హనుమ సీతా అన్వేషణలో మండోదరిని చూసి సీతే అనుకొని **"ఆస్ఫోటయామాస చుచుంబ పుచ్ఛం-ననంద చిక్రీడ జగౌ జగామ"** అన్న విధంగా కుప్పిగంతులు వేసిన ఘట్టం అమోఘమైన వ్యాఖ్యానంతో నడిచింది. హనుమ వంటి బుద్ధిమతాం వరిష్ఠుడు మండోదరిని చూసి సీతను అన్వేషణతో చూడగలిగానన్న ఆత్మశ్లాఘతో జబ్బలు చరుచు కోడమూ, తన నీచాంగమైన తోకను ముద్దుపెట్టు కోడమూ, ప్రక్కనే ఉన్న స్తంభాన్ని గబగబా ఎక్కేయడమూ, జరజరా క్రిందకు జారడమూ వంటి కోతి చేష్టలకు కారణం ఏమిటనిపిస్తుంది? ఒక రాక్షస స్త్రీ దేవతాస్త్రీ ఐన సీతలా ఉండడం ఎలా సంభవం? అన్నవానికి ఇందులో సరైన సమాధానం దొరుకుతుంది.

ఒకప్పుడు పార్వతీదేవి శివుణ్ణి -

కథం మండోదరీ సీతాసదృశీ రాక్షసీరితా ।

రావణ సతి మండోదరి సీతలా ఎందుకనిపిస్తుంది? అని అడిగింది. అప్పుడు శివుడు-

శ్రుణుష్వ కారణం దేవి! సీతేయం విష్ణునా చితా ।

తేనైవ విష్ణునా పూర్వ మియం మండోదరీ చితా ॥

(ఆనందరామాయణం)

"దేవీ ! పూర్వం విష్ణువు మండోదరిని సృజించాడు. తిరిగి శ్రీహరే సీతనూ కల్పించాడు. అందువల్ల ఇద్దరూ సమానలక్షణాలు కలిగి ఉంటారని" సమాధాన పరచాడు. (108 పుట నుండీ) రావణుడు తన తపః ఫలంగా ఆత్మలింగాన్నీ, పార్వతీదేవినీ ఇమ్మని శివుణ్ణి కోరగా ఇచ్చేసాడు. అందువల్ల పార్వతి రావణుణ్ణి వెన్నంటి వెళ్తూ హరిని తలచుకొని రక్షించమంది. అపుడు శ్రీహరి పార్వతిలా మండోదరిని సృష్టించి రావణునితో నీవెంట ఉన్నది పార్వతి కాదనీ మహాకాళి అనీ చెప్పి ఫలానా చోట పార్వతి రహస్యంగా ఉందని చెప్పి మాయతో పార్వతిని

విడిపించాట్ట. కనుక పార్వతీ, సీతా, మండోదరిలు ముగ్గురూ ఒకేలా ఉంటారట.

ఇలా ఇతరేతర ఆర్ష గ్రంథాల సహాయంతో ఈ సారోద్ధారం మూలాన్ని సమన్వయపరుస్తూ సాగిన పద్ధతి చాలా హృదయంగమంగా నడించింది.

ఇందులో ప్రతి విషయమూ సుందరమే. అందుకే ఈ సారోద్ధార సుందరకాండలో –

"సుందరే కిం నసుందరమ్" సౌందర్యంలేని దేదీ లేదు.

ఇలా ఎన్నెన్నో విశేషాలిందులో ఉన్నాయి. అన్నీ తెలియాలంటే ఈగ్రంథం చదివే తీరాలి.

శ్రీఅవతార శర్మగారు ఈ కృతి సాఫల్యానికి మహోన్నతమైన కృషి చేసారు. వ్రాస్తున్నంత సేపూ అన్ని రామకథల్నీ ఉపాసిస్తూనే ఉన్నారు. వారికి నా ప్రత్యేక ప్రశంస లందిస్తూ అందరూ ఈ కృతిని ఆదరించి చదువుతారనీ, చదవాలనీ ఆశిస్తున్నాను.

దీన్ని చదవగలగడం ఒకవరంగా భావించండి.

తత్తే మనః శివసంకల్పమస్తు ॥

– ధూళిపాళ మహాదేవమణి

డా॥ అన్నదానం చిదంబరశాస్త్రి
'సనాతనధర్మజ్యోతి' సంపాదకులు .

సుందర కాండ సారోద్ధారోద్ధారం

'శ్రీపాదుక' బ్రహ్మశ్రీ కొల్లూరు అవతారశర్మగారు (కాశీవాసి), ఈతగాని వలె సాహితీసముద్రంలో మునిగి తేలుతూ ఎన్నో అనర్ఘరత్నాలు వెలికితీసి సమాజానికందిస్తూ ఉంటారు. అలా ఇప్పుడీ గ్రంథ రత్నాన్నందిస్తున్నారు. "సుందరకాండ మళ్ళీ ఈయట మెందుకు?" అని కొందరి కనిపించవచ్చు. కాని అందులో ఎంత పరమార్థముందో, దాని అవసరమెంత ఉందో క్షణం నిలకడగా పరిశీలిస్తే గ్రహిస్తారు. **"లోకహితం మమ కరణీయమ్"** అనుకొనే అవతారశర్మగారు లోకహితం కోసం ఇంతటి పెద్దతనంలో కూడా రచనలు చేస్తూనే ఉన్నారు. ఆ రచనలను సద్వినియోగంచేసికొనటం తప్ప మరేదీ వారు కోరేది లేదు. నిజంగా వారు ఈ గ్రంథరూపంలో చేసినది చాలా మేలయిన కృషి. ఈ గ్రంథాన్ని వారు నాకు పంపగానే "కొడిగట్టిన వత్తిని పైకి తీసి వెలుగుచూపారు సంతోషం" అని వారికి మెసేజీ పంపాను. 'నూతన ఆలయ నిర్మాణం కన్న జీర్ణోద్ధరణ ఎక్కువ పుణ్యం' అంటారే అటువంటిదన్నమాట ఈ కృషి.

"చరితం రఘునాథస్య – శతకోటి ప్రవిస్తరం ।
ఏకైక మక్షరం ప్రోక్తం – మహాపాతక నాశనమ్ ॥

అని చెప్పబడుటవల్ల రామాయణం నూరుకోట్ల శ్లోకాలు కలది అని అర్థమవుతుంది. కాని దానిని నమ్మనివారు కొందరు అది అతిశయోక్తిగా చెప్పినట్లు అనుకొంటారు. దీనిపై మేథోమథనం చేసి 24,000 శ్లోకాలు అనటానికే 'శతకోటి ప్రవిస్తరం' అన్నారంటూ వివరించి చూపారు. అదేమంటే 'శత' అనేది సంఖ్యామానంలో మూడవది కాన, కోటి అనేది సంఖ్యామానంలో ఎనిమిదవది కాన 3 × 8 = 24 కాన 24,000 శ్లోకాలకు సాంకేతికంగా శతకోటి ప్రవిస్తరత యథార్థం. ఆనందరామాయణంలో సాక్షాత్తు పరమేశ్వరుడే

పార్వతీదేవికి దానిని గూర్చి వివరిస్తాడు. అట్టి శతకోటి శ్లోకాలలో భూలోకానికి అందిన భాగం నుండి అనేక రామాయణాలేర్పడగా అందులో వాల్మీకి రామాయణమూ ఒకటి. మిగిలిన రామాయణాలు ప్రచారంలో లేవు, అట్టి వానిని తమ రామాయణసారోద్ధారం ద్వారా వెలుగులోనికి తెచ్చిన మహనీయులు బ్రహ్మశ్రీ ములుకుట్ల నృసింహావధాని గారు. చాలాకాలంగా ఆ గ్రంథాలు ముద్రణలో లేవు. వాటికై వెదకి వెదకి వేసారిన మాబోంట్లకు ఈనాడు మరల శ్రీఅవతారశర్మగారు దానిలోని సుందరకాండను ఇలా బయటకు తెస్తున్నారంటే అది పండుగే. ఈ గ్రంథం విలువను అర్థం చేసుకొని అందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరుచున్నాను. వారో, వేరొకరో మిగిలిన కాండలను కూడా వెలుపరచగల్గితే అది లోకానికి మహోపకారం కాగలదు. ఇటువంటి మహత్కార్యానికి పూనుకొన్న పండితోత్తములు శ్రీ కొల్లూరు అవతారశర్మగారికి శతకోటి వందనాలు.

సం. డా॥అన్నదానం చిదంబర శాస్త్రి,

శ్రీ రామ జయం

డా॥ఉలిమిరి వేంకట సోమయాజులు,

మేనేజింగ్ ట్రస్టీ, శ్రీరామ సేవా సమితి వారణాసి

గురు వందనమ్

పూజ్య గురువులు బ్రహ్మశ్రీ కొల్లూరు అవతారశర్మగారి ఆదేశానుసారంగా, వారికి వందనము సమర్పించుకొనే అవకాశం శ్రీరామ ప్రసాదంగా భావిస్తాను. బ్రహ్మశ్రీ ములుకుట్ల నృసింహ అవధానిగారు అందించిన "శ్రీ రామాయణ సారోద్ధారమ్" నకు అందరికి అర్థమయ్యే రీతిలో శ్రీపాదుకా వ్యాఖ్యతో "శ్రీ రామాయణ సారోద్ధారమ్- సుందరకాండ" అనే గ్రంథరాజమును పుస్తకప్రసాదముగా అనుగ్రహించిన గురువులకు వందన పూర్వక కృతజ్ఞతలు.

ఉపాసకులకు, సాధనమార్గంలో పయనిస్తున్న వారికీ ఉపకరించే ఎన్నో మంత్రశాస్త్ర రహస్యాలనిధి ఈ గ్రంథము. శ్రీ హనుమన్మాలామహామంత్రము అయిన శ్రీ సుందరకాండలోని శ్లోకాలకు శ్రీపాదుకావ్యాఖ్య ద్వారా, శ్రీమద్ రామాయణ రహస్యాలను ఆవిష్కరించారు గురు దేవులు. శ్రీరామభాగవతము, శ్రీ వాల్మీకిరామాయణము, పులస్త్యరామాయణము, శివరామాయణము, ఆనందరామాయణము, ఆధ్యాత్మరామాయణము, శ్రీమద్దేవీభాగవత పురాణము, పరాశరసంహిత, ఉమాసంహిత, శౌనకసంహిత ఇత్యాది గ్రంథాలలోని విశేష అంశాలతో సమన్వయ పూర్వక శ్రీపాదుకా వ్యాఖ్యానము, శ్రీపాదుకా చరణామృతపానానందాన్ని కలిగిస్తుంది అని నా స్వానుభవపూర్వక భావన.

సముద్ర లంఘనం చేస్తున్నప్పుడు పది యోజనాల వెడల్పు, ముప్పది యోజనాల పొడవు గల ఆంజనేయస్వామి వారి నీడ గురించి (28వ శ్లోకము) సుందరమయిన వ్యాఖ్య అందించారు. లంకా రాక్షసి వృత్తాంతానికి,

శ్రీ దేవీభాగవతపరంగా చేసిన వ్యాఖ్య పాఠకులను అలరిస్తుంది. గృహస్థ ఆశ్రమంలో ఉన్న బ్రహ్మచారి శ్రీహనుమ అనే వాస్తవం విషయంలో, బ్రహ్మచర్య వ్రతనిష్ఠకు సంబంధించిన వివరణ చాలామందికి మదిలో ఉన్న సందేహాల నివృత్తికి దివ్య ఔషధం వలే పని చేస్తుంది. నమోస్తు రామాయ ...... (34వ శ్లోకం) యొక్క శ్రీపాదుకా వ్యాఖ్య భగవద్ (భగవతి) దర్శన లాలసులయిన సాధకులకు దిశానిర్దేశం చేసి, అనుష్ఠానబలవృద్ధిద్వారా సంకల్పానుసార కార్యసిద్ధికి మార్గం సుగమం చేస్తుంది.

పారాయణ, హవన, పఠన, అధ్యయన యోగ్యంగా ఉన్న ఈ గ్రంథరాజము ప్రతి వారి (పూజా) గృహములో మరియు హృదయములో ఉండవలసినది. సనాతన ధర్మ పరిరక్షణకు, మన వైదిక వాఙ్మయము, మరియు ఇతిహాస, పురాణముల అధ్యయనము చేయడం, అర్థం చేసుకోవడము, ఆ వాఙ్మయాన్ని అందించిన ద్రష్టలు అయిన వ్యాస, వాల్మీకి ఇత్యాది ఋషుల హృదయములోని భావనల ఆవిష్కరణ చాలా అవసరం. ఈ దిశలో ప్రసంగాల, ప్రవచనాల, రచనల ద్వారా ప్రయత్నం చేస్తున్న (చేయబోతున్న) వారికి గురువు గారి గ్రంథాలు కరదీపికలు అని నా విశ్వాసము.

శ్రీ రామ రక్ష సర్వ జగద్రక్ష

బుధ జన విధేయుడు

సం. **ఉలిమిరి వేంకట సోమయాజులు**

వారణాసి

శ్రీ విశ్వావసు ఉగాది,

30.3.2025

కృతం స్మర!
(ఉపకారస్మృతి)

నా అభ్యర్థనను మన్నించి నాయందలి వాత్సల్యాభినివేశముతో ఈ కృతికన్యకకు బహుమూల్యాలంకారములుగా **'ఆశీరభినందనముల'** ననుగ్రహించిన పూజ్యులు–

అవధూత దత్తపీఠాధిపతి జగద్గురు పరమపూజ్య
శ్రీశ్రీశ్రీ **గణపతిసచ్చిదానంద స్వామి**వారికి,

అవధూత దత్తపీఠ ఉత్తరాధిపతి జగద్గురు పరమపూజ్య
శ్రీశ్రీ **దత్తవిజయానంద స్వామి**వారికి,

కుర్తాళం, సిద్ధేశ్వరీ పీఠాధీశ్వరులు జగద్గురు
శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతీస్వామి వారికి,

మాతృమూర్తి,శ్రీ శివకేశవ్ పీఠం సంస్థాపక పీఠాధీశ్వరి,**పూజ్యశ్రీ మాతా శివానంద సరస్వతీ** వారికి,

శ్రీకాశీ హిందూవిశ్వవిద్యాలయ ఆంధ్రభాషావిభాగాధ్యక్షులు **ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు** గారికి,

'ఋషిపీఠం' వ్యవస్థాపకాధ్యక్షులు
బ్రహ్మశ్రీ **సామవేదం షణ్ముఖశర్మ** గారికి,

అభినవవాల్మీకి, అభినవమల్లినాథేత్యాద్యనేక బిరుదాంచితులు సుహృన్మణి విద్వన్మణి,
బ్రహ్మశ్రీ **ధూళిపాళ మహాదేవమణి** గారికి,

సహృదయులు,ఆత్మీయులు, ఆప్తులు, **'సనాతనధర్మజ్యోతి'** సంపాదకులు
బ్రహ్మశ్రీ **అన్నదానం చిదంబరశాస్త్రి**గారికి,

సహృదయులు,ఆత్మీయులు,అస్మచ్ఛిష్యశిరోమణి,నిరంతరరామసేవాపరాయణులు, **బ్రహ్మశ్రీ. ఉలిమిరి వేంకట సోమయాజులు,**మేనేజింగ్ ట్రస్టీ, శ్రీరామసేవాసమితి వారణాసి**వారికి,**

నా అభీష్టమునను సరించి చక్కని ముఖచిత్రమును సమకూర్చిన చిత్రకారులు శ్రీ కె.వి.భీమారావుగారికి,

ఉపరి–

ఆత్మీయతాభిమానములతో ఈ గ్రంథమును సర్వాంగసుందరముగా తీర్చిదిద్దిన శిష్యకల్పుడు వినయశీలి చి. **పి. రాముకు,మరియు డి.టి.పిలో చాలావరకు సహకరించిన శ్రీమతి భాగ్యలక్ష్మిగారికి,**

సదా నీడలా వెన్నుదన్నుగా నా రచనోపాసనాద్యనుష్ఠానములను నిరంతరాయముగా సాగేలా సహకరిస్తూ నా సహధర్మచరి అర్ధాంగికి– **నా ఆశీరభినందనములను తెలియజేయుచున్నాను.**

విషయసూచిక

దుస్సాహసం ! సహృదయులు మన్నించాలి !!	3
వాల్మీకి – రామాయణం	7
ప్రవేశిక / అవతారిక	13
శ్రీ రామాయణ సారోద్ధారము – సుందరకాండ	
ప్రథమ సర్గ	27
ద్వితీయ సర్గ	59
తృతీయ సర్గ	76
చతుర్థ సర్గ	86
పంచమ సర్గ	108
షష్ఠస్సర్గః	126
సప్తమస్సర్గః	146
అష్టమ సర్గః	161
నవమ సర్గః	176
దశమస్సర్గః	187
ఏకాదశ సర్గః	206
ద్వాదశ సర్గః	218
త్రయోదశ స్సర్గః	231
చతుర్దశ స్సర్గః	242
పంచదశస్సర్గః	252
షోడశ స్సర్గః	264
సప్తదశ స్సర్గః	276
అష్టాదశ స్సర్గః	288
ఏకోనవింశః సర్గః	296

శ్రీరామాయణసారోద్ధారము - సుందరకాండ

(శ్రీపాదుకా వ్యాఖ్యతో)

మూలం

బ్రహ్మశ్రీ ములుకుట్ల నృసింహావధాని(పాకయాజి)



వ్యాఖ్యాత

'శ్రీపాదుక' ఆచార్య కొల్లూరు అవతారశర్మ (కాశీవాసి)

సర్వస్వామ్యములు గ్రంథకర్తవి

కవిసామ్రాట్ శ్రీవిశ్వనాథ

'సరస్వతీ పుత్ర' శ్రీమాన్ దాశరథి రంగాచార్యులు



దుస్సాహసం ! సహృదయులు మన్నించాలి !!

శ్రీ మద్రామాయణ సారోద్ధార గ్రంథానికి జడమైన యీ **'శ్రీపాదుక'** ఇలా వివరణ వ్రాయడానికి పూనుకోవడం దుస్సాహసమే అవుతుంది. అయినా యిలా ఉపక్రమించడం బాలచాపలమే తప్ప అహంకారం మాత్రం కాదని పెద్దమనస్సుతో రసజ్ఞసహృదయులు ఆశీర్వదిస్తారని భావిస్తున్నాను.

శ్రీమద్రామాయణమును ఊపిరిగా సంభావిస్తూ బహువిధ రామాయణాది గ్రంథములను కంఠోపాఠముగా ఒక ఉపాసనగా, ఒక తపస్సుగా స్వాధ్యాయ ప్రవచన తత్పరతతో నుపాసించిన గ్రంథకర్తయే స్వయముగా – తాము చేసిన సుదీర్ఘమైన వ్యాఖ్యానమును గూర్చి **"మత్కృత సాహసానాం మదీయక్షన్తవ్యతాం సతాం సవిధేఽభ్యర్థయే"** అనగా నా, యీ సాహసమును పెద్దలు క్షమింతురు గాక యని ప్రాంజలిబద్ధముగా ప్రార్థించియున్నారు.

రామాయణం శ్రీమత్తు. ఆ శ్రీమత్త్వాన్ని గుఱించి ఏమైనా ఒక విషయాన్ని ఇదమిత్థంగా ప్రకటించాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించి మరీ ఉపక్రమించాలి. ఆ తత్త్వము సర్వజ్ఞునకే ఎఱుక !

1963 ఏప్రిల్ 28వ తేదీన కవిసామ్రాట్ శ్రీవిశ్వనాథ 'సరస్వతీ పుత్ర' శ్రీమాన్ దాశరథి రంగాచార్యుల వారిని సన్మానించారు. ఆ సభలో దాశరథి రామాయణంపై గంటన్నర ప్రసంగించిన తరువాత, శ్రీ విశ్వనాథ చమత్కారంగా దాశరథి చెప్పిన వాటిలో దేనితోనూ నేనేకీభవించను, అంటూనే ఆయనను చమత్కారంగా ప్రశంసించి శాలువతో సమ్మానించి, సౌహార్దంతో కౌగలించుకొని నెమ్మదిగా చెవిలో "రంగాచార్యులూ ! నీకు రామాయణం అర్థమయ్యిందా?' అని యడిగి, మిన్నకున్న అతనితో మరల – "దాని మీద ముప్ఫైయేళ్ళుగా యేడిచిన ముండావాణ్ణి. నాకే అర్థం కాలేదు. నీకేమిటి అర్థమౌతుంది లే!" అని రహస్యంగా ఆయన భుజంపై చెయ్యి వేసి మెట్లు దింపుతూ అన్నారుట!.. "అవి నాకు అమృతఘుడియలు! మెట్టు దిగిన నాకు

ఆకాశమంత ఎత్తై కనిపించారు!" అని శ్రీమాన్ దాశరథిగారు తమ అక్షరమందాకినిలో వ్రాసుకున్నారు. (రసజ్ఞ భారతి-21 మే, 24) కాగా సహృదయ సాహితీ లోకానికి సవినయంగా నేను సమర్పిస్తున్న యీ **"సారోద్ధార శ్రీ పాదుకావివృతి"** గుర్వంబానుగ్రహ లబ్ధమైన యత్కించిత్ పరిజ్ఞానముతో నేగ్రహించిన విషయమును సగటు పరిజ్ఞానము గల సామాన్య పాఠకులకు తెలియజేయాలనే ఏదో తెలియని భావావేశమే తప్ప స్వోత్కర్షతో కూడిన పాండితీ దురహంకారము కాదని సవినయముగా తెలుపుచున్నాను.

"ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజమ్" (రామా....) అని స్వయంగా రాముడే తనను తాను ప్రకటించుకున్నాడని సాక్షాత్తుగా రామాయణ ద్రష్ట స్రష్ట కూడ యైన వాల్మీకిమహర్షి ప్రకటించినా - ఎందుకో నా మనస్సంగీకరించుట లేదు.

రామచంద్రమూర్తి **వేదవేద్యమైన పరబ్రహ్మమే!**

శ్రీమద్రామాయణము **వేదమే!**

వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే ।

వేదః ప్రాచేతసా దాసీత్ సాక్షాద్రామాయణాత్మనా ॥

"వేదవేద్యుడగు పరమ పురుషుడు పరబ్రహ్మము దశరథ పుత్రుడుగా నవతరింపగా ఆతని నడువడి రామాయణముగా, వేదము రూపమున ప్రాచేతసుడగు వాల్మీకి హృదయము నుండి వెలువడినది" అనే ఆర్షవచనము శతప్రతిశతసత్యము అనగా నూటికి నూఱుపాళ్ళ నికార్సైన నిజమని నా యభిప్రాయము.

ఈ విధమైన నిశ్చితాభిప్రాయముతో శ్రీమద్రామాయణమును పఠిస్తేనే లేదా శ్రవణం చేస్తేనే **రామతత్త్వం** కొంత తెలిసినట్లనిపిస్తుంది. రామానుగ్రహం కలుగుతుంది. తద్వారా శ్రీరామతత్త్వము, శ్రీమద్రామాయణతత్త్వము తెలుస్తాయి. వాల్మీకి హృదయం అవగతమవుతుంది. వాల్మీకి వాణిలో పంచమస్వరము, సింహగర్జనము రెంటినీ దర్శింపగలుగుతాము. హృదయము

రసమయానంద నిర్భరమవుతుంది. మనమాత్మారాములమై అంతా రామమయంగా దర్శిస్తూ తన్మయత్వంలో తరిస్తాం. ఈ ఆనందానుభవము వక్తుమశక్యము. వాక్కులకు ఊహలను అందనిది.

"యతో వాచో నివర్తన్తే అప్రాప్య మనసా సహ– ఆనందం బ్రహ్మణో విద్యాత్" – ఆ యానందానుభవాన్ని మాటల్లో వివరించే ప్రయత్నం అజ్ఞానం లేదా దుస్సాహసమే అవుతుందేమో ! ఈవిషయం తెలిసికూడా దుస్సాహసాన్నీవిధంగా చేస్తున్నాను. దీని వల్ల ఏ కొద్దిమంది కానందం కలిగినా ఈకృతీ, కర్తా ఇరువురు సుకృతులౌతారు.

॥ శుభం భూయాత్ ॥

శ్రీ పాదుక



శ్లో॥యావత్ స్థాస్యంతి గిరయః సరితశ్చ మహీతలే ।
తావద్రామాయణీ గాథా లోకేషు ప్రచలిష్యతి ॥

శా॥ ఈ సంసారమిదెన్ని జన్మలకు నేనీ మౌని వాల్మీకి భా-
షా సంక్రాంత ఋణంబుఁ దీర్పఁగలదా? సత్కావ్య నిర్మాణ రే-
ఖా సామగ్రి ఋణంబుఁ దీర్పగలదా? కాకుత్థ్సుడౌ స్వామి గా-
థా సంపన్నము భక్తి దీర్చినను ద్వైతాద్వైతమార్గంబులన్ ॥

వాల్మీకి - రామాయణం

వాల్మీకి ఋషి. ఋషి మాత్రమే కాదు, మహర్షి కూడా. **'ఋషీ-గతౌ'** అనే గత్యర్థకమైన ధాతువు నుండి 'ఋషి' శబ్దం నిష్పన్నమైంది. **'ఋషిర్గన్తా-ఋషిర్ద్రష్టా'.** ఋషి అనగా వెళ్ళినవాడు అని అర్థము. అయితే ఆయన ఎక్కడికి వెళ్ళేడు? ఎలా వెళ్లేడు? ఎందుకు వెళ్ళేడు? ఏమి చూచాడు? చూచినాక ఏమి చేశాడు అనే ప్రశ్నల పరంపర ఉదయిస్తుంది.

మనమంతా భూమిపై క్షితిజ సమాంతరంగా ప్రయాణిస్తే ఋషి తనదైన దివ్యశక్తితో ఊర్ధ్వముఖంగా ప్రయాణిస్తాడు. లోకంబులు, లోకేశులు కూటస్థులు తెగిన పిదప అలోకమైన పెంజీకటికవ్వలి తీరాన్ని చేరుకొని, అక్కడ తనదైన ఒక దివ్యమైన తేజస్సును దర్శించి, దానిలో లయిస్తాడు ఋషి.

తత్త్వజ్ఞుడైన ఋషి – ఆంతరంగా బాహిరంగా అంతటా ఆ వెలుగునే చూస్తూ తన్మయుడైపోతాడు. ఇది తత్త్వీభూతమైన స్థితి. ఇదే బ్రాహ్మీస్థితి. దీనినే **'ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ!'** – అని నరునకుపదేశిస్తాడు నారాయణుడు. ఇదే విషయాన్ని **'తత్త్వమాభ్యంతరం దృష్ట్వా తత్త్వం దృష్ట్వాతు బాహ్యతః।**

తత్త్వీభూత స్తదారామః తత్త్వాదప్రచ్యుతో భవేత్॥"– అని,

తత్త్వీభూత స్థితిగా చెప్పి దీనిలో నిశ్చలంగా ఉండాలంటారు గౌడ పాదులవారు.

సగటుమనిషి సాధనలో ఈ స్థితిని పొందినా, మరల దానినుండి భ్రష్టుడవుతూ ఉంటాడు. నిశ్చలమైన ఈ యోగాన్ని స్వంతం చేసుకున్న ఒకానొక మహితాత్ముడు తన వలె అందరూ తరించాలని అందుకు సరియైన మార్గమును అందరికీ అర్థమయ్యేలా, మధురమైన భావములతో, లలిత లలిత పదములతో లోకానికి ఉద్బోధిస్తాడు. అలాంటి ద్రష్టయైన ఋషి **'మహర్షి'** అనబడతాడు.

వాల్మీకి ఈ విధమైన మహర్షులకు ఆద్యుడు, మార్గదర్శి. కావుననే భోజమహారాజు ఇతనిని – **'మధుమయఫణితీనాం మార్గదర్శీ మహర్షిః'** – అని సంస్తుతించాడు.

"కూజన్తం రామ రామేతి మధురం మధురాక్షరమ్ ।

ఆరుహ్య కవితాశాఖామ్ వన్దే వాల్మీకి కోకిలమ్ ॥" అని కొందరు తాత్త్వికులాయనను అవ్యక్త మధురమైన కలకూజితముతో కవితాశాఖను అధిరోహించిన **'కవికోకిల'** గా వర్ణించి నమస్కరిస్తే మరి కొందరు అతనిని–

"వాల్మీకేర్మునిసింహస్య కవితావనచారిణః ।

శ్రుణ్వన్ రామకథానాదం కో న యాతి పరాం గతిమ్ ॥"

మరి కొందరు కవితావనసంచారియై తన సింహనాదమును బోలిన అభివ్యక్తితో పాఠకులకు పరగతిననుగ్రహించే **"మునిసింహుడు"**గా అభివర్ణించారు.

ఈ విధంగా వాల్మీకి రామాయణం, కోకిల కలకూజితమై రసజ్ఞమనోహరమైన మహాకావ్యంగా, సింహగర్జనను బోలినదై, ప్రభుసమ్మితంగా శాసిస్తూ, ధర్మప్రబోధంతో మానవజాతికి మార్గదర్శనం చేస్తున్న వేదవాణిగా, రెండు విధాలైన రూపాలతో తరతరాలుగా అందరినీ తరింపచేస్తున్నది. అందరకు స్వాంత సంతర్పణం చేస్తూ స్వాత్మారాములను గావిస్తున్నది.

ఆదికవిగా ఆయన తన కావ్యము యొక్క తత్త్వాన్ని ఆదిలోనే సుస్పష్టంగా రాగ, తాళ సమన్వితంగా పాడుకొనుటకనువైన మధురగీతముగా, తంత్రీలయ సమన్వితమైన రసవత్కావ్యముగా, మహార్థ గంభీరమైన ఒక ధ్వని ప్రబంధముగా రచించినట్లు తెల్పి – **"శ్రోతవ్యమనసూయయా"** ఏ విధమైన ఈర్ష్యాద్వేషాసూయాదులు లేకుండా ఆస్తిక్య బుద్ధితో అవధరించాలని, ఆచరించి తరించాలని ప్రతిబోధిస్తూ –

"కృత్స్నం రామాయణం ప్రోక్తం–సీతాయాశ్చరితం మహత్–

పౌలస్త్యవధమిత్యేతత్" – అని ముప్విధములైన నామకరణములను–

1) **రామాయణము**

2) **సీతాచరిత్రము**

3) **రావణ వధ –** అని ప్రకటిస్తాడు.

ఇలా గ్రంథాదిలోనే తన కావ్యాన్నెలా వ్రాసేడో, ఎలా చూడాలో, ఎలా భావించి తరించాలో తెలియజేస్తూ –

శ్లో॥యావత్ స్థాస్యంతి గిరయః సరితశ్చ మహీతలే ।

తావద్రామాయణీ గాథా లోకేషు ప్రచలిష్యతి ॥ –

ఈ నా రామాయణగాథ చతుస్సముద్రవేలావలయితమైన ఈ భూమండలములో కులపర్వతములు, జీవనదులు, నిలచునంత వరకు (ఆచంద్రతారార్కము) జనాదరణము చూరగొంటూ ప్రచారంలో ఉంటుందని – బ్రహ్మవాక్కుగా ప్రబోధిస్తాడు.

ఎందరెందరో మహామహుల రచనల్నీ పుబ్బలో పుట్టి మఖలో మాడిపోయిన ఈ మహాకాలంలో యుగయుగాలుగా తరతరాలుగా నా కావ్యం శాశ్వతంగా జనాదరణ పొందుతూ ప్రచారంలో ఉంటుందని ఘంటాపథంగా చెప్పిన ఆదికవి యొక్క ఆత్మనిర్భరతకు జోహారులర్పించకుండా ఉండగలమా! అదీ వాల్మీకి మాహాత్మ్యం!

అలాంటి వాల్మీకి హృదయాన్ని అవగతం చేసుకోవాలంటే ఆ మహర్షికి శిరసా పాదాభివందనం చేసి మార్గదర్శనం చెయ్యమని వేడుకోవాలి. తప్పక ఆయన మార్గదర్శనం చేస్తాడు. రామానుగ్రహం లభించి తీరుతుంది. **"విశ్వాసః సంపదాంమూలమ్"** విశ్వాసము సర్వసంసిద్ధులకు మూలము.

సరే! వాల్మీకి మార్గదర్శనంలో రామాయణంలో శ్రీపాదుకాప్రస్థానం ప్రారంభమవుతున్నది.

మహర్షి తన రామాయణాన్ని అసూయను విడనాడి కావ్యంగా చూడమన్నాడు. చూస్తే, అది ఒక మహాకావ్యంగా, సర్వోత్తమ ధ్వనిప్రబంధంగా గోచరిస్తుంది. శ్రీమద్రామాయణం మహాకావ్యమని, ధ్వనిప్రబంధమని చెప్పుకున్నాం. బయటకు వాచ్యార్థముగా సామాన్య ప్రతిపాద్యమైన కథాంశము ప్రకటితమౌతూ, ఆంతరమున నిగూఢమైన తాత్పర్యార్థము చిదాకాశంలో చిత్కళగా అభివ్యక్తమయ్యేలా క్రాంతదర్శియైన మహాకవిరచించిన మహాకావ్యము **'ధ్వనిప్రబంధము'**గా కీర్తింపబడినది.

ఆర్షమైన, అనగా ఋషి ప్రోక్తమైన మహాకావ్యంలో బాహిరంగా, ఆంతరంగా రెండు విధాలుగా తత్త్వాన్ని ప్రబోధిస్తూ ఉంటుంది. బయటకు రామకథగా కనిపిస్తున్నా అది ఆంతరంగా వేదధర్మాన్నీ దాని పరమార్థమైన

మోక్షపురుషార్థ ప్రాప్త్యుపాయాన్నీ, దానికనుగుణంగా ఆత్మజ్ఞానాన్నీ ప్రతిబోధిస్తూ ఉంటుంది. శ్రీమద్రామాయణదర్శనము సాంతమూ ఈ విధంగానే సాగుతుంది. దానిని రామానుగ్రహంతో వాల్మీకిహృదయాన్ని గ్రహిస్తూ అధ్యయనంచేసి తరించడమే మన కర్తవ్యం. అదే మన మీ మానవ జన్మ లభించినందుకు పొందవలసిన పరమార్థం.

చూడాలనే సంకల్పం, చూడగలిగే కన్నూ ఉండాలేకాని రామానుగ్రహము, తద్వారా మహర్షి యొక్క మార్గనిర్దేశము సాక్షాత్కరిస్తూనే ఉంటాయి. పరమదయా పరిపూర్ణుడైనమహర్షి తన కావ్యాన్నెలా సందర్శించాలో మూడు దృక్కోణాలలో – రామాయనముగా, సీతాచరితముగా, రావణవధగా మార్గనిర్దేశం చేశాడు. ముందుగా శ్రీమద్రామాయణాన్ని రామాయనము అనగా రాముని నడువడి లేదా ధర్మనిష్ఠను దర్శిస్తూ అవగాహన చేసుకోవాలని సూచిస్తారు మహర్షి.

రామాయనం అంటే, రాముని జీవనయానం. అదే అతని నడువడి యన్నమాట. అది ప్రస్థానం ప్రారంభించింది మొదలు సాంతము సీతాచరితము నాధారముగా గొని సాగినట్లు కనబడుతుంది. తాను ముందుగా అవరోధములను తొలగిస్తూ మార్గాన్ని సుగమంచేస్తానని భరవసానుకల్పిస్తూ – **"అగ్ర తస్తే చరిష్యామి మృద్నన్తీ కుశకంటకాన్"** – అని, ఒకానొక దివ్యమైన ప్రణాళికాబద్ధంగా మహామాయా స్వరూపిణిగా రామాయనమును సాంతము సుగమము చేస్తుంది సీతమ్మ.

ఆ విధంగానే ఆ తల్లి, సాధనలో మనకెదురయ్యే అవరోధాలను కూడా తొలగించి, మనకు సిద్ధిని త్వరగా అనుగ్రహిస్తుంది. అందుకే మహర్షి **సీతాయాశ్చరితం మహత్తని** మహద్విశేషణాన్ని జోడించి మరీ కీర్తిస్తారు.

సరే మూడవ దృక్కోణం రావణవధ. రావణుడంటే **'లోకాన్ రావయతి'** – లోకములనాక్రందింప చేసేవాడని అర్థం. లోకమంటే వేరేమీ ఎక్కడా లేదు. మన శరీరమే క్షేత్రము. జీవుణ్ణి విషయముల వైపుకాకర్షించి దశవిధములైన ఇంద్రియములు దశదిశలకు మనస్సును (జీవుణ్ణి) పరుగులు పెట్టిస్తూ ఉంటాయి. ఆ దశేంద్రియాలే రావణుని 'దశశిరస్సులు' వానిని ధరించి భక్తులను బాధించే దశకంఠుడే రావణుడు. వాడు బుద్ధిసిద్ధులననుగ్రహించే

శక్తిని బంధించాడు. ఆమెను పొందాలంటే వానిని వధించాలి. ఆ రావణవధ మరేదో కాదు– రామకథకు, సీతాచరితానికి కూడా చరమాంకము. ముగింపు.

ఇలా మూడుదృక్కోణాలలో దర్శించేలా రామకథాశిల్పాన్ని మలచి లోకాలను మురిపింపజేస్తారు మహర్షి వాల్మీకి. ఇలా ముప్విధములుగా మూడు కోణాలలో మలచిన రామాయణ శిల్పరామణీయకతను దర్శించి అనుభవించవలసినదే తప్ప వర్ణించడం, ప్రశంసించడం అస్మదాదులకు అసాధ్యమేనని తెలిసి కూడా ఆ దిశగా అసంకల్పితంగానే ఎందరో మహానుభావులు అడుగులు వేశారు! **"మహాజనో యేనగతః స పంథాః"** మహితాత్ములనుసరించినదే మనదారి కూడా !

వారందరూ వాల్మీకిమార్గదర్శనంలో తమ తమ శక్త్యానుసారం రామకథను తమదైనదృక్కోణంలో ఆస్వాదిస్తూనే ఉన్నారు. అనుసరిస్తూనే ఉన్నారు. ఇదంతా ఆ మహర్షి మఱియు ఆ కవితల్లజుని ఋణం తీర్చుకోవడమే. దీని వల్ల ఋషిఋణమూ తీరుతుంది. ఆనందం, ముక్తీ రెండూ లభిస్తాయి. ఈ సందర్భంలో కవిసామ్రాట్ శ్రీ విశ్వనాథవారి –

శా॥ ఈ సంసారమిదెన్ని జన్మలకు నేనీ మౌని వాల్మీకి భా–
షా సంక్రాంత ఋణంబుఁ దీర్పఁగలదా? సత్కావ్య నిర్మాణ రే–
ఖా సామగ్రి ఋణంబుఁ దీర్పగలదా? కాకుత్స్థుడౌ స్వామి గా–
థా సంపన్నము భక్తి దీర్చినను ద్వైతాద్వైతమార్గంబులన్ ॥

అనే వాణిని రసజ్ఞులు, భావుకులునైన రామభక్తులందరూ అనునిత్యం మననం చేసుకుంటూనే ఉంటారు. మహర్షి ఋణాన్ని తీర్చుకునే ప్రయత్నం యథాశక్తి యథామతి చేస్తూనే ఉంటారు.

ఆ విధమైన ప్రయత్నంగానే శ్రీమద్రామాయణ సారోద్ధార మావిర్భవించింది. దాని తత్త్వాన్ని కొంతవరకు గ్రహించాననుకుంటున్న ఈ శ్రీపాదుక తనదైన జడత్వ నిర్మూలన కోసం, బుద్ధిమద్వరిష్ఠుడైన ఆంజనేయుని అనుగ్రహాన్నభిలషిస్తూ– సుందరకాండ సారోద్ధారతత్త్వాన్ని యథామతి అనువదించే ప్రయత్నిస్తున్నది.

శ్లో ॥ సుందరే సుందరో రామః సుందరే సుందరీ కథా ।
సుందరే సుందరీ సీతా సుందరే సుందరం వనమ్ ।
సుందరే సుందరం కావ్యం సుందరే సుందరః కపిః ।
సుందరే సుందరం మంత్రం సుందరే కిం న సుందరమ్ ?

సుందరకాండలో చరమ ఫల భోక్త యగు నాయకుడు శ్రీరామచంద్రమూర్తి ! సుందరుడు. జితేంద్రియులగు మహర్షులను సైతము సమ్మోహితులను గావించు ముగ్ధమోహనమూర్తి శ్రీరామచంద్రమూర్తి ! సుందరకాండలో అతనికి సంబంధించిన రామకథ అత్యంత రమణీయమైనది. సుందరకాండ ప్రధాన కథానాయిక సీతాదేవి సుందరీమణి. సుందరకాండమున ఆమె కధివాసముగా వర్ణింపబడిన అశోకవనమత్యంత రమణీయమైనది. సుందరకాండమున కావ్య రచనాశిల్పము సుందరతమమైనది. సుందరకాండలో ఆద్యంతము నిండిన వానరోత్తముడు హనుమ అనేకానేక కల్యాణ గుణసుందరుడు. సుందరకాండము అందమైన మాలా మహామంత్ర రాజము. ఇంకను దీనిలో **సుందరహనుమన్మంత్రము** పరోక్షముగా నుపదేశింపబడినది. (పుట-78)సుందరకాండలో నెచటయే విషయమును తరచిచూచినను సౌందర్యమే కాననగును. సుందరకాండలో నేది సుందరము కాదు! సర్వము సుందరమేనని భావము.

ప్రవేశిక / అవతారిక

శ్రీ మద్రామాయణము **'చతుర్వింశతి సాహస్రి'** అనగా ఇరువదినాలుగు వేల శ్లోకములలో రచింపబడిన ఇతిహాసము. ఇతిహాసమే కాదు. సాక్షాత్తు వేదమే రామాయణముగా నవతరించినది. **'వేదః ప్రాచేతసా దాసీత్ సాక్షాద్రామాయణాత్మనా'** అని పెద్దల ప్రవచనము. చతుర్వింశత్యక్షర మితమైన అనగా ఇరువదినాలుగు మంత్ర బీజముల సంఘాతరూపమగు గాయత్రీ మహామంత్రములోని మంత్ర బీజవర్ణములు క్రమముగా ప్రతి సహస్రమిత గ్రంథములోను ఒకటొక్కటిగా నిక్షేపింపబడినందున శ్రీమద్రామాయణము ఒక **మాలామహామంత్రరాజమ**ని గూడ ప్రసిద్ధిని పొందినది.

శతకోటి ప్రవిస్తరమైన రామాయణ గ్రంథము పలువురిచే బహుముఖీనముగా దేశకాలానుగుణముగా కీర్తింపబడినది. వానిలో శ్రీరామ పరబ్రహ్మతత్త్వమును ప్రతిపాదించునట్టి ఇరువది నాలుగు ప్రసిద్ధ రామాయణములను తమ బహుముఖీనమైన ప్రజ్ఞా ప్రాభవముచే మథించి గతశతాబ్దిలో సం. 1930 ప్రాంతములో విజయవాడ దగ్గర కృష్ణలంకలో నివసించిన బ్రహ్మశ్రీ ములుకుట్ల నృసింహావధాని పాకయాజిగారు **'శ్రీరామాయణ సారోద్ధారము'** అను గ్రంథమును ప్రకటించియున్నారు. శ్రీమద్రామాయణము వారి యూపిరి. నిరంతర రామాయణ ప్రవచన పరాయణులైనవారు తత్కాలీనులైన పండిత ప్రకాండులందరి మన్ననలను పొంది **'రామాయణంశాస్త్రులు'** గారుగా ఆంధ్రదేశమున తమద్దైన తనతనముతో తనరారిన మహితాత్ములు – వారు తమ సారోద్ధార గ్రంథ పీఠికలో **"శ్రీరామచంద్ర ప్రభువు యొక్క అనుగ్ర విశేషము చేతనే నేను ఋషి ప్రోక్తములైన ఇరువది నాలుగు రామాయణములలోను వర్ణింపబడిన శ్రీరామతత్త్వ ప్రతిపాదకములును, అతని కల్యాణగుణములకు సంబంధించిన విషయములను యథాతథముగా సంగ్రహించి క్రోడీకరించి చిలుకవలె పలికితినేగాని ఇందు నా స్వకీయ మిసుమంతయును లేద"**ని ముక్తకంఠముగా పల్కియున్నారు.

సంస్కృతాంధ్రములలో గ్రాంథికభాషలో శ్రీ శాస్త్రులుగారు వివరించిన విషయజాతమునంతను సమగ్రముగా సరళమైన శిష్ట వ్యావహారికభాషలో ఆంధ్ర పాఠకులకు తెలియజేయుటయే యీ గ్రంథము యొక్క ప్రధానలక్ష్యమని విన్నవించుచున్నాను. భవతు !

రామాయణములన్నింటికిని మూలమును తలమానికమునైనది వాల్మీకి మహర్షి కృతమైన శ్రీమద్రామాయణము. తదనుగుణముగనే ఇతర రామాయణములన్నియు దేశకాలానుగుణముగా అక్కడక్కడ కొలది మార్పులను సంతరించుకొని ఆవిర్భవించినవి. అన్నింటను **'సుందరకాండము'** మధ్యమణిగా ప్రకాశించుచు తనదైన ఉత్కృష్టతను కలిగియున్నది.

"తపః స్వాధ్యాయనిరత" మిత్యారభ్య చతుర్వింశతి సహస్ర గ్రంథ పర్యంతం, తధైవ ఇతరార్ష రామాయణస్థ శ్రీరామకథా సర్వాపి అత్రైవ కాండే సూక్ష్మేక్షికయా నిరూఢేతి తత్తద్ఘట్టేషు తత్తత్కాండస్థ కథార్థో విద్యత ఏవేతి సద్భిర్నిర్ణీతమస్తి. అత ఏవ సుందరకాండ పారాయణ మాత్రేణైవ యావద్రామాయణ పారాయణ ఫలసిద్ధిరితి ఫలశ్రుతయః శ్రూయన్తే" అనగా – **"తపస్వాధ్యాయ నిరతమ్"** అని గాయత్రీ ప్రథమ బీజాక్షర నిక్షేపముతో ప్రారంభింపబడి ఇరువదినాల్గు వేల శ్లోక పర్యంతమగు సంపూర్ణ గాయత్రీ మంత్ర గర్భితమైన శ్రీమద్వాల్మీకి రామాయణమును, అట్లే తదితరములైన ప్రముఖ రామాయణములందు చెప్పబడిన రామకథయంతయు ప్రసక్తాను ప్రసక్తముగా సుందరకాండ పారాయణముచే సమగ్రరామాయణ పారాయణ ఫలము సిద్ధించునని సంప్రదాయ విదులు ఫలశ్రుతిలో ప్రతిపాదించియున్నారు. తదనుసారముగా ఆస్తికులగు రామభక్తులందరు సుందరకాండ పారాయణమును చేయుచూ కామితార్థములనన్నింటిని పొందుచున్నారు. రామభక్తులకు హనుమద్భక్తులందరకు ఇది అనుభవములో నున్న విషయమే!

చరమ ఫలభోక్తృత్వ నియముననుసరించి రామాయణ కావ్యమునకు శ్రీరామచంద్రమూర్తి అధినాయకుడుగా చెప్పబడినను, సుందరకాండకు ప్రధానమైన నాయక లక్షణలక్షితుడుగా హనుమంతుడు మాత్రమే నిర్ధారింపబడినాడు. సుందరకాండ న్యాసములో సీత ప్రధాన దేవతా శక్తిగా

ప్రతిపాదింపబడినది. వాల్మీకి హృదయభూతమైన **సీతాయాశ్చరితం మహత్తనే'** మాహాత్మ్య శక్తిమత్త్వములు సుందరకాండములో హనుమదాశ్రితములుగా నిరూపింపబడినది. ఈ విషయమునే శ్రీశాస్త్రిగారు **"సుందరకాండ ప్రధాన దేవతాభూత ఆంజనేయోపాసనా మాత్రేణ సర్వదేవతోపాసనా జనితం ఫలం సిధ్యతీతి స్మర్యతే"** – అనగా సుందరకాండమునకు ప్రధాన దేవతయైన హనుమంతుని ఉపాసించినచో సమస్త దేవతలను ఉపాసించినట్లగునని స్మృతుల యందు కలదు. పరాశర స్మృతిలో **"ఆంజనేయః పూజితశ్చేత్. పూజితాః సర్వదేవతాః"** అని చెప్పబడినది. అనగా ఆంజనేయుడు పూజింపబడినచో సర్వదేవతలను పూజించినట్లే**! "హనుమన్మహిమా శక్యో బ్రహ్మణాపి న వర్ణితుమ్"** హనుమంతుని మాహాత్మ్యమును వర్ణించుటకు బ్రహ్మదేవునకు సైతము నలవికాదు అని చెప్పబడినది. (పరాశర సంహిత–సప్తమ పటలము)

శ్రీ శాస్త్రిగారు ప్రతిబోధించిన హనుమద్వైభవము –

ఆంజనేయుని యందు రుద్రతేజము స్వయం ప్రతిష్ఠితమైయున్నది. ఈ విషయమును శ్రీశాస్త్రిగారు **'హనుమదుపాసనాకల్పద్రుమ'** –మనే గ్రంథము నందలి 232వ పుటలోని హనుమజ్జననమునకు సంబంధించిన గాథనుదాహరించుచు సప్రమాణంగా – **ఆ కేసరి భార్యయగు అంజనాదేవి పుత్రార్థినియై ఏడువేల సంవత్సరములు తపమాచరింపగా పరమశివుడామెకు 'తన అష్టమూర్తులలో బలీయమైన వాయువుతో సమానమైన తేజో బల పరాక్రమ సంపన్నుడగు పుత్రుడు ఏకాదశ రుద్ర రూపుడుగా జన్మిస్తాడని' తెలియజేసినాడని, తదనుగుణంగా వాయుదేవుడంజనాదేవిలో సమర్పించిన రుద్రవీర్య ప్రభావముచే వజ్రదేహుడగు ఆంజనేయుడు ప్రాదుర్భవించినాడని"** తెలియజేస్తారు. (సుందరకాండ సారోద్ధారం–పుటలు. 30–31)

వైకుంఠ పరంధామము నందు గరుత్మంతునివలె హనుమంతుడు కూడ నిత్య విభూత్యాత్మక శ్రీరామపరబ్రహ్మము యొక్క సన్నిధిలో నిత్యశూరుడుగా ప్రకాశిస్తూ ఉంటాడనే అంశాన్ని –**'బృహద్బ్రహ్మ సంహితాయాం అర్థపంచక వివరణే నిత్య విభూత్యాత్మక పరమపదే ఏకాంత మందిరే శ్రీరామనామక పరవాసుదేవ సన్నిధౌ సదావస్థిత ఏష హనుమానితి**

ప్రతిపాదనాత్' – అని సప్రమాణంగా తెలియజేస్తారు. వాల్మీకి రామాయణంలో కూడా సుందరకాండలో బలవేగముల ప్రసక్తి వచ్చినప్పుడల్లా హనుమకు గరుత్మంతుని తోడి సామ్యము సుమారుగా 20–30 పర్యాయములు ప్రదర్శింపబడినది. సుందరకాండమును నిత్యము పారాయణము చేయు సాధకులు, విమర్శన దృష్టితో పరిశీలించు సహృదయము ఈ విషయమున అనుభవపూర్వకముగా గ్రహించగలరు. (ఇది శ్రీపాదుక స్వానుభవము కూడ) కొన్ని యుదాహరణములు –

1) పక్షిరాజ ఇవోరగమ్ (సుం. 1–33)

2) గరుడేనేవ హ్రియమాణో మహోరగః (సుం. 1–34)

3) సుపర్ణమివ చాత్మానం మేనే స కపికుంజరః (సుం. 1–44)

4) వ్యోమ్ని తం కపిశార్దూలం సుపర్ణ ఇతి మేనిరే (సుం. 1–75)

5) ఆపాతే పక్షిసంఘానాం పక్షిరాజ ఇవ వ్రజన్ (సం. 1–80)

6) గరుత్మానివ మారుతిః (సుం. 1–171)

7) ఉద్ధరిష్యతి వేగేన వైనతేయ ఇవోరగః (సుం. 21/ 27)

8) శక్తిః స్యాద్వైనతేయస్య తవ వా మారుతస్య వా (సుం. 39/26)

9) తార్క్ష్యాయమాణో గగనే బభాసే వాయునందనః (సుం. 57/10)

10) తతోంతరిక్షం విపులం ప్లుతో౽హం గరుడోయథా (సుం. 58/34)

వైనతేయసమ వేగవత్వ శక్తిమత్వములతోపాటు శ్రీమదాంజనేయుని యందు రుద్రశక్తితోపాటు శ్రీరామావేశము, రామభక్తులగు సర్వవానరుల శక్త్యావేశము, సముద్రుడు నాగమాత, మైనాకుడు, సకల దేవగణములు, సీతాపరమేశ్వరి యొక్క శక్త్యావేశము ప్రక్షిప్తములైయున్నవి. మహిషాసుర, శుంభనిశుంభాది మర్దనములో సర్వదేవతా శక్తులను ఆవహింప చేసుకొని దుర్గాపరమేశ్వరి సుందరియైనట్లుగా, సుందరకాండలో ప్రధానోపాస్యుడైన హనుమ సుందరుడైనాడంటారు శాస్త్రిగారు. (సారో. పుటలు. 8 & 9)

హనుమంతుని విరాడ్రూపము

"సుందరే–సుందరః కపిః" అను పదమునకు పీఠికలో శ్రీ శాస్త్రిగారు ఇంకనూ ఎన్నెన్నో విషయములను సోపపత్తికముగా నిరూపించినారు. ఇది కేవలము దిగ్దర్శనము లేదా దిశా నిర్దేశము మాత్రమేనని గ్రహింపగలరు.

హనుమంతుడు విశ్వాత్ముడు విశ్వరూపుడు –

ఈ విషయాలను నిరూపించడం కోసం సారోద్ధార గ్రంథ పీఠికలో శ్రీ శాస్త్రులుగారు శివరామాయణంలో సహస్రకంఠ రావణుని వధించు సందర్భమున హనుమంతుడు విశ్వరూపమును ప్రదర్శించిన వైనమును –

శ్లో ॥ **తదాంజనేయస్తు విజృంభయిత్వా ప్రతీపమాగాత్కిల విశ్వరూపమ్ ।**

బ్రహ్మాది దేవాశ్చ తదంగరోమ కూపస్య మధ్యే ఋషయశ్చదృష్టాః ॥

సహస్ర శీర్షాభ సహస్రబాహూ రాక్రమ్య సర్వా విదిశో దిశశ్చ ।

తత్రైకమంఘ్రిం పరపుష్కరే–న్యం నిక్షిప్యయానం తరసా నినాయ ॥

(సారోద్ధారం.పుట.16)

ఆ సమయమున ఆంజనేయుడు విజృంభించి విశ్వరూపమును ప్రదర్శించెను. ఆతని రోమకూపముల నడుమ బ్రహ్మాది దేవతలు ఋషులు చూడబడిరి. ఆ సమయమున నతనికి వేయితలలు, వేయి బాహువులు ఉద్భవించి దశదిశలను విదిశలను కూడ ఆక్రమించి ప్రకాశించినవి. అతడొక పాదమును పుష్కరద్వీపము నందును వేరొక పాదమును జంబూద్వీపము నందును ఉంచి నిలచెను." (సారోద్ధారం.పుట.17)

ఇట్లే పరాశర సంహితలో కూడ హనుమ శ్రీరామునితో –

ప్రసార్యలాంగూలమహం తిష్ఠామి వరుణాలయే ।

సప్తసాగర పర్యంతం వర్ధయిత్వాతు సేతువత్ ॥

లాంగూలం సమధిష్ఠాయ జహి తం పురుషోత్తమమ్ ।

ఇత్యుక్త్వా దీర్ఘలాంగూలం ప్రసార్య పవనాత్మజః ॥

మార్గం సప్త సముద్రాంతం కృత్వావై పర్యవస్థితః ।

లాంగూల రోమజాతేషు నక్షత్రాణి తథా గ్రహాః ।

దృశ్యన్తే దర్భపుంజేషు యథైవ హిమ బిందవః ॥

ఓ పురుషోత్తమా ! నేను నా తోకను సముద్రపుపై సేతువు వలె ప్రసరింపచేసి నిలచెదను. సప్త సముద్రములను వ్యాపించి సేతువు వలె నా తోక ప్రసరించును. ఆ నా వాలమును అధిష్ఠించి నీవా శతకంఠుని వధింపుము అని పలికి వాయునందనుడు తన లాంగూలమును ప్రసరింపచేసి సప్త సముద్రపర్యంతము జలాంతర్గత మార్గములను నిర్మించి నిలచెను. అతని లాంగూల రోమజాలములందు గ్రహ నక్షత్రములు దర్భపుంజములందు నిలచిన హిమబిందువులు వలె ప్రకాశించినవి. పరాశరసంహిత (సారోద్ధారము. పుటలు. 17-19)

శ్రీమద్రామాయణ సుందరకాండలోని 37వ సర్గలో హనుమ సీతకు జూపిన స్వస్వరూప ప్రదర్శన ఘట్టములో కూడ నతని విరాడ్రూపము-

తతోవర్ధితు మారేభే సీతాప్రత్యయ కారణాత్ ।
మేరుమందర సంకాశో బభౌ దీప్తానల ప్రభః ॥
అగ్రతో వ్యవతస్థేచ సీతాయాః వానరోత్తమః ।
హరిః పర్వత సంకాశః తామ్రవక్త్రో మహాబలః ।
వజ్ర దంష్ట్రనఖో భీమో వైదేహీ మిదమబ్రవీత్ ॥ అని మూడు శ్లోకములలో వర్ణింపబడినది.

ఇంకను నారద పురాణములోని 36వ అధ్యాయములో శ్రీమహావిష్ణువు హనుమత్ర్పసాదమును స్వయముగా స్వీకరించెననియు, అట్లే స్కాందపురాణంలో సేతుమాహాత్మ్యఖండములో - హనుమంతుడు ఏకకాలములో **“త్రిసహస్ర సంఖ్యాక విద్వత్పరి దృథకృతప్రశ్నానాం సమాధానముక్త్వా- అష్ట యోజనోన్నత స్వరూపం ధృత్వా ప్రత్యక్షోఽభూత్”** - అనగా హనుమ యెనిమిది యోజనముల పొడవు గల మహోగ్రమైన రూపమును ధరించి ఏకకాలములో మూడు వేలమంది పండిత ప్రకాండులతో

సువర్చలాంజనేయులు

వాగ్వాదమును జరిపి జయించెనని చెప్పబడినది. ఇవి యీతని విద్వద్విశ్వరూపమునకు, సర్వజ్ఞత్వమునకు ఉదాహరణలని చెప్పవచ్చును. (సారోద్ధారము–పుట. 32)

హనుమ గృహస్థుడు. నిరంతర బ్రహ్మచర్య వ్రత నిష్ఠుడు. కావుననే అతనిని గృహస్థునిగా, బ్రహ్మచారిగా కూడా నుపాసించుచున్నారు. హనుమకు సూర్యపుత్రియగు సువర్చలాదేవితో వివాహము జరుపబడినట్లు పరాశరసంహితలో విశేషించి ప్రస్తుతింపబడినది.

హనుమ సంపూర్ణకాముడని ప్రస్తుతించు సందర్భములో

శ్లో ॥ జాయాచాపి సువర్చలా రవిసుతా దివ్యంచ హేమాంబరమ్ – అనియు అచటనే హనుమతో షోడశాక్షర మంత్ర ధ్యానములో ధ్యానమూర్తిని వర్ణించు శ్లోకములో –

ఏకేనాభయదం పరేణ వరదం భోజ్యం పరం చాపరే ।

అన్యేనాపి సువర్చలా కుచయుగం హస్తేన సంబిభ్రతమ్ ॥ అనియు

(పరాశర సంహిత 20వ పటలము)

అలాగే ధ్వజదత్త చరితము 10వ పటలములో ప్రత్యక్షీభూత సువర్చలా సహిత హనుమత్స్వరూప వర్ణనములో –

"సువర్ణకుండల జ్యోతిర్దీప్త గండ స్థల ద్వయః

సువర్చలాం దధానశ్చ వామ భాగే నిజప్రియామ్ ।

ధ్యాయన్తీం హృది భర్తారం పార్వతీ మివ శంకరమ్ ॥

మందస్మితాం సువర్ణాభాం సూర్యపుత్రీం సువర్చలామ్ ।

కౌశేయ పరిధానం చదధానాం చ కుశేశయమ్ ॥

ఏవం సర్వగుణోపేతాం ప్రేయసీం మారుతాత్మజః ।

వామభాగే వహన్ భార్యాం క్షణాత్ప్రాదురభూన్మునే ॥

ధ్వజదత్తుడను భక్తునకు హనుమ సువర్చలా సమేతుడై దర్శనమిచ్చినాడు. అతని చెక్కిళ్ళపై బంగారు కుండలములు ప్రకాశిస్తున్నాయి. బంగారు యజ్ఞోపవీతము దివ్యములైన పట్టు వస్త్రములను ధరించి, ఎడమ వైపున బంగరు కాంతితో శోభిల్లుచున్న తన ప్రియ భార్యయు, సూర్య పుత్రియునగు సువర్చలాదేవితో సహ దర్శనమిచ్చినాడని వర్ణింపబడినది.

ఇట్లే 11వ పటలములో గాలవునకు సువర్చలాసహిత హనుమద్ద్వాదశాక్షర మంత్ర మీయబడినట్లు వర్ణింపబడినది. క్రమముగా 12, 13 పటలములలో సువర్చలా సమేత హనుమద్వర్ణనము పరాశర సంహితలో దర్శింపవచ్చును.

ఆంజనేయ పూజా విధానములో కూడా హనుమంతుని –

ఆవాహయామి సర్వేశం సూర్యపుత్రీ ప్రియం విభుమ్ ।

అంజనాతనయాదేవం మాయాతీతం జగద్గురుమ్ ॥

అని సూర్య సుతయగు సువర్చలాదేవితో కూడ నావాహనము చేయవలెనని చెప్పబడినది.

హనుమత్సూక్తములో కూడ – హనుమంతుడు – **“శుద్ధ స్ఫటిక సంకాశః పంచవదనః ... సకల దివ్యాస్త్రధారీ – సువర్చలా రమణః”** – అని కీర్తింపబడినాడు.

ఆయా యా ప్రమాణములను బట్టి హనుమంతుడు శ్రీరామ శ్రీకృష్ణుల వలె గృహస్థుడై యుండి కూడ నిత్యబ్రహ్మచర్యనిష్ఠుడుగా కీర్తింపబడినాడని గ్రహించాలి.

హనుమజ్జయంతి –

హనుమంతుని జన్మ తిథి విషయములలో ఆయా పురాణ కథనములనుసరించి–కార్తీక కృష్ణ చతుర్దశి యనియు,చైత్రశుద్ధఏకాదశి యనియు,వైశాఖ బహుళ దశమి యనియు,మార్గశీర్షకృష్ణదశమి యనియు, – అట్లే వారము విషయములో కూడ మందవాసరము లేదా శనివారము

అనియు,మంగళవారమనియు, బుధవారమనియు వేరువేరుగా ఉల్లేఖములున్నవి.

అన్నింటిని పరిశీలించి సారోద్ధారములో నృసింహావధానులు (రామాయణ శాస్త్రులు) గారు

వైశాఖ బహుళ దశమ్యాం మందవాసరే పూర్వప్రోష్ఠపదా నక్షత్రే వైధృత నామక యోగే, మధ్యాహ్న వేళాయాం, కర్కాటక లగ్నే కౌండిన్యస గోత్ర ప్రాదుర్భూతః -

అనగా హనుమ కౌండిన్యస గోత్రంలో వైశాఖబహుళ దశమీ స్థిరవారం నాడు కర్కాటకలగ్నంలో మధ్యాహ్నసమయంలో వైధృతయోగములో అంజనాదేవికి జన్మించినట్లు నిర్ధారించినారు. కావున అస్మదాదులందరము **వైశాఖబహుళదశమీ తిథినాడు** హనుమజ్జయన్తిని జరుపుకొనుచున్నాము.

'సత్యం-శివం-సుందరమ్' అనే తత్త్వ త్రయములో ఉత్తరోత్తర ప్రాధాన్యమును బట్టి సుందరతత్త్వ సమాలోచనము చేసినచో హనుమ మూర్తీభవించిన సుందరతత్త్వ సమన్వితుడని తెలియును. **"సర్వ సుందర గుణగణ పరిపూర్ణ ఏవ సుందరో హనుమాన్"** అని సారోద్ధార పీఠికలో నిరూపింపబడినది (సారో.పుటలు.34-39)

సుందరకాండ :

సుందరకాండము **శ్రీహనుమన్మాలా మహామంత్రము** అని పండితుల ప్రవచనము.ఈ సారోద్ధారగ్రంథములో ద్వితీయసర్గచివర **'సుందర హనుమన్మాలామహామంత్రము' సకల ఆధివ్యాధినివారకముగా** స్వయముగా బ్రహ్మదేవునిచే లోకకల్యాణముకొరకు ఉపదేశింపబడిన వైనము సవిస్తరముగా తెలియజేయబడినది.(2వసర్గ-శ్లో॥45,46,47-శ్రీపాదుక)

ఆనంద రామాయణం మనోహరకాండలో -

"ఉద్యదాదిత్య సంకాశం ఉదార భుజవిక్రమమ్ ।

కందర్పకోటి లావణ్యం సర్వవిద్యా విశారదమ్ ॥"

హనుమంతుని సౌందర్యము **"కందర్ప కోటి లావణ్యమ్"** అనగా కోటి మన్మథుల సౌందర్యమును మించినదిగా వర్ణింపబడినది.

"బుద్ధిర్బలం యశోధైర్యం నిర్భయత్వమరోగితా

అజాడ్యం వాక్పటుత్వంచ'' – ఇత్యాదిగా వర్ణింపబడిన హనుమద్గుణగ్రామ సౌందర్యమంతయు సోదాహరణగా సుందరకాండలో సమగ్రముగా వర్ణింపబడినది.

హనుమంతుడు లంకకు బయలుదేరునపుడు ప్రస్థానకాలీన పుష్పిత వృక్షాదుల అనుగమనము అత్యంత సుందరముగా మహాద్భుతముగా వర్ణింపబడినది.

మైనాక, సురస, సింహికల యెడ హనుమ చూపిన కార్యతత్పరత, సాహసము, పరాక్రమము మొదలగు స్వాభావిక గుణసౌందర్యము, లంకా నగరము నందలి సౌధవర్ణనము, పుష్పకవిమానము, చంద్రోదయము మొదలగు మనోహర దృశ్యముల రామణీయకత, చంద్రోదయ వర్ణనము, ఋతువర్ణన సందర్భములలో ప్రాకృతిక సౌందర్యముతోపాటు రచనా శిల్ప రామణీయకత, సీతాసంభాషణములలో నామె పాతివ్రత్యాది గుణ సౌందర్యాతిశయము, దేశకాల పాత్రౌచితీ సౌందర్యములు హనుమద్దౌత్యమున నీత్యుపదేశ సౌందర్యములు, ఇలా సుందరకాండలో ప్రతి వర్ణనములో, ప్రతి వాక్యములో, ప్రత్యక్షరములో నుండి సౌందర్య సమున్మేషము తొణికిసలాడుచు కన్పట్టును.

ప్రతిక్షణము నొక విలక్షణమైన సౌందర్యాతిశయము కన్పించు తత్త్వమును రామణీయకతా లక్షణముగా మాఘకవి –

"క్షణే క్షణే యన్నవతాముపైతి తదేవ రూపం రమయణీయతాయాః" అని పేర్కొనినాడు. ఆ సౌందర్యము సుందరకాండములో సర్వత్ర సమానముగా సంతతతైలధారావచ్ఛిన్నముగా కనిపించును.

ఈ విధముగ సుందరకాండ సహృదయ హృదయములకు అమందానంద సందోహకరమగుటచే **సుందరకాండ**మని లోకమున ప్రసిద్ధిని గాంచినది.

ఈ విధముగా సుందరకాండ యొక్క తాత్త్విక సమాలోచనము గావించుచూ శ్రీనృసింహావధాని పాకయాజిగారు శ్రీమద్రామాయణాంతర్యార్థ వివరణము సుందరకాండ పారాయణ పద్ధతులు, శ్రీమద్రామాయణము నందలి సర్గ, శ్లోక సంఖ్యలను గూర్చిన సాంకేతిక వివరణములను, సుందరకాండ పారాయణ ఫలములు, పారాయణ పద్ధతులు వేద రామాయణ వివరణముల వంటి విషయములనెన్నింటినో ప్రతిపాదించియున్నారు.

ప్రస్తుత సుందరకాండలో ప్రతిపాద్యవిషయము 19సర్గలలో 1008 శ్లోకములలో నిట్లు ప్రతిపాదింపబడినది.

సర్గ	**శ్లోకసంఖ్య**	**మొత్తము**	**సర్గ**	**శ్లోకసంఖ్య**	**మొత్తము**
1.	82	82.	11.	54	622.
2.	47	129.	12.	50	672.
3.	33	162.	13.	50	722.
4.	60	222.	14.	43	765.
5.	56	278.	15.	49	814.
6.	65	343.	16.	60	874.
7.	57	400.	17.	60	934.
8.	54	454.	18.	35	969.
9.	51	505.	19.	39	**1008.**
10.	63	568.			

మంత్రసంఖ్యానము ననుసరించి 1008, పరబ్రహ్మావాచకమగు నవాంకము(9)ని సూచించును. కాగా ఈ సుందరకాండము భక్తజనమందారమె శ్రీహనుమత్సీతాలక్ష్మణసమేత తారకరామబ్రహ్మపదముననుగ్రహించునని తాత్పర్యము.

-----0-----

శ్లో ॥ రామం కామారిసేవ్యం భవభయహరణం కాలమత్తేభ సింహమ్ ।
యోగీంద్రం జ్ఞానగమ్యం గుణనిధిమజితం నిర్గుణం నిర్వికారమ్ ।
మాయాతీతం సురేశం ఖలవధనిరతం బ్రహ్మబృందైకవేద్యమ్ ।
వందే కుందావదాతం సరసిజనయనం దేవముర్వీశ రూపమ్ ॥

శ్రీ రామాయణ సారోద్ధారము – సుందరకాండ

ప్రథమ సర్గ

హనుమంతుడు, జాంబవంతుడు, అంగదుడు, సుగ్రీవుడు మున్నగువారి ప్రేరణచే మహేంద్ర పర్వతము నుండి లంకకు పోవలెనని తలంచుట – "తతో రావణ సీతాయాః" శ్లోక వ్యాఖ్యానము.

హనుమ ఆకాశమార్గమున సముద్రమును లంఘించుచుండగా దేవతలతనిని స్తుతించుట.

మైనాకుని అభ్యర్థనమును సున్నితముగా తిరస్కరించి, హనుమ ముందుకుసాగుట.

హనుమంతుని పరీక్షించుటకై దేవతలు సురసను పంపుట. మరియు హనుమంతుడామెను జయించి కార్యోన్ముఖుడై సాగిపోవుట.

ఛాయాగ్రాహి యగు సింహికను సంహరించి లంకను ప్రవేశించుట అను అంశములు ఈ సర్గలో ప్రధానముగా ప్రతిపాదించబడినవి.

ప్రార్థన

అవతారిక :

"గ్రంథాదౌ మంగళమవశ్యం కర్తవ్యమ్" – గ్రంథారంభమున సంకల్పిత కార్యసిద్ధి, అనగా గ్రంథపరిసమాప్తిపర్యంతము రచనము నిర్విఘ్నముగా కొనసాగవలెనని యిష్టదైవమును ప్రార్థించుట సంప్రదాయము. అందులకనుగుణముగా తారకపరబ్రహ్మస్వరూపుడును శ్రీమద్రామాయణ కథానాయకుడును,అగు శ్రీరామసార్వభౌముని స్తుతించుచున్నారు.

శ్లో ॥ **రామం కామారిసేవ్యం భవభయహరణం కాలమత్తేభ సింహమ్ ।**
యోగీంద్రం జ్ఞానగమ్యం గుణనిధిమజితం నిర్గుణం నిర్వికారమ్ ।
మాయాతీతం సురేశం ఖలవధనిరతం బ్రహ్మబృందైకవేద్యమ్ ।
వందే కుందావదాతం సరసిజనయనం దేవ ముర్వీశరూపమ్ ॥

అర్థము : కామారి యనగా మన్మథుని దహించిన శివునిచే సేవింపబడు వాడును, జన్మమృత్యురూపమైన సంసారభయమును హరించువాడును, కాలుడు లేదా కాలమను మదగజముపాలిట సింహమైనవాడును, యోగీశ్వరుడు, జ్ఞానగమ్యుడు, సకలకల్యాణగుణములకు నిధియైనవాడును, అజేయుడు, నిర్గుణుడు, నిర్వికారుడు, మాయాతీతుడు, సర్వదేవతలకు ప్రభువైనవాడును, దుర్మార్గులను వధించుటలో నిరతము ప్రవర్తించువాడును, బ్రహ్మాదిసర్వదేవతావంద్యుడును మల్లెపూవువలె తెల్లని(చరితము)వాడును, రాజీవలోచనుడునగు శ్రీరామభూపాలుని నమస్కరించుచున్నాను.

శ్రీపాదుక : ఇది శ్రీ తులసీదాసవిరచిత రామచరితమానసములోని లంకాకాండలో గావింపబడిన మంగళారంభశ్లోకము.

'రామ' యను తారకనామమంత్రముచేనారంభించబడి, శ్రీరామసార్వభౌముని గ్రంథారంభమున నుతించుటచే గ్రంథరచనలోని విఘ్నములన్నియు వారింపబడి సాంతము రచన నిరాటంకముగా సాగి, చరమఫలమగు మోక్షపురుషార్థమును పొంది, పాఠకులు, శ్రోతలు తరింపగలరని శ్రీరామదాసదాసుడైన తులసీదాసుని ఆశంస మరియు మంగళాశాసనముగా గ్రహింపవలెను.

శ్రీమహాదేవః – శ్రీ మహాదేవుడు పార్వతికి **"సుందరకాండ సారోద్ధారము"** నుపదేశించుచున్నాడు.

శ్రీపాదుక : తులసీరామాయణములోని ప్రార్థనశ్లోకమును యథాతథముగా గ్రహించినట్లుగనే రచయిత ఇతర రామాయణములందున్న రామాయణోపదేశమును శివపార్వతీసంవాదరూపముగా సంభావించినారని గ్రహించాలి. ఈ విధముగా భావించుట వలన ప్రస్తుతసుందరకాండ సారోద్ధార గ్రంథమునకు ఆగమప్రామాణ్యము సిద్ధించును.

శ్లో ॥ ఆగతాః శంభువక్త్రేభ్యః గతాశ్చ గిరిజాముఖమ్ ।
మతాశ్చ వాసుదేవేన ఆగమాః పరికీర్తితాః ॥

ఆ = ఆగతాః, శివుని పంచముఖముల నుండి వెలువడినవి; **గ** = గతాః – పార్వతీదేవిముఖపద్మములో ప్రవేశించినవి; **మ**=మతాః –

వాసుదేవుడగు విష్ణువుచే ఆమోదించబడినవియగు గ్రంథములు ఆగమములుగా ఆగమవేత్తలచే కీర్తింపబడినవని భావము.

శ్లో ॥ తతో రావణనీతాయాః సీతాయాశ్శత్రుకర్శనః ।

ఇయేష పదమన్వేష్టుం చారణాచరితే పథి ॥

అర్థము : తరువాత శత్రుభంజనశీలుడగు హనుమంతుడు రావణునిచేనపహరింపబడిన సీతమ్మను వెదకుటకై దేవగాయకులగు సిద్ధచారణాదులు సంచరించు ఆకాశమార్గమున సీతాధివాసమగు లంకకు పోవసంకల్పించెను.

అనువాద పద్యం :

తే.గీ ॥ వరద సీతమ్మ కపటి రావణుని చేత

నపహరింపబడగ నామె నాంజనేయ-

స్వామి, వెదుక జలధిదాట, చారణపథి

నేగ దలచియు, నింగిపై కెగసినాడు !

శ్రీపాదుక : 'తతః' అను ఆనంతర్యార్థకమైన అవ్యయముచే శ్లోకమారంభింపబడినది.

గ్రంథారంభ సౌందర్యము :

'తతః' అనే ఈ ఎత్తుగడలోనే సుందరకాండయొక్క శిల్పరామణీయకత గోచరిస్తుంది. సుందరకాండ పారాయణ మాత్రముచేతనే శ్రీమద్రామాయణ పారాయణఫలం సిద్ధిస్తుందని చెప్పుకున్నాం. కారణం,రామాయణం "తపస్స్వాధ్యాయ నిరతమ్" అని తకార బీజంతో, వరుణదేవతాకమైన 'యగణం'తో ప్రారంభించబడింది.

ఈ సుందరకాండ కూడా గాయత్రీమంత్రప్రథమబీజమైన తత్పదాన్ని సూచిస్తూ "తతోరా" అని యగణంతో ప్రారంభమైంది.

శ్లో॥ ప్రకృత్యా యగణో నిత్యం శ్రీకరః కథ్యతే బుధైః ।

కరోత్యర్థానాదిలఘుః యగణో వారిదైవతమ్ ॥

అనియు, **"యోవార్యాది లఘుర్ధృతిమ్"** – అనియు ఛందశ్శాస్త్ర ప్రవచనము.

ఆదిలఘువైన యగణముచే ప్రారంభించబడిన కావ్యము సంతతశ్రీప్రదముగా పండితులచే ప్రవచింపబడినది. మరియు వరుణదేవతాకమైన యగణము సర్వార్థములను సిద్ధింపచేయుటయేగాక, అది ప్రవర్తించు ప్రదేశమునంతను తృణకాష్ఠజలసమృద్ధిచే సస్యశ్యామలమొనర్చును. ఈ విధమైన మహాఫలము సుందరకాండ మఱియు శ్రీమద్రామాయణ పారాయణపరాయణులమైన మనకందరకు అనుభవములోనున్న విషయమేనని ప్రత్యేకించి వివరింపనవసరము లేదు. మఱియు – 'తతో' అనే యీ గ్రంథారంభ నిర్దేశము గాయత్రీమంత్ర ప్రథమ బీజము, తత్పదార్థ స్వరూపమైన శ్రీరామతారకపరబ్రహ్మమును కూడ అభివ్యక్తీకరించును.

'తతః' అనే ఈ ఆనంతర్యార్థకమైన అవ్యయము పూర్వవృత్తమైన కిష్కింధకాండ చివరలో జాంబవంతాదులు హనుమపరాక్రమమమును నభినుతించుటచే, అమందానందసందోహకందళితస్వాంతుడైన హనుమ అత్యుత్సాహముతో – **"జగామలంకాం మనసా మనస్వీ"** మనోజవంతో మనసా లంకను చేరుకున్నాడట! ఆ విధంగా సంకల్పించిన మానసికప్రయాణాన్నిప్పుడు కార్యరూపంలో ప్రదర్శింపనిచ్ఛగించాడనే విషయం **'తతః'** (పిమ్మట) **ఇయేష** (మరల సంకల్పించాడు) అనే పదాలు ధ్వనింపచేస్తున్నాయి. ఈ విధమైన అభివ్యక్తిచేత రామాయణం ఉత్తమోత్తమమైన **ధ్వనికావ్యమైంది.**

ఈవిధమైన వ్యంగ్యవైభవం పదగతము, వాక్యగతము ప్రబంధగతమునై త్రిపథగలా రామాయణంలోను, సమాంతరంగా సుందరకాండలోనూ, దర్శనమిస్తుందంటారు సారోద్ధారకర్తలు. **"ఏతత్కాండరూపేణ అనాది భగవత్సంహార కర్తృత్వముచ్యతే, తథైవ శారీరకమీమాంసాపి. తదా –లంకా విచారణేన శరీరం ద్యోతితం. ఏకాక్షీ ప్రభృతయః ఇంద్రియాణి, రావణ కుంభకర్ణాదయో అహంకారమమకారాదయః : ఇంద్రజిత్ప్రభృతయః కామక్రోధాద్యరిషడ్వర్గాః తాదృశలంకాఖ్యశరీరే నిరుద్ధసీతాసదృశం వివేకం తద్ జ్ఞాతుం. హనుమాన్ చారణాచరితే పథి గంతుం ఇయేష"** ఇతి.

ప్రారంభ శ్లోకంలోనే కావ్యార్థ సమగ్ర సూచనం ఉత్తమోత్తమ కావ్య లక్షణం. కాగా రావణాపహృతయైన సీతనుసందర్శించుటకై హనుమ (జ్ఞానియైన సాధకుడు) లంకలో దర్శింప సంకల్పించి చారణాచరిత మార్గంలో

ప్రయాణించడానికి సంకల్పించాడని వర్ణింపబడింది. హనుమల్లంకా ప్రవేశ సంకల్పంలో శారీరకమీమాంస కూడా ధ్వనింపబడుచున్నది. లంకాపురి శరీరము లేదా దేహమునకు ప్రతీక. సీతను పరివేష్టించియున్న ఏకాక్షి మొదలగు రాక్షసీగణములు ఇంద్రియములు. రావణుడు అహంకారము, కుంభకర్ణాదులు మమకారాదులైన ద్వంద్వపరిశిష్టములు. ఇంద్రజిదాదులు కామక్రోధాద్యంతశ్శత్రుసమూహములు. ఈ విధమైన లంకాపురిలో వివేకస్వరూపిణియైన సీత నిరోధింపబడినది. దానినన్వేషింప బయలుదేరిన హనుమ సిద్ధచారణాచరిత మార్గములో పయనించుటకుద్యమించిన జ్ఞానియగు సాధకుడు.

హనుమ సంకల్పించిన యానమార్గము చారణాచరితపథము. **'చారయన్తి ఆచారయన్తి ధర్మాన్'** అనగా ధర్మములను ప్రవర్తింపజేయు వారు చారణులు వారే పూర్వాచార్యులు.

శ్లో ॥ **ఆచినోతి హి శాస్త్రార్థాన్ ఆచారే స్థాపయత్యపి ।**
స్వయమాచరతే యస్మాత్ తస్మాదాచార్య ఉచ్యతే ॥ అనియు
ఆచార్యో వేద సంపన్నో విష్ణుభక్తో విమత్సరః ।
మంత్రజ్ఞో మంత్రభక్తశ్చ సదామంత్ర శ్రయశ్శుచిః ॥
గురుభక్తి సమాయుక్తో పురాణజ్ఞో విశేషతః '
ఏవం లక్షణ సంపన్నో గురురిత్యభిధీయతే ॥ – అనగా

శాస్త్రార్థములను వెదకివెదకి, సంగ్రహించి తానాచరించుచు, ఇతరులచే నాచరింపజేయువాడాచార్యుడని ఆచార్యశబ్దము నిర్వచింపబడినది. గురువుకూడా అట్టివాడేనని– చక్కగా హృదయమునకు హత్తుకొనునట్లు ఉపదేశించువాడును, వేదాశాస్త్రార్థముల నెఱింగినవాడును, విష్ణుభక్తుడు మాత్సర్యరహితుడు, మంత్రజ్ఞుడు, మంత్రాచరణము నందు శ్రద్ధా, భక్తి నిష్ఠలు కలవాడును, మంత్రములకాశ్రయమైన వాడును, పరిశుద్ధుడు, గురుభక్తి కలిగినవాడు, పురాణములనువానితత్త్వమును సాకల్యముగనెఱిగి యుపదేశింపగలవాడునో **"గురువు"** అని గురు లక్షణము. హనుమ ఈ విధమైన గుర్వాచార్యలక్షణసంపన్నుడు కావుననే – **"మహాజనో యేన**

గతస్స పంథాః" – అనగా మహితాత్ములైన సిద్ధపురుషులు నడచు మార్గమున సిద్ధిస్వరూపిణియగు సీతనన్వేషింప సంకల్పించినాడని గ్రహించాలి.

కాని ఆయుమ, **'రావణ నీత'–** రావణునిచే నయిష్టముగా అపహరింపబడి తీసికొనిరాబడినదై లంకలో నిరోధింపబడినది. **రావయతి** – అసత్ప్రలాపములను తానపలిపించుచు, నితరులను జల్పింపచేయువాడు రావణుడు. అతడవివేకి, విచక్షణజ్ఞానములేనివాడు. కావున అహంకారియై, సీతను వశంవదగావింప యత్నించుచున్నాడు. అతని యహంకారమును సమూలముగా నిర్మూలించుటకు **సాధనచతుష్టయసంపత్తి** పుష్కలముగా గలవాడే దక్షుడగు అధికారి. అతడే హనుమ. కావుననే అతడు తానెన్నుకొనిన సిద్ధచారణులు సంచరించు గగనమార్గము నెన్నుకొని తన సంకల్పమున కనువుగా **"సుపర్ణమివ చాత్మానం మేనే"** – తనను తాను గరుత్మంతునిగా దలచి తనలో గరుత్మంతుని లక్షణమును అధ్యారోపము చేసికొనినాడు. గరుడునికి **సుపర్ణు**డని పేరు. **సుపర్ణుడనగా** శోభనములైన ఎగురుటకు సామర్థ్యమునుపకల్పించు పక్షములు లేదా ఱెక్కలు కలవాడని భావము.

చారణాచరిత మార్గమున చరించుటకు గల సామర్థ్యమునిచ్చు సాధనము జ్ఞానకర్మసముచ్చయము. ఇదే విషయము –

శ్లో॥ ఉభాభ్యా మేవ పక్షాభ్యాం యథాఖే పక్షిణాం గతిః ।

తథైవ జ్ఞానకర్మాభ్యాం నియతా పరమాగతిః ॥ అనియు –

శ్రు ॥ బ్రాహ్మణా వివిదిషంతి – యజ్ఞేన దానేన తపసా నాశకేనేతిచ ॥

పక్షులే విధముగా తమ ఱెక్కల సామర్థ్యముతో వియన్మార్గ సంచారమును సాధింపగలుగుచున్నవో అదే విధముగా పరగతికి జ్ఞానకర్మ మార్గముల రెండింటి సహాయము పరమావశ్యకమై యున్నది. కావుననే శ్రుతిమాత – బ్రాహ్మణులు యాగములచేతను దానాదులచేతను, తపోయోగాది ప్రక్రియల చేతను జ్ఞాన సముపార్జనము తద్వారా పరమగతిని సాధించుచున్నారని ప్రవచించినది అని భావము.

హనుమంతుని ప్రస్థానసంకల్పము రావణుడపహరించిన సీతాదేవి యున్న పదమ్ – అనగా స్థానమును అన్వేషించుటయే. అందులకు అతనికి

గల అర్హులతలతోపాటు అన్వేషణావసరమున ఎదురైన సురస, సింహికాది అవరోధములను ఇతర ప్రత్యర్థులను ఎదుర్కొను సామర్థ్యము **"శత్రుకర్శనః"** అను విశేషణముచే చెప్పబడినది.

గోవిందరాజీయభూషణ వ్యాఖ్యానములో–' ఇది శ్రీమద్రామాయణము లోని ద్వాదశసహస్రముయొక్క ప్రారంభశ్లోకమనియు, ఇందు గాయత్రీమంత్రములోని 12వ అక్షరము ప్రయుక్తమైనది. దానిని తజ్ఞులగు విజ్ఞులు గమనించగలరు' – అని సూచింపబడినది. గాయత్రీ మంత్రములోని 12వ అక్షరమైమన **వకారము "రావణనీతాయాః"** అనుపదములోని **'వ'**కారము అని గ్రహించాలి.

2) శ్లో॥ దుష్కరం నిష్ప్రతిద్వంద్వం చికీర్షన్ కర్మ వానరః ।
సముదగ్రశిరోగ్రీవో గవాంపతి రివాబభౌ ॥

భావము – మిక్కిలి అసాధ్యమైనదియు, అనితరసాధారణమైనదియు నిరుపమానమైనదియునగు యీ సముద్రోల్లంఘనమును నిర్విఘ్నముగా కొనసాగించుటకై హనుమంతుడు, మెడను పూర్తిగా సాచి, తలను సంపూర్ణముగా పైకెత్తిన మహావృషభము (నందీశ్వరుడు) వలె ప్రకాశించెను.

శ్రీపాదుక : అత్యంత కష్టసాధ్యమైన కార్యమును సాధించుటకు సాధకుడు మహాశక్తిమంతుడు కావలెను. శ్రీవిద్యాసంప్రదాయములో మహాశక్తి **"శ్రీశివా శివశక్త్యైక్య రూపిణీ లలితాంబికా"** అని కీర్తించబడినది. సుందరమైన శివశక్తి స్వరూపము – లలిత. **"లోకానతీత్య లలతే ఇతి లలితా"** అని ఆ మహాశక్తి లోకములను ప్రకాశింపజేయుచు తాను వానికతీతముగా ప్రకాశించునదని కీర్తింపబడినది.

ఇచట హనుమ పరాశక్తి– మహావిద్యాస్వరూపిణియైన సీతనన్వేషింపబూనినవాడై **"గవాంపతిరివ–ఆబభౌ"** అని నిర్దేశింపబడినాడు. గోవులనగా కిరణములు. **గవాంపతిరివ** – అనగా మహాప్రకాశస్వరూపునిగా **ఆబభౌ–** అనగా కాంతులన్నింటిని మించిన వెలుగులకు వెలుగుగా వెలుగొందినాడు అని వర్ణింపబడినాడు.

హనుమ శివావతారము. రావణుడు కూడ హనుమను - **"కిమేష భగవాన్నందీ?"** ఇతడు నందీశ్వర భగవానుడు కాదు కదా? అని దిగ్భ్రాంతికి లోనవుతాడు. (వా.రా.సుందర 5-50-2.2) శ్రీవిద్యాసంప్రదాయ ప్రవర్తకులలో నందీశ్వరుడు ఒకడు. అతడు దర్శించిన పంచదశీమహావిద్యకు -**'నందివిద్య'** అని పేరు.

స-ఏ-ఈ-ల-హ్రీం, స-హ-క-హ-ల-హ్రీం, స-క-ల-హ్రీం- అనేది నందివిద్యా పంచదశాక్షరీ మహామంత్రము నంది విద్యనుపాసించి సిద్ధులను పొందిన సిద్ధపురుషుడు **సుందరనాథుడు.**

ఈ పంచాక్షరీమంత్రమే కాక **"ఓం-ఐం-హ్రీం-శ్రీం-క్లీం- నంది విద్యాయై నమః"** అనే ద్వాదశాక్షర మంత్రము కూడా నందివిద్యగా చెప్పబడినది. పూర్వజన్మజ్ఞానము. వశీకరణము, అసాధ్యసాధనములకై నందివిద్యానుష్ఠానము ప్రసిద్ధముగా నిర్దేశింపబడినది.

'తత్పురుషాయ విద్మహే-చక్రతుండాయ ధీమహి-తన్నో నందిః ప్రచోదయాత్' అని నందివిద్యాగాయత్రి.

కామరూపుడగు హనుమ దుష్కరము, అనితరసాధ్యమునైన సముద్ర లంఘనమునకుద్యమించినవాడై - నందివిద్యాతాదాత్మ్యమునందినాడను విషయమిచట ధ్వనింపచేయబడినదని చెప్పనొప్పును.

3)శ్లో ॥ పూర్వం జాంబవతోఽభివాద్య చరణావాపృచ్ఛ్య సేనాపతిమ్ ।
ఆశ్వాస్యాశ్రుముఖాన్ ముహుః ప్రియసఖాన్ ప్రేష్యాన్ సమాదిశ్య చ।
ప్రారంభం జగృహే మహేంద్రశిఖరా దంభోనిధేర్లంఘనే ।
రమ్యం శ్రీ రఘునాథ పాదరజసాముచ్చైః స్మరన్మారుతిః ॥

(హనుమద్రామాయణము)

భావము : మారుతి ముందుగా జాంబవంతుని చరణములకు ప్రణమిల్లినాడు. తరువాత సేనానాయకుడగు ప్రహస్తుని వద్దకు వెళ్ళి 'పోయివచ్చెదను' అని విన్నవించి అతనియనుమతిని తీసికొనినాడు. తన ఆప్తమిత్రులందరు ప్రేమాతిశయమున కంటతడిపెట్టగా వారినోదార్చినాడు. తనసేవకులకు తగు

జాగ్రత్తలను ఆదేశించినాడు. చివరగా మహేంద్రగిరిపైనుండి సాగరమును ఉల్లంఘించుటకై యుద్యమించుచు తన ప్రభువైన శ్రీరామచంద్ర పదరజఃకణములను మనసా స్మరించి బయలుదేరినాడు.

శ్రీపాదుక : ఈ శ్లోకము హనుమద్విరచితముగా చెప్పబడుచున్న హనుమద్రామాయణములోనిది. ఇందులో సముద్రోల్లంఘనమునకై బయలుదేరుచున్న హనుమత్ప్రస్థానసంరంభము కట్టెదుట సాక్షాత్కరించు శబ్దచిత్రము దర్శింపనగును.

హనుమ బుద్ధిమద్వరిష్ఠుడు. కాన ముందుగా జాంబవంతుని చరణములకు ప్రణమిల్లి సంప్రదాయమును పాటించినాడు. కారణము జాంబవంతుడందరిలోను వయోవృద్ధుడు మఱియు జ్ఞానవృద్ధుడతడే. బ్రహ్మగారి జృంభణము (ఆవులింత) నుండి జనించి కృత, త్రేతా, ద్వాపరయుగముల మూడింటను విష్ణుసేవాతత్పరుడై మెలగిన ధన్యాత్ముడు. అందులకై ముందుగా ఆంజనేయుడాతనికి పాదాభివందనము చేసి యాతని ఆశీరభినందనములను పొందినాడు.

సైన్యమును వీడి స్వామికార్యార్థమై బయలుదేరుచున్నను సైన్యాధ్యక్షునికి విన్నవించి యతని అనుమతిని పొంది నిర్గమించుట తన వృత్తిధర్మము. కావున దానిని పాటించుచూ హనుమ ప్రహస్తునికి విన్నవించి, యాతనినుండి సెలవుగొనినాడు. తరువాత దుష్కరమైన కార్యమును సాధించుటకై ఒంటరిగా నేగుచున్నాడని తనయందలి ప్రేమాతిశయముచే కన్నీరు పెట్టుకున్న ఆప్తమిత్రుల కన్నీళ్లు తుడిచివారినోదార్చినాడు.

తనకనుసన్నలలోమెలగుచు సర్వులకు సహాయసహకారములందించు తనయనుచరగణములకు కర్తవ్యములను ఆదేశించి చివరగా...

యే మహితాత్ముని చరణాంగుష్ఠ ప్రహారముచే దుందుభికాయము ఏడామడల దూరమునకు చిమ్మబడినదో, మరియునే పరమాత్ముని చరణధూళికణము సోకినంతనే అహల్యామతల్లి శాపమునుండి విముక్తురాలయ్యెనో అట్టి తన ప్రభునగు శ్రీరామచంద్రమూర్తి పాదారవిందరజఃప్రభావమును మనసా స్మరించి, తత్ప్రభావముచే

నవనవోన్మేషములైన స్ఫూర్తిధృత్యుత్సాహములనుపొంది సాగరలంఘనమునకై సర్వశక్తిమంతుడుగా విజయోత్సాహముతో బయలుదేరినాడని గ్రహించాలి.

హనుమయొక్క ఈ విధమైన ప్రస్థానోపక్రమమే ఆతని భవిష్యత్కార్య సిద్ధిని నిశ్చయముగా నిరూపించుచున్నది.

4) శ్లో ॥ నిష్ప్రమాణ శరీరస్సన్ విలంఘయిషురర్ణవమ్ ।

బాహుభ్యాం పీడయామాస చరణాభ్యాం చ పర్వతమ్ ॥

భావము : సముద్రమును దాటదలచినవాడై స్వామి అందుకు తగినట్లుగా ఇంతటి పరిమాణము కలదని చెప్పనలవికానట్లుగా తన శరీరమునుపెంచి, బాహువులతోను పాదములతోను ఆ మహేంద్రపర్వతమునుపమర్ధించెను.

శ్రీపాదుక : అపారపారావారమునుల్లంఘించుచుటకు అపరిమిత ప్రమాణమగు శరీరమవసరము గావున బుద్ధిమంతుడగు హనుమ తగినట్లుగా తన శరీరప్రమాణమును నిష్ప్రమాణముగా పరిమితినూహింప శక్యముకానట్లుగా పెంచినాడు.

"బుద్ధిస్తాత్కాలికీజ్ఞేయా" అనగా సకాలములో సరియగు నిర్ణయమును తీసికొను ధీశక్తి బుద్ధియని నిర్వచింపబడినది. సమయోచితముగా సరియైన నిర్ణయమును గైకొని కార్యోన్ముఖుడగుటయే విజయప్రాప్తిరహస్యము కదా!

ఈ విధమైన బుద్ధిమంతులలో హనుమను మించిన వారెవ్వరును లేరు. కావుననే హనుమ **'బుద్ధిమద్వరిష్ఠుడు'** గా కీర్తించబడినాడు. అట్టి మహాకాయముతో నతడు రెండుచేతులతో, మరియు పాదములతో మహేంద్ర పర్వతమును మర్ధించెను. హనుమ చతుష్పాద్వానరజాతికి చెందినవాడు కావున ఇట్లు మర్ధించుట సహజమేనని భావము.

5) శ్లో ॥ స చచాలాచలశ్చాపి ముహూర్తం కపిపీడితః ।

సర్వతః సంవృతః శైలో బభౌ పుష్పమయో యథా ॥

భావము : ఆ మహేంద్రగిరి కదలని స్వభావము కలదైనప్పటికీ హనుమంతునిచే ముహూర్తకాలము అనగా 12 క్షణములు లేదా 48 ని॥లపాటు పీడింపబడి అటునిటు చలించిన కారణముగా (ఈ ప్రకంపనలకు అందున్న విరియబూసిన

హనుమంతుడు సముద్రమును దాటుట

చెట్లనుండి రాలిపడిన) పూలచే పూర్తిగా కప్పబడినదై పుష్పమయమైన పర్వతమువలె ప్రకాశించెను.

శ్రీపాదుక : ఇచట ముహూర్తశబ్దమునకు మన కాలమానములననుసరించి కొద్ది (12) క్షణములనియు, రెండు ఘడియలనియు, 48 నిమిషములనియు ఏదో ఒక అర్థమును గ్రహింపవచ్చును.

6) శ్లో ॥ శిరోభిః పృథుభిస్సర్పాః వ్యక్త స్వస్తిక లక్షణైః ।

వమంతః పావకం ఘోరం దదంశుర్దశనైశ్శిలాః ॥

భావము : మహేంద్రగిరి యట్లు హనుమంతునిచే పీడింపబడుచుండగా అందువసించు మహాసర్పములు స్వస్తిక చిహ్నములతో ప్రకాశించు పెద్ద పెద్ద పడగలను విప్పి క్రోధముతో భయంకరమైన విషాగ్నులను వెడలగ్రక్కుచు ఆ కొండఱాళ్ళను కోఱలలో కఱవసాగెను.

7) శ్లో ॥ తాస్తదా సవిషైర్దష్టాః కుపితైస్తైర్మహాశిలాః ।

జజ్జ్వలుః పావకోద్దీప్తాః బిభిదుశ్చ సహస్రశః ॥

భావము : ఆ విధముగా కోపోద్రిక్తములైన మహావిషసర్పములచే కాటువేయబడిన మహేంద్రగిరిశిలలు విషాగ్నిజ్వాలలచే ప్రజ్వరిల్లుచు వేలకొలదిగా తుత్తునియలై ప్రేలిపోయినవి.

8) శ్లో ॥ దుధువే చ స రోమాణి చకంపే వ్యచలోపమః ।

ననాద సుమహానాదం సుమహానివ తోయదః ॥

భావము : మహాపర్వతాకారుడగు హనుమమహోత్సాహముతో రోమాంచితమగు శరీరమును విదలించుచు, ప్రకంపించి పెద్దపెట్టున మహాకాలమేఘమువలె గర్జించెను.

9) శ్లో ॥ బాహూసంస్తంభయామాస మహాపరిఘసన్నిభౌ ।

ససాద చ కపిః కట్యాం చరణౌ సంచుకోచ చ ॥

10) శ్లో ॥ రురోధ హృదయే ప్రాణాన్ ఆకాశమవలోకయన్ ।

పద్భ్యాం దృఢమవస్థానం కృత్వా స కపికుంజరః ॥

భావము : వానరవీరుడగు ఆ హనుమంతుడు మహాపరిఘాయుధములను బోలిన తన బాహువులను రెండింటిని బిగుతుగా స్తంభింపచేసి, యనగా బిగియబట్టి, వాయువును బిగపట్టుటచే నడుమును సన్నము గావించి, కూడ,

కొద్దిగా మడమలను పైకెత్తి మునివ్రేళ్ళపై స్థిరముగా నిలచిన పాదములతో నదిమిపట్టిన వాడై ఆకాశము పైకిచూచుచు, హృదయము నందు ప్రాణవాయు సంచారమును స్తంభింపచేసినవాడై ...

11) శ్లో ॥ నికుంచ్య కర్ణౌ హనుమానుత్పతిష్యన్మహాబలః ।

వానరాన్వానర శ్రేష్ఠః ఇదం వచన మబ్రవీత్ ॥

భావము : చెవులను ముడుచుకొని పైకెగురుటకుద్యమించుచున్న వానరవీరుడగు ఆంజనేయుడు జాంబవదాది వానరవీరులతో నిట్లు పలికెను.

12) శ్లో ॥ యథా రాఘవనిర్ముక్తః శరః శ్వసనవిక్రమః ।

గచ్ఛేత్తద్వద్గమిష్యామి లంకాం రావణపాలితామ్ ॥

భావము : వాయుదేవునితో సమానమైన జవపరాక్రమములు కల, శ్రీరామునిచే విడువబడిన బాణమువలె నేను అప్రతిహత పరాక్రమముతో రావణునిచే పరిపాలింపబడుచున్న లంకకు పోయి వచ్చెదను.

13) శ్లో ॥ న హి ద్రక్ష్యామి యది తాం లంకాయాం జనకాత్మజామ్ ।

అనేనైవ హి వేగేన గమిష్యామి సురాలయమ్ ॥

భావము : ఒకవేళ లంకలో జనకుని కుమార్తెయగు ఆ సీతాదేవిని నేను చూడజాలకపోయినచో, ఇదే వేగముతో స్వర్గలోకమునకు పోయెదను (అని పలికి)పిమ్మట..

14) శ్లో ॥ స సూర్యాయ మహేంద్రాయ పవనాయ స్వయంభువే ।

భూతేభ్యశ్చాంజలిం కృత్వా చకార గమనే మతిమ్ ॥

భావము : హనుమంతుడు సూర్యునకు, దేవేంద్రునకు, వాయుదేవునకు, పంచభూతములకు అంజలిఘటించి, ప్రణతి పూర్వకముగా ప్రయాణించుటకు నిశ్చయించెను.

15) శ్లో ॥ సర్వథా కృతకార్యోఽహ మేష్యామి సహ సీతయా ।

ఆనయిష్యామి వా లంకాం సముత్పాట్య సరావణామ్ ॥

భావము : చేయవలసిన కార్యమును సమగ్రముగా నిర్వహించి సీతను తీసికొని వచ్చెదను. అట్లుకాకున్న రావణునితోపాటుగా లంకాపట్టణమునే పెల్లగించి తెచ్చెదను.

16) శ్లో ॥ ప్రాణప్రయాణసమయే యస్య నామ సకృత్స్మరన్ ।

నరస్తీర్త్వా భవాంభోధి మపారం యాతి తత్పదమ్ ॥

17) శ్లో ॥ కిం పునస్తస్య దూతోఽహం తదంగాంగులిముద్రికః ।

తమేవ హృదయే ధ్యాత్వా లంఘయామ్యల్పవారిధిమ్ ॥

భావము : ప్రాణావసానకాలమున ఏ మహితాత్ముని పేరునొకమారు తలంచిన మాత్రముననే మానవులపారమైన సంసారసాగరమునే యవలీలగాదాటి, దానికావలనున్న పరంధామమును (వైకుంఠమును) జేరుచున్నారో –

అట్టి శ్రీరామచంద్రుని సేవకుడను, మరియు నతనివ్రేలి యుంగరమును (రాజముద్రికను) వహించుచు అతనినే నిరంతరము మనసున ధ్యానించుచున్న నాకు ఈ చిన్నిసముద్రమును దాటుట ఎంతపని గనుక ! కాగా, ఆ పురుషోత్తముడైన రామచంద్రప్రభువును ధ్యానించుచు స్వల్పజలములుకల యీ సముద్రముననాయాసముగా దాటెదను.

శ్రీపాదుక : ఈ శ్లోకములధ్యాత్మరామాయణములోని ప్రథమసర్గలోనివి (అ.రా.సుందరకాండ–1/4 & 5)

17) శ్లో ॥ ఏవముక్త్వాతుహనుమాన్వానరోత్తమః ।

భావము : వానర శ్రేష్ఠుడగు హనుమంతుడీ విధముగ జాంబవదంగదాది వానరవీరులతో పలికి –

18) శ్లో ॥ నమో గురుభ్యః స్వీయేభ్యః పరమేభ్యో నమో నమః ।

పరమేష్ఠిగురుభ్యశ్చ మరుతేస్తు నమో నమః ॥

భావము :– ముందుగా హనుమ ఒక సాధకునిగా తన స్వగురువులకు పరమ గురువులకు, పరమేష్ఠిగురువులకు, తండ్రియగు వాయుదేవునకు నమస్కరించెను.

19) శ్లో ॥ నమోఽస్తు రామచంద్రాయ సీతాయై లక్ష్మణాయ చ ।

మాత్రేంజనాయై పిత్రే చ నమః కేసరిణోస్తు మే ॥

భావము :- తరువాత సీతారామలక్ష్మణులకు తల్లియగు అంజనాదేవికి తండ్రియగు వానరవీరుడు కేసరికిని అంజలి ఘటించెను.

20) శ్లో ॥ ఉమాయైచ మహేశాయ గణాధిపతయే నమః ।

ఇత్యుచ్చరన్ నమస్కుర్వన్ ఖే దధావే ఖగేంద్రవత్ ॥

(శ్రీరామ భాగవతం - హనుమత్సందేశ కాండం - 1వ అధ్యాయం)

భావము: 20-అటుపిమ్మట ఉమామహేశ్వరులకు, విఘ్ననివారకాధిదేవతయగు శ్రీమహాగణాధిపతికి ప్రణామములనుచెప్పి నమస్కరించి, గరుత్మంతునివలె అప్రతిహతగమనముతో ఆకాశముపైకెగసి ప్రయాణించెను.

21) శ్లో ॥ ఉత్పపాతాథ వేగేన వేగవానవిచారయన్ ।

సుపర్ణమివ చాత్మానం మేనే సకపికుంజరః ॥

భావము : మహావేగముతో నెగురగల ఆ కపిశ్రేష్ఠుడగు ఆంజనేయుడు తనను గరుత్మంతునిగా సంభావించుకొనినవాడై మహాజవముతో ఆకాశము పైకెగసెను.

శ్రీపాదుక : ఉత్పపాత-పాతంజలయోగ సూత్రము - విభూతిపాదం - సూ. 42 (ఆకాశగమన సిద్ధి)

22) శ్లో ॥ సముత్పతతి తస్మింస్తు వేగాత్తే నగరోహిణః ।

సంహృత్య విటపాన్ సర్వాన్ సముత్పేతుస్సమంతతః ॥

భావము : హనుమంతుడావిధముగా మహావేగముతో పైకెగిసిన వాడు కాగా ఆతని సముత్పతన వేగమునకా మహేంద్రపర్వతముపైనున్న చెట్లన్నియు విరిగిన కొమ్మలుకలవై యాతనితో సమానముగా ఎగిరి యనుసరించుచు అనుగమించినవి.

23) శ్లో ॥ విముక్తాస్తస్య వేగేన ముక్త్వా పుష్పాణి తే ద్రుమాః ।

వ్యవశీర్యంత సలిలే నివృత్తాః సుహృదో యథా ॥

భావము : ఆ విధముగా హనుమ మహావేగముతో ప్రయాణించుటకు ఉద్యమింపగా అతని వేగముననుగమింపజాలని యావృక్షములు అతనిని వీడ్కొల్పుటకు సంప్రదాయానుగుణముగా కొంత దూరమనుగమించు మిత్రుల వలె సాగనంపి, మిత్రులు వియోగదుఃఖముచే కన్నీటిని విడచునట్లుగా పూలను సముద్రజలములలో రాల్చుచు సముద్రజలములో పడినవి.

శ్రీపాదుక : తమ మిత్రుడొక సంక్లిష్టమగు కార్యమును సాధించుటకై బయలు దేరినపుడతని యాత్మీయబంధుమిత్రజనమంతయు **"ఓదకాన్తాత్ స్నిగ్ధోజనోనుగంతవ్యః"** – సన్నిహిత జలాశయము వరకు అతనిని అనుగమించి వీడ్కొలుప వలెనని మన సంప్రదాయము. ఇదే సంప్రదాయమును కాళిదాస మహాకవి తన శాకుంతలనాటకములో శకుంతలనత్తవారింటికి పంపుసమయమున కణ్వుడు మఱియు శకుంతలయొక్క ఆత్మీయ సఖీజనమును పాటించినట్లు వర్ణించియున్నాడు. కాళిదాసుని రచనా శిల్పరామణీయకతకు కవిసార్వభౌమత్వ ప్రసిద్ధికి అతని రామాయణానుసరణమేనని సాహితీ ప్రియంభావుకులందరు ముక్తకంఠముతో తెల్పియున్నారు.

24) శ్లో ॥ తస్య వానర సింహస్య ప్లవమానస్య సాగరమ్ ।

కక్షాంతరగతో వాయుర్జీమూత ఇవ గర్జతి ॥

భావము : ఈ విధముగా మహావేగముతో సముద్రమును లంఘించుచున్న వానరవీరుడగు హనుమంతుని కక్షాంతరగతమైన అనగా బాహుమూలము (చంకల మధ్య) నుండి నిర్గమించుచున్న ప్రభంజనము మేఘగర్జనవలె నినదించెను. ధ్వనించెనని భావము.

శ్లో ॥ వాయుమార్గే నిరాలంబే పక్షవానివ పర్వతః ॥

భావము : అంతరిక్షమున నిరాధారమగు వాయుపథమున పయనించుచున్న యా హనుమంతుడు ఱెక్కలుగల పర్వతమువలె ప్రకాశించెను.

25) శ్లో ॥ యేనాసౌ యాతి బలవాన్ వేగేన కపికుంజరః ।

తేన మార్గేణ సహసా ద్రోణీకృత ఇవార్ణవః ॥

భావము : మహాబలసంపన్నుడగు ఆ వానర దిగ్గజమైన ఆంజనేయుడే దారిని మహావేగముతో సాగుచుండెనో ఆ మార్గమున సముద్రమొక్కసారిగా తొట్టివలె కుచించి చూపట్టుచుండెను.

26) శ్లో ॥ తస్యాంబరగతౌ బాహూ దదృశాతే ప్రసారితౌ ।

పర్వతాగ్రాద్వినిష్క్రాంతౌ పంచాస్యావివ పన్నగౌ ॥

భావము : హనుమ ఆకాశమును తాకుతున్నట్లుగా రెండుబాహువులను నిటారుగా సాచాడు. అవి పర్వతశిఖరమునుండి బయటకువస్తున్న రెండు అయిదుపడగలపాములవలె కనబడినవి.

27) శ్లో ॥ అతిక్రామన్మహావేగ స్తరంగాన్గణయన్నివ ॥

భావము : మహావేగంతో హనుమ ముందుకు సాగిపోతూ ఎదురుగా పైకి లేచుచున్న కెరటాలను లెక్కపెడుతున్నాడా! అన్నట్లు కనిపించాడు.

28) శ్లో ॥ దశయోజన విస్తీర్ణా త్రింశద్యోజన మాయతా ।

ఛాయా వానరసింహస్య జలే చారుతరాఽభవత్ ॥

భావము : అప్పుడా వానరవీరుడైన ఆంజనేయుని నీడ పదియోజనముల వెడల్పు, ముప్పదియోజనముల పొడవు కలుగునట్లుగా సముద్రజలములపై అందముగా ప్రతిబింబించుచుండెను.

శ్రీపాదుక : ఈ శ్లోకములో హనుమంతుని నీడ ముప్పది యోజనముల పొడవు, పదియోజనముల వెడల్పుగానున్నట్లు వర్ణింపబడినది. (పరిమాణము రాబోవు మైనాక, సురసా సంవాదములకు సరిపోదు).

ఛాయా వానర సింహస్య - అను చోట ప్రయోగించబడిన ఈ ఛాయాశబ్దము నీడను సూచిస్తుందిగాని ప్రతిబింబము అనే అర్థంలో ప్రయోగింపబడదు. నీడ సూర్యునిదిశనుబట్టి ఉదయ సాయం సమయములను బట్టి మారుతూ ఉంటుంది. ఉదయ సమయంలో నీడ నిడివిగా నుండి క్రమంగా తగ్గుతూ, మధ్యాహ్న సమయంలో అతి తక్కువగా ఉంటుంది. అలాగే సాయం కాలానికి క్రమంగా పెరుగుతూ ఉంటుంది. ఇదే విషయాన్ని భర్తృహరి దుర్జనసజ్జన సహవాస పరిణామాలకుదాహరణంగా బోధిస్తాడు.

ఆరంభగుర్వీ క్షయిణీ క్రమేణ-లఘ్వీ పురా వృద్ధిముపైతి పశ్చాత్

దినస్య పూర్వార్ధపరార్ధభిన్నా-ఛాయేవ మైత్రీ ఖలసజ్జనానామ్ ॥

పగటిపూట ఉదయ సమయంలో నీడ పెద్దదిగానుండి మధ్యాహ్నానికి

క్రమంగా క్షీణిస్తూ ఉంటుంది. దుర్జనమైత్రి ఇలాగే ప్రారంభంలో ప్రగాఢంగానుండి క్రమేపీ తగ్గుతుంది.

సజ్జనమైత్రి అపరాహ్ణపుటెండలోని నీడలా స్వల్పంగా ప్రారంభమై క్రమంగా ప్రగాఢంగా పెరుగుతూ ఉంటుంది.

కాగా, ఇక్కడ వర్ణింపబడిన హనుమ యొక్క ఛాయ ప్రతిబింబం కాదని సాయం సమయములో విస్తరించిన నీడయని అర్థమును గ్రహించాలి.

29) శ్లో ॥ ప్రవిశన్న భ్రజాలాని నిష్పతంశ్చ పునః పునః ।

ప్రచ్ఛన్నశ్చ ప్రకాశశ్చ చంద్రమా ఇవ లక్ష్యతే ।

వవర్షుః పుష్పవర్షాణి దేవగంధర్వదానవాః ॥

భావము : మిక్కిలి వేగముతో ప్రయాణించుచున్న హనుమంతుడు మరలమరల మేఘపంక్తులమధ్య దూరుచు, కనుమరుగై మరుక్షణములోనే బయలుపడుచు, మబ్బుల చాటున అదృశ్యమై, మరలమరల ప్రకాశించుచున్న చంద్రుని వలె కనుపించుచుండెను.

ఆ విధముగా ప్రయాణించుచున్న అతనిపై దేవతలు, గంధర్వులు, దానవులు పూలవానలను కురిపించిరి.

30) శ్లో ॥ తతాప న హి తం సూర్యః ప్లవంతం వానరోత్తమమ్ ।

భావము : రామకార్యార్థమై సముద్రముపై నెగురుచు ప్రయాణించుచున్న అతనిని సూర్యుడు తనతాపముచే బాధింపలేదు.

శ్లో ॥ సిషివే చ తదా వాయూ రామకార్యార్థసిద్ధయే ॥

భావము : హనుమ రామకార్యార్థమై బయలుదేరి ప్రయాణించుచున్నాడు. పైగా తనకు కుమారుడు కూడనైనందున వాయువు అతనికనుకూలముగా వీచి యతనికి సహకరించెను.

శ్రీపాదుక : ఇక్కడ వాయుదేవుని సహకారము హనుమ ప్రయాణమునకు శుభసూచకముగా శకున శాస్త్రప్రవచనము కనిపిస్తుంది.

అగ్రే మధుర వాక్ పక్షీ పార్శ్వే పల్లవితో ద్రుమః ।

అనుకూలో వహన్ వాయుః ప్రయాణే శుభశంసినః ॥

ప్రయాణమునకు బయలుదేరునప్పుడు పక్షులు మధురముగా కూయుట (కోకిల కలకూజితములవంటివి) ఇరుప్రక్కలనున్న మార్గవృక్షములు చిగురించి పుష్పఫలాదులతో ప్రకాశించుట, ప్రయాణమునకు ప్రతికూలముగాకాక, అనుకూలదిశలో నెమ్మదిగా వాయువు వీచుట, శుభసూచకములై కార్యసిద్ధిని తెలియజేస్తాయని శకునశాస్త్రం.

31) శ్లో ॥ తస్మిన్ ప్లవగ శార్దూలే ప్లవమానే హనూమతి ।

ఇక్ష్వాకు కులమానార్థీ చింతయామాస సాగరః ॥

భావము : కపిశ్రేష్ఠుడగు హనుమంతుడు వినువీధిలో నెగురుచు సముద్రమును లంఘించుచుండగా, పూర్వమొకప్పుడు తాను ఇక్ష్వాకువంశీయులగు సగరపుత్రులచే వృద్ధినొందింపబడిన యుపకారమునకు ప్రత్యుపకారమును చేయదలచినవాడై...

32) శ్లో ॥ సాహాయ్యం వానరేన్ద్రస్య కరిష్యామీతి సత్వరః ।

హిరణ్యనాభం మైనాక మువాచ గిరిసత్తమమ్ ॥

భావము : తననాశ్రయించియున్న వాడును, సర్వ పర్వతశ్రేష్ఠుడైనవాడును, స్వర్ణమయుడును అగు మైనాకునితో ఇట్లనెను.

33) శ్లో ॥ త్వ మిహాసుర సంఘానాం పాతాలతలవాసినామ్ ।

పాతాళస్యా ప్రమేయస్య ద్వారమావృత్య తిష్ఠసి ॥

భావము : పర్వతరాజమా ! పాతాళ లోకనివాసులగు రాక్షసబృందములు పాతాళము నుండి బయటకు రాకుండా నిరోధించుటకై నీవు ఆ పాతాళద్వారమును ఆవరించి (మూసి) యున్నావు.

34) శ్లో ॥ తిర్యగూర్ధ్వమధశ్చైవ శక్తి స్తే శైల వర్ధితుమ్ ।

తస్మాత్సంచోదయామి త్వాముత్తిష్ఠ గిరిసత్తమ! ॥

భావము : ఓ పర్వతశ్రేష్ఠా! నీకు అడ్డముగా, క్రిందుగా, ఊర్ధ్వముఖముగా పెరుగగల శక్తి యున్నది. కావున నిన్నీ పనికి ప్రోత్సహించుచున్నాను. లెమ్ము! (ఆ తీరుగా నీవు నీ యాకృతిని పెంచి పైకెగురుమని భావము)

35) శ్లో ॥ సలిలాదూర్ధ్వ ముత్తిష్ఠ తిష్ఠత్వేష కపిస్త్వయి ॥

భావము : నీవు మహాకాయముతో జలముల నుండి పైకెగిసిరమ్మ. రామకార్య నిర్వహణముకై బయలుదేరిన ఈ హనుమంతుడు నీపై నిలచి కొద్దిసేపు విశ్రమించును.

36) శ్లో ॥ హిరణ్యనాభో మైనాకో నిశమ్య లవణాంభసః ।

ఉత్పపాత జలాత్తూర్ణం మహాద్రుమలతాయుతః ॥

భావము : స్వర్ణ శిఖరములతో ప్రకాశించుచున్న మైనాకుడు సముద్రుని మాటలను వినిన వెంటనే, గొప్ప గొప్ప లతాపరివేష్టితములయిన ఫలవృక్షములతో పాటుగా వేగముగా సముద్రజలములనుండి పైకెగసి సిద్ధముగా నిలచెను.

37) శ్లో ॥ తముత్థిత మసంగేన హనుమా నగ్రతస్థితమ్ ।

మధ్యే లవణతోయస్య విఘ్నోయమితి నిశ్చితః॥

38) శ్లో ॥ స తముచ్ఛ్రిత మత్యర్థం మహావేగో మహాకపిః ।

ఉరసా పాతయామాస జీమూతమివ మారుతః ॥

భావము : మహావేగంతో ముందుకు దూసుకుపోతున్న హనుమ తనకెదురుగా సముద్ర మధ్యమున అడ్డముగా లేని నిలచిన మైనాకుని విఘ్నము (ఆటంకపరచు వానిని) గ నిశ్చయించిన వాడై – ఉవ్వెత్తున పైకి లేచి అవరోధముగా నిలచిన ఆ పర్వతమును ప్రభంజనము మేఘము నణచినట్లుగా తన వక్షఃప్రహారముతో నణచివేసెను.

39) శ్లో ॥ ప్రహితం చ తతస్తస్య లాంగూలేన మహాగిరేః ।

శిఖరం సూర్యసంకాశం వ్యశీర్యత సహస్రథా ॥

40) శ్లో ॥ వ్యవసాయం చ తం బుద్ధ్వా స హోవాచ మహాగిరిః ।

మానుషం ధారయన్ రూప మాత్మనశ్శిఖరే స్థితః ॥

41) శ్లో ॥ సాగరేణ సమాదిష్టస్తద్విశ్రామాయ మారుతే ! ।

ఆగచ్ఛామృతకల్పాని జగ్ధ్వా పక్వఫలాని మే ॥

42) శ్లో ॥ విశ్రమ్యాత్ర క్షణం పశ్చాద్గమిష్యసి యథాసుఖమ్ ।

(మారుతే ! హిమవత్పుత్రో మైనాకోఽహం న రాక్షసః)॥

భావము : (39)పిమ్మట ఆంజనేయ స్వామి తన వాలాయుధము (తోక)తో, సూర్యసమతేజస్సుతో ప్రకాశించుచున్న ఆ మైనాకుని స్వర్ణశిఖరమును ఒక్క ప్రహారముతో కొట్టివేయుచు ప్రక్కలుగా తుత్తునియలు గావించెను.

40) అయినను అతని కార్యదీక్షను, నిబద్ధతను బుద్ధిపూర్వకముగా తెలిసిన ఆ పర్వతశ్రేష్ఠుడు ఏమియు కలతచెందనివాడై, తన శిఖరముపై తానుగా మనుష్యరూపమునుదాల్చి, ప్రసన్నమగురీతిలో నిట్లనెను.

శ్రీపాదుక : 'సర్వస్మిన్నాత్మాస్తి' – అని మన వైదికసంప్రదాయము. చెట్టులోను, గుట్టలోను, పుట్టలోను, అంతటా మనము పరతత్త్వమును దర్శిస్తాము. పర్వతములు అచలములే అయినా వానిలో కూడా ఆత్మచైతన్యముంటుంది. ఈ విషయాన్ని మహాకవి కాళిదాసు కుమారసంభవకావ్యంలో హిమవంతుణ్ణి **"దేవతాత్మా హిమాలయః"** అని సూచించి కరచరణాద్యవయవములతో కూడిన ఒక పర్వతరాజుగా చూపిస్తాడు. (ఇది వాల్మీకి ననుసరించి చేసిన వర్ణనమే!)

41, 42) "వాయునందనా ! నేను రాక్షసుడను కాను. పర్వతరాజగు హిమవంతుని కుమారుడను. నా పేరు మైనాకుడు. నేను సముద్రునిచే – 'రామకార్యముపై బయలుదేరిన హనుమంతుడు నీపై క్షణకాలము విశ్రమించి, వెళ్ళును' – అని ఆదేశింపబడితిని. కావున రమ్ము ! ఈ నా శిఖరాగ్రముపైనున్న వృక్షములయొక్క అమృతతుల్యములై బాగుగా పండినపండ్లను భుజించి, యథాసుఖముగా క్షణకాలము విశ్రమించి యథేచ్ఛగా బయలుదేరుము.

43) శ్లో ॥ దుష్కరం కృతవాన్ కర్మ త్వమిదం వానరోత్తమ!।

నిపత్య మమ శృంగేషు విశ్రమస్వ యథాసుఖమ్ ॥

భావము : ఓ వానరోత్తమా ! నీవెవ్వరు చేయజాలని సముద్రోల్లంఘనము చేయుచున్నావు. కావున నా శిఖరములపై కొంతసేపు సుఖముగా సేదతీరుము.

44) శ్లో ॥ కృతేచ ప్రతికర్తవ్య మేష ధర్మ స్సనాతనః ।

పక్షవంతః పురా పుత్ర ! బభూవుః పర్వతోత్తమాః ।

ఛందతః పృథివీం చేరుర్బాధమానా స్సమంతతః ।

చిచ్ఛేద భగవాన్పక్షా న్వజ్రేణైషాం సహస్రశః ॥

45) శ్లో ॥ మారుతేన తదా వత్స ! ప్రక్షిప్తోఽస్మి మహార్ణవే ।

పూజితే త్వయి ధర్మజ్ఞ ! పూజాం ప్రాప్నోతి మారుతః ॥

భావము : పూర్వము (కృతయుగంలో) పర్వతరాజములు ఱెక్కలు కలిగినవై యథేచ్ఛగా ఎగురుచూ భూమిపై బడుచు అందరిని బాధించుచుండెడివి.

ఇది గమనించిన ఇంద్రుడు వజ్రాయుధముచే వేలాదిపర్వతముల పక్షములను ఖండించెను.

కుమారా ! ఆ సమయమున వాయుదేవుడు నన్ను రక్షించి సముద్రమున పడవేసినాడు.

ఉపకారము చేసిన దానికి తప్పక ప్రత్యుపకారము చేయవలెను. ఇది అనూచానముగా వచ్చుచున్న సనాతనధర్మము.

కావున ఓ ధర్మవిదుడా! నిన్ను పూజించినచో ఆ పూజ లేదా సత్కారము వాయుదేవునకే చెందును.

శ్రీపాదుక : 'ఆత్మావై పుత్ర నామాసి' – పుత్రుడు తండ్రి యొక్క ఆత్మస్వరూపుడని శాస్త్ర ప్రవచనము.

46) శ్లో ॥ ఏవ ముక్తః కపిశ్రేష్ఠ స్తన్నగోత్తమ మబ్రవీత్ ।

ప్రీతోఽస్మి కృత మాతిథ్యం మన్యు రేషోపనీయతామ్ ॥

భావము : మైనాకుని పలుకులను వినిన హనుమంతుడతనితో – పర్వతరాజా! నీ ప్రేమాదరములకు నేనెంతయో సంతోషించితిని. నీ ఆతిథ్యమును నేనాందముతో స్వీకరించినట్లే. అన్యథా భావించి నాపై కోపగించవద్దు, క్షమింపుము.

47) శ్లో ॥ త్వరతే కార్యకాలో మే అహశ్చా ప్యతివర్తతే ।

ప్రతిజ్ఞా చ మయా దత్తా న స్థాతవ్య మిహాంతరే ॥

భావము : నా కర్తవ్యము తొందరపెట్టుచున్నది. సమయము మించి

పోవుచున్నది. దివసమతిక్రమించుచున్నది. పొద్దుక్రుంకులోపల నేను గమ్యము చేరుటకై ప్రతిజ్ఞ చేసి యున్నందున మధ్యలో నెచ్చటను నిలువజాలను. మఱియు –

48) శ్లో ॥ గచ్ఛతో రామకార్యార్థం భక్షణం మే కథం భవేత్ ।

ఇత్యుక్త్వా స్పృష్ట శిఖరః కరాగ్రేణ యయౌ కపిః ॥

భావము : రామకార్యముపై ప్రయాణించుచున్న నాకు ఈ విధముగా విందు భోజనాదులను స్వీకరించుట ఎట్లు కుదురును? (కాన పోయివచ్చెదనని పలికి) అతని శిఖరమును ప్రేమతో స్పృశించి హనుమంతుడు ముందుకు సాగిపోయెను.

శ్రీపాదుక : ఈ శ్లోకము అధ్యాత్మ రామాయణములోనిది. ఇది హనుమంతుని కార్యదీక్షను సూచించును.

49) శ్లో ॥ స పర్వతసముద్రాభ్యాం బహుమానాదవేక్షితః ।

భావము : ఆ విధముగా కార్యదీక్షతో ముందుకు సాగిపోవుచున్న ఆంజనేయుడు మైనాకుడు అతనిని హనుమను సత్కరించుటకై పంపిన సముద్రుడును కూడ గొప్పగా తలచుచు తదేకదృష్టితో నతనిని చూచుచుండిరి.

50) శ్లో ॥ తద్ద్వితీయం హనుమతో దృష్ట్వా కర్మ సుదుష్కరమ్ ।

ప్రశశంసు స్సురా స్సర్వే సిద్ధాశ్చ పరమర్షయః ॥

భావము : హనుమంతుని యొక్క ఈ రెండవదైన దుష్కరమైన అనగా అనితరసాధ్యమైన పనిని జూచిన దివ్య,ఋషి, సిద్ధగణముల వారందరు అతనిని బహుధా ప్రశంసించిరి.

శ్రీపాదుక : దుష్కరమైన సముద్రోల్లంఘనమునకుపక్రమించుట హనుమంతుడు చేసిన మొదటిసాహసము. మధ్యలో అయాచితముగా సంప్రాప్తించిన ఆతిథ్యమును సున్నితముగా తిరస్కరించి కార్యదీక్షతో ముందుకు సాగిపోవుట రెండవ అసాధారణ కృత్యముగా గ్రహించాలి.

51) శ్లో ॥ దృష్ట్వా శచీపతిః ప్రాహ మైనాకం తుష్టవా నహమ్ ।

అభయం తే ప్రయచ్ఛామి తిష్ఠ సౌమ్య యథాసుఖమ్ ॥

భావము : ఈ విషయమునంతను గమనించిన శచీపతియగు దేవేంద్రుడు మైనాకునితో – నీవు హనుమనిట్లాదరించినందుకు నేను సంతోషించి అభయము నిచ్చుచున్నాను. నీవికపై స్వేచ్ఛగా, సుఖముగా నుండుము – అని పలికెను.

52) శ్లో ॥ స వై దత్తవర శ్శైలో బభూవావస్థిత స్తదా ॥

భావము : ఆ విధముగా ఇంద్రునిచే అభయ వరప్రదానమును పొందిన మైనాకుడప్పటి నుండి అట్లే నిలచియుండెను. (అనగా మరల హనుమంతుని ప్రత్యాగమనము తిరిగివచ్చు సమయమును నిరీక్షించుచుండెనని భావము.)

శ్రీపాదుక : ఈ విషయము మనకు యుద్ధకాండచివరలో రావణ సంహారానంతరము పుష్పకమునధిరోహించి శ్రీరాముడు అయోధ్యకు తిరిగి వచ్చుచూ సీతమ్మతో –

"హిరణ్యనాభం శైలేంద్రం కాంచనం పశ్య మైథిలి!" – సీతా! అదిగో అటు చూడుము. అతడే హిరణ్యనాభుడను నామాంతరముకల స్వర్ణశిఖరముతో నలరారు మైనాకుడు అను పర్వతశ్రేష్ఠుడు" – అని పలికి మైనాకుని చూపెను.

కావున, హనుమ రామకార్యమును ముగించుకుని మరల తిరిగివచ్చునంత వరకు మైనాకుడట్లే అతని రాకకై నిరీక్షించుచుండెనని తాత్పర్యము. మైనాకుని యొక్క ఆతిథేయత అనగా ఆతిథ్యసత్కారదీక్ష అంతటి మహిమాన్వితమైనదని భావము.

53) శ్లో ॥ తతో దేవాస్సగంధర్వా స్సిద్ధాశ్చ పరమర్షయః ।

తం ప్రయాంతం సముద్వీక్ష్య హ్యాకాశే మారుతాత్మజమ్ ।

అబ్రువన్ సూర్యసంకాశాం సురసాం నాగమాతరమ్॥

భావము : ఇట్లాకాశమార్గమున అతివేగముతో సాగిపోవుచున్న హనుమంతుని దేవ,గంధర్వ, సిద్ధ, ఋషిగణముల వారు ఆశ్చర్యముతో లెస్సగా తలలుపైకెత్తి పరీక్షగా చూచుచు (అతనిని పరీక్షింపదలచినవారై) సూర్యసమతేజస్సుతో ప్రకాశించుచున్న **'సురస'** అను నాగమాతతో ఇట్లు పలికిరి.

54) శ్లో ॥ ఉద్భ్రూభ్రీమ ముఖాంబుజో ఉద్రిశిరసి న్యస్తాగ్రపాదాంగుళిః ।

ప్రత్యాలీఢవికుంచితాయతపదో వ్యావృత్తతుంగత్రికః ।

మూర్ధ్ని భ్రాజిత దీర్ఘవాలవలయో భుగ్నాయితోరఃస్థలః ।

తీవ్రం సంవళితావనిః ప్లవగరాడంభోనిధిం పుప్లవే ॥

భావము : కనుబొమ్మలు పైకెత్తిన బొమముడితో, భయంకరమైన ముఖము కలవాడై, మైనాకుని శిఖరమును పాదాగ్రము నందలి మునివ్రేళ్ళతో తాకుచు రెండవ కాలిని సాచి పైకెత్తి, ఎత్తైన తన శిరోభుజములను వృత్తాకారముగా త్రిప్పుచు, ప్రకాశించుచున్న తన సుదీర్ఘమైన తోకను ఉరః స్థలము మీదుగా శిరసు పైభాగము నుండి భూమి భాగమునకు (క్రిందుగా) చుట్టుచు, కపి రాజసింహుడగు హనుమంతుడు సముద్రమును దాటుచున్నాడు.

శ్రీపాదుక : ఈ శ్లోకము హనుమద్రామాయణములోనిదిగా సూచింపబడినది. ఇందు హనుమంతుని భీకరమైన శరీరసౌష్ఠవము, సముద్రోల్లంఘన పాటవము అభివ్యక్తములైనవిగా గ్రహించాలి.

55) శ్లో ॥ అయం వాతాత్మజః శ్రీమాన్ ప్లవతే సాగరోపరి ।

హనుమాన్నామ తస్య త్వం ముహూర్తం విఘ్నమాచర ।

జ్ఞాత్వా తస్య బలం బుద్ధిం పునరేహి త్వరాన్వితా ॥

భావము : ఈ వాయుపుత్రుడైన హనుమంతుడు సముద్రోల్లంఘనమునకై ఎగురుచునున్నవాడు. అతనికి కొంతసేపు విఘ్నమును అనగా ఆటంకము కలిగించి, అతని బలమును, బుద్ధివైశద్యమును తెలిసికొని శీఘ్రముగా రమ్ము – అని నాగమాతయగు 'సురస'ను ఆదేశించిరి.

56) శ్లో ॥ ఇత్యుక్తా సా యయౌ శీఘ్రం హనూమద్విఘ్న కారణాత్ ॥

57) శ్లో ॥ రాక్షసం రూపమాస్థాయ సుఘోరం పర్వతోపమమ్ ।

ఆవృత్య మార్గం పురతస్థ్సిత్వా వానర మబ్రవీత్ ॥

భావము : వారి మాటలను వినిన 'సురస' సరేనని హనుమంతునికి విఘ్నమును కలిగించుటకై శీఘ్రముగా బయలుదేరి, అతని దారికడ్డముగా పర్వతమువలె భయంకరమగు రాక్షసాకృతిని దాల్చి అతనికి ఎదురుగా నిలచి యా వానర వీరునితో నిట్లు పలికెను.

58) శ్లో ॥ ఏహి మే వదనం శీఘ్రం ప్రవిశస్వ మహామతే ।

తా మాహ హనుమాన్మాతరహం రామస్య శాసనాత్ ॥

59) శ్లో ॥ గచ్ఛామి జానకీం ద్రష్టుం పున రాగమ్య సత్వరః ।

రామాయ కుశలం తస్యాః కథయిత్వా త్వదాననమ్ ॥

60) శ్లో ॥ వివేక్ష్యే దేహి మే మార్గం సురసాయై నమోఽస్తుతే ।

కర్తుమర్హసి రామస్య సాహ్యం విషయవాసిని ॥

భావము : మహాబుద్ధిమంతుడవగు వానర వీరా ! శీఘ్రమే వచ్చి నా నోటిలో ప్రవేశింపుము అని యిట్లు పలికిన ఆమెతో హనుమంతుడు – ఓ సురసా ! నీకు నమస్కారము. నేను శ్రీరామచంద్రుని ఆదేశానుసారము అతని భార్యయగు జానకిని దర్శించుటకై తొందరగా వెళుచున్నాను. నేను శీఘ్రమే పోయి, ఆమెను చూచి, ఆ దేవి యొక్క కుశలవార్తను రామునకు చెప్పి తిరిగివచ్చిన వెంటనే నీ నోటిలో ప్రవేశించెదను. నీవు కూడ రాముని రాజ్యములో నివసించుచున్నావు కావున రామునకు ఈ సహాయమును చేయవలసిన దానవే కదా !

శ్రీపాదుక : బుద్ధిమంతులలో శ్రేష్ఠుడైన హనుమ సురసను **'విషయవాసిని!'** అని సంబోధించినాడు. విషయమనగా దేశము లేదా రాజ్యమని యర్థము. కాగా విషయవాసిని యనగా దేశము లేదా రాజ్యమునందు వసించుచున్న దానవని అర్థము. అనగా నీవు కూడ రామునిరాజ్యములో అనగా అతని ఏలుబడిలోనున్నావు కావున అతని శాసనమును నీవు అనువర్తించుట నీ విధి. ఈ విషయమునే హనుమ 'నాకు సహాయమొనరించి, నీవిధి నిర్వహించుము' అని యామెకు హితమును బోధించెను.

61) శ్లో ॥ ఇత్యుక్త్వా పునరేవాహ సురసా క్షుధితాస్మ్యహమ్ ।

ప్రవిశ్య గచ్ఛ మే వక్త్రం నోచే త్త్వాం భక్షయామ్యహమ్ ॥

భావము : ఇట్లు హనుమంతుడెంతగా హితమును బోధించినను అంగీకరింపక సురస – "నేను ఆకలితోనున్నాను. నీకు నీవుగా వచ్చి నా నోట ప్రవేశింపుము. లేకున్నచో నేనే నిన్నిపుడు (పట్టి) భక్షించెదను అని పలికెను.

62) శ్లో ॥ ఇత్యుక్తో హనుమా నాహ ముఖం శీఘ్రం విదారయ ।

ప్రవిశ్య వదనం తేఽద్య గచ్ఛామి త్వరయాన్వితః ।

ఇత్యుక్త్వా యోజనాయామదేహో భూత్వా పురః స్థితః ॥

భావము : సురసచే ఆవిధముగా పలుకబడినవాడై హనుమంతుడామెతో – అయినచో నీవు తొందరగా నీ నోటిని తెఱువుము. ఇప్పుడే వేగముగా నీ నోటిలో ప్రవేశించి నేను త్వరగా నిష్క్రమించెదనని పలుకుచు యోజనాయామముగా అనగా ఆమడ విస్తీర్ణము (సుమారు రెండున్న మైళ్ళ నిడివి గలదిగా) తన శరీరము పెంచి ఆమెకెదురుగా నిలచెను.

శ్రీపాదుక : యోజనము = 8.05945 కిలోమీటర్లు లేదా యోజనమనగా 2.5 లేదా 4.5 మరియు 9.3 మైళ్ళు అని మైళ్ళలో వేర్వేరు సందర్భాలలో చెప్పబడినది. యోజనమనగా 8 మైళ్ళ దూరమని పలువురి అభిప్రాయం. ఏదియేమైనా బుద్ధిమద్వరిష్ఠుడైన హనుమ, సురస ఊహించని విధంగా హఠాత్తుగా సంకల్పించినదే తడవుగా మహాశరీరమును ధరించినాడని తాత్పర్యము. ఇది యాతని మహామహిమత్వమును తెలియజేయును.

63) శ్లో ॥ దృష్ట్వా హనుమతో రూపం సురసా పంచయోజనమ్ ॥

64) శ్లో ॥ ముఖం చకార హనుమాన్ద్విగుణం రూపం మాదధత్ ।

తతశ్చకార సురసా యోజనానాం చ వింశతిమ్ ॥

భావము : హనుమంతుని మహాకారమును చూచిన సురస తననోటిని అయిదు యోజనములంతగా పెంచెను.

64) అప్పుడే హనుమ రెట్టింపు అనగా పదియోజనముల విస్తీర్ణముకల యాకృతిని ధరించెను. తదనుగుణముగా సురస కూడ ఇరవైయోజనములంత వెడల్పు కలదిగా తన నోటిని తెఱచెను.

65) శ్లో ॥ వక్త్రం తదాహనూమాంస్తు బభూవాంగుష్ఠమాత్రకః ॥

66) శ్లో ॥ ప్రవిశ్య వదనే తస్యాః పున రేత్య పురస్థితః ।

నిమేషాంతర మాత్రేణ జఠరం ప్రాప్య నిర్యయౌ ॥

67) శ్లో ॥ ప్రవిష్టో నిర్గతోఽహం తే వదనం దేవి తే నమః ।

ఏవం వదంతం దృష్ట్వా సా హనూమంత మథాఽబ్రవీత్ ॥

భావము : అప్పుడు హనుమంతుడొక్కసారిగా అంగుష్ఠమాత్రమనగా చిన్న బొటనవ్రేలి పరిమాణముకల దేహమును ధరించి ఒక్కనిముషములో ఆమె నోటిలో ప్రవేశించి, జఠరమును కదిలించి బయటకు వచ్చి –

దేవీ ! (దాక్షాయణీ!) నీ నోటిలో ప్రవేశించి మరల బయటకు వచ్చితిని. నీకు నమస్కారము అని పలుకుచుండగనే ఆ హనుమంతుని చూచి సురస అతనితో నిట్లనెను.

68) శ్లో ॥ గచ్ఛ సాధయ రామస్య కార్యం బుద్ధిమతాంవర!

దేవై స్సంప్రేషితాఽహం తే బలం జిజ్ఞాసుభిః కపే!॥

69) శ్లో ॥ దృష్ట్వా సీతాం పునర్గత్వా రామం ద్రక్ష్యసి గచ్ఛ భో ।

ఇత్యుక్త్వా సా యయౌ దేవలోకం వాయుసుతః పునః ॥

భావము : బుద్ధిమంతులలో శ్రేష్ఠుడవైన ఆంజనేయా! నీయొక్క బుద్ధి, బలములను పరీక్షింపదలచిన, దేవతలచే నేను పంపబడితిని నీవిక వెళ్ళవచ్చును.

69) ఓయీ ! నీవు తప్పక సీతను చూచి, తిరిగి వచ్చి రాముని సందర్శింపగలవు అని యిట్లు పలికి దాక్షాయణి (దక్షపుత్రి)యగు సురస దేవలోకమునకు వెళ్ళిపోయెను. (పిమ్మట) పవనతనయుడగు ఆంజనేయుడు మరల –

70) శ్లో ॥ స సాగర మనాధృష్య మభ్యేత్య వరుణాలయమ్ ।

జగామ వాయుమార్గేణ గరుత్మానివ పక్షిరాట్ ॥

భావము : దాటశక్యము కాని ఆ సముద్రము నుల్లంఘించుచు, వాయు (ఆకాశ) మార్గమున పక్షిరాజగు గరుత్మంతునివలె అతివేగముతో ప్రయాణించెను.

71) శ్లో ॥ కించిద్దూరం గతస్యాస్య ఛాయాం ఛాయాగ్రహోఽగ్రహీత్ ।

సింహికా నామ సా ఘోరా జలమధ్యే స్థితా సదా ॥

72) శ్లో ॥ ఆకాశగామినాం ఛాయామాక్రమ్యాకృష్య భక్షయేత్ ।

విధేర్వరా దవధ్యా సా లంకాపాలనతత్పరా ॥

73) శ్లో ॥ ఛాయాగ్రహ ఇతిఖ్యాతా ఛాయాం జగ్రాహ మారుతేః ।

ఛాయాయాం గృహ్యమాణాయాం చింతయామాస వానరః ॥

భావము : కొద్ది దూరమావిధముగా ప్రయాణించుసరికి అతని నీడను ఛాయా గ్రహము (నీడనుపట్టిలాగు స్వభావము కలది) అను రాక్షసి పట్టి ఆకర్షింప సాగెను. సింహిక అనే పేరుగల ఆ భయంకర రాక్షసి ఎల్లప్పుడును ఆ సముద్ర జలముల నడుమ నివసిస్తూ ఉంటుంది.

72) అది ఆకాశమార్గమున ప్రయాణించు జీవుల నీడనాకర్షించి భక్షిస్తూ ఉంటుంది. బ్రహ్మ యిచ్చిన వరము కారణముగా దానినెవ్వరును చంపలేరు. ఆమె సదా లంకను అప్రమత్తముగానుండి రక్షిస్తూ ఉంటుంది.

73) దానిని అందరు ఛాయాగ్రాహి అని కీర్తిస్తారు. అది వాయుపుత్రుడైన హనుమంతుని పట్టుకొనెను. ఆ విధముగా తన నీడను పట్టుకొని క్రిందకు లాగుచున్న ఆమెను చూచి వానర వీరుడగు హనుమ ఇలా ఆలోచించసాగాడు.

శ్రీపాదుక : సింహిక అనే రాక్షసి విష్ణుపురాణంలో హిరణ్య కశిపుని సోదరిగా కీర్తింపబడినది. ఆమె విప్రచిత్తి అనే వాని భార్య. ఆమెకు శల్యుడు, నభుడు, వాతాపి, ఇల్వలుడు, అంధకుడు, నరకుడు, నముచి అనే కుమారులుండేవారని చెప్పబడినది.

ఈ నరకుడనేవాడు శ్రీకృష్ణునిచేచంపబడిన నరకాసురుడు కాడంటారు. గ్రంథకర్త తమ అథోజ్ఞాపికలో.

74) శ్లో ॥ కపిరాజేన కథితం సత్త్వమద్భుతదర్శనమ్ ।

ఛాయాగ్రాహి మహావీర్యం తదిదం నాత్ర సంశయః ॥

భావము : వానరరాజైన సుగ్రీవుడు మాతో – (దక్షిణ సముద్రమున నీడనుపట్టి లాగు ఛాయాగ్రాహి యను మహాబలశాలి కలదని చెప్పెను. ఆ ఛాయాగ్రాహి ఇదియే. ఈ విషయంలో సంశయమేమాత్రమును లేదు.

75) శ్లో ॥ స దదర్శ తత స్తస్యా వివృతం సుమహన్ముఖమ్ ।

కాయమాత్రం చ మేధావీ మర్మాణి చ మహాకపిః ॥

76) శ్లో ॥ సంక్షిప్య ముహురాత్మానం నిష్పపాత మహాబలః ।

ఆస్యే తస్యా నిమజ్జంతం దదృశుః సిద్ధచారణాః ।

గ్రస్యమాణం యథా చంద్రం పూర్ణం పర్వణి రాహుణా ॥

భావము : (ఈ విధముగా హనుమంతుడామెను సుగ్రీవుడు చెప్పిన సింహికగా తలంచి) ఆమె యొక్క తెఱచియున్న విశాలమైన ముఖమును, ఆమె యొక్క దేహమును నిశితముగా పరిశీలించి చూచెను. మహాబుద్ధిమంతుడగు హనుమంతడామె ఆయుఃస్థానములను లెస్సగా దర్శించి–

76) మరుక్షణములో మహాబలసంపన్నుడగు హనుమ తనశరీరమును అతిసూక్ష్మముగా సంకోచింప చేసుకొని హఠాత్తుగా సింహికాముఖములోనికి ప్రవేశించెను. అపుడా సమయమున సంచరించుచున్న సిద్ధచారణ సమూహములు సింహికాముఖమున ప్రవేశించుచున్న హనుమంతుని పూర్ణిమనాడు రాహువుచే మ్రింగబడుచున్న పూర్ణచంద్రునివలె చూచిరి.

శ్రీపాదుక : పై శ్లోకములో బుద్ధిమద్వరిష్ఠుడైన హనుమ సింహికయొక్క విస్తృతముగా తెఱువబడిన నోటిని చూచినంతనే తన కర్తవ్యమును స్మరించుచు, ఆమె ఆయుఃస్థానములను మరణరహస్యచ్ఛేదనమును నిశ్చయించుకొనినట్లు వర్ణింపబడినది. ఇదే విషయము మన తెలుగునాట బుద్ధిమంతుని కౌశలమును – 'ఆవులిస్తే ప్రేవులు లెక్కపెట్టగలిగిన సామర్థ్యము' అనే ఒక నానుడిగా యేర్పడినదని చెప్పవచ్చును.

అట్లే రెండవ శ్లోకములో గ్రహణ సమయములో పున్నమి చంద్రుడు రాహుముఖమున ప్రవేశించినట్లు హనుమ సింహికాముఖమును ప్రవేశించినట్లు వర్ణింపబడినాడు. గ్రహణానంతరము చంద్రుడు ముక్తుడై మరల ప్రకాశించునట్లు హనుమ కూడ సింహికను హతమార్చి బయటకు వచ్చుననే విషయం ధ్వనింపచేయబడినదని గ్రహించాలి.

77) శ్లో ॥ తతః స స్తాం నఖై స్తీక్ష్ణైర్మర్మాణ్యుత్కృత్య వానరః ।

ఉత్పపాతాథ వేగేన మన స్సంపాతవిక్రమః ॥

78) శ్లో ॥ స్వయంభువేనైవ హనుమాన్ సృష్ట స్తస్యా నిపాతనే ।

హృతహృత్సా హనుమతా పపాత విధురాఽంభసి ॥

భావము :77) పిమ్మట వానరవీరుడైన హనుమ తన వాడిగోళ్ళతో, సింహిక ఆయువుపట్టులను (హృదయమును) చీల్చి, మనస్సంపాత వేగముతో (అనగా ఆమె బాధతో తెరచిన నోటిని మూయు లోపలనే) వెలుపలికి వచ్చి, పైకెగసెను.

78) స్వయంభువైన బ్రహ్మగారే యామెకు (అవధ్యత్వమును వరముగా నిచ్చు సమయమున) హనుమంతుని యామెను వధించుటకై సృష్టించెను. ఈ విధముగా హనుమంతునిచే గుండెపిండి చీల్చబడిన సింహిక స్పృహను కోల్పోయినదై నీటిపై తేలెను.

శ్రీపాదుక : ఈ సింహికా వృత్తాంతము అగస్త్య రామాయణములో విశేషముగా వర్ణింపబడినట్లు తెలుపబడినది.

79) శ్లో ॥ జగామాకాశ మావిశ్య పన్నగాశనవ త్కపిః ।

ప్రాప్తభూయిష్ఠపారస్తు సర్వతః ప్రవిలోకయన్ ॥

80) శ్లో ॥ యోజనానాం శతస్యాంతే వనరాజిం దదర్శ సః ।

తతశ్శరీరం సంక్షిప్య తన్మహీధరసన్నిభమ్ ॥

81) శ్లో ॥ పునః ప్రకృతి మాపేదే వీతమోహ ఇవాత్మవాన్ ॥

భావము : వానర శ్రేష్ఠుడైన ఆ హనుమంతుడు ఆకాశమార్గములో గరుత్మంతునివలె అతి వేగముతో ప్రయాణించి సముద్రమునకావలి యొడ్డును చేరి అంతటను కలయజూచుచున్న వాడై నూఱామడల కావలివైపున పెద్ద వనపంక్తిని చూచెను.

80) తరువాత పర్వతాకారమును పోలిన తన శరీరమును తగ్గించుకుని అజ్ఞాన మోహమును విడనాడిన ఆత్మజ్ఞుని వలె తన స్వభావసిద్ధమగు పూర్వ రూపమును ధరించెను.

అనాదిగా వచ్చుచున్న అజ్ఞానముకూడ అగాధము అపారమునైన సముద్రమువలె సులభముగా దాటశక్యము కానిది. అట్టి అజ్ఞానమును సాధనచే ఆత్మజ్ఞాని తరించినట్లే హనుమ తన బలపరాక్రమముతో శతయోజనవిస్తీర్ణమైన సముద్రమును దాటెనని భావము.

82) శ్లో ॥ తతస్తు సంప్రాప్త సముద్రతీరం

సమీక్ష్య లంకాం గిరివర్యమూర్ధ్ని ।

కపిస్తు తస్మిన్నిపపాత పర్వతే

విధూయ రూపం వ్యధయన్ మృగద్విజాన్ ॥

భావము : ఈ విధముగా నపారమగు పారావారమును దాటి సముద్రతీరమును చేరి, అచట సువేలాద్రిశిఖరముపైనున్న లంకను చూచి, ఆ లంకాపర్వతముపైదిగి, తనశరీరమును ఒక్కసారిగా విదలించగా అచటి పక్షిజంతుజాలములన్నియు మిక్కిలి వ్యధ చెందెను. అనగా భయపడినవని భావము.

ఇది శ్రీమద్రామాయణ సారోద్ధారాంతర్గత

సుందరకాండమున మొదటి సర్గము.

సర్గాంతశ్లోకసంఖ్య-82

ద్వితీయ సర్గ

1) శ్లో ॥ సూర్యే చాస్తంగతే రాత్రౌ దేహం సంక్షిప్య మారుతిః ।

పృషదంశక మాత్రస్సన్ బభూవాద్భుతదర్శనః ।

యోగైశ్వర్య బలేనైవ యోగీశవరవల్లభః ॥

భావము : పవన తనయుడును, యోగీశ్వరేశ్వరుడును అగు హనుమంతుడు సూర్యుడస్తమించగనే, తన దేహమును పిల్లివంటి చిన్నదిగా చేసికొని, అత్యంతాశ్చర్యకరుడుగా ప్రకాశించెను.

శ్రీపాదుక : ఇక్కడ హనుమ యోగీశ్వరేశ్వరుడుగా వర్ణింపబడిన ప్రసంగము పులస్త్య రామాయణములోనిది. యోగీశ్వరుడైనవాడు తన యోగదృష్టితో అతీతానగతములను దర్శింపగలడు. యోగబలములో అసాధ్యమునైనను సాధించగలడని యోగశాస్త్రము.

కావుననే భక్తులా యోగీశ్వరేశ్వరుని కార్యసిద్ధికై

"అసాధ్య సాధకః స్వామిన్న సాధ్యం తవ కిం వద ।

రామదూత ! కృపాసింధో ! మత్కార్యం సాధయ ప్రభో!" అని వేడుకుంటారు.

హనుమ రాత్రి ఎలుకలను వేటాడి చంపు స్వభావముకల పిల్లితో పోల్చబడినాడు. పిల్లి రాత్రులందుకూడ స్పష్టముగా చూడగలదు. అట్లే నిశ్శబ్దముగా (అడుగుల చప్పుడు కూడ వినబడకుండగా) సంచరించగలదు. హనుమ ఆ విధముగా లంకలో సంచరింపదలచినాడని భావము.

2) శ్లో ॥ యోజనానాం శతం శ్రీమాం స్తీర్త్వా ప్యుత్తమవిక్రమః ।

అనిశ్వసన్కపిస్తత్ర న గ్లాని మధిగచ్ఛతి ॥

భావము : శతయోజన విస్తీర్ణమగు సముద్రాన్ని దాటినా కూడ అతివీర్య పరాక్రమశాలియగు హనుమ ఆయాసముతో నిట్టూర్చలేదు అలసటను కూడ చెందలేదు.

3) శ్లో ॥ ప్రదోషకాలే హనుమాం స్తూర్ణ ముత్ప్లుత్య వీర్యవాన్ ।
ప్రవివేశ పురీం రమ్యాం సువిభక్తమహాపథామ్ ।

4) శ్లో ॥ సప్తభౌమాష్టభౌమైశ్చ స దదర్శ మహాపురీమ్ ॥

భావము : రాత్రి ప్రవేశించుచున్న ప్రదోషకాలంలో వానరవీరుడగు ఆంజనేయుడు, కుప్పిగంతులతో సహజ సంచారముతో (నిర్భయముగా) విశాలముగా తీర్చిదిద్దబడిన రాజవీధులు కలదియు, ఏడెనిమిది అంతస్తులలో గల మహాసౌధములు కల లంకాపురిని దర్శింపసాగెను.

5) శ్లో ॥ చంద్రోపి సాచివ్య మివాస్య కుర్వన్
తారాగణై ర్మధ్యగతో విరాజన్ ।
జ్యోత్స్నావితానేన వితత్య లోక-
ముత్తిష్ఠతే నైక సహస్ర రశ్మిః ॥

భావము : చంద్రుడు కూడ సహాయము చేయుచున్నవాని వలె నక్షత్రముల నడుమ ప్రకాశించుచు, తన సహస్రకిరణజాల ప్రసారముచే (వెన్నెలను విరియజేయుచూ) ప్రకాశింపజొచ్చెను.

6) శ్లో ॥ శంఖ ప్రభం క్షీరమృణాళవర్ణమ్ ।
ఉద్గచ్ఛమానం వ్యవభాసమానమ్ ।
దదర్శ చంద్రం స హరిప్రవీరః
పోప్లూయమానం సరసీవ హంసమ్ ॥

భావము : వానరవీరుడగు ఆంజనేయుడు శంఖముయొక్క కాంతిని పోలి, పాలు మఱియు తామరతూండ్ల వలె తెల్లగా ప్రకాశించుచున్న ఆ చంద్రుని, సరస్సు నుండి పై కెగిరి ఒక చోటు నుండి వేఱొక చోటికి ఎగురుచు తేలియాడు హంసవలె భావించుచూ దర్శించెను.

7) శ్లో ॥ తతో దదర్శ నగరం త్రికూటాచలమూర్ధని ।
ప్రాకారైర్బహుభిర్యుక్తం పరిఖాభిశ్చ సర్వతః ॥

భావము : పిమ్మట హనుమంతుడు త్రికూటపర్వతశిఖరమున నున్న లంకా

నగరాన్ని చూశాడు. దానికి చుట్టూ చాలా ప్రాకారాలున్నాయి. ఆ ప్రాకారాలచుట్టూ విశాలములైన అగడ్తలు అంటే కందకాలున్నాయి.

శ్రీపాదుక : ఈ శ్లోకం ఆధ్యాత్మరామాయణములోనిది.

8) శ్లో ॥ ప్రప్రాకారజఘనాం విపులాంబునవాంబరామ్ ।
శతఘ్నీశూలకేశాంతా మట్టాలకవతంసకామ్ ।
మనసేవకృతాం లంకాం నిర్మితాం విశ్వకర్మణా ॥

భావము : చుట్టువారియున్న ప్రాకారములనే పిరుదులుగా, వాని చుట్టును విస్తరించియున్న సాగరజలములనే వినూత్నవస్త్రముగా, శతఘ్నులు (నూఱుగుండ్ల ఫిరంగులు) శూలములు మున్నగు ఆయుధములే శిరోజ కుంతలములుగా, కోటబురుజులే చెవికమ్మలుగా అలంకార పుష్పాలుగా, ధరించి, విశ్వకర్మచే మనసా సృష్టింపబడిన అందమైన సుందరిలా హనుమ ఆ లంకా నగరాన్ని చూచాడు.

9) శ్లో ॥ ద్వారముత్తర మాసాద్య చింతయామాస వానరః ।
తస్యాశ్చ మహతీం గుప్తిం శూలపట్టసపాణిభిః ॥
రావణం చ రిపుం ఘోరం సాగరం చ నిరీక్ష్య సః ॥

భావము : (ఆ విధంగా అందమైన ఆ లంకా నగరాన్ని చూస్తూ) హనుమ ఉత్తర ద్వారాన్ని చేరుకుని, దాని యొక్క శూలములు పట్టిసముల వంటి ఆయుధములను ధరించిన రాక్షసవీరులచే కావలికాయబడుచున్న గొప్ప భయంకరమైన రక్షణవ్యవస్థను, రావణుని యొక్క అరివీరభయంకరత్వమును, చుట్టునూ విస్తరించియున్న భయావహమైన సముద్రమును చూసి మనసులో ఇట్లాలోచింపసాగెను.

10) శ్లో ॥ ఆగత్యాపీచ హరయో భవిష్యంతి నిరర్థకాః ।
నహి యుద్ధేన వై లంకా శక్యా జేతుం సురైరపి ॥

భావము : వానరులీ లంకకు రాలేరు. వచ్చినను ఇచ్చట వారేమియు చేయలేరు. వారి ప్రయత్నము వ్యర్థమే అగును. ఏలన-యీ లంకాపట్టణము దేవతలకు కూడ యుద్ధముచేసి గెలువ శక్యముకానిది.

11) శ్లో ॥ ఇమాం తు విషమాం దుర్గాం లంకాం రావణపాలితామ్ ।

ప్రాప్యాపి స మహాబాహుః కిం కరిష్యతి రాఘవః ॥

భావము : సంక్లిష్టములైన గుప్తద్వారములు కలిగినదై రావణునిచే పరిపాలింపబడుచున్న ఈ లంక చొరశక్యము కానిది. ఒకచో నెట్లైనను ప్రవేశించినను మహాభుజపరాక్రమసంపన్నుడగు రామచంద్రుడిక్కడ ఏమి చేయగలడు? ఏ విధముగను యుద్ధము చేయజాలడని భావము.

12) శ్లో ॥ వంచనీయా మయా సర్వే జానకీం పరిమార్గతా ।

కేనోపాయేన పశ్యేయం మైథిలీం జనకాత్మజామ్ ॥

భావము : జానకిని నేను వెతకవలెనన్న ఇచ్చటి వారిని (రాక్షసులను) వంచింపవలెను. నేను యే ఉపాయముచే మిథిలాధీశుడగు జనకుని కుమార్తెయగు సీతను దర్శింపగలను గనుక !

13) శ్లో ॥ నహి శక్యం క్వచి త్స్థాతు మవిజ్ఞాతేన రాక్షసైః ।

అపి రాక్షసరూపేణ కిముతాన్యేన కేనచిత్ ?

14) శ్లో ॥ వాయురప్యత్ర న జ్ఞాతశ్చరే దితి మతిర్మమ ॥

భావము : రాక్షసులకు తెలియకుండా నేనెక్కడను ఉండుటకు వీలులేదు. సాధ్యపడదని భావము. రాక్షస రూపములోనుందునా! అయినను వారు నన్ను గుర్తించెదరు. ఏలన వారి కంటపండకుండ, వారికి తెలియకుండా వాయువే కాదు వేరెవ్వరును సంచరింపజాలరు.

శ్రీపాదుక : వాయువుకు ఆకారము లేదు కావున అతనినెవ్వరును చూడజాలరు. అట్టి గాలినికూడ వారు గుర్తింపగలరనని హనుమంతుని తలంపు.

15) శ్లో ॥ ఇతి చింతాపరో భూత్వా రామం ధ్యాత్వా హృదంబుజే ।

సౌమిత్రిం జానకీం చైవ సమాధిస్థోఽభవత్తదా ॥

భావము : హనుమంతుడీ విధముగా నాలోచించుచు హృదయ కమలమునందు శ్రీసీతారామలక్ష్మణులను ధ్యానించుచు సమాధినిష్ఠుడయ్యెను.

16) శ్లో ॥ సమీక్ష్య తు మహాబాహూ రాఘవస్య పరాక్రమమ్ ।

లక్ష్మణస్య చ విక్రాంత మభవ త్ప్రీతిమా న్కపిః ॥

భావము : ఆ సమాధిస్థితిలో నతడు శ్రీరామచంద్రమూర్తి యొక్క అమేయ పరాక్రమమును, లక్ష్మణునియొక్క సర్వాతిశాయి విక్రమమును దర్శించినవాడై మిక్కిలి సంతోషించెను.

శ్రీపాదుక : ఈ రెండు (15 & 16) శ్లోకములను శివరామాయణములోనివిగా చెప్పబడినది. చివర హనుమ కేవల 'కపి' శబ్దముచే చెప్పబడినాడు. ఇది అతని హృదయములో ఆ సమయములో నతనికి కలిగిన చిత్తచాంచల్యమును సూచించును.

17) శ్లో ॥ వస్వౌకసారాప్రతిమాం తాం వీక్ష్య నగరీం తతః ।

ఆసాద్య సహసా హృష్టః ప్రాకార మభిపేయివాన్ ॥

భావము : పిమ్మట హనుమంతుడు వస్వౌకసారమనే పేరు గల దేవేంద్రుని అమరావతీ పట్టణమును పోలిన (సుందరమైన) ఆ లంకా నగరమును చూచి, సంతోషించి తొందరగా నగర ప్రాకారమును చేరెను.

శ్రీపాదుక : వస్వౌకసారమని ఇంద్రపురియైన అమరావతికి పేరు. ఇంద్రుని పురము – వస్వౌకసారము తూర్పున కలదు. యమపురి – సంయమనీ నగరము. దక్షిణముగా నుండును వరుణుని నగరము – సుఖాపురము పడమర దిశలో నుండును. అట్లే ఉత్తరమున విభావరి యుండునని –

"వస్వౌకసారా శక్రస్య యామ్యాం సంయమనీ తథా ।

పురీసుఖా జలేశస్య సోమస్య చ విభావరీ ॥"

అని విష్ణుపురాణములో చెప్పబడినది.

18) శ్లో ॥ గ్రామం వా నగరం వాపి పత్తనం వా పరస్య హి ।

విశేషాత్సమయే దౌత్యే న ద్వారేణ వివేశయేత్ ॥

19) శ్లో ॥ స్మృత్వాఽద్వార ప్రదేశే తు హనుమాన్గంతు ముద్యతః ॥

భావము : శత్రువు యొక్క పట్టణమును లేదా గ్రామంలోకి ప్రవేశింపవలసి వచ్చినప్పుడు, విశేషంగా రాయబారం జరిపే దూతగా ప్రవేశించేటప్పుడు,

ముఖద్వారం గుండా ప్రవేశింపరాదు. పెడదారిపట్టి మాత్రమే ప్రవేశింపవలెను. అనెడి సూక్తిని స్మరించి, హనుమంతుడు ద్వారదేశమువద్ద గల ప్రదేశమున (గోడను దాటి) లోనికి ప్రవేశించుటకు ప్రయత్నించెను.

శ్రీపాదుక : ఈ శ్లోకము భారద్వాజ రామాయణములోనిదిగా చెప్పబడినది.

20) శ్లో ॥ అథ సా హరిశార్దూలం ప్రవిశంతం మహాబలమ్ ।
నగరీ స్వేన రూపేణ దదర్శ పవనాత్మజమ్ ॥

భావము : ఆ విధముగా ప్రవేశించుచున్న మహాబలశాలియగు మారుతిని, లంకాపురాధిదేవత తన నిజరూపముతో ప్రత్యక్షమై చూచెను.

21) శ్లో ॥ సా తం హరివరం దృష్ట్వా లంకా రావణపాలితా ।
స్వయమేవోత్థితా తత్ర వికృతాననదర్శనా ॥

భావము : ఈ విధముగా రావణునిచే పాలింపబడుచున్న ఆ లంకాపురాధి దేవత, లంకను అద్వారములో ప్రవేశించుచున్న హనుమంతునిచూచి, భయంకరముగా తన ముఖకవళికలను ప్రదర్శించుచు, తనకు తానుగా లేచి నిలచెను.

22) శ్లో ॥ పురస్తా త్కపివర్యస్య వాయుసూనో రతిష్ఠత ।
ముంచమానా మహానాద మబ్రవీ త్పవనాత్మజమ్ ॥

భావము : ఆమె వాయుపుత్రుని మార్గమునకడ్డముగా నిలచి, పెద్దపెట్టున గర్జించి, హనుమంతునితో నిట్లు పలికెను.

23) శ్లో ॥ కస్త్వం ? కేన కార్యేణ ఇహ ప్రాప్తో వనాలయమ్ ?
కథయస్వేహ యత్తత్త్వం యావ త్ప్రాణా ధరన్తి తే ॥

భావము : 'వనవాసివగు వానరా ! నీ వెవడవు? ఇక్కడికి ఏ పనిపై వచ్చితివి? మరుక్షణములో నీ ప్రాణములుపోకపూర్వమే నాకు యథార్థమును తెలియజెప్పుము అని పలికెను.

24) శ్లో ॥ అథ తా మబ్రవీ ద్వీరో హనుమా నగ్రత స్థితామ్ ।
కథయిష్యామి తే తత్త్వం యన్మాం త్వం పరిపృచ్ఛసి ।
కా త్వం విరూపనయనా పురద్వారేఽవతిష్ఠసి ॥

భావము : అందులకు సమాధానముగా వీరుడగు హనుమంతుడు ఎదురుగానున్న ఆమెతో నిర్భయముగా నా సంగతిని యథార్థముగా నీకు చెప్పెదను కాని, ముందుగా వికృతమైన పెద్ద కండ్లు కల ముఖముతో లంకాపుర ద్వారమున కావలిగాయుచున్న నీవెవ్వరవని ప్రశ్నించెను.

లంకా :

25) శ్లో ॥ అహం హి నగరీ లంకా స్వయమేవ ప్లవంగమ ।
సర్వతః పరిరక్షామి హ్యేతత్తే కథితం మయా ॥

భావము : హనుమంతుని ప్రశ్నకు సమాధానముగా ఆ లంకాదేవి – కుప్పిగంతులు వేయు వానరా ! నేనీ లంకాపురమునురక్షించు లంకాధిదేవతను. ఇదీ నా విషయమును నీకు చెప్పితిని.

శ్రీపాదుక : ఇచ్చట లంక హనుమను ప్లవంగమ ! అని సంబోధించినది. నీ కుప్పిగంతులు నావద్ద సాగవుసుమా! అనే హెచ్చరిక ఈ సంబోధనలో ధ్వనిస్తుంది.

హనుమాన్ :

26) శ్లో ॥ ద్రక్ష్యామి నగరీం లంకాం సాట్టప్రాకారతోరణామ్ ।
దృష్ట్వా పురీమిమాం భద్రే ! పున ర్యాస్యే యథాగతమ్ ॥

భావము : అప్పుడు హనుమంతుడామెతో – ప్రాకార, తోరణద్వారములతో ప్రకాశించుచున్న ఈ లంకాపురమును నేను చూచెదను. ఈ పట్టణమును సందర్శించి లంకామతల్లీ ! నా దారిని నేను వచ్చిన రీతిగనే మరలిపోయెదను– అని పలికెను.

లంకా :

27) శ్లో ॥ మా మనిర్జిత్య దుర్బుద్ధే ! రాక్షసేశ్వరపాలితామ్ ।
న శక్య మద్య తే ద్రష్టుం పురీయం వానరాధమ ॥

28) శ్లో ॥ తతః కృత్వా మహానాదం సా వై లంకా భయావహమ్ ।
తలేన వానర శ్రేష్ఠం తాడయామాస వేగితా ॥

భావము : అప్పుడా లంకాదేవి - హనుమంతునితో - ఓరీ ! దుర్మతీ ! వానరాధమా ! నన్ను జయింపకుండా నీవీ రావణపాలితమగు లంకా పట్టణమును దర్శింపలేవు.

అని పలికి భయంకరముగా పెద్ద పెడబొబ్బపెట్టి, వెనువెంటనే ఆ వానరశ్రేష్ఠుని, తన అరచేతితో పెద్దగా చరచెను.

శ్రీపాదుక : ఈ శ్లోకమధ్యాత్మరామాయణము ప్రథమసర్గలోనిదిగా చెప్పబడినది.

29) శ్లో ॥ తతః సంవర్తయామాస వామహస్తస్య సోంగులీః ।

ముష్టినాఽభిజఘానైనాం హనుమాన్ క్రోధమూర్ఛితః ॥

30) శ్లో ॥ స్త్రీ చేతి మన్యమానేన నాతిక్రోధ స్స్వయంకృతః ॥

భావము : ఆమె దెబ్బకు హనుమంతుడు మిక్కిలి కోపపరవశుడై, తన యెడమ చేతివ్రేళ్ళను లోనికి బిగియపట్టి ఆమెను పిడికిలితో గట్టిగా పొడిచెను.

చంపవలెనన్నంత కోపము కలిగినను సమయజ్ఞుడగు హనుమ ఆమెను (స్త్రీ) (అబల) యని దయతలచి ఆమెపై క్రోధమునంతగా ప్రదర్శింపలేదు.

31) శ్లో ॥ సా తు తేన ప్రహారేణ విహ్వలాంగీ నిశాచరీ ।

పపాత సహసా భూమౌ వికృతాననదర్శనా ॥

భావము : ఆ పిడికిలిపోటుచే సర్వావయవములు కలత చెందిన శరీరముకల ఆ రాక్షసి భయంకరముగా నోటిని, కన్నులను తెరచి ఒక్కసారిగా నేల కొరిగెను. క్రింద పడిపోయెనని భావము.

32) శ్లో ॥ తతో వై భృశసంవిగ్నా లంకా సా గద్గదాక్షరమ్ ।

ఉవాచాగర్వితం వాక్యం హనుమంతం ప్లవంగమమ్ ॥

భావము : అప్పుడాలంక మిక్కిలి విధేయురాలై గద్గదస్వరముతో తడబడుచున్న మాటలతో ప్లవంగముడగు హనుమంతునితో నిట్లు పలికెను.

శ్రీపాదుక : ఈ శ్లోకములో భృశసంవిగ్నా, ప్లవంగమ అనే పదములు సాభిప్రాయములు. కుప్పిగంతులు వేయుచు చరించువాడని, అతని కుప్పిగంతులు తన వద్ద సాగవని అవహేళనము చేసిన ఆమెకు ఆ వానర

వీరుని పరాక్రమము అనుభవ పూర్వకముగా తెలిసినది. స్త్రీ యని తలంచి తనను చంపక విడిచినాడని గ్రహించుటచే ఆమె యొక్క మదగర్వములుడిగి పోయినవి. కావుననే **భృశసంవిగ్నా** – అనగా మిక్కిలి భయభక్తులు కలదైనదని భావము.

33) శ్లో ॥ స్వయంభువా పురాదత్తం వరదానం యథా మమ ।
ఇదం తు తథ్యం శ్రుణు వై బ్రువంత్యా మే హరీశ్వర ॥

భావము : ఓ వానరేశ్వరా ! నేను చెప్పబోవు ఈ సత్యము మరియు నిశ్చితమైన మాటలను వినుము. పూర్వము నాకు బ్రహ్మదేవుడనుగ్రహించిన వరదానమును యథాతథముగా చెప్పుచున్నాను.

34) శ్లో ॥ త్రేతాయుగే దాశరథీ రామో నారాయణోఽవ్యయః ।
జనిష్యతే యోగమాయా సీతా జనకవేశ్మని ॥

35) శ్లో ॥ భూభారహరణార్థాయ ప్రార్థితోఽయం మయా క్వచిత్ ।
సభార్యో రాఘవో భ్రాత్రా గమిష్యతి మహావనమ్ ॥

36) శ్లో ॥ తత్ర సీతాం మహామాయాం రావణోఽపహరిష్యతి ।
సుగ్రీవో జానకీం ద్రష్టుం వానరాన్ప్రేషయిష్యతి ॥

37) శ్లో ॥ తత్రైకో వానరో రాత్రా వాగమిష్యతి తేఽన్తికమ్ ।
యథా త్వాం వానరః కశ్చి ద్విక్రమాద్వశమానయేత్ ।
తదా త్వయా హి విజ్ఞేయం రక్షసాం భయమాగతమ్ ॥

38) శ్లో ॥ ధన్యాహ మప్యద్య చిరాయ రాఘవ–
స్మృతి ర్మమాసీద్భవబంధమోచనీ ।
తద్భక్తసంగో ప్యతి దుర్లభో మమ
ప్రసీదతాం దాశరథి స్సదా హృది॥

39) శ్లో ॥ సహిమే సమయ స్సౌమ్య ! ప్రాప్తోఽద్య తవ దర్శనాత్ ॥

భావము : త్రేతాయుగంలో శ్రీమన్నారాయణ మూర్తి దశరథపుత్రుడగు శ్రీరామచంద్రమూర్తిగాను, అతని మాయాశక్తి మిథిలానగరంలో జనకుని ఇంటిలో సీతగాను, భూమికి కేవలం భారమును కలిగించే దుష్టులు రాక్షసులను సంహరించడం కోసం, మాచే ప్రార్థింపబడినవాడై జన్మిస్తారు.

(తన ప్రణాళిక ప్రకారముగా) అతడు తమ్ముడైన లక్ష్మణునితోను, సీతమ్మతోను కూడ దండక అనే మహారణ్యమునకు వెళ్ళును.

అక్కడ మహామాయాస్వరూపిణియైన సీతను రావణుడు అపహరిస్తాడు.

సుగ్రీవుడు సీతను వెదకుటకై వానరులను పంపిస్తాడు. వారిలో నొక వానరవీరుడు రాత్రిసమయంలో నీ వద్దకు వచ్చును.

ఎప్పుడా వానరుడు తన పరాక్రమంతో నిన్ను జయించి వశపరచుకుంటాడో అప్పుడు రాక్షసులకు ముప్పు (భయము) వాటిల్లునని తెలిసికొనుము, అని బ్రహ్మగారు నాకు చెప్పియున్నారు.

ఆహా ! చాలా కాలము గడచిన తరువాత ఇప్పటికి సంసార బంధములను తొలగించు శ్రీరాముని స్మరణము నాకు కలిగినది. శ్రీరామ భక్తుడవైన నీ యొక్క మిక్కిలి దుర్లభమైన సాంగత్యము కూడ నాకు లభించినది. నేటికి నేను ధన్యురాలనైతిని. సదా శ్రీరామచంద్రమూర్తి నా హృదయము నందు ప్రసన్నుడై ప్రకాశించుగాక.

సౌమ్యుడా ! చంద్రునివలె చూడముచ్చట గొలుపు హనుమా ! బ్రహ్మగారు నాకు తెలిపిన ఆ సమయము ఇప్పుడు సంప్రాప్తించినదని నీ సందర్శనమువలన తెలిసినది.

40) శ్లో ॥ ప్రవిశ్య శాపోపహతాం హరీశ్వర
శ్శుభాం పురీం రాక్షసముఖ్యపాలితామ్ ।
యదృచ్ఛయా త్వం జనకాత్మజాం సతీమ్
విమార్గ సర్వత్ర గతో యథాసుఖమ్ ॥

భావము : వానరోత్తమా ! శుభప్రదమైన యీ లంకాపురి రాక్షసరాజగు రావణునిచే పరిపాలింపబడుచున్నను, (పూర్వము నందీశ్వరాదులచే) శాపోపహతమైనది. కావున మీకు మున్ముందు శుభంకరము కాగలదు. నీవికపై యథేచ్ఛగా ఈ లంకాపురిని ప్రవేశించి, సర్వత్ర సంచరించుచు పతివ్రతాలలామయగు సీతను సుఖముగా అన్వేషింపుము.

41) శ్లో ॥ నిర్జితాహం త్వయా వీర ! ఇత్యుక్త్వా సా నిశాచరీ ।
విహ్వాలా వికృతాకారా పపాత సమరక్షితౌ ॥

భావము : ఓ వానరవీరుడా ! నిశ్చయముగా నీవు నన్ను జయించితివని పలికి ఆ లంకారాక్షసి భయంకరమైన వికృతాకారము కలిగినదై భయవిహ్వాలయై, ఆ యుద్ధభూమిపైనే అనగా హనుమంతుని ముష్టిఘాతము పొందిన చోటనే నేలకూలి మరణించెను.

శ్రీపాదుక : ఈ లంకారాక్షసీ వృత్తాంతమున సారోద్ధార కర్తలు ఆధ్యాత్మ రామాయణ, దేవీభాగవతప్రసక్త రామకథా ప్రసంగములనుదాహరిస్తూ.. చక్కని వ్యాఖ్యానమును ప్రతిపాదించినారు.

"సహీత్యాది శ్లోక పర్యాలోచన యా లంకేశ్వరీ స్వయం హనుమంతం జ్ఞాత్వా లంకా ప్రవేశం కర్తుం అనుజ్ఞాం దత్తవతీతి విజ్ఞాయతే । తదేవ స్పష్టం ప్రతిపాదితం ప్రాచీన దేవీభాగవతే" – అనేది వారి ప్రవచనము.

"సహిమే సమయస్సౌమ్య ! – ఇత్యాది శ్లోకార్థసమాలోచనముచే లంకేశ్వరి హనుమంతుని రామదూతగా గుర్తించి, లంకాపుర ప్రవేశమునకనుమతించినదని తెలుస్తుంది. దీని కుపపాదకముగా వారు ప్రాచీన దేవీభాగవతంలోని 36వ అధ్యాయములో నారదునకు శివునిచే చెప్పబడిన రావణుని వృత్తాంతాన్నిలా వివరిస్తారు.

ఒకప్పుడు రావణుడు జగజ్జననిని సంప్రార్థించి, ఆమె అనుగ్రహముచే ముల్లోకాలను జయించాడు. అప్పుడు త్రిమూర్తులైన బ్రహ్మవిష్ణురుద్రులామె సన్నిధి నాశ్రయించారు. వారి ఆవేదనను గమనించిన మహాదేవి విష్ణువుతో – 'మధుసూదనా ! నేను రావణునిచే చిరకాలమునుండి పూజింపబడి అతనిననుగ్రహించడం కోసమని లంకలో నివసించుచున్నాను.

ఇప్పుడా రావణుడు తన బలమదముచే తన వినాశమును తానే స్వయముగా గొనిదెచ్చుకొనిన వాడై చరాచర విశ్వమునంతను బలవంతముగా బాధించుచున్నాడు. వాడునన్ననన్య భక్తితో సేవించుచున్నందున నేను వానిని చంపజాలకున్నాను. నీవు మనుష్యుడుగా భూలోకంలో అవతరిస్తే నా అంశతో లక్ష్మి సీతగాను, రుద్రుడు హనుమంతుని గాను జన్మిస్తారు. నేను కూడ తగు సమయములో నిశ్చయముగా లంకాపురిని విడిచిపెడతాను అని చెప్పెను.

తరువాత అదే దేవీభాగవతంలో 38వ అధ్యాయంలో రావణుడు నా ప్రతిరూపమై లక్ష్మ్యంశతోనవతరించిన సీతాదేవిని బలాత్కారముగా అపహరించెను. ఆ మహాశక్తి అప్పుడే అతనిని భస్మము చేయగలదు కాని భక్త వాత్సల్యముచే నామె ఆ పనిని చేయలేదు. అతడామెను అశోకవనములో నుంచెను. సీతాప్రవేశసమనంతరమే లంకేశ్వరి లంకను వీడుటకు సంకల్పించెను - అని చెప్పబడినది.

కావున లంకేశ్వరి ఇచ్ఛాపూర్వకముగానే హనుమను లంకా ప్రవేశమునకు అనుమతించినదని గ్రహించాలి.

42) శ్లో ॥ విహ్వాలాం భగినీం దృష్ట్వా బ్రహ్మలోకాన్నిశాచరీ ।
విషూచీ లోకసంహర్త్రీ కర్కటీ ఘోరరూపిణీ ।
ఆగత్య హనుమన్నికట మువాచేదం మహాస్వనా ॥

భావము : ఆ విధముగా హనుమంతుని ప్రహారముచే నేలకొరగిన లంకేశ్వరిని చూచి, బ్రహ్మలోకమునుండి విషూచీరూపిణియైన (వైరస్ రూపంతో ముల్లోకములను సంహరింపగల శక్తి కల) **'కర్కటి'** అనే రాక్షసి హనుమంతుని వద్దకువచ్చి పెద్దగా అరచుచు అతనితో నిట్లనెను.

43) శ్లో ॥ యద్బ్రహ్మవరదత్తాహ మతివిక్రమశాలినీ ।
తస్మా దహం హనిష్యామి క్షణేన త్వాం సమీరజ! ॥

44) శ్లో ॥ తాం జ్ఞాత్వా లోకసంహర్త్రీం తద్ధస్తాద్వక్రదండకమ్ ।
గృహీత్వా తాడయామాస సాపి తత్ర పపాత హ ॥

భావము : ఓ వాయు పుత్రా ! నేను బ్రహ్మ దత్తములైన వరబలముచే అత్యంత పరాక్రమము కలదానను. నిన్నిప్పుడే వధించెదను అని పలుకుచున్న ఆమెను చూచి హనుమంతుడు -

44) ఆమెను లోకకంటకురాలు కావున చంపదగినదని నిశ్చయించి, ఆమె చేతిలోనున్న వంకరకఱ్ఱ (వక్రదండము)ను లాగికొని దానితో నామెను చావమోదెను. ఆ దెబ్బకు ఆమె యచ్చటనే పడిపోయెను.

45) శ్లో ॥ తస్మిన్ క్షణే సమాయాతః బ్రహ్మోవాచ హరీశ్వరమ్ ।
సప్తవింశతి నామాని లోకేఽ తీవ పఠంతి యే ॥

46) శ్లో ॥ విషూచి వ్యాధయ స్తేషాం న భవన్తి కదాచన ।
సుందరం హనుమన్మంత్ర మిదమేవ హరీశ్వర! ॥

47) శ్లో ॥ ఇత్యుక్త్వా తన్మహామంత్ర మవద త్తత్ర పద్మజః ।
ఇత్యుక్త్వా తాం సమాదాయ యయౌ లోకపితామహః ॥

భావము : ఆ క్షణముననే బ్రహ్మదేవుడచటికి వచ్చి హనుమంతునితో – వానరోత్తముడనైన ఆంజనేయా ! నీ యొక్క సప్తవింశతి నామముల **సుందర హనుమన్మాలా మహామంత్రమును** పఠించువారికి విషూచివ్యాధులు (కరోనా వైరస్‌ల వంటివి) ఎప్పుడునూ సంభవింపవు. అని పలికి –

47) ఆ కర్కటిని తనతో తీసికొని తన సత్యలోకమునకు వెళ్ళిపోయెను.

ఇతి శ్రీరామాయణసారోద్ధారే సుందరకాండే ద్వితీయస్సర్గః.

శ్రీపాదుక : ఈ **కర్కటీవృత్తాంతము** వాల్మీకి రామాయణములోనికి కాదు. లోక కల్యాణమునకై శ్రీ శాస్త్రులవారు పరాశరసంహితలోనుపదేశింప బడిన సుందర హనుమన్మహామంత్రమునుపదేశించి దీనిని ప్రస్తావించారు.

ఇటీవల సంభవించిన కరోనా మహామారీమహోత్పాతములో యీ సారోద్ధార, పరాశర సంహితా, యోగవాసిష్ఠాది గ్రంథముల నెఱింగిన కొందరు దీనినుపాసించి ఆయాపద నుండి తరించినారు. ఉమాసంహితలో కూడ దీని ప్రస్తావన కలదు. దానినిచ్చట యథాతథముగా పరిచయము చేయుట యుక్తముగా భావించి, యథామతి సంస్కరించి పొందుపరచుచున్నాను.

శ్రీ సుందర హనుమన్మాలా మహామంత్రము

అస్య శ్రీ సుందర హనుమన్నామమాలా మహామంత్రస్య వాల్మీకీ ఋషిః। అనుష్టుప్ఛందః । ఆంజనేయో దేవతా । మారుత్మాజ ఇతి బీజమ్ । అంజనాసూనురితి శక్తిః । వాయుపుత్ర ఇతి కీలకమ్ ॥

మమ హనుమదనుగ్రహ సిద్ధ్యర్థే తద్వారా సర్వవ్యాధి నివారణార్థే చ జపేవినియోగః ॥

హ్రౌ మిత్యాది కరాంగుళ్యంగన్యాసః

ధ్యానమ్

బాలార్కా యుత తేజసం త్రిభువన ప్రక్షోభకం సుందరమ్ ।
సుగ్రీవాది సమస్త వానరగణై స్సంసేవ్య పాదాంబుజమ్ ।
నాదేనైవ సమస్తరాక్షసగణా న్సంత్రాసయంతం ప్రభుమ్ ।
శ్రీమద్రామ పదాంబుజస్మృతిరతం ధ్యాయామి వాతాత్మజమ్ ।
ఏవం ధ్యాత్వా జపేదార్తో మారుతేర్మనురాదరాత్ ॥

శ్రీ సుందర హనుమన్మాలా మహామంత్రము

హనుమానంజనాసూను ర్వాయుపుత్రో మహాబలః ।
కపీంద్రః పింగళాక్షశ్చ లంకాద్వీపభయంకరః ॥
ప్రభంజనసుతో వీర స్సీతాశోకవినాశకః ।
వాగీశతారకశ్చైవ మైనాకగిరిభంజనః ॥
అక్షహంతా రామసఖో రామకార్యధురంధరః ।
మహౌషధి గిరేర్హారీ వానరప్రాణదాయకః ॥
నిరంజనో జితక్రోధో కదలీవనసంవృతః ।
ఊర్ధ్వరేతా మహాసత్త్వ స్సర్వమంత్రప్రవర్తకః ॥
మహాలింగప్రతిష్ఠాతా బాష్పకృజ్జపతాం వరః ।
శివధ్యానపరో నిత్యం శివపూజాపరాయణః ॥
సప్తవింశతి సంఖ్యాకా న్యేతాని శ్రీహనూమతః ।
'తతో రావణ నీతాయా స్సీతాయాశ్శత్రుకర్శన' –
ఇత్యారభ్య – 'అభిషిక్త మయోధ్యాయాం క్షిప్రం
ద్రక్ష్యసి రాఘవమ్' – ఇత్యంతం ప్రతిపాదితాని ।
(యః పఠేద్భక్తి మాన్నిత్యం ఆయురారోగ్య భాగ్భవేత్ ॥)

భావము : ఈ సుందర హనుమన్మాలామహామంత్రానికి ఋషి వాల్మీకి. ఛందస్సు – అనుష్టుభ్ అనునది. ఆంజనేయస్వామి దేవత. 'మారుతాత్మజు' డనునది బీజము. 'అంజనాసూనుః' – అనునది శక్తి. 'వాయుపుత్రః' అనేది కీలకమ్.

హనుమదనుగ్రహముద్వారా సర్వవ్యాధినివారణార్థమై జపించుచున్నాననేది సంకల్పము.

హ్రామిత్యాది బీజాక్షరములతో కరావయవన్యాసముల అనంతరం.

'బాలార్కాయుత తేజసం ... మనురాదరాత్' అని ధ్యానం చేయాలి.

పదివేలమంది బాలభానుల తేజస్సుతో ప్రకాశించువాడును, ముల్లోకములను మర్దింపగల శక్తికలవాడును, సుందరుడు లేదా సుందరపురాధ్యక్షుడును, సుగ్రీవాదులగు సమస్త వానరవీరులచే సేవింపబడుచున్న పాదపద్మములు కలవాడును, తన గర్జనమాత్రముచేతనే రాక్షసబృందములన్నింటిని భయపెట్టువాడును, సదా శ్రీరామపదపద్మములను ధ్యానించువాడును, వాయుపుత్రుడునగు శ్రీ హనుమత్ప్రభువును ధ్యానించుచున్నాను. అనుఈ భావనతో యథాశక్తిగా ఈ సప్తవింశతి నామాన్వితమైన మాలామహామంత్రాన్ని యథాశక్తిగా(9/11/27 పర్యాయములు) ఆర్తితో జపించాలి.

మంత్రోపనిబద్ధములైన సప్తవింశతి హనుమన్నామ మంత్రములు.

1) హనుమతే నమః 2)అంజనాసూనవే నమః

3) వాయుపుత్రాయ నమః 4)మహాబలాయ నమః

5) కపీంద్రాయ నమః 6)పింగళాక్షాయ నమః

7) లంకాద్వీపభయంకరాయ నమః

8) ప్రభంజనసుతాయ నమః

9) వీరాయ నమః 10)సీతాశోకవినాశకాయ నమః

11) వాగీశతారకాయ నమః 12)మైనాకగిరిభంజనాయ నమః

13) అక్షహంత్రే నమః 14) రామసఖాయ నమః

15) **రామకార్యదురంధరాయనమః16)మహౌషధిగిరిహారిణే నమః**

17) **లక్ష్మణప్రాణదాత్రే నమః 18)నిరంజనాయ నమః**

19) **జితక్రోధాయ నమః** **20)కదళీవనసంవృతాయ నమః**

21) **ఊర్ధ్వరేతసే నమః** **22)** **మహాసత్త్వాయ నమః**

23)సర్వమంత్రప్రవర్తకాయనమః24)మహాలింగప్రతిష్ఠాత్రే నమః

25)బాష్పకృజ్జపతాంవరాయ నమః

26)నిత్యశివధ్యాన పరాయణాయ నమః

27)శివపూజాపరాయణాయ నమః

ఈ 27 హనున్నామములు ప్రధానముగా – **"తతో రావణ నీతాయాః"** – అని ప్రారంభించబడిన శుభప్రదమగు సుందరకాండలో హనుమంతుని కీర్తించినవి. **"సుందరే సుందరో కపిః"** అను ప్రసిద్ధిని బట్టి సుందరాకాండ కథానాయకుడగు హనుమ **'సుందరుడు'** గా కీర్తింపబడినాడు. ఈ నామ మంత్రములు అతనిని కీర్తించుచున్నందున **సుందరహనుమన్నామ మంత్రములు**గా భక్తజనులచే జపింపబడుచున్నవని గ్రహించాలి.

ఈ సందర్భములో రచయిత ప్రతిపాదించిన హనుమంతుని నిత్యనివాస స్థానములు కూడ ధ్యానింపదగినవి. ఇవి పరాశరసంహితలోని 37వ పటలములో –

కుండినం నామ నగరం శ్రీ భద్రం కుశతర్పణమ్

పంపాతీరం చంద్రకోణం కాంభోజం గంధమాదనమ్

బ్రహ్మావర్తపురం చైవ నైమిశారణ్యమేవ చ

సుందరం నగరం చైవ రమ్యం శ్రీ హనుమత్పురమ్–అని కీర్తింపబడినవి.

ఏతాని వాయుపుత్రస్య పుణ్యస్థానాని నిత్యశః ।

యః స్మరేత్ప్రాతరుత్థాయ భుక్తిముక్తీ చ విందతి ।

సాయంకాలే పఠేన్నిత్యం చోర భూతాదికాన్ జయేత్ ॥

భావము : *కుండిన నగరము, శ్రీభద్రపురము, కుశ తర్పణము, పంపాతీరము, చంద్రకోణము, కాంభోజము, గంధమానము (మలయ పర్వతము) బ్రహ్మావర్త పురము, నైమిశారణ్యము, రమ్యమైన సుందర నగరము* – అను **దశ పురములు** హనుమంతుని నిత్యనివాసస్థానములు.

ప్రతిరోజు ప్రాతః కాలమున నెవ్వరీ పుణ్యస్థలములను స్మరించెదరో వారు భుక్తిముక్తులను అనగా భోగమోక్షములను పొందెదరు.

నిత్యము సాయంసమయమున వీనిని స్మరించి పఠించువారికి చోరభయము గాని, భూతభేతాళరాక్షసులవలనైన భయము కాని కలుగదని చెప్పబడినది.

సుందరపురము హనుమంతుని నిత్యనివాసముగా చెప్పబడినందున హనుమకు **సుందరుడు మఱియు సుందరాపురాధ్యక్షుడను** నామము లేర్పడెనని గ్రహించాలి.

ఇది శ్రీమద్రాయణ సారోద్ధారములోని

సుందరకాండమున రెండవ సర్గము

సర్గాంతశ్లోకసంఖ్య–(82+47=129)

తృతీయ సర్గ

1) శ్లో ॥ స నిర్జిత్య పురీం శ్రేష్ఠాం లంకాం తాం కామరూపిణీమ్ ।
విక్రమేణ మహాతేజా హనుమాన్ కపిసత్తమః ॥

2) శ్లో ॥ అద్వారేణ మహాబాహుః ప్రాకార మభిపుప్లువే ।
నిశి లంకాం మహాసత్త్వో వివేశ కపికుంజరః ॥

భావము : వానర శ్రేష్ఠుడును, మహాతేజస్వియు, అగు హనుమంతుడు కామరూపిణి యగు లంకేశ్వరిని జయించి పరాక్రమముతో రాత్రివేళ అద్వారములో అనగా ద్వారము గుండా ప్రవేశింపక గోడదాటి రాత్రివేళ ప్రవేశించెను.

3) శ్లో ॥ ప్రవిశ్య నగరీం లంకాం కపిరాజహితంకరః ।
చక్రేథ పాదం సవ్యం చ శత్రూణాం స తు మూర్ధని ॥

భావము : వానరాజగు సుగ్రీవునకు సదా శ్రేయస్సును కలిగించువాడగు హనుమంతుడు లంకానగరాన్ని ప్రవేశించి, 'శత్రుపురమును ప్రవేశించునప్పుడు ముందుగా ఎడమపాదమునుంచి ప్రవేశింపవలె' నను శాస్త్రవిధి ననుసరించి ముందుగా ఎడమ పాదమునుంచగా, అది శత్రుశిరముపై నుంచబడినట్లుండెను.

4) శ్లో ॥ హనుమాన్ప్రయయౌ లంకాం సీతాన్వేషణహేతవే ।
రామాదధీతసందేశో యయౌ రుద్రకళోద్భవః ॥

భావము : రుద్రాంశ సంభూతుడగు హనుమంతుడు శ్రీరామ సందేశమును గ్రహించినవాడై సీతాన్వేషణము కొరకు లంకాపురములోనికి ప్రవేశించెను.

శ్రీపాదుక : ఈ శ్లోకము బ్రహ్మవైవర్త పురాణములోని శ్రీకృష్ణజన్మఖండములోని 62వ అధ్యాయములోనిదని సూచింపబడినది.

5) శ్లో ॥ పాదగ్రాహీం మహాసత్త్వాం లంకారక్షణతత్పరామ్ ।
క్రౌంచాం హత్వా సింహికావ ల్లంకాం రాత్రౌ వివేశ సః ॥

భావము : లంకను ప్రవేశించుచున్న యతనిని లంకాసంరక్షణ తత్పరురాలైన మహాబలసంపన్నురాలగు 'క్రౌంచ' అనే రాక్షసి పాదమును పట్టి లాగుచుండగా దానిని 'సింహిక'ను చంపినట్లుగా వధించి రాత్రిపూట లంకలో ప్రవేశించెను.

శ్రీపాదుక : ఈ శ్లోకము శివరామాయణములోనిదని చెప్పబడినది.

6) శ్లో ॥ తతో జగామ హనుమాన్లంకాం పరమశోభనామ్ ।
రాత్రౌ సూక్ష్మతనుర్భూత్వా బభ్రామ పరితః పురీమ్ ॥

భావము : అటు పిమ్మట నా హనుమంతుడు రాత్రివేళ అతి సుందరముగా ప్రకాశించుచున్న లంకాపురిలో సూక్ష్మరూపమును ధరించినవాడై, అంతను పరిశీలించి చూచుచున్నవాడై పరిభ్రమించెను. (కలియదిరిగెను)

7) శ్లో ॥ హసితోత్కృష్టనినదై స్తూర్యఘోషపురస్సరైః ।
వజ్రాంకుశనికాశైశ్చ వజ్రజాలవిభూషితైః ॥

8) శ్లో ॥ సితాభ్ర సదృశై శ్చిత్రైః పద్మస్వస్తిక సంస్థితైః ।
వర్ధమానగృహైశ్చాపి సర్వత స్సువిభూషితా ।
ప్రజజ్వాల తదా లంకా రక్షోగణగృహోత్తమైః ॥

భావము : అప్పుడా లంకాపురము వికటాట్టహాస మహాధ్వనులచేతను, నిరంతరము మ్రోగుచున్న తూర్యవాద్య నినాదములచేతను, వజ్రాంకుశ ప్రభలచేతను, వజ్రపంక్తులచే నలంకరింపబడినవియు, తెల్లని మేఘములను పోలినవియు, చిత్రవిచిత్రములైన పద్మము, స్వస్తికము, వర్ధమానము అను సంస్థాన విశేషములచే నిర్మింపబడిన రాక్షససమూహముల ఉత్తమగృహములు (రమ్య హర్మ్యముల)తో కన్నులు మిరుమిట్లు గొల్పుచు దేదీప్యమానముగా ప్రజ్వరిల్లుచుండెను.

శ్రీపాదుక : పద్మస్వస్తిక వర్ధమానములనునని గృహసముదాయ నిర్మాణ ప్రకార విశేషములుగా–

చతుశ్శాలా చతుర్ద్వారా సర్వతోభద్ర సంజ్ఞితా ।
పశ్చిమ ద్వార రహితా మధ్యావర్తా హయాననా ।

దక్షిణద్వారరహితా వర్ధమానా ధనప్రదా ।

ప్రాగ్ద్వారరమితా స్వస్తికాఖ్యా పుత్రధనప్రదా ॥

వరాహమిహిరసంహితలో చెప్పబడినవి.

నాలుగుమూలలు తీర్చిదిద్దబడినది స్వస్తికము.

చతుశ్శాలలలో, ప్రవేశద్వారములతో పశ్చిమద్వారము లేకుండా, మధ్యలో ఆవర్తము(సుడి) కలిగి గుఱ్ఱపుముఖమువలెనున్న నిర్మితి సర్వతోభద్రమనబడును.

అదే తూర్పు ద్వారరమితమైనచో స్వస్తికమను పేరుతో సత్సంతానసంపదలను కలుగజేయునని సూచింపబడి, విస్తారముగా లక్షణనిర్దేశము కూడ వరాహమిహిరసంహితలో చెప్పబడినది.

9) శ్లో ॥ భవనాద్భవనం గచ్ఛన్దదర్శ పవనాత్మజః ।

వివిధాకృతి రూపాణి భవనాని తతస్తతః ।

10) శ్లో ॥ శుశ్రావ మధురం గీతం త్రిస్థానస్వరభూషితమ్ ।

శుశ్రావ జపతాం తత్ర మంత్రాన్ రక్షోగృహేషు వై ॥

భావము : పవనతనయుడగు ఆంజనేయుడు ఒక యింటినుండి వేఱొక యింటిని దాటుచు, అటనట వివిధములైన ఆకృతుల నిర్మాణముతో శోభిల్లు భవనములను సందర్శించుచున్నవాడై ముందుకుసాగుచూ ఉరః, కంఠ, శిరస్థానములందు మంద్రమధ్యతార స్వరములలో (వీనులవిందుగా పురకాంతలచే గానము చేయబడుచున్న) మధురగీతములను, అట్లే మరి కొందరిండ్లలో సిద్ధరాక్షసులచే జపింపబడుచున్న మంత్రోచ్చారణములను కూడ వినెను.

11) శ్లో ॥ స్వాధ్యాయనిరతాంశ్చైవ యాతుధానాన్ దదర్శ సః ।

రావణస్తవ సంయుక్తాన్ గర్జతో రాక్షసానపి ॥

12) శ్లో ॥ దీక్షితాన్ జటిలాన్ ముండాన్ గోఽజినాంబర వాససః ।

దర్భముష్టి ప్రహరణా నగ్నికుండాయుధాం స్తదా ॥

13) శ్లో ॥ దదర్శ రాక్షసాం స్తత్ర వేదఘోష సమన్వితాన్ ।

అగ్నిహోత్రాశ్చ వేదాశ్చ రాక్షసానాం గృహేగృహే ॥

భావము : హనుమంతుడచట నిరంతర వేదపారాయణరతులైన రాక్షసులను, రావణుని ప్రశంసించుచు స్తోత్రము చేయుయు, బిగ్గరగా గర్జించుచున్న రాక్షసులను చూచెను.

12) మరియు యజ్ఞదీక్షనుగొని, జటాధారులైనవారిని, ముండిత శిరస్కులను (బోడిగుండు కల వారిని అనగా సన్న్యాసులని భావము) వృషభ చర్మములను ధరించినవారిని, అనిష్టనివారణమునకై అభిమంత్రించిన దర్భలను పిడికిలి బట్టిన వారిని, శత్రుమారణహోమముల నిర్వహణకై అగ్నికుండములను ఆయుధముగా స్వీకరించిన వారిని, తదర్థమై వేదమంత్రములను ఉచ్చైస్స్వరముతో పఠించుచున్న రాక్షసులను చూచెను. రాక్షసులందరి యిండ్లలోను అగ్నిహోత్రములు, వేదపాఠము నిరంతరముగా జరుగుచుండెను.

శ్రీపాదుక : దర్భలను చేతిలో పిడికిలి బట్టి అభిమంత్రిత జలములతో ప్రోక్షించి దర్భాగ్రములతో జలసేచనము నీళ్ళుచల్లినచో భూతప్రేతాద్యరిష్టములు నివారింపబడును. దర్భాగ్రములనుండి జాలువారిన అభిమంత్రిత జల బిందువులు భూతప్రేతాదుల ఉచ్చాటనమునకు, ఆదివ్యాధుల నివారణమునకు కూడా వజ్రాయుధము వలె పనిచేయునని –

"యథా వజ్రం హరేః పాణౌ తథా విప్రకరే కుశాః" – ఇంద్రుని చేత నున్న వజ్రాయుధమువలె బ్రాహ్మణుని చేతిలోనున్న దర్భముష్టి (పిడికిలి బట్టిన దర్భల సముదాయము) దర్భకట్ట / అనిష్టనివారణము గావించునని–

"అనిష్ట నివారకానుష్ఠానసాధనతయా దర్భముష్టీనామాయుధత్వమ్" – అని చెప్పబడినది.

14) శ్లో ॥ దయా సత్యం చ శౌచం చ రాక్షసానాం న విద్యతే ।
భక్షన్తి మదవస్తూని సురాం పీత్వా చ రాక్షసాః ॥

భావము : అయినను వారిలో దయాగుణము, సత్యపరాయణత్వము, శౌచము రాక్షసులలో లేదు. వారు సదా మద్యమునుసేవిస్తూ మాదకములైన మాంసాదులను మిక్కుటముగా మెక్కుచుందురు.

15) శ్లో ॥ దదర్శ మధ్యమే గుల్మే రావణస్య చరాన్ బహూన్ ।
ధన్వినః ఖడ్గినశ్చైవ శతఘ్నీ ముసలాయుధాన్ ॥

16) శ్లో ॥ పరిఘోత్తమహస్తాంశ్చ విచిత్రకవచోజ్జ్వలాన్ ।

నాతిస్థూలాన్నాతికృశాన్నాతిదీర్ఘాతిహ్రస్వకాన్ ॥

17) శ్లో ॥ ధ్వజీన్ పతాకినశ్చైవ దదర్శ వివిధాయుధాన్ ॥

భావము : క్రమముగా ఆ హనుమంతుడు పురమధ్యభాగములో రావణుని యొుక్క చాలామంది సైనికులను ధానుష్కులను, ఖడ్గహస్తులను, ముసలాయుధములను ధరించిన వారిని, ఫిరంగులను ప్రయోగించుటకు సిద్ధముగానున్న వారిని, ఉత్తమములైన పరిఘలనబడు లోహదండములను చేతబట్టియున్న వారిని, చిత్రవిచిత్రవర్ణములతో ప్రకాశించు వివిధములైన కవచములను ధరించినవారిని, అతిస్థూలకాయులుగాగాని, అత్యంత నీరసించి, కృశించిన వారుగా కాకుండా, అట్లే అత్యంత పొడగరులుగా గాని, మరుగుజ్జులుగాగాని కాకుండా, స్వస్థులై సమసౌష్ఠవాకృతితో ధ్వజ పతాకాదులను ధరించినవారును, బహువిధాయుధపాణులునైన వారిని హనుమంతుడు చూచెను.

చంద్రోదయ వర్ణనము

18) శ్లో ॥ తత స్స మధ్యంగత మంశుమంతమ్

జ్యోత్స్నావితానం మహదుద్వమన్తమ్।

దదర్శ ధీమాన్ దివి భానుమంతమ్

గోష్ఠే వృషం మత్తమివ భ్రమన్తమ్ ॥

భావము : లంకాపుర వైభవమును తన్మయుడై పరిశీలించుచున్న హనుమ "ఎంత పొద్దుపోయెనో" యని తలను పైకెత్తి – ఆకాశపు నడుమ, నలుదిక్కులకు తన చంద్రికా వితానమును వెదజల్లుచున్నవాడై (పిండారబోసినట్లు) వెన్నెలను ఆకాశము నందతటను పరచుచున్నవాడై గోశాలయందు ఠీవిగాగోవుల నడుమ తిరుగాడు మహోవృషభమువలె ఆకాశమధ్యమున చుక్కలనడుమ సంచరించుచున్న చంద్రుని చూచెను.

శ్రీపాదుక : ఈ చంద్రోదయవర్ణనము హనుమంతుడు లంకాపుర మధ్యమును ప్రవేశించుసరికి రాత్రి మొదటిజాము గడిచినదను సమయమును

తెలియజేయును. కావుననే అచడచటి జనులజీవనమును నిశితముగా పరిశీలింపగలుగుచున్నాడని భావము.

19) శ్లో ॥ స్థితః కకుద్మానివ తీక్ష్ణశృంగః
మహాచలశ్శ్వేత ఇవోచ్చ శృంగః ।
హస్తీవ జాంబూనదబద్ధ శృంగః
రరాజ చంద్రః పరిపూర్ణ శృంగః ॥

భావము : ఆ చంద్రుడు వాడికొమ్ములు మఱియు పెద్దమూపుతో నున్న యాబోతు వలె, ఎత్తైన శిఖరములుకల మహాపర్వతమువలె, బంగారు పొన్నులు తొడుగబడిన దంతావళము (ఏనుగు) వలె, కళాపూర్ణుడై ప్రకాశించెను.

శ్రీపాదుక : ఇక్కడ చంద్రుడాకాశ మధ్యమున పరిపూర్ణకళామండల శోభితుడుగా ప్రకాశించినట్లు వర్ణింపబడినాడు. తొలిజాము దాటుచుండగా చంద్రుడాకాశ మధ్యమున ఫాల్గుణశుద్ధద్వాదశినాడు సంభవించునుకాన హనుమ ఫాల్గుణశుద్ధద్వాదశినాడు మొదటిజామున హనుమంతుడు లంకను ప్రవేశించినాడని చెప్పనొప్పును.

పరిపూర్ణశృంగః అనగా సమగ్రకళానవేతుడై అనునది లాక్షణికార్థముగా మాత్రమే గ్రహించవలెను. లేకున్నచో పూర్ణిమనాడు అను అర్థము చెప్పుకొనవలసివచ్చును.

20) శ్లో ॥ మత్తః ప్రమత్తాని సమాకులాని ।
వీరశ్రియా చాపి సమాకులాని ।
రథాశ్వభద్రాసనసంకులాని ।
దదర్శ ధీమాన్ స కపిః కులాని ॥

భావము : బుద్ధిమంతుడగు ఆ హనుమంతుడచ్చట, మద్యమాంసాదులను మెక్కి మదించియున్న వారును, జయశ్రీసంయుతులైన రాక్షసవీరుల సమూహములతో క్రిక్కిరిసియున్న రథములు, అశ్వములు, సింహాసనములతో కిటకిటలాడుచున్న రాక్షసభవనములను చూచెను.

21) శ్లో ॥ గృహాద్గృహం రాక్షసానా ముద్యానాని చ వానరః ।
వీక్షమాణో హ్యసంత్రస్తః ప్రాసాదాంశ్చ చచార హ ॥

భావము : ఇట్లా హనుమంతుడు రాక్షసభవనములనొక దానినుండి వేఱొక దానిని దాటుచు, అటనున్న సుందరోద్యానవనములను, మహాసౌధములను నిర్భయముగా పరిశీలించుచు సంచరించెను.

22) శ్లో ॥ దురుచ్ఛ్వాసం గాఢనిద్ర మున్మత్తం పర్వతోపమమ్ ।
కుంభకర్ణం సమాలోక్య శిరో ధున్వ న్స మారుతిః ॥

23) శ్లో ॥ వైణ్యావం విష్ణుగాయంతం సదా సత్యరతం తతః ।
విభీషణం లోకహితే రతం మంగళ మైక్షత ॥

భావము : ఆ విధముగా సంచరించుచున్న వాయునందనుడు పెద్దగా ఉచ్ఛ్వాసనిశ్వాసములతో గాఢ నిద్రావరవశుడై మదించియున్న మహాపర్వతాకారుడగు కుంభకర్ణునిచూచి, ఆశ్చర్యముతో తలపంకించి, తరువాత సదా వీణావేణుగాన సంస్తుతులతో విష్ణువును భజించువాడును, సత్యనిరతుడు, లోకక్షేమంకరుడును, మంగళాకృతికలవాడగు విభీషణుని సందర్శించెను.

24) శ్లో ॥ యాని యాని వరీయాంసి వస్తూని భువనత్రయే ।
తాని తాన్యుపనీతాని రక్షస్యైక్షత మారుతిః ॥

25) శ్లో ॥ క్రమమాణః క్రమేణైవ హనూమాన్మారుతాత్మజః ।
సర్వేషాం సమతిక్రమ్య భవనాని సమంతతః ।
ఆససాదాథ లక్ష్మీవాన్రాక్షసేంద్రనివేశనమ్ ॥

భావము : పవనతనయుడగు హనుమ ఆ రాక్షసభవనములలో ముల్లోకముల నుండి కొల్లగొట్టుకొని తేబడిన అత్యంత శ్రేష్ఠములైన వస్తువులనెన్నింటినో ఆ రాక్షసుల భవనములలో చూచెను.

శ్రీమంతుడగు ఆ మారుతి ఈ విధముగా రాక్షసభవనములను క్రమముగానన్నింటిని దాటి ఎదురుగా రాక్షసేంద్రుడగు రావణుని భవనమును చేరెను.

శ్రీపాదుక : ఆససాదాథలక్ష్మీవాన్... అను శ్లోకపాదమునకు పూర్వమున్న రెండుశ్లోకములు పులస్త్యరామాయణములోనివిగా సూచింపబడినది.

26) శ్లో ॥ రావణస్యోపశాయిన్యః దదర్శ హరిసత్తమః ।
శూలముద్గరహస్తాశ్చ శక్తితోమరధారిణీః ॥

భావము : రావణుని భవనమును చేరిన హనుమంతుడు రావణుని ప్రక్కను పరుండి నిద్రించుచున్న సుందరీమణులనే గాక, శూల, ముద్గర, తోమరాది ఆయుధములను ధరించి, భవనరక్షణతత్పరలైన స్త్రీలను కూడ చూచెను.

27) శ్లో ॥ తాని ప్రయత్నాభి సమాహితాని ।
మయేన సాక్షాదివ నిర్మితాని ।
మహీతలే సర్వగుణోత్తరాణి ।
దదర్శ లంకాధిపతేర్గృహాణి ॥

భావము : ఆ హనుమంతుడు మయునిచే ప్రయత్నపూర్వకముగా నిర్మించిననియు, భూతలమునందు సర్వశుభలక్షణసమన్వితములుగా శోభిల్లు లంకాధీశుడగు రావణుని గృహసముదాయములను సందర్శించెను.

పుష్పకవిమాన వర్ణనము

28) శ్లో ॥ పుష్పాహ్వయం నామ విరాజమానమ్ ।
రత్నప్రభాభిశ్చ వివర్ధమానమ్ ।
వేశ్మోత్తమానామపి చోచ్చమానమ్ ।
మహాకపి స్తత్ర మహావిమానమ్ ॥

భావము : లంకాపురీ శోభలను సందర్శించుచున్న మహాకపీంద్రుడగు హనుమ ఒకచోట భూమిపై పర్వతపంక్తులు ప్రకాశించుచున్నట్లును, ఆ పర్వతపంక్తులలో పలువిధములైన సంతతులతో, మరియు సుగంధయుత కేసరములు దళములతో నొప్పారు పూగుత్తులతో శోభిల్లుచున్న వివిధములైన వృక్షములు చిత్రించబడిన – లంకాపురీ శోభలను సందర్శించుచున్న మహాకపీంద్రుడగు హనుమంతుడచట బహువిధ రత్నప్రభలచే విరాజిల్లుచున్నదియు, దాని నధిరోహించు జనులకనుగుణముగా విస్తరించునదియు, శ్రేష్ఠములైన

భవంతులనుమించి మహోన్నతముగాభాసిల్లు పుష్పకమనే విమానమును చూచెను.

29) శ్లో ॥ మహీ కృతా పర్వతరాజిపూర్ణా ।
శైలాః కృతా వృక్షవితానపూర్ణాః ।
వృక్షాః కృతాః పుష్పవితానపూర్ణాః ।
పుష్పం కృతం కేసర పత్ర పూర్ణమ్ ॥

భావము : ఆ విమానములో నొకచోట పర్వతపంక్తులతో శోభిల్లు భూమి చిత్రించబడినది. ఆ పర్వతములపై బహువిధములైన వృక్షములు బహువిధములైన పూగుత్తులతో ప్రకాశించుచున్నవి. మరియు ఆ పూలగుత్తులలోని ప్రతిపుష్పము సుగంధములను వెదజల్లు కింజల్కముల తోడను, దళములతోను శోభిల్లుచుండెను.

30) శ్లో ॥ కృతాశ్చ వైడూర్యమయా విహంగాః ।
రూప్యప్రవాళైశ్చ తథా విహంగాః ।
చిత్రాశ్చ నానా వసుభి ర్భుజంగాః ।
జాత్యానురూపా స్తురగా శ్శుభాంగాః ॥

భావము : మఱియును ఆ విమానము నందు ఒకచోట వైడూర్యమణులతో పలురకములై చిత్రవర్ణములుకల పక్షులు, పగడములతో, వెండితో చెక్కబడిన చాలా పిట్టలు, చిత్రవర్ణముల మణులతో చిత్రింపబడిన సుందర సర్పములు, మఱియు చక్కని సౌష్ఠవముతోనొప్పారు బహుళజాతిగుఱ్ఱములు ప్రకాశించుచుండెను.

31) శ్లో ॥నియుజ్యమానాస్తు గజా స్సుహస్తాః ।స కేసరా శ్చోత్పలపత్రహస్తాః ।
బభూవ దేవీ చ కృతా సుహస్తా । లక్ష్మీ స్తథా పద్మిని పద్మహస్తా ॥

భావము : ఆ విమానము నందే వేఱొక తావున తను సుందర సుకోమల హస్తముల యందు పద్మములను చేబూనినదై పద్మాసనయగు లక్ష్మీదేవి, సుందరములైన శుండా దండములతో సుగంధములను వెదజల్లు పద్మములను దాల్చిన గజరాజములచే సేవింపబడుచున్నట్లు చిత్రింపబడెను.

32) శ్లో ॥ తద ప్రమేయా ప్రతికార కృత్రిమమ్ ।
కృతం స్వయం సాధ్వితి విశ్వకర్మణా ।
దివం గతం వాయుపథప్రతిష్ఠితమ్ ।
వ్యరాజతాదిత్యపథస్య లక్ష్మవత్ ॥

33) శ్లో ॥ విమానం పుష్పకం దివ్యమారురోహ మహాకపిః ॥

ఇతి శ్రీమద్రామాయణ సారోద్ధారే సుందరకాండే తృతీయస్సర్గః

భావము : దానికి సాటియగు వేఱొకటి నిర్మించుటకు సాధ్యము కానట్లుగా నిరుపమానమైనదిగా స్వయముగా విశ్వకర్మ తన నిర్మితిని తానే "బాగు బాగు" అని ఆశ్చర్యముతో ప్రశంసించుచు, నిర్మించి వాయుమార్గంలో ఆకాశమున సూర్యసంక్రమణమార్గమును సూచించు చిహ్నమువలె శోభిల్లు దివ్యమైన ఆ పుష్పకవిమానమును దర్శించి, కుతూహలముతో దానిని అధిరోహించెను.

ఇది శ్రీమద్రామాయణ సారోద్ధారములోని సుందరకాండమున

మూడవ సర్గము

సర్గాంతశ్లోకసంఖ్య-(129+33=162)

పుష్పకవిమానము

చతుర్థ సర్గ

1) శ్లో ॥ స తస్య మధ్యే భవనస్య సంస్థితమ్ ।
మహద్విమానం బహువజ్రచిత్రితమ్ ।
ప్రతప్త జాంబూనదజాలచిత్రితమ్ ।
దదర్శ వీరః పవనాత్మజః కపిః ॥

భావము : మారుతాత్మజుడును, మహావీరుడును అగు ఆ హనుమంతుడా భవనమునడుమ ప్రకాశించుచున్నదియు నానావిధములైన వజ్రవైడూర్యాది మణికాంతులతో చిత్రవర్ణశోభితమై ప్రకాశించుచున్నదియు, మిక్కిలిగా పుటము పెట్టబడిన మేలిమిబంగారముతో నిర్మింపబడిన మహావిమానమును చూసెను.

2) శ్లో ॥ తస్యాలయవరిష్ఠస్య మధ్యే విపులమాయతమ్ ।
దదర్శ భవనశ్రేష్ఠం హనూమాన్మారుతాత్మజః ॥

భావము : పవనతనయుడగు హనుమంతుడా పుష్పకవిమానపు నడుమ, విశాలమైనదియు, పొడవైనదియునగు వరిష్ఠమగుభవనము నొకదానిని చూచెను.

3) శ్లో ॥ అర్ధయోజన విస్తీర్ణ మాయతం యోజనం హి తత్ ।
భవనం రాక్షసేంద్రస్య బహుప్రాసాదసంకులమ్ ॥

భావము : అది రాక్షసరాజగు రావణుని నివాసభవనము. దాని వెడల్పు అర్థయోజనము (అనగా సుమారు 4 కి.మీ.) పొడవు యోజనము (సుమారు 8.05945 కిలోమీటర్లు) ఆ భవనము పొంతులేనిమేడలతో క్రిక్కిరిసి యుండెను.

శ్రీపాదుక : బ్రిటిష్ వారి కాలమునకు పూర్వము మనదేశములో దూరమానము ఈ విధముగా పరిగణింపబడుచుండెడిది. 50 సంవత్సరములు పైబడిన వారందరు ఈ దూరమానము యొక్క వ్యవహారమును తెలిసికొనియుందురు. ఈ మానములో అతిచిన్న కొలత 1 అంగుళం – 2.54 సెంటీమీటర్లు, 3 అంగుళములు ఒక బెత్తె అనగా 7.62 సెంటీమీటర్లు, 2 బెత్తెలు ఒక జాన = 9 అంగుళాలు = 22.8 సెంటీమీటర్లు, 4 బెత్తెలు ఒక అడుగు. అనగా

12 అంగుళాలు 30.5 సెంటీమీటర్లు, 2 జానలు ఒకమూర (సుమారు 45 సెం.మీ) 2 మూరలు ఒక గజము దాదాపు 90 సెంటీమీటర్లు, 2 గజములు లేదా నాలుగు మూరలు ఒకబార అనగా 180 సెంటీమీటర్లు, 1000 బారలు ఒక మైలు = 1.61 కిలోమీటర్లు, 2 మైళ్ళు ఒక క్రోసు 3.22 కిలోమీటరు, 8 మైళ్ళు ఒకఆమడ అనగా 13 కిలోమీటర్లు.

4) శ్లో ॥ మార్గమాణస్తు వైదేహీం సీతా మాయతలోచనామ్ ।
సర్వతః పరిచక్రామ హనూమానరిసూదనః ॥

భావము : విదేహరాజపుత్రియు, విశాలాక్షయునగు సీతను వెదకుచున్నవాడై శత్రుహన్తయగుహనుమంతుడా భవనము నందతటను కలయదిరిగెను.

5) శ్లో ॥ చతుర్విషాణై ర్ద్విరదై స్త్రివిషాణై స్తథైవ చ ।
పరిక్షిప్త మసంబాధం రక్ష్యమాణముదాయుధైః ॥

భావము : రావణునియా నివాసభవనమును, నాలుగు, మూడు, రెండు,దంతములుకల యేనుగులు చుట్టుముట్టి కావలికాయుచున్నవి. మరియు కత్తులు కటారులు మున్నగు ఆయుధములను చేతితో పైకెత్తి పట్టుకొనిన రాక్షసవీరులచే సంరక్షింపబడుచుండెను.

6) శ్లో ॥ రాక్షసీభిశ్చ పత్నీభీ రావణస్య నివేశనమ్ ।
ఆహృతాభిశ్చ విక్రమ్య రాజకన్యాభిరావృతమ్ ॥

భావము : ఆ భవనము రావణుని రాక్షసధర్మపత్నులచేతను, మరియు పరాక్రమముచే బలాత్కారముగా గొనితెచ్చిన రాకుమార్తెలచేతను నిండియుండెను.

7) శ్లో ॥ యా హి వైశ్రవణే లక్ష్మీ ర్యా చేంద్రే హరివాహనే ।
సా రావణగృహే సర్వా నిత్యమేవానపాయినీ ॥

భావము : కుబేరుని వద్దను, మరియు హరిదశ్వములుకల రథము నధిరోహించిన దేవేంద్రునివద్ద కల లక్ష్మి అనగా సంపద అంతయు రావణుని యింట నిత్యము అపాయము లేక స్థిరముగానుండెను.

8) శ్లో ॥ స్వర్గో౾యం దేవలోకో౾యమింద్రస్యేయంపురీ భవేత్ ।
సిద్ధిర్వేయం వరా హి స్యా దిత్యమన్యత మారుతిః ॥

భావము : వాయు నందనుడగు హనుమ ఆ భవన శోభలను చూచుచు – 'ఆహా ! ఇది స్వర్గమో ! లేక దేవలోకమో ! లేక దేవేంద్రుని రాచనగరియగు అమరావతియో ! అథవా పరాసిద్ధియగు పరమపదమో (మోక్షపదమో) అయి ఉండును' – అని తలంచెను.

శ్రీపాదుక : స్వర్గమనగా పుణ్యకర్మలు చేసినవారు దేవత్వమును పొంది తమ తమ పుణ్యకర్మల ఫలితముగా సుఖభోగములు అనుభవించు లోకము.

దేవయోని విశేషులగు, గంధర్వ, కిన్నర కింపురుషాదులు నివసించునది దేవలోకము.

పరాసిద్ధి యనగా మోక్షము **'యద్గత్వా న నివర్తన్తే తద్ధామ'** పునరావృత్తి రహితమైన పరమపదము (శైవులకు కైలాస సన్నిధి, వైష్ణవులకు వైకుంఠము, శాక్తులకు – మణిద్వీపము) అని చెప్పబడినది.

9) శ్లో ॥ తతో౾పశ్య త్కుథాసీనం నానావర్ణాంబరస్రజమ్ ।
సహస్రం వరనారీణాం నానావేష విభూషితమ్ ॥

10) శ్లో ॥ పరివృత్తా౾ర్ధ రాత్రే తు పాననిద్రావశం గతమ్

భావము : పిమ్మట నతడచట చిత్రవిచిత్ర వర్ణములు కల వస్త్రమాల్యాదులను ధరించినవారును, బహువిధములైన వేషభూషలతో నలరారుచున్నవారునగు శ్రేష్ఠనారీసమూహములను అర్ధరాత్రమున మద్యమును గ్రోలి, నిద్రాపరవశలై రత్నకంబళులపై మైమరచి నిద్రించుచున్న వారిని వేలాదివిలాసినీ మతల్లును చూచెను.

11) శ్లో ॥ రావణే సుఖసంవిష్టే తాః స్త్రియో వివిధప్రభాః ।
జ్వలంతః కాంచనా దీపాః ప్రైక్షంతానిమిషా ఇవ ॥

భావము : రావణుడు సుఖముగా నిద్రించుచున్న ఆ సమయంలో, అతని ప్రక్క నిదురించుచున్న ఆ మదవిలాసినీ జనమును, వివిధములగు బంగారు దీపస్తంభములపై బహువిధములైన కాంతులనీను మణిదీపములు ఱెప్పపాటు లేని దేవలవలె నిరంతరాయముగా చూచుచున్నట్లుండెను.

శ్రీపాదుక : ఇచ్చట రావణునిగూడి నిద్రించుచున్న మదవతులైన మత్తకాశినులను మణిదీపములు నిరంతరముగా చూచుచున్నట్లు వర్ణింపబడినవి. నిరంతరముగా కన్నార్పకుండునట్లుచూచు అనిమిషత్వము దేవతలస్వభావము.

రావణుడు జాగరూకుడైయున్న సమయమున వారినిచూచుట దేవతలకే కాదు వేఱెవ్వరికిని కూడ సాధ్యము కాదు. అట్టి దృశ్యమును అచటి బంగరు కంబములపై వెలుగొందు మణిదీపములు సదా సందర్శించుచున్నట్లు ఉత్ప్రేక్షింపబడినది. మరియు మణిదీపములకు అనిమిషత్వము ఆరోపింపబడి వారికి అనిమిషులగు దేవతలతో పోలిక చెప్పబడినది. కావున నిచట ఉపమాను+ప్రాణితమైన "ఉత్ప్రేక్షాలంకారము" అలంకారవిశేషముగా గ్రహింపదగును.

12) శ్లో ॥ రాజర్షి పితృ దైత్యానాం గంధర్వాణాం చ యోషితః ।

రాక్షసానాం చ యాః కన్యా తస్య కామవశం గతాః ॥

13) శ్లో ॥ సమదా మదనేనైవ మోహితాః కాశ్చిదాగతాః ।

చింతయామాస హనుమాన్ స్వాత్మన్యేవం మహామతిః ॥

భావము : రాజ, ఋషి, పితృ, దైత్య, గంధర్వ జాతులకు చెందినవారును, రాక్షసకన్యలు అతని కామమునకు వశంవదలైనవారే, మఱికొందరు స్వయముగా మదనార్తిసమ్మోహితులై వచ్చినవారు.

13) అచట నిదురించుచున్న వేలాది సుందరీమణులలో చాలామంది రాజర్షి పితృదేవగంధర్వాది జాతులకు చెందిన వారాతనిచే మోహింపబడి రాక్షస వివాహముచే తీసికొని రాబడినవారు, మరికొందరు స్వయముగా నతని రూపసందపదైశ్వర్యములచే మోహింపబడి వచ్చినవారుగా హనుమ వారిని గుర్తించి, బుద్ధిమద్వరిష్ఠుడు కావున వెనువెంటనే తనలోనిట్లు ఆత్మవివేచన చేసికొనసాగెను.

శ్రీపాదుక : శయనమందిరమును సందర్శించుట అనుచితమేయైనను సీతాన్వేషణైక పరాయణుడగుటవలన అతనికి ఆ దోషమంటదు. ఈ సందర్భములో బ్రహ్మచర్యనిష్ఠుడగు హనుమ, వారిని యాదృచ్ఛికముగా

చూచుటకూడ దోషమేయగునని విచారణచేయుట అతని మహాబుద్ధిమత్త్వమును లేదా బుద్ధిమద్వరిష్ఠత్వమును తెలియజేయును.

14) శ్లో ॥ నాఽవస్త్రాః స్త్రియ ఈక్షేత బ్రహ్మచారీ విశేషతః ।

ఇతి శాస్త్రగతిం నాహ మద్రాక్షం కార్యగౌరవాత్ ॥

భావము : వివస్త్రలుగా నున్న స్త్రీలనెవ్వరును చూడకూడదు. బ్రహ్మచారియైన వాడు సుతరాముచూడనే చూడకూడదని శాస్త్రమర్యాద. దీనిని నేను సీతాన్వేషణైకకార్యనిర్వహణపరవశుడనై స్మరింపలేకపోయితిని గదా ! అని హనుమంతుడు తాను వారిని ఆ స్థితిలో చూచుటనుగూర్చి ఆత్మవిచారణ చేసికొనెననది తాత్పర్యము.

శ్రీపాదుక : ఇక్కడ హనుమ శాస్త్రగతిననుసరించి ఆత్మవివేచనము చేసికొనినాడని పూర్వశ్లోకములో–

"చింతయామాస హనుమాన్ స్వాత్మన్యేవం మహామతిః"–అని అగస్త్య రామాయణములోని పంక్తి ఉట్టంకింపబడినది.

'మహామతి' యనగా విశిష్టమైన బుద్ధికలవాడు లేదా బుద్ధిమద్వరిష్ఠుడని భావము.

'బుద్ధిస్తాత్కాలికీ జ్ఞేయా' – తక్షణమే వివేచనతో సరియగు నిర్ణయము చేసి సమాధానపరచు ధీశక్తి బుద్ధి యనబడును.

హనుమ మహామతి, యనగా బుద్ధిమద్వరిష్ఠుడు అనగా ఏమరుపాటు లేక తక్షణమే తగు విచారణచేసి సిద్ధాంతీకరింపగల ప్రతిభావంతుడు.

అతడు పని తొందరలో బ్రహ్మచారియగు వాడు విశేషించి స్త్రీలను వివస్త్రలుగా చూడరాదను శాస్త్రగతిని దర్శింపజాలకపోయితినేయని విచారించినాడు.

హనుమంతుడు బ్రహ్మచారియా? గృహస్థుడా? అను విషయములో బహువిధ తర్కములు కలవు. నిశితముగా పరిశీలించినచో హనుమంతుడు గృహస్థుడు మరియు బ్రహ్మచారియను విషయము రామాయణానుశీలనము వలన తెలియును.

ఇచ్చుట బ్రహ్మచారియగువాడు విశేషించిస్త్రీలను వస్త్రవిహీనులైన వారిని చూడరాదను శాస్త్రవిధిని తాను కార్యభారవ్యగ్రతలో అనుష్ఠింప లేకపోయితినే యని హనుమ బాధపడినాడు.

హనుమంతుడు తన ప్రభువగు రామచంద్రమూర్తి వలె గృహస్థాశ్రమములోనున్న బ్రహ్మచారి.

హనుమంతునకు సూర్యపుత్రియగు సువర్చలతో వివాహమైనది. హనుమ తన బ్రహ్మచర్యనిష్ఠకు ప్రతిబంధకముకాని విధమున సువర్చలను వివాహమాడిన వైనము పరాశరసంహితలో విశేషముగా వర్ణింపబడినది.

ఈ విషయమును శ్రీమద్రామాయణము కూడ కావ్యభాషలో వ్యంగ్య మర్యాదగా పరోక్షముగా తెలియజేయబడినది. సుందరాకాండలో సుగ్రీవుడు హనుమంతుని రామలక్ష్మణులను గూర్చి తెలిసికొనుటకు పంపుచు –

గచ్ఛ ! జానీహి భద్రంతే వటుర్భూత్వా ద్విజాకృతిః బ్రాహ్మణ వటు రూపమును ధరించి వెళ్ళవలసినదని నియోగిస్తాడు. వటువుకాని వానినే వటురూపంలో వెళ్ళమని చెప్పడం సబబు. కావున హనుమ బ్రహ్మచారికాడు గృహస్థు అనే విషయం తెలుస్తుంది.

మరల సుందరకాండలో ప్రస్తుతసందర్భంలోనే హనుమ 11వ సర్గలో

– **పరదారావరోధస్య ప్రసుప్తస్య నిరీక్షణమ్ ।**

ఇయం ఖలు మమాత్యర్థం ధర్మలోపం కరిష్యతి ।

నహి మే పరదారాణాం దృష్టిర్విషయవర్తినీ ।

అయం చాత్ర మయాదృష్టః పరదారా పరిగ్రహః ॥

విషయవర్తనులైన పరదారలను పరస్త్రీలను చూచి తాను ధర్మ లోపము చేసినట్లు బాధపడుతాడు. స్వదారానువర్తనుడైన వాడే కదా పరదారసందర్శనమును దోషముగా పరిగణిస్తాడు. కావున హనుమ గృహస్థు అని తెలియవలెను.

పరాశరసంహితయే కాక ఇతరత్ర కూడ హనుమ గృహస్థుగానే వర్ణింపబడినాడు.

శౌనక సంహితలో – హనుమదావాహనమున– **"ఆగచ్ఛ ! హనుమన్! దేవ! త్వం సువర్చలయా సహ"** అని చెప్పబడినది.

వానరగీతలలో కూడ – **"మాతా సువర్చలా దేవీ పితా మే వాయు నందనః"** అని హనుమందుడు సువర్చలాసమేతునిగా కీర్తింపబడినాడు.

ఆయా యీ ప్రసంగములను బట్టి హనుమంతుడు గృహస్థు మరియు **'సువర్చలాపతి'** యని స్పష్టముగా నిర్ణయింపబడినది.

కొందరు ఔత్తరాహులు హనుమంతుని కేవల ఘోటక బ్రహ్మచారిగా తలంచుచున్నారు. అట్టివారిని సమాధానపరచుచూ శ్రీపాదుక పరాశర సంహితాహవనమును, సువర్చలా హనుమత్కల్యాణమును కాశీ ముముక్షు భవనంలో 2010 సంవత్సరంలో నిర్వహించి సువర్చలాహనుమంతుల అర్చామూర్తులను యంత్రముపై ప్రతిష్ఠించుట జరిగినది.

హనుమంతుడు గృహస్థుడేయైనచో ఆంజనేయ సహస్ర నామములలో **'బ్రహ్మచారిణే నమః'** – అని ప్రతిపాదించుటయు, పలుతావులలో సర్వత్ర హనుమంతుని ఒక్కనినే ప్రతిష్ఠించుట యెట్లు పొసగును అని కొందరు ప్రశ్నింపవచ్చును.

శాస్త్రగతి నవలోకించి ధర్మసూక్ష్మమును గ్రహించినచో ఈ శంకకు తావే యుండదు. ధర్మశాస్త్ర (కాణ్వాయన స్మృతి) – గాయత్రః, బ్రాహ్మః, ప్రాజాపత్యః, బృహన్ (బృహద్బ్రహ్మచారీ) అని నాలుగు విధములై బ్రహ్మచర్య వ్రత నిష్ఠలను నిర్దేశించినది. వారు క్రమముగా –

(1)'గాయత్ర బ్రహ్మచారి'–

ఉపనయనాదూర్ధ్వం త్రిరాత్ర మక్షారలవణాశీ గాయత్రీ మధీతౌ – స గాయత్రః' అనగా – ఉపనయనదీక్షానంతరము అనగా యజ్ఞోపవీతధారణా సమనంతరమే క్షారలవణవర్జితమగు, అనగా కారము, ఉప్పు మొదలగు రుచులను వర్జించి కేవల సాత్త్వికాహారపరాయణుడై మూడు రోజులు దీక్షతో గాయత్రీమంత్రజపానుష్ఠానమును నిర్వర్తించువాడు.

(2) బ్రాహ్మ బ్రహ్మచారి–**'యస్తు వేదస్య గ్రహణాంతం బ్రహ్మచర్యం చరతి స బ్రాహ్మః'** అనగా ఉపనయనసంస్కారమైన పిమ్మట, గురుకులములో వేదాధ్యయనము పూర్తియగువరకు బ్రహ్మచర్యనిష్ఠను పాటించు వటువు బ్రాహ్మబ్రహ్మచారి యని యర్థము.

(3) **ప్రాజాపత్య బ్రహ్మచారి – 'ఋతుకాలే స్వదారగామీ నిత్యం పరస్త్రీ విముఖః – స ప్రాజాపత్యః' ॥** అనగా ఋతుకాలము నందు మాత్రమే తన సహధర్మచారిణితో వంశకర సంతానప్రాప్తిపర్యంతము సంగమించి పరస్త్రీవిముఖుడుగా వర్తించువాడు ప్రాజాపత్యబ్రహ్మచారి యనబడును.

"సంవత్సరం వేదకృ ద్వటురపి ప్రాజాపత్య ఏవ" నిరంతరాయముగా సంవత్సర కాలము వేదాధ్యయనము నిష్ఠతో చేసిన వటువు కూడా ప్రాజాపత్య బ్రహ్మచారియేనగునని భావము.

(4) బృహద్బ్రహ్మచారి – 'ఆమరణాంతం గురుకులవాసీ సనైష్ఠికో బృహన్నిత్యుచ్యతే' – అనగా ఉపనయనము మొదలు మరణించు వరకు గురుకులవాసము చేస్తూ వేదాధ్యయన పరాయణుడగు వాడు బృహద్బ్రహ్మచారి యనబడును.

ఇట్లే గృహస్థులలోను వానప్రస్థులలోను నాలుగు భేదములున్నవి. అవి ప్రస్తుతము అప్రస్తుతములు. హనుమ, పై నాలుగు విధములైన బ్రహ్మచారులలో **ప్రాజాపత్య బ్రహ్మచారి**యని చెప్పవచ్చును. హనుమంతుడే కాదు, శ్రీరామచంద్రమూర్తి, శ్రీకృష్ణుడు, జనకుడు, చూడాల మొదలగువారు కూడ ఈ తరగతికి చెందినవారే.

హనుమంతుడే ముక్తకంఠముగా సీతమ్మతో శ్రీరామచంద్రమూర్తి **'బ్రహ్మచారి'** యని నివేదించినాడు. సుందరకాండములో శ్రీరాముని గుణగణములను వర్ణించు సందర్భములో **'బ్రహ్మచర్యవ్రతే స్థితః'** అని ముక్తకంఠముగా ప్రశంసించియున్నాడు.

శ్రీకృష్ణుడుకూడ ఎనమండుగురు పట్టపురాణులు, పదునాఱువేల గోపికలతో క్రీడించినను – అనాదిబ్రహ్మచారి, సదాబ్రహ్మచారిగనే కీర్తింపబడినాడు.

బ్రహ్మచర్యవ్రతనిష్ఠ గృహస్థులకు కూడ విధింపబడినది. **'వివాహానంతర మక్షారలవణాశినౌ బ్రహ్మచారిణావధశ్శాయినౌస్యాతామ్'** అనియు **'యదికామయేత శ్రోత్రియం జనయేయ మిత్యరుంధత్యుపస్థానాంతం కృత్వా త్రిరాత్రమక్షారలవణాశినా వధశ్శాయినౌ బ్రహ్మచారిణే – ఇత్యాది భారతోక్త్యాపి వివాహానంతరం బ్రహ్మచర్యవ్రతం సంగచ్ఛతే'**

వివాహానంతరము దంపతులు ఉప్పుకారములను తినుటమాని బ్రహ్మచర్యము నవలంబించి నేలపై పరుండవలెను. మరియు ఈ దంపతులు శ్రోత్రియుడు వంశకరుడగు కుమారుని కనవలెనని తలంచినచో అరుంధత్యుపస్థానాంతము కర్మచేసి పిదప మూడురాత్రులు క్షారలవణ భోజనము మాని బ్రహ్మచారులై అధశ్శయనము పాటింపవలెను.

ఇదే విధముగా భారతము నందు కూడ వివాహానంతర బ్రహ్మచర్య వ్రతము ప్రస్తావింపబడినదని శ్రీరామాయణం శాస్త్రులు గారు ప్రస్తావించియున్నారు. ఏతావతా **హనుమంతుడు వివాహానంతర బ్రహ్మచర్య నిష్ఠను పాటించుచున్న ప్రాజాపత్య బ్రహ్మచారి** యని సిద్ధాంతీకరింపబడినది.

15) శ్లో ॥ పరదారావరోధస్య ప్రసుప్తస్య నిరీక్షణమ్ ।

ఇయం ఖలు మమాత్యర్థం ధర్మ లోపం కరిష్యతి ।

నహి మే పరదారాణాం దృష్టి ర్విషయవర్తినీ ।

అయం చాత్ర మయా దృష్టః పరదారపరిగ్రహః ॥

భావము : ఈ విధముగా రావణాంతపురమును రహస్యముగా ప్రవేశించి, పరస్త్రీల నిట్లు పరికించుట నాకు ధర్మోల్లంఘన రూపమగు అపచారముగా అనిపించుచున్నది. అయినను నా ఈ దృష్టి భోగాపేక్షతో పరస్త్రీలను పరికించునది కాదు. ఇచ్చట రావణునిచే స్వేచ్ఛానుసారముగా పరదారలను చేబట్టి విలాసముగా భోగలాలసుడై యుండుట మాత్రమే గమనింపబడినది.

16) శ్లో ॥ మమ త్వసంగమనసో న దోషో విషయేక్షణాత్ ।

విషయైర్నహి లేపో౽స్తి వహ్నివాయువివస్వతామ్ ॥

భావము : నేనిట్లుగా ఈ విషయములను అనగా వీరి పరస్పర పరిష్వంగాదికమును చూచుచున్నను నా మనస్సు అనాసక్తితో వ్యభిచరింపక యున్నది. కావున నాకే విధమైన దోషము అంటదు.

అగ్ని, వాయు, సూర్య భగవానులు (చరింపని ప్రదేశము లేదు) విషయములను చూచుచున్నను అనాసక్తులు కావున వారు దోషులు కారు. అట్లే వాయుపుత్రుడగు హనుమకూడ నిర్దోషియేనని తాత్పర్యార్థము.

శ్రీపాదుక : మనసైవ కృతం పాపం న శరీరకృతమ్ కృతమ్ ।

యేనైవాలింగ్యతే కాంతా తే నైవాలింగ్యతే సుతా ॥

పాపమనునది ఉద్దేశపూర్వకముగా మనసా సంభావించి చేసినచో కలుగును. అనాసక్తితో కేవల శరీరసంస్పర్శ మాత్రముచే కలుగదు. ఎట్లన, ఒకే వ్యక్తి శారీరకముగా తన కాంతతో భోగించి, తన తనయను కౌగిలించి యానందించును. సంభోగమున లాలస, కౌగిలింతలో వాత్సల్యము భిన్నముగా ఆనంద సంధాయకములు దోషవర్జితములని గ్రహించవలెను.

ఈ విధమైన వివేచనములో హనుమ వికలమైన తన మనస్సును సమాధానపరచుకొనినాడని గ్రహించాలి.

17) శ్లో ॥ న తత్ర కాచి త్ప్రమదా ప్రసహ్యా

వీర్యోపపన్నేన గుణేన లబ్ధా ।

న చాన్యకామాపి న చార్యపూర్వా

వినా వరార్హాం జనకాత్మజాం తామ్ ॥

భావము : ఇచట నున్న స్త్రీలలో నొక్కతెకూడ రావణునిచే బలాత్కారముగా విక్రమించి తేబడినదికాదు. వారందరు అతనిపై మనసుపడి వచ్చినవారే. వారిలో నెవ్వరును రావణునితప్ప వేరెవ్వరిని కామించ లేదు. వేరెవ్వరిని భర్తగా స్వీకరింపలేదు. ఒక్క సీతమ్మ మాత్రమే వీరందరికన్న భిన్నమైనది. (కావుననే యిచట కనబడకున్నదని భావము)

జహ్రే పథి నరేంద్రర్షి దేవదానవకన్యకాః

దర్శనీయాం హి తద్రక్షః కన్యాం స్త్రీం వాఽను పశ్యతి ।

హత్వా బంధుజనం తస్యాః విమానే తాం రురోధ హ ।

తాదృశ స్త్రీణాం విభీషణానుమతేన విమోచనం కృతవాన్ ॥

రావణుడు సుందరముగా రాజ, ఋషి, దేవకాంతలను కంటబడిన వారిని బలాత్కారముగా తనకడ్డుపడినవారి బంధుజనమును వధించి తన విమానములోనికెక్కించుకుని తీసికొని వచ్చెడివాడనియు, తరువాత వారిని విభీషణుని బోధచే విడిచిపుచ్చెననియు, కావుననే వారిచట కనబడుటలేదనియు

రచయిత శ్రీ శాస్త్రిగారు రామాయణ ఉత్తరకాండలోని 24వ సర్గలోని పై శ్లోకములనుదాహరించి వ్యాఖ్యానించినారు (రామాయణసారోద్ధారము - సుందరకాండ పుటలు. 88, 89)

18) శ్లో ॥ న చాకులీనా న చ హీనరూపా
నాదక్షిణా నానుపచార యుక్తా ।
భార్యాఽభవ త్తస్య న హీనసత్త్వా
న చాపి కాంతస్య న కామనీయా ॥

19) శ్లో ॥ బభూవ బుద్ధిస్తు హరీశ్వరస్య
యదీదృశీ రాఘవ ధర్మపత్నీ ।
ఇమా యథా రాక్షసరాజభార్యా
స్సుజాత మస్యేతి హి సాధుబుద్ధేః ॥

భావము : ఆ రమణీమణులందరు సద్వంశమున జన్మించినవారే! అందరూ సుందరీమణులే ! నెఱజాణలు మరియు నేర్పరులే ! సకలోపచారములను పొందుచున్న శరీరపాటవము కలవారలే. అందరును రావణునికి ప్రియకాంతలే. (భోగకాంతలేనని భావము)

రాక్షసేశ్వరుడగు రావణుని యీ భార్యలందరివలె సీతమ్మ కూడ రాముని కూడి సుఖించినట్లయిన రావణునకు మేలు కలుగునని సద్బుద్ధితో హనుమ యోచించెను.

శ్రీపాదుక : ఈ 19వ శ్లోకములో అనుచోట రాముడగ్ని సాక్షిగా వివాహమాడిన సీత ఈదృశీయది అనగా వీరి వలె స్వయంవరమునకు పూర్వమే ఇతనికి ధర్మపత్ని అనగా అ భార్యయైనచో అస్య సుజాతం - ఈ రావణుని సుకృతము పుణ్యఫలమయ్యెడిది అనెడి బుద్ధిః - సద్బుద్ధికల హనుమంతుడు అని హనుమకు సద్బుద్ధి కలవాడు అను విశేషణము - రాఘవ ధర్మపత్నియగు సీతకు వీరితో రావణుని భోగకాంతలతో పోలిక హనుమంతునికి తన సహజాతమగు చలచిత్త స్వభావముచే పొడచూపినదే కాని 'బుద్ధిమద్వరిష్ఠుడగు హనుమ ఇట్టి తలంపున కెన్నడును లోనుకాడ'ను విషయమును. తం-కాని

అను అవ్యయము, మరియు సాధుబుద్ధిత్వ విశేషము తెలియజేయుచున్నవి – అని అధోజ్ఞాపికలో రచయిత వివరిస్తారు. (రామాయణసారోద్ధారం– పుటలు. 90–94)

20) శ్లో ॥ పునశ్చ సోఽచింత యదార్త రూపో
ధ్రువం విశిష్టా గుణతో హి సీతా ।
అథాయ మస్యాం కృతవాన్మహాత్మా
లంకేశ్వరః కష్టమనార్య కర్మ ॥

భావము : మరల నింకను మనసున బాధపడుచున్నవాడై యా రావణుని చూచి హనుమ తనలో – సీతాదేవి తన పాతివ్రత్య, కులీనత్వాది విశిష్టగుణములచే కనబడుచున్న వీరందరికన్న నిశ్చయముగా గొప్పది లంకేశ్వరుడగు ఈ రావణుడును మహితాత్ముడే ! అయినను అతడిట్టి శిష్టులగు వారు చేయకూడని సీతాపహరణమును చేసినాడు కదా ! అని అతని అకృత్యమునకు జాలిపడుచు తలంచెను.

21) శ్లో ॥ తత్ర దివ్యోపమం ముఖ్యం స్ఫాటికం రత్నశోభితమ్ ।
అవేక్షమాణో హనుమా న్దదర్శ శయనాసనమ్ ॥

భావము : ఇట్లు తర్కించుకొనుచు హనుమంతుడు అచ్చట నతిముఖ్యమగు దేవేంద్రుని పర్యంకముతో పోల్చదగినదియు, స్ఫటిక మణులతో నిర్మింపబడి బహువిధములైన రత్నమణులతో శోభిల్లుచున్న రావణుని శయనతల్పమును చూచెను.

22) శ్లో ॥ తస్య చైకతమే దేశే సోఽగ్ర్య మాలా విభూషితమ్ ।
దదర్శ పాండురం ఛత్రం తారాధిపతిసన్నిభమ్ ॥

భావము : ఆ తల్పపుపై భాగమున నొకచోట ఉత్తమోత్తమములైన పుష్పమాలికలచే నలంకరించబడిన చంద్రకాంతిని పోలిన పాండుర వర్ణముతో శోభిల్లు శ్వేతఛత్రమును చూచెను.

23) శ్లో ॥ వాలవ్య జనహస్తాభి ర్వీజ్యమానం సమంతతః ।
గంధైశ్చ వివిధై ర్జుష్టం వరధూపేన ధూపితమ్ ॥

భావము : మరియు నెదురుగా నతడు వింజామరలను వీచుచున్న వారిని,

బహువిధములైన పరిమళములుతో గుబాళించు ధూపములనుకూడ చూచినాడని భావము.

శ్రీపాదుక : రాత్రివేళ ఏకాంతములో నిదురించు రావణునకు స్త్రీలు వింజామరలు వీచుట, ధూపగంధాదులచే సేవించుట ఎట్లు సంభవము? వారట్లు సేవించినను వారిని హనుమంతుడు దర్శించుట యెట్లు కుదురును? వారతనిని చూచినచో రసాభాసముగాను కదా యని శంకింపనవసరము లేదు.

విశ్వకర్మయొక్క పుష్పక నిర్మాణ కౌశలమట్టిది. ఆ స్త్రీ మూర్తులు శిల్పి నిర్మితములై ప్రతిమలే ఆ ధూపములు కూడ అట్టి చిత్రమైన గుబాళింపు కలవేనని భావింపవలెను.

తల్పమున శయనించుచున్న రావణుని వర్ణనము

24) శ్లో ॥ తస్మి న్జీమూతసంకాశం ప్రదీప్తోత్తమకుండలమ్ ।
లోహితాక్షం మహాబాహుం మహారజతవాససమ్ ॥

25) శ్లో ॥ లోహితేనానులిప్తాంగం చందనేన సుగంధినా ।
వృత మాభరణైర్దివ్యై స్సురూపం కామరూపిణమ్ ॥

26) శ్లో ॥ భాస్వరే శయనే వీరం ప్రసుప్తం రాక్షసాధిపమ్ ।
నిశ్వసంతం యథా నాగం రావణం వానరర్షభః ॥

27) శ్లో ॥ ఆసాద్య పరమోద్విగ్న స్సోఽపాసర్ప త్సుభీతవత్ ।
అథారోహణ మాసాద్య వేదికాంతర మాశ్రితః ॥

28) శ్లో ॥ సుప్తం రాక్షసశార్దూలం ప్రేక్షతే స్మ మహాకపిః ।
కాంచనాంగదనద్ధౌ చ దదర్శ న మహాత్మనః ॥

29) శ్లో ॥ విక్షిప్తౌ రాక్షసేంద్రస్య భుజావింద్రధ్వజోపమౌ ।
ఐరావత విషాణాగ్రై రాపీడనకృతవ్రణౌ ॥

30) శ్లో ॥ వజ్రోల్లిఖితపీనాంసౌ విష్ణుచక్రపరిక్షతౌ ।
విక్షిప్తౌ శయనే శుభ్రే పంచశీర్షావివోరగౌ ॥

భావము : దివ్యమైన ఆ తల్పముపై నీలమేఘచ్ఛాయ కల శరీరముతో, బాగుగా

ప్రకాశించుచున్న కుండలములతో, ఎఱ్ఱని కన్నులు గలిగి, విలువైన బంగారు రంగారు వెండిజరీ వస్త్రములను ధరించిన వాడును–

25) ఘుమఘుమలాడు యెఱ్ఱచందనము పూయబడినదియు, ఉత్తమోత్తములైన దివ్యాభరణభూషితమై సుందర రూపముతో ప్రకాశించుచున్న స్వేచ్ఛా రూపధారియును –

26, 27) స్వచ్ఛముగా ప్రకాశించుచున్న తల్పమున మహాసర్పము బుసకొట్టునట్లు గుఱ్ఱుపెట్టుచు నిద్రించుచున్న రాక్షసేశ్వరుడగు రావణుని సమీపించిన వానరోత్తముడగు హనుమంతుడు మిక్కిలి కలత చెందిన మనస్సు కలవాడై భయపడిన వానివలె నతనికి దూరముగా తొలగిపోయెను.

28–30) ఆ విధముగా తొలగి జరిగిన హనుమంతుడొక మెట్టునెక్కి వేరొక వేదికపై కూర్చుండి, ప్రగాఢముగా నిద్రించుచున్న రాక్షసశ్రేష్ఠుడగు రావణుని పరిశీలనగా చూడసాగెను.

బాగుగా విస్తరించి చాచబడిన ఆతని బాహువులు బంగారు భుజకీర్తులతో శోభిల్లుచుండెను. ఇంద్రధ్వజముతో పోల్చదగిన ఆ మహాభుజములు ఐరావతముతో పోరాడి దాని దంతములచే గ్రుచ్చబడిన గాయముల గుర్తులు కలవై, వజ్రాయుధపు గాట్లు మరియు విష్ణుచక్రపు నఱకుల చిహ్నములతో ప్రకాశించుచు ఐదుపడగల మహాసర్పముల వలె, తెల్లని పాన్పుపై ప్రకాశించుచు కనిపించెను.

శ్రీపాదుక : రావణ బాహువులు వింశతి (ఇరువది) సంఖ్యలో ప్రసిద్ధములు. ఇచ్చట ద్వివచన ప్రయోగముచే రెండుగా మాత్రమే సూచింపబడినవి. ఇది ఎట్లు పొసగునని శంకింపనవసరము లేదు. ఏలన అతడు కామరూపుడు అనగా తన సంకల్పానుసారముగా నాకృతిని ధరించువాడు. యుద్ధరంగమున దశ శిరస్సులతో ఇరువది చేతులతో నతడు ప్రకాశించును. శయనాగారమున ప్రసన్న వదనములో ఒకే తల రెండుబాహువులతో చరించునని గ్రహింపవలెను.

31) శ్లో ॥ తాభ్యాం స పరిపూర్ణాభ్యాం భుజాభ్యాం రాక్షసేశ్వరః ।

శుశుభేఽచలసంకాశ శ్శృంగాభ్యామివ మందరః ॥

భావము : ఈ విధముగా బాగుగా పరిపుష్టములైన రెండు భుజములతో రెండు శిఖరములతో శోభిల్లు మందరాచలము వలె ప్రకాశించెను.

32) శ్లో ॥ చూతపున్నాగసురభి ర్వకుళోత్తమసంయుతః ।

మృష్టాన్నరస సంయుక్తః పానగంధపురస్సరః ॥

33) శ్లో ॥ తస్య రాక్షససింహస్య నిశ్చక్రామ మహాముఖాత్ ।

శయానస్య వినిశ్వాసః పూరయన్నివ తద్గృహమ్ ॥

భావము : ఆ విధముగా గుఱ్ఱువెట్టి తల్పముపై నిద్రించు రాక్షసేశ్వరుడైన రావణుని విశాలమైన నోటినుండి - మామిడి, పున్నాగ, బొగడపూల సుగంధముల పరిమళముగల పానసేవనము వలనను, వివిధములైన మృష్టభోజనముల సుగంధముతో వెలువడుచున్న నిశ్వాస వాయువు ఆ శయన మందిరమునంతను నింపుచున్నట్లుండెను.

శ్రీపాదుక : బుద్ధిమంతుడగు హనుమ యాతని నోటి నుండి వెలువడు నిశ్వాస పవనమును బట్టి అతడు సేవించిన ఆహారమును గుర్తించినాడు.

"అన్నమశితం త్రేధా విభజ్యతే । తస్య యత్ స్థవిష్ఠోధాతుస్తత్పురీషం భవతి । యో మధ్యమస్తన్మాసం - యోఽణిష్ఠః - తన్మనః ఇతి । అని శాస్త్ర వచనము. భుజించిన అన్నము మూడు విధములుగా స్థూల మధ్య అణు రూపములుగా విభక్తమై, స్థూలధాతువు పురీషముగా మధ్యమధాతువు మాంసముగా, అణు లేదా సూక్ష్మధాతువు మానసముగా పరిణమించునని శారీరక మీమాంసా శాస్త్రము.

ఇట్టి నిశితపరిశీలనముచే రావణుని బలపరాక్రమములతోపాటు అతని మనస్సును కూడ గ్రహింపగల సూక్ష్మబుద్ధికలవాడు హనుమ యని తాత్పర్యార్థమును గ్రహింపవలెను.

"ఆవులించినంత మాత్రమున ప్రేవులను లెక్క పెట్టుట" - అను నానుడి మనమందర మెఱిగినదే ! నిశ్వాస వాయువును బట్టి, రావణుని బలపరాక్రమములు, మనోభావములను కూడ గుర్తింపగల ప్రతిభాసమున్మేషము కలవాడు కావుననే హనుమ బుద్ధిమద్వరిష్ఠుడుగా కీర్తింపబడినాడు.

34) శ్లో ॥ మాషరాశి ప్రతీకాశం నిశ్వసంతం భుజంగవత్ ।

గాంగే మహతి తోయాంతే ప్రసుప్తమివ కుంజరమ్ ॥

భావము : మినుగుల ప్రోవువలె నల్లని మేనిఛాయ గల వాడును, మహాసర్పము యొక్క బుసలవలె నిశ్వాసమును విడుచుచున్నవాడు, స్వచ్ఛమైన గంగా ప్రవాహము నందు నిదురించుచున్న ఏనుగువలె నున్న రావణుని హనుమంతుడు దర్శించెను.

35) శ్లో ॥ చతుర్భిః కాంచనైర్దీపైర్దీప్యమానం చతుర్దిశమ్ ।
ప్రకాశకృత సర్వాంగం మేఘం విద్యుద్గణైరివ ॥

భావము : నలుదిక్కులలో బంగారు దీపస్తంభములపై వెలుగుచున్న దీపకాంతులలో మెఱుపుతీగల నడుమ ప్రకాశించుచున్న మేఘమువలె నున్న రావణుని హనుమంతుడు చూచెనని భావము.

36) శ్లో ॥ పాదమూలగతశ్చాపి దదర్శ సుమహాత్మనః ।
పత్నీ స్స ప్రియభార్యస్య తస్య రక్షః పతేర్గృహే ॥

భావము : మహితాత్ముడగు రావణుని పాదముల వద్ద నిదురించుచున్న రావణుని ప్రియభార్యలను ఆ రావణుని యింటిలో హనుమంతుడు చూచెను.

37) శ్లో ॥ మదవ్యాయామఖిన్నా స్తా రాక్షసేంద్రస్య యోషితః ।
తేషు తేష్వవకాశేషు ప్రసుస్తా స్తనుమధ్యమాః ॥

భావము : (రావణభవనము నందు సంచరించుచున్న ఆంజనేయుడు) అవకాశము లభించిన ప్రదేశములందన్నింటను మద్యము చేతను, వ్యాయామము చేతను అలసి నిదురించుచున్న రాక్షసరాజగు రావణుని అందమైన భార్యలను చూచెను.

38) శ్లో ॥ తాసామేకాంత విన్యస్తే శయానాం శయనే శుభే ।
దదర్శ రూపసంపన్నా మవరాం స కపి స్స్త్రియమ్ ॥

39) శ్లో ॥ గౌరీం కనకవర్ణాభా మిష్టా మంతఃపురేశ్వరీమ్ ।
కపిర్మండోదరీం తత్ర శయానాం చారురూపిణీమ్ ॥

భావము : ఆ రావణుని భార్యలలో ఏకాంతమున ప్రత్యేకముగా నున్న గొప్ప శయ్యపై నిదురించుచున్న మఱియొక అపురూపమగు సౌందర్యవతిని బంగారు వన్నెతో ప్రకాశించున్నదియు, సుందరీమణియును, అంతఃపుర పట్టపు

రాణియగు మండోదరిని నిదురించుచుండగా హనుమంతుడు చూచెను.

శ్రీపాదుక : ఇచట ప్రత్యేకశయ్యపై నిదురించుచున్న రూపయౌవన సంపన్నురాలైన సుందరియొక్క శరీరకాంతిని, అవయవసౌష్ఠవమును హనుమంతుడు పరిశీలించి చూచుటలో – అతడు సంభావించిన సీతాసౌందర్య మామె యందున్నదా లేదా యను పరిశీలనమే తప్ప వేఱొకభావము లేదని తాత్పర్యార్థము. ఈ విషయము తరువాత శ్లోకముద్వారా తెలియును.

40) శ్లో ॥ స తాం దృష్ట్వా మహాబాహు ర్భూషితాం మారుతాత్మజః ।
తర్కయామాన సీతేతి రూపయౌవన సంపదా ॥

41) శ్లో ॥ హర్షేణ మహతాయుక్తో ననంద హరియూథపః ॥

భావము : పవన తనయుడగు హనుమంతుడు ఆ విధమైన రూపసంపద గల ఆమెను చూచి ఈమె సీతయగునేమోనని తలంచి మిక్కిలి ఆనంద పరవశడయ్యెను.

42) శ్లో ॥ ఆస్ఫోటయామాస చుచుంబ పుచ్ఛమ్
ననంద చిక్రీడ జగౌ జగామ
స్తంభా నరోహ న్నిపపాత భూమౌ
నిదర్శయన్ స్వాం ప్రకృతిం కపీనామ్ ॥
దృష్ట్వా సీతేతి హృష్టోఽభూ ద్దీన శ్చారిత్రదర్శనాత్ ॥

భావము : ఆయానంద పారవశ్యములో హనుమంతుడు గట్టిగా నేలను చరిచాడు. తన తోకను ముద్దుపెట్టుకుని ఆనందంతో ఆడుతూ గెంతుతూ, పాడుతూ, నర్తించాడు. స్తంభముపై కెక్కి క్రిందకు దూకాడు. ఈ విధమైన కోతిచేష్టలను సంతోషముతో మైమరచి చేసినాడట.

సీతను చూచినానను సంతోషముతో అతడావిధమగు సహజ స్వభావమును ప్రదర్శించెను, కాని ఆమె స్వభావమును గమనించిన వెంటనే దైన్యమును పొందెను.

శ్రీపాదుక : ఈ సందర్భములో రచయిత ఆనందరామాయణములోని సారకాండలో శివపార్వతుల సంవాద రూపముగా ప్రతిపాదింపబడిన మండోదరీ వృత్తాంతమును ప్రస్తావించుచున్నారు

పార్వత్యువాచ :

43) శ్లో ॥ కథం మండోదరీ సీతాసదృశీ రాక్షసీరితా ?

సీతాంశాంశాంశజాస్సర్వాః స్త్రియశ్చేతిశ్రుతం మయా ॥

భావము : పార్వతి పరమేశ్వరునితో – స్వామీ మండోదరి రాక్షస స్త్రీ కదా ! ఈమె సీతను పోలియుండుటెట్లు సంభవించినది? సర్వలోకములందలి స్త్రీలందరు సీతాంశచే సంభవించినారని నేను విన్నది నిజమేనా ? యని ప్రశ్నించెను.

శ్రీపాదుక : 'విద్యాస్సమస్తా స్తవ దేవి భేదాః । స్త్రియస్సమస్తా సకలా జగత్సు ॥ – అని మార్కండేయ పురాణములోని చండీదేవీమాహాత్మ్యమున చండీ మహావిద్యలో – స్త్రీ దేవతాకములైన మంత్రవిద్యలు సకల లోకములలోని స్త్రీమూర్తులు అందరూ ఆ మహాశక్త్యంశలేనని చెప్పబడినది.

పార్వతి పరిప్రశ్న దానికనుబంధించినదేనని గ్రహించాలి.

శ్రీశివ ఉవాచ :

సమాధానముగా శివుడు **మండోదరీ వృత్తాంతమును** నిట్లు చెప్పుచున్నాడు.

44) శ్లో ॥ శ్రుణుష్వ కారణం దేవి సీతేయం విష్ణునా చితా ।

తేనైన విష్ణునా పూర్వ మియం మండోదరీ చితా ॥

భావము : దేవీ సీతా మండోదరుల సాదృశ్యమునకు కారణము వినుము. సీతయు, ఈ మండోదరియు ఇరువురును శ్రీమహావిష్ణువు చేతనే సృజింపబడినారు.

45) శ్లో ॥ మామాహ రావణో వాక్యం దేహి మే ద్వౌ వరౌ ప్రభో !।

ఆత్మలింగం చ మన్మాత్రే పత్న్యర్థం పార్వతీం మమ ॥

భావము : ఒకప్పుడీ రావణుడు నన్ను రెండు వరములనడిగెను. మొదటిది ఆత్మలింగమును నా తల్లి కొరకు, రెండవ వరము–నాకు భార్యగా పార్వతిని అనుగ్రహింపుము అని యడిగెను.

46) శ్లో ॥ తత్తస్య వచనం శ్రుత్వా త్వం దత్తాసి గిరీంద్రజే !

దత్త్వాత్మలింగం సంప్రోక్తో మయా త్వం యది రావణ! ॥

47) శ్లో ॥ మార్గే లింగం భూమిసంస్థం కురుషే తర్హ్యహం పునః ।

నాగ్రే గచ్ఛామి తత్స్థానా త్తత్రైవ చ వసామ్యహమ్॥

భావము : పార్వతీ ! నేనాతడు కోరినట్లే నిన్నిచ్చి, నా ఆత్మలింగమును కూడ నిచ్చి యతనితో రావణా ! మార్గమధ్యమున ఈ లింగమును భూమిపై నుంచి నట్లయిన నేనాచోటి నుండి ముందుకు నీతో సాగను. నేనచ్చటనే యుండి పోయెదను. (నీవు నన్ను అచటి నుండి కదిలింపలేవని భావము) అని చెప్పితిని.

48) శ్లో ॥ తథేతి రావణ శ్చోక్త్వా దేవ్యా లింగేన సో యయౌ ।

తదా త్వయా స్మృతో విష్ణు స్తేనాంగం చందనాదినా ।

భావము : రావణుడట్లేయని అంగీకరించి నిన్నును, నా ఆత్మలింగమును తీసికొని బయలుదేరెను. ఆ సమయమున నీవు విష్ణువును స్మరించితివి. అప్పుడా విష్ణుమూర్తి చందనాదులతో మండోదరి యను స్త్రీని తయారుచేసి ఆ శుభాంగిని మయుని చేతిలో సమర్పించెను.

49) శ్లో ॥ కృత్వా మండోదరీనామ్నీ మయహస్తేఽర్పితా శుభా ।

తతో ద్విజ స్వరూపేణ విష్ణుః ప్రాహ దశాననమ్ ॥

50) శ్లో ॥ ప్రతారిత శ్శివేన త్వం దత్త్వా దుర్గాం తు కృత్రిమామ్ ।

పాతాళే మయ గేహే సా గోపితాస్తి శివేన హి ॥

భావము : తరువాత బ్రాహ్మణ వేషాన్ని ధరించి విష్ణువు రావణుని వద్దకు వచ్చి – 'రావణా ! నిన్ను శివుడు మోసం చేశాడు. అతడు నీకు పార్వతిని బదులు కృత్రిమమైన దుర్గ అనే శక్తి నిచ్చాడు.

50) సత్యమైన దుర్గాశక్తి (పార్వతి)ని పాతాళలోకంలో మయుని ఇంటిలో దాచిపెట్టినాడు అని చెప్పెను.

51) శ్లో ॥ తద్విప్రవచనం సత్యం మత్వా మా మేత్య వై పునః ।

విహస్య రావణః ప్రాహ జ్ఞాతం తేన్తర్గతం మయా ॥

52) శ్లో ॥ అర్పితా కృత్రిమా దేవీ మాతాం గోప్య రసాతలే ।

తవైవా స్త్వధునా చేయం త్వహం నేష్యామి గోపితామ్ ॥

భావము : రావణుడా బ్రాహ్మణుని మాటను నిజమని తలచి మరల నా వద్దకు వచ్చి అవహేళనగా నవ్వి నాతో – ఓ దేవా! నీ రహస్యమును (నీ మోసమును) నేను తెలిసికొంటిని. పాతాళంలో అసలైన దుర్గా శక్తిని దాచిపెట్టి నాకీ కృత్రిమ శక్తి నిచ్చితినవి (కావున) ఈమె నీ వద్దనే యుంచుకొనుము. నేనా దాచబడిన సత్యదుర్గనే తీసికొని పోయెదను.

53) శ్లో ॥ ఇత్యుక్త్వా త్వాం విసృజ్యాథ పాతాళం గంతు ముద్యతః ।
మార్గమధ్యే హ్యల్పశంకాగ్రస్తః ప్రాహ ద్విజం తదా ॥

భావము : అని చెప్పి నిన్ను నా వద్దనే విడిచిపెట్టి పాతాళమునకు ప్రయాణమయ్యెను. మార్గమధ్యములో అతనికి అల్పశంక (మూత్రశంక)కు పోవలసి బ్రాహ్మణరూపధారియగు విష్ణువుతో నిట్లనెను –

54) శ్లో ॥ ఆత్మలింగం క్షణే హస్తే గృహ్ణీష్వ వచనా న్మమ ।
ద్విజవేషధరో విష్ణు స్తదా ప్రాహ దశాననమ్ ॥

55) శ్లో ॥ అతిక్రాన్తే ముహూర్తేఽథ లింగం స్థాప్య వ్రజామ్యహమ్ ।
తథేతి రావణ శ్చోక్త్వా తత్కరే లింగ మర్పయత్ ॥

భావము : ఓ బ్రాహ్మణోత్తమా ! నా మాటను విని యీ ఆత్మలింగమును క్షణకాలము పట్టుకొనియుండుము అని పలికెను. అపుడా బ్రాహ్మణుడు రావణునితో క్షణ (ముహూర్త) కాలము గడచినచో ఈ లింగము నిచటనే యుంచి నా దారిని పోయెదనని పలికెను

55) రావణుడట్లే యని అంగీకరించి ఆ లింగమునతని చేతిలో నుంచి వెళ్ళెను. ఆ సమయమున నతనికి మూత్రము అఖండముగా వచ్చుచుండటచే ఆలస్యమయ్యెను.

56) శ్లో ॥ తతో మూత్రస్య ధారాఽఖండితాఽభూచ్చిరం ప్రియే ।
అతిక్రాన్తే ముహూర్తేఽథ లింగం సాగర రోధసి ॥

57) శ్లో ॥ పశ్చిమే స్థాప్య భూమాన్యం స యయౌ స్వీయస్థలం హరిః ।
ఏతస్మిన్నంతరే లింగశక్తి శ్శివ మగా త్తతః ॥

58) శ్లో ॥ అభూద్గర్తః కర్ణరంధ్రసదృశ స్తచ్ఛిరః స్థలే ।

భువః కర్ణోపమం లింగం గోకర్ణం త ద్వదంతి హి ॥

భావము : ముహూర్త కాలము గడచిపోయిన కారణముగా బ్రాహ్మణ రూపధారి యగు విష్ణువా లింగమును పశ్చిమ సముద్ర తీరమున భూమిపై నుంచి తన నివాసము (వైకుంఠము)నకు తరలిపోయెను.

ఇంతలో గోవు కర్ణరంధ్రము వంటి దొక రంధ్రము పడి దాని నుండి ఆ లింగమునందున్న శివుని శక్తి శివునికి లోనికి ప్రవేశించెను. (ఆ శివలింగ శిరో భాగమున)భూమిపై గోకర్ణాకృతిని పోలిన లింగమావిర్భవించిన కారణముగా నా క్షేత్రమును గోకర్ణక్షేత్రముగా వ్యవహరించుచున్నారు.

59) శ్లో ॥ తతః ఖిన్నమనా స్తూష్ణీం పాతాళం రావణో యయౌ ।

మయం సంప్రార్థయామాస దదౌ తాం రావణాయ సః ॥

భావము : పిమ్మట రావణుడు విచారగ్రస్త మనస్కుడై మిన్నక పాతాళమున కేగి, మయుని ప్రార్థించగా మయుడాతని కోరికను మన్నించి అతని వద్ద నున్న కన్యకను రావణునికిచ్చెను.

60) శ్లో ॥ తస్మా త్సీతాసమానేయం దృష్టా మండోదరీ ప్రియే ।

మండోదరీగర్భజా సా జానకీతి న వేత్సి కిమ్?॥

ఇతి శ్రీమద్రాయణ సారోద్ధారే సుందరకాండే చతుర్థ సర్గః

భావము : కావున మండోదరి సీతతో సమానరూపము కలదిగా హనుమంతునకు కనిపించినది. మఱియు ఓ దేవీ! సీత మండోదరీ గర్భము నుండి జనించిన విషయము నీకు తెలియదా? యేమి? అని శివుడు పార్వతికి మండోదరీ వృత్తాంతము తెలిపెను.

శ్రీపాదుక : ఆనందరామాయణములోని సారకాండములోని 9వ సర్గలో చెప్పబడిన యీ వృత్తాంతమును ప్రస్తావించి రచయిత హనుమంతుడు మండోదరిని చూచి సీతయని భ్రమించుటకు కారణమును తెల్పుటయే గాక – **"యౌవన సంపన్నాత్ర దర్శనేన సీతేతి విచారితవా నిత్యర్థః"** – కేవలము రూప యౌవన సంపదచేత మాత్రమే మండోదరి సీతకు సమానమైనది అని

వ్యాఖ్యానిస్తారు. అంతమాత్రమున మండోదరి శీలమును శంకింపరాదని చివరగా – ఉమా సంహితలోని దశమాధ్యాయములోని–

అహల్యా ద్రౌపదీ సీతా తారా మండోదరీ తథా ।

నిత్య యౌవన సంపన్నాః పంచకన్యా గుణాన్వితాః ॥

అహల్య, ద్రౌపదీ, సీత, తార, మండోదరియను నీ అయిదుగురు కన్యకలు నిత్య యౌవన గుణశీలములు కలవారను శ్లోకమునుదాహరించి మండోదరీ పాతివ్రత్యమును గూర్చియు ప్రస్తావించినారు.

ఇది శ్రీమద్రాయణ సారోద్ధార సుందరకాండమున నాలుగవ సర్గము

సర్గాంతశ్లోకసంఖ్య–(162+60=222)

హనుమంతుడు మండోదరిని చూచుట

పంచమ సర్గ

1) శ్లో ॥ అవధూయ చ తాం బుద్ధిం బభూవాస్థిత స్తదా ।
జగామ చాపరాం చింతాం సీతాం ప్రతి మహాకపిః ॥

భావము : అంతట వానరవీరుడగు హనుమంతుడు మండోదరినిచూచి సీతయని భ్రమించిన తన తలంపును కాదనుకొని మరల సీతనుగూర్చి వేఱొక విధముగా నాలోచింపసాగెను.

2) శ్లో ॥ న రామేణ వియుక్తా సా స్వప్తు మర్హతి భామినీ ।
న భోక్తుం నాప్యలంకర్తుం న పాన ముపసేవితుమ్ ।
నాఽన్యం నర ముపస్థాతుం సురాణామపి చేశ్వరమ్ ॥

భావము : రాముని వియోగముతో సాధ్వియగు సీత అన్న పానాలంకారములను సేవింపదు. పరపురుషుని దేవేంద్రునియంతటి వానినైనను పొందుట కిచ్చగింపదు.

3) శ్లో ॥ న హి రామ సమః కశ్చి ద్విద్యతే త్రిదశేష్వపి ।
అన్యేయ మితి నిశ్చిత్య పానభూమౌ చచార సః ॥

భావము : రామునితో సరియగు పురుషుడు దేవతలలోకూడ నుండడు. ఈమె తప్పక వేఱొక స్త్రీ అయియుండునని నిశ్చయించి, హనుమంతుడు సీతను వెదుకుటకై పానశాలవైపు వెళ్ళెను.

4) శ్లో ॥ మృగాణాం మహిషాణాం చ వరాహాణాం చ భాగశః ।
తత్ర న్యస్తాని మాంసాని పానభూమౌ దదర్శ సః ॥

భావము : అచట లేళ్ళ యొక్క దున్నపోతుల మఱియు అడవిపందుల యొక్క తినగా మిగిలిన మాంసావశేషములను పానభూమిలో అటనటవ్యస్తముగా పడియున్న వానిని హనుమంతుడు చూచెను.

5) శ్లో ॥ పానభాజనవిక్షిప్తైః ఫలైశ్చ వివిధైరపి ।
పానం శ్రేష్ఠం తదా భూరి కపి స్తత్ర దదర్శ హ ॥

భావము : పానపాత్రలయందుంచబడిన బహువిధములైన ఫలములతోడను అసంఖ్యాకములుగా నింపబడిన మంచి పానీయములను మద్యములనుకూడ వానరోత్తముడగు హనుమంతుడు చూచెను.

6) శ్లో ॥ క్వచి దర్ధావశేషాణి క్వచిత్పీతాని సర్వశః ।
క్వచి త్ప్రభిన్నైః కరకైః క్వచి దాలోళితైర్జలైః ॥

భావము : హనుమంతుడచ్చట నొకచోట త్రాగగా మిగిలిన మద్యపాత్రల నొకచోట, మఱియొక చోట పూర్తిగా త్రాగి విసిరివైచిన పాత్రలను కొన్నింటిని, వేఱొకచోట విసరుటచే పగిలిన కొన్ని పాత్ర శకలములను, ఇంకొక చోట కలియబెట్టిన జలములు కలవానిని చూచెను.

7) శ్లో ॥ దివ్యాః ప్రసన్నా వివిధా స్సురాః కృతసురా అపి ।
శర్కరాసవ మాధ్వీక పుష్పాసవ ఫలాసవాః ॥

భావము : హనుమంతుడు ఆ పానభూమిలో దివ్యములైన అనగా సముద్రమథన కాలములో తమకు తాముగా ఆవిర్భవించిన వారుణీ మొదలగు మద్యములను, కృత్రిమముగా శర్కరా, మధు, మాధ్వీకాదులచే, పుష్పముల మఱియు ఫలాదులతో తయారుచేయబడిన సిద్ధమద్యములను, బహువిధములైన పరిమళముల నీను సుగంధ చూర్ణములను (సుపారీలను) చూచెను.

శ్రీపాదుక : దివ్యమద్యములనగా – **"అమృతమథనోద్భూతాః । వారుణీ జాతీయాః"** అని వ్యాఖ్యానింపబడినవి. మాదకములగు శర్కరాదులచే తయారు చేయబడినవి.

శ్లో ॥ పానకం ద్రాక్ష మాధూకం ఖార్జూరం తాళమైక్షవమ్ ।
మధూస్థం శీధు మాధ్వీకం ఐరేయం నాళికేరజమ్ ॥

అనగా శర్కరాసము, ద్రాక్ష, ఇప్పపూల చేతను, ఖర్జూరము తాటిపళ్ళు, చెరుకు రసములచే తయారుచేయబడినని కృత్రిమ మద్యములుగా – అర్ణవమును గ్రంథములో పేర్కొనబడినవి.

8) శ్లో ॥ వాస చూర్ణైశ్చ వివిధైర్ఘృష్టా స్తైస్తైః పృథక్ పృథక్ ॥

భావము : ఉమాసంహితలోని 11వ అధ్యాయములో కూడ

మద్యశాలాం దదర్శాథ కూర్మ మయూర కుక్కుటాన్ ।

అర్ధార్థం భక్షితం చాపి దదర్శ స్ఫుటితం తదా ॥

హనుమంతుడా మద్యశాలలో సగము తిని వదిలివేయబడిన తాబేలు, నెమలి, కోళ్ళ మాంస ఖండములను చూచెను. అందులో కొన్ని సగభాగము మరికొన్ని నాలుగవ వంతు తిని వదలివేయబడినవని కూడ చెప్పబడినది.

శ్రీపాదుక– ఈ ప్రసంగములో రచయిత నృసింహావధాని గారు **"సురాపానం కథం చక్రే బ్రాహ్మణో రావణస్స్వయమ్?"** అనగా బ్రాహ్మణుడగు రావణుడు నిషిద్ధమగు సురాపానమును ఎట్లు చేసినాడనెడి సంశయమును ప్రకటించగా–

శివుడామెతో – శుక్రశాపాత్సురాదేవి సురాపానం న దుష్యతి ।

రాక్షసో రావణస్తస్మాత్ సురాపానం కరోతి వై ॥

అనగా దేవీ ! పూర్వము శుక్రాచార్యుని శాపకారణముగా మద్యపానము బ్రాహ్మణులకు దూష్యము కాకుండెను. రావణుడు రాక్షసప్రవృత్తి కలవాడు కావున మద్యమును సేవించుచుండెను అని సమాధానపరచుచు చెప్పినట్లు ప్రస్తావించేరు.

9) శ్లో ॥ ఏవం సర్వమశేషేణ రావణాంతఃపురం కపిః ।

దదర్శ సుమహాతేజా న దదర్శ చ జానకీమ్ ॥

భావము : ఈ విధముగా వానరోత్తముడగు హనుమంతుడు రావణాంతపురము నంతను కలియ వెదికెను. కాని ఆ తేజస్వి సీతను మాత్రమెచ్చటను చూడలేకపోయెను. (సీత అచట నతనికి కనబడలేదని భావము)

10) శ్లో ॥ భూమిగృహాం శ్చైత్యగృహాన్ గృహాతిగృహకానపి ।

ఉత్పతన్నిష్పతంశ్చాపి తిష్ఠన్గచ్ఛన్పునః పునః ॥

11) శ్లో ॥ అపావృణ్వంశ్చ ద్వారాణి కవాటా న్యవఘాతయన్ ।

ప్రవిశ న్నిష్పతంశ్చాపి ప్రపతన్నుత్పతన్నపి ॥

12) శ్లో ॥ సర్వమప్యవకాశం స విచచార మహాకపిః ॥

భావము : ఆ వానరోత్తముడగు హనుమ సీతనింకను వెదకుచు భూగృహములను, క్రీడా మందిరములను ఎత్తుగా నిర్మింపబడిన గద్దెలపైనను పైకెగసి క్రిందకు దూకుచు మరల మరల పరికించి వాకిలితలుపులను పగులగొట్టుచూ ఇండ్లలోనికిప్రవేశించి తిరిగి యటనుండి వెలుపకు ఎగురుచూ గెంతుచూ ఏ చోటును విడువకుండ సంచరించుచు వెదుకజొచ్చెను.

13) శ్లో ॥ చతురంగుళమాత్రోఽపి నావకాశ స్స విద్యతే ।
రావణాంతఃపురే తస్మి న్యం కపి ర్న జగామ సః ॥

భావము : నాలుగంగుళములమేరనుకూడ విడువక వానరోత్తముడగు హనుమంతుడా రావణాంతఃపురమందంతటను సంచరించెను.

14) శ్లో ॥ అనిర్వేదః శ్రియోమూల మనిర్వేదః పరం సుఖమ్ ।
భూయస్తావ ద్విచేష్యామి దేశాన్రావణ పాలితాన్ ॥

భావము : అనిర్వేదము అనగా ధైర్యముతో కూడిన ఉత్సాహము సర్వసంపదలకు, మఱియు సర్వసుఖములకు మూలకారణము. కావున, నిరాశచెందక ధృత్యుత్సాహములతో రావణునిచే పాలింపబడుచున్న ప్రదేశము లన్నింటిని వెదకి సీత జాడను కన్గొనెదను.

15) శ్లో ॥ ఇతి సంచిత్య భూయోఽపి విచేతు ముపచక్రమే ।
సంపరిక్రమ్య హనుమాన్ రావణస్య నివేశనాత్ ॥
అదృష్ట్వా జానకీం సీతామబ్రవీ ద్వచనం కపిః ॥

భావము : ఇట్లాలోచించి హనుమంతుడు మరల సీతను వెదకుటకు ప్రారంభించి, రావణుని భవనముపైకెక్కి నలుదిక్కులలో కలయజూచి సీత కనిపించకపోగా తనలో నిట్లనుకొనెను.

16) శ్లో ॥ పల్వాలాని తటాకాని సరాంసి సరితస్తథా ।
నద్యోఽనూప వనాంతాశ్చ దుర్గాశ్చ ధరణీ ధరాః ॥
లోళితా వసుధా సర్వా నతు పశ్యామి జానకీమ్ ॥

17) శ్లో ॥ ఇహ సంపాతినా సీతా రావణస్య నివేశనే ।

ఆఖ్యాతా గృధ్రరాజేన న చ పశ్యామి తా మహమ్ ॥

భావము : ఇచటనున్న నీటిపడియలు, చెఱువులు, సరస్సులు, సెలయేఱులు, నదులు, వాని తీరములలోనున్న ఉద్యానములు, చొఅశక్యముకాని ప్రదేశములు, పర్వతములు, అదియిది యననేల సర్వ భూభాగములను కలయజూచితిని కాని సీత కనబడలేదు.

పూర్వము సంపాతి సీత రావణుని భవనములోనున్నదని చెప్పగా వింటిని. కాని యిచట సీత కనబడకున్నదే ! అని విచారించెను.

హనుమంతుని నిర్వేదము

18) శ్లో ॥ కిం ను సీతాథ వైదేహీ మైథిలీ జనకాత్మజా ।

ఉపతిష్ఠేత వివశా రావణం దుష్టచారిణమ్ ॥

భావము : వైదేహి, మైథిలి, జానకీ యగు సీత, రావణునికి వశపడి దుష్టాచార పరాయణుడగు రావణుని సేవించునా! యేమి, (అనగానెట్టి పరిస్థితులలోను అతనికి వశపడి సేవింపదని భావము)

శ్రీపాదుక : ఇచ్చట సీత రావణుని సేవించునా ! అని చెప్పిన సరిపోవును. కాని హనుమ తలంపులో సీతయనగనే మైథిలి, వైదేహి, జానకీ అను మూడు తత్త్వములతనికి ప్రతిభాసించినవి. **సీతాశబ్దము** ఆమె యొక్క 'అయోనిజా'తత్త్వమును తెలియజేయును. ఆమె మనవలె లౌకికముగా యోనినుండి జన్మింపలేదు. ఆమె జన్మ అలౌకికము. అదియును దేహాభిమానమునకు అతీతమైనది అను తత్త్వమును **వైదేహి** అను విశేషణము తెలియజేయును. అటుపై ఆమెను మైథిలిగా తలంచినాడు. మిథిలా శబ్దమునకు **'మథ్యన్తే శత్రవః యస్యాం'** - అనగా శత్రువులు సమూలముగా నిర్మూలించబడు ప్రదేశము అని శబ్దకల్పద్రుమము. అట్టి మిథిలానగరపు భూమి నుండి సారభూతమైన శక్తిగా శత్రుసంహారిణీశక్తిగా ఆవిర్భవించినది కావున ఆమె **మైథిలి.** తరువాతి విశేషణము **జానకి,** జనకుని కుమార్తె. జనకునకే విదేహుడని పేరు. విదేహుడనగా దేహాభిమానము లేనివాడని భావము.

శరీరపోషణముకొరకే సంసారతాపత్రయ మనగా దానియందేమాత్రము ఆపేక్షలేని నిరీహుడు. వీతరాగుడు జనకుడు **"మిథిలాయాం ప్రదీప్తాయాం న మే కించిత్ప్రదహ్యతే"** అన్న నిరీహుడు జనకుడు. విదేహుడు. అతని పుత్రి వైదేహి ఏ విధమైన వాంఛాపేక్షలు లేనిది అని భావము. అట్టి నిర్మమ, నిరీహ అగు సీత రావణునకు వశపడుట అసంభవము అని నిర్ధారించుటకు హనుమంతుని స్ఫురణలో సీతయనగనే **వైదేహి, మైథిలి, జనకాత్మజా తత్త్వములు** ప్రతిభాసించనవి. ఏవంవిధ ప్రతిభాసమున్మేషము కలవాడు కనుకే హనుమ బుద్ధిమద్వరిష్ఠుడు!

19) శ్లో ॥ హా రామ! లక్ష్మణే త్యేవం హాఽ యోధ్యేతిచ మైథిలీ ।
విలప్య బహు వైదేహీ న్యస్తదేహా భవిష్యతి ॥

భావము : కాదు ! కాదు ! సీత హా ! రామా ! లక్ష్మణా ! అయోధ్యా అని పరిపరి విధములుగా పరితపించుచు తుదకు దేహము వీడియుండవచ్చును.

శ్రీపాదుక : సీతాతత్త్వమును పూర్తిగా తెలిసిన హనుమ ఆమె ఈ విధముగా పరితపించినట్లు తలంచుట సమంజసమా ! అని శంకింప నవసరము లేదు. ఒక విషయమును విచారించునప్పుడు ఊహాపోహలను తర్కింపవలసి యుండును. అట్టి అపోహయే ఇదియని తాత్పర్యార్థము.

20) శ్లో ॥ రామస్య ప్రియభార్యస్య న నివేదయితుం క్షమా ।
నివేద్యమానే దోషస్స్యా ద్దోషస్స్యాదనివేదనే ॥

21) శ్లో ॥ ఘోర మారోదనం మన్యే గతే మయి భవిష్యతి ।
ఇక్ష్వాకుకులనాశశ్చ నాశశ్చైవ వనౌకసామ్ ॥

22) శ్లో ॥ న చ శక్ష్యామ్యహం ద్రష్టుం సుగ్రీవం మైథిలీం వినా ।

భావము : భార్యనే మిక్కిలి ప్రియతమగానెన్ను రామునకీ విషయము నెట్లు తెలుపగలను. తెలిపినను, తెలుపకున్నను కూడ దోషమే యగును. నేనచ్చటికి మరలిపోయినచో గొప్పరోదన ధ్వని, ఏడ్పులు, పెడబొబ్బలు సంభవించును. ఇక్ష్వాకుకులనాశనము, వానర కులవినాశము కూడా సంభవించును.

సీతను చూడకుండ నేనెట్లు సుగ్రీవుని దర్శింపగలను? (ఏ విధముగను దర్శింపజాలనని భావము.)

23) శ్లో ॥ వానప్రస్థో భవిష్యామి హ్యదృష్ట్వా జనకాత్మజామ్ ।
చితాం కృత్వా ప్రవేక్ష్యామి సమిద్ధమరణీసుతమ్ ॥

24) శ్లో ॥ సమ్యగాపః ప్రవేక్ష్యామి నచేత్పశ్యామి జానకీమ్ ।
ఇదం మహర్షిభిర్దృష్టం నిర్యాణమితి మే మతిః ॥

25) శ్లో ॥కుత్రాఽయోధ్యా? క్వ రామో? దశరథవచనా ద్దండకారణ్యమాగాత్।
కోఽయం మారీచనామా కనకమయ మృగః? కుత్ర సీతాపహారః?
సుగ్రీవో నామ మిత్రం క్వ? జనకతనయాన్వేషణే ప్రేషితోఽహమ్।
యోర్థోఽసంభావనీయ స్తమపి ఘటయతి క్రూరకర్మా విధాతా ॥

భావము : సీతను సందర్శింపజాలకపోయిన నేను వానప్రస్థుడనయ్యెదను లేదా చితిని ప్రజ్వలింపచేసి అగ్ని యందు ప్రవేశించెదను లేదా జలప్రవేశము గావింతును. (నీటబడి ప్రాణములు వీడెదనని భావము) ఈ విధమైన దేహత్యాగము మహర్షుల విషయమున చూపట్టునని నా తలంపు.

ఆహా ! ఎక్కడి అయోధ్యాపురి! ఎక్కడి శ్రీరాముడు! అతడు దశరథునిమాటపై దండకారణ్యమున కేగుట ఏమి? బంగారులేడిగా వచ్చి సీతనపహరించిన ఆ మారీచుడను వాడెవ్వడు? సుగ్రీవునితో మైత్రి ఎట్లుగా సంభవించినది ! సంభవించినదిపో! సీతను వెదకుటకై నేనిట్లు పంపబడుట యేమి? ఇదంతయు క్రూరకర్మడగు విధాతవిధానము కదా!

శ్రీపాదుక : భోగభాగ్యములనన్నింటిని స్వచ్ఛందముగా విడిచిపెట్టి అడవులకేగి యచ్చట యాదృచ్ఛికముగా లభించు కందమూలాదులను తినుచు జీవనమును కొనసాగించు జీవన విధానమును వానప్రస్థముగా చెప్పబడినది.

'వానప్రస్థ'మనే పదానికి అడవికి బయలుదేరడమని అర్థం. పిల్లలు పెద్దవాళ్ళయ్యాక వారికి కుటుంబ భారం అప్పగించి తాము భారం. కాకుండా తమకు గాముగా భార్యతో కలసిగాని, భార్యనువారివద్ద ఆమె యిష్టము ప్రకారం విడచిగాని, అడవికి వెళ్ళి ఏకాంతములో తపోనియమములను పాటిస్తూ ధార్మిక జీవనమును గడపుట వానప్రస్థముగా –

యతీనాం ప్రశ్రమో ధర్మః – నియమో వనవాసినామ్ ।
దానమేవ గృహస్థానాం – శుశ్రూషా బ్రహ్మచారిణామ్ ॥

యతులకు కర్మసన్న్యాసము – వానప్రస్థులకు జితేంద్రియత్వ, విధ్యుక్త కర్మానుష్ఠానములు – గృహస్థులకు దానధర్మాచరణము – బ్రహ్మచారులకు గురుశుశ్రూష ధర్మములుగా చెప్పబడినవి. గృహస్థాశ్రమమును సక్రమముగా నిర్వర్తించిన తరువాత –

అథ విప్రో వనం గచ్ఛేత్ – వినా వా భార్యయా సహ ।

జితేంద్రియో వసేత్తత్ర – శ్రౌతాగ్నికర్మకృత్ ॥

యోగాభ్యాసరతో నిత్యం – స్థానాసన విహారవాన్ ।

హేమన్త గ్రీష్మ వర్షాసు – జలాగ్న్యాకాశ మాశ్రయేత్ ॥

అగ్నినాత్మని వైతానాన్ – సమారోప్య యథావిధి ।

అనగ్నిరనికేతస్స్యాత్ – మునిర్మూలఫలాశనః ॥

బ్రాహ్మణుడు తన భార్యతోగాని, భార్య గతించినచో తానొక్కడే గాని, అడవులకు పోయిజితేంద్రియుడై అంటే కామనలను పూర్తిగా విడనాడి, అక్కడ వేదోక్తములైన ధర్మనిష్ఠతో, యోగాభ్యాసనిరతుడై, శీత, వేసవి, వర్షాకాలములలో క్రమంగా జల, అగ్ని, ఆకాశములలో (ఆరు బయట నుండి) తపస్సు చేసుకోవాలి. అంటే శీతాకాలంలో పీకబంటి నీళ్ళలో నిలచి తపస్సు చేయాలి. వేసవిలో పంచాగ్ని మధ్యంలో తపమాచరించాలి. వర్షాకాలంలో ఆరుబయట వానకు తడుస్తూ ధ్యానం చేయాలి. ఇలా కఠినమైన తపశ్చర్యలతో నుండి తుదకు అగ్నులనన్నింటినీ తనలోనే సంభావించుకుని నిరాశ్రయంగా, నిర్మోహుడై కందమూలాదులను తింటూ జీవించాలి.

'వానప్రస్థో భవిష్యామి' – అన్నమాటకిదే అర్థం.

(పార్వతి ఇంతకన్నా కఠినమైన తపశ్చర్యతో కౌమారంలోనే శివుని మెప్పించిన వైనం కుమారసంభవ కావ్యంలో ఐదవ సర్గలో వర్ణించబడింది.)

"కుత్రాయోధ్యా...." అనెడి 25వ శ్లోకము హనుమద్రామాయణము లోనిది.

'ఇతిచింతయమానస్య....' అను తరువాతిశ్లోకము అగస్త్య రామాయణములోనిది అని అథోజ్ఞాపికలో సూచింపడినది.

26) **శ్లో ॥ ఇతి చింతయమానస్య వానరస్య మహాత్మనః ।**
బుద్ధియోగం దదౌ శ్రీమాన్ రామస్తస్య హృది స్థితః ॥

27) **శ్లో ॥ తదా బుద్ధ్వా కపి స్తత్ర హ్యేవం విధమమన్యత ।**
వినాశే బహవో దోషాః జీవన్ భద్రాణి పశ్యతి ।
తస్మాత్ప్రాణాన్ ధరిష్యామి ధ్రువో జీవితసంగమః ॥

భావము : ఈ విధముగా నాలోచించుచున్న మహాత్ముడగు ఆ హనుమంతునికి సదా అతని హృదయములో స్మరింపబడుచునున్న శ్రీరామచంద్రమూర్తి బుద్ధియోగమును అనుగ్రహించెను.

అపుడా వానరోత్తముడు తనలో –'వినాశము అనగా మరణించుటలో ఆత్మహత్యాది బహువిధ దోషములు కలుగును. బ్రతికియుండినచో తప్పక శుభములను చూడవచ్చును. కావున నేను ప్రాణముతో నుండెదను. జీవించి యుండినచో నిశ్చయముగా సీతా సమాగమసందర్శనములు పొందవచ్చును'. – అని తలంచెను.

28) **శ్లో ॥ ఏవం బహువిధం దుఃఖం మనసా ధారయన్ముహుః ।**
తతో విక్రమమాసాద్య ధైర్యవాన్కపికుంజరః ॥

29) **శ్లో ॥ రావణం వా వధిష్యామి దశగ్రీవం మహాబలమ్ ।**
కామమస్తు వృతా సీతా పత్యా చీర్ణం భవిష్యతి ॥

30) **శ్లో ॥ ధ్యానశోకపరీతాత్మా చింతయామాస వానరః ॥**

భావము : ఈ విధముగా పరిపరివిధములుగా పరితపించిన వానర శ్రేష్ఠుడగు హనుమంతుడు ధైర్యమును కూడగట్టుకొని మనస్సులో – ఏదియేమైనను మహాబలసంపన్నుడగు రావణుని వధించెదను. సీతను తప్పక శ్రీరాముడు వరింపగలడు. (తిరిగి పొందునని భావము.) ఈ విధముగా దుఃఖపరితప్తమనస్కుడైన హనుమ బహువిధములుగా చింతించెను.

31) **శ్లో ॥ అశోకవనికా చేయం దృశ్యతే యా మహాద్రుమా !**
ఇమా మధిగమిష్యామి న హీయం విచితా మయా ॥

భావము : మహావృక్షములు గల ఈ అశోకవనినిప్పుడే చేరుకొందును. ఇచ్చట నేను సీతకై అన్వేషింపలేదు.

32) శ్లో ॥ వసూన్రుద్రాం స్తథాఽఽదిత్యా నశ్వినౌ మరుతోఽపి చ ।

నమస్కృత్వా గమిష్యామి రక్షసాం శోకవర్ధనః ॥

33) శ్లో ॥ స ముహూర్త మివ ధ్యాత్వా చింతావగ్రథితేంద్రియః ।

ఉదతిష్ఠన్మహాతేజా హనుమాన్మారుతాత్మజః ॥

భావము : 'నేనిపుడష్ట వసువులను, ఏకాదశ రుద్రులను, ద్వాదశాదిత్యులను, సప్తమరుత్తులను, అశ్వినులనిరువురను తలచి నమస్కరించి, రాక్షసుల దుఃఖమును వర్ధిల్లచేయుటకై బయలుదేరెదనుగాక!' అని ఇట్లు క్షణకాలమాలోచించి, చింతాక్రాంత మనస్కుడై పవనతనయుడు మహాతేజస్వియునగు హనుమంతుడు పైకిలేచెను. ప్రయాణము నకుద్యమించెనని భావము.

34) శ్లో ॥ నమోఽస్తు రామాయ సలక్ష్మణాయ

దేవ్యై చ తస్యై జనకాత్మజాయై ।

నమోఽస్తు రుద్రేంద్ర యమానిలేభ్యః

నమోఽస్తు చంద్రార్కమరుద్గణేభ్యః ॥

భావము : 'లక్ష్మణునెడబాయక యుండు రామునకు నమస్కారము. జనక తనయయగు సీతమ్మకు ప్రణామము. రుద్ర, ఇంద్ర, యమ, వాయుదేవులకు జోహార్లు. సూర్య, చంద్ర మరుద్గణములకు నా కైమోడ్పులు.' అని కార్యసిద్ధికై అందరకు ముందుగా నమస్కరించెను.

శ్రీపాదుక : ఈ శ్లోకాన్ని కార్యసిద్ధికరమంత్రంగా, క్లేశనాశక మంత్రంగా కూడ చెప్పవచ్చు. ఇందులో హనుమ – 'నమోఽస్తు రామాయ' అని రామునకు ముందుగా నమస్కరిస్తాడు. అతని అహంకారం పూర్తిగా నిరాస్తమైంది. తనను పంపిన స్వామి గుర్తుకువచ్చాడు. సముద్రోల్లంఘనమునకు బయలుదేరినది మొదలు ఇంతవరకు ఆయన రామధ్యానం చెయ్యలేదు. అంతా తానే చేస్తున్నానని భావింపసాగాడు. ఎంత ప్రయత్నించినా సీతమ్మ జాడ తెలియలేదు.

ఇప్పుడిక తన వల్లకాదని అహంతను వీడి, రామచంద్రా! ఇది నా పని కాదు. నీ పని. దీనిని నీవే నన్ను నిమిత్తంగా చేసుకొని, నాచేత నీవే చేయించుకుని నన్నను(గ్రహించు. నీకు నమస్కారం. సదా నీడలా నిన్ను వెన్నంటి యుండే నీ తమ్మునికి నమస్కారం. ఎందుకంటే నీ యను(గ్రహాన్ని ఆయన ద్విగుణీకృతంచేసి సత్వరసిద్ధినను(గ్రహిస్తాడని భావం.

రెండవపాదంలో జనకనందినియైన సీతమ్మకు సమస్కరిస్తాడు. కారణం, ఇప్పటికి తెలిసిందాయనకు సీతమ్మ. వెదికితే కనబడేది కాదని. జనకునకు యాదృచ్ఛికంగా పొలం దున్నుతూ ఉంటే తనకు తానుగా ఆమె యతనికి దొరికింది. కాబట్టి ఆమె తన ఇచ్ఛానుసారం కనబడదలుచుకుంటే కనిపిస్తుందని (గ్రహించాడు స్వామి. అందుకే ఆమె దర్శనంలభించాలని (ప్రార్థనసూచకంగా సీతమ్మకు నమస్కరించాడని (గ్రహించాలి.

తరువాతి పాదంలో వేదం మహాబలసంపన్నులు, అతిభయంకరులుగా వర్ణించిన శూలపాణి, (రు(ద్రుడు), వ(జపాణి (ఇం(ద్రుడు), పాశపాణి (యముడు), మరియు తన తం(డి యగు (ప్రభంజనస్వామి (వాయుదేవుని) కార్యసిద్ధికోసమని నమస్కరించాడు.

చివరగా చం(ద, సూర్య, మరుద్గణములకు నమస్కరిస్తాడు. ఎందుచేతనంటే వారు చొరలేని (ప్రదేశము కాని, వారికి కనిపించని వస్తువుగాని, లోకములో నుండదు. కావున, వారు తప్పక సీతజాడను తెలియజేస్తారని వారికి నమస్కరిస్తాడు.

ఇలా ఈ శ్లోకం కార్యసిద్ధి నిచ్చు మహామం(త్రమే కాదు. ఘోర విపత్తారక మం(త్రం కూడ. ఎందుచేతననగా సీతమ్మయే గనుక కనిపించకుంటే, రాముడు రఘువంశము, అయోధ్య అంతా దుఃఖాకులితమై నశిస్తారు. అట్లే సు(గ్రీవుడు వానరులు అంతా దుఃఖోపహతులై (ప్రాణత్యాగం చేస్తారు. ఇంతటి మహావిపత్తు సంభవించకుండా స్వామిచేసిన సర్వా పన్నివారకమైన మం(త్రరాజంగా కూడా ఈ శ్లోకాన్ని సంభావించవచ్చు.

ఈ సందర్భంలో సారోద్ధారకర్త ఉమాసంహితలోని రెండవ అధ్యాయంలో (ప్రతిపాదించబడిన 'రామ' నామము యొక్క స్మరణ, కీర్తన,

జపధ్యానములకు సంబంధించిన విషయములను ప్రస్తావించిరి. కాని ప్రస్తుతము అవి అప్రస్తుతములని వానిని గ్రంథవిస్తరభీతిచే విడచుట జరిగినది. వలసినవారు మూలగ్రంథమును పరిశీలింపగలరు.

35) శ్లో ॥ స తేభ్యస్తు నమస్కృత్వా సుగ్రీవాయ చ మారుతిః ।
అవప్లుతో మహాతేజాః ప్రాకారం తస్య వేశ్మనః ॥

36) శ్లో ॥ అథామ్రవణ సంఛన్నాం లతాశత సమావృతమ్ ।
జ్యాముక్త ఇవ నారాచః పప్లువే వృక్షవాటికామ్ ॥

భావము : హనుమంతుడీ విధముగా సీతారామలక్ష్మణులకు, ఇంద్రాదులకు నమస్కరించి, ఆ రావణ భవనప్రాకారమునుండి ఒక్క ఉదుటున దట్టముగా వివిధ లతాపరివేష్టితములైన మామిడి తోపులు చుట్టునూ కల అశోకవనము లోనికి, బాగుగా లాగివిడువబడిన బాణమువలె శరవేగముతో ప్రవేశించెను.

37) శ్లో ॥ మార్గమాణో వరారోహాం రాజపుత్రీ మనిందితామ్ ।
సుఖప్రసుప్తాన్విహగాన్ బోధయామాస వానరః ॥

భావము : పవిత్రచరిత్రయగు జనకరాజపుత్రికై వెదకుచు (ఒక చెట్టునుండి వేఱొక చెట్టుపైకి దుముకుచు ప్రయాణించుటవలన) ఆ హనుమంతుడు అంతవరకు సుఖముగా ఆ చెట్లపై నిదురించుచున్న పక్షులను మేల్కొల్పుచున్నట్లుండెను. (ఆ పక్షులు అలజడికి మేల్కొని ఎగిరిపోవుచుండెనని భావము.)

38) శ్లో ॥ హనూమతా వేగమతా కంపితాస్తే నగోత్తమాః ।
పుష్పపర్ణ ఫలాన్యాశు ముముచుః పుష్పశాలినః ॥

39) శ్లో ॥ నిర్ధూత పత్రశిఖరాః శీర్ణపుష్పఫలద్రుమాః ।
నిక్షిప్త వస్త్రాభరణా ధూర్తా ఇవ పరాజితాః ॥

భావము : హనుమంతునిచే మహావేగముతో కదలింపబడుచున్న ఆ వృక్ష రాజములు పత్ర పుష్ప ఫలములను వర్షింపజొచ్చెను. (వాని యాకులు, పూలు, పండ్లు విరివిగా రాలిపోయెనని భావము). ఈ విధముగా రెమ్మలు, కొమ్మలు విఱిగి, పత్రపుష్పఫలములన్నియు రాలిపడిన ఆ చెట్లు మోడులై పాచికలాటలో పందెము నొడ్డి సర్వస్వమును కోలుపోయిన జూదరుల వలె ప్రకాశింపజొచ్చినవి.

40) శ్లో ॥ సురపాదపసంబాధం రత్నసోపానవాపికామ్ ।
నానాపక్షిమృగాకీర్ణాం స్వర్ణప్రాసాదశోభితామ్ ॥

41) శ్లో ॥ ఫలైరానమ్రశాఖాగ్ర పాదపైః పరివారితామ్ ।
దృష్ట్వా విస్మయమాపన్నః ప్రతివృక్షం మరుత్సుతః ॥

భావము : సురపాదపములనగా కల్పవృక్షములని యర్థము. కల్పవృక్షములు లెక్కకు మిక్కుటముగా క్రిక్కిరిసియున్నదియు, మణిసోపానములు కల దిగుడుబావులతోను, పలువిధములైన మృగపక్షిసంతతులచే పరివ్యాప్తమైనదియు, బంగారుభవనములతో శోభిల్లుచున్నదియు,

ఫలభారములచే వంగిన కొనకొమ్మలుగల చెట్లచే పరివేష్టింపబడినదియునైన ప్రతివృక్షమునందును ఇట్టి శోభలనాశ్చర్యముతో హనుమంతుడు చూచుచునుండెను.

శ్రీపాదుక : పాలకడలిని ద్రచ్చు సమయమున జనించిన సర్వకామదములైన కల్పవృక్షము, చింతామణియు ఒక్కొటొక్కటిగా మాత్రమే స్వర్గమునందున్నట్లు వర్ణింపబడినది. కాని అశోకవనిలో అట్టికల్పవృక్షములు, చింతామణులు కోకొల్లలుగా నుండినవి. కావుననే, హనుమంతుండంతటి ధీరుడుకూడ క్షణమాత్రమాశ్చర్యపరవశుడైనాడని గ్రహించాలి. (ఈ శ్లోకములధ్యాత్మ రామాయణములోనివిగా సూచింపబడినవి)

42) శ్లో ॥ అవేక్షమాణశ్చ మహీం సర్వాం తా మన్వవైక్షత ।
బహ్వాసన కుథోపేతాం బహుభూమి గృహాయుతామ్ ॥

43) శ్లో ॥ సర్వర్తుకుసుమైః రమ్యాం ఫలవద్భిశ్చ పాదపైః ।
పుష్పితానామశోకానాం శ్రియా సూర్యోదయప్రభామ్ ॥

44) శ్లో ॥ నందనం వివిధోద్యానం చిత్రం చైత్రరథం యథా ।
ప్రదీప్తామివ తత్రస్థో మారుతిస్సముదైక్షత ॥

అశోకవనవర్ణనము

ఇట్లాశ్చర్యముతో హనుమంతుడు అశోకవనభూమినంతను శ్రద్ధగా పరిశీలింపసాగెను. అచట నొకచోట బహువిధములైన ఆసనములు, దిండ్లు రత్నకంబళులు శోభిల్లుచుండెను.

వేఱొక ప్రదేశమన్ని ఋతువులలోకూడ విస్తారముగా పుష్పించి ఫలించు వృక్షములతోను, పుష్పించిన అశోకవృక్షసంపదచే సూర్యోదయప్రభను తలపించుచుండెను.

ఈ విధముగా హనుమంతుడు అటనట నిలచుచు, నందనవనమునుబోలిన అనేక ఉపవనములతోడను కుబేరుని ఉద్యానమైన చైత్రరథమునుమించిన చిత్రాతిచిత్రములైనశోభలతో ప్రకాశించుచున్న ఆయశోకవనిని తన్మయుడై తిలకింపసాగెను.

45) శ్లో ॥ స తత్ర మణిభూమీశ్చ రాజతీశ్చ మనోరమాః ।
తథా కాంచనభూమీశ్చ దదర్శ విచరన్ కపిః ॥

46) శ్లో ॥ వాపీశ్చ వివిధాకారాః పూర్ణాః పరమవారిణా ।
మహార్హైర్మణిసోపానై రుపపన్నా స్తతస్తతః ॥

47) శ్లో ॥ ముక్తాప్రవాళసికతాః స్ఫాటికాంతరకుట్టిమాః ।
కాంచనై స్తరుభి శ్చిత్రై స్తీరజై రుపశోభితాః ॥

48) శ్లో ॥ ఫుల్లపద్మోత్పలవనాః చక్రవాకోపకూజితాః ।
అమృతోపపమ తోయాభిశ్శివాభి రుపసంస్కృతాః ॥

49) శ్లో ॥ లతాశతై రావలితా స్సంతాన కుసుమావృతాః ।
నానాగుల్మావృతఘనాః కరవీరకృతాంతరాః ॥

భావము : వానరోత్తముడగు హనుమంతుడా యశోకవనములో విహరించుచు అచ్చట కొన్ని రత్నభూములను, బంగారు, వెండి నేలలను చూచెను. ఇంకను–

స్వచ్ఛమైనజలభరితములైన బహువిధాకృతులలో నిర్మించబడినవియు, రత్నమయ సోపానములుకల దిగుడుబావులను,

ముత్యములు, పగడముల నేలపై స్ఫాటికమణి కుట్టిమములతో ఒడ్డున చిత్రవిచిత్రములైన కాంచనవృక్షములను (బంగారుచెట్లను) చూచెను.

ఆ నడబావులయందు, వికసించిన పద్మషండములను అమృతముతో సమానమైన పవిత్రజలములతో, చక్రవాకపక్షుల కలకూజితముతో నొప్పారు వానినిగాంచెను.

ఆ బావుల చుట్టును వందలాదిగానల్లుకొనిన కల్పలతికలతో కూడిన పొదలను, ఇవి నడబావులని గుర్తుపట్టుటకు వీలుగా తీరమువెంబడి నాటబడిన గన్నేరుచెట్లను చూచెను.

50) శ్లో ॥ దదర్శ హరిశార్దూలః రమ్యం జగతి పర్వతమ్ ।

దదర్శ చ నగా త్తస్మా న్నదీం నిపతితాం కపిః ॥

భావము : మరియునచ్చట అతిలోకసుందరమగు ఒక కృత్రిమక్రీడాపర్వతమునుకూడ చూచెను.

51) శ్లో ॥ అంకాదివ సముత్పత్య ప్రియస్య పతితాం ప్రియామ్ ।

జలే నిపతితాగ్రైశ్చ పాదపై రుపశోభితామ్ ॥

52) శ్లో ॥ వార్యమాణామివ కృద్ధాం ప్రమదాం ప్రియబంధుభిః ।

పునరావృత్తతోయాం చ దదర్శ స మహాకపిః ।

ప్రసన్నామివ కాంతస్య కాంతాం పునరుపస్థితామ్ ॥

భావము : ఆ కొండపైనుండి ప్రియుని యొడినుండి విడివడి క్రిందకు పరుగిడుచున్నది వలె నున్నదియు,

అట్లే జలములందుపడి తేలుచున్న కొమ్మలుగల వృక్షములచే శ్రేయోభిలాషులగు ఆప్తులగు బంధుజనములచే వారింపబడినది వలె,

మరల వారి బోధనచే కోపమును వీడి కాంతుని అంకమును చేరిన ప్రియురాలివలె వెనుకకు మరలినప్రవాహము కల ఒక నదిని ఆ వానరోత్తముడైన హనుమంతుడు చూచెను.

శ్రీపాదుక : ఈ వర్ణనములో హనుమంతుడు చూచిన యొక నదీమతల్లికి ముందుగా కొండపైనుండి మహావేగముతో క్రిందకు బాకుచు, క్రిందనున్న మహావృక్షశాఖల అవరోధముచే శాంతించి, అచటి చరియలను ఢీకొని వెనుకకు మరలుచున్న దృశ్యమును చూచెను.

ఇదే విషయమును కాళిదాస మహాకవి – **"మార్గాచల వ్యతికరాకులితేవ సింధుః"** వేగముగా ప్రవహించుచున్న నది, మార్గమున కడ్డు నిలిచిన కొండను ఢీకొని (న యయౌ నతస్థౌ) మరల వెనుదిరుగుచు ముందుకు సాగలేక, అట నిలువజాలకయున్నట్లు వర్ణించెను.

ఈ నదీవర్ణనములో ప్రణయకోపముచే ప్రియుని అంకమును వీడి, ఆప్తుల బోధనలచే ననునయింపబడి, మరల ప్రియుని చెంతకుచేరిన ఒక కలహాంతరిత నాయికయొక్క ప్రవృత్తి సమాసోక్త్యలంకారము ద్వారా తెలియజేయబడినది. ఇది సుందరకాండములోని శబ్దార్థాలంకార సౌందర్యమునకుదాహరణముగా చెప్పవచ్చును.

53) శ్లో ॥ ప్రాసాదై స్సుమహద్భిశ్చ నిర్మితైర్విశ్వకర్మణా ।

భావము : అచట విశ్వకర్మ నిర్మితములైన గొప్ప భవంతులనడుమ, బహువిధములైన మృగములు తిరుగాడు చిత్రవర్ణములు కల

54) శ్లో ॥ వివిధైర్మృగ సంఘైశ్చ విచిత్రాం చిత్రకాననామ్ ।
సచ్ఛత్రా స్సవితర్దీకా స్సర్వా స్సౌవర్ణవేదికాః ॥

భావము : ఉపవనములతో కూడి మధ్య భాగమున వితానములు, ఛత్రములు, స్వర్ణవేదికలతో శోభిల్లుచున్న చక్కని దివ్యమైన దిగుడుబావిని చూచెను.

55) శ్లో ॥ తేషాం ద్రుమాణాం ప్రభయా మేరోరివ దివాకరః ।
అమన్యత తదా వీరః కాంచనోఽ స్మీతి వానరః ॥

భావము : మేరు పర్వత కాంతి ప్రతిఫలించుటచే సూర్యుడెట్లు స్వర్ణవర్ణముతో భాసించునో అట్లే ఆ స్వర్ణవృక్షముల కాంతులచే హనుమ తననుకూడ స్వర్ణస్వరూపుడైనట్లుగా తలంచెను.

56) శ్లో ॥ తాం కాంచనై స్తరుగణైర్మారుతేన చ వీజితామ్ ।
కింకిణీ శతనిర్ఘోషాం దృష్ట్వా విస్మయ మాగమత్ ।
కాంచనీం శింశుపా మేకాం దదర్శ హరియూథపః ॥

భావము : వానరవీరుడగు హనుమంతుడా అశోకవన మధ్యమునందు బంగారు రంగారు చెట్లతో నొప్పుచున్నదియు, గాలికి కదలాడుచున్న బంగారు (క్వణత్కింకిణీ నినాదములు) చిఱుగంటల సవ్వడులు కలదియు నగు ఒక శింశుపా వృక్షమును చూచెను.

శ్రీపాదుక : అశోకవని – శింశుపావృక్షములనే రెండు పదాలను గుఱించి కొద్దిగా తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

అశోకవనంలో శింశుపావృక్షంక్రింద సీతమ్మ కూర్చునియున్నదని శ్రీమద్రామాయణం. ఇదేదో కథలో ఒక సన్నివేశం అని మనం యథాలాపంగా భావించి వదిలేస్తున్నాం. దీన్ని గుఱించి నిశితంగా ఎప్పుడైనా ఆలోచించామా? లేదు. సరిహద్దు గోడలో ఒక అరంగుళం జాగా కోసం తలలుపగులకొట్టుకునే మనం జాతి సంపద వారసత్వాలను గుఱించి క్షణకాలమైనా ఆలోచించం. అది మన స్వభావం. ఏ దొఱగారో ఏదీ తెలియని పేర్లతో చెబితే ఆహా అని నోరెళ్ళ వెట్టుకొని అప్పుడు దాన్ని గుఱించి సంభావిస్తాం. సరే !

అశోకవృక్షం యొక్క శాస్త్రీయనామం Saraca Asoca. శింశుపావృక్షం యొక్క శాస్త్రీయ నామం Dalbergiasisso. వాల్మీకి మహర్షితత్త్వజ్ఞుడు. మేధావియైన రావణబ్రహ్మ సీతాదేవికి ఉచితమైన స్థానంగా అశోకవనిని నిర్ధారించాడు. **"అశోకైః శోకనాశనైః"** అని వృక్షవాటికను అశోకవృక్ష బాహుళ్యము కలదిగా వర్ణిస్తాడు. సీతాదేవి దుఃఖార్త, వివశ. ఆమె పరాప్రకృతి. కావున ఆమెకు నివాసముగా ప్రాకృతముగా, సుందరమైన, శోకనాశనకర వనస్పతులుకల అశోకవనంలో ఉంచాడని వర్ణిస్తాడు.

మనం రోడ్ల ప్రక్క చూసే అశోకవృక్షాలు Polathea Longgifolia అనే తెగకు చెందినవి.

ఇలా విని, 'మనం చూస్తున్న అశోకం కన్నాభిన్నమైనది మఱొకటి ఉందిలే' అని సరిపెట్టుకొనే బద్ధకిష్టి అలసుడు లేదా సోమరి. ఈ విషయమై జిజ్ఞాసతో ప్రశ్నించేవాడు మధ్యముడు. పరిశోధించేవాడు ఉత్తముడు. పరిశోధించి అసలైన అశోకాన్ని కనుగొని పెంచి ఇది అశోకమని సప్రమాణంగా నిరూపించి లోకానికి చూపించేవాడు ఉత్తమోత్తముడు అటువంటి వాణ్ణి ధీరుడుగా పరిచయం చేస్తాడు భర్తృహరి.

ప్రాణులలో పరిణామసిద్ధాంతాన్ని నిరూపించినట్లే వృక్షజాతుల పరిణామ సిద్ధాంతాన్ని వరాహమిహిరుడు వంటి శాస్త్రవేత్తలు, పురాణకర్తలు ప్రతిపాదించారు. దీనిని పనికిమాలినదిగా వామపక్షీయులు, భస్మాసుర 'హస్త' సంతతిగల నాయకులు సెక్యులర్ పక్షులుగా బిట్టరచి ఘోషించి మరగునపరచే ప్రయత్నం చేస్తున్నారు సరే. తెల్లదొరచెప్పిన పరిణామసిద్ధాంతాన్ని నెత్తికెక్కించుకొని మోస్తున్న మనం మన పురాణశాస్త్రవేత్తలు చెప్పిన

'అవతారవాద పరిణామసిద్ధాంతాన్ని' – అంగీకరించే సాహసంగాని, ప్రచారంచేసే పాపం గాని చెయ్యడానికి చెయ్యం. అది మన నైజం.

వరాహమిహిరుడు వృక్షజాతిని చెట్లు, గుల్మములు. లతలు అని వర్గీకరించాడు. వాయు పురాణం కథారూపంలో వృక్షసంతతిని కూడా కశ్యపప్రజాపతి సంతానంగానే వర్ణించింది. ఇలా (ఆమెయే ఇల) అనే ఆమెకు – లత, వల్లి, విరుద్ధ అని ముగ్గురు సంతానమనిన్నీ, వీరిలో లతకు వనస్పతులు అంటే పూవులు పూయనివి, మఱియు వృక్షములు అనగా పుష్పఫలములనిచ్చేవి జన్మించాయనిన్నీ చెప్పబడింది. వల్లి అనే రెండవ కుమార్తెకు గుల్మములు (గుబురుగా పెరిగే పొదలు) తృణ (గడ్డి)జాతి మొక్కలు జన్మించాయి. విరుధ అనే ఆమెకు లతా ప్రతానములు చెట్లను చుట్టి వాని నాశ్రయించి జీవించే తీవలు పుట్టినట్లు వర్ణించింది.

ఇంకా, మన సాహిత్యంలో మాట్లాడే చెట్లు, వరాలిచ్చే చెట్లు, ఎగిరే చెట్లు, శపించే చెట్లు ఇలా ఎన్నెన్నో గొప్ప గొప్ప మాహాత్మ్యముగల వృక్షసంతతులు వర్ణించబడినాయి. ఇలాంటివే దుఃఖార్తులను ఓదార్చి ఉపశమనాన్ని కలిగించే చెట్లు అశోకవృక్షాలు. వానిని "అశోకాః శోకనాశనాః" అని వర్ణిస్తారు మహర్షి. శ్రీరామ వియోగదుఃఖముచే సీత మరణించకుండా సంవత్సరకాలం ఆనందంగా జీవించి తుదకు తనను వరించాలనే భ్రమతో రావణబ్రహ్మ ఆమెని అశోకవనంలో శింశుపావృక్షంక్రింద ఉంచాడని గ్రహించాలి.

పద్మపురాణంలో అశోకం శోకనాశనకరమనిన్నీ, శింశుపావృక్షం దేవవేశ్యలను వశపరుస్తుందనిన్నీ చెప్పబడినట్లు చెబుతారు. ఇచ్చట దేవతాంగనలచే సీతమ్మ సేవించబడుతూ దుఃఖమును సహిస్తూ నివసించినదని గ్రహించాలి. శింశుపావృక్షం ఇరుగుడు చెట్టుగా కోశములలో చెప్పబడినది. జ్యోతిశ్శాస్త్రంలో శింశుపావృక్షాన్ని మకరరాశికి చెందినగా పేర్కొనబడినట్లు చెబుతారు.

ఇతి శ్రీరామాయణ సారోద్ధారే పంచమ స్సర్గః

ఇది శ్రీమద్రామాయణ సారోద్ధార సుందరకాండమున ఐదవ సర్గము

సర్గాంతశ్లోకసంఖ్య–(222+56=278)

షష్ఠస్సర్గః

1) శ్లో ॥ సపుష్పితాగ్రాం రుచిరాం తరుణాంకుర పల్లవామ్ ।

తా మారుహ్య మహాబాహు శ్శింశుపాం పర్ణసంవృతామ్ ।

ఇతో ద్రక్ష్యామి వైదేహీం రామదర్శనలాలసామ్ ॥

భావము : మహాబాహుబలసంపన్నుడైన హనుమంతుడు లేచిగుఱుటాకులచేతను, అరవిచ్చుకొనుచున్న పూలచేతను శోభిల్లుచున్న శింశుపావృక్షము (ఇరుగుడు చెట్టు)ను అధిరోహించి 'ఇచ్చటి నుండి రాముని దర్శించుటకువ్విళ్లూరుచున్న సీతమ్మను చూచెదను గాక!' అని తలంచెను.

2) శ్లో ॥ యది జీవతి సా దేవీ తారాధిపనిభాననా ।

ఆగమిష్యతి సాఽవశ్య మిమాం శివజలాం నదీమ్ ॥

3) శ్లో ॥ ఇయం చ నళినీ రమ్యా ద్విజసంఘనిషేవితా ।

రామస్య దయితా భార్యా జనకస్య సుతా సతీ ॥

4) శ్లో ॥ సంధ్యాకాలమనా శ్యామా ధ్రువ మేష్యతి జానకీ ॥

భావము : చంద్రవదన యగు సీతాదేవి జీవించియున్నట్లైన ఆమె తప్పక ఈ పవిత్రజలములు కల నది వద్దకు రాగలదు (వచ్చి తీరునని భావము). ఏలన,

ఈ నది పద్మసంపదచేత సుందరముగా ప్రకాశించుచున్నది మఱియు పక్షిసమూహములచే సేవింపబడుచున్నది.

రాముని ప్రియభార్యయు, జనకసుతయునగు సీతామహాసాధ్వి సంధ్యావందనతత్పరురాలు కావున నిశ్చయముగా ఈ ప్రదేశమునకు వచ్చును.

శ్రీపాదుక : సంధ్యాకాలమనాః – అనుపదము –

' సంధ్యాకాలే మనోయస్యాః సా – తథా – సంధ్యావందన తత్పరేత్యర్థః' అని వ్యాఖ్యానించబడినది. **'అహరహ స్సంధ్యాముపాసీత'** అని శ్రుతి.

5) శ్లో ॥ సవీక్షమాణ స్తత్రస్థో మార్గమాణశ్చ మైథిలీమ్ ।

అవేక్షణశ్చ మహీం సర్వాం తా మన్వవైక్షత ॥

6) శ్లో ॥ అశోకవనికాయాం తు తస్యాం వానరపుంగవః ।
స దదర్శావిదూరస్థం చైత్యప్రాసాద ముత్తమమ్ ।
మధ్యే స్తంభసహస్రేణ స్థితం కైలాసపాండురమ్ ॥

భావము : వానరోత్తముడగు హనుమ అచ్చటనేయుండి సీతనన్వేషించుచు అశోకవనినంతను చుట్టునూ పరిశీలించుచునే, భూభాగమునంతను పరీక్షగా పర్యవేక్షింపసాగెను. ఇంతలో –

అతనికా యశోకవనియందు సమీపములో వేయిస్తంభములతో విరాజిల్లుచున్న కైలాసపర్వతమువలె తెల్లనికాంతితో ప్రకాశించుచున్న చైత్యప్రాసాదము కనిపించెను.

శ్రీపాదుక : చైత్యమనగా బౌద్ధులు ధ్యానము కొరకు ఏర్పరచుకొన్న విశాలమైన భవంతి. అది ఒక పెద్దహాలువలె బహుస్తంభములిరువైపులనుండి ఆంతరమున బుద్ధునిప్రతిమ విరాజిల్లుచుండును.

వాల్మీకికాలములో ఈ విధమైన బౌద్ధమందిరములుండెడివి. అయోధ్యాపురోపకంఠములోనిట్టి భవంతులున్నట్లు వర్ణింపబడినది. రావణుడుకూడ చైత్యప్రాసాదమువంటిదానినొకదానిని రజితకాంతిలో మిరుమిట్లుకొల్పుచున్న దానిని నిర్మించియుండెనని తలంపవచ్చును.

రావణుడు తనభవనమును విలాసవంతముగా నిర్మించుకున్నను, సీతనుమాత్రము పవిత్రమైన వాతావరణములో నుంచినాడని భావము.

సీతాసందర్శనము
(హనుమంతుడు సీతను చూచుట)

7) శ్లో ॥ తతో మలిన సంవీతాం రాక్షసీభి స్సమావృతామ్ ।
ఉపవాసకృశాం దీనాం నిశ్వసన్తీం పునః పునః ॥

8) శ్లో ॥ దదర్శ శుక్లపక్షాదౌ చంద్రరేఖామివామలామ్ ।
గ్రహేణాంగారకేణైవ పీడితామివ రోహిణీమ్ ॥

9) శ్లో ॥ ప్రియం జన మపశ్యన్తీం పశ్యన్తీం రాక్షసీగణమ్ ॥

10) శ్లో ॥ నీలనాగాభయా వేణ్యా జఘనం గతయైకయా ।
నీలయా నీరదాపాయే వనరాజ్యా మహీమివ ॥

11) శ్లో ॥ తాం స్మృతీమివ సందిగ్ధాం ఋద్ధిం నిపతితామివ ।
విహతామివ చ శ్రద్ధాం ఆశాం ప్రతిహతామివ ॥

12) శ్లో ॥ సోపసర్గాం యథా సిద్ధిం బుద్ధిం సకలుషామివ ।
ప్రభూతేనాపవాదేన కీర్తిం నిపతితామివ ॥

13) శ్లో ॥ ఆమ్నాయానా మయోగేన విద్యాం ప్రశిథిలామివ ।
తస్య సందిదిహే బుద్ధి ర్మహుస్సీతాం నిరీక్ష్య తు ॥

14) శ్లో ॥ దుఃఖేన బుబుధే సీతాం హనుమాననలంకృతామ్ ।
సంస్కారేణ యథా హీనాం వాచ మర్థాంతరం గతామ్ ॥

భావము : పిమ్మట మలినవస్త్రములను ధరించినదియు, రాక్షసస్త్రీలచే చుట్టుముట్టబడి యున్నదియు, ఉపవాసములచే మిక్కిలికృశించినదియు భారముగా మాటిమాటికి నిట్టూర్చుచున్నదియు–

శుక్లపక్షపాడ్యమినాటి చంద్రరేఖవలె, నిర్మలముగా ప్రకాశించుచున్నదియు, అంగారకగ్రహముచే పీడింపబడిన రోహిణీనక్షత్రము వలె వెలవెలవోవుచున్నదియు,

నెన్నడుమువరకు కటిప్రదేశమును తాకుచూ వ్రేలాడుచున్న నల్లత్రాచును పోలిన వేణీబంధము కలదియు,

మేఘములు నిర్గమించిన పిదప శరదృతువులో నల్లనికాంతితో నొప్పారు వనపంక్తులతో శోభిల్లు భూమివలెనున్నదియు నగు సీతను,

సందిగ్ధార్థమును అస్పష్టముగా సూచించుచున్న స్మృతివలె, చేజారి పోవుచున్న సంపదవలె, ప్రతిహతమైన శ్రద్ధ లేదా ఆస్తిక్యబుద్ధి వలె, భగ్నమైన ఆశవలె, విఘ్నోపహతమైన కార్యసిద్ధివలె, కాలుష్యముతో కూడిన బుద్ధి వలె, మిక్కుటమగు లోకాపవాదముచే చెడిన కీర్తివలె, ఆవృత్తులు లేక శిథిలమైన విద్యవలెనున్న సీతమ్మనుచూచిన హనుమంతుడు, వ్యాకరణాలంకార సంస్కారములు లోపించినకారణముగా వేఱొక అర్థస్ఫూర్తిని కలిగించువాక్కువలె రూపాంతరమునుపొందిన యామెను అతికష్టముపై సీతయని తెలిసికొనెను.

శ్రీపాదుక : ఉపవాసకృశాం – అను పదమును వ్యాఖ్యానించు సందర్భంలో శ్రీమదాంధ్రవాల్మీకిరామాయణకర్త యగు వావికొలను సుబ్బారావుగారు (వాసుదాస స్వామి) – 'ఆహారము కొంచమైన లేదనుటచే కిష్కింధాకాండ మందు ఇంద్రుడు పాయసమిచ్చెనను' కథ కల్పితము – అని దానిని ప్రక్షిప్తముగా పేర్కొనినారు.

ఈ పదానికి రెండు విధాలుగా అర్థాన్ని సంభావించవచ్చు. ఇంద్ర సమర్పితమైన పాయసాన్ని సీతమ్మ నిత్యమూ తలచినంతనే తనకు సాక్షాత్కరించిన శ్రీరామచంద్రమూర్తికి సమర్పించేది. ఆయన స్వీకరించినట్లు భావించి సంతోషించేది. సంతోషము సగము బలమను నానుడిని బట్టి ఆమె శ్రీరామ వియోగమును భరించుచున్నది. ఈ విధమైన ఉపవాసముచే నామె కృశించినదని భావము.

ఉపవాసశబ్దమునకు –

'ఉపావృత్తస్తు పాపేభ్యః । యస్తువాసో గుణైస్సహ।

ఉపవాసస్స విజ్ఞేయః న తు కాయస్య శోషణమ్' – అనగా పాపముల నుండి, పాపపుటాలోచనలనుండి వైదొలగుట, సద్గుణములలోను, సజ్జనులతోను సదా వసించుట **ఉపవాస**మనబడును. కాని శరీరసంశోషణము మాత్రము కాదని అర్థము. విడనాడ వలసిన పాపసంసర్గమే తన చుట్టునుండుట చేతను వసింపదగిన సజ్జనులు త్రిజట, విభీషణసతి వంటి వారొకరిద్దరే యుండుట చేతను సీత వారిఉపవాసముచే కృశించినది నీరసించినదని కూడ భావింపవచ్చును.

తరువాత సీతను శుక్ల పక్షాదిలో ప్రకాశించు ప్రతిపచ్చంద్ర రేఖ వలె అనగా పాడ్యమినాడు రేఖామాత్రముగానున్న చంద్రకళవలె చూచినాడని వర్ణింపబడినది.

శుక్లపక్ష పాడ్యమినాడు రేఖామాత్రముగా నుదయించు చంద్రునికి ప్రజలు నమస్కరిస్తారు. ఈ విషయాన్ని కాళిదాసు **"ప్రతిపచ్చంద్ర మివ ప్రజాః"** అని సంభావిస్తాడు. పాడ్యమిచంద్రుడు దినదినాభివృద్ధి చెందుతూ ఉంటాడు. కావున నమస్కార్యుడు అట్లే సీత కూడ కృశించినట్లు దీనముగా కనిపించినను

హనుమంతుని సమాగమానంతరము మరల దైన్యమునువీడి ఆనందింపగలదనే భవిష్యదర్థమును శుక్లపక్షాదిలోని ప్రతిపచ్చంద్రోపమానము తెలియజేయును. ఇది రామాయణములోని రచనాశిల్పరమణీయకతకు చక్కని ఉదాహరణము.

ఆమె నల్లని వేణీబంధమును కృష్ణసర్పముగా హనుమ గాంచినాడు. దానినిపట్టి తెచ్చిన రావణుడా సర్పముచే తప్పక కాటువడి మరణించునను సూచన కానవచ్చును. మరియు సాధకులకది ప్రచ్ఛన్నయగు కుండలినిగా దర్శనమిచ్చును.

ఆమె సందిగ్ధమైన స్మృతివలెనున్నదట. స్మృతులంటే ఇచట మన్వాదిస్మృతులను భావించాలి. సీతమ్మ స్మృతిరూపమే. కాని ఈ రూపంలో అవునా? కాదా? అని సందిగ్ధంగా కనిపిస్తున్నదని భావం.

శ్రద్ధ అంటే ఆస్తిక్యబుద్ధి. లేదా విశ్వాసం. అది ప్రహతమైనది. దాని వలన సిద్ధికి విఘ్నమేర్పడింది. దానివల్ల బుద్ధి కలుషితమైంది. బుద్ధి స్వరూపిణియైన సీత రావణస్పర్శ వల్ల కలుషితమైనదని భావించాలి.

ఆమె అసత్యవాదంవల్ల పతితమైన కీర్తిలా ఉంది. ఆమె యశస్స్వరూపిణి. రామ వియోగాన్ని పొందింది. దానికి కారణమైనవాడు తప్పక పతితమై తీరుతాడు.

ఇంకా ఆమె ఆవృత్తులయోగంలేని విద్యలా ఉంది. అమ్మ సీతమ్మ శ్రీవిద్యాస్వరూపిణి. శ్రీవిద్యాసంప్రదాయంలో పూర్వ, దక్షిణ, పశ్చిమోత్తరఊర్ధ్వఅనుత్తరములని షడామ్నాయాలున్నాయి. అవి ఉపాస్యదేవతాస్వరూపాన్నిబట్టి భిన్నభిన్నంగా లలితాశ్యామలేత్యా-ద్యామ్నాయములుగా దర్శనమిస్తాయి. ఈ ఆమ్నాయషట్కంతో యోగంలేకుంటే శ్రీవిద్య శిథిలమైనట్లుంటుంది. కాని దానికి పూర్తిగా నాశమనేది లేదని గ్రహించాలి. విద్య ఒకప్పుడు సాధకునిలో అదృశ్యమవుతూ వానిని క్షీణింపజేస్తుంది. వివేకముకల సాధకుడు తనలో విద్య క్షీణిస్తున్నదని గ్రహించి, అది పూర్తిగా అదృశ్యమయ్యేలోగా దానిని శ్రద్ధగా ఉపాసిస్తాడు. ఇక్కడ అలాంటి సాధక ప్రవరుడే హనుమ. అతనికామె అందుకే క్షీణించినట్లుగా, కృశించినట్లుగా

దర్శనమిచ్చింది, హెచ్చరించింది. హనుమ బుద్ధిమద్వరిష్ఠుడు కావున ఈ హెచ్చరికను గ్రహించి బుద్ధితో ఆమె తత్త్వాన్ని సోపపత్తికంగా సప్రమాణంగా వికశింపచేయసాగాడు. ఆమె సీతయే అయి ఉంటుందని సప్రమాణంగా యిలా తర్కింపసాగాడు.

15) శ్లో ॥ తాం సమీక్ష్య విశాలాక్షీ మధికం మలినాం కృశామ్ ।
తర్కయామాస సీతేతి కారణై రుపపాదిభిః ॥

16) శ్లో ॥ హ్రియమాణా తదా తేన రక్షసా కామరూపిణా ।
యథారూపా హి దృష్టా వై తథా రూపేయమంగనా ॥

17) శ్లో ॥ పీతం కనకపట్టాభం స్రస్తం తద్వసనం శుభమ్ ।
తస్యోత్తరీయస్య సమ ముత్తరీయ మిదం ధ్రువమ్ ॥

18) శ్లో ॥ వైదేహ్యా యాని చాంగేషు తథా రామోఽన్వకీర్తయత్ ।
తాన్యాభరణజాలాని శాఖాశోభీన్యలక్షయత్ ॥

భావము : పద్మపత్రవిశాలాక్షియు, మలినవస్త్రములను ధరించి, మిక్కిలి కృశించినదిగా నగుపడుచున్న సీతను చూచి హనుమంతుడు ప్రమాణీకరింప బోవుచున్న హేతుపురస్సరముగా సీతయని నిర్ధారించుకొనెను. ఆ హేతువులేవి యనగా –

ఇపుడామె ధరించిన వస్త్రము ఆనాడామె యాభరణములను మూటకట్టి దిగవిడచినపుడు నేను చూచిన బంగారు రంగారు పీతవస్త్రమే తప్ప వేఱొకటి కాదు.

విదేహరాజపుత్రియగు సీత యే యాభరణములను ధరించియున్నట్లు శ్రీరామచంద్రమూర్తి చెప్పియుండెనో, అవే యాభరణములీ చెట్టుకొమ్మల యందు తగిలించబడి కనబడుచున్నవి.

19) శ్లో ॥ ఇయం సా యత్కృతే రామ శ్చతుర్భిః పరితప్యతే ।
స్త్రీ ప్రణష్టేతి కారుణ్యాదాశ్రితే త్యానృశంస్యతః ।
పత్నీ నష్టేతి శోకేన ప్రియేతి మదనేన చ ॥

భావము : శ్రీరామచంద్రమూర్తి బేలయై యే సీత కొరకు – (1) నా రక్షణలో నున్న యొక అబల నశించినదనెడి కారుణ్యము (దయ) చేతను, (స్త్రీ ప్రణష్టా అను విషయమును శ్రుతి – **"అర్ధోవా ఏష ఆత్మనో యత్పత్నీ"** అని భార్య సర్వకాల సర్వావస్థలయందును భర్తకు ఆత్మార్థభూత. సర్వాత్మనా తన జీవితార్థ భాగస్వామియని కీర్తించినది. ఆమె విధివిడంబనముచే తన నెడబాసినదని కారుణ్యము. అనగా దైన్యమును పొందినాడని భావము.)(2) తనను విశ్వసించి యాశ్రయించిన సీత కనబడకపోయినదనెడి ఆనృశంస్యము (అక్రూరత్వము) చేతను, (3) తన యర్ధాంగి తనను వీడినదను దుఃఖము చేతను, (4) తనకు మిక్కిలి ప్రియమొనరించు కాంతామణి దూరమైనదను మదనపరితాపము చేతను – నాలుగు విధములుగా దుఃఖించుచున్నాడో ఆ సీతయే ఈమె యని హనుమంతుడు నిశ్చయించుకొనెను.

20) శ్లో ॥ అస్యా దేవ్యా యథారూప మంగప్రత్యంగసౌష్ఠవమ్ ।
రామస్య చ యథా రూపం తస్యేయ మసితేక్షణా ॥

భావము : ఈ సీతాదేవియొక్క అంగప్రత్యంగసౌష్ఠవము (అనగా రామప్రోక్తమగు ఆమెయొక్క కనుముక్కు తీరు) ఎట్లుండెనో, శ్రీరాముని యొక్క అంగప్రత్యంగ సౌష్ఠవము కూడ నట్టే యున్నది (అనగా యిరువురు నొకరికొకరు సరిసమానమైన వారు సరిజోడులుగా నున్నవారని భావము) కావున, ఈమె తప్పక శ్రీరామ ధర్మపత్నియగు సీతమ్మయేనని నిశ్చయించెను.

21) శ్లో ॥ దుష్కరం కృతవాన్రామో హీనో యదనయా ప్రభుః ।
ధారయత్యాత్మనో దేహం న శోకేనావసీదతి ॥

భావము : నిజముగా నా స్వామి – సీతావియోగ దుఃఖముననుభవించుచు యింకనూ బ్రతికియే దేహమును ధరించుచున్నాడను నిది మిక్కిలి దుష్కరమైన అనగా అశక్యమైన కార్యమును (దేహధారణమును) చేయుచున్నాడు. అతడు ధీరోదాత్తుడు కావున వియోగ దుఃఖముచే నశింపలేదని భావించెను.

శ్రీపాదుక : ఈ ప్రసంగమున శ్రీరామచంద్రమూర్తి **'ప్రభు'** శబ్దముచే కీర్తింపబడినాడు. ప్రభుశబ్దమునకు – **గజాశ్వాది శిక్షణం రాజ్యాది పాలనం చ జానాతి –** గజాశ్వాది హృదయ విద్యలను, రాజ్య పాలనమును బాగుగా

నెటింగినవాడు అని భావము. ఆత్మ శరీరముసహింపశక్యముకాని సీతా వియోగమును అవశ్యము సహింపవలసియున్నది. పరతంత్రయు, వివశయునై యున్న తన అర్ధాంగిని విముక్తను గావించుట తనకవశ్యకర్తవ్యము. ఆయా యీ కారణములచే దుస్సహమైన ఆవేదననను భవించుచు శ్రీరాముడు శరీరధారణమును చేయుచున్నాడని భావము. ఇది యాతని ప్రభుత్వమని హనుమంతుని హృదయము.

22) శ్లో ॥ తుల్యశీలవయోవృత్తాం తుల్యాభి జనలక్షణామ్ ।

రాఘవోఽర్హతి వైదేహీం తం చేయ మసితేక్షణా ॥

భావము : శీలము, వయస్సు, నడువడి ఆభిజాత్యములన్నింటిలో సీత రామునకన్ని విధములుగా తగియున్నది. అట్లే సీతకును రాముడన్ని విధములుగా తగియున్నవాడు. ఈ విధముగా సీతారాములిరువురు సర్వలక్షణములయందు పరస్పరము సరిజోడుగానున్నారని భావము.

23) శ్లో ॥ కృతార్థోఽహం కృతార్థోఽహం దృష్ట్వా జనకనందినీ ।

మయైవ సాధితం కార్యం రామస్య పరమాత్మనః ॥

భావము : నేను కృతకృత్యుడనైతిని. ఏలన నేను జనకరాజపుత్రియగు ఈ సీతను చూచితిని. పరమాత్ముడగు శ్రీరామునియొక్క కార్యమును నే సాధింప గలిగితిని. కావున నేను సర్వదా కృతకృత్యుడనైతినని హనుమంతు డానందించినాడని భావము.

24) శ్లో ॥ అస్యా హేతో ర్విశాలాక్ష్యా హతో వాలీ మహాబలః ।

రావణ ప్రతిమో వీర్యే కబన్ధశ్చ నిపాతితః ॥

25) శ్లో ॥ విరాథశ్చ హత స్సంఖ్యే రాక్షసో భీమవిక్రమః ।

చతుర్దశసహస్రాణి రక్షసాం భీమకర్మణామ్ ॥

26) శ్లో ॥ నిహతాని జనస్థానే శరైరగ్నిశిఖోపమైః ।

సుఖార్హాం దుఃఖితాం దృష్ట్వా మమాపి వ్యథితం మనః ॥

భావము : పద్మపత్రదళాయతాక్షి యగు ఈ తల్లినిమిత్తముగనే శ్రీరామచంద్రునిచే మహాబల సంపన్నుడగు వాలి వధింపబడినాడు.

రావణునితో సమానమైన పరాక్రమశాలియగు కబంధుడు కూల్చబడినాడు. అటులనే భయంకరమైన విక్రమముకల విరాధుడుకూడ యుద్ధములో నిహతుడైనాడు.

జనస్థానములో ఘోరకర్ములైన పదునాలుగువేల రాక్షసులు అగ్నిజ్వాలలను పోలిన శ్రీరాముని బాణములచే చంపబడినారు.

అట్టి శ్రీరామచంద్రుని పొందులో సుఖింపదగిన ఈ సీతమ్మను జూచిన నా మనస్సు మిక్కిలి వ్యథచెందుచున్నది.

27) శ్లో ॥ యది రామః సముద్రాన్తాం మేదినీం పరివర్తయేత్ ।

అస్యాః కృతే జగచ్చాపి యుక్తమిత్యేవ మే మతిః ।

28) శ్లో ॥ త్రైలోక్య రాజ్యం సకలం సీతాయాః నాప్నుయాత్కళామ్ ॥

భావము : ఈమె కొరకై శ్రీరామచంద్రుడు ఈ చతుస్సముద్రవలయితమైన భూమండలమును అతలాకుతలము (తలక్రిందులుగా) చేసినను, జగత్తునంతనుకూడ పరివర్తింపజేసినను యుక్తమేనగునని నా తలంపు. ఏలన – త్రైలోక్య మహాసామ్రాజ్యమంతయు కలసి సీతాదేవి యొక్క కళాంశమునకు కూడ సరితూగదు. (అంతటి త్రిలోకసుందరి సీతమ్మ యని భావము)

29) శ్లో ॥ దుఃఖమోహాదికా మిథ్యా నటనట్యోరివ ధ్రువమ్ ।

అనుకుర్వాణయోర్లోకాన్ దేవదేవ్యో రదీనయోః ॥

30) శ్లో ॥ మాయామయీ మిమాం సృష్ట్వా సీతాప్రతికృతిం నిజామ్ ।

స్వయమన్తర్హితాఽవ్యక్తా ఇత్థం మే ప్రతిభా శుభా ॥

31) శ్లో ॥ ఇత్యేవ మర్థం కపిరన్వవేక్ష్య సీతేయ మిత్యేవ నివిష్టబుద్ధిః ।

సంశ్రిత్య తస్మి న్నిషసాదవృక్షే బలీహరీణామృషభ స్తరస్వీ ॥

భావము : దేవీ దేవులగు ఈ సీతారాములు నిజముగా దైన్యమును పొందకున్నను దీనులవలె మిథ్యా దుఃఖమోహములను నటీనటులవలె లోకములో నిట్లభినయమును చేయుచున్నారు. (కానిచో వీరిట్లు జీవించియుండ జాలరని హనుమంతుని హృదయముగా గ్రహించాలి)

లేదా మహామాయా స్వరూపిణియగు సీతమ్మ తన మాయామయమగు ప్రతిరూపమును ఈ విధముగా వ్యక్తపరచి స్వయముగా తానంతర్హితురాలై యుండుననెడి శుభంకరమైన తలంపు నాకు కలుగుచున్నది.

మహాబలియు, వానరశ్రేష్ఠుడునగు హనుమంతుడు తన బుద్ధివైశద్యముచే నీ విధముగానర్థమును మనసులో సంభావించినవాడై ఈమె తప్పక సీతయేయని నిశ్చయించుకుని, అదే శింశుపావృక్షముపై కూర్చునియున్నవాడై –

32) శ్లో ॥ తస్థౌ తస్మి న్మహాబాహు స్సీతాసంభాషణాతురః ।
స పరాహ్ణాంతపర్యంత మంతరాన్వేషణోత్సుకః ॥

భావము : ఎప్పుడెప్పుడు సీతమ్మతో సంభాషించెదనో యని యాతురతతో నువ్విళ్లూరుచున్నవాడై అదే వృక్షముపై సరియగు సమయమునకై నిరీక్షించుచున్నవాడై మరునాటి యపరాహ్ణపర్యంతమునట్లే యుండెను.

శ్రీపాదుక : 29 నుండి 32వ శ్లోకము వరకు గ్రంథకర్త అగస్త్యరామాయణ శ్లోకములను వాల్మీకీయములో ననుసంధానించి కూర్చెను.

“న దేవా దండమాదాయ రక్షన్తి పశుపాలవత్ ।
యం తు రక్షితుమిచ్ఛన్తి బుద్ధ్యా సంయోజయన్తి తమ్ ॥”

అనగా పశుపాలకుడు దండహస్తుడై పశువును వెన్నంటి తిరుగునట్లుగా దేవతలు భక్తులనురక్షించుటకై వారి వెంబడి చరింపరు. వారెవరిని రక్షింపదలచెదరో వారికి, సకాలములో సద్బుద్ధిననుగ్రహింతురు. ఈ అనుగ్రహమా భక్తుని కార్యసిద్ధికి కారణమగుచున్నది.

హనుమంతుడు శ్రీరాముని తన ప్రభువుగా, సుగ్రీవమిత్రునిగా మాత్రమే తలంపలేదు. సీతారాముల నిరువురను పరమాత్మ స్వరూపులుగా అనునిత్యము నారాధించును.

ఈ విషయమును 23వ శ్లోకములో **“రామస్య పరమాత్మనః”** అని వాచ్యముగా తెలిపియున్నాడు. కావుననే పరమాత్మస్వరూపులైన సీతారాములతనికి బుద్ధియోగమును అనుగ్రహించినారు. తద్వారా వారు లీలామానుషవిగ్రహులై తమ తమ పాత్రలను రంగస్థలముపై నటులవలె లోకకల్యాణార్థమై పోషించుచున్నారని గ్రహింపగలిగినాడు.

"యస్యదేవే పరాభక్తిః యథా దేవేతథా గురౌ।

తస్యై తేహ్యకథితాహ్యర్థాః ప్రకాశ్యన్తే మహాత్మనః" అను శ్వేతాశ్వతరశ్రుతి ఈ విషయమును ధ్రువపరచుచున్నది. ఈ విధమైన బుద్ధిప్రకాశమే హనుమంతుని ప్రతిభయని తాత్పర్యార్థము.

శ్రీపాదుక : ఈమె సీతయేయని నిశ్చయించుకొనిన హనుమంతుడు తరువాత నిర్వర్తింపదగిన కార్యమును నిశ్చయించుకొనుచు అదే వృక్షముపై, ఆ రాత్రి శేషమును, తరువాతి దినమపరాహ్ణమువరకునుండి సీతా సంభాషణావకాశమునకై నిరీక్షించుచుండెనను ఈ వర్ణనముద్వారా –

సముద్రోల్లంఘన దివసము నందే మూడు జాముల వఱకు రావణాంత పురముతోపాటుగా లంకనంతను సీత జాడనన్వేషించి కడపటి దగు నాలుగవ ఝామున అశోకవనమును ప్రవేశించెనని తెలియవలెను.

33) శ్లో ॥ తతః కుముద షణ్డాభో నిర్మలో నిర్మలం స్వయమ్ ।

ప్రజగామ నభశ్చంద్రో హంసో నీలమివోదకమ్ ॥

భావము : ఆ సమయమున తెల్ల కలువను బోలిన కాంతితో ప్రకాశించుచున్న నిర్మలుడైన చంద్రుడు నీలనీరములందు ప్రవేశించిన తెల్లని హంస వలె నభో మధ్య భాగమున విరాజిల్లెను.

34) శ్లో ॥ సాచివ్య మివ కుర్వ న్స ప్రభయా నిర్మల ప్రభః ।

చంద్రమా రశ్మిభి శ్శీతై స్సిషేవే పవనాత్మజమ్ ॥

భావము : రాత్రి చంద్రోదయ సమనంతరమే తనను సమీపించిన ఆంజనేయునకు సాహాయ్య మొనరించుచున్నవాడు వలె మిక్కిలి పరిశుభ్రమగు తెల్లనికాంతిగల చంద్రుడు తన చల్లని సుధాంశువులచే నతనిని సేవించుచున్నట్లుండెను.

శ్రీపాదుక : రాత్రి యందు పిండారబోసినట్లున్న చంద్రుని వెన్నెలకాంతిలో రాక్షసస్త్రీల మధ్యనున్న సీతను చూడగలిగినాడు. ఈ విధముగా సీతా సందర్శనములో చంద్రుడు హనుమకు తోడ్పడినాడని భావము. ఇదే చంద్రుని సాచివ్యము లేదా సహాయమని లాక్షణికార్థముగా గ్రహించవలెను.

34) శ్లో ॥ స దదర్శ తతః సీతాం పూర్ణచంద్రనిభాననామ్ ।

శోకభారై రివ న్యస్తాం భారైర్నావ మివాంభసి ॥

భావము : ఆ యాంజనేయుడు పున్నమిచంద్రుని కాంతితో ప్రకాశించు సీతాదేవి యొక్క దుఃఖభారావనమ్రమైన ముఖమును, భారాధిక్యముచే నీటిలో మునిగిపోవుటకు సిద్ధముగానున్న నావవలె నున్నదిగా చూచెను. పూర్ణచంద్రావనయగు సీత పెల్లుబుకుచున్న దుఃఖమును దిగమ్రింగుచు తలను వంచిన దానినిగా చూచెను.

హనుమంతుడు చూచిన వికృతాకారములు గల రాక్షస స్త్రీల వర్ణనము.

35) శ్లో ॥ స దదర్శావిదూరస్థా రాక్షసీర్ఘోరదర్శనాః ।

ఏకాక్షీ మేక కర్ణాం చ కర్ణప్రావరణాం తథా ॥

36) శ్లో ॥ అకర్ణాం శంకుకర్ణాం చ మస్తకోచ్ఛ్వాసనాసికామ్ ।

హ్రస్వాం దీర్ఘాం తథా కుబ్జాం వికటాం వామనాం తథా ॥

37) శ్లో ॥ వరాహమృగశార్దూల మహిషాజశివాముఖీః ।

హస్తిపాదా, మహాపాదా, గోపాదాః పాదచూళికాః ॥

38) శ్లో ॥ అనాసా అతినాసాశ్చ తిర్యఙ్నాసా వినాసికాః ।

తాభిః పరివృతాం తత్ర సగ్రహామివ రోహిణీమ్ ॥

39) శ్లో ॥ రక్షితాం స్వేన శీలేన సీతా మసితలోచనామ్ ।

దదర్శ హనుమాన్దేవీం లతా మకుసుమామివ ॥

భావము : ఆ యాంజనేయుడు సీతాసమీపమును చేరి భయంకారముతో చూపరులకు వెఱపుగొలుపునట్టి వికృతరూపములతో నున్న – ఒంటికంటి దానిని, ఒకచెవి మాత్రము కలదానిని, చెవియే మేలిముసుగుగా గలదానిని, (అంతటి పెద్ద చెవి గలదని భావము) చెవులు అసలే లేని దానిని, నీరు పంది చెవుల వంటి చెవులు కలదానిని, తలతోనుచ్ఛ్వసించు దానిని, మిక్కిలి పొట్టి దానిని, అట్లే మిక్కిలి ఎత్తైన దానిని, గూని దానిని, మిగుల వక్రమైన దానిని మరుగుజ్జుయైన దానిని, పంది, లేడి, బెబ్బులి, దున్న, మేక, ఆడునక్కల ముఖములను పోలిన ముఖములు కలవారిని, ఏనుగుల పాదముల వంటి

పాదములు కలదానిని, పెద్ద పాదములు కలదానిని, గోపాదములవంటి పాదములు కలదానిని, పాదములపై రోమములు కలదానిని,

అసలే ముక్కులేని వారిని, పెద్ద పెద్ద ముక్కులు కలవారిని, వంకర ముక్కులు కలవారిని వికృతమైన నాసికలు కలవారితో చుట్టుముట్టబడి దుష్ట గ్రహ పరివేష్టితమగు రోహిణీనక్షత్రము వలెనున్న సీతాదేవిని చూచెను.

ఇట్టియవస్థలో తనదైన శీలముచే రక్షింపబడిన ఆ కాటుకకంటి సీతాదేవిని పూవులులేని లత వలె చూచెను.

40) శ్లో ॥ జానకీ వేపమానా సా చంద్రం దృష్ట్వాఽబ్రవీదిదమ్ ॥

41) శ్లో ॥ మాదృశీ హిమమయూఖ న తే కిం
సోదరీం కిమితి శోషయసే మామ్?
అభ్రమో హర హర క్వ దయాతే
సోదరీనిలయశోషణ హేతోః ॥

భావము : అపుడా సీత ప్రకంపితశరీరము కలదై చంద్రుని చూచి ఇట్లు పలికెను – ఓ శీతకిరణుడా ! నీకు నా వంటి సోదరి లేదా? నీకు తోబుట్టవు వంటి దాననైన నన్నెందులకిట్లు పరితపింప చేయుచున్నావు? లేక ఇది నా భ్రమయా? శివ శివా! నీ సోదరియైన కమలాలయ వసించు తామరలనే ముకుళింపజేయు నీకు నాపై దయ ఎక్కడ నుండును గనుక!

శ్రీపాదుక : సాధారణముగా శీతాంశుప్రసారము, మలయానిలము, చంద్రోదయముల వంటివి, సంయోగములో ఆనందమును కలిగించునట్లే, ప్రియవిరహములో మిక్కిలి పరితాపమును కలుగజేయునని కవిసమయము అలంకార శాస్త్రములో ప్రసిద్ధము. శ్రీరామచంద్రమూర్తి నెడబాసిన సీతమ్మకు చంద్రజ్యోత్స్న పరితాపమును కలిగించుట సహజమే.

ఈ విధమైన నాయికాకృత చంద్రోపాలంభము కావ్యరచనాశిల్ప సౌందర్యాధాయకముగా నాలంకారికులచే ప్రశంసింపబడినది.

ఈ విధముగా ఈ వర్ణనము సుందరకాండ రచనా శిల్ప సౌందర్యమునకుదాహరణముగా చెప్పవచ్చును. కావుననే రచయిత

అవాల్మీకమగు ఈ వర్ణనమును **బోధాయనరామాయణము**నుండి గ్రహించినట్లు అధోజ్ఞాపికలో తెలిపియున్నారు.

సీతాత్రిజటలసంవాదము

42) శ్లో ॥ సంవాద మభవ త్తత్ర సీతా త్రిజటయోరిదమ్ ॥

43) శ్లో ॥ పృచ్ఛామి త్రిజటే ! సుఖేన భవతీం కస్మాదయం రావణో
నీతిజ్ఞో నృపశేఖరో హరతి మా మన్యాంగనాం కాననాత్ ?
సీతే మన్మథ పుష్పసాయకహతే కా నామ నీతేః కథా ?
యావత్కామశరాహతో న పురుషస్తావద్ధి శిష్టాయతే ॥

భావము : సీతాత్రిజటల మధ్య సంభాషణమును చమత్కారాధాయకములగు సంవాద శ్లోకముల ద్వారా రచయిత ప్రస్తావించుచున్నారు.

సీతాత్రిజటల మధ్య సంభాషణమిట్లు జరిగినది.

ఈ శ్లోకములో పూర్వార్థములో సీతయొక్క పరిప్రశ్నము, ఉత్తరార్థములో త్రిజటాసమాధానము ఇట్లు వర్ణింపబడినవి.

సీతా : త్రిజటా ! నిన్ను సుఖముగా సమాధానము చెప్పగల యొక సంశయమును ప్రశ్నించుచున్నాను. రావణుడు (మీ యందరచే) నీతిమంతుడైన రాజశేఖరుడుగా కీర్తింపబడుచున్నాడు కదా ! అతడట్టి వాడే యైనచో పరకాంతనగు నన్నరణ్యము నుండి ఎందులకిట్లపహరించి గొని వచ్చినాడు?

తరువాతి రెండు శ్లోకపాదములతో త్రిజట సీతతో – సీతా! పురుషుడు మన్మథుని పుష్పబాణములచే కొట్టబడనంతవరకే శిష్టుడు. నీతిమంతుడు, ఉత్తముడుగా నుండును. మన్మథబాణహతుడైన మరుక్షణమే అతనిలోని నీతిమత్త్వము, ఉత్తమత్వము, శిష్టత్వము లోపించి అతడనార్యుడు, నింద్యుడు అగును.

శ్రీపాదుక : ఈ విధమైన చమత్కారయుతములైన సంవాదశ్లోకములు కావ్యశోభాతిశయమును ఇనుమడింపచేయును. ఏవంవిధ ప్రబంధాయమానములైన శ్లోకములు సుందరకాండ సౌందర్యమును అతిశయింపచేయునని రచయిత అభిప్రాయముగా తోచును. వాల్మీకి

రామాయణములో త్రిజట రావణునిచే సీతను సంరక్షించుటకశోకవనిలో నియోగింపబడిన వృద్ధరాక్షస స్త్రీగా, తరువాత ఆమె రావణుని వినాశమును, సీతారాముల అభ్యుదయమును సూచించు తన స్వప్నవృత్తాంతమును చెప్పి సీతననునయించినట్లుగా వర్ణింపబడినది.

తరువాతి రామాయణములలో త్రిజట విభీషణుని కుమార్తెగాను, మరి కొన్ని చోట్ల సీతను విశేషముగా అభిమానించిన కారణముగా ఆమె రామానుగ్రహమును పొంది కృష్ణావతారములో శ్రీకృష్ణుని సోదరియగు సుభద్రగా జన్మించినట్లు చెప్పబడినట్లు అంతర్జాలకథనము.

త్రిజట ఇంకనూ ఇట్లు కారణాంతరమును చెప్పుచున్నది.

44) శ్లో ॥ పులస్త్యతనయాజ్జాతః కైకస్యాం ధనదానుజః ।
మాతృవంశాఘ సంక్రాంత్యా రాక్షసత్వ ముపాగతః ॥

భావము : కుబేర సహోదరుడైన రావణుడు బ్రహ్మమానసపుత్రుడైన పులస్త్యబ్రహ్మ వలన కైకసి యను రాక్షస స్త్రీకి జన్మించిన వాడగుటచే పాప యోనియగు మాతృవంశగుణసంక్రణముచే రాక్షసుడయ్యెను.

శ్రీపాదుక : బ్రహ్మబీజమైనను బలీయమైన క్షేత్రీయ గుణ సంసర్గముచే నతనిలో రాక్షసత్వమే ప్రాచుర్యము నందినదని భావము.

రావణుని యవక్రపరాక్రమము

45) శ్లో ॥ వజ్రం జీర్యతి వజ్రిణోఽపి చ, హరేశ్చక్రం చ వక్రం గతమ్
దణ్డః ఖండశతం యమస్య, దళితః పాశోఽ భవత్పాశినః
లంకేశోరసి తత్ర మన్మథశరో మగ్నో న భగ్న స్తతః
కశ్శాఖీ సఖి తస్య పుష్పమదదత్పుష్పాయుధ స్యాయుధమ్ ॥

భావము : రావణుని యుద్ధమున జయింపదలచిన ఇంద్రునిచే ప్రయోగింపబడిన వజ్రాయుధమాతని వక్షమున జీర్ణించెను, అట్లే విష్ణు ప్రయుక్తమగు చక్రము వంకరయయ్యెను, దండధరుడగు యముని దండా యుధము విరిగిపోయెను, వరుణుని పాశము తునాతునకలయ్యెను. కాని మన్మథ ప్రయుక్త పుష్ప బాణము మాత్రము భగ్నము కాలేదు సరికదా అతని

హృదయములో ప్రగాఢముగా నాటుకొనిపోయినది. పుష్పాయుధుడగు అతనికా పుష్పబాణమును ఏ చెట్టు ప్రసాదించినదో నీకు తెలియునా? అని సీతను త్రిజట ప్రశ్నించినది.

శ్రీపాదుక : బదులుగా సీత త్రిజటకు మఱియొక ప్రశ్నను సంధించినది. **సీతోవాచ –**

46) శ్లో ॥ త్రస్తాఽహం సఖి ! కీటభృంగకమతం సంవీక్ష్య, సీతే కథమ్?
శ్రీరామార్పితచిత్తవృత్తి రథునా రామో భవిష్యా మ్యహమ్
కా హాని స్తవ తేన, మే ప్రియతమో జాయావిహీనో భవేత్
రామస్తత్స్మరణా త్త్వమేవ భవితా, తర్హ్యస్తు వాం శోభనమ్ ॥

భావము : ఇది కూడ సంవాద శ్లోకమే.

సీత : సఖీ భ్రమర కీట న్యాయమును చూచి భయపడుచున్నాను. అనగా త్రిజట – సీతా ! భయము కలుగుట ఎట్లు? అని యడుగును. సమాధానముగా సీత– శ్రీరాముని యందే చిత్తవృత్తి కలదాననై రామ తాదాత్మ్యమును పొంది రాముడనయ్యెదనని నా భయము.

అందులకు త్రిజట – సీతా ! రాముడవైనచో నీకు హాని ఎట్లగును? అని యడిగెను. సమాధానముగా సీత – ఆ పక్షమున (అనగా నేను రాముడనైనచో) నా భర్త భార్యలేనివాడగును కదా యనును.

అందులకు త్రిజట – ఆ శ్రీరాముడు కూడ నిన్ను స్మరించి నీ తాదాత్మ్యమును పొంది సీత యగును కదా !

ఆ పక్షమున మీ సీతారాములకు శోభనమే యనగా క్షేమమే కదా! యనును. (కావున భయపడనవసరము లేదని భావము)

శ్రీపాదుక : భ్రమరకీటన్యాయము – తుమ్మెదలు ఏవేని పురుగులను తెచ్చి తమ గూళ్ళయందు బంధించి వానిని తమ సూదివంటి తుండముతో పొడుచుచూ ఝుంకారము చేయుచుండును. కొన్ని దినములకా పురుగు భయముచే తదేక ధ్యానము చేయుచూ తుదకు భ్రమరము లేదా తుమ్మెదగా మారును. ఈ విధముగా కీట(క)ము భ్రమరముగా మారుటను భ్రమరకీటన్యాయము అందురు.

47) శ్లో ॥ దిదృక్షమాణో వైదేహీం హనుమాన్మారుతాత్మజః ।
స దదర్శ తత స్సీతాం పూర్ణచంద్రనిభాననామ్॥

భావము : ఈ విధముగా పవనతనయుడగు ఆ హనుమంతుడు సీతా సందర్శనోత్సుకుడై పున్నమిచంద్రుని బోలిన కాంతివంతమగు ముఖము గల సీతాదేవిని గాంచెను.

48) శ్లో ॥ తథాపి ప్రేక్షమాణస్య వనం పుష్పితపాదపమ్ ।
విచిన్వతశ్చ వైదేహీం కించిచ్ఛేషా నిశాఽభవత్ ॥

భావము : ఆ విధముగా విరబూసిన వృక్షములు కల అశోకవనిని చూచుచూ సీతను వెదకుచుండగా రాత్రి కొలదిగా ప్రొద్దు మిగిలియుండెను.

49) శ్లో ॥ షడఙ్గ వేదవిదుషాం క్రతుప్రవరయాజినామ్ ।
శుశ్రావ బ్రహ్మఘోషాంశ్చ విరాత్రే బ్రహ్మరక్షసామ్ ॥

భావము : ఆ నిశావసాన సమయమున (ప్రభాత వేళలో) శిక్షావ్యాకరణాది షడంగములతో వేదములను వల్లించినవారును, శ్రేష్ఠములైన యాగములను చేయించుటలో నిపుణులును అగు బ్రహ్మరాక్షసులు చేయుచున్న వేదాధ్యయన ఘోషములు వినవచ్చుచుండెను.

50) శ్లో ॥ తస్మిన్దినే చార్ధరాత్రే రావణో రాక్షసాధిపః ।
స్వప్నే రామేణ సందిష్టః కశ్చిదాగత్య వానరః ॥

51) శ్లో ॥ కామరూపధర స్సూక్ష్మో వృక్షాగ్రస్థోఽనుపశ్యతి ।
ఇతి దృష్ట్వాఽద్భుతం స్వప్నం స్వాత్మన్యేవానుచిన్త్య సః ॥

52) శ్లో ॥ స్వప్నః కదాచిత్సత్య స్స్యా దేవం తత్ర కరోమ్యహమ్ ।
జానకీం వాక్శరైర్విద్ధ్వా దుఃఖితాం నితరామహమ్ ॥

53) శ్లో ॥ కరోమి దృష్ట్వా రామాయ నివేదయతు వానరః ।
ఇత్యేవం చింతయన్ సీతాసమీపం గన్తుమైచ్ఛత ॥

భావము : ఆ దినమున అర్ధరాత్రిసమయమున రాక్షసరాజగు రావణుడు శ్రీరామునిచే దూతగా పంపబడిన యొకానొక కామరూపధరుడగు వానరుడు సూక్ష్మరూపధారియై అశోకవనమున వృక్షాగ్రముపైనుండి సీతను చూచుచున్నట్లు అద్భుతమైన స్వప్నమును గాంచి,

స్వప్నముకూడ ఒకప్పుడు సత్యము కావచ్చునని తన మనస్సులో – 'నేను సీత వద్దకుపోయి బాణముల వంటి మాటలతో ఆమెను వేధించి మిక్కిలి దుఃఖితురాలను చేసెదను. దూతగా వచ్చిన ఆ వానరుడు ఈ వృత్తాంతమును విని రామునకు నివేదించును గాక!' – అని ఇట్లాలోచించి శీఘ్రముగా సీతవద్దకు వెళ్ళుటకు నిశ్చయించుకొనెను.

శ్రీపాదుక : ఈ ఘట్టము ఆధ్యాత్మరామాయణములోనిది.

54) శ్లో ॥ అథ మంగళవాదిత్రైః శబ్దైః శ్రోత్రమనోహరైః ।
ప్రాబుధ్యత మహాబాహుర్దశగ్రీవో మహాబలః ॥

భావము : పిమ్మట శ్రవణసుభగములగు అనగా వినుటకింపైన మంగళ వాద్య శబ్దములచే మహాబలుడగు దశకంఠుడు మేల్కొనెను.

55) శ్లో ॥ భృశం నియుక్త స్తస్యాం చ మదనేన మదోత్కటః ।
న సతం రాక్షసః కామం శశాకాత్మనిగూహితమ్ ॥

భావము : మన్మథునిచే సీతావిషయమున ప్రగాఢముగా ప్రేరేపింపబడి మిక్కిలి మదోన్మత్తుడై యున్న ఆ రావణుడు ఆ మన్మథపరితాపమును మనసులో నడంచుకొనలేకపోయెను.

శ్రీపాదుక : ఇదే భావమును వేఱొక విధముగా కూడ "మన్మథుడు ఎంతగా ప్రేరేపించినను రావణుడెంత మాత్రమును మన్మథ వికారమును పొందలేదు కావున నా సీత యందు మిక్కిలి భక్తి వినయములు కలిగియుండెనని – చెప్పవచ్చును అని రచయిత స్వయముగా వ్యాఖ్యాంతరమును ప్రస్తావించిరి.

రావణుడశోకవనిని ప్రవేశించుట

56) శ్లో ॥ నానామృగగణాకీర్ణాం ఫలైః ప్రపతితైర్వృతామ్ ।
అశోకవనికామేవ ప్రావిశత్సంతతద్రుమామ్ ॥

57) శ్లో ॥ అంగనాశతమాత్రంతు తం వ్రజన్తమనువ్రజత్ ।
దీపికాః కాంచనీః కాశ్చి జ్జగృహు స్తత్ర యోషితః ॥

58) శ్లో ॥ వాలవ్యజనహస్తాశ్చ తాలవృంతాని చాపరాః ।
ద్వారదేశమనుప్రాప్తం దదర్శ హనుమా న్కపిః ॥

భావము : బహు విధములైన జంతుతతులచే నిండినదియు, పండిరాలిన ఫలములతోనున్న సదాఫలించు ఫలవృక్షములు కలదియునగు అశోకవని వందలాది వనితామల్లులు, బంగారు దీపపుసెమ్మెలను పట్టుకొని వచ్చుచుండిరి.

కొందరు స్త్రీలు చామరములను, మరి కొందరు తాళవృజనములను చేతబట్టి వచ్చుచుండగా ద్వారప్రదేశమువద్దకు వచ్చిన రావణుని హనుమంతుడు చూచెను.

59) శ్లో ॥ దీపికాభిరనేకాభి స్సమంతా దవభాసితమ్ ।
గన్ధతైలావసక్తాభిర్ధ్రియమాణాభిరగ్రతః ॥

60) శ్లో ॥ కాచి ద్రత్నమయీం స్థాలీం పూర్ణాం పానస్య భామినీ ।
దక్షిణా దక్షిణేనైవ తదా జగ్రాహ పాణినా ॥

భావము : ఎదురుగా నా ప్రదేశమంతయు అసంఖ్యాకములైన దీపములతో ప్రకాశింపసాగెను.

కొందరా దీపములలో సుగంధతైలములను అత్తరులను పోయుచుండిరి. ఇంతలో...

చాతుర్యము కల ఒక దక్షిణ నాయిక విలాసముగా పూర్తిగా మద్యముతో నిండిన రత్నమయమగు పానపాత్రను కుడిచేతితోపట్టుకొని రావణుని అనుసరించెను. మిగిలిన స్త్రీలామెననుసరించిరని భావము.

61) శ్లో ॥ రాజహంస ప్రతీకాశం ఛత్రం పూర్ణశశి ప్రభమ్ ।
సౌవర్ణదండ మపరా గృహీత్వా పృష్ఠతో యయౌ ॥

62) శ్లో ॥ కామదర్పమదైర్యుక్తం జిహ్మతామ్రాయతేక్షణమ్ ।
సమక్షమివ కందర్ప మపవిద్ధశరాసనమ్ ॥

63) శ్లో ॥ తం దదర్శ మహాతేజాస్తేజోవంతం మహాకపిః ।
రావణోఽయం మహాబాహు రితి సంచింత్య వానరః ॥

64) శ్లో ॥ సోఽయమేవ పురాశేతే పురమధ్యే గృహోత్తమే ।
ఏవం నిశ్చిత్య మనసా రామం స్మృత్వా హృదంబుజే ॥

65) శ్లో ॥ పత్రగుహ్యాన్తరే సక్తో హనుమాన్సంవృతోఽభవత్ ॥

ఇతి శ్రీరామాయణసారోద్ధారే సుందరకాండే

షష్ఠస్సర్గః

భావము : ఒక స్త్రీ రాజహంసను పోలినదియు, పూర్ణచంద్ర ప్రభాసమున్మేషము కలదియు శ్వేతచ్ఛత్రమును పట్టుకొని ముందు నడచుచుండగా వెఱొకతె స్వర్ణ దండమును పట్టుకొని యామె వెనుక నడచుచుండెను.

అప్పుడా రావణుడు మన్మథమదదర్పములతో ఎఱుపెక్కిన వక్రపక్ష్మములు కల విశాల నేత్రములతో తనదైన చెఱకువింటిని విడిచి వచ్చిన ప్రత్యక్ష మన్మథునివలె నుండెను.

మహాతేజస్వియగు హనుమంతుడతనిని చూచి ఇతడింతకు పూర్వము లంకాపురమధ్యమున తాను శయనమందిరమున చూచిన రావణుడే అని నిశ్చయించుకొని,

మనసులో శ్రీరాముని ధ్యానించి, స్మరించుచు, గుబురుగా ఆకులు నిండుగానున్న రహః ప్రదేశమున ఎవ్వరికిని కానరాకుండ దాగిన సూక్ష్మ రూపముతో నుండెను.

ఇది శ్రీమద్రామాయణ సారోద్ధారములోని

సుందరకాండమున ఆరవ సర్గము.

సర్గాంతశ్లోకసంఖ్య–(278+65=343)



సప్తమస్సర్గః(ఏడవ సర్గ)

1) శ్లో ॥ తతో దృష్ట్వైవ వైదేహీ రావణం రాక్షసాధిపమ్ ।
ప్రావేపత వరారోహా ప్రవాతే కదలీ యథా ॥

2) శ్లో ॥ ఆచ్ఛాద్యోదరమూరుభ్యాం బాహుభ్యాం చ పయోధరౌ ।
ఉపవిష్టా విశాలాక్షీ రుదన్తీ వరవర్ణినీ ॥

భావము : పిమ్మట విదేహరాజపుత్రియగు సీత, రాక్షసేశ్వరుడగు రావణుని చూచి ప్రభంజనమునకు ప్రకంపించుచున్న అరటిచెట్టువలె భయముతో గడగడ వణకసాగెను. మఱియు

2. విశాలనేత్రియగు ఆ సీత (తన వైపునకువచ్చు రావణుని చూచి) తొడలతోపొట్టను, భుజములతో చనుగవను కప్పుకొని యేడ్చుచు కూర్చుండెను.

3) శ్లో ॥ అసంవృతాయా మాసీనాం ధరణ్యాం సంశ్రితవ్రతామ్ ।
సీతాం పతివ్రతాం దీనాం నిరానందాం తపస్వినీమ్ ॥

4) శ్లో ॥ సాకారైర్మధురై ర్వాక్యైర్న్యదర్శయత రావణః ।
నేహ కేచి న్మనుష్యా వా రాక్షసాః కామరూపిణః ।
వ్యపసర్పతు తే సీతే ! భయం మత్త స్సముత్థితమ్ ॥

భావము : పతివ్రతా నియమ పరాయణయైనదియై, కటికనేలపై కూర్చుని యున్న పతివ్రతాలలామయగు సీతను ఏ విధమైన ఆనందలేశము కూడలేనిదై దీనముగా దుఃఖితురాలైయున్న సీతను చూచి, తీయని ఇంపైన మాటలతో తన అభిప్రాయమును రావణుడిట్లు ప్రదర్శించెను.

5) శ్లో ॥ నేహ కేచి న్మనుష్యా వా రాక్షసాః కామరూపిణః ।
వ్యపసర్పతు తే సీతే ! భయం మత్త స్సముత్థితమ్ ॥

భావము : ఇచ్చట నీకు భయమును కలిగించు కామరూపులగు రాక్షసులు గాని, మనుష్యులు గాని వేరెవ్వరును లేరు. కావున ఓ సీతా ! నీవు నా కారణముగా కలిగిన భయమును విడిచిపెట్టుము

6) శ్లో ॥ స్వధర్మో రక్షసాం భీరు ! సర్వథైవ న సంశయః ।
గమనం వా పరస్త్రీణాం హరణం సంప్రమథ్య వా ॥

7) శ్లో ॥ ఏవం చైత దకామాం తు న త్వాం స్ప్రక్ష్యామి మైథిలి !
ప్రణయస్వ చ తత్త్వేన మైవం భూశ్శోకలాలసా ॥

భావము : అధర్మమునకు భయపడు స్వభావము కల ఓ సీతా ! మా రాక్షసులకు పరస్త్రీగమనము కాని, లేదా పరకాంతలను అపహరించి బలాత్కరించుట స్వధర్మమేయగును. ఈ విషయమున ఎంత మాత్రము సంశయింప నవసరము లేదు.

అయినను నీవు నన్ను కామించుటలేదు కావున నిన్ను నేను స్పృశింపను. కావున నీ స్వభావానుగుణముగా నీవు ఆనందించుము. ఈ విధముగా ఓ మిథిలాత్మజా ! నీవు దుఃఖమును విడనాడుము అని పలికెను.

శ్రీపాదుక : రావణుని వచనములిచ్చుట సాభిప్రాయములు. బయటకు మధురముగా కనిపించుచున్నను స్వధర్మానువర్తిని యగు సీతమ్మకవి మర్మచ్ఛేదకములైనవి.

రావణుడిచ్చుట ధర్మమను ముసుగులో అధర్మమును ఆమెకు బోధింపదలచినాడు. పరస్త్రీగమనము, పరకాంతలనపహరించి బలాత్కరించుట రాక్షసులలో దోషము కాదు, అది వారి సహజధర్మము లేదా ప్రవృత్తియని అంతరంగము.

'స్వధర్మోరక్షసాం భీరు!' అను శ్లోకము విరోచనుడను రాక్షసధర్మకర్త యొక్క సిద్ధాంతము. పంచదశి యందును ఛాందోగ్య అష్టమఖండములోని అష్టమప్రపాఠకము నందును ఈ విషయము సమర్థింపబడినదని గ్రంథకర్త తమ అథోజ్ఞాపికలో వివరించిరి. అట్లే **అకామాం** – అను పదమునకు నన్ను స్వామిగా వరింపని లేదా నీవు నాకు శత్రువైన విష్ణువునందు మాత్రమే అనురక్తి కలిగియుండుట నాకు అకామ్య – అనగా కోరదగినదానవు కావు అను నర్థములను వివరించి – ఆ, యీ కారణములచే నతడామెను స్పృశింప నిచ్చగించుట లేదని తాత్పర్యమును ప్రకటించిరి. (సుందరకాండ సారోద్ధారము, పుట. 164–165)

8) శ్లో ॥ త్వాం కృత్వోపరతం మన్యే రూపకర్తా స విశ్వసృట్ ।
నహి రూపోపమాత్వన్యా తవాస్తి శుభదర్శనే ॥

9) శ్లో ॥ త్వాం సమాసాద్య వైదేహి ! రూపయౌవనశాలినీమ్ ।
కః పుమా నతివర్తేత సాక్షాదపి పితామహః ॥
భవ మైథిలి ! భార్యా మే మోహమేనం విసర్జయ ॥

భావము : శుభ లక్షణ సంపన్నవగు నిన్ను సృష్టించిన తరువాత రూపశిల్పియగు బ్రహ్మ తన సృష్టికార్యమును విరమించెనని నా తలంపు. ఏలన ఓ శుభదృష్టి కల సీతా ! నిన్ను పోలిన మఱియొక సుందరి లేనే లేదు.

రూపయౌవనసంపన్నవైన నిన్ను చూచి, నిన్ను సృష్టించిన బ్రహ్మయే మోహించును. ఇకపై నితరులు మోహింపకుండ నుండజాలరని వేరుగా చెప్పవలెనా?

కావున నో సీతా ! రాముని యందలి వ్యామోహమును వీడి నాకు భార్యవగుము.

10) శ్లో ॥ కిం కరిష్యసి రామేణ సుభగే ! చీరవాససా ।
నిక్షిప్త విజయో రామో గతశ్రీ ర్వనగోచరః ॥

11) శ్లో ॥ వ్రతీ స్థండిలశాయీ చ శంకే జీవతి వా నవా ।
న చాపి మమ హస్తా త్త్వాం ప్రాప్తు మర్హతి రాఘవః ॥
హిరణ్యకశిపుః కీర్తిమింద్రహస్త గతామివ ॥

భావము : సుందరీ ! నారచీరలు ధరించినవాడును, గత వైభవము కలవాడును, విజయకాంక్ష అణగినవాడును, వనసంచారియు నగు రామునితో నీకేమి ప్రయోజనము?

వానప్రస్థవ్రతముతో, కేవలము కటికనేలపై పరుండువాడును అగు రాముడింకను బ్రతికియుండెనో లేదో నా సందేహము. (అతడిప్పటికి నీ విరహముచే మరణించియే యుండునని భావము)

ఒక చోనాతడు జీవించియున్నను హిరణ్యకశిపుడు ఇంద్రహస్తగతమగు కీర్తిని పొందలేకపోయినట్లు నాకు చేజిక్కిన నిన్ను నా నుండి పొందజాలడు.

12) శ్లో ॥ మయాతు బహుధా లోకాః ప్రేషితా స్తస్య దర్శనే ।
న పశ్యన్తి ప్రయత్నేన వీక్షమాణా స్సమన్తతః ॥

13) శ్లో ॥ కదాచి ద్దృశ్యతే కైశ్చిత్ కదాచి న్నైవ దృశ్యతే ।

కిం కరిష్యసి రామేణ నిస్పృహేణ సదా త్వయి ॥

14) శ్లో ॥ ఇదానీమపి నాయాతి భక్తిహీనః కథం వ్రజేత్ ॥

భావము : నేను పలువురు చారులను రాముని జాడతెలిసికొనుటకై సర్వలోకములకు పంపియుంటిని. కాని ఎంతగా ప్రయత్నించినను అతనిని తెలియరైరి.

ఒకప్పుడాతనిని కొందరు చూచినట్లును, మరికొందరు చూడనట్లును చెప్పుచున్నారు. భార్యయందాశను కోల్పోయినవాడగు రామునిచే నీకేమి ప్రయోజనము?

నీయందు ప్రేమనుకోల్పోయి నిస్పృహుడైనవాడు ఇచటికెట్లు రాగలడు? (ఏ విధముగను రాజాలడని భావము)

శ్రీపాదుక : ఈ శ్లోకములధ్యాత్మ రామాయణములోనివిగా సూచింపబడినవి.

15) శ్లో ॥ క్లిష్ట కౌశేయవసనాం తన్వీ మప్యనలంకృతామ్ ।

త్వాం దృష్ట్వా స్వేషు దారేషు రతిం నోపలభామ్యహమ్ ॥

16) శ్లో ॥ అంతఃపుర నివాసిన్యః స్త్రియః సర్వగుణాన్వితాః ।

యావన్త్యో మమ సర్వాసా మైశ్వర్యం కురు భామిని ॥

భావము : నలిగిన పట్టుపుట్టమును ధరించి, ఆభరణములను ధరింపక కృశించియున్నప్పటికిని నీ రూపమును దర్శించిన నేను, నా భార్యలపై ప్రేమను పొందలేకున్నాను.

ప్రశస్తాభిప్రాయము కల సీతా ! సమస్తకల్యాణ గుణసంపన్నలైన నా అంతఃపుర స్త్రీలందరకు నీవు స్వామినివై వారిని శాసింపుము.

17) శ్లో ॥ న రామ స్తపసా దేవి! న బలేన న విక్రమైః ।

న ధనేన మయా తుల్యః తేజసా యశసాఽపివా ॥

భావము : దేవీ ! నీ రాముడు తపోబలపరాక్రమములలో గాని, యశస్తేజస్సంపదలలో గాని (నాకు సాటి) నాతో సమానుడు కాజాలడు.

18) శ్లో ॥ తస్య తద్వచనం శ్రుత్వా సీతా రౌద్రస్య రక్షసః ।
ఆర్తా దీనస్వరా దీనం ప్రత్యువాచ శనై ర్వచః ।
తృణ మన్తరతః కృత్వా ప్రత్యువాచ శుచిస్మితా ॥

భావము : భయంకరుడగు ఆ రాక్షసుని మాటలను విన్న సీత పవిత్రమగు మందహాసము కల సీత ఒక గడ్డిపోచను మధ్యలో నుంచుకొని, భయపీడిత కావున దీనముగా హీనస్వరముతో నెమ్మదిగా నతనికిట్లు బదులు పలికెను.

శ్రీపాదుక : భయపీడిత యగు సీత పవిత్రమగు మందహాసపూర్వకముగా రావణునితో భాషించుటెట్లు? అని సంశయింపనవసరము లేదు. ఆమె పవిత్రచరిత్ర కావుననే పరపురుషుడగు రావణునితో ప్రత్యక్షముగా భాషించలేదు. గడ్డిపోచను మధ్యనుంచుకొని దానిని చూచుచు మాత్రమే బదులుపలికినదని గ్రహించవలెను.

ఆదరముతోకాక అతనిని తృణీకరించి భాషించినది కావున ఆమె పరపురుషసంభాషణము అను మర్యాదోల్లంఘనము చేయలేదు. ఆమె మాట్లాడుటలో హేతువు 'తననెట్లయినను రాముని ఇచటి కాహ్వానించి యతనికి సమర్పించుమని బోధ చేయుటయే.' ఈ భావమంతయు తరువాత పలుకబోవు ఆమె హిత వచనములలో స్పష్టము చేయబడినది.

19) శ్లో ॥ నివర్తయ మనోమత్తః స్వజనే క్రియతాం మనః ।
న మాం ప్రార్థయితుం యుక్తం సుసిద్ధిమివ పాపకృత్ ॥

20) శ్లో ॥ అకార్యం న మయా కార్యమేకపత్న్యా విగర్హితమ్ ।
కులం సంప్రాప్తయా పుణ్యం కులే మహతి జాతయా ॥

21) శ్లో ॥ నాహ మౌపయికీ భార్యా పరా, భార్యా సతీ తవ ।
సాధు ధర్మ మవేక్షస్వ సాధు సాధువ్రతం చర ॥

22) శ్లో ॥ ఇహ సంతో న వా సన్తి సతో వా నానువర్తసే।
తథాహి విపరీతా తే బుద్ధి రాచారవర్జితా ॥

23) శ్లో ॥ శక్యా లోభయితుం నాహ మైశ్వర్యేణ ధనేన వా ।
అనన్యా రాఘవేణాహం భాస్కరేణ ప్రభా యథా ॥

24) శ్లో ॥ ఏవ ముక్త్వా తు వైదేహీ రావణం తం యశస్వినీ ।

రాక్షసం పృష్ఠతః కృత్వా భూయో వచన మబ్రవీత్ ॥

భావము : రావణా ! నా నుండి మనసు మరల్చుకొని నీ భార్యలయందు మనసుపడుము. పాపకర్ముడు గొప్పదగు సిద్ధిని పొందుటకు ఏ విధముగా తగనివాడో అట్లే నీవు కూడా నన్నుకోరుట తగనిపని. పాపాత్ముడు తురీయమగు మోక్షమును పొందుటకర్హుడు కాడు. అతడు కోరినను అతనికి మోక్ష పురుషార్థమెట్లు సిద్ధింపదో అట్లే నీవు కోరుకున్నంత మాత్రమున నేను నీకు లభింపను. దక్కనని భావము.

పవిత్రమగు జనకరాజవంశమున పుట్టి, పవిత్రతరమగు దశరథరాజకులమున మెట్టిన నేను, పతివ్రతలకు తగని అకార్యమునకే విధముగాను పాల్పడుదానను కాను.

నేను పరసతిని, పతివ్రతను. నీకు భార్యగా చేబట్టదగినదానను కాను. ధర్మమును కాపాడుము. సదాచారమును విడువక సంరక్షించుము.

రావణా ! నీకిచట హితమునుపదేశించు సజ్జనులెవ్వరును లేరా? ఉన్నచో వారి వచనములననుసరింపవా? నీవు వారి వచనములను తప్పక తిరస్కరించియుందువు. కావుననే నీకీవిధమైన దుర్బుద్ధి కలిగినదని భావము.

రావణా! నీ యైశ్వర్యధనములను చూపి నన్ను ప్రలోభపెట్టజాలవు. సూర్యునినుండి సూర్యకాంతిని వేఱుచేయజాలనట్లే నన్ను రాఘవునినుండి మరల్చుట నీతరము కాదు.

ఈ విధముగా రావణునితో పలికి విదేహరాజపుత్రి యగు ఆ సీత రావణునికి పెడమొగముగా తిరిగి మరల ఇట్లు చెప్పసాగెను.

25) శ్లో ॥ సాధురావణ రామేణ మాం సమానయ దుఃఖితామ్ ।

వనే వాసితయా సార్థం కరేణ్వేవ గజాధిపమ్ ॥

భావము : నాయనా రావణా ! వనమందు ఏకాకి యైన ఆడుఏనుగును గజరాజు పొందునకు చేర్చునట్లు దుఃఖితనగు నన్ను శ్రీరామునితో జేర్చుము.

శ్రీపాదుక : ఇచట 'సాధు' – అను సంబోధనము సీతయొక్క దైన్యముతో

కూడిన వివశాత్వకారణమగు యాచనమును అనునయమును తెలియజేయును. అట్లే **'సమానయ'** – అను శబ్దము నన్ను రాముని వద్దకు తీసికొనిపోయి చేర్చుట కాదు. శ్రీరాముని యిచటకు రప్పించి యతనికి నన్ను సమర్పించుము అను అభ్యర్థనను తెలియజేయుచున్నదని వ్యాఖ్యానింపబడినది.

26) శ్లో ॥ మిత్ర మౌపయికం కర్తుం రామస్థానం పరీప్సతా ।

వధం చానిచ్ఛతా ఘోరం త్వయాఽసౌ పురుషర్షభః ॥

భావము : రావణా ! నీవు నీ స్థానమును అనగా లంకాధిపత్యమును కోరుకొనువాడవైనట్లయిన అట్లే రామునిచేతిలో భయంకరముగా మరణించకుండ యుండగోరెదవేని రాముని మిత్రునిగా జేసికొనుము.

27) శ్లో ॥ విదిత స్సహి ధర్మజ్ఞః శరణాగతవత్సలః ।

తేన మైత్రీ భవతు తే యది జీవితుమిచ్ఛసి ॥

28) శ్లో ॥ ప్రసాదయస్వ త్వం చైనం శరణాగతవత్సలమ్ ।

మాం చాస్మై ప్రయతో భూత్వా నిర్యాతయితుమిచ్ఛసి ॥

భావము : శ్రీరాముడు సమస్తధర్మములనెఱింగినవాడు. శరణుజొచ్చినవారిపై దయచూపు స్వభావము కలవాడు అని ప్రసిద్ధిని పొందినవాడు. నీవు బ్రతుకదలచినవాడవైనచో అతనితో చెలిమి చేయుము.

శరణాగతవత్సలుడగు ఆ శ్రీరామునికి ప్రీతిని కలిగింపుము. పరిశుద్ధహృదయముతో నన్నాతనికి సమర్పించుము.

29) శ్లో ॥ అన్యథా త్వం హి కుర్వాణో వధం ప్రాప్స్యసి రావణ ।

రామస్య ధనుష శ్శబ్దం శ్రోష్యసి త్వం మహాస్వనమ్ ॥

భావము : రావణా! నీవు నన్ను రాముని కర్పింపక వేఱువిధముగా ప్రవర్తించినచో నీవు రామునిచే వధింపబడుదువు. అచిరకాలములోనే నీవు రాముని భయంకరమగు ధనుష్టంకారమును వినబోవుచున్నావు.

30) శ్లో ॥ జనస్థానే హతస్థానే నిహతే రక్షసాం బలే ।

అశక్తేన త్వయా రక్షః ! కృతమేత దసాధు వై ॥

భావము : జన స్థానమునందలి రాక్షససమూహములన్నియు చంపబడి శూన్య ప్రాయమైన కారణముగా, నీవు రామునెదిరించి యుద్ధముచేయలేక పిరికివాడవై ఇట్టి అకృత్యమును అనగా అపహరణమునకు పాల్పడితివి.

31) శ్లో ॥ రాఘవాద్విభ్యతా నూనం భిక్షురూపం త్వయా ధృతమ్ ।
రహితో రాఘవాభ్యాం త్వం శునీవ హరిరధ్వరే ।

32) శ్లో ॥ హృతవానసి మాం నీచ ! తత్ఫలం ప్రాప్స్యసేఽచిరాత్ ॥

భావము : శ్రీరామునకు భయపడినవాడవై నీవు భిక్షురూపమును ధరించి రామలక్ష్మణులు లేని సమయమున యజ్ఞములోని హవిస్సును కుక్క దొంగిలించినట్లుగా నన్నపహరించితివి. నీచుడా ! నీయకృత్యమునకు తగిన ఫలమును అచిరకాలములోనే పొందగలవు.

33) శ్లో ॥ బ్రువన్తీమివ తాం సీతాం విదుషీం ప్రవిభావయన్ ।
లలితోక్తిభి రారేభే సంభాషితు మథాసురః ॥

(మూడు ముచ్చట గొలిపే చిత్ర శ్లోకములు)

34) శ్లో ॥ రామో వాచ్యతిప్రియోఽతి చలితశ్రీ స్తన్వి నీచం వపుః ।
భిభ్రత్కాననసీమ్ని రాక్షస చయాయత్త స్తతః కిం సుఖమ్?
మాం పశ్యాతి విచక్షణోఽస్మి బహుధాచాపైక వీరోఽస్మ్యహమ్ ।
లబ్ధశ్రీ ప్రచయ స్తథాసి కిమరే చేలం బధానాఽసకృత్ ॥

భావము : ఈ విధముగా పలుకుచున్న విదుషీమణియగు సీతను తన లలితలలిత వచనములతో ప్రభావితురాలను చేయుచు ఆమెతో రావణుడిట్లు పలికెను– "లలిత కృశాంగివగు సీతా ! గత వైభవముకల రాముడు ప్రియభాషి కాడు. నీచమగు మానవదేహధారియై యడవులలో రాక్షససేనలచే మోహరింపబడినవాడు. అతని వలన నీకేమి సుఖము? నన్ను చూడుము. నేను విచక్షణా జ్ఞానము కలవాడను, పలువురు వీరులనెదిరించి నిలువగల ధానుష్కుడను. వైభవశ్రీసమలంకృతుడను. ఇట్టి నన్ను ప్రేమింపక రాముని యేల వలచెదవు?

ఇది వినిన సీత ఓరీ! ఏమంటివి. కొంగుముడి వేసి కొనుము. నీ

మాటలందలి చకారములకు బదులు లకారములను చేర్చుము. ఇదియే నా సమాధానమనెను.

శ్రీపాదుక : ఇది బోధాయన రామాయణములోనిదిగా పేర్కొనబడిన చిత్ర శ్లోకము.

శ్లోకములోని మొదటి చ కారమునకు బదులు ల కారమునుంచినచో రామో వాల్యతి ప్రియః – అనగా రాము (నిన్ను నాలుగు సముద్రములలో ముంచి పరాభవించిన) వాలిని సంహరించిన మహావీరుడు అనియు,

రెండవ చ కారమునకు బదులుగా ల కారమునుంచిన 'అతి లలితశ్రీ' అత్యంత వైభవ శ్రీయుతుడు అనియు, నీచం వపుఃలోని మూడవ చ కార స్థానములో ల కారమునుంచిన నీలమేఘశ్యాముడు.

అట్లే నాల్గవ చ కార స్థానములో ల కారమునుంచిన "రాక్షసలయాయత్తః" రాక్షసులను సంహరించినవాడు అనియు,

అయిదవ చ కారమునకు బదులు ల కారమునుంచిన "అతి విలక్షణోస్మి" తనను రామునికన్న విలక్షణమైనవాడు, ఆరవ చ కార స్థానములో, ల కారమును భావింపగా రావణుడు బహుధాలాపైక వీరుడు అనగా వ్యర్థ ప్రలాపి, తరువాతి చ కారమునకు బదులు ల కారమునుంచగా "లబ్ధశ్రీ పతయః" అతని సంపదకు ప్రళయము (నాశము) వాటిల్లును అని సీత అభిప్రాయముగా తెలియవలెనని భావము.

35) శ్లో ॥ భవిత్రీ లంకాయాం త్రిదశవదనగ్లాని రచిరాత్ ।
స రామోఽపి స్థాతా న యుధి పురతో లక్ష్మణసఖః ।
తథా యాస్యత్యుచ్చై ర్విపద మనుజేనాత్ర జటిలో ।
వయశ్రీరామేస్యాన్నమమ బహుతోషోఽత్ర తు భవేత్ ॥

36) శ్లో ॥ తద్రావణవచ శ్శృత్వా జానకీ ప్రాహ తం పునః ।
షష్టాక్షర పరాణ్యేవ చతుర్షు చరణేష్వపి ।
త్వ మక్షరాణి చత్వారి లోప్య శ్లోక మముం పఠ ॥

భావము : రావణుడు సీతతో – నిట్లను చున్నాడు. అచిరకాలములోనే లంకలో దేవతల వదనములు మాడిపోవును. యుద్ధమున లక్ష్మణునితోపాటు

నాకెదురు నిలచిన రాముడు ఉండబోడు (మరణించునని భావము) జడదారి లక్ష్మణుడుకూడ అతనిని అనుగమించును. (మరణించునని భావము) రామునకు విజయము లభింపదు. నాకమందానందము కలుగును అని పలికెను.

ఆ రావణుని వచనమును వినిన సీతయతనితో – నీవు పలికిన శ్లోక పాదముల నాల్గింటిలో ఆరవ అక్షరములను లోపించి చదువుకొనుమని చమత్కరించెను.

శ్రీపాదుక : 34వ శ్లోకము వలెనిదియును చిత్రమైన శ్లోకమే. పై శ్లోకములోని నాలుగు పాదములలోని ఆరవ అక్షరములు క్రమముగా – 'త్రి–న–వి–న' అను వర్ణములను లోపింప జేసినచో –

భవిత్రీలంకాయాం దశవదన గ్లాని రచిరాత్ ।

సరామోఽపి స్థాతా యుధి పురతో లక్ష్మణసఖః ।

తథా యాస్యత్యుచ్చైః పదమనుజేవాత్ర జటిలః ।

నయత్ర్శీరామేస్యా న్మమ బహుతోషోఽత్ర భవేత్ ॥

అనగా – లంకలో దశవదనునకు అచిరకాలములోనే గ్లాని సంభవించును–

యుద్ధములో రాముడు లక్ష్మణునితో కూడ నీయెదుట నిలచును. (నిన్నెదిరించునని భావము)

అట్లే సోదరసహితుడై ఉన్నత పదవిని (జయము) పొందును. నాకు బహుసంతోషము కలుగును అని యర్థము సిద్ధించును.

37) శ్లో ॥ సీతే! పశ్య శిరాంసి యాని శిరసా ధత్తే మహేశ స్స్వయమ్ ।

తాని త్వత్పదసంస్థితాని సుభగే ! కస్మా దవజ్ఞాయతే ।

శ్రుత్వైత త్పరదారలంపటవచ స్సీతాఽఽహ తం రావణమ్ ।

నిర్మాల్యాని శిరాంసి మూఢ! తవధిక్ సీతావచః పాతు వః ॥

భావము : ఇది సీతా రావణసంవాదములోని ప్రశ్నోత్తర పద్యశ్లోకము. అర్థము– సీతా! చూడు మహేశుడేశిరములను తలపై ధరించుచున్నాడో అట్టి నా యా

శిరస్సులను నీ పాదములకర్పించుచున్నాను. నీవేల నిరాకరించుచున్నావు – అని రావణుని వచనము దీనికి సీత సమాధానము 3, 4 పాదములు.

పరదారాపరాయణుడగు రావణుని వచనములను విన్న సీత అతనితో – మూఢుడవగు రావణా ! అవి శివనిర్మాల్యములు కదా కావున అవి ధిక్కారయోగ్యములే కాని గ్రహింపదగినవి కావు అని పల్కెను.

ఈ సీతావచనము మిమ్ములను రక్షించుగాక! యని తాత్పర్యము.

38) శ్లో ॥ ప్రత్యువాచ తత స్సీతాం రావణః క్రోధమూర్ఛితః ।
దర్శయిత్వా తు ఘోరాం స్వాం దశ శీర్షాదికాం తనూమ్ ॥

భావము : సీతా వచనమును విని క్రోధోద్విగ్నుడైన రావణుడు తన పది తలలు ఇరువది చేతుల భయంకరరూపమును చూపి యామెతో నిట్లనెను.

39) శ్లో ॥ పరుషాణీహ వాక్యాని యాని యాని బ్రవీషి మామ్ ।
తేషు తేషు వధో యుక్త స్తవ మైథిలి దారుణః ॥

40) శ్లో ॥ ద్వౌ మాసౌ రక్షితవ్యౌ మే యోఽవధి స్తే మయా కృతః ।
తత శ్శయన మారోహ మమ త్వం వరవర్ణిని ॥

భావము : మిథిలాధీశపుత్రీ సీతా ! నన్ను గూర్చి నీవు పలికిన పరుష వచనములలో నొక్కొక్క దానికే నీవు వధింపదగియున్నావు. ఓ సుందరాంగీ సీతా ! నేను నీకిచ్చిన రెండు మాసముల గడువు ప్రకారము రెండు మాసములింకను మిగిలియున్నవి. అటుపై నీవు తప్పక నా శయ్యను ఆరోహింపవలసినదే!

41) శ్లో ॥ ఊర్ధ్వం ద్వాభ్యాంతు మాసాభ్యాం భర్తారం మామనిచ్ఛతీమ్ ।
మమత్వాం ప్రాతరాశార్థ మాలభన్తే మహానసే ॥

భావము : ఈ రెండుమాసముల వ్యవధిలో నీవు నన్ను భర్తగా అంగీకరింపకున్నచో ఆ మరునాడే నిన్ను నా ప్రాతఃకాల భోజనమునకై నా వంటశాలలో చంపి వండెదరు.

శ్రీపాదుక : ఇక్కడ 40వ శ్లోకములో రావణుడు సీతకు రెండు మాసములు

గడువు (ద్వౌమాసౌ రక్షితవ్యౌ) అని చెప్పబడినది. పది మాసములు గడచినవి యింకను రెండు మాసములే యను సీతకు ఓదార్పుగా రావణుడు మద్యపానపు మత్తులో పలికిన మాటగా దీనిని గ్రహించాలి. ఏలన సీత స్వయముగా ఇదే సుందరకాండలో **'మాసాదూర్ధ్వం న జీవిష్యే'** ఒక మాసము కంటే పైన నే బ్రతకను అని హనుమంతునిచే చెప్పుటచే – మాసశబ్దానికి జరుగుచున్న మాసము అని అర్థం. రామాయణం సుందరకాండలో 37వ సర్గలో చెప్పబడిన సీతా వచనము –

ఆయం సంవత్సర కాలః స్తావద్ధి మమ జీవితమ్ ।

వర్తతే దశమో మాసః ద్వౌతు శేషే ప్లవంగమ ।

రావణేన నృశంసేన సమయో యః కృతో మమ ॥ అనునది కేవలము రావణుని వచనానుసారముగా చెప్పిన మాటయే కాని సీతాభిప్రాయము కాదని గ్రహించాలి.

42) శ్లో ॥ తాం తర్జ్యమానాం సంప్రేక్ష్య రాక్షసేంద్రేణ జానకీమ్ ।
దేవగంధర్వకన్యాస్తాః విషేదుర్వికృతేక్షణాః ॥

43) శ్లో ॥ ఓష్ఠప్రకారై రపరా వక్త్ర నేత్రై స్తథాపరాః ।
సీతామాశ్వాసయామాసుః తర్జితాం తేన రక్షసా ॥

భావము : రాక్షసుడగు రావణునిచే నీ విధముగా భయపెట్టబడిన సీతను చూచి దేవగంధర్వ స్త్రీలు వికృతములైన కన్నులు కలవారై దుఃఖించిరి. వారిలో–

కొందరు పెదవులను కదుపుచు, మరికొందరు ముఖకవళికలతోను, నేత్రములతోను రావణునిచే బెదిరించబడిన సీతనూఅడించిరి.

44) శ్లో ॥ తం దృష్ట్వా రావణం సీతా క్రోధా త్ప్రోవాచ రోషితా ।

భావము : అపుడా రావణుని సీత క్రోధముతో చూచి రొప్పుతూ నిట్లు పలికెను.

45) శ్లో ॥ రాక్షసాధమ ! రామస్య భార్యా మమిత తేజసః ।
ఉక్తవా నసి యత్పాపం క్వ గత స్తస్య మోక్ష్యసే ॥

భావము : రాక్షసాధముడవైన రావణా ! మహావీరుడగు రాముని ధర్మపత్ని నగు నన్నుద్దేశించి యిట్లు పాపపు మాటలాడిన నీవే లోకమున నెక్కడికి పోయినను నా శ్రీరాముడు నిన్ను విడువడు (నీ వాతని బారినుండి తప్పించుకొనలేవని భావము)

46) శ్లో ॥ అసందేశాత్తు రామస్య తపసశ్చానుపాలనాత్ ।

న త్వాం కుర్మి దశగ్రీవ భస్మ భస్మార్హ తేజసా ॥

47) శ్లో ॥ నాపహర్తు మహం శక్యా త్వయా రామస్య ధీమతః ।

విధి స్తవవధార్థాయ విహితో నాత్ర సంశయః ।

తవక్షయాద్యశోహాని ర్మత్పతేస్స్యహ్యతే మయా ॥

భావము : నా భర్తయగు రామునియాజ్ఞలేని కారణముగను, పాతివ్రత్యవ్రతపాలనము వలనను, దశకంధరా ! రావణా ! నా పాతివ్రత్యమహిమచే భస్మముచేయదగినవాడవైనను నిన్ను భస్మీభూతునిగా చేయలేదు.

బుద్ధిశాలియగు రాముని చెంతనున్న నన్ను నీవపహరింపలేవు. నీకు చావు మూడుటకై విధి నన్నతనికి దూరము చేసినది. ఇది నిశ్చయము. నేనే నిన్ను చంపినచో రాముని కీర్తికి భంగము వాటిల్లునని నిన్ను క్షమించితిని.

48) శ్లో ॥ సీతాయాః వచనం శ్రుత్వా రావణో రాక్షసాధిపః ।

వివృత్య నయనే క్రూరే జానకీమన్వవైక్షత ॥

49) శ్లో ॥ నీలజీమూతసంకాశో మహాభుజశిరోధరః ।

శ్మశానచైత్యప్రతిమో భూషితోఽపి భయంకరః

50) శ్లో ॥ సందిదేశ తత స్సర్వా రాక్షసీర్ఘోరదర్శనాః ॥

భావము : రాక్షసేశ్వరుడగు రావణుడు సీత మాటలను విని, మిక్కిలి కోపించినవాడై భయంకరములగు నేత్రములతో సీతను చూచెను.

నల్లనిమేఘమువంటి శరీరముతో, విశాలభుజములు కలిగి మహోన్నత శిరస్సుతో నొప్పుచున్న రావణుడు, శ్మశానమందలి మంటపము వలె అలంకరింపబడియున్నను వెఱపును గొల్పుచున్నవాడై భయంకరాకారము గల రాక్షస స్త్రీలతో నిట్లనెను.

51) శ్లో ॥ యథా మద్వశగా సీతా క్షిప్రం భవతి జానకీ ।

తథా కురుత రాక్షస్య స్సర్వాః ! క్షిప్రం సమేత్య చ ॥

భావము : ఓ రాక్షసస్త్రీలలారా ! మీరందరు కలసి జనకరాజపుత్రియగు యీ సీత నా వశమగునట్లు అనగా తనకు తానుగా నాయందనురాగము కలదగునట్లు చేయుడు.

52) శ్లో ॥ ఇతి ప్రతి సమాదిశ్య రాక్షసేంద్రః పునః పునః ।
కామమన్యుపరీతాత్మా జానకీం పర్యతర్జయత్ ॥

భావము : రాక్షస రాజగు రావణుడీ విధముగా రాక్షస స్త్రీలకాజ్ఞాపించి కామ క్రోధములతిశయింపగా మరల సీతను భయపెట్టుసాగెను.

53) శ్లో ॥ ఉపగమ్య తతః క్షిప్రం రాక్షసీ ధాన్యమాలినీ ।
పరిష్వజ్య దశగ్రీవ మిదం వచన మబ్రవీత్ ॥

54) శ్లో ॥ మయాక్రీడ మహారాజ ! సీతయా కిం తవానయా ।
న కులేన న రూపేణ న దాక్షిణ్యేన మైథిలీ ॥

55) శ్లో ॥ మయాధికా వా తుల్యా వా త్వం తు మోహాన్న బుధ్యసే ।
అకామాం కామయానస్య ప్రీతిర్భవతి శోభనా ॥
ఇచ్ఛన్తీం కామయానస్య శరీర ముపతప్యతే ॥

56) శ్లో ॥ ఏవముక్తస్తు రాక్షస్యా సముతిక్షప్త స్తతో బలీ ।
ప్రహస న్మేఘసంకాశో రాక్షస స్సన్యవర్తత ॥

భావము : ఇంతలో ధాన్యమాలిని యను రాక్షస స్త్రీ (మండోదరి) రావణుని సమీపించి కౌగలించుకొని యిట్లు పలికెను.

మహారాజా ! ఈ సీతతో నీ కేల? నాతో క్రీడించుము. ఈ సీత రూప లావణ్యకులదాక్షిణ్యములలో నా కన్న గొప్పదీ కాదు, నాకు సమానమైనది కూడా కాదు. నీవీమె యందలి వ్యామోహముచే నన్ను (నా రూపలావణ్యకుల సౌందర్యములను) తెలియకున్నావు.

తనను కామించని స్త్రీని ప్రేమించినచో శరీరము పరితపించి కృశించును. తనను ప్రేమించిన స్త్రీని ప్రేమించినచో చక్కని యానందము కలుగును.

ఈ విధముగా మండోదరిచే నిషేధింపబడి నివర్తింపజేయబడిన నల్లని కారు మబ్బువంటి మేనిఛాయ గల రావణుడు బిగ్గరగానవ్వుచూ అచటి నుండి మరలిపోయెను.

శ్రీపాదుక : ఇచ్చట 53వ శ్లోకములో "రాక్షసీ ధాన్యమాలినీ" అని చెప్పబడిన ధాన్యమాలిని రావణుని భార్యయగు మండోదరియని గ్రహించాలి.

మండోదరియే మందోదరి, ధాన్యమాలిని యని పర్యాయపదములచే రామాయణములో వర్ణింపబడినది. వాల్మీకి రామాయణములో ఇదే సుందర కాండలోని 58వ సర్గలో బుద్ధిమద్వరిష్ఠుడగు హనుమ ఇదే ప్రసంగమును వానరులకు తెలియజెప్పుచూ –

"మైథిలీం హంతుమారబ్ధః స్త్రీభిర్హాహాకృతం తదా ।
స్త్రీణాం మధ్యాత్సముత్పత్య తస్య భార్యా దురాత్మనః ।
వరా మండోదరీ నామ తయా స ప్రతిషేధితః ॥"

(రావణుడు సీతను వధించుటకుద్యమింపగా స్త్రీ లందరు హాహాకారములు చేయుచుండగా రావణుని స్త్రీ పరివారములో ఉత్తమురాలును, అతని భార్యయునగు మండోదరి యతనిని వలదనివారించెను) – అని చెప్పును.

ఇదే ప్రసంగము అధ్యాత్మరామాయణములో కూడ – "మండోదరీ నివార్యాహ పతిం పతిహితే రతా" స్పష్టముగా రావణుని హితమును కోరునట్టి అతని భార్య మండోదరి యతనిని వారించినట్లు స్పష్టముగా తెలుపబడినది.

కావున, ధాన్యమాలిని రావణుని భార్యయగు మండోదరియనియే గ్రహించవలెను. ఇతర స్త్రీలకు రావణుని నిషేధించి, నివారించునంతటి చొరవ, ధైర్యము ఉండదు కదా !

57) శ్లో ॥ స మైథిలీం ధర్మపదా మవస్థితామ్ ।
ప్రవేపమానం పరిభర్త్స్య రావణః ।
విహాయ సీతాం మదనేన మోహితః ।
స్వమేవ వేశ్మ ప్రవివేశ భాస్వరమ్ ॥

ఇతి శ్రీరామాయణసారోద్ధారే సుందరకాండేసప్తమ స్సర్గః

భావము : తరువాత నా రావణుడు పతివ్రతాధర్మపరాయణయు, విశేషభయకంపితయునగు సీతనువీడి కామమోహితుడై ప్రకాశవంతమైన తన మందిరమును ప్రవేశించెను.

ఇది శ్రీమద్రామాయణ సారోద్ధారము నందలి సుందరకాండలోని ఏడవ సర్గము.

సర్గాంతశ్లోకసంఖ్య–(343+57=400)

అష్టమ సర్గః

మహాదేవః –

మహాదేవుడు పార్వతికిట్లు చెప్పుచున్నాడు.

1) శ్లో ॥ తతస్సీతా ముపాగమ్య రాక్షస్యో భీమ దర్శనాః ।
పరుషం పరుషానార్య ఊచుస్తాం వాక్యమ ప్రియమ్ ॥

అవతారిక – ఉమాసంహితలో శ్రీమహాదేవుడు రామకథను పార్వతికి వివరించుచు నిట్లు పలికెను. రావణుడు సీతను భయపెట్టిన ప్రకారము ముందు సప్తమసర్గలో చెప్పబడినది. దానికనుసంధానముగా ప్రస్తుత వచనము ప్రారంభమగుచున్నది. తతః అనునది ఆనంతర్యార్థకమగు అవ్యయము, పిమ్మట అని భావము. కాగా రావణుడు పలువిధముల సీతను వెఱపు కొలుపు వాక్యములతో భయపెట్టి వెడలిన పిమ్మట అని భావము.

భావము : రావణుడావిధముగ సీతను భయవిహ్వలనుచేసి పిమ్మట భయంకారాకారమును ప్రదర్శించు వారును, పరుషస్వభావము కలవారును కావుననే పూజనానర్హులగు రాక్షసస్త్రీలు సీతను సమీపించి అప్రియములు, పరుషములునగు వచనములను పలికిరి.

2) శ్లో ॥ రాక్షసీనాం వచ శ్రుత్వా సీతా పద్మనిభేక్షణా ।
నేత్రాభ్యా మశ్రుపూర్ణాభ్యా మిదం వచన మబ్రవీత్ ॥

భావము : ఆ రాక్షస స్త్రీల యొక్క పరుష వచనములను విని, పద్మపత్రములను బోలిన కన్నులుకల సీత, కన్నీరు నిండిన కన్నులుకలదై ఇట్లు పలికెను.

3) శ్లో ॥ కామం ఖాదత మాం సర్వాః న కరిష్యామి వో వచః ।
దీనో వా రాజ్యహీనో వా యో మే భర్తా స మే గురుః ।
తం నిత్యమనురక్తాస్మి యథా సూర్యం సువర్చలా ॥

4) శ్లో ॥ అరుంధతీ వసిష్ఠం చ రోహిణీ శశినం యథా ।
లోపాముద్రా యథాగస్త్యం కేశినీ సగరం యథా ।
నైషధం దమయన్తీవ భైమీ పతిమనువ్రతా ।
తథాహ మిక్ష్వాకువరం రామం పతిమనువ్రతా॥

భావము : మీరందరు కలిసి నన్ను తినివేసినా సరే ! నేను మీ మాటలను అనుసరింపను. దీనుడైనను, రాజ్యహీనుడైనను నా భర్తయే నాకు సర్వోత్తముడు. సూర్యుని తేజస్వినీశక్తి సువర్చల అతని యందెట్లు అనురక్తురాలో అట్లే నేనును నా భర్తయగు రాముని ప్రేమించుచున్నాను.

4) పతివ్రతాలలామయగు అరుంధతి వసిష్ఠుని యందును, రోహిణి చంద్రుని యందును, లోపాముద్రా దేవి అగస్త్యుని యందును, కేశిని సగరుని యందును భీమరాజనందిని యగు దమయన్తి నిషధాధిపతియగు నలుని యందును, నిత్యము వీడని యనురాగము నెట్లు కలిగియున్నారో, అదే విధముగా నేనును ఇక్ష్వాకు వంశశ్రేష్ఠుడు మరియు నా భర్తయగు రాముని యందు సదా అనురాగము కలిగియున్నాను.

శ్రీపాదుక– ఇచ్చట సువర్చల సూర్యునియొక్క అనపాయిని అనగా అగ్నియొక్క దాహకత్వశక్తివలె నిత్యము నెడబాయక యుండుశక్తి అను **యౌగికార్థమునుమాత్రమే** గ్రహింపవలసియున్నది. ఏలనన సూర్యునకు ఛాయా, ఉషా, పద్మినులనుమాత్రమే భార్యలుగా పురాణములలో తెలియజేయబడినది. శక్తిశక్తిమంతులకు అభేదవివక్షలో నిత్యసంబంధమును భార్యాభర్తలుగా త్రిమూర్తులకు రూఢముగా సంభావింపబడినది. హనుమత్సువర్చలాసంబంధముకూడ ఆవిధముగా దాంపత్యార్థములోనే అనగా భార్యాభర్తలనెడి యర్థములోనే **రూఢమై నదని** తాత్పర్యము. పరాశరసంహితలో సువర్చల సూర్యసుతగా, హనుమంతుని భార్యగా స్పష్టముగా తెలియజేయబడినది.

5) శ్లో ॥ యదిదం లోకవిద్విష్ట ముదాహరత సంగతాః ।
నైతన్మనసి వాక్యం మే కిల్బిషం ప్రతిభాతిమే ॥

భావము : మీరింతకు పూర్వము పలికిన లోకమున సదాచార విరుద్ధములగు మాటలు నా మనస్సునకెంతయో పాపములుగా తోచినవి.

6) శ్లో ॥ అవలీన స్సనిర్వాక్యః హనుమాన్ శింశుపాద్రుమే ।
సీతాం సంతర్జయన్తీ స్తా రాక్షసీ రశృణోత్కపిః ॥

భావము : ఈ విధముగా నా రాక్షస స్త్రీలు సీతను భయపెట్టుచూ పలికిన పలుకుల నన్నింటిని శింశుపా వృక్షము నందు దాగియుండిన హనుమంతుడు మారాడక నిశ్చలముగా నుండి వినుచుండెను.

7) శ్లో ॥ రాక్షసీభి రవిజ్ఞాతః సీతాం విశ్వాసయన్నహమ్ ।
సంవదిష్య ఇతిహ్యాసాం నిద్రాం ప్రత్యైక్షత ప్రభుః ॥

భావము : ఈ రాక్షస స్త్రీలకు కనిపింపకుండ నేను సీతను నమ్మబలికెదనని తలంచి హనుమంతుడు వారి నిద్రాసమయమునకై ప్రతీక్షించుచుండెను.

శ్రీపాదుక : ఈ శ్లోకము శివరామాయణములోనిదిగా చెప్పబడినది.

8) శ్లో ॥ తస్యాస్సా దీర్ఘవిపులా వేపన్త్యా సీతయా తదా ।
దదృశే కంపినీ వేణీ వ్యాళీవ పరిసర్పతీ ॥

భావము : ఆ సమయమున భయకంపితయై వణకుచున్న సీతామాత యొక్క పొడవుగా విస్తరించియున్న జడ, అంతటను వ్యాపించి ప్రాకుచున్న నల్లత్రాచుపాము వలె నచటి రాక్షసస్త్రీలచే చూడబడెను. అనగా వారామె సుదీర్ఘమగు నీలవేణిని తమ వైపునకు ఎగబ్రాకుచున్న కృష్ణసర్పమువలె చూచి భీతిల్లిరని భావము.

9) శ్లో ॥ సా భర్త్స్యమానా భీమాభీ రాక్షసీభిర్వరాననా ।
సా బాష్ప మపమార్జన్తీ శింశుపాం తా ముపాగమత్ ।
అభిగమ్య విశాలాక్షీ తస్థౌ శోకపరిప్లుతా ॥

10) శ్లో ॥ సాత్వ శోకస్య విపులాం శాఖా మాలంబ్య పుష్పితామ్ ।
చింతయామాస శోకేన భర్తారం భగ్నమానసా ॥

భావము : చక్కని ముఖశోభతో నలరు ఆ సీత వెఱపును గొల్పు రాక్షస స్త్రీలచే బెదిరింపబడుచున్నదై కన్నీటిని గార్చుచు, (ఎచ్చటికిని పోజాలక) హనుమంతుడు దాగియున్న ఆ శింశుపా వృక్షమునే చేరి దాని మూలము నాశ్రయించి, దుఃఖార్తయై వెడద కన్నులతో పరికించుచు నిలచెను.

ఆమె ఆ యశోకవృక్షము యొక్క విరబూసిన కొమ్మనొకదానిని ఆనుకొని దుఃఖముచే పగిలిన మనసు కలదై విలపించుచు భర్తయగు రాముని గూర్చి యాలోచించుచుండెను.

11) శ్లో ॥ సా నిశ్వసంతీ దుఃఖార్తా శోకోపహతచేతనా ।
ఆర్తా వ్యసృజ దశ్రూణి మైథిలీ విలలాప హ॥

భావము : దుఃఖార్తయగు ఆ సీత కడుంగడు దుఃఖమునిండిన మనసుతో బిగ్గరగా నిట్టూర్చుచు, కన్నుల నుండి కన్నీరు గార్చుచు బిగ్గరగా విలపించెను.

12) శ్లో ॥ హా రామేతిచ దుఃఖార్తా హా పునర్లక్ష్మణేతి చ ।
హా శ్వశ్రు మమ కౌసల్యే హా సుమిత్రేతి భామినీ ॥

13) శ్లో ॥ లోకాపవాద స్సత్యోఽయం పండితై స్సముదాహృతః ।
అకాలే దుర్లభో మృత్యుః స్త్రియా వా పురుషస్య వా ॥

భావము : దుఃఖపీడిత యగు సీతాదేవి హా రామా! యనియు మరల లక్ష్మణా! యని, హా అత్తా కౌసల్యా దేవీ!, హా సుమిత్రా యని మిక్కిలి దుఃఖిచుచు, అహా లోకమున స్త్రీకి గాని పురుషునకు గాని అకాలమున అనగా తలచిన వెంటనే చావు లభించుట దుర్లభము అని, పండితులు చెప్పిన లోకప్రసిద్ధ వచనము సత్యమైనది కదా!

14) శ్లో ॥ కీదృశం తు మయా పాపం పురా జన్మాంతరే కృతమ్।
యేనేదం ప్రాప్యతే దుఃఖం మయా ఘోరం సుదారుణమ్ ॥

15) శ్లో ॥ అశ్మసార మిదం నూనం అథవాప్యజరామరమ్ ।
హృదయం మమ యేనేదం న దుఃఖేనావశీర్యతే ॥

16) శ్లో ॥ న చాప్యహం చిరం దుఃఖం సహేయం ప్రియవర్జితా ।
చరణేనాపి సవ్యేన న స్పృశేయం నిశాచరమ్ ॥

17) శ్లో ॥ రావణం కిం పునరహం కామయేయం విగర్హితమ్ ।
ప్రత్యాఖ్యాతం న జానాతి నాత్మానం నాత్మనః కులమ్ ॥
యో నృశంస స్వభావేన మాం ప్రార్థయితుమిచ్ఛతి ॥

భావము : పూర్వజన్మము నందునేనెట్టి పాపమును చేసితినో కదా! కావుననే నేనిపుడింతటి భయంకరమైన ఘోరదుఃఖమును పొందితిని.

ఇంతటి భయంకరదుఃఖమునందు కూడ నా హృదయము బ్రద్దలుకాలేదు. కావున ఈ నా గుండె ఱాతివలె బండబారి శాశ్వతముగా నుండునని తలంచెదను.

నా ప్రియుని విరహజమగు దుఃఖమును నేనిక చిరకాలము సహింపలేను. నా యెడమ పాదముచే కూడ తాకుటకనర్హుడగు ఈ రావణుని నేనెంత మాత్రము స్పృశింపను.

నిందార్హుడగు యీ రావణుని నేను కామించుటయా? (అని సీత రాక్షస స్త్రీలతో చెప్పెనని భావము)

ఓ రాక్షసాంగనలారా! క్రూరస్వభావముచే నన్ను కోరుచున్న మీ యీ రావణుడు నేను అతనిని నిరాకరించినట్లు తెలియకున్నాడు. అట్లే అతని వంశము యొక్క ఉదాత్తతను కూడ గుర్తించుట లేదు.

18) శ్లో ॥ ఇహస్థాం మాం నజానీతే శంకే లక్ష్మణపూర్వజః ।
హృతేతి యోఽధిగత్వా మాం రాఘవాయ నివేదయేత్ ॥
గృధ్రరాజ్యోఽపి న రావణేన నిపాతితః ॥

భావము : లక్ష్మణుని యన్నగారైన శ్రీరామచంద్రుడు నేనిక్కడయున్నానని యెఱుగడు. నేనిట్లు రావణునిచే నపహరింపబడినట్లు తెలిసికొని శ్రీరామునకు నివేదింపగల గృధ్రరాజగు జటాయువుకూడ రావణునిచే చంపబడినాడు.

19) శ్లో ॥ యది మా మిహ జానీయా ద్వర్తమానాం స రాఘవః ।
అద్య బాణై రభిక్రుద్ధః కుర్యాల్లోక మరాక్షసమ్ ॥

భావము : మా రాముడే గనుక నే నీ విధముగా నిక్కడ యున్నట్లు తెలిసికొనినచో కోపించినవాడై లోకములో రాక్షసవంశమే లేకుండ నిర్మూలించి యుండెడివాడు.

20) శ్లో ॥ తతో నిహతనాథానాం రాక్షసీనాం గృహే గృహే ।
యథాఽహ మేవం రుదతీ తథా భూయో న సంశయః ॥
భవిష్యతి పురీ లంకా నష్టభర్త్రీ యథాంగనా ॥

భావము : ఆ విధముగా రావణుడు మరియు రాక్షసులందరు మరణించిన పిమ్మట (లంకలో) ప్రతి యింటియందును రాక్షసస్త్రీలు భర్తృవియోగ దుఃఖముతో, నావలె ఏడ్చెదరు. ఈ విషయమున నిశ్చయమే గాని సంశయమే మాత్రము లేదు. ఈ లంకాపురి భర్తృమరణమునందిన విధవరాలువలె కాంతివిహీనమైనది కాగలదు.

21) శ్లో ॥ యది కశ్చిత్ప్రదాతా మే విషస్యాద్య భవేదిహ ।
క్షిప్రం వైవస్వతం దేవం పశ్యేయం పతినా వినా ॥

భావము : ఇప్పుడిక్కడ నాకెవడైనను విషమునిచ్చు దాత లభించినచో నేనిప్పుడే ఆ విషమును సేవించి, భర్త నాతో లేకున్నను యముని సందర్శించెదను. అనగా మరణింతునని భావము

22) శ్లో ॥ ధన్యాః ఖలు మహాత్మానో మునయః త్యక్త కిల్బిషాః ।
జితాత్మనో మహాభాగా యేషాం న స్తః ప్రియాప్రియే ॥
జీవితం త్యక్తు మిచ్ఛామి శోకేన మహతా వృతా ॥

భావము : ఇష్టానిష్టములైన ద్వంద్వములను విషయసుఖములను త్యజించిన పుణ్యశీలురు, జితేంద్రియులు మహానుభావులునగు మహర్షులెంతయో ధన్యాత్ములు. మహాదుఃఖాక్రాంతనగు నేనిప్పుడే యసువులను బాయ గోరుచున్నాను.

23) శ్లో ॥ ప్రసక్తాశ్రుముఖీ త్యేవం బ్రువన్తీ జనకాత్మజా ।
ఉన్మత్తేవ ప్రమత్తేవ భ్రాన్తచిత్తేవ భామినీ ।
ఉపావృత్తా కిశోరీవ నివేష్టన్తీ మహీతలే ॥

భావము : జనకరాజనందినియగు సీత యీవిధముగా, కన్నీళ్ళనుకార్చు ముఖముతో పిచ్చిదానివలె, మైమరచినది వలె, చిత్తవిభ్రమమునొందినదానివలె దుఃఖార్తయగు శిశువువలె భూమిపై పొర్లుచు విలపించెను.

24) శ్లో ॥ నాజానా జ్జీవతీ రామ స్స మాం లక్ష్మణపూర్వజః ।
జానన్తౌ తౌ న కుర్యాతాం నోర్వ్యాం హి మమ మార్గణమ్ ।
నూనం మమైవ శోకేన స వీరో లక్ష్మణాగ్రజః ।
దేవలోక మితో యాత స్త్యక్త్వా దేహం మహీతలే ॥

భావము : లక్ష్మణాగ్రజుడగు రామునకు సీత యీ విధముగా జీవించి యున్న వైనము తెలియదు. తెలిసియున్న యెడల రామలక్ష్మణులీ భూమండలములో నన్ను వెదకకుండ యుందరు. (తప్పక యీ పాటికి నా జాడ తెలిసికొని యుండెడివారని భావము)

నిశ్చయముగా లక్ష్మణ భ్రాతయగు శ్రీరాముడు నా విషయకమైన దుఃఖములో ఈ భూతలమును వీడి దేవలోకమగు స్వర్గమునకేగి యుండును.

25) శ్లో ॥ ధన్యా దేవా స్సగంధర్వా స్సిద్ధాశ్చ పరమర్షయః ।
మమ పశ్యన్తి యే నాథం రామం రాజీవలోచనమ్ ॥

26) శ్లో ॥ అథవా రాక్షసేంద్రణ రావణేన దురాత్మనా ।
ఛద్మనా సాదితౌ శూరౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ ॥
సాఽహ మేవం గతే కాలే మర్తు మిచ్ఛామి సర్వథా ॥

27) శ్లో ॥ ఇత్యుక్తా స్సీతయా ఘోరా రాక్షస్యః క్రోధమూర్ఛితాః ।
కాశ్చి జ్జగ్ముః తదా ఖ్యాతం రావణస్య తరస్వినః ॥

భావము : పదపత్రాక్షుడు, నా స్వామియునగు శ్రీరాముని కన్నులారగాంచిన స్వర్గలోకములోని గంధర్వాది దేవతలు, సిద్ధులు, మహర్షులు మొదలగు వారందరు ధన్యులు.

పక్షాంతరమున దుర్మార్గుడగు రాక్షస రాజగు రావణునిచే, మోసముచే పరాక్రమోపేతులగు రామలక్ష్మణులు చంపబడియుందురు. కావున నేనీ సమయమున నేనెట్లైనను మరణింపగోరుచున్నాను.

అని సీత రాక్షస స్త్రీలతో పలుకగా వారు మిక్కిలి కోపించిరి. వారిలో కొందరీ విషయమును రావణునకు విన్నవించుటకై త్వరగా వెళ్ళిరి.

28) శ్లో ॥ సీతాం తాభి రనార్యాభి ర్దృష్ట్వా సంతర్జితాం తదా ।
రాక్షసీ త్రిజటా వృద్ధా శయానా వాక్యమబ్రవీత్ ॥

29) శ్లో ॥ ఆత్మానం ఖాదతానార్యా న సీతాం భక్షయిష్యథ ।
స్వప్నో హ్యద్య మయా దృష్టో దారుణో రోమహర్షణః ॥

30) శ్లో ॥ రాక్షసానా మభావాయ భర్తు రస్యా జయాయ చ ॥

భావము : దుష్టురాండ్రగు రాక్షస స్త్రీలచే బహువిధములుగా బెదరింపబడుచున్న ఆ సీతను జూచి అంతవరకు అచట నిదురించుచున్న వృద్ధురాలైన త్రిజటయను రాక్షసాంగన వారితో నిట్లు పలికెను.

ఓ దురాత్ములారా! మీరు సీతను తినవద్దు (బదులుగా) నన్ను తినుడు. నాచే యిప్పుడే మిక్కిలి భయంకరమైనదియు, ఒడలు గగుర్పొడుచునట్టిదియు

రాక్షసుల వినాశమును, ఈమె భర్తయగు రాముని జయమును సూచించునదగు స్వప్నము చూడబడినది.

31) రాక్షస్య ఊచుః –

32) శ్లో ॥ కథయస్వ త్వయా దృష్టః స్వప్నోఽయం కీదృశో నిశి ।
ఉవాచ వచనం కాలే త్రిజటా స్వప్నసంశ్రితమ్ ॥

భావము : అపుడా రాక్షస స్త్రీలామెతో – 'రాత్రి నీచే చూడబడిన కల ఎట్టిదో చెప్పు' మనిరి. బదులుగా త్రిజట తన స్వప్నవృత్తాంతము నిట్లు చెప్పెను.

త్రిజటాస్వప్నవృత్తాంతము :

33) శ్లో ॥ స్వప్నే చాద్యమయా దృష్టా సీతా శుక్లాంబరావృతా ।
రామేణ సంగతా సీతా భాస్కరేణ ప్రభా యథా ॥

భావము : ఇప్పుడే స్వప్నమునందు నాచే తెల్లనివస్త్రములను ధరించి, రామునితో కూడిన సీత, సూర్యునితో కూడిన కాంతివలె కనిపించినది.

34) శ్లో ॥ తతోఽన్యత్ర మయా దృష్టో రామో రాజీవలోచనః ।
ఆసీనః ప్రాఙ్ముఖః శ్రీమాన్ ఆసనే పరమాద్భుతమ్ ॥

35) శ్లో ॥ అభిషిక్తస్తు కాకుత్థ్సః సర్వదేవైర్నమస్కృతః ।
సబ్రహ్మర్షిగణై స్సర్వైః సర్వతీర్థజలేన చ ॥

36) శ్లో ॥ పునరేవ మయా దృష్టో రామో రమయతాం వరః ।
విష్ణురేవ స్వయంభూత్వా తస్మి న్నాస్తే వరాననే ॥

37) శ్లో ॥ పరంబ్రహ్మ పరం తత్త్వం పరం జ్ఞానం పరం తపః ।
పరం బీజం పరం క్షేత్రం పరం కారణకారణమ్ ॥

38) శ్లో ॥ శంఖచక్రగద శ్రీమాన్ పుండరీకాయతేక్షణః ।
శ్రీవత్సవక్షా నిత్యశ్రీ రజేయ శ్శాశ్వతో ధ్రువః ॥

39) శ్లో ॥ ఏవం భూతో మహాతేజా రామః కమలలోచనః ।
ఆరుహ్య పుష్పకం దివ్యం విమానం సూర్యసన్నిభమ్ ॥

40) శ్లో ॥ లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయాసహ రాఘవః ।

ఉత్తరాం దిశ మాలోక్య జగామ పురుషోత్తమః ॥

భావము : తరువాత మరియొక వైపున పుండరీకదళాయత నేత్రుడగు రాముడు శోభాయమానముగ పరమాద్భుతమగు ఆసనమున తూర్పుముఖముగా కూర్చొనియున్న వాడె కనిపించెను.

అతడు సమస్త బ్రహ్మర్షిదేవతా సమూహములచేతను, సర్వతీర్థ జలములచేతను అభిషిక్తుడై నమస్కరింపబడుచుండెను.

మఱియు అతిలోకసుందరుడగు ఆ శ్రీరాముడు సాక్షాన్నారాయణ మూర్తి యగు విష్ణుభగవానునిగా ఆ దివ్యసింహాసనముపై విరాజిల్లుచుండెను.

అతడే పరతత్త్వమగు పరంబ్రహ్మ. పరమమైన జ్ఞానము. పరమమగు తపస్సు. పరమమగు మూలకారణ బీజము, క్షేత్రము కూడ. ఇట్లా పరాత్పరుడు కారణములన్నిటికిని పరమైన ఆదికారణము.

శంఖచక్రగదా సంశోభితుడును, పద్మపత్రవిశాలాక్షుడును, శ్రీవత్సాంకిత వక్షుడును నిత్యశ్రీయుతుడును, అజేయుడు, శాశ్వతుడు ధ్రువుడు నతడే.

ఈ విధమైన సర్వలక్షణసంశోభితుడూ, మహాతేజస్వియు, కమలలోచనుడు అగు రాముడు సూర్య సమకాంతివంతమగు పుష్పకవిమానమునధిరోహించి సోదరుడగు లక్ష్మణునితోడను, సీతాదేవి తోడను కూడిన పరమపురుషోత్తముడగు ఆ శ్రీరాముడు ఉత్తరదిశాముఖుడై వెడలిపోవుచు చూడబడినాడు.

41) శ్లో ॥ రావణశ్చ మయా దృష్టః క్షితౌ తైలసముత్క్షితః ।

విమానా త్పుష్పకాదద్య రావణః పతితో భువి ॥

42) శ్లో ॥ కంఠే బద్ధ్వా దశగ్రీవం ప్రమదా రక్తవాసినీ ।

కాలీ కర్దమ లిప్తాంగీ దిశం యామ్యాం ప్రకర్షతి ॥

43) శ్లో ॥ ఏవం తత్ర మయా దృష్టః కుంభకర్ణో నిశాచరః ।

రావణస్య సుతాస్సర్వే దృష్టాః తైలసముత్క్షితాః ॥

44) శ్లో ॥ ఏకస్తత్ర మయా దృష్టః శ్వేతచ్ఛత్రో విభీషణః ।
శుక్లమాల్యాంబరధర శ్శుక్ల మాల్యానులేపనః ॥

45) శ్లో ॥ ఆరుహ్య శైలసంకాశం మేఘస్తనితనిస్వనమ్।
చతుర్దన్తం గజం దివ్య మాస్తే తత్ర విభీషణః ॥

46) శ్లో ॥ చతుర్దన్తం గజం దివ్యమాస్తే తత్ర విభీషణః ।
చతుర్భి స్సచివైస్సార్థం వైహాయసముపస్థితః ॥

భావము : రావణుడుకూడ నాచే భూతలమున శరీరమంతయు నూనె పూసుకొని యున్నట్లును, పుష్పకవిమానముపైనుండి భూమిపై బడినట్లును చూడబడినాడు.

అతనిని ఎఱ్ఱని వస్త్రములను ధరించిన నల్లని శరీరకాంతికల కాళీశక్తి ఒడలంతయు బురదను పూసికొని, రావణుని మెడను బంధించి దక్షిణ దిక్కునకు పట్టిలాగుచున్నట్లు కనబడినాడు.

ఇట్లే రావణానుజుడగు కుంభకర్ణుడు మఱియు రావణునిపుత్రులు అందరును కూడ శరీమంతయు నూనెను పూసికొనినవారుగా చూడబడినారు.

విభీషణుడొక్కడు మాత్రము తెల్లని గొడుగును, తెల్లని పుష్పమాల్యాదులను ధరించి, తెల్లని సుగంధలేపనమును పూసుకొని

గొప్ప పర్వతమువలె నున్నతమైనదియు, మేఘగర్జనను పోలి ఘీంకరించుచున్నట్టి, నాలుగు దంతములతో శోభిల్లు దివ్యమైన ఏనుగునెక్కిన వాడుగా చూడబడినాడు.

అతడు తన నలుగురు మంత్రులతోపాటు ఆకాశమార్గమున కనబడెను.

47) శ్లో ॥ లంకా దృష్టా మయా స్వప్నే రావణేనాభిరక్షితా ।
దగ్ధా రామస్య దూతేన వానరేణ తరస్వినా ॥

భావము : రావణ రక్షితమగు ఈ లంక కూడ బలవంతుడును, రామదూతయు నగు ఒక వానరునిచే కాల్చబడుచున్నట్లు చూచితిని. (కావున)

48) శ్లో ॥ అవగచ్ఛత నశ్యధ్వం సీతామాప స రాఘవః ।
రావణం రాఘవో ఘోరే భార్యా హర్తారమాహవే ॥

49) శ్లో ॥ ఘాతయేత్పరమామర్షీ సర్వై స్సార్థం హి రాక్షసైః ।
తదలం క్రూరవాక్యై ర్వః సాంత్వ మేవాభిధీయతామ్ ॥

50) శ్లో ॥ అభియాచామ వైదేహీ మేతద్ధి మమ రోచతే ।
భర్త్సితామపి యాచధ్వం రాక్షస్యః ! కిం వివక్షయా ॥

51) శ్లో ॥ ప్రణిపాత ప్రసన్నాహి మైథిలీ జనకాత్మజా ।

భావము : ఓ రాక్షసాంగనలారా! శ్రీరాముడు సీతమ్మను పొందినట్లే, అతడు తన భార్యనపహరించిన రావణుని భయంకరమైనయుద్ధములో చంపును.

మిక్కిలి క్రోధపరవశుడై యతడు రాక్షసులందరితోసహా రావణుని వధించును. కావున మీరందరు క్రూరవచనములతో సీతను బెదిరించుట మాని సీతను వేడుకొనుడు.

రాక్షసస్త్రీల మయిన మనము అభిజాత్యమును విడిచి, మనచే పూర్వము భయపెట్టబడినప్పటి యా సీతమ్మనే (క్షమింపుమని) వేడుకొందము.

మిథిలాధిపతియగు ఆ జానకి ప్రపత్తితో నమస్కరించిన మనపట్ల తప్పక ప్రసన్నురాలగును.

52) శ్లో ॥ నిమిత్తభూత మేతత్తు శ్రోతు మస్యా మహత్ప్రియమ్ ।
దృశ్యతే చ స్ఫురచ్చక్షుః పద్మపత్రమివాయతమ్ ॥

53) శ్లో ॥ అకస్మా దేవ వైదేహ్యా బాహు రేకః ప్రకంపతే ।
వేపమాన స్సూచయతి రాఘవం పురతః స్థితమ్ ॥

54) శ్లో ॥ త్రిజటాయా వచ శ్శృత్వా భీతా స్తా రాక్షసస్త్రియః ।
తూష్ణీ మాసం స్తత్ర తత్ర నిద్రావశముపాగతాః ॥

ఇతి శ్రీ రామాయణసారోద్ధారే సుందరకాండే అష్టమస్సర్గః

భావము : ఇంతవరకు ఈమెకు గొప్ప ప్రియమును గూర్చునదిగా నేను వివరించిన ఈ నా కల కేవలము నిమిత్త మాత్రమే కావచ్చు.

ఇప్పుడు ప్రత్యక్షముగా పద్మపత్రము వలె విశాలమైన ఈమె యొక్క యెడమకన్నదురు చున్నది.

హఠాత్తుగా ఈ సీత యొక్క ఒక (ఎడమ) భుజము కూడా ప్రకంపించు చున్నది. ఈ విధముగా శుభసూచకముగా ప్రకంపించుట రాముని ప్రత్యక్షముగా ఎదురుగా నున్నట్లే భావింప చేయుచున్నది.

త్రిజటయొక్క ఈ వచనములను వినిన రాక్షసాంగనలు భయపడి

కొందరు మౌనమును వహించిరి. వారిలో మరికొందరు నిద్రాపరవశు రాంద్రయిరి.

ఇది శ్రీమద్రామాయణ సారోద్ధారమునందలి సుందరకాండలోని ఎనిమిదవ సర్గము.

శీపాదుక :- స్వప్నవిచారణము

మన భారతీయతత్త్వశాస్త్రములో స్వప్నజగత్తుకూడ విశేషముగా వివేచింపబడినది. జాగ్రత్ప్రపంచములోవలె జీవుడు (ఆత్మ) స్వప్న ప్రపంచములో కూడ సుఖదుఃఖములననుభవించును. జాగ్రదవస్థలో జీవుడు **'విశ్వుడు'**గా సుఖదుఃఖాదులననుభవించుననియు, అదే జీవుడు స్వప్నావస్థలో **'తైజసుడు'**గా సుఖదుఃఖాదులను అనుభవించును. అని మన వేదాంతశాస్త్రము ప్రవచించినది.

జాగ్రదవస్థలోని యనుభవము అనుభవకాలములో యథార్థముగనే గోచరించినట్లే, స్వప్నావస్థలో కలగాంచుచున్నంతసేపు ఆ స్వప్నానుభవము యథార్థముగనే తోచును. జాగ్రదవస్థలో స్వప్నము మిథ్య అనిపించును. కాని స్వప్నములలో కొన్ని జరుగబోవు విషయములను తెలియజేయును. ఈ విషయజాతమొక శాస్త్రముగా స్వప్నశాస్త్రమనుపేర పరిఢవిల్లినది. స్వప్నముల భవిష్యదర్థసూచన విషయములో ఈ త్రిజటాస్వప్నము కూడ ప్రామాణికోదాహరణముగా వివేచింపబడినది. 'సీతాదేవి యొుక్క శుక్లమాల్యాంబరధారణము, రామునితోపాటుగా ప్రాచీదిశాభిముఖముగా పయనము, అభిషిక్తుడై పుష్పకవిమానము నధిరోహించిన శ్రీరాముని దేవర్షిగణములు స్తుతించుట, శ్రీరాముడు సాక్షాద్విష్ణుమూర్తిగా కనబడుట, అతడు పరాత్పరుడైన పరబ్రహ్మస్వరూపుడుగా భాసిల్లి మరల నుత్తరాభిముఖముగా దివ్యవిమానారూఢుడై వెడలుట యనునంశములు **సీతారాముల సమాగమము, శ్రీరామవిజయము** అను భావ్యర్థసూచకములు. అట్లే రావణుని తైలసముత్క్షిప్తత్వము, అతని దక్షిణాభిముఖముగా నల్లనివస్త్రము చే బంధింపబడి బలాత్కారముగా తీసికొనిపోబడుటవంటివి అతని భవిష్యత్పరాజయమును, విభీషణునిశ్వేతచ్ఛత్రమాల్యాంబరధారిత్వమతని

భవిష్యల్లంకాధిపత్యమును తెలియజేయును. ఈ విధముగా స్వప్న వృత్తాంతములు జరుగబోవు శుభాశుభములను సూచించునని స్వప్నశాస్త్రవిదులు చెప్పుదురు.

ఈ విషయమున ప్రమాణాంతరములను కూడ కొద్దిగా విచారించుదము. ఈస్వప్నములు శశవిషాణవత్ అనగా కుందేటికొమ్మువలె మిథ్యాప్రాయులనియు, అని కఫవాతపిత్తతత్త్వములు ప్రకోపింపబడినప్పుడు జీవునకు అనుభవగమ్యములగుచున్నవనియు కొందరిమతము.

'వాతకం, పైత్యకం స్వప్నం కఫజం చింతితం త్యజేత్ ।
స్వప్నే పైత్తికే పశ్యేత్ తుంగాద్రివ్యోమలంఘనమ్ ।
స్వర్ణరత్నాగ్ని మాల్యాని స్వప్నే పశ్యతి వాతకే ।
సరిత్తోయావగాహాది శుక్లం పుష్పం కఫోద్భవే ।
అభీప్సితం వా దృష్టం వా చింతా తం సముదాహృతమ్ ।
దృష్టం న శక్యతే వక్తుం యస్సంబంధం తు తత్త్యజేత్ ॥'

ఇత్యాత్రేయ వచనమ్ :

కఫవాతపిత్తములు ప్రకోపించుటచే స్వప్నములు కలుగుచున్నవి. పిత్తదోషాధిక్యముచే ఎత్తైనపర్వతములను దాటుచున్నట్లు, ఆకసముపైకెగిరినట్లును కలలు వచ్చును.

వాతదోషము ప్రబలినప్పుడు కలలో రత్నములు, పూలదండలు దొరికినట్లు అగ్ని దహించుచున్నట్లును కలలు వచ్చును.

కఫ ప్రకోపముచే నదీ ప్రవాహములో ప్రవేశించినట్లు, తెల్లని పూవులను దర్శించి గ్రహించినట్లును స్వప్నములు వచ్చును. అని యిట్లు చెప్పి సాధారణముగా మనము సంతతచింతనము చేయు విషయములు స్వప్నములందు కన్పట్టుచుండునని ఆత్రేయుడు వచించెను.

దేవతలు, పితృదేవతలు సిద్ధులు మొదలగువారు స్వప్నములో కనిపించివారు చెప్పినవి, వారియుపదేశములు సత్ఫలితములనిచ్చునని కూడ చెప్పబడినది.

శ్లో ॥ త్రిద్వ్యేక వర్షాత్ షణ్మాసాత్ఫలం యామక్రమాద్భవేత్ ।

పక్షాదుషసి సప్తాహాత్ఫలం స్వప్నోఽరుణోదయే ॥

కలలువచ్చిన సమయానుసారముగా నవి శుభాశుభఫలితముల నిచ్చునని చెప్పబడినది. రాత్రి మొదటిజామున వచ్చిన కలలు మూడు సంవత్సరములలోగా ఫలించును. అట్లే రెండవజామున కన్న కలలు రెండు సంవత్సరములలో ఫలించును. మూడవజామున వచ్చు కలలు సంవత్సరములో ఫలించును. నాల్గవజామున వచ్చిన కలలు ఆరు నెలలలో ఫలించును. ఉషఃకాలమున వచ్చిన కలలు 15 దినములలో ఫలించును. అరుణోదయ కాలంలో వచ్చిన కలలు వారము రోజులలో ఫలించునని చెప్పబడినది.

ఉమాసంహితలోని 8వ అధ్యాయము నందు కూడస్వప్నవిచారము విస్తారముగా గావింపబడినది. (

స్వప్నములు శుభాశుభఫలములను కలుగజేయుచున్నవను విషయము మనలో చాలామందికనుభవ వేద్యమే. అవి కేవల కాకతాళీయముల వంటివి కాదని మనకీ రామాయణవృత్తాంతమే ప్రమాణము.

పురాణములలోకూడా నచట నచట స్వప్న మీమాంస గావింపబడినది. బ్రహ్మాణ్డపురాణంలో స్వప్నము – **'మనోగతాన్ సంస్కారాన్ స్వేచ్ఛయా పరమేశ్వరః । ప్రదర్శయతి జీవాయ స స్వప్న ఇతి గీయతే।'** అనగా మన మనోగత సంసారములను పరమేశ్వరుడు జీవులకు ప్రదర్శించుచున్నాడు. అదియే స్వప్నమని తెలుపబడినది.

ఫలానుగుణముగా స్వప్నములు శుభస్వప్నములనియు, దుస్స్వప్నములనియు రెండు విధములు. వీనిలో దుఃస్వప్నములకు కొన్ని గ్రంథములలో నివారణోపాయము కూడా చెప్పబడినవి.

సు స్వప్నం బహుశో బ్రూయా ద్దుస్వప్నం గోపయేన్నరః ।

దుస్వప్నం శ్రాఽవయే ద్వాచా పశ్యేద్యద్వా పునః స్వపేత్ ॥

నోఽర్థం స్వప్యా చ్ఛోభనే స్వప్న దృష్టే పశ్చాద్దృష్టే యస్సుపాకం విధత్తే।

శంసన్నేష్టం తచ్చ సాధు ద్విజేభ్యః త్రైరాశీర్భిః పూజయేయుర్నరేంద్రాః॥

శుభస్వప్నము కలిగిన వెంటనే పలువురితో చెప్పాలి. చెడ్డకల వస్తే దాన్ని ప్రక్కనున్న వారితో చెప్పి మరల పరుండవలెను. మంచికల వస్తే ప్రక్కవారికి

చెప్పాక నిద్రపోకూడదు. నాల్గవజామున చెడ్డ కల వస్తే పెద్దల, బ్రాహ్మణులకు చెప్పి వారి ఆశీస్సులు తీసుకోవాలి. మహాభారతంలో దుష్ట స్వప్నాలు కలుగకుండా కేవలం మంచికలలు మాత్రమే కనే ఉపాయం ఇలా సూచించబడింది.

భజన్తం గజరాజానమవదన్మధుసూదనః ।
యే మాం త్వాం చ నరశ్చైవం గ్రహస్యచ విదారణమ్ ॥
గుల్మకీచక వేణూనాం రూపం చైవ మమాశ్రమమ్ ।
అశ్వత్థం భాస్కరం గంగాం నైమిశారణ్యపుష్కరమ్ ।
ప్రయాగం బ్రహ్మతీర్థంచ దండకారణ్య మేవచ ॥
పురాణం రామచరితం చ భారతాఖ్యాన ముత్తమమ్ ।
విభూతిం చ కురుక్షేత్రం గరుడం మేరుపర్వతమ్ ॥
యే స్మరిష్యన్తి మనుజాః ప్రయతాః స్థిరబుద్ధయః ।
దుస్స్వప్నో నశ్యతే తేషాం సుస్వప్నశ్చ భవిష్యతీతి ॥

ఆపదలో నుండి శ్రీమన్నారాయణమూర్తిని ధ్యానమార్గంలో సేవిస్తున్న గజేంద్రునితో విష్ణుమూర్తి–గజేంద్రా! ఏ మనుజుడు–నిన్ను, నన్ను, నాచే చంపబడిన ఈ మకరము యొక్క కథను, గుల్మ కీచక వేణు వినిర్మితమగు నా ఆశ్రమాన్ని, రావిచెట్టును, రవిని, గంగను, నైమిశారణ్యమును, పుష్కర తీర్థమును, ప్రయాగను, బ్రహ్మతీర్థమును, దండకారణ్యమును, శ్రీమద్రామాయణ మహాభారతాద్యుత్తమ పురాణములను, విభూతిని కురుక్షేత్రమును, గరుడుని, సుమేరుపర్వతమును నిశ్చలమనస్సుతో ధ్యానయోగంలో దర్శిస్తారో, లేదా భావిస్తారో వారి దుస్స్వప్నములు నశించి అవి సుస్వప్నములుగా పరిణమించి ఫలప్రదములౌతాయని భావము.

ఈ విచారణను బట్టి శ్రీమద్రామాయణాంతర్గతము ఈ త్రిజటాస్వప్నవృత్తాంతము కూడ దుస్స్వప్ననివారకము శుభఫలప్రదము అని నిస్సంశయముగా సంభావింపవచ్చును.

ఇది శ్రీమద్రామాయణ సారోద్ధారములోని సుందరకాండము నందలి 'త్రిజటా స్వప్న వృత్తాంతము' అను ఎనిమిదవ సర్గము.

సర్గాంతశ్లోకసంఖ్య–(400+54=454)

నవమ సర్గః

1) శ్లో ॥ తర్జితా రాక్షస స్త్రీభిః సీతా భీతాతివిహ్వలా ।
అశ్రుభిః పూర్ణనయనా చిన్తయన్తీదమబ్రవీత్ ॥

2) శ్లో ॥ హా రామ! హా లక్ష్మణ! హా సుమిత్రే!
హా రామమాత స్సహ మే జనన్యా ।
ఏషా విపద్యా మ్యహ మల్పభాగ్యా ।
మహార్ణవే నౌ రివ మూఢవాతా ॥

3) శ్లో ॥ నూనం స కాలో మృగరూపధారీ ।
మా మల్పభాగ్యాం లులుభే తదానీమ్ ।
యత్రార్యపుత్రం విససర్జ మూఢా ।
రామానుజం లక్ష్మణపూర్వజం చ ॥

4) శ్లో ॥ హా రామ సత్యవ్రత దీర్ఘబాహో !
హా పూర్ణచంద్ర ప్రతిమానవక్త్ర!
హా జీవలోకస్య హితః ప్రియశ్చ ।
వధ్యాం న మాం వేత్సి హి రాక్షసానామ్ ॥

5) శ్లో ॥ అహం తు రామ త్వయి జాతకామా ।
చిరం వినాశాయ నిబద్ధభావమ్ ।
మోఘం చరిత్వా చ తపోవ్రతం చ ।
త్యక్ష్యామి ధిగ్జీవిత మల్పభాగ్యా ॥

6) శ్లో ॥ సా జీవితం క్షిప్రమహం త్యజేయమ్ ।
విషేణ శస్త్రేణ శితేన వాపి ।
విషస్య దాతా న హి మేఽస్తి కశ్చిత్ ।
శస్త్రస్య వా వేశ్మని రాక్షసస్య ॥

7) శ్లో ॥ **శోకాభితప్తా బహుధా విచింత్య ।**
సీతాథ వేణ్యుద్గ్రథనం గృహీత్వా ।
ఉద్బధ్య వేణ్యుద్గ్రథనేన శీఘ్రమ్ ।
అహం గమిష్యామి యమస్య మూలమ్ ॥

8) శ్లో ॥ **దీర్ఘ వేణీ మమాత్యర్థ ముద్బన్ధాయ భవిష్యతి ।**
ఇతి నిశ్చిత్య సా వేణీ ముద్బధ్య స్వపతిం స్మరన్ ।
వృక్ష శాఖాం కరే ధృత్వా స్థితా శోకమహార్ణవే ॥

భావము : రాక్షసస్త్రీలచే బహువిధములుగా భయపెట్టబడిన సీత కన్నుల నీరునిండినదై తనలో నిట్లనుకొనెను.

2. హా రామా ! హా లక్ష్మణా ! హే సుమిత్రా ! ఓ కౌసల్యా మందభాగ్యురాలనగు నేను నడి సముద్రమున సుడిగాలి తగిలి మునుగుటకు సిద్ధముగా నున్న నావ వలె ఆపదలోనున్నాను.

3. నిశ్చయముగా నన్నా ప్రతికూలదైవమే మృగరూపమును ధరించి ప్రలోభపెట్టి ఆర్యపుత్రుడగు రామచంద్రుని, లక్ష్మణుని వీడునట్లు చేసినది.

4. సత్యప్రతిజ్ఞ కలవాడవు, ఆజానుబాహుడవు, పూర్ణచంద్ర సదృశాననా! ప్రాణికోటికంతకు హితమును ప్రియమును కూర్చువాడా! శ్రీరామచంద్రా! నన్నిట్లు రాక్షసులచే వధింపబడుటకు సిద్ధముగా నున్నట్లు తెలియకున్నావు కదా!

5. హే రామచంద్రా! నేను నీ యందే లగ్నమనస్కురాలనై నీపై పెట్టుకొనిన ఆశలు వ్యర్థమైనవి. నీ యందలి కోరికతో నేనొనరించిన అధశ్శయానోపవాసాది తపశ్చర్యలన్ని వ్యర్థమైనవి. మందభాగ్యనగు నేనీ పాడు జీవితమును విడిచెదనుగాక!

6. దుర్భాగ్యురాలనగు నేను విషభక్షణముచే కాని, పదునైన ఆయుధముచే గాని త్వరగా ప్రాణమును వీడగోరుచున్నాను. ఇచ్చట నాకు విషమును కాని, శస్త్రాద్యాయుధములను గాని యిచ్చువారెవ్వరు లేరు.

7. ఈ విధముగా సీత దుఃఖోద్వేగముచే పలువిధములుగా విలపించి, ఈ నా జడనే కేశపాశముగా నుఱివేసుకొని శీఘ్రముగా ప్రాణములను వీడి యమధర్మరాజు సన్నిధికి చేరుకొనియెదను గాక!

9) శ్లో ॥ తథాగతాం తాం వ్యథితా మనిందితామ్ ।
వ్యపేత హర్షాం పరిదీనమానసామ్ ।
శుభాం నిమిత్తాని శుభాని భేజిరే ।
నరం శ్రియాజుష్ట మివోపజీవినః ॥

10) శ్లో ॥ తస్యా శ్శుభం వామ మరాళపక్ష్మ
రాజీవృతం శుక్లవిశాలకృష్ణమ్ ।
ప్రాస్పందతైకం నయనం సుకేశ్యా ।
మీనాహతం పద్మ మివాభితామ్రమ్ ॥

11) శ్లో ॥ ఏవం నిశ్చిత బుద్ధిం తాం మరణాయాథ జానకీమ్ ।
విలోక్య హనుమాన్ కించిద్విచార్యైత దమన్యత ॥

భావము : పవిత్రచరిత్ర యగు ఆ సీత ఆ విధముగా బాధపడుచు, పరిదీనమనస్సుతో నున్న సమయమున ఆమెకు శుభమునుసూచించు శకునములు పొడచూపినవి.

ఆమెయొక్క శుభదృష్టి కల వంకరదిరిగిన కనుబొమ్మలతో ప్రకాశించు పద్మదళముల వంటి కాటుకకన్నులలో నొక (వామ) నేత్రము చేప తాకిడికి కదలిన పద్మమువలె యదరినది. ఈ విధముగా మరణమునకు (ఆత్మహననమునకు) నిశ్చయించుకొనిన బుద్ధికల సీతనుచూచి హనుమంతుడు తనలో నిట్లనుకొనెను.

12) శ్లో ॥ అనేన రాత్రి శేషేణ యది నాశ్వాస్యతే మయా ।
సర్వథా నాస్తి సందేహః పరిత్యక్ష్యతి జీవితమ్ ॥

13) శ్లో ॥ అన్తరం త్వహమాసాద్య రాక్షసీనా మిహ స్థితః ।
శనైరాశ్వాసయిష్యామి సంతాపబహులా మిమామ్ ॥

14) శ్లో ॥ అహం త్వతితనుశ్చైవ వానరశ్చ విశేషతః ।
వానరస్య విశేషేణ కథం స్యాదభిభాషణమ్ ॥

15) శ్లో ॥ వాచం చోదాహరిష్యామి మానుషీమిహ సంస్కృతామ్ ।
యదివాచం ప్రదాస్యామి ద్విజాతిరివ సంస్కృతామ్ ॥
రావణం మన్యమానా మాం సీతా భీతా భవిష్యతి ॥
16) శ్లో ॥ తతో జాత పరిత్రాసా శబ్దం కుర్యాన్మనస్వినీ ।
సీతయా చ కృతే శబ్దే సహసా రాక్షసీగణః ॥
17) శ్లో ॥ వధే చ గ్రహణే చైవ కుర్యుర్యత్నం యథాబలమ్ ।
విపన్నం స్యా త్తతః కార్యం రామసుగ్రీవయోరిదమ్ ।
ప్రాణత్యాగశ్చ వైదేహ్యా భవేదనభిభాషణే ॥
18) శ్లో ॥ అవశ్యమేవ వక్తవ్యం మానుషం వాక్యమర్థవత్ ।
ఇతి సంచింత్య హనుమాంశ్చకార మతిమాన్మతిమ్ ।
19) శ్లో ॥ రామ మక్లిష్టకర్మాణం స్వబన్ధు మనుకీర్తయన్ ।
సంశ్రవే మధురం వాక్యం వైదేహ్యా వ్యాజహార హ ॥

(శనై శ్శనై స్సూక్ష్మ రూపో జానక్యాశ్శ్రోత్రగం వచః ॥

భావము : నేనీ రాత్రితెల్లవారు లోపల సీతనోదార్చకున్నచో యీ సీత తప్పక ప్రాణములను విడచును. ఈ విషయమున సంశయమిసుమంతయును లేదు.

నేను ఇచ్చటనేయుండి ఈ రాక్షసస్త్రీలనుండి అవకాశము నందిపుచ్చుకుని మిక్కిలి పరితపించుచు దుఃఖించుచున్న ఈమెను నెమ్మదిగా నెట్లో ఓదార్చెదను.

నేను మిక్కిలి సూక్ష్మశరీరము కలవాడను. తత్రాపి వానరుడను. (కావున ఈ రాక్షసాంగనలు నన్ను గుర్తింపలేరు) వానరుడనగు నేనామెతో మాట్లాడుటెట్లు!

మనుష్యులకు వలె సంస్కృతభాషలో బ్రాహ్మణుని వలె మాట్లాడెదనేని, నన్ను రావణునిగా దలచి సీత భయపడును.

అప్పుడామె భయపడి శబ్దము చేయవచ్చును. (భయముతో కేకలనప్రయత్నముగా వేయవచ్చును) ఆ విధముగా నామె యరచినచో రాక్షసులు గుంపులుగా వచ్చి యథాశక్తిగా నన్ను పట్టుకొనుటకు లేదా వధించుటకు ప్రయత్నించెదరు.

ఆ పక్షమున రామసుగ్రీవులు నా ద్వారా సంకల్పించిన కార్యము వినష్టమగును. అట్లని నేనిపుడామెతో మాట్లాడకుండినచో సీత ప్రాణములను వీడును.

కావున, నేనిప్పుడు తప్పక మనుష్యభాషనవలంబించి అర్థవంతమగు వాక్యములను మాట్లాడెదనని బుద్ధిమంతుడగు హనుమంతుడు భావించెను.

ఇట్లు భావించి జానకీ ప్రాణకారకుడు అక్లిష్టకర్ముడును అగు స్వామి శ్రీరామునిగాథను నెమ్మదిగా సీతకుమాత్రమే వినబడునట్లుగా పలుకనారంభించెను.

20) శ్లో ॥ రాజా దశరథో నామ రథకుంజర వాజిమాన్ ।
పృథివ్యాం చతురన్తాయాం విశ్రుతః సుఖదః సుఖీ ॥
21) శ్లో ॥ తస్య పుత్రః ప్రియో జ్యేష్ఠః తారాధిపనిభాననః ।
రామో నామ విశేషజ్ఞ శ్శ్రేష్ఠ స్సర్వధనుష్మతామ్ ॥
22) శ్లో ॥ స భార్యః సహ చ భ్రాత్రా పిత్రాదేశాద్వనం గతః ।
తతస్త్వమర్షా పహృతా జానకీ రావణేన తు ॥
23) శ్లో ॥ తతస్స వాలినం హత్వా రామః పరపురంజయః ।
ప్రాయచ్ఛత్కపిరాజ్యం తత్సుగ్రీవాయ మహాబలః ॥
24) శ్లో ॥ సుగ్రీవేణాఽపి సందిష్టాః హరయః కామరూపిణః ।
దిక్షు సర్వాసు తాం దేవీం విచిన్వన్తి సహస్రశః ॥
25) శ్లో ॥ అహం సంపాతివచనా త్సాగరం వేగవాన్ ప్లుతః ।
అశ్రౌషం రాఘవస్యాహం సేయ మాసాదితా మయా ।
విరరామైవ ముక్త్వాసౌ వాచం వానరపుంగవః ॥

భావము : చతుస్సముద్రపరివ్యాప్తమగు యీ భూమండలమున గజాశ్వరథ బాహుళ్యము కలవాడుగా ప్రసిద్ధిగాంచిన దశరథుడనురాజు సుఖముగా నుండెను.

అతని కుమారులు (నలువురలో) పెద్దవాడును, అత్యంత ప్రియుడును, పూర్ణచంద్రబింబమును పోలినముఖము కలవాడును, ధనుర్ధరులందరిలో శ్రేష్ఠుడును, సర్వశాస్త్రవిశారదుడును రాముడు అనువాడుండెను.

అతడు తండ్రియగు దశరథునియాదేశముచే భార్యాసోదరులతో వనములకు వెళ్ళెను. అచ్చట రాక్షసరాజగు రావణుడతని భార్యయగు జానకిని కపటియై అపహరించెను.

పిమ్మట అరివీరభయంకరుడు మహాబలవంతుడునగు రాముడు వాలినిచంపి అతని వానరరాజ్యమును సుగ్రీవునకిచ్చెను.

అంతట సుగ్రీవునిచే పంపబడిన కామరూపులగు వానరులు వేలాది సంఖ్యలో ఆ దేవినన్వేషించుటకై అన్ని దిక్కులకు వెళ్ళిరి.

నేను సంపాతి వచనముననుసరించి అతి వేగముతో సముద్రమును దాటి యిచ్చటకు వచ్చి, రాముడే లక్షణములను చెప్పెనో ఆ లక్షణములు గల సీతను చూడగలిగితిని.

అని యిట్లు పలికి వానరశ్రేష్ఠుడగు హనుమంతుడు విరమించెను.

26) శ్లో ॥ జానకీ చాపి తచ్ఛ్రుత్వా విస్మయం పరమం గతా ॥

27) శ్లో ॥ తతస్సా వక్రకేశాన్తా సుకేశీ కేశసంవృతమ్ ।

ఉన్నమ్య వదనం భీరు శ్శింశుపావృక్ష మైక్షత ॥

భావము : హనుమంతుని వచనములను విన్న సీత పరమాశ్చర్యమును పొందెను.

పిమ్మట వంకరలు తిరిగిన సుందరమైన కేశపాశము కల సీత, భయపడుచున్నదై ముఖమును పైకెత్తి ఆ శింశుపావృక్షముపైకి చూచెను.

28) శ్లో ॥ సా దదర్శ కపిం తత్ర ప్రశ్రితం ప్రియవాదినమ్ ।

ఫుల్లాశోకోత్కరాభాసం తప్త చామీకరేక్షణమ్॥

భావము : ఆ సీత యచటనా శింశుపావృక్షముపై అత్యంత వినయశీలుడై ప్రియవచనములు పల్కుచున్న, విరబూసిన అశోకమువలె ప్రకాశించుచున్న వాడును, మెరుగుపెట్టబడిన పసిడివలె వెలుగొందు కన్నులుకలవాడును యగు వానరుని చూచెను.

29) శ్లో ॥ సా తం దృష్ట్వా హరిశ్రేష్ఠం వినీతవదుపస్థితమ్ ।

రురోద బహుధా సీతా మందం మందస్వరా సతీ ॥

30) శ్లో ॥ మైథిలీ చింతయామాస స్వప్నోఽయమితి భామినీ ॥

భావము : ఆ విధముగా వినయముతో ప్రియభాషియగు వానరవీరుని చూచి, దుఃఖముప్పొంగుచుండగా సీత నెమ్మదిగా మందస్వరంలో భోరున విలపించెను.

సుందరి యగు సీత (లంకలోనిట్టి ప్రియవచనములు సవినయముగా పలుకువారుండరు కావున) ఇదంతయు స్వప్నమేమోనని తలచెను.

31) శ్లో ॥ స్వప్నే మయాఽయం వికృతోఽద్య దృష్టః ।
శాఖామృగ శ్శాస్త్రగణైర్నిషిద్ధః ।
స్వస్త్యస్తు రామాయ సలక్ష్మణాయ ।
తథా పితుర్మే జనకస్య రాజ్ఞః ॥

32) శ్లో ॥ నిద్రామే నాస్తి దుఃఖేన జానామ్యేతత్ కుతో భ్రమః ?
యేన మే కర్ణ పీయూషం వచనం సముదీరితమ్ ।

33) శ్లో ॥ స దృశ్యతాం మహాభాగః ప్రియవాదీ మమాగ్రతః ॥

భావము : నేనిప్పుడు కలలో శాస్త్రములన్నింటిచే నిషేధింపబడిన వికృతాకారమగు కోతిని చూచితిని. రామలక్ష్మణులకు, నా తండ్రియగు జనక మహారాజుకు మంగళము కలుగుగాక!

(ఇది కల కాదు) ఏలన నాకు దుఃఖముచే నిద్ర పట్టనే లేదు. పైగా నేను దీనిని ప్రత్యక్షముగా గుర్తించు (చూచు) చున్నాను. కావున భ్రమ యెక్కడిది గనుక ! ఏలననా చెవులకు అమృతోపమములైన వచనములు (రామకథ) స్పష్టముగా వినిపించబడినది.

ఇట్లు ప్రియ వచనములను పలుకు మహానుభావుడు నా కెదురుగా కనబడు గాక !

34) శ్లో ॥ శ్రుత్వా త జ్జానకీ వాక్యం హనుమాన్ పత్రషణ్డతః ।
సోఽవతీర్య ద్రుమాత్తస్మా ద్విద్రుమప్రతిమాననః ॥

35) శ్లో ॥ వినీతవేషః కృపణః ప్రణిపత్యోపసృత్య చ ।
కలవిఙ్క ప్రమాణాంగో రక్తాస్యః పీతవానరః ॥

36) శ్లో ॥ తామబ్రవీన్మహాతేజా హనుమాన్మారుతాత్మజః ।
శిరస్యంజలి మాధాయ సీతాం మధురయా గిరా ॥

భావము : ఆ విధమైన సీతావచనమును విని హనుమంతుడు, ఆ శింశుపా వృక్షమునుండి దిగి, పగడమువలె నెఱ్ఱనిముఖవర్చస్సు కలవాడై,

వినీతమగు ఆకృతి కలిగి, సమీపించి, నమస్కరించి, ఎఱ్ఱనిముఖము, పచ్చనిశరీరముకలిగి కలవింకము అనగా ఊరపిచ్చుకయంతటి చిన్నపరిమాణములో వచ్చిన

వాయుపుత్రుడగు హనుమంతుడు శిరసుతో అంజలిఘటించి మధురమైన వాక్కులనిట్లు పలుకనారంభించెను.

37) శ్లో ॥ తీర్ణార్ణవో రామదూత స్సత్యం ప్రాప్తోఽస్మి శోభనే ।
ప్రభంజనాదంజనాయాం జాతోఽహం హనుమాన్కపిః ॥
38) శ్లో ॥ అహం రామస్య సందేశా ద్దేవి! దూతస్తవాగతః ।
వైదేహి! కుశలీ రామః త్వాం చ కౌశలమబ్రవీత్ ॥
39) శ్లో ॥ లక్ష్మణశ్చ మహాతేజా భర్తుస్తేఽనుచరః ప్రియః ।
కృతవాన్ శోక సంతప్త శ్శిరసాతేఽభివాదనమ్ ॥
40) శ్లో ॥ సా తయోః కుశలం దేవీ నిశమ్య నరసింహయోః ।
ప్రీతిసంహృష్ట సర్వాంగీ హనూమన్త మథాబ్రవీత్ ॥

భావము : హే సుమంగళమూర్తివగు సీతా! నేను సముద్రమును దాటివచ్చిన శ్రీరాముని దూతను. అంజనాదేవికి వాయుదేవునివలన కలిగిన పుత్రుడను. హనుమంతడనుపేరు గల వానరుడను.

దేవీ! నేను రామునిసందేశమువలన దూతగా నీ వద్దకు పంపబడినాను. వైదేహీ! రాముడు కుశలముగా నున్నాడు. నీ క్షేమము నడిగినాడు.

నీ భర్తయగు శ్రీరామునకు ప్రియమైన వాడును, సదా అతనిని వీడక వెన్నంటియుండు సహచరుడు మహాతేజస్వియునగు లక్ష్మణుడు దుఃఖ సంతప్తుడై నీకు శిరసువంచి నమస్కారమును చేసినాడు.

ఈ విధముగా ఆ సీతాదేవి రామలక్ష్మణుల కుశలవార్తవిని, సంతోషముతో శరీరమంతయు పులకరింపగా హనుమంతునితో నిట్లనెను.

41) శ్లో ॥ కల్యాణీ బత గాథేయం లౌకికీ ప్రతిభాతి మే ।
ఏతి జీవన్త మానన్దో నరం వర్షశతాదపి ॥

భావము : 'బ్రతికియున్నట్లయిన నూరు సంవత్సరములకైనను ఆనందము తనకు తానుగా సంప్రాప్తించును' అను లౌకికమగు సామెత నా విషయమున నిజమైనట్లు తోచుచున్నది' అని సీత హనుమంతునితో పలికెను.

42) శ్లో ॥ తస్యా స్తద్వచనం శ్రుత్వా హనుమాన్ హరియూథపః ।
సీతాయా శ్శోకదీనాయా స్సమీప ముపచక్రమే ॥

43) శ్లో ॥ యథాయథా సమీపం స హనుమా నుపసర్పతి ।
తథా తథా రావణం సా తం సీతా పరిశంకతే ॥

భావము : ఆమె యొక్క ఆ మాటను విన్న వానరయూథమున కధిపతియగు హనుమంతుడు ఆమెనోదార్చుటకై సీతను సమీపింపసాగెను.

ఆ విధముగా హనుమంతుడామెను సమీపించుచుండు సరికి రావణుడే ఆ విధముగా వానరరూపములో తనను దరిచేరుచున్నట్లు సీత శంకింపసాగెను.

44) శ్లో ॥ తా మశోకస్య శాఖాం సా విముక్త్వా శోకకర్శితా ।
తస్యా మేవానవద్యాంగీ ధరణ్యాం సముపావిశత్ ॥

45) శ్లో ॥ అవందత హనూమాంస్తు తత స్తాం జనకాత్మజామ్ ॥

భావము : దుఃఖముచే మిక్కిలికృశించిన సర్వాంగసుందరియగు సీత ఆ యశోక వృక్షశాఖను విడిచి, క్రింద నేలపై కూర్చుండెను.

పిమ్మట హనుమంతుడు జానకికి నమస్కరించెను.

46) శ్లో ॥ తం దృష్ట్వా వందమానం తు సీతా శశినిభాననా ।
అబ్రవీ ద్దీర్ఘముచ్ఛ్వస్య వానరం మధురస్వరా ॥

47) శ్లో ॥ మాయాం ప్రవిష్టో మాయావీ యదిత్వం రావణస్స్వయమ్ ।
ఉత్పాదయసి మే భూయ స్సంతాపం త న్న శోభనమ్ ॥

48) శ్లో ॥ యదిరామస్య దూతస్త్వమాగతో భద్రమస్తుతే ।
గుణాన్రామస్య కథయ ప్రియస్య మమ వానర ॥

49) శ్లో ॥ అహో స్వప్నస్య సుఖతా యాఽహ మేవం చిరాహృతా ।
ప్రేషితం నామ పశ్యామి రాఘవేణ వనౌకసామ్ ॥

50) శ్లో ॥ స్వప్నేఽపి యద్యహం వీరం రాఘవం సహలక్ష్మణమ్ ।
పశ్యేయం నాఽవసీదేయం స్వప్నోఽపి మమ మత్సరీ ॥

51) శ్లో ॥ నాహం స్వప్న మిమం మన్యే స్వప్నే దృష్ట్వా హి వానరమ్ ।
న శక్యోఽభ్యుదయం ప్రాప్తుం పశ్చాదభ్యుదయో మమ ॥

భావము : ఆ విధముగ తనకు నమస్కరించుచున్న హనుమంతుని చంద్రవదనయగు సీత చూచి, నిడివిగా నిట్టూర్చి మధురమైన కంఠముతో ఆ వానరునితో నిట్లనెను.

నీవు మాయావియేయగు రావణుడవే, అయి యిట్లు వానరరూపముతో నాకు సంతాపమును కలిగించుచున్నచో అది నీకెంతమాత్రము తగిన పనికాదు.

నిజముగా నీవు రాముని దూతవేయైన నీకు శుభమగుగాక! ఓ వానరా! నా ప్రియుడగు శ్రీరాముని గుణగణములను నాకు తెల్పుము.

బహుకాలముగా శ్రీరాముని యెడబాసిన నేను స్వప్నములో నైన శ్రీరామునిచే పంపబడిన వనవాసులను దర్శించితిని. ఆహా ఈ స్వప్నమెంత సుఖదాయకమో కదా !

కలలోనైనను నేను రామలక్ష్మణులను చూచెదనేని నాకు ఈ దుఃఖముండదు. స్వప్నము కూడా మాత్సర్యముతో నన్ను చేరుట లేదు.

(కాదు కాదు) నేనిద్దానిని స్వప్నమని యనుకొనలేదు. స్వప్నమున వానరుని జూచిన వారికభ్యుదయము కలుగదు. నాకిప్పుడానందమును కూర్చునభ్యుదయము సంప్రాప్తించినది.

శ్రీపాదుక : ఈ విధముగా తాను హనుమను సందర్శించిన వైనము స్వప్నము కాదు. యధార్థమేనని నిశ్చయించుకొనినదని భావము.

ఇది శ్రీమద్రామాయణ సారోద్ధారములోని సుందరకాండాంతర్గతమగు తొమ్మిదవ సర్గము.

సర్గాంతశ్లోకసంఖ్య-(454+51=505)

హనుమంతుడు రాముని లక్షణములను ప్రశంసించుట

దశమస్సర్గః

1) శ్లో ॥ సీతాయాశ్చింతితం బుద్ధ్వా హనుమాన్మారుతాత్మజః ।
శ్రోత్రానుకూలైర్వచనై స్తదా తాం సంప్రహర్షయత్ ।

2) శ్లో ॥ నాహం తథావిధో మాతః త్యజ శంకాం మయిస్థితామ్ ।
దాసోఽహం కోసలేంద్రస్య రామస్య పరమాత్మనః ॥

భావము : సీతామాత యొక్క అభిప్రాయమునెఱిగిన వాయునందనుడు అప్పుడు ఆమెకు శ్రవణ సుభగములైన (వినసొంపైన) మాటలతో సంతోష పెట్టసాగెను.

తల్లీ నీవు సంశయించి నట్లు నేను రావణుడను కాను. నా విషయమున అట్టి సంశయమును వీడుము. నేను కోసలదేశాధీశుడగు శ్రీరామచంద్ర పరమాత్మునకు దాసుడను.

హనుమంతుడు రాముని ప్రశంసించుట

3) శ్లో ॥ ఆదిత్య ఇవ తేజస్వీ లోకకాంత శ్శశీ యథా ।
రాజా సర్వస్య లోకస్య దేవో వైశ్రవణో యథా ॥

4) శ్లో ॥ రూపవాన్ సుభగ శ్శ్రీమాన్ కందర్ప ఇవ మూర్తిమాన్ ।
స్థానక్రోధః ప్రహర్తా చ శ్రేష్ఠో లోకే మహారథః ॥

5) శ్లో ॥ బాహుచ్ఛాయా మవష్టబ్ధో యస్య లోకో మహాత్మనః ।
దేవా ఇవ మహేంద్రస్య మోదన్తే విగతజ్వరాః ॥

6) శ్లో ॥ అపకృష్యాఽశ్రమపదాన్మృగరూపేణ రాఘవమ్ ।
శూన్యే యేనాపనీతాఽసి తస్య ద్రక్ష్యసి యత్ఫలమ్ ।
తేనాహం ప్రేషితో దూత స్త్వత్సకాశ మిహాగతః ॥

భావము : శ్రీరామచంద్రమూర్తి సూర్యుని వలె ప్రచండ తేజోమయుడు. చంద్రుని వలె జగదానంద కారకుడు. రాజాధిరాజుగా ప్రసిద్ధుడైన కుబేరునివలె లోకపాలకుడగు మహారాజు

అతడు అందగాడు. సౌభాగ్యవంతుడు. శ్రీయుతుడు మఱియు రూపుదాల్చిన మన్మథుడు. అపరాధులపైనే కోపమును ప్రదర్శించి వారిని శిక్షించును. అతడు లోకమున శ్రేష్ఠుడు మఱియు మహారథి.

దేవతలు దేవేంద్రుని భుజచ్ఛాయలో మనుగడ సాధించుచున్నట్లు లోకమంతయు మహితాత్ముడగు శ్రీరాముని భుజచ్ఛాయలో (పరాక్రమమను నీడలో) నిశ్చింతగా మనుచున్నది.

శూన్యమైన ఆశ్రమమునుండి శ్రీరాముని వంచించి యెవడు ఈ వనమున కిట్లు అపహరించి తెచ్చెనో, ఆ ఫలము నాతడిప్పుయనుభవించుటను నీవు చూడగలవు.

నేనా రామునిచే నీ వద్దకు పంపగా వచ్చిన దూతనని నన్నెఱుంగుము.

శ్రీపాదుక : 'రాజాధిరాజాయ ప్రసహ్య సాహినే-నమో వయం వైశ్రవణాయ కుర్మహే' అని వేదము కుబేరుని రాజాధిరాజు, సర్వలోకములకు రాజుగా కీర్తించినది.

7) శ్లో ॥ జానన్తీ బత దిష్ట్యా మాం వైదేహి పరిపృచ్ఛసి ॥
భర్తుః కమలపత్రాక్షి ! సంస్థానం లక్షణాని చ ॥

8) శ్లో ॥ రామః కమలపత్రాక్షః సర్వసత్వ మనోహరః ।
రూపదాక్షిణ్య సంపన్నః ప్రసూతో జనకాత్మజే ! ॥

9) శ్లో ॥ మర్యాదానాం చ లోకస్య కర్తా కారయితా చ సః ।
అర్చిష్మా నర్చితోఽ త్యర్థం బ్రహ్మచర్యవ్రతే స్థితః ॥

10) శ్లో ॥ శ్రుతవాన్ శీలసంపన్నో వినీతశ్చ పరంతపః ।
యజుర్వేద వినీతశ్చ వేదవిద్భిః సుపూజితః ॥

11) శ్లో ॥ ధనుర్వేదే చ వేదేషు వేదాంగేషు చ నిష్ఠితమ్ ।
విపులాంసో మహాబాహుః కంబుగ్రీవ శ్శుభాననః ॥

12) శ్లో ॥ గూఢజత్రు స్సుతామ్రాక్షో రామో దేవి జనై శ్శ్రుతః ।
దుందుభిస్స్వననిర్ఘోష స్స్నిగ్ధవర్ణః ప్రతాపవాన్ ॥

13) శ్లో ॥ సమస్సమ విభక్తాంగో వర్ణం శ్యామం సమాశ్రితః ॥

14) శ్లో ॥ త్రి స్థిరస్త్రిప్రలంబశ్చ త్రిసమస్త్రిషుచోన్నతః ।
త్రి తామ్ర స్త్రిషు చ స్నిగ్ధో గంభీర స్త్రిషు నిత్యశః ॥

15) శ్లో ॥ త్రివలీవాన్ త్ర్యవనతశ్చతుర్వ్యఙ్గ స్త్రిశీర్షవాన్ ।
చతుష్కల శ్చతుర్లేఖ శ్చతుష్కిష్కు శ్చతుస్సమః ॥

16) శ్లో ॥ చతుర్దశ సమద్వంద్వ శ్చతుర్దంష్ట్ర శ్చతుర్గతిః ।
మహోష్ఠ హనునాసశ్చ పంచస్నిగ్ధోఽష్ట వంశవాన్ ॥

17) శ్లో ॥ దశపద్మో దశ బృహత్త్రిభిర్వ్యాప్తో ద్విశుక్లవాన్ ।
షడున్నతో నవతను స్త్రిభిర్వ్యాప్నోతి రాఘవః ॥

18) శ్లో ॥ సత్యధర్మ పరశ్శ్రీమాన్ సంగ్రహానుగ్రహే రతః ।
దేశకాల విభాగజ్ఞః సర్వలోక ప్రియంవదః ॥

భావము : విదేహ రాజపుత్రీ ! సీతా ! భర్తయగు శ్రీరాముని శుభలక్షణములను, అవయవసౌష్ఠవమును తెలిసియుండి కూడ నన్నడుగుచున్నావు. అయినను పద్మాక్షీ! చెప్పుచున్నాను. వినుము.

శ్రీరాముడు పద్మదళాయతాక్షుడు. సర్వప్రాణిమనోహరుడు. జానకీ! అతడు సౌందర్యదాక్షిణ్యాది గుణములు సహజముగా కలవాడు.

లోకములోని సముదాచారములను స్వయముగా నిర్వర్తించుచు, ఇతరులచే ఆచరింపచేయును. అతడు సహజ ప్రభాసమున్మేషము కలవాడు. సర్వజన సంపూజ్యుడతడు. బ్రహ్మచర్యవ్రతము నందున్నవాడు.

శ్రీరామచంద్రమూర్తి వేదజ్ఞుడు. శీలసంపన్నుడు. శత్రుదమనుడు అయినను వినయశీలుడు. యజుర్వేదమును బాగుగానధ్యయనము చేసినవాడు మఱియు వేదవిదులచే పూజింపదగినవాడు.

మఱియు రాముడు ధనుర్వేదమును, తదితరములగు వేదములను, వేదాంగములైన శిక్షావ్యాకరణాదులను బాగుగా నిష్ఠతో అధ్యయనము చేసినవాడు. పెద్ద బాహువులు, విశాలమైన మూపులు శంఖము వంటి మెడ, సుందర వదనారవిందముతో శోభిల్లువాడు.

సుపుష్టములగు భుజదండ మూలములతో, ఎఱ్ఱనిజీర కల కన్నులలో దుందుభులమ్రోతవంటి కంఠస్వరముతో, నిగనిగలాడు శరీరకాంతితో పరాక్రమశాలిగా కనబడును.

అతని శరీరావయవములు చక్కని క్రమసౌష్ఠవముతో నీలమేఘ శ్యామల వర్ణముతో ప్రకాశించుచుండును.

ఆ శ్రీరామచంద్రమూర్తి-

1) త్రిస్థిరుడు : అనగా వక్షస్థలము, మణికట్టు, పిడికిలి యను మూడు బిగువు (పట్టు) కలవాడు. ఇది వీర లక్షణము.

2) త్రిప్రలంబుడు : సుదీర్ఘములైన కనుబొమ్మలు, బాహువులు, ముష్కములు కలవాడు. ఇది సంపన్న లక్షణము.

3) త్రిసముడు : తలవెంట్రుకలు, ముష్కములు, మోకాళ్ళు సమప్రమాణములో కలవాడు. ఇది రాజ లక్షణము.

4) త్ర్యున్నతుడు : ఉన్నతమైన (ఎత్తయిన) నాభి పొట్ట వక్షస్థలములు కలవాడు (రాజ లక్షణము)

5) త్రితామ్రుడు : ఎఱ్ఱని కనుకొనలు, నఖములు, అఱచేతులు, అఱికాళ్ళు కలవాడు. (ఇది సుకుమార లక్షణము)

6) త్రిస్నిగ్ధుడు : నునుపైన పాదరేఖలు, కేశములు, లింగమణి కలవాడు. ఇది సౌభాగ్యవంతుని లక్షణము.

7) త్రి(షు) గంభీరుడు : కంఠస్వరము, నడక, పొక్కిలి (లోతైన నాభి) గంభీరముగా నుండువాడు. (త్రిజగత్పూజ్యుడగు యశః సంపన్నుని లక్షణము)

8) త్రివలీయుతుడు : ఉదర కంఠ దేశము లందు మూడు రేఖలు కలవాడు (ఉత్తమ కులసంజాతుని (అభిజాత్య) లక్షణము)

9) త్ర్యవనతుడు : స్తనములు, స్తనాగ్రములు, పాదరేఖలు కొద్దిగా లోతుగా నున్నవాడు. ఇది సామ్రాట్టు లక్షణము.

10) చతుర్వ్యంగుడు : కంఠము, లింగము, వీపు, పిక్కలు అను నాలుగు హ్రస్వముగానున్నవాడు (పూజ్యుని లక్షణము)

11) త్రిశీర్షవాన్ : శిరస్సుపై మూడు సుడులున్నవాడు. (ఇది రాజలక్షణము)

12) చతుష్కలుడు : చతుష్కళలు అనగా వ్రేళ్ళయందు వేదచతుష్టయము అనగా నాలుగు వేదములను సూచించు రేఖలు కలవాడు.

13) చతుర్లేఖః : లలాట, పాణిపాదముల యందు నాలుగు రేఖలు కలవాడు. ఇది దీర్ఘాయుర్దాయముతో కూడిన మహారాజలక్షణము.

14) చతుష్కిష్కుడు : నాలుగుమూరల పొడవు గల శరీరము కలవాడు (దివ్య పురుషుని లక్షణము)

15) చతుస్సముడు : బాహువులు, మోకాళ్ళు, తొడలు, పిక్కలు సమానముగా నుండువాడు.

16) చతుర్దశ సమద్వంద్వుడు :కనుబొమ్మలు, నాసికాపుటములు, నేత్రములు, చెవులు, పెదవులు, స్తనాగ్రములు, మోచేతులు, మణిబంధములు, మోకాళ్ళు, ముష్కములు, పిరుదులు, చేతులు, పాదములు, పిరుదులపై నుండు గుండ్రని కందరములు అను పదునాలుగు జతల అవయవములు సమాన ప్రమాణములో హెచ్చు తగ్గులు లేక యుండువాడు. (మహాపురుష లక్షణము)

17) చతుర్దంష్ట్రుడు : నాలుగు కోఱపండ్లు కలవాడు.

18) చతుర్గతి : సింహము, వ్యాఘ్రము, గజము, వృషభముల గమనములను పోలి నడకగలవాడు (మహాపురుష లక్షణము)

19) మహోష్ఠ హనునాసికలు కలవాడు : బింబఫలసదృశములైన పెదవులు, నిండుకండగల దవుడలు, ఉన్నతమైన నాసికాదండములు కలవాడు. (మహారాజలక్షణము)

20) పంచస్నిగ్ధుడు : నిగనిగలాడు నేత్రములు, దంతపంక్తులు, చర్మము, పాదములు, కేశములు కలవాడు (సౌభాగ్యవంతుని లక్షణము)

21) అష్టవంశ్యుడు : చేతివ్రేళ్ళు–కాలివ్రేళ్ళు–కరములు, నాసిక, కండ్లు, కర్ణములు, ప్రజననము అనే అష్టవంశములు తగు పరిమాణములోనున్నవాడు (సౌభాగ్యపురుషుడు)

22) దశపద్ముడు : పద్మములవంటి ముఖము, నేత్రములు, నోరు, నాలుక, పెదవులు, దౌడలు, స్తనములు, గోళ్ళు, హస్తములు అను దశావయవములు కలవాడు. (రాజలక్షణము)

23) దశబృహత్ : శిరస్సు–లలాటము–చెవులు, కంఠము, వక్షము.

హృదయము, నోరు, చేతులు, కాళ్ళు, వీపు అను పది అవయవములును పెద్దవిగానగుపించువాడు. (మహాపురుషలక్షణము)

24) త్రివ్యాప్తుడు : తేజో యశస్సంపదలు మూడింటిచే వ్యాపింపబడిన మూడు లోకములు కలవాడు.

25) ద్విశుక్లుడు : పవిత్రములైన మాతృపితృ వంశములు కలవాడు.

26) షడున్నతుడు : కక్షములు (చంకలు), వక్షము, నాసిక, భుజములు, లలాటము, ఉదరము (పొట్ట) అను ఆరు స్ఫుటతరావయవములలో శోభిల్లువాడు.

27) నవతముడు : సూక్ష్మములైన వ్రేళ్ళ కణుపులు, వెంట్రుకలు, కేశములు, గోళ్ళు, చర్మము, లింగము, మీసములు, దృష్టి, బుద్ధియను తొమ్మిది పటిష్ఠములైన అవయవములు కలవాడు.

28) త్రిథావ్యాప్త కీర్తిమంతుడు : ధర్మార్థకామములనెడు మూడు పురుషార్థములచే పూర్వాపరాహ్ణమధ్యాహ్నములను త్రికాలములను వ్యాపించినవాడు. త్రికాలానుష్ఠానతత్పరుడని భావము.

29) సత్యధర్మపరుడు : సత్యసంధుడు మఱియు ధర్మనిరతుడు

30) శ్రీమంతుడు : సకల సద్గుణైశ్వర్యసంపన్నుడు

31) సంగ్రహానుగ్రహరతుడు : యథోచితముగ ధర్మమార్గమున పన్నుల ద్వారా ధనమును సంగ్రహించి, ప్రజాసంక్షేమ కార్యముల యందు మాత్రమే వినియోగించువాడు.

32) దేశకాల విభాగజ్ఞుడు : ఎక్కడ ఎప్పుడే విధముగా కార్యాచరణములను ప్రవర్తింపచేయవలెనో స్పష్టముగా తెలిసినవాడు, మఱియు

33) సర్వలోకప్రియంవదుడు : ప్రజలందరితోడను ప్రియముగా సంభాషించి సంతోషపరచువాడు. కావుననే అతడు రాముడు.

(రమయతీతి రామః అని కదా రామ శబ్దార్థము.)

శ్రీపాదుక :

1) **తిస్థిరః : ఉరశ్చమణిబంధశ్చ ముష్టిశ్చ నృపతేః స్థిరాః ।**

2) **త్రిప్రలంబః : దీర్ఘ భ్రూబాహూ ముష్కస్తు చిరంజీవీ ధనీ నరః ।**

3) త్రిసమః : *కేశాగ్రం వృషణం జాను సమా యస్య స భూపతిః ।*

4) త్రిషుచోన్నతః : *నాభ్యంతః కుక్షి వక్షోభిరున్నతః క్షితిపో భవేత్ ।*

5) త్రితామ్రః : *నేత్రాంతనఖపాణ్యంఘ్రి తలైస్తామ్రైస్త్రిభిః సుఖీ ।*

6) త్రిస్నిగ్ధః : *స్నిగ్ధా భవన్తి తే యేషాం పాదరేఖాః శిరోరుహాః ।*

7) త్రిషుగంభీరః : *స్వరే గతౌ చ నా భౌచ గంభీరస్త్రిషు శస్యతే ।*

8) త్రివళీవాన్ : *పీనో ఉదరే కంఠే చ వళిత్రయవాన్ ।*

9) త్ర్యవనతః : *పీనోపచితైర్నిమ్నైః క్షితిపతయః శ్చూచుకై స్తనైః, సుఖినః।*

10) చతుర్వ్యంగః : *గ్రీవాప్రజననం పృష్ఠం హ్రస్వం జంఘా చ పూజ్యతే ।*

11) త్రిశీర్షవాన్ : *ఆవర్తత్రయం రుచిరం యస్య శిరః । స క్షితిభృతాం నేతా*

12) చతుష్కలః : *మూలేం గుష్ఠస్య వేదానాం చతస్రస్త్రి స్రపవనా ।*

ఏకా ద్వేవా యథా యోగం రేఖాజ్ఞేయా ద్విజన్మనామ్ ॥

13) చతుర్లేఖః : *లలాటే యస్య దృశ్యంతే చతుస్త్రిద్వ్యేకరేఖికాః ।*

శతద్వయం శతం షష్టిః తస్యాయుర్వింశతా స్తథా ॥

లలాటంపై నాలుగు రేఖలుంటే 200 సం॥లు, మూడు రేఖలున్నచో 100 సం॥లు, రెండు రేఖలు ఉన్నచో 60 సం॥లు, ఒక రేఖయున్నచో 20 సం॥ లేదా అంతకు లోపు ఆయువుగా చెప్పబడినది.

14) చతుష్కిష్కు : కిష్కువనగా మూర లేదా ఇరవై నాలుగు అంగుళములు కల హస్త ప్రమాణము. కాగా శ్రీరాముడు 24×4=96 అంగుళములు లేదా నాలుగు మూరల పొడవైనవాడు అని అర్థము. ఇది దివ్యపురుష (దేవ) లక్షణముగా ***"షణ్ణవత్యంగుళోత్సేధో యః పుమాన్ స దివౌకసః"*** అని చెప్పబడినది.

15) చతుస్సమః : *"బాహుజానూరు జంఘాశ్చ చత్వార్యథ సమానిచ"*

16) చతుర్దశ సమద్వంద్వః :

భ్రువౌ నాసాపుటే నేత్రే కర్ణావోష్ఠౌచ చూచుకే ।

కూర్పరౌ మణిబంధౌ చ జానునీ వృషణౌ కటీః ।

కరౌ పాదౌ స్ఫిచౌ యస్య సమౌ జ్ఞేయస్స భూపతిః ॥

17) చతుర్ధంష్ట్రః : *దంతపంక్తి ద్వయే మధ్య దంత చతుష్కమభితో దాద్వౌ దంత విశేషా దంష్ట్రాః ఇత్యభిధీయన్తే. తాదృశ దంష్ట్రావా నిత్యర్థః ॥*

18) చతుర్గతిః : *చతుర్ణాం సింహశార్దూల గజ వృషభాణాం గతిదివ గతిర్యస్య సః ఇత్యర్థః ।*

19) మహోష్ఠహనునాసికః : *ఓష్ఠ యోర్మహత్వం నామ బంధుజపా కుసుమ ఫలారుణ మాంసలత్వమ్.*

హన్వోస్తు పరిపూర్ణ మాంసలోన్నత్వం మహత్వమ్

నాసికాయాః దీర్ఘోన్నతరుచిర పుటత్వం మహత్వం-తైర్యుక్త ఇత్యర్థః

20) పంచస్నిగ్ధః :

స్నిగ్ధా ఘనాశ్చ దశనాః సుతీక్షణ దంష్ట్రా స్సమాశ్చ శుభాః ।
కేశనేత్ర దంతత్వక్ పాదతలాని పంచస్నిగ్ధాః ॥

21) అష్టవంశ్యః : *అష్టవంశశ్శరీరం చ హస్త పాదాంగులీ కరౌ ।*
నాసికా చక్షుషీ కర్ణౌ ప్రజనోయస్య చా హతాః ॥

22) దశపద్మ : *ముఖనేత్రాస్య జిహ్వోష్ఠ తాలుస్తన నఖాం కరౌ ।*
పాదౌ చ దశ పద్మాని పద్మాకారాణి యస్య చ ॥

23) దశబృహత్ : *శిరోలలాటే శ్రవణే గ్రీవా వక్షశ్చ హృత్తథా ।*
ఉదరం పాణి పాదౌ చ పృష్ఠం దశ బృహంతి చ ॥

24) త్రివ్యాప్తః : *త్రిభిర్వ్యాప్తిశ్చ యస్యస్యాత్ - తేజసా యశసా శ్రియా ॥*

25) ద్విశుక్లః : *ద్వౌ శుక్లౌతు శుభౌ శుద్ధౌ వంశౌ మాతుః పితుస్తథా ॥*

26) షడున్నతః : *కక్షః కుక్షిశ్చ వక్షశ్చ ఘ్రాణః స్కంధో లలాటికాః ।*
సర్వభూతేషు నిర్దిష్టా ఉన్నతాంగాః శుభప్రదాః ॥

27) నవతనవః : *కేశశ్మశ్రునఖలోనుత్వగంగులి పర్వశేఫో బుద్ధి దర్శనాని నవతనవః ॥*

28) త్రిధావ్యాప్తః : *ధర్మార్థకామః కాలేషు త్రిషుయస్య స్వనుష్ఠితాః ॥*

29) సత్యధర్మ పరః :(స్పష్టమ్)

30) శ్రీమాన్ (స్పష్టమ్)

31) సంగ్రహాను గ్రహరతః (స్పష్టమ్)

32) దేశకాల విభాగజ్ఞః (స్పష్టమ్)

33) సర్వలోక ప్రియంవదః (స్పష్టమ్)

19) శ్లో ॥ భ్రాతా చతస్య ద్వైమాత్ర సౌమిత్రి రపరాజితః ।
అనురాగేణ రూపేణ గుణైశ్చైవ తథావిధః ॥

20) శ్లో ॥ యాని రామస్య చిహ్నాని లక్ష్మణస్య చ తాని వై ।
స సువర్ణచ్ఛవిః శ్రీమాన్ రామశ్శ్యామో మహాయశాః ॥

భావము : అతని తమ్ముడు లక్ష్మణుడు ద్వైమాత్రుడు సవతితల్లి సుమిత్రకుమారుడు యుద్ధమున పరాజయమెఱుగనివాడు, దయా సౌందర్యాదులన్నింటి యందును రామునివంటి వాడే. అన్ని విధముల రామునితో సరియైనవాడు.

శ్రీమంతుడగు రాముడు మహాయశస్వి నీలమేఘశ్యామల వర్ణము కలవాడు. లక్ష్మణుడు బంగారు వన్నె మేను కలవాడు.

21) శ్లో ॥ లంకా చాపి మయా రాత్రౌ ప్రవిష్టా రాక్షసాకులా ।
రావణశ్చ మయా దృష్టః త్వం చ శోక పరిప్లుతా ॥

భావము : నేను రాత్రిసమయమున రాక్షసులు తిరుగాడుచున్న లంకను ప్రవేశించితిని. రావణుని చూచితిని. దుఃఖముచే కన్నీరుమున్నీరుగుచున్న నిన్నును సందర్శించితిని.

22) శ్లో ॥ అభిభాషస్వ మాం దేవి దూతో దాశరథే రహమ్ ।
రామనామాంకితం చేదం పశ్య దేవ్యంగులీయకమ్ ॥

23) శ్లో ॥ ప్రత్యయార్థం తవానీతం తేన దత్తం మహాత్మనా ॥
సువర్ణస్య సువర్ణస్య సువర్ణస్య వరాననే ।
ప్రేషితం రామభద్రేణ సువర్ణస్యాంగులీయకమ్ ॥

24) శ్లో ॥ సమాశ్వసిహి భద్రంతే క్షీణ దుఃఖ ఫలాహ్యసి ।
ఇత్యుక్త్వా ప్రదదౌ తస్యై సీతాయై వానరోత్తమః ॥

భావము : దేవీ ! నేను దశరథ పుత్రుడగు రాముడు పంపిన రాయబారిని. కావున నాతో మాట్లాడుము. ఇదిగో రామనామాంకితమగు ఈ ఉంగరమును చూడుము. నీకు నమ్మకము కలుగుటకై శ్రీరామునిచే నీయబడినది. నీకు సమర్పించుటకై తెచ్చితిని.

చక్కని పసిడి మిసిమి కలదియు, శోభనమైన **'రామ'** యను రెండు వర్ణములు కలదియు, దశమాష ప్రమాణము (పది మినపగింజల ఎత్తు బరువు కలదియు) కలదియునగు స్వర్ణాంగుళీయకము నీకు రాముడు నీ కిమ్మని పంపినాడు.

నీవిపుడూరట జెందుము. నీకు మంగళమగుగాక ! యికపైన నీ దుఃఖము పూర్తిగా నశించినట్లేనని పలికి వానరోత్తముడగు హనుమంతుడు ఆ యుంగరమును సీతకు సమర్పించెను.

శ్రీపాదుక : 'సువర్ణస్య సువర్ణస్య సువర్ణస్య' – అని ముమ్మారు సువర్ణ శబ్దము ప్రయోగింపబడిన ఈ శ్లోకము హనుమద్రామాయణములోనిది. మొదటి సువర్ణ పదమునకు – బంగారు రంగారునది అనగా బంగారము వలె పసిడి మిసిమి అనగా సుందరమైన పీతరక్త వర్ణము (పసుపు ఎఱుపు రంగుతో మెఱియునది) అని అర్థము.

రెండవ సువర్ణ శబ్దమునకు శోభనములగు 'రామ' యను రెండక్షరములతో ప్రకాశించుచున్నదని యర్థము.

మూడవ సువర్ణశబ్దమునకు – **'సువర్ణం దశమాషకమ్'** అనగా పది మినుగుల బరువు గల ప్రమాణము కొలతకు సువర్ణమను వ్యవహారమును బట్టి పది మినుపగింజల బరువు కలదని అర్థమును గ్రహించవలెను.

25) శ్లో ॥ గృహీత్వా ప్రేక్షమాణా సా భర్తుః కరవిభూషణమ్ ।

భర్తారమివ సంప్రాప్తా జానకీ ముదితాఽభవత్ ॥

భావము : భర్త యగు రాముని హస్తాభరణమగు ఆ యుంగరమును తీసికొని పలుమారులు తరచితరచి చూచుచున్న సీత, ప్రతిచూపులో తన భర్తను పొందిన యానందానుభవమును పొందెను.

26) శ్లో ॥ అత్రాంగుళీయక మణౌ ప్రతిబింబ మాసీ-
ద్రామస్య సాదర మతీవ విలోకయన్త్యా ।
మద్రూప ఏవ కి మభూన్మమ చిన్తయేతి
మీమాంసయా జనక రాజసుతా ముమోహ ॥

భావము : సీతాదేవి ఆ యంగుళీయక మణి యందు రామనామాక్షరములనదే పనిగా చూచుచుండగా, దానిలో తన ప్రతిబింబము ప్రతిఫలించుటను చూచి అయ్యో! నా రాముడు నన్నే తదేకముగా నాలోచించుచు, నా రూపమును పొందినాడా? యేమని సంశయించుచు మూర్ఛిల్లెను.

27) శ్లో ॥ చారు తద్వదనం తస్యా స్తామ్రశుక్లాయతేక్షణమ్ ।
అశోభత విశాలాక్ష్యా రాహుముక్త ఇవోడురాట్ ॥

భావము : అపుడా విశాలాక్షియగు సీతాదేవి యొక్క కనుగొనల యందు ఎఱ్ఱనైన నడుమ తెల్లగా నున్న కన్నులతో సుందరముగాశోభిల్లు ముఖము రాహువుచే విడువబడిన చంద్రునివలె ప్రకాశించెను.

28) శ్లో ॥ సౌఖ్యావహస్య పవనాత్మజ నీయమాన
రామాంగుళీయక విలోకన వాసరస్య ।
సత్యం కళాం శతతమీం భువినైవ భేజే
పాణిగ్రహోత్సవదినం జనకాత్మజాయాః ॥

భావము : ఆంజనేయుడు తెచ్చిన శ్రీరాముని ఉంగరమును దర్శించినప్పుడు సీతాదేవికి కలిగిన యానందానుభవములో నిజముగా నూరవవంతు ఆనందమును కూడ జనకరాజనందినియగు సీత తన పాణిగ్రహణ సమయమున పొందలేదు.

శ్రీపాదుక : ప్రప్రథమముగా శ్రీరామ పాణిగ్రహణము చేసినపుడు పొందిన యానందము కంటె వందరెట్ల యానందమును, హనుమంతుడు తెచ్చి ఇచ్చిన రామాంగుళీయకమును చూచి పొందినదని భావము. తన పెళ్ళినాటి ప్రథమ పాణిగ్రహణ సమయమున పొందిన యానందానుభవము కంటే వందరెట్ల ఆనందానుభవ సుఖమును హనుమ అంగుళీయకమును సమర్పించినపుడు సీత ఆతురతతో ననుభవించినదని యర్థమును గ్రహించవలెను.

29) శ్లో ॥ సీతా యతాత్మని హనూమతి రామదూతే
రామాంగులీయక విలోకనసంప్రహృష్టా ।
బుద్ధిం చకార నిజగర్భభవాదభీష్టః
పుత్రో మమైష భవతాదితి లోకమాతా ॥

30) శ్లో ॥ తతః సా హ్రీమతీ బాలా భర్తృసందేశహర్షితా ।
పరితుష్టా ప్రియం కృత్వా ప్రశశంస మహాకపిమ్ ॥

భావము : జగన్మాతమైన సీత శ్రీరాముని యుంగరమును చూచుటచే మిక్కిలి సంతోషించినదై నియతాత్ముడైన హనుమంతుని యందు తన గర్భమున జనించిన పుత్రునిమించిన వాత్సల్యమును సంభావించెను.

పిమ్మట బాల (ముద్దరాలగు) సీత, తన భర్తయొక్క కుశలవార్తచే కడు సంతోషించినదై, పిదప సిగ్గుతో కూడిన సంతోషముతో వానరశ్రేష్ఠుడగు హనుమంతునిట్లు కీర్తించెను.

31) శ్లో ॥ విక్రాంత స్త్వం సమర్థస్త్వం ప్రాజ్ఞస్త్వం వానరోత్తమ ।
శతయోజన విస్తీర్ణ స్సాగరో మకరాలయః ॥

32) శ్లో ॥ విక్రమశ్లాఘనీయేన క్రమతా గోష్పదీకృతః ॥

33) శ్లో ॥ భక్తోఽపి ప్రియకారీత్వం విశ్వాసోఽస్తి తవైవ హి ।
నోచే స్మత్సన్నిధిం చాన్యం పురుషం ప్రేషయే త్కథమ్ ॥

34) శ్లో ॥ మహాత్మన్ ! కథ మంభోది మలంఘిష్ఠా దురత్యయమ్ ।
కథం త్వం వానరో భూత్వా రామసందేశ మాహరః ॥

35) శ్లో ॥ భాషసే త్వం ససంస్కారం న చ్యుతిః స్వరవర్ణయోః ।

భావము : వానరోత్తమా ! హనుమా ! సముద్రము శతయోజనవిస్తీర్ణమైనది. అది మొసళ్ళకు నిలయమైనది. దానిని నీవొక గోష్పదప్రాయముగా నెంచి దాటితివి. అట్టి నీ విక్రమ మెంతయో శ్లాఘింపతగినది. ప్రాజ్ఞుడవు, సమర్థుడవు నగు నీవు దానిని దాటితివి.

నీవు శ్రీరామునకు భక్తుడవు. ప్రియమును గూర్చువాడవు. అట్లే

విశ్వాసపాత్రుడవు. కాకున్నచో నిన్ను శ్రీరామచంద్రమూర్తి నా వద్దకు ఎట్లు పంపును గనుక !

మహితాత్ముడవగు హనుమా ! వానరుడవగు నీవు అలంఘనీయమగు యీ సముద్రమును దాటి శ్రీరాముని సందేశమును గైకొని లంకా నగరమునకు ఎట్లు రాగలిగితివి?

ఆంజనేయా ! వానరుడవయ్యు వ్యాకరణసంస్కారము కలవాని వలె స్వరవర్ణోచ్చారణముల యందేమాత్రపు దోషములు లేకుండా మాట్లాడుచున్నావు.

36) శ్లో ॥ ఆర్యపుత్రే కృతస్నేహ మపశ్యం గృధ్రమేకకమ్ ।
తతోఽపి సౌష్ఠవాధారం భవతో భాషితం శ్రుతమ్ ।
కిన్న స్వప్నో మమాసీన్మే భవతో భాషణం క్షమమ్ ॥

37) శ్లో ॥ అభాషాః కపయోలోకే సంస్కృతం భాషసే భవాన్ ।
తచ్ఛ్రుత్వా హనుమానాహ ప్రణిపత్య వినీతవత్ ॥

భావము : పూర్వమార్యపుత్రుడగు శ్రీరామునియందు స్నేహముకల జటాయువును చూచితిని. అతని కన్న మిక్కిలి సౌష్ఠవాధారములతో సమర్థవంతమైనదిగా నీ భాషణమున్నది. ఇది స్వప్నము కాదు కదా! స్వప్నమైనచో నీతో భాషించుట ఎట్లు పొసగును?

లోకమున వానరులు మాట్లాడరు. నీవా సంస్కృతమున మాట్లాడుచున్నావు అని యిట్లు పలుకుచున్న సీతమాటలను విని హనుమంతుడు మిక్కిలి వినయముతో సీతకు ప్రణమిల్లి ఇట్లు పలికెను.

38) శ్లో ॥ మాతర్నాయం తవ స్వప్నో జాగర్త్యైవ మహేశ్వరి ।
ఈదృశో నాహ మేకోఽస్మి బహవ స్సంతి వానరాః ॥

39) శ్లో ॥ సర్వే భాషా విదో మాతర్నీతిజ్ఞాశ్చ మనీషిణః ।
వాయువేగా మహాసత్త్వా గజాదన్యూన విగ్రహాః ।
సర్వే చ బుద్ధిసంపన్నా స్సర్వే సంస్కృతభాషిణః ॥

40) శ్లో ॥ తవ ప్రసాదా త్పవనప్రసాదా-
త్త్వైవ భర్తు శ్చరణ ప్రసాదాత్ ।
త్రిభిః ప్రసాదై రనుకూలితోఽహం
వ్యలంఘయం గోష్పదవత్సముద్రమ్ ॥

41) శ్లో ॥ నిశ్చయం వదామి తే నాన్యథా వచాంసి మే ।
హరిం నరా భజన్తి యే దుస్తరం తరన్తి తే ॥

భావము : తల్లీ ! ఇది కల కాదు. నీవు జాగరూకురాలవే అయియున్నావు. ఈ విధముగా మాట్లాడువాడను నేనొక్కడనే కాను. నావంటి వానరులు పలువురు కలరు. అమ్మా! మా వానరులందరు మాట్లాడగలవారు. అందరు నీతికోవిదులే. అందరూ బుద్ధిమంతులే. అందరును వాయు వేగము కలవారే. అందరూ మహాసత్త్వ బలసంపన్నులు. ఏనుగులవలె మహాకాయులు. అందరూ బుద్ధిమంతులు మఱియు సంస్కృతములో మాట్లాడువారే !

సీతా! నీ యనుగ్రహము చేతను, (మా తండ్రి యగు) వాయుదేవుని అనుగ్రహము చేతను, నీ భర్త యగు శ్రీరాముని పాదములను సేవించుటచే నైన ప్రభావము చేతను, ఈ విధముగా ముప్విధములైన అనుగ్రహ బలముచే నేను సముద్రమును గోష్పదము వలె దాటితిని.

నిశ్చయముగా చెప్పుచున్నాను. నా మాటలయందన్యథా భావము లేదు. శ్రీహరిని భజించువారు తరింపశక్యము కాని సంసారసముద్రమునే దాటుచున్నారు.

42) శ్లో ॥ సీతా తద్వచనం శ్రుత్వా పూర్ణచంద్రనిభాననా ।
హనూమన్త మువాచేదం ధర్మార్థసహితం వచః ॥

43) శ్లో ॥ దిష్ట్యా చ కుశలీ రామో ధర్మాత్మా సత్యసంగరః ।
లక్ష్మణశ్చ మహాతేజా స్సుమిత్రానందవర్ధనః ॥

44) శ్లో ॥ కౌసల్యాయా స్తథా కచ్చిత్సుమిత్రాయా స్తథైవ చ ।
అభీక్షణం శ్రూయతే కచ్చి త్కుశలం భరతస్య చ ॥

45) శ్లో ॥ కచ్చిదక్షౌహిణీం భీమాం భరతో భ్రాతృవత్సలః ।
ధ్వజినీం మంత్రిభిర్గుప్తాం ప్రేషయిష్యతి మత్కృతే ।
వానరాధిపతి శ్రీమాన్ సుగ్రీవః కచ్చి దేష్యతి ॥

46) శ్లో ॥ రాక్షసానాం వధం కృత్వా సూదయిత్వా చ రావణమ్ ।
లంకా మున్మూలితాం కృత్వా కదా ద్రక్ష్యతి మాం పతిః ॥

47) శ్లో ॥ స వాచ్య స్సంతరస్వేతి యావదేవ న పూర్యతే ।
అయం సంవత్సరః కాలః తావద్ధి మమ జీవితమ్ ॥

48) శ్లో ॥ వర్తతే దశమో మాసో ద్వౌ తు శేషౌ ప్లవంగమ ।
రావణేన నృశంసేన సమయో యః కృతో మమ ॥

49) శ్లో ॥ విభీషణేన చ భ్రాత్రా మమ నిర్యాతనం ప్రతి ।
అనునీతః ప్రయత్నేన చ తత్కురుతే మతిమ్ ॥

50) శ్లో ॥ మమ ప్రీతిప్రదానం చ రావణస్య న రోచతే ।
రావణం మార్గతే సంఖ్యే మృత్యుః కాలవశం గతమ్ ॥

51) శ్లో ॥ జ్యేష్ఠా కన్యా నలా నామ విభీషణసుతా కపే ।
తయా మమేద మాఖ్యాతం మాత్రా ప్రహితయా స్వయమ్ ॥

52) శ్లో ॥ అవింద్యో నామ మేధావీ విద్వాన్ రాక్షస పుంగవః ।
ద్యుతిమాన్ శీలవాన్ వృద్ధో రావణస్య సుసమ్మతః ॥

53) శ్లో ॥ రామక్షయ మనుప్రాప్తం రక్షసాం ప్రత్యచోదయత్ ।
న చ తస్య స దుష్టాత్మా శ్రుణోతి వచనం హితమ్ ॥

54) శ్లో ॥ ఇతి సంజల్పమానాం తాం రామార్థే శోకకర్శితామ్ ।
అశ్రుసంపూర్ణనయనాం ఉవాచ వచనం కపిః ॥

భావము : పున్నమి చంద్రుని బోలిన ముఖముకల సీతాదేవి హనుమంతుని మాటలను విని అతనితో ధర్మసమ్మతములైన వాక్కుల నిట్లు పలికెను.

నా భాగ్యవశమున ధర్మాత్ముడు సత్యసంధుడు అగు రాముడును,

మహాతేజస్వి, మరియు సుమిత్రానందవర్ధనుడైన లక్ష్మణుడును క్షేమముగా నున్నవారు.

కౌసల్యా, సుమిత్రా, భరతుల కుశల వార్తలు తెలియవచ్చుచున్నవి కదా!

అన్నయందతిశయించిన ప్రేమ కల భరతుడు తన మంత్రులచే రక్షింపబడుచున్నదై ధ్వజ సంశోభితమైన భయంకరమైన ఒక అక్షౌహిణి సేనను నన్ను విడిపించుట కొరకు పంపును కదా ! వానరాధిపతి యగు సుగ్రీవుడు ఇచ్చటకు వచ్చును కదా!

రాక్షసులను వధించి, రావణుని హతమార్చి, లంకను పెకలించి (నశింపచేసి) శ్రీరాముడు నన్నెప్పుడు చూచునో కదా !

నాకు రావణుడు పెట్టిన సంవత్సర పరిమితమగు గడువు ముగియక పూర్వమే త్వరగా నిచటకు రావలసినదని అంతవరకే నే జీవించి యుందుననియు శ్రీరామునకు చెప్పుము.

ఓ వానరోత్తమా! క్రూరుడగు రావణుడు విధించిన గడువులో ప్రస్తుతము పదియవ నెల నడచుచున్నది. ఇక రెండు నెలలు మాత్రమే మిగిలియున్నది.

సోదరుడగు విభీషణుడు నన్ను సమర్పించుమని అనునయ పూర్వకముగా హితమును బోధించినను రావణుడందులకంగీకరింపలేదు.

ఇష్టపూర్వకముగా నన్ను సమర్పించుట రావణున కిష్టము లేదు. ఆయువుమూడిన రావణుని యుద్ధములో మృత్యుదేవత అన్వేషించుచున్నది. (యుద్ధములో రావణుడు మరణించుట తథ్యమని భావము).

వానరశ్రేష్ఠా హనుమా! విభీషణుని జ్యేష్ఠ కుమార్తెయగు 'నల' యను నామె తన తల్లిచే నా వద్దకు పంపబడినదై నాకీవృత్తాంతమును తెలిపెను.

మహామేధావి, విద్వాంసుడు, శ్రీమంతుడు, రాక్షసోత్తముడు, సుశీలుడు, వయోవృద్ధుడు రావణునకు ఇష్టుడును అగు అనింద్యుడనువాడు–

'రాక్షసుల కెల్లరకును శ్రీరాముని వలన వినాశము కలుగనున్నదని (సీతాపహరణము వంటి) అకృత్యములను చేయవలదని' రావణునకు (హితమును) ప్రబోధించెను. కాని దుర్మార్గుడను రావణుడా హితవచనములను వినకున్నాడు.

ఇట్లు పలుకుచు రామునికై కన్నీరు మున్నీరుగా విలపించుచున్న సీతతో హనుమంతుడిట్లనెను.

55) శ్లో ॥ అనుదిన మనుశైలం త్వామనాలోక్య సీతే ।
ప్రతిదిన మనుదీనం వీక్ష్య రామం విరామమ్ ।
గిరిరపి కఠినోఽసౌ యత్తథా న ద్విధాభూత్ ।
క్షితిరపి న విదీర్ణా సా హి సర్వంసహైవ ॥

56) శ్లో ॥ కిం దూర మిందుముఖి రామశిలీముఖానామ్ ।
కిం దుర్గమం కులభిదాం హరియూథపానామ్ ।
దేవం ప్రసన్నమివ దేవి తవాద్య సత్యమ్ ।
రక్షాంసి కాని కుపితస్య స లక్ష్మణస్య ॥

57) శ్లో ॥ శ్రుత్వైవ తు వచో మహ్యం క్షిప్ర మేష్యతి రాఘవః ।
అథవా మోచయిష్యామి త్వా మద్యైవ వరాననే ॥

58) శ్లో ॥ పృష్ఠ మారోహ మే దేవి! మా వికాంక్షస్వ శోభనే !।
యోగ మన్విచ్ఛ రామేణ శశాంకే నేవ రోహిణీ ॥

59) శ్లో ॥ తచ్ఛృత్వా విస్మితా భూత్వా సీతోవాచ మహాకపిమ్ ॥

భావము : సీతా ప్రతిదినము నీ కొరకు అన్వేషించుచు శ్రీరాముడు ప్రతి పర్వతము నందు జూచి నిన్ను గానక, నిర్విరామముగా నీకై శోకముతో దీనముగా పరితపించుచున్నాడు. అట్టి రాముని దుఃఖమును జూచి కూడ పర్వతము రెండుగా బ్రద్దలగుట లేదు. అది బండఱాయి గదా! అట్లే భూమి గూడ రెండుగా చీలిపోవుట లేదు. దాని పేరే **'సర్వంసహ'** (అన్నింటిని సహింపగలది) కదా!

హే చంద్రవదనా! రామబాణములకు దూరదేశమేది? (అవి ఎంత దూరములో నున్న లక్ష్యమునైనను అవలీలగా ఛేదించగలవని భావము) కులపర్వతములనైనను బ్రద్దలుకొట్టగల వానర సమూహములకు చొరశక్యము కాని తావేది? (అనగా వానర సమూహము లెచ్చటికైనను చొచ్చుకొని పోగలరని

భావము). ఇప్పుడో దేవీ! శ్రీరాముడు నీ యెడ ప్రసన్నుడై యున్నాడు. లక్ష్మణుడు కోపించినచో యిపుడే రాక్షసులను మట్టుపెట్టును. ఇది సత్యము.

శ్రీరాముడు నా మాటను వినినంతనే త్వరగా నిచటకు వచ్చును. ఓ సుముఖీ ! సీతా ! అంత ఎందుకు. నేను నిన్నిప్పుడే విడిపింపగలను.

దేవీ! సుమంగళీ! అన్యథా సంశయింపక ఇప్పుడే నా పృష్ఠము నధిరోహింపుము. రోహిణి నక్షత్రముచంద్రుని గూడినట్లు నీవు శ్రీరాముని పొందును పొందగలవు.

ఇట్లు పలుకుచున్న హనుమంతుని వచనములనాశ్చర్యముతో వినిన సీత యతనితో నిట్లనెను.

60) శ్లో ॥ తదేవ ఖలు తే మన్యే కపిత్వం హరియూథప!
కథం వాల్పశరీర స్త్వం మా మితో నేతు మిచ్ఛసి ?
సకాశం మానవేంద్రస్య భర్తుర్మే ప్లవగర్షభ !

భావము : వానరవీరా ! హనుమా ! ఇదియే నీ వానరత్వము ! ఈ చిన్ని శరీరము కల నీవు నన్నిచ్చటి నుండి మానవేంద్రుడగు నా భర్త వద్దకు ఎట్లు తీసికొని పోగలవు?

61) శ్లో ॥ సీతాయా వచనం శ్రుత్వా హనుమాన్ మారుతాత్మజః ।
చిన్తయామాస లక్ష్మీవాన్ నవం పరిభవం కృతమ్ ॥

62) శ్లో ॥ నమే జానాతి సత్త్వం వా ప్రభావం వాఽసితేక్షణా ।
తస్మాత్పశ్యతు వైదేహీ యద్రూపం మమ కామతః ॥

63) శ్లో ॥ ఇతి సంచింత్య హనుమాన్ తదా ప్లవగసత్తమః ।
దర్శయామాస వైదేహ్యా స్స్వరూప మరిమర్దనమ్ ॥

ఇతి శ్రీ రామాయణ సారోద్ధారే సుందరకాండే దశమ స్సర్గః ॥

భావము : సీత యొక్క ఈ వచనములను వినిన వాయునందనుడగు హనుమంతుడు శ్రీమంతుడగు తనకిది యొక కొత్త అవమానముగా తలంచి యిట్లనుకొనెను.

కాటుకకన్నుల ఈ సుందరికి నా ప్రతాప ప్రభావములు తెలియవు. కావున యిట్లు పలికినది. అందుచే ఈ విదేహరాజపుత్రికిప్పుడు నా కామరూప ప్రభావములను చూపెదను.

అని యాలోచించి వానరోత్తముడైన హనుమంతుడు సీతాదేవికి తన అరివీరభయంకరమైన విరాడ్రూపమును ప్రదర్శించెను.

ఇది శ్రీమద్రామాయణ సారోద్ధారములోని సుందరకాండాంతర్గతమగు పదియవ సర్గము.

సర్గాంతశ్లోకసంఖ్య-(505+63=568)

ఏకాదశ సర్గః

1) శ్లో ॥ స తస్మా త్పాదపా ద్ధీమా నాప్లుత్య ప్లవగర్షభః ।
తతో వర్ధితుమారేభే సీతాప్రత్యయ కారణాత్ ॥

2) శ్లో ॥ మేరుమందరసంకాశో బభౌ దివ్యానలప్రభః ।
తతః ప్రసన్నో హనుమాన్ సోఽభవద్విశ్వరూపధృత్ ॥

3) శ్లో ॥ వానరం ముఖమేకం తు ద్వితీయం సింహవక్త్రకమ్ ।
తృతీయం గారుడంవక్త్రం చతుర్థం సౌకరంముఖమ్ ॥

4) శ్లో ॥ హయాస్యం పంచమం చోర్ధ్వం చైకైకం నయనం త్రిభిః ।
దశబాహుసమోపేతం దశాయుధ సమన్వితమ్ ॥

5) శ్లో ॥ రూపం తస్య బభౌ యద్వ ద్రుద్రస్య పురఘాతినః ।
తదాప్రభృతి నామాసీ త్పంచాస్యో హనుమానితి ॥

6) శ్లో ॥ తం దృష్ట్వా భీమసంకాశ మువాచ జనకాత్మజా ।

7) శ్లో ॥ వందే వానర నారసింహ ఖగ రాట్క్రోడాశ్వ వక్త్రాంచితః ।
నానాలంకరణం త్రిపంచనయనం దేదీప్యమానం హరిమ్ ।
హస్తాబ్జై రసిఖేటపుస్తక సుధాకుంభాంకుశాద్రీన్ హలమ్ ।
ఖట్వాంగం ఫణిభూరుహౌ చ దధతం సర్వారిగర్వాపహమ్ ॥

8) శ్లో ॥ నమస్తే దేవదేవేశ ! నమస్తే రాక్షసాన్తక !
నమస్తే వానరాధీశ ! నమస్తే వాయునందన !

9) శ్లో ॥ నమ స్త్రిమూర్తి వపుషే వేదవేద్యాయ తే నమః ।
నమస్తే లోకనాథాయ సీతాశోకాపహారిణే ॥
స్తువన్తీం జానకీం దృష్ట్వా హనుమానాహ సుందరః ॥

హనుమంతుడు సీతకు విశ్వరూపమును ప్రదర్శించుట

భావము : వానర శ్రేష్ఠుడను బుద్ధిమంతుడును అగు హనుమ ఆ వృక్షమునుండి క్రిందకుదిగి, సీతకువిశ్వాసమును కలిగించుటకై క్రమముగా పెరుగనారంభించెను.

మేరుమందరపర్వతములను పోలిన బృహదాకారముతో, దివ్యాగ్ని సమ కాంతిమంతుడై ప్రసన్నగంభీరుడగు ఆ హనుమంతుడు విశ్వరూపమును ధరించెను. విశ్వరూపమును ధరించిన హనుమంతుడు ప్రసన్నముగనే యుండెను.

అతని పంచముఖములలో మొదటిది వానరముఖము. రెండవది సింహాస్యము, మూడవది గారుడముఖము. నాలుగవది సూకరముఖము. అయిదవది హయాననము ఊర్ధ్వముఖము. ప్రతిముఖమున మూడేసి నేత్రములు కలవు. అతని పదిచేతులలో పది ఆయుధములుండెను.

ఆ రూపము త్రిపురాసురసంహారమునకై యవతరించిన రుద్రునిరూపమును పోలియుండెను. అది మొదలు హనుమంతునకు పంచాస్యుడను ప్రసిద్ధిని పొందెను. అట్టి భీమాకృతి గల హనుమంతుని జూచి జానకి యతని నిట్లుస్తుతించెను.

వానర–నారసింహ–గారుడ–వారాహ–హయ ముఖములతో, బహువిధ ఆభరణములతో, ముఖమునకు మూడేసి కన్నులు చొప్పున పదునైదు కన్నులుకల పంచాస్యములతో దేదీప్యమానముగా ప్రకాశించుచు, పది కరకమలములలో – ఖడ్గము, ఖేటము, పుస్తకము, సుధాకలశము, అంకుశము, పర్వతము, నాగలి, మంచముకోడు, సర్పము, వృక్షము – అను పదిఆయుధములను ధరించిన సర్వారిగర్వాపహారియగు హనుమా! నీకు నమస్కరించుచున్నాను.

దేవాధిదేవా ! నీకు నమస్కారము. రాక్షసాంతకా! నీకు వందనము. వానరాధీశా ! నీకు ప్రణామము. వాయునందనా ! నీకిదే నా యంజలి.

త్రిమూర్తి స్వరూపా ! వేదవేద్యా ! లోకనాథా ! సీతాశోకాపహర్తా ! నీకు సమస్కారము అని ఇట్లు స్తుతించుచున్న సీతను జూచి సుందరుడగు హనుమ యామెతో నిట్లు పలికెను.

10) శ్లో ॥ సూత్రతుల్యం సముద్రం చ శరావమివ భూతలమ్ ।
పిపీలికాసంఘ మివ ససైన్యం రావణం తథా ॥

11) శ్లో ॥ సంహర్తుం చ సమర్థోఽహం ముహూర్తార్ధేన లీలయా ।
రామప్రతిజ్ఞారక్షార్థం న హనిష్యామి సాంప్రతమ్ ॥

12) శ్లో ॥ త మాహ జానకీ నాహం ద్రుష్టుం తే రూపమీదృశమ్ ।
ప్రసన్నో భవ మే బ్రహ్మన్ పూర్వరూపం ప్రదర్శయ ॥

భావము : సీతా నేను సముద్రమునొక దారముతో సమానమైన సన్నని పిల్లకాలువ వలెను, భూతలమునంతను శరావము (బూరెల మూకుడు)గను, సైన్య సమేతుడగు రావణుని చీమలబారును వలె ఒక్క అరఘడియ కాలములో చంపగలను. కాని శ్రీరామునిప్రతిజ్ఞను పాలించుటకై ప్రస్తుతము వారిని వధింపను. అని యిట్లు పలుకుచున్న యతనితో సీత –

ఆంజనేయా ! ఈ విధమైన నీ విరాడ్రూపమును నేను చూడజాలకున్నాను. కావున యోబ్రహ్మరూపా! నా యందు ప్రసన్నుడనై నీ పూర్వరూపమును చూపుము అని పలికెను.

13) శ్లో ॥ తచ్ఛృత్వోవాచ హనుమాన్ యదా తే సంకటం భవేత్ ।
తదా సంస్మర మాం దేవీ త్యక్త్వా పూర్వవదత్రవై ॥
స్తువన్ సీతాం స్థిత స్తం సా ప్రశంసా పూర్వమబ్రవీత్ ॥

14) శ్లో ॥ తవ సత్త్వం బలం చైవ విజానామి మహాకపే !
అయుక్తం తు కపిశ్రేష్ఠ మమ గన్తుం త్వయానఘ !

15) శ్లో ॥ త్వయా హి సహ రామస్య మహానాగమనే గుణః ।
యదిరామో దశగ్రీవ మిహ హత్వా స బాంధవమ్ ।

16) శ్లో ॥ మా మితో గృహ్య గచ్ఛేత తత్తస్య సదృశం భవేత్ ॥

భావము : సీతా వచనములను వినిన హనుమంతుడామెతో – 'దేవీ! నీకు కష్టము కలిగినప్పుడు నన్ను స్మరింపుము' అని పలికి పూర్వము వలె సీతను సంస్తుతించుచు, ఆమె ఎదుట నిలచెను. అపుడామె ఆ విధముగా వినీతుడై నిలిచియున్న అతనిని చూచి ప్రశంసించుచు నిట్లు పలికెను.

మహా వానరా ! నీ పరాక్రమ ప్రభావములను బాగుగా తెలిసికొంటిని.

అయినను వానరోత్తమా! పవిత్రచరిత్రుడవైనను నేను నీతో వచ్చుట తగదు.

శ్రీరాముడు నీతో కూడ ఈ లంకకు వచ్చి, ఇచ్చట నున్న రావణుని సపరివారముగా వధించి, నన్నిచ్చటి నుండి తీసుకొనిపోయినట్లయిన, అది యా వీరునకు తగిన పని యగునని పలికెను.

హనుమానువాచ –

17) శ్లో ॥ యుక్తరూపం త్వయా దేవి భాషితం శుభదర్శనే ।
సదృశం స్త్రీస్వభావస్య సాధ్వీనాం వినయస్య చ ॥

18) శ్లో ॥ ద్వితీయం కారణం యచ్చ బ్రవీషి వినయాన్వితే !
రామా దన్యస్య నార్హామి సంస్పర్శమితి జానకి ।
ఏతత్తే దేవి సదృశం పత్న్యాస్తస్య మహాత్మనః ॥

19) శ్లో ॥ కా హ్యన్యా త్వదృతే దేవి బ్రూయాద్వచనమీదృశమ్ ।
శ్రోష్యతే చైవ కాకుత్థ్సః సర్వం నిరవశేషతః ॥

20) శ్లో ॥ యది నోత్సహసే యాతుం మయాసార్థ మనిందతే ।
అభిజ్ఞానం ప్రయచ్ఛ త్వం జానీయా ద్రాఘవో హి తత్ ॥

21) శ్లో ॥ మాయామృగేణ తవ మైథిలి ! వంచితాయా ।
శ్శాఖామృగేణ పునరాగత మిత్యయుక్తమ్ ।
ఏషా కథాపి భువనే విదితా యది స్యాత్
కానామ రామ ధనుషః ప్రథితా ప్రశస్తిః ? ॥

22) శ్లో ॥ ఏవ ముక్తా హనుమతా సీతా సురసుతోపమా ।
ఉవాచ వచనం మన్దం భాష్పప్రగథితాక్షరమ్ ॥

భావము : దేవీ ! నీవు తప్ప ఇతర స్త్రీలెవ్వరిట్టి వచనములు పలుకగలరు? శ్రీరాముడీవాక్యమునువిని మిక్కిలి సంతోషించును.

నాతో వచ్చుటకు నీ వంగీకరింపకపోయినట్లయిన శ్రీరాముడు గుర్తించునట్టి ఒక అభిజ్ఞానము (ఆనవాలు) నిమ్ము.

ఓ మైథిలీ మాయామృగముచే వంచించబడిన నిన్ను వేఱొక శాఖామృగము (వానరము) మరల తీసికొని వచ్చెననుట యుక్తము కాదు. ఈ వార్త లోకమున ప్రకటింపబడినచో రామకోదండ ప్రాశస్త్యము లేదా ప్రసిద్ధి ఏమగును? (నశించునని భావము)

ఈ విధముగా హనుమంతునిచే పలుకబడిన దేవకాంతలతో పోల్చదగిన సీత (తన ఏకాన్త వృత్తాన్త స్మరణముచే పెల్లుబికిన) బాష్పగద్గద వచనముతో నిట్లనెను.

23) శ్లో ॥ ఇదం శ్రేష్ఠ మభిజ్ఞానం బ్రూయాస్త్వం తు మమ ప్రియమ్ ।
శైలస్య చిత్రకూటస్య పాదే పూర్వోత్తరే పురా ॥

24) శ్లో ॥ మనశ్శిలాయా స్తిలకో గండపార్శ్వే నివేశితః ।
త్వయా ప్రణష్టే తిలకే తం కిల స్మర్తు మర్హసి ॥

25) శ్లో ॥ అభిజ్ఞానార్థ మన్యచ్చ వదామి తవ సువ్రత!
చిత్రకూటగిరౌ పూర్వమేకదా రహసి స్థితః ॥

26) శ్లో ॥ మదంకే శిర ఆధాయ నిద్రాతి రఘునందనః ।
ఐంద్రకాక స్తదాగత్య నఖై స్తుండేన చాసకృత్ ॥

27) శ్లో ॥ మత్పాదాంగుష్ఠ మారక్తం విదదారామిషాశయా ।
తతో రామః ప్రబుద్ధ్యాథ దృష్ట్వా పాదం కృతవ్రణమ్ ॥

28) శ్లో ॥ కాకముద్దిశ్య చిక్షేప బ్రహ్మాస్త్రం సస్తృణం స్పృశన్ ।
స త్వింద్రస్య సుతః కాక శ్చేన్ద్రలోకం వివేశ హ ॥

29) శ్లో ॥ రామాస్త్రం ప్రజ్వలద్దీప్తం తస్యాను ప్రవివేశ వై ।
విదితార్థశ్చ దేవేన్ద్రో దేవైస్సహ సమన్వితః ॥

30) శ్లో ॥ నిష్క్రామయచ్చ తం పుత్రం రాఘవస్యాపకారిణమ్ ।
తతోఽసౌ సర్వదేవైస్తు దేవలోకా ద్బహిష్కృతః ॥

31) శ్లో ॥ పునస్సోఽభ్యపతద్రామం రాజానం శరణం గతః ।
త్రాహి త్రాహి మహాబాహో అజ్ఞానాదపకారిణమ్ ॥

రామః –

32) శ్లో ॥ అమోఘంచ మమైవాస్త్రమంగమేకం ప్రయచ్ఛ వై ।
తతో జీవసి దుష్ట ! త్వం అపకారో మహన్ కృతః ॥

33) శ్లో ॥ ఇత్యుక్త్వోఽసౌ స్వకం నేత్రమేక మస్త్రాయ దత్తవాన్ ।
తతః ప్రభృతి కాకానాం సర్వేషా మేకనేత్రతా ।

34) శ్లో ॥ చక్షుషైకేన పశ్యన్తి హేతునా తేన వానర !
మత్కృతే కాకమాత్రే తు బ్రహ్మాస్త్రం సముదీరితమ్ ॥

35) శ్లో ॥ కస్మా ద్యో మాం హరత్యత్తః క్షమసే తం మహీపతే ।
త్వయా నాథవతీ నాథ! హ్యనాథేవ హి దృశ్యతే ॥

36) శ్లో ॥ ఉవాచ శోకసంతప్తా హనుమన్తం ప్లవంగమమ్ ॥

భావము : ఓ హనుమంతుడా ! నీకు ఈ శ్రేష్ఠమైన అభిజ్ఞానము (ఆనవాలు)ను నా కత్యంతప్రియమైన దానిని చెప్పెదను.

చిత్రకూట పర్వతప్రాంత ప్రత్యంతపర్వతమునందు ఈశాన్య భాగమున నేను నా ప్రియుడైన శ్రీరామునితో నివసించు సమయమున జరిగిన రహస్యవృత్తాంతమును చెప్పెదను, దానిని శ్రీరామునకు విన్నవించుము.

'ఓ రామా! నా తిలకము చెదరిపోగా మనశ్శిలచే నాకు తిలకమును దిద్ది మిగిలిన దానిని నా గండస్థలము (చెక్కిలి) పై నుంచితిని. దానిని నీవు స్మరించుము.

ఓ సువ్రతాచరణా ! ఆనవాలుగా మరియొక విషయమును కూడ చెప్పెదను పూర్వము చిత్రకూటపర్వతము నందేకాంతములో రఘునందనుడగు శ్రీరాముడు నా ఒడిలో శిరమునుంచుకొని నిద్రించుచుండెను.

అప్పుడింద్రపుత్రుడగు కాకాసురుడచటకువచ్చి గోళ్ళతోను ముక్కుతోను పలుమార్లు నా పాదాంగుష్ఠమును మాంసమని తలచి చీల్చసాగెను. పిమ్మట రాముడు మేల్కొని నా పాదమున (స్తనాంతరమున) చేయబడిన గాయమును చూచెను.

వెంటనే అతడొక తృణము (దర్భ) నభిమంత్రించి బ్రహ్మాస్త్రముగా ఇంద్రసుతుడగు కాకాసురునిపై ప్రయోగించెను. అపుడా ఇంద్రసుతుడైన కాకాసురుడింద్ర లోకమును ప్రవేశించెను.

అతని ననుసరించుచు జ్వలద్దీప్తమగు రామాస్త్రము కూడ ఇంద్రలోకములోనికి ప్రవేశించెను. ఈ వృత్తాంతమును తెలిసికొనిన దేవేంద్రుడు దేవతలతో కూడ రాఘవునకపకారము చేసిన తన కుమారుని యటనుండి పంపివేసెను. పిదప నతడు దేవతలచే కూడ బహిష్కరింపబడెను.

అంతట మరల నా కాకాసురుడు రాముని పాదములపైబడి శరణుజొచ్చినవాడై – 'ఓ మహానుభావా! అజ్ఞానినై నీకపకారమును చేసిన నన్ను క్షమించి రక్షింపుము, రక్షింపుము' – అని వేడుకొనెను. అప్పుడు –

శ్రీరాముడు – 'ఓయీ! ఈ నా అస్త్రము వ్యర్థము కాదు. దుష్టుడా! నీవు చేసిన అపకారము బహుగొప్పది. కావున ప్రతిఫలముగా దీనికి నీ శరీరావయవము నొక దానిని సమర్పించుము. అప్పుడే నీవు జీవింపగలవు'.

అని కరుణతో పలుకబడినవాడై యతడు తన నేత్రము నొకదానిని ఆ యస్త్రమునకు సమర్పించుకొనెను. అది మొదలుకొని కాకులన్నియు ఏకాక్షులైనవి. వానరోత్తమా ! ఈ కారణముగా కాకులన్నియు నొక్క కంటితోనే చూచుచున్నవి.

ఇట్లు నా కారణముగా తుచ్ఛమగు కాకిపై బ్రహ్మాస్త్రమును నా యందలి ప్రేమచే ప్రయోగించిన శ్రీరామభూపాలా! నన్నిట్లు అపహరించి తీసికొని వచ్చిన ఈ రాక్షసాధముడగు రావణుని ఎందుకుపేక్షించుచున్నావు? నీ వంటి పరాక్రమశాలి ప్రాణనాథుడుగా నున్న నేననాథ వలె ఇట్లు విలపించుచున్నాను అని దుఃఖ పరితప్తయై సీత విలపించుచు హనుమంతునితో ఇట్లనెను –

37) శ్లో ॥ కౌసల్యా లోకభర్తారం సుషువే యం మనస్వినీ ।
తం మమార్థే సుఖం పృచ్ఛ శిరసా చాభివాదయ ॥

38) శ్లో ॥ అనుప్రవ్రజితో రామం సుమిత్రా యేన సుప్రజాః ।
స మమార్థాయ కుశలం వక్తవ్యో వచనా న్మమ ॥

39) శ్లో ॥ ఇదం బ్రూయాశ్చ మే నాథం శూరం రామం పునః పునః ।

హారో నారోపితః కంఠే పురా వ్యవహితే రతౌ ।

అధునాచావయో ర్మధ్యే సముద్రశ్శతయోజనః ॥

40) శ్లో ॥ జీవితం ధారయిష్యామి మాసం దశరథాత్మజ ।

ఊర్ధ్వం మాసాన్న జీవేయం సత్యేనాహం బ్రవీమి తే ॥

భావము : గొప్ప మనస్సుకల కౌసల్య లోకరక్షకుడగుకుమారునిగా కన్న శ్రీరాముని సుఖమును, కుశలమును నా (రక్షణ) కొరకు కూడ అడుగుము.

సుమిత్రానందవర్ధనుడుగా జన్మించి, రాముని యనుసరించి కానల కేగినయా లక్ష్మణుని కుశలమును నా మాటగా (నా తరఫున) అడుగుము.

శూరుడు వీరుడు నా నాథుడునగు శ్రీరామునితో యీ మాటను మరల మరల చెప్పుము. పూర్వము మన ఏకాంత రతిసమయమున అడ్డుతగులు చున్నదని కంఠమున హారము ధరింపబడలేదు. కాని ఇప్పుడు మన నడుమ శతయోజనవిస్తీర్ణమగు సముద్రమున్నది. (ఇది ఎంత వ్యధా జనకమో ఊహింపుమని భావము)

దశరథనందనా ! రామా ! నేనింకొక్క నెలమాత్రమే బ్రతికి యుండెదను. అంతకుమించి బ్రతుకను. ఇది మాత్రమే సత్యముగా నీకు సందేశించుచున్నాను.

41) శ్లో ॥ తతో వస్త్ర గతం ముక్త్వా దివ్యం చూడామణిం శుభమ్ ।

ప్రదేయో రాఘవాయేతి సీతా హనుమతే దదౌ ॥

42) శ్లో ॥ మణిం దత్వా తతస్సీతా హనూమంత మథాబ్రవీత్ ।

మణిం దృష్ట్వా తు రామో వై త్రయాణాం సంస్మరిష్యతి ॥

43) శ్లో ॥ వీరో జనన్యా మమ చ రాజ్ఞో దశరథస్య చ ॥

భావము : పిమ్మట సీతాదేవి తన చీర చెంగున కట్టబడి యున్న దివ్యమైన మంగళకరమైన శిరోరత్నము (చూడామణిని) తీసి హనుమంతునికి యిచ్చి రామునకు దానినిమ్మని ఇట్లు చెప్పెను.

ఈ మణిని చూచిన వెంటనే వీరుడగు శ్రీరామచంద్రుడు తల్లియగు కౌసల్యను, నన్నును రాజగు దశరథుని మా ముగ్గురను బాగుగా స్మరించును.

శ్రీపాదుక : దానిని ముందుగా కౌసల్యా మాత దశరథుని చేతి నుండి దానిని గ్రహించి నా శిరస్సున ఆభరణముగా నలంకరించినది. కావున మా ముచ్చురను రాముడు తప్పక సంభావించునని సీతాహృదయము.

44) శ్లో ॥ మణిరత్నం కపివరః ప్రతిగృహ్యాభివాద్య చ ।
సీతాం ప్రదక్షిణం కృత్వా ప్రణతః పార్శ్వతః స్థితః ॥

45) శ్లో ॥ అంగుళ్యా యోజయామాస న హ్యస్య ప్రాభవద్భుజః ।
హృదయేన గతో రామం శరీరేణ తు విష్ఠితః ॥

భావము : వానరోత్తముడగు హనుమంతుడా రత్నమణిని పరిగ్రహించి, నమస్కరించి, సీతాదేవికి ప్రదక్షిణము చేసి, మరల నమస్కరించి, ప్రక్కగా నిలుచుండెను. హనుమంతుడద్దానిని వ్రేలితోనే పట్టుకొనెను. (అప్పటికాతడు విశ్వరూపం ఉపసంహరించుటచే అతని బాహువు పెద్దదిగా లేదు)

అప్పుడా హనుమంతుడు మనసుతో మాత్రమే రాముని చేరుకొనెను. శరీరముతో సీతవద్దనే నిలచియుండెను.

శ్రీపాదుక : బుద్ధిమద్వరిష్ఠుడు కావున మనోవేగముతో రాముని చేరి, మణినిచ్చి అతనికానందమును కలిగించెనని భావము.

46) శ్లో ॥ హనుమా నా హ తాం సీతాం దీయతాం ఫలరాశయః ।
తదా తం జానకీ ప్రాహ పతితాన్యత్ర వై భువి ।
భుంక్ష్వైతాని ఫలాని త్వం తూష్ణీం మా త్రోటయాత్ర వై ॥

భావము : పిమ్మట హనుమంతుడు సీతను ఫలరాశులనిమ్మని యడిగెను. అప్పుడు జానకి యతనితో నచట నేలపైపడియున్న వానిని మాత్రమే మౌనముగా భుజింపుము. ఇచట చెట్లకున్న ఫలములను త్రుంచ వద్దని చెప్పెను.

47) శ్లో ॥ స చ వాగ్భిః ప్రశస్తాభిర్గమిష్య న్పూజిత స్తయా ।
కించిద్దూర మథో గత్వా స్వాత్మన్యేవాను చింతయత్ ॥

48) శ్లో ॥ కార్యార్థ మాగతో దూతః స్వామికార్యావరోధతః ।
అన్యత్కించి దసంపాద్య గచ్ఛత్యధమ ఏవ చ ॥

49) శ్లో ॥ ఇతి నిశ్చిత్య మనసా వృక్షషణ్డే మహాబలః ।

50) శ్లో ॥ తత ఉత్థాయ వృక్షాగ్రే దేవ్యా మందిరమద్భుతమ్ ॥

సింహధ్వజం దదర్శాగ్రే దృష్ట్వా పవననందనః ॥

51) శ్లో ॥ తత స్తన్మందిర ద్వారం గత్వాஉపశ్య త్సురేశ్వరీమ్ ।

ఉవాచ త్రిజగద్వంద్యాం భక్త్యా పరమయా యుతః ॥

52) శ్లో ॥ దేవి ప్రసీద విశ్వేశి రామస్యానుచరో హ్యహమ్ ।

అన్వేష్టుం జానకీం లక్ష్మీం లంకాయాం సముపాగతః ॥

53) శ్లో ॥ తస్మాత్త్యజ పురీమేనాం రావణం సుదురాసదమ్ ।

పాతయస్వ మహాదేవి! రక్ష విశ్వం చరాచరమ్ ॥

దేవ్యువాచ -

54) శ్లో ॥ లంకాత్యాగే మతిం పూర్వ మకార్షం స్వయమేవ హి ।

ఇత్యుక్త్వా సా భగవతీ లంకాం త్యక్త్వా మహేశ్వరీ ॥

అంతర్దధే వాయుపుత్రే సహసా తస్య పశ్యతః ॥

ఇతి శ్రీరామాయణ సారోద్ధారే సుందరకాండే ఏకాదశ స్సర్గః

భావము : ఈ విధముగా ప్రశస్తములగు మాటలచే సీతచే సమ్మానింపబడిన హనుమ సెలవుగొని బయలుదేరుచు తనలో నిట్లు తలంచెను.

'దూత స్వామికార్యార్థమై వచ్చి, స్వామికార్యమున కనుకూలములగు ఇతర కార్యములను ఏమాత్రమాలోచింపక (తన వచ్చిన పనిని మాత్రమే నెరవేర్చుకొని) వెళ్ళిపోయినచో అతడధముడనబడును. కావున స్వామి కార్యానుకూలముగా ఇతరములైన కార్యములను కూడ సంపాదించవలెను'.

అని నిశ్చయించి అటనుండి బయలుదేరి ఒక చెట్టుకొనపైకెక్కి చెట్లతోపు నడుమ సింహధ్వజముతో నలరారు దేవీమందిరమును చూచి, చెట్టు దిగి ఆ దేవీ మందిరద్వారమువద్దకేగి, దేవిని చూచి, ముల్లోకములచే నమస్కరింపబడు ఆ దేవికి పరమభక్తితో నమస్కరించి యిట్లు పలికెను-

'అమ్మా సర్వలోకేశ్వరీ! నేను రామసేవకుడను. ఇచ్చట జనకరాజపుత్రిగా నవతరించిన మహాలక్ష్మిని (రామ పత్నియగు సీతను) వెదకుటకై ఈ లంకాపురికి వచ్చితిని. జగన్మాతా ! నన్ననుగ్రహింపుము. పరమ దుర్మార్గుడగు రావణుని, అతని యీ లంకాపురిని పడగొట్టుము. (అనగా రావణుని హతమార్చి లంకాపట్టణమును ధ్వంసము గావింపుమని భావము) ఇట్లీ చరాచర1విశ్వమును సంరక్షింపుము. నీవీ లంకను విడిచిపెట్టుము.'

హనుమంతుని ప్రార్థనను వినిన దేవి, యతనితో – 'నేను కూడ యీ లంకాపురిని విడిచిపెట్టి వెళ్ళదలచితిని యని పలికి ఆ మహేశ్వరి వెనువెంటనే ఆ హనుమంతుడు చూచుచుండగనే తన దివ్యస్వరూపముతో అంతర్ధానమయ్యెను.

శ్రీపాదుక : ఈ వృత్తాంతము ప్రాచీన దేవీభాగవతములోని 39వ సర్గములోనిదిగా సూచింపబడినది.

ఇది శ్రీమద్రామాయణ సారోద్ధారములోని సుందరకాండము నందలి పదనొకండవ సర్గము

సర్గాంతశ్లోకసంఖ్య–(568+54=622)



లంకాదహనం

ద్వాదశ సర్గః

1) శ్లో ॥ తస్మా ద్దేశా దపక్రమ్య చిన్తయామాస వానరః ।
అల్పశేష మిదం కార్యం దృష్టేయ మసితేక్షణా ॥
త్రీనుపాయానతిక్రమ్య చతుర్థ ఇహ దృశ్యతే ॥

2) శ్లో ॥ న సామ రక్షస్సు గుణాయ కల్పతే
న దాన మర్థోపచితేషు యుజ్యతే ।
న భేదసాధ్యా బలదర్పితా జనాః ।
పరాక్రమస్త్వేవ మమేహ రోచతే ॥

3) శ్లో ॥ వనం నేత్ర మనః కాన్తం నానాద్రుమలతాయుతమ్ ।
ఇదం విధ్వంసయిష్యామి శుష్కంవనమివానలః ॥

4) శ్లో ॥ అస్మి న్భగ్నే తతః కోపం కరిష్యతి దశాననః ॥

5) శ్లో ॥ తతో మహత్సాశ్వ మహారథద్విపమ్ ।
బలం సమాదేక్ష్యతి రాక్షసాధిపః ।
నిహత్య తద్రావణచోదితం బలమ్ ।
సుఖం గమిష్యామి కపీశ్వరాలయమ్ ॥

6) శ్లో ॥ ఏవమాలోచ్య వవృధే వృక్షేభ్యోపి సమున్నతః ॥

భావము : వానర వీరుడగు హనుమంతుడా ప్రదేశమును వీడి, మఱియొక చోట నిలచి తనలో నేనిచ్చటకు వచ్చిన కార్యము చాలావరకు పూర్తయినది. నల్లని కన్నులుకల సుందరియగు సీతను దర్శించితిని. అయినను కొంతపని మిగిలియున్నది.

సామదానభేదదండములనెడి నాలుగుపాయములలో నాలుగవది మాత్రమే అవలంబింపదగినదిగా కనబడుచున్నది.

సహజముగా క్రూరులగు రాక్షసుల విషయములో సామమవలంబించ దగదు. వీరు ధనముచే బలిసినవారు కావున దానము పనికిరాదు. బలదర్పితులగు వీరి విషయమున భేదముకూడ సాధ్యము కాదు కావున

నాలుగవదగు దండోపాయము మాత్రమే నాకు సమంజసముగా తోచుచున్నది.

బహువిధములగు వృక్షలతాశోభితమగు ఈ వనము కన్నులకు మనసునకు కూడ ఆనందమును కూర్చుచున్నది. దీనినిప్పుడు ఎండిన వనమును దావానలము దహించినట్లుగా పూర్తిగా ధ్వంసము కావించెదను.

దీనిని భగ్నము కావించినచో దశగ్రీవుడగు రావణుడు కోపించును.

పిమ్మట ఆ రాక్షసేశ్వరుడగు రావణుడు గొప్ప రథాశ్వగజసారథులతో కూడిన తన సైన్యమును యుద్ధమునకాదేశించును. ఆ విధముగా రావణునిచే పంపబడిన బలగము నంతను పరిమార్చి సుఖముగా కపీశ్వరుడగు సుగ్రీవుని నగరమగు కిష్కింధకు పోయెదను అని యిట్లాలోచించి హనుమంతుడా వృక్షములను మించి యున్నతునిగా పెరిగెను.

7) శ్లో ॥ తతస్తుహనుమా న్వీరో బభంజ ప్రమదావనమ్ ।
తతో మారుతవ త్క్రుద్ధో మారుతి ర్భీమవిక్రమః ॥

8) శ్లో ॥ ఊరువేగేన మహతా ద్రుమాన్ క్షేప్తుమథారభత్ ।
మత్తద్విజసమాఘుట్టం నానాద్రుమల తాయుతమ్ ॥

9) శ్లో ॥ లతాగృహై శ్చిత్రగృహైశ్చ నాశితై -
ర్మహోరగై ర్వ్యాళ మృగైశ్చ నిర్ధుతైః ।
శిలాగృహై రున్మథితై స్తదా గృహైః ।
ప్రణష్టరూపం త దభూన్మహ ద్వనమ్ ॥
సీతాశ్రయనగం త్యక్త్వా వనం శూన్యం చ కారసః ॥

భావము : హనుమంతుడశోకవనమును భగ్నము చేయుట

పిమ్మట వీరుడగు హనుమంతుడా ప్రమదావనమును ప్రభంజనము వలె ప్రకోపించి భయంకరమగు పరాక్రమముతో భగ్నము చేయసాగెను.

మహావేగముతో విజృంభించి మదించిన ఏనుగులు పక్షులు వృక్షములు, లతలతో కూడిన ఆ వనమందలి చెట్లను పెకిలించి విసిరివేయసాగెను.

ఆ ప్రమద వనమందున్న పొదరిళ్లు, చిత్రగృహములు నాశనము గావింపబడగా అందున్న సర్పములు, మృగములు తరిమివేయబడినవై బయటకు వచ్చెను. జాతి యిళ్ళు సైతము నిర్మూలింపబడగా ఆ మహావనమంతయు పూర్తిగా నశించి ధ్వస్తమయ్యెను.

ఈ విధముగా ఆ హనుమంతుడు సీతకూర్చునియున్న వృక్షమును మాత్రము విడిచి పెట్టి పూర్తిగా వనమునంతయు విధ్వంసము గావించెను.

10) శ్లో ॥ తతః పక్షినినాదేన వృక్షభంగస్వనేన చ ।

బభూవు స్త్రాస సంభ్రాన్తా స్సర్వే లంకానివాసినః ॥

11) శ్లో ॥ రక్షసాం చ నిమిత్తాని క్రూరాణి ప్రతిపేదిరే ॥

12) శ్లో ॥ తతో గతాయాం నిద్రాయాం రాక్షస్యో వికృతాననాః ।

తద్వనం దదృశుర్భగ్నం తం చ వీరం మహాకపిమ్ ॥

భావము : పిమ్మట నట చెలరేగిన పక్షుల కలకలముచేతను మహావృక్షములు విరువబడుచున్న శబ్దములచేతను లంకలో నివసించుచున్న వారందరును భయభ్రాంతులైరి.

రాక్షసులందరకును అపశకునములు కలిగెను. అంతలో నిద్రలేచిన భయంకర ముఖములకల రాక్షసస్త్రీలు ఎదురుగా పూర్తిగా విధ్వస్తమైన అశోకవనమును, ఎదురుగా మహాకాయముతో నిలచిన వానరవీరుడగు హనుమంతుని చూచిరి.

13) శ్లో ॥ రాక్షస్యో వానరం దృష్ట్వా పప్రచ్ఛుర్జనకాత్మజామ్ ।

కోఽయం కస్య కుతో వాఽయం కిన్నిమిత్త మిహాగతః ?

అథాఽబ్రవీ త్తదా సాధ్వీ సీతా సర్వాంగసున్దరీ ।

భావము : వానరుని జూచిన యా రక్షసాంగనలు 'ఇతడెవ్వడు? ఎవరివాడు? ఎచ్చటి వాడు? ఇచ్చటికెందుకు వచ్చినాడు?' అని సీతను ప్రశ్నించిరి.

అందులకు పరమపతివ్రతయు, సర్వాంగసుందరియునగు సీత వారితో నిట్లు పలికెను.

14) శ్లో ॥ రక్షసాం భీమరూపాణాం విజ్ఞానే మమ కా గతిః ।

యూయ మేవాభిజానీథ యోఽయం యద్వా కరిష్యతి ॥

15) శ్లో ॥ అహి రేవ హ్యహేః పాదా న్విజానాతి న సంశయః ।

అహమప్యస్య భీతాస్మి నైనం జానామి కోఽన్వయమ్ ॥

16) శ్లో ॥ వైదేహ్యా వచనం శ్రుత్వా రాక్షస్యో విద్రుతా దిశః ।

స్థితాః కాశ్చి ద్గతాః కాశ్చి ద్రావణాయ నివేదితుమ్ ॥

భావము : భీమరూపులైన రాక్షసుల స్వరూపము నెఱుంగు సామర్థ్యము నాకు లేదు. ఇతడెవ్వడో, యేమి చేయనున్నాడో అను విషయమునంతను మీరే యెఱుగుదురు.

సర్పముయొక్క పాదములు సర్పములకే తెలియును. నేనుకూడ ఇతనిని జూచి భయపడుచున్నాను ఇతడెవ్వడో నాకేమియు తెలియదు. (అని పలికెను)

సీత యొక్క ఈ పలుకులనువిని కొందరు స్త్రీలు భయపడి దిగంతములకు పరిగెత్తిరి. కొందరక్కడే నిలిచిరి. మరి కొందరు రావణునికీ వార్తను విన్నవించుటకు వేగముగా పరిగెత్తిరి.

శ్రీపాదుక : సత్యసంధుడగు రాముని అర్ధాంగియు, అభిజాత, శీలవతి మహాసాధ్వియు నగు సీత అసత్యమాడినదా? అది యామెకు తగినదా? అను ప్రశ్నలకు సమాధానము –

'నేను కూడ ఇతని వలన భయపడుచున్నాను. ఇతడెవడో నాకును తెలియ'దని సీత హనుమంతుని విషయమున అసత్యము పలికినది. ఇది వాస్తవము. సీత యిట్లు పలుకుట దోషము కదా! అని యామెకు దోషమునాపాదించుట మాత్రము సరికాదు.

వివాహకాలే రతి సంప్రయోగే ప్రాణాత్యయే సర్వధనాపహారే ।

మిత్రస్య చార్థేఽ ప్యనృతం వదేయుః పంచానృతా న్యాహురపాతకాని॥

వివాహ విషయములందును, రతి యందును ప్రాణాపాయస్థితిలోను, ధననాశ, మిత్ర విపత్తులందును కూడ అసత్యమాడుట దోషము కానేరదని ధర్మశాస్త్ర వచనము.

ప్రస్తుతమున సీత ఆపన్న మఱియు తనకు, రామునకు కూడా ప్రాణమిత్రుడగు హనుమద్విషయమున అసత్యమాడుట దోషము కాదని తెలియవలెను.

ఋగ్వేదమునందు (10-142-2,1-80-2) తావులలో మాయావి యగు వృత్రాసురుని మాయతోజయించిన ఇంద్రుని వేదము స్తుతించినది.

పంచమవేదమైన భారత శాంతిపర్వములోని సత్యానృతాధ్యాయములో – **"యస్మిన్యథా వర్తితవ్యో మనుష్యః**

తస్మిన్ తథా వర్తితవ్యం స ధర్మః"

మాయా చారో మాయయా బాధితవ్యః

సాధ్వాచారో సాధునా ప్రత్యుపేయః" – ఎవని యందే విధముగా ప్రవర్తింపవలెనో అతని విషయమున నట్లే ప్రవర్తించుట ధర్మమగును. మాయావిని మాయను ప్రయోగించి, సజ్జనుని ఋజుమార్గములోను వధించుట దోషము కాదని యుద్ధ నీతి. అట్లే భారతోద్యోగపర్వము నందలి 36వ అధ్యాయములో –

'యోయథా వర్తతేయస్మిన్ తస్మిన్నేవం ప్రవర్తయన్ ।

నాఽధర్మం సమమాప్నోతి న చా శ్రేయశ్చ విన్దతి' – ఎవడెవనియందెట్టి అభిప్రాయముతో నున్నాడో వాని యందట్లే యుండిన అది అధర్మము కాబోదు. అతడపకీర్తిని పొందడు – అని చెప్పబడినది.

సత్యస్య వచనం శ్రేయః సత్యాదపి హితం వదేత్ ।

యద్భూతహిత మత్యంతం ఏతత్సత్యం మతం మమ – అనగా సత్యము పలుకుట మంచిది. సత్యము కంటెను హితము చెప్పుట శ్రేయము. ఏది సర్వభూత హితంకరమో అదియే సత్యమని సనత్కుమారుడు చెప్పెను. ఈ విషయమునే శ్రీ శుకుడు నారదునకు బోధించెను.

ఇట్లు సత్యాసత్య నిర్ణయమును విచారణ చేసినచో మాయావినులు, దుష్టస్వభావము కల రాక్షస స్త్రీలకు హనుమ విషయములో యత్కించిదసత్య భాషణము చేసి అతనికి హితము కూర్చుటకై పలికి సీతా వచనములు కేవలము

అసత్యాభాసములు ధర్మ సమ్మితములు అనియు సీతామాతకీ ప్రకరణములో అసత్య వచన దోషము లేదనియు సిద్ధాంతముగా గ్రహించవలెను.

17) శ్లో ॥ రావణస్య సమీపే తు రాక్షస్యో వికృతాననాః ।
విరూపం వానరం భీమ మాఖ్యాతుముపచక్రమే ॥

18) శ్లో ॥ యత్రారణ్యే వహతి సతతం మారుతో మందమందమ్ ।
సూర్యో యత్ర త్రసతి తపితుం తోయదా స్తోయదానే ।
భగ్నం భగ్నం కుటతి సహస ప్రాచిరం విశ్వకర్మా ।
తత్తేఽరణ్యం క్షణిక మధునా వానరేణైవ భగ్నమ్ ॥

19) శ్లో ॥ న తత్ర కశ్చి దుద్దేశో యస్తేన న వినాశితః ।
యత్ర సా జానకీ సీతా స తేన న వినాశితః ।
జానకీ రక్షణార్థం వా శ్రమా ద్వా నోపలభ్యతే ।
అథవా క శ్శ్రమ స్తస్య సైవ తేనాభి రక్షితా ॥

20) శ్లో ॥ తస్యోగ్రరూప స్యోగ్ర త్వం దండ మాజ్ఞాతు మర్హసి ।
సీతా సంభాషితా యేన తద్వనం చ వినాశితమ్ ॥

21) శ్లో ॥ ముద్రా మర్కటకేన రామనికటాదాగత్య దత్తా కరే ।
సీతాయా ఇతి సంభ్రమా త్త్రిజటయాప్రోక్తోఽథ లంకేశ్వరః ।
కిం కిం కిం కిమితి బృవద్భిరనిశం సింహాసనాదుత్థితైః ।
రక్షో ముఖ్యసుత స్తమేవ హి కపిం ధర్తుం నియుక్తీకృతః ॥

22) శ్లో ॥ రాక్షసీనాం వచ శ్శృత్వా రావణో రాక్షసేశ్వరః ।
హుతాగ్ని రివ జజ్వాల కోపసంవర్తితేక్షణః ॥

23) శ్లో ॥ తస్య క్రుద్ధస్య నేత్రాభ్యాం ప్రాపతన్నస్రబిందవః ।
దీప్తాభ్యామివ దీపాభ్యాం సార్చిష స్స్నేహబిందవః ॥

భావము : వికృతములైన ముఖములు కల రాక్షసస్త్రీలు రావణునిచెంతకు చేరి హనుమంతుని భయంకరవిశ్వరూపత్వము, వనభంగములవంటి

సమాచారములను చెప్పనారంభించిరి.

ప్రభూ ! ఏ వనమందు వాయుదేవుడు భయముచే నెమ్మది నెమ్మదిగా వీచుచుండునో, సూర్యుడెండ కాయుటకు భయపడుచుండునో, మేఘములు నీటిని వర్షించుటకు భయపడుచుండునో, అట్టి యశోకవనమంతయు ఆ వానరునిచే భగ్నము గావింపబడినది.

ఆ యశోకవనిలో అతనిచే నశింపచేయబడని ప్రదేశమేదియును లేదు. సీతయున్న ప్రదేశము తప్ప మిగిలినదంతయు ధ్వంసము చేసెను. జానకిని రక్షించుటకో లేక శ్రమచేతనో కాని ఆ ప్రదేశమును నశింపచేయ లేదు. ఈ రెంటిలో కారణమేదియో తెలియదు. అథవా వానికి శ్రమయేముండును? సీతకు శ్రమ కలుగుననియే ఆ చోటును విడిచిపెట్టెను.

సీతతో సంభాషించుటయేగాక మాకు మహోగ్రరూపమును జూపి భయపెట్టి అశోకవనమునంతను నశింపజేసిన అతనికి గొప్పదండనను విధింపుము.

ఒకానొక వానరుడు రామునివద్దనుండి వచ్చి సీతచేతిలో ఉంగరము నొకదాని నుంచెనని త్రిజట లంకేశ్వరునితో చెప్పగా రావణుడు విని – సంభ్రమముతో ఏమి? ఏమి? ఏమిటని పలుకుచు సింహాసనము నుండి లేవబోవుచుండగా, రావణ కుమారుడులో ముఖ్యుడగు (ఇంద్రజిత్తు) వారింపగా ఆ వానరుని పట్టుకొనుటకై అతనినే నియోగించెను.

రాక్షసస్త్రీల వచనములను విన్న రాక్షసేశ్వరుడగు రావణుడు క్రోధోజ్జ్వల నేత్రములను త్రిప్పుచు ఆజ్యాక్తహవిస్సులు వ్రేల్చబడిన అగ్నిహోత్రునివలె ప్రజ్వరిల్లెను. (మండిపడెనని భావము)

అతడా విధముగా కోపోద్రిక్తుడైనప్పుడు మండిపడుచున్న నూనెదీపముల నుండి జ్వాలలతో గూడి రాలిపడుచున్న తైలబిందువుల వలె అతని రెండు నేత్రములనుండి రక్తబిందువులు క్రిందపడెను.

శ్రీపాదుక : ఇచట నేత్రాభ్యాం అనగా రావణుని రెండు కన్నులనుండి అని చెప్పబడినది. దశకంఠరావణునకు పది జతలకన్నులుండగా నేత్రాభ్యాం అను ద్వివచనము ఎట్లు పొసగునని సంశయింప నవసరములేదు. అతడు

కామరూపుడు కావున సంగ్రామ సమయములలో మాత్రమే పదితలలను ఇరువది చేతులను ధరించునని గ్రహించవలెను.

24) శ్లో ॥ ఆత్మనః సదృశాన్ శూరాన్ కింకరాన్నామ రాక్షసాన్ ।
వ్యాదిదేశ మహాతేజా నిగ్రహార్థం హనూమతః ॥

25) శ్లో ॥ తేషా మశీతిసాహస్రం కింకరాణాం త్వరస్వినామ్ ।
ప్రేషయామాస బలినో మృగయాయాం పటీయసః ॥

26) శ్లో ॥ నిర్యయుర్భవనాత్తస్మా త్కూటముద్గరపాణయః ।
మహోదరా మహాదంష్ట్రా ఘోరరూపా మహాబలాః ॥

27) శ్లో ॥ యద్ధాభిమనసస్సర్వే హనుమద్గ్రహణోద్యతాః ।
తే కపీన్ద్రం సమాసాద్య తోరణస్థ మవస్థితమ్ ॥

28) శ్లో ॥ అభిపేతుర్మహా వేగాః పతంగా ఇవ పావకమ్ ॥

29) శ్లో ॥ తే గదాభిర్విచిత్రాభిః పరిఘైః కాంచనాంగదైః ।
ఆజఘ్నుర్వానరశ్రేష్ఠం శరైరాదిత్యసన్నిభైః ॥

భావము : మహాతేజస్వియగు రావణుడు తనతోసమానమైన వీరులగు కింకరులను రాక్షసులను హనుమంతుని నిగ్రహించుటకై ఆదేశించి పంపెను.

ఎనభై వేలమంది కింకరులను రాక్షసులు అప్పుడే బయలుదేరిరి. వారు గొప్పబలవంతులు. చేతులలో కూటముద్గరాద్యాయుధములను ధరించినవారు. పెద్దపొట్టలతో, కోరలతో, భయంకరాకారములతో, హనుమంతునితో యుద్ధముచేసి నిగ్రహించుటకై బయలుదేరినారు.

వారందరు ఆ విధముగా బయలుదేరి తోరణద్వారమువద్ద అగ్నినిమిడుతలు ప్రవేశించునట్లు హనుమంతునెదుర్కొనుటకై చేరుకొనిరి.

వారా హనుమంతుని విచిత్రములగు గదాయుధముల చేతను, పరిఘాయుధములతోను, బంగారు నగలు తొడిగిన పిడులుకల ఆయుధములతోడను సూర్యునివలె ప్రచండ ప్రకాశము కల తీక్షణ బాణములచేతను కొట్టిరి.

30) శ్లో ॥ హనుమానపి తేజస్వీ శ్రీమా న్పర్వత సన్నిభః ।
క్షితా వావిధ్య లాంగూలం ననాద చ మహాస్వనమ్ ॥

31) శ్లో ॥ స భూత్వా సుమహాకాయః హనుమాన్మారుతాత్మజః ।
ధృష్ట మాస్ఫోటయామాస లంకాం శబ్దేన పూరయన్ ॥

32) శ్లో ॥ తస్యాస్ఫోటితశబ్దేన మహతా సానునాదినా ।
పేతుర్విహంగా గగనా దుచ్చై శ్చేద మఘోషయత్ ॥

భావము : అప్పుడు శ్రీమంతుడగు హనుమంతుడు కూడ తన శరీరమును పర్వతమువలెపెంచి పర్వతాకారుడై నేలపై తన తోకతోకొట్టి బిట్టరచి మహాధ్వనిని గావించెను.

మఱియు నా పర్వతాకారుడగు హనుమంతుడు దర్పముతో భుజాస్ఫోటనము (జబ్బలు చరిచి) లంకలోనుండు జనులందరు వినునట్లు సింహనాదమును చేసెను.

ఆ మహాశబ్దము ప్రతిధ్వనింపగా ఎగురుచున్న పక్షులాకాశము నుండి బెదిరి క్రింద పడిపోయెను. తరువాత నాంజనేయుడు అందరు వినునట్లుగా నిట్లు విజయ ఘోషను ప్రకటించెను.

33) శ్లో ॥ జయత్యతి బలోరామో లక్ష్మణశ్చ మహాబలః ।
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః ॥

34) శ్లో ॥ దాసోఽహం కోశలేంద్రస్య రామస్యాక్లిష్టకర్మణః ।
హనుమాం ఛ్ఛత్రుసైన్యానాం నిహన్తా మారుతాత్మజః ॥

35) శ్లో ॥ న రావణసహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్ ।
శిలాభిస్తు ప్రహరతః పాదపైశ్చ సహస్రశః ॥

36) శ్లో ॥ అర్దయిత్వా పురీం లంకామభివాద్య చ మైథిలీమ్ ।
సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వరక్షసామ్ ॥

37) శ్లో ॥ ఇత్యుక్త్వాదాయ పరిఘం జఘాన రజనీచరాన్ ।

భావము : సర్వాతిశాయి బలసంపన్నులగు రామలక్ష్మణులు, రాఘవునిచే

సంరక్షింపబడు వానరరాజగు సుగ్రీవుడును తమ గుణసాకల్యముచే నందరను మించియున్నారు.

నేను ఎట్టి దుష్కర కార్యమునైనను లీలగా చేయగల కోసల దేశాధీశుడగు శ్రీరాముని సేవకుడను. హనుమంతుడను పేరుగల నేను వాయుపుత్రుడను. రాక్షససైన్యములను నిశ్శేషముగా వధించెదను.

వేలాదిగా రాక్షసులను బండఱాల చేతను, వృక్షముల చేతను కొట్టుచు యుద్ధములో సంహరించుచున్న నాకు వేయిమంది రావణులు కూడ ప్రతియోధులు కాజాలరు. (నన్నెదిరింప సమర్థులు కారని భావము)

అట్టి నేనిపుడీ లంకాపురిని నుగ్గుజేసి, మిథిలాధీశుడగు జనకుని కుమార్తెయగు సీతమ్మకు నమస్కరించి, రాక్షసులందరు చూచుచుండగనే కృతకృత్యుడనై సంపూర్ణ మనోరథుడనై (శ్రీరాముని సన్నిధికి) మరలిపోయెదను.

శ్రీపాదుక : హనుమయొక్క ఈ జయఘోషను శ్రీరామ భక్తులందరు కార్యసిద్ధి ననుగ్రహించు **'జయమంత్రము'**గా జపించుచున్నారు.

ఇట్లు జయఘోషణమును ప్రకటించి (పరమేశ్వర వరప్రసాదముచే మరణములేని) హనుమంతుడు పరిఘాయుధమును చేబూనిరాక్షసుల నందరను మోదసాగెను.

38) శ్లో ॥ అవధ్యాన్ శంకరవరాత్ కింకరాన్నామ రాక్షసాన్ ।
వినా రుద్రేణ దేవేన హ్యవధ్యాన్ బలదర్పితాన్ ॥

39) శ్లో ॥ హత్వా సర్వాన్మహాకాయః కింకృత్యమితి చిన్తయన్ ।
తస్మాత్ప్రాసాద మప్యేవం భీమం విధ్వంసయామ్యహమ్ ॥

40) శ్లో ॥ ఇతి సంచింత్య మనసా హనుమాన్దర్శయన్బలమ్ ॥

41) శ్లో ॥ ఆరుహ్య గిరిసంకాశం ప్రాసాదం హరియూథపః ।
బభౌ స సుమహాతేజాః ప్రతిసూర్య ఇవోదితః ॥

భావము : శంకరునిచే తప్ప ఇతరులచే వధింప శక్యముకానట్లుగా శంకరుని వలన వరము పొందిన బలదర్పితులగు కింకరులను పేరుగల ఆ రాక్షసులను అందరను మహాకాయుడగు హనుమంతుడు చంపి తరువాత చేయదగిన

కార్యము నాలోచించుచు-

ఇచటి నుండి ఈ భయంకరమగు ప్రాసాదమును కూడ విధ్వంసము గావించెదను గాక -

అనియాలోచించి తనబలమును చూపించుచు పర్వతమువలె ఉన్నతమ్మైన ఆ ప్రాసాదము నధిరోహించి, మహాతేజస్సుతో ప్రకాశించుచున్నవాడై సూర్యునకెదురుగా, ఉదయించిన వేఱొక సూర్యునివలె నిలచెను.

శ్రీపాదుక : కింకరులను ఆ రాక్షసులకు శివుడే రుద్రుని చేతిలో తప్ప వేరెవ్వరిచేత మరణము లేకుండునట్లు వరమిచ్చెను. వారినిప్పుడు హనుమంతుడు వధించెను. దీనిని బట్టి **'శివస్తు హనుమాన్ స్మృతః'** - అను వచనము ననుసరించి హనుమంతుడు రుద్రావతారమని తెలియుచున్నది.

ప్రాచీన దేవీభాగవతములో శివుడు విష్ణుమూర్తితో - నేను వానర రూపమును ధరించి వాయునందనుడనై సముద్రమునుదాటి నీ ప్రియురాలిని చూచి వచ్చి నిన్ను సంతోషపరచెదను. నేను లంకను ప్రవేశింపగనే లంకేశ్వరి లంకను విడిచి వెళ్ళిపోవునని చెప్పినట్లున్నది.

అహం వానరరూపేణ సంభూయ పవనాత్మజః ।
సాహాయ్యంతే కరిష్యామి యథోచితమరిందమ ।
ఉల్లంఘ్య సాగరం ఘోరం సమవేక్ష్య చ తేంగనామ్ ।
ప్రీతిం తే జనయిష్యామి సర్వదా మధుసూదన ।
మయి లంకాం ప్రవిష్టే చ స్వయం వానర రూపిణి ।
లంకేశ్వరీ స్వయం లంకాం పరిత్యక్ష్యతి నిశ్చితమ్ ॥

అదే దేవీభాగవతములో -

మహేశస్య తథాంశేన భూత్వా పవననందనః ।
హనుమానితి విఖ్యాతో మహాబల పరాక్రమః ॥ అన్న వచనము కూడ హనుమంతుడు రుద్రావతారమను విషయమును ధ్రువపరచుచున్నది.

42) శ్లో ॥ సంప్రధృష్య చ దుర్ధర్షం చైత్య ప్రాసాదముత్తమమ్ ।
ధృష్ట మాస్ఫోటయామాస లంకాం శబ్దేన పూరయన్ ॥

43) శ్లో ॥ ననాద భీమ నిర్హ్రాదో రక్షసాం జనయన్ భయమ్ ।
తేన శబ్దేన మహతా చైత్యపాలాశ్శతం యయుః ॥

44) శ్లో ॥ గృహీత్వా వివిధానస్త్రాన్ప్రాశాన్ఖడ్గాన్పరశ్వథాన్ ।
విసృజన్తో మహాకాయా మారుతిం పర్యవారయన్ ॥

45) శ్లో ॥ ఆజఘ్ను ర్వానరశ్రేష్ఠం బాణై శ్చాదిత్యసన్నిభైః ।
తతో వాతాత్మజః క్రుద్ధో భీమం రూపం సమాస్థితః ॥

46) శ్లో ॥ ఉత్పాటయిత్వా వేగేన స్తంభం హేమపరిష్కృతః ।
తత స్తం భ్రామయామాస శతధారం మహాబలః ॥

47) శ్లో ॥ తత్రచాగ్ని స్సమభవ త్ప్రాసాదశ్చా ప్యదహ్యత ।
అంతరిక్షే స్థితః శ్రీమా నిదం వచన మబ్రవీత్ ॥

48) శ్లో ॥ ఈదృగ్విధైస్తు హరిభిర్వృతో దన్తనఖాయుధైః ।
శతై శ్శతసహస్రైశ్చ కోటీభిరయుతైరపి ।

49) శ్లో ॥ ఆగమిష్యతి సుగ్రీవః సర్వేషాం వో నిషూదనః ।
ఏవముక్త్వా తు చైత్యస్థాన్ రాక్షసాన్ హరియూథపః ॥

50) శ్లో ॥ స రాక్షసశతం హత్వా వజ్రేణేంద్ర ఇవాసురాన్ ।
బభంజ చైత్య ప్రాసాదం లోహస్తంభేన మారుతిః ॥
(యుద్ధకాంక్షీ పునర్వీర స్తోరణం సముపాశ్రితః)

ఇతి శ్రీరామాయణ సారోద్ధారే సుందరకాండే ద్వాదశ సర్గః ॥

భావము : శత్రుజనదుర్భేద్యమగు ఆ చైత్యప్రాసాదము నాక్రమించి హనుమంతుడు లంక యంతయు ప్రతిధ్వనించునట్లు భుజాస్ఫాలనము చేసెను. మఱియు భయంకరస్వనముతో రాక్షసులకు భయమును కలిగించు సింహనాదమును చేసెను. ఆ శబ్దమును విని వందమంది చైత్యపాలకులు బయటకు వచ్చిరి.

మహాకాయులగు వారందరు వివిధములగు పాశములను, శస్త్రాస్త్రములను, ఖడ్గపరశ్వథాది ఆయుధములను ప్రయోగించుచు వాయునందనుని చుట్టుముట్టిరి.

వారందరు ఆ వానరోత్తముని సూర్యునితో సమానములైన సుతీక్షణములగు బాణములతో కొట్టిరి. అప్పుడు కోపించిన వాయునందనుడు భయంకరాకారమును ధరించి -

ఆ చైత్యప్రాసాదముయొక్క బంగారుతొడుగులు గల ఒక పెద్ద స్తంభమును పెకిలించి, దానిని శతధారముగా వందరెట్ల భ్రమితో త్రిప్పజొచ్చెను.

ఆ శతధారావేగమునకు అగ్ని జనించి, ప్రజ్వరిల్లి ఆ ప్రసాదమునంతను దహించివేసెను. అపుడు విజశ్రీమంతుడగు హనుమంతుడంతరిక్షములో నిలచి- 'ఈ విధమైన అనగా నా వంటి పరాక్రమోపేతులగు దంత, నఖాయుధములుకల వందలు, వేల కోట్ల అయుత న్యర్బుదముల సంఖ్యలో వానరులను తీసికొని సుగ్రీవుడు ఇచ్చటికి రాబోవుచున్నాడు-అని ప్రకటించి,

యచటనున్న రాక్షసుల లోపలికి హనుమంతుడాచైత్యప్రాసాదము యొక్క లోహస్తంభమును విరిచి, ఇంద్రుడు వజ్రాయుధముతో రాక్షసులను వధించినట్లుగా వందలాది రాక్షసులను చంపి - మరి కొందరు రాక్షస వీరుల నెదుర్కొనుటకై యుద్ధకాంక్షతో చైత్య ప్రాసాదపు తోరణ ద్వారము నాశ్రయించెను.

ఇది శ్రీమద్రామాయణ సారోద్ధారములోని సుందరకాండమున పన్నెండవ సర్గము.

సర్గాంతశ్లోకసంఖ్య-(622+50=672)

త్రయోదశ స్సర్గః

1) శ్లో ॥ సందిష్టో రాక్షసేంద్రేణ ప్రహస్తస్య సుతో బలీ ।
జంబుమాలీ మహాదంష్ట్రో నిర్జగామ ధనుర్ధరః ॥
తిష్ఠతిష్ఠేతి సహసా హనూమన్త మథాబ్రవీత్ ॥

హనుమంతుడు జంబుమాలిని వధించుట

భావము : (హనుమంతుని ప్రకటన తరువాత) గొప్ప బలవంతుడు, భయంకరమైన కోరలు కలవాడును ప్రహస్తుడను రావణుని మంత్రి పుత్రుడగు జంబుమాలి రావణునిచే సందేశింపబడి ధనుర్ధారియై ఆంజనేయునితో యుద్ధముచేయుటకై త్వరగా వచ్చి ఉండుముండుమని పలికెను.

2) శ్లో ॥ తం తోరణవిటంకస్థం హనూమన్తం మహాకపిమ్ ।
జంబుమాలీ మహాబాహుః వివ్యాధ నిశితైశ్శరైః ॥

3) శ్లో ॥ చుకోప బాణాభిహతో రాక్షసస్య మహాకపిః ।
తతః పార్శ్వేతి విపులాం దదర్శ మహతీం శిలామ్ ॥

4) శ్లో ॥ తరసా తాం సముత్పాట్య చిక్షేప బలవద్బలీ ।
తాం శరైర్దశభిః క్రుద్ధ స్తాడయామాస రాక్షసః ॥

5) శ్లో ॥ విపన్నం కర్మ త ద్దృష్ట్వా హనుమాం శ్చండవిక్రమః ।

6) శ్లో ॥ అతివేగోఽతి వేగేన భ్రామయిత్వా బలోత్కటః ।
పరిఘం పాతయామాస జంబుమాలేర్మహోరసి ॥

7) శ్లో ॥ తస్య చైవ శిరోనాస్తి న బాహూ న చ జానునీ ।
న ధను ర్న రథో నాశ్వాస్తత్రా దృశ్యన్త నేషవః ॥

8) శ్లో ॥ జంబుమాలిం చ నిహతం కింకరాంశ్చ మహాబలాన్ ।
చుక్రోధ రావణ శ్శ్రుత్వా కోపసంర్తలోచనః ॥

భావము : మహావీరుడు వానరోత్తముడునగు హనుమంతుని తోరణద్వారముపై బయట పావురముల గూటి యందున్న వానినిగా జూచి పదునైన బాణములతో కొట్టెను.

మహాకపి యగు హనుమంతుడా రాక్షసుని బాణపుదెబ్బలచే కోపించి ప్రక్కన పడియున్న విశాలమైన పెద్దబండఱాతిని చూచెను.

చూచినడతడవుగా మహాబలియగు హనుమంతుడద్దానిని పెకిలించి యతనిపైకి బలముగా విసిరెను. ఆ రాక్షసుడద్దానిని కోపముతో పది బాణములను ప్రయోగించి భగ్నము చేసెను.

ఆ విధముగా తన ప్రయత్నము విఫలమగుటను చూచిన భయంకరమైన పరాక్రమముకల హనుమంతుడు.

ఉత్కటమగు బలముతో మహావేగముతో పరిఘాయుధమును త్రిప్పి ఆ జంబుమాలి వక్షముపై విసిరెను. అతివేగముతోతిరుగుచు తాకిన ఆ పరిఘా ఘాతమునకు –

అతని శిరస్సు, బాహువులు, జానువులు, ధనుస్సు, గుఱ్ఱములు, రథములు అతని బాణములు అన్నియును నామరూపములు మిగులకుండా నుగ్గు నుగ్గయిపోయినవి.

ఇట్లు జంబుమాలియు, మహాబలశాలురైన 80 వేల మంది కింకరాసురులు, చంపబడిన వారుగా తెలుసుకొన్న రావణుడు కోపముచే నెఱ్ఱవారిన కన్నులతో మండిపడెను.

సప్త మంత్రి పుత్రుల వధ

9) శ్లో ॥ తతస్తే రాక్షసేంద్రేణ చోదితా మన్త్రిణ స్సుతాః ।
నిర్యయుర్భవనా త్తస్మా త్సప్త సప్తార్చివర్చసః ॥

10) శ్లో ॥ సృజన్తో బాణవృష్టింతే రథగర్జితనిస్వనాః ।
వృష్టిమంత ఇవాంభోదా విచేరు ర్నైరృఋతాంబుదాః ॥

11) శ్లో ॥ అపకీర్ణ స్తత స్తాభిర్హనూమా న్శరవృష్టిభిః ।
అభవత్సంవృతాకార శ్శైలరాడివ వృష్టిభిః ॥

12) శ్లో ॥ స శరా న్మోఘయామాస తేషా మాశుచరః కపిః ।
సకృత్వా నినదం ఘోరం త్రాసయం స్తాం మహాచమూమ్ ॥

13) శ్లో ॥ తలేనాభ్యహన త్కాంశ్చి త్పాదైః కాంశ్చి త్పరంతపః ।
ముష్టినాభ్యహన త్కాంశ్చి న్నఖైః కాంశ్చి ద్విదారయత్ ॥

14) శ్లో ॥ ప్రమమాథోరసా కాంశ్చి దూరుభ్యా మపరాన్ కపిః ।
కేచిత్తస్య నినాదేన తత్రైవ పతితా భువి ॥

15) శ్లో ॥ వినేదుర్విస్వరం నాగా నిపేతుర్భువి వాజినః ।
భగ్న నీడధ్వజచ్ఛత్రైర్భూశ్చ కీర్ణాఽభవ ద్రథైః ।
స్రవతా రుధిరేణాథ స్రవన్త్యో దర్శితాః పథి ॥

16) శ్లో ॥ స తాన్ప్రవృద్ధా న్వినిహత్య రాక్షసాన్ ।
మహాబల శ్చండపరాక్రమః కపిః ।
యుయుత్సు రన్యైః పున రేవ రాక్షసై ।
స్త మేవ వీరోఽభి జగామ తోరణమ్ ॥

హనుమంత్రుడు సప్తమంత్రి కుమారులను చంపుట

భావము : పిమ్మట రావణుడు పంపిన మమంత్రి పుత్రులు ఏడుగురు సప్త జిహ్వుడగు అగ్ని వలె మండిపడుచు రావణగృహము నుండి బయలుదేరిరి.

వారు మేఘగర్జనము వలె ధ్వనిచేయు రథములపై నుండి, ఉరుముచు వర్షించుచున్న మేఘములవలె బాణవర్షములను కురిపించుచు యుద్ధరంగమున సంచరింపసాగిరి.

ఆ బాణవర్షముచే బాణములు శరీరమునందంతటను నిండిన హనుమంతుడు ధారావర్షముచే నాచ్ఛాదింపబడిన పర్వతమువలె దృశ్యాదృశ్య రూపముతో ప్రకాశించెను.

అతి వేగముతో (మెరుపు తీగవలె) చరించుచు హనుమంతుడా బాణములను వ్యర్థపరచుచు (వమ్ము చేయుచు), ఆ రాక్షససైన్యమంతయు భయపడునట్లుగా పెద్ద సింహనాదము చేసెను.

అతడు కొందరు రాక్షసులనరచేతితో చరచుచు, కొందరిని పాదములతో నేలరాయుచు, మరికొందరిని పిడిగ్రుద్దులతో, ఇంకొందఱిని

ఱొమ్ముతో ఢీకొట్టుచు, ఊరు ఘాతములచే కొందరిని సంహరింపసాగెను. కొందఱాతని సింహనాదమును విని గుండెలదటి పడిపోయిరి.

తెన్నుగానక చలించు గజములు నీల్గుచు ఘీంకరించెను, గుఱ్ఱములు నేలకొరిగెను, ధ్వజ పతాకములు రథములు, విఱిగి నేలపై చెల్లాచెదరుగా పడియుండెను. రక్తములేరులై ప్రవహింపసాగెను.

మహాబలసంపన్నుడు ప్రచండపరాక్రమోపేతుడును అగు హనుమంతుడీ విధముగా సైన్య సమేతముగా విజృంభించిన మంత్రిపుత్రులను సంహరించి, ఇంకను రాబోవు రాక్షసులతో యుద్ధము చేయుటకై ఉత్సాహముతో మరల తోరణద్వారమును చేరుకొనెను.

17) శ్లో ॥ **హతాన్మంత్రి సుతాన్ బుధ్వా వానరేణ మహాత్మనా ।**
స విరూపాక్ష యూపాక్షౌ దుర్ధరం చైవ రాక్షసమ్ ॥

18) శ్లో ॥ **ప్రఘసం భాసకర్ణం చ పంచ సేనాగ్రనాయకాన్ ।**
సందిదేశ దశగ్రీవో వీరాన్నయ విశారదాన్ ॥

19) శ్లో ॥ **పునశ్చ శంకితో భూత్వా తా నువాచ ససైనికాన్ ॥**

20) శ్లో ॥ **నావమాన్యో భవద్భిశ్చ హరిర్ధీర పరాక్రమః ।**
స హ్యహం తం కపిం మన్యే కర్మణా ప్రతితర్కయన్ ॥

21) శ్లో ॥ **దృష్టా హి హరయః పూర్వం మయా విపులవిక్రమాః ।**
వాలీ చ సహ సుగ్రీవో జాంబవాంశ్చ మహాబలః ॥

22) శ్లో ॥ **నీల స్సేనాపతిశ్చైవ యే చాన్యే ద్వివిదాదయః ।**
నైవం తేషాం గతిర్భీమా న తేజో న పరాక్రమః ॥

23) శ్లో ॥ **న మతిర్న బలోత్సాహౌ న రూపపరికల్పనమ్ ।**
ప్రయత్నం మహాదాస్థాయ క్రియతా మస్య నిగ్రహః ॥

24) శ్లో ॥ **కామం లోకా స్త్రయ స్సేంద్రా స్ససురాసురమానవాః ।**
భవతా మగ్రతః స్థాతుం న పర్యాప్తా రణాజిరే ॥

25) శ్లో ॥ తథాపి తు నయజ్ఞేన జయ మాకాంక్షతా రణే ।
ఆత్మా రక్ష్యః ప్రయత్నేన యుద్ధసిద్ధిర్హి చంచలా ॥

26) శ్లో ॥ తే స్వామి వచనం శ్రుత్వా హనుమంతముపస్థితాః ।
తత స్తం దదృశుర్వీరా దీప్యమానం మహాకపిమ్ ।
రశ్మిమన్త మివోద్యన్తం స్వతేజోరశ్మిమాలినమ్ ॥

రావణుడు పంచసేనానులను హనుమంతునితో యుద్ధము చేయుటకు పంపుట

భావము : మహితాత్ముడగు హనుమంతుడు మంత్రిపుత్రులను వధించినట్లు తెలిసికొనిన రావణుడు – **విరూపాక్షుడు – యూపాక్షుడు – దుర్ధరుడు – ప్రఘసుడు భాసకర్ణుడు** అను పంచసేనాగ్ర నాయకులను సందేశించి హనుమంతునితో యుద్ధమునకు పంపెను. వారందరు వీరులు మఱియు నీతికోవిదులు.

మరల సంశయించుచు సైన్యసమేతులగు వారిలో – ఓ సైన్యాధీశులారా! ధీరుడు పరాక్రమశాలియునగు అతనిని అవమానింపవలదు. అతని మహత్కార్యముల నాలోచించి చూడగా నతడు సామాన్య వానరుడుగా కనిపించుట లేదు.

పూర్వము నేను బహు విపుల పరాక్రమ సంపన్నులగు, వాలి సుగ్రీవులు, మహాబలియగు జాంబవంతుడు, సేనాపతియగు నీలుడు, మఱియు ద్వివిదుడు మైందుడు మొదలగు వానర వీరులను అతి పరాక్రమవంతులను చూచియున్నాను.

కాని వారికి ఇట్టి గమనము, తేజస్సు, బలము, ఉత్సాహము రూపము లేదు. గొప్ప ప్రయత్న పూర్వకముగా ఈ వానరుని నిగ్రహింపవలెను.

ఓ సేనాధీశులారా ! ఇంతకు పూర్వము సంగ్రామములలో మీరు ముల్లోకములను, ఇంద్రాది దేవతలను, మానవులను మీ యెదుట విలువ లేనట్లు చేసి జయించిన మాట వాస్తవము.

అయినప్పటికి విజయము నాకాంక్షించు నీతికోవిదులు ప్రయత్న పూర్వకముగా ఆత్మరక్షణపరులై యుండవలెను. యుద్ధమున విజయసిద్ధి చంచలమైనదని నీతిశాస్త్ర ప్రవచనము.

అనియిట్లు తమప్రభువగు రావణుడు పలికినది విని ఆ సేనానులైదుగురును హనుమంతుని సమీపమునకు వెళ్ళి, దీప్తి, ఉత్సాహము గల ఆ మహావానరవీరుని, తనదైనతేజముతో నుదయభానునివలె ప్రకాశించుచున్న వానినిగా చూచిరి.

27) శ్లో ॥ తం సమీక్ష్యైవ తే సర్వే దిక్షు సర్వా స్వవస్థితాః ।
తై స్తైః ప్రహరణైర్భీమై రభిపేతు స్తత స్తతః ॥

28) శ్లో ॥ సతైః పంచభి రావిద్ధో దశో దశ వినాదయన్ ।
చకార కదనం భూయో వ్యవర్ధత చ వేగవాన్ ॥

29) శ్లో ॥ సదూరం సహసోత్పత్య దుర్ధరస్య రథే హరిః ।
నిపపాత మహావేగో విద్యుద్రాశిర్గిరావివ ॥

30) శ్లో ॥ తతస్స మథితాష్టాశ్వం రథం భగ్నాక్షకూబరమ్ ।
విహాయ న్యపత ద్భూమౌ దుర్ధరస్త్యక్త జీవితః ॥

21) శ్లో ॥ తం విరూపాక్షయూపాక్షౌ దృష్ట్వా నిపతితం భువి ।
సంజాతరోషౌ దుర్ధర్షా వుత్పేతతు రరిందమౌ ॥

32) శ్లో ॥ స సాలవృక్ష మాసాద్య త ముత్పాట్య చ వానరః ।
తా వుభౌ రాక్షసౌ వీరౌ జఘాన పవనాత్మజః ॥

33) శ్లో ॥ తత స్తాం స్త్రీన్ హతాన్ జ్ఞాత్వా వానరేణ తరస్వినా ।
అభిపేదే మహావేగః ప్రసహ్య ప్రఘసో హరిమ్ ॥

34) శ్లో ॥ భాసకర్ణశ్చ సంక్రుద్ధ శ్శూల మాదాయ వీర్యవాన్ ।
సముత్పాట్య గిరే శ్శృంగం సమృగవ్యాళపాదపమ్ ॥

35) శ్లో ॥ జఘాన హనుమాన్వీరో రాక్షసౌ కపికుంజరః ।
గిరిశృంగవినిష్పిష్టౌ తిరశ స్తౌ బభూవతుః ॥

36) శ్లో ॥ తతస్తేష్వవసన్నేషు సేనాపతిషు పంచసు ।
స తైః పంచభి రావిద్ధో దిశో దశ వినాదయన్ ॥

37) శ్లో ॥ బలం త దవశేషం చ నాశయామాస వానరః ।
అశ్వైరశ్వాన్గజై ర్నాగా న్యోధై ర్యోధా న్రథై రథాన్ ॥

38) శ్లో ॥ స కపి ర్నాశయామాస సహస్రాక్ష ఇవాసురాన్ ।
పూర్వ స్థాన ముపాశ్రిత్య ప్రతీక్షన్ రాక్షసాన్ స్థితః ॥

హనుమంతుడు పంచసేనాపతులను వధించుట

భావము : ఆ రాక్షస వీరులందరు హనుమంతుని చూచిన తోడనే నలుదిక్కులలో సర్దుకుని వారున్నచోటులనుండియే భయంకరములగు అశస్త్రాస్త్ర ప్రహారములతో నతని నెదుర్కొనిరి.

ఆ హనుమంతుడాయైదుగురిచే గాయపరుచబడినవాడై దశదిశలు పిక్కటిల్లజేయుచు మరల వేగముతో యుద్ధమును చేయుచు వర్ధిల్లుచుండెను.

వేగవంతుడగు హనుమంతుడతి శీఘ్రముగా పైకెగసి దుర్ధరుని రథముపై కొండపై పిడుగుపడినట్లు దుమికెను.

అట్లా హనుమంతుడు దుమికిన వేగమునకు రథము గుఱ్ఱములు తోడను కాడితోడను నుగ్గునుగ్గయిపోగా దుర్ధరుడు కూడ ప్రాణములను వీడి నేలపై బడెను.

పిమ్మట విరూపాక్షయూపాక్షులిరువురు నేలకొరిగిన దుర్ధరుని జూచి మిక్కిలి కోపముతో హనుమంతుని పైకెగసి పడసాగిరి.

వానరవీరుడగు హనుమంతుడు వెంటనే మద్దిచెట్టునొకదానిని పెకిలించి దానితో వారిరువురను మోది చంపెను.

పిమ్మట మహాతరస్వియగు ప్రఘసుడు, వానరవీరుడగు హనుమ ఆ విరూపాక్షయూపాక్ష దుర్ధరులను ఆ ముప్వరను చంపినట్లు విని, అతి కోపముతో మహాబల సంపన్నుడగు హనుమంతుని బలముగా నెదుర్కొనెను.

భాసకర్ణుడు కూడ శూలాయుధమును ధరించి, మహాకోపముతో హనుమంతునెదుర్కొనగా మహా పరాక్రమోపేతుడగు హనుమంతుడు బహువిధ మృగసర్ప వృక్షసమేతముగా నొకకొండకొనను పెల్లగించి ఆ రాక్షసులిరువురిపై విసిరెను.

ఇట్లా ప్రఘస భాసకర్ణులిరువురును కొండకొనచే కొట్టబడినవారై నుగ్గు నుగ్గయి మరణించిరి.

పంచసేనానులీ విధముగా మరణించిన పిమ్మట, వారి దెబ్బలచే నొచ్చిన హనుమ దశదిశలు పిక్కటిల్లునట్లు సింహనాదము చేయుచూ మిగిలిన చతురంగ బలములను కూడ నాశనము చేయసాగెను.

గుఱ్ఱములతో గుఱ్ఱములను, ఏనుగులతో నేనుగులను, యోధులతో, యోధులను, రథములతో రథములను బాదుచు, రాక్షసవీరులను సంహరించుచున్న దేవేంద్రునివలె ప్రకాశించెను.

తరువాత హనుమంతుడు మరల స్వస్థానమైన తోరణద్వారము వద్దకు వచ్చి మిగిలిన రాక్షసవీరులనెదుర్కొనుటకై సిద్ధముగా నుండెను.

39) శ్లో ॥ హతాన్ శ్రుత్వా పంచసేనానాయకాన్ రావణః స్వయమ్ ।
స్వపుత్రం చాక్షతనయ మువాచ క్రోధమూర్ఛితః ॥

40) శ్లో ॥ దక్షాక్షీణపరాక్రమాక్ష తనయ!ప్రక్షాళయాస్మత్కుల ।
స్యాయాతా మపకీర్తిమాశు మహతీం కీర్తిం కురుష్వాజితామ్ ।
ద్రాక్చాదృష్టచరం మయా కపివరం కుత్రాపి కేశగ్రహా–
దాకృష్యానయ గచ్ఛ శూర! సమరే జైత్రశ్రియం ప్రాప్నుహి ।

41) శ్లో ॥ తతో జగామ బలవాన్ కుమారోఽక్షః ప్రతాపవాన్ ॥

రావణుడు అక్షకుమారునాశీర్వదించి హనుమంతునిపై యుద్ధమునకు పంపుట

భావము : పంచసేనా నాయకులు మరణించినట్లు విని రావణుడు స్వయముగా తన పుత్రుడగు అక్షకుమారునితో కోపోద్రిక్తుడై ఇట్లనెను.

యుద్ధముల యందక్షీణ పరాక్రమమును ప్రదర్శించు అక్షకుమారా! మన వంశమునకు కలిగిన గొప్పదగు ఈ (ఓటమియను) అపకీర్తి కళంకమును ప్రక్షాళనము గావింపుము. మన వంశమున కపరాజితమగు కీర్తిని సమకూర్చుము. ఇంతకు మున్నెన్నుడును చూడని యీ వానరమును జుట్టు పట్టుకొని తీసికొని రమ్ము. ఓ శూరుడా! బయలుదేరి యుద్ధమున జయలక్ష్మిని

పొందుము. పిమ్మట బలపరాక్రమోపేతుడగు అక్షకుమారుడు బయలుదేరును.

42) శ్లో ॥ సురాసురాధృష్య మసంగచారిణమ్ ।
రవిప్రభం వ్యోమచరం సమాహితమ్ ।
దివాకరాభం రథ మాస్థిత స్తత-
స్స నిర్జగామామరతుల్య విక్రమః ॥

43) శ్లో ॥ స జాతమన్యుః ప్రసమీక్ష్య విక్రమమ్ ।
స్థిరం స్థిత స్సంయతి దుర్నివారణమ్ ।
సమాహితాత్మా హనుమన్త మాహవే ।
ప్రచోదయామాస శరై స్త్రిభి శ్శితైః ॥

44) శ్లో ॥ తతస్స బాణాసన చిత్రకార్ముక-
శ్శర ప్రవర్షో యుధి రాక్షసాంబుదః ।
శర్మా న్ముమోచాశు హరీశ్వరాచలే ।
వలాహకో వృష్టి మివాచలోత్తమే ॥

45) శ్లో ॥ స తాన్ శరాం స్తస్య హరి ర్విమోక్షయన్ ।
చచార వీరః పథి వాయుసేవితే ।
శరాన్తరే మారుతవ ద్వినిష్పత-
న్మనోజవ స్సంయతి చండవిక్రమః ॥

46) శ్లో ॥ తతశ్శరై ర్భిన్న భుజాంతరః కపిః ।
కుమార వీరేణ మహాత్మనా నదన్ ।
మహాభుజః కర్మ విశేషతత్త్వవి-
ద్విచింతయామాస రణే పరాక్రమమ్ ॥

47) శ్లో ॥ తత స్తలేనాభిహతో మహారథ-
స్స తస్య పింగాధిపమంత్రినిర్జితః ।
ప్రభగ్ననీడః పరిముక్తకూబరః ।
పపాత భూమౌ హతవాజి రంబరాత్ ॥

48) శ్లో ॥ స తం పరిత్యజ్య మహారథో రథమ్ ।
సకార్ముకః ఖడ్గధరః ఖ ముత్పతన్ ।
సమేత్య తం మారుతతుల్య విక్రమః ।
క్రమేణ జగ్రాహ స పాదయో ర్దృఢమ్ ॥

49) శ్లో ॥ ముమోచ వేగా త్పితృతుల్య విక్రమో ।
మహీతలే సంయతి వానరోత్తమః ।
స భగ్న సంధిః ప్రవికీర్ణబంధనో ।
హతః క్షితౌ వాయుసు తేన రాక్షసః ॥

50) శ్లో ॥ హత్వా త మక్షం నిశ్శేషం బలం సర్వం చకార సః ॥

ఇతి శ్రీరామాయణసారోద్ధారే సుందరకాండే త్రయోదశ స్సర్గః

హనుమంతుడు దక్షకుమారుని హతమార్చుట

భావము : దేవదానవులెవ్వరికిని నిర్జింప శక్యము కానిదియు, భూమికంటకయే చలించునదియు, సూర్యునివంటి కాంతి కలదై యాకాశమార్గమున చరించునదియు, యుద్ధమునకు సిద్ధపరుపబడినదియు ఆ రథము నధిరోహించి, దేవతుల్య పరాక్రముడగు అక్షకుమారుడు బయలుదేరెను.

పరపరాక్రమమును చూచినంతనే కోపగించి వెంటనే ఇంత మాత్రమేనని అని నిశ్చయించుకొని స్థిరముగా నిలచి యుద్ధము చేయగల ఆ అక్షకుమారుడు, ఎదురుగా దుర్నివారుడు రణరంగమున నిశ్చలముగా నిలచియున్న హనుమంతునిపై మూడువందల బాణములను వేసి అతనిని యుద్ధమునకు ఉసిగొలిపెను.

మఱియు నా అక్షరాక్షస మేఘుడు తన చిత్రవిచిత్ర చిత్రిత బాణాసనమునుండి శరవర్షమును హనుమంతుడను మహాచలముపై కురిపించుచు, పెనుగొండపై కాలమేఘము వర్షించుశోభను తలపించుచుండెను.

ప్రచండ పరాక్రమోపేతుడును, మారుత తుల్యవేగుడును అగు హనుమంతుడు కూడ, అక్ష బాణాహతికందకుండ గాలివలె తప్పించుకొనుచు

ఆకాశమున పరిభ్రమించసాగెను.

అయినను తన వక్షఃస్థలమున ఆ యక్షకుమారుడు ప్రయోగించిన బాణకౌశలమును మనసా ప్రశంసిచుచు, హనుమంతుడు తదుపరి తన కర్తవ్యమును విచారణ చేసెను. (అనగా అతనిని వధించునుపాయమును సంకల్పించెనని భావము).

తదుపరి హనుమంతు దరచేతితో అక్షకుమారుని రథమును గట్టిగా చరచగా రథావయమములు భగ్నమయ్యెను. పిమ్మట పింగాక్షుడగు సుగ్రీవుని మంత్రియగు హనుమంతుని యా దెబ్బకు గుఱ్ఱములు చచ్చెను. రథము రథావశేషములతోపాటు ఆకాశమునుండి భూమిపై పడిపోయెను.

మహారథుడగు అక్షకుమారుడారథమును వీడి ధనుస్సును ఖడ్గమును పట్టుకొని, ఆకసముపైకెగురుచుండగా హనుమంతుడు ఒక్కసారిగా నతని పాదములను గట్టిగా పట్టుకొని–

వాయువుతో సమానమైన పరాక్రమావేశముతో త్రిప్పుచు అతనిని నేలపై విసిరికొట్టెను. ఆ దెబ్బకాతడా రణభూమిపై తుత్తునియలుగానై సంధులు సడలి, బంధములు త్రెళ్ళునట్లుగా ఆ వాయునందనుచే హతమార్చబడెను.

తరువాత పవనతనయుడగు హనుమంతుడు హతుడైన అక్షకుమారుని అవశిష్ట సైన్యమును కూడా నిశ్శేషముగా నిర్మూలించెను.

ఇది శ్రీమద్రామాయణ సారోద్ధారములోని సుందరకాండ యందలి పదమూడవ సర్గము.

సర్గాంతశ్లోకసంఖ్య–(672+50=722)



చతుర్దశ స్సర్గః

1) శ్లో ॥ తత శ్శృత్వా కుమారస్య వధం రాక్షస పుంగవః ।
క్రోధేన మహతావిష్ట ఇంద్రజేతార మబ్రవీత్ ।

2) శ్లో ॥ పుత్ర గచ్ఛామ్యహం తత్ర యత్రాస్తే పుత్రహా రిపుః ।
హత్వా త మథవా బద్ధ్వా ఆనయిష్యామి తేఽన్తికమ్ ॥

భావము : పిమ్మట రాక్షస శ్రేష్ఠుడగు రావణుడు అక్షకుమారుని మరణవార్తను విని, మిక్కిలి కోపముతో ఇంద్రుని జయించిన కుమారుని (ఇంద్రజిత్తు) తో నిట్లు పలికెను.

పుత్రా ! నేనిప్పుడే (నా) కుమారునిచంపిన శత్రువుయొక్క సమీపమునకు వెళ్ళి అతనిని చంపి కాని, బంధించి కాని నీ సమీపమునకు తీసికొనివచ్చెదను.

3) శ్లో ॥ ఇంద్రజిత్పితరం ప్రాహ త్యజ శోకం మహామతే !
మయి స్థితే కిమర్థం త్వం భాషసే దుఃఖితం వచః ॥

4) శ్లో ॥ ఇత్యుక్త్వా రథమారుహ్య రాక్షసైర్బహుభి ర్వృతః ।
జగామ వాయుపుత్రస్య సమీపం వీరవిక్రమః ॥

5) శ్లో ॥ స పక్షిరాజోపమతుల్య వేగైర్వ్యాళై-
శ్చతుర్భి స్సిత తీక్షణదంష్ట్రైః ।
రథం సమాయుక్త మసంగవేగమ్
సమారురోహేంద్రజిదింద్రకల్పః ॥

6) శ్లో ॥ రక్షోనాథవచో నిశమ్య చరణౌ తస్యేంద్రజి ద్రావణిః ।
సత్వారుహ్య రథం హిరణ్మయయుతాశ్వాన్ శ్వదంష్ట్రాయుతైః ।
రథ్యైర్వాస్తిక సైనికాశ్వ సహితో గచ్ఛద్దిశామండలమ్ ।
భేరీదుందుభిశంఖముఖ్యనినదై రాపూరయన్ రాక్షసః ॥

7) శ్లో ॥ స తస్య రథనిర్ఘోషం జ్యాస్వనం కార్ముకస్య చ ।
నిశమ్య హరివీరోఽసౌ సంప్రహృష్టతరోఽభవత్ ॥

8) శ్లో ॥ సమాగతాస్తత్ర తు నాగయక్షా ।
మహర్షయ శ్చక్రచరాశ్చ సిద్ధాః ।
నభ స్సమావృత్య చ పక్షిసంఘాః ।
వినేదురుచ్చైః పరమప్రహృష్టాః ॥

9) శ్లో ॥ తత స్సమేతా వతితీక్షణ వేగౌ - బహోబలౌ ద్వౌ రణనిర్విశంకౌ ।
కపిశ్చ రక్షోధిపతేశ్చ పుత్ర - స్సురాసురేన్ద్రావివ బద్ధవైరౌ ॥

10) శ్లో ॥ తం దృష్ట్వేంద్రజి దున్నతోన్నతతమం భీమం హనూమత్కపిమ్
నారాచై స్సురనాథవజ్రసదృశై ర్నామాక్షరైరంకితైః
సర్వాంగేషు సమావృణో ద్దశముఖస్యాత్మోద్భవస్తం కపిః
పుచ్ఛాగ్రేణ నునోద సోపి సహసా తానాశుగాన్ లీలయా ॥

11) శ్లో ॥ శరాణా మన్తరేష్వాశు వ్యవర్తత మహోకపిః ।
హరిస్తస్యాభి లక్ష్యస్య మోఘయన్ లక్ష్యసంగ్రహమ్ ॥

12) శ్లో ॥ హనూమతో వేద న రాక్షసోంతరమ్ ।
న మారుతి స్తస్య మహాత్మనోంతరమ్ ।
పరస్పరం నిర్విషహౌ బభూవతు-
స్సమేత్య తౌ దేవసమాన విక్రమౌ ॥

13) శ్లో ॥ తతో భ్రమన్తం నభసి హనూమన్తం శిలీముఖైః ।
విద్ధ్వా తస్య శిరోభాగ మిషుభి శ్చాష్టభిః పునః ॥

14) శ్లో ॥ భేదయిత్వా తతో ఘోరం సింహనాద మథాకరోత్ ।
తతోఽతిహర్షాద్ధనుమాన్ స్తంభ ముద్యమ్య వీర్యవాన్ ॥

15) శ్లో ॥ జఘాన సారథిం సాశ్వం రథం చాచూర్ణయత్ క్షణాత్ ।
వృక్షేన భిన్న సర్వాంగో మేఘనాదోఽవిశద్గృహమ్ ॥

16) శ్లో ॥ ఏతస్మిన్నంతరే బ్రహ్మా ప్రార్థయామాస మారుతిమ్ ।
బ్రహ్మాస్త్రం మానయస్మేఽద్య తం లంకాం యాహి రావణమ్ ॥

17) శ్లో ॥ తతోఽన్యం రథ మాస్థాయ మేఘనాదో మహాబలః ।
జగామ వాయుపుత్రస్య సమీపం వీరవిక్రమః ॥

18) శ్లో ॥ తా వుభౌ వేగసంపన్నౌ రణకర్మ విశారదౌ ।
సర్వభూతమనోగ్రాహి చక్రతు ర్యుద్ధముత్తమమ్ ॥

19) శ్లో ॥ తతః పైతామహం వీర స్సోఽస్త్ర మస్త్రవిదాం వరః ।
సందధే సుమహాతేజా స్తం హరిప్రవరం ప్రతి ॥

20) శ్లో ॥ అవధ్యోఽయ మితి జ్ఞాత్వా త మస్త్రేణా స్త్రతత్త్వవిత్ ।
నిజగ్రాహ మహాబాహు ర్మారుతాత్మజ మింద్రజిత్ ।
హతం తం మారుతిం మత్వా సింహనాద మథాకరోత్ ॥

యుద్ధములో హనుమంతుని ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రముచే బంధించుట

భావము : అప్పుడింద్రజిత్తు తండ్రితో – 'తండ్రీ ! తమరు మహాబుద్ధిమంతులు. నేను బ్రతికియుండగా మీరిట్లు ఎందుకు దుఃఖించుచున్నారు?

అని ఇట్లు పలికి మహాపరాక్రమ సంపన్నుడగు ఇంద్రజిత్తు తన రథము నధిరోహించి రాక్షస సైన్యముతో కూడ వాయునందనుడగు హనుమంతుని సమీపమునకు బయలుదేరెను.

ఇంద్రసముడగు ఇంద్రజిత్తు గరుత్మంతునితో సమానములగు నాలుగు సింహములను పాముతో కట్టబడిన భూస్పర్శ తగులని రథము నెక్కి యుద్ధభూమి కేగెను.

రాక్షసేశ్వరుడగు రావణుని మాటలను విని, రావణపుత్రుడగు ఇంద్రజిత్తు అతని చరణములకు ప్రణమిల్లి, బంగరు తేరునెక్కి శ్వదంష్ట్రలతో కూడిన రథ్యముల చేతను, హస్త్యశ్వ సైన్యముల తోడను భేరీశంఖ దుందుభిస్వనములు దిగ్దిగంతములవరకు వ్యాపించుచుండగా యుద్ధమునకు బయలుదేరెను.

వానర వీరుడగు హనుమంతుడు కూడ ఇంద్రజిద్రథ నిర్ఘోషమును ధనుష్టంకార ధ్వనిని విని యుద్ధమునకు గొప్ప ప్రతివీరుడు లభించినందుకు సంతోషించెను.

అప్పుడా మహాయుద్ధమును జూచుటకై గగనచారులగు నాగ, యక్ష మహర్షి, సిద్ధ,చారణసంఘముల వారును, ఆకాశమునావరించి సమావిష్టులైరి. పక్షిబృందములు కూడ సంతోషముతో బిగ్గరగా కూయసాగినవి.

పిమ్మట దుర్ధర్షమగు గమనవేగముతో తారసపడిన యామహాబల సంపన్నులగు హనుమదింద్రజిత్తులిరువురు, యుద్ధభయమిసుమంతయు లేనివారై, దేవాసురులవలె పరస్పరసంగ్రామము నారంభించిరి.

దశముఖసుతుడగు ఇంద్రజిత్తు, ఉన్నతతమమై యరివీర భయంకరాకారము దాల్చిన హనుమద్వానరుని జూచి వజ్రాయుథమును పోలినవియు, స్వనామాంకితాక్షరములుకల బాణములతో హనుమచ్ఛరీరము నంతను కొట్టసాగెను. హనుమంతుడు కూడ వానినన్నింటిని తన వాలాయుధముతో లీలగానుపసంహరింప జేయసాగెను.

కౌశలముతో ఇంద్రజిత్ప్రయుక్తములైన బాణములు తనను తాకకుండు నటుల, నంతకుమించిన నేర్పుతో ఆ బాణములకు మధ్యగా చరించుచూ హనుమంతుడు ఇంద్రజిద్బాణ ప్రయోగమును వ్యర్థము చేయసాగెను.

ఈ విధముగా దేవతుల్య పరాక్రమము కల ఆ హనుమదింద్రజిత్తులు పరస్పరానంతర్యమును నెఱుంగజాలని వారై పరస్పర విజిగీషతో ఘోరముగా యుద్ధము చేయసాగిరి.

పిమ్మట ఇంద్రజిత్తు గగనమున విజృంభించు హనుమంతుని తలపై యెనిమిది పదునైనబాణములను ప్రయోగించి బిగ్గరగా సింహనాదము గావించెను.

వెనువెంటనే హనుమంతుడు కూడ మహోత్సాహముతో నొక స్తంభమును పెల్లగించి దానితో ఇంద్రజిత్తుని రథమును సారథిని గుఱ్ఱములను కూడ క్షణకాలములో నుగ్గు చేసెను.

వృక్షపు దెబ్బలచే శిథిలములైన అంగములతో మేఘనాథుడు తన గృహమునకు మరలెను.

ఇంతలో బ్రహ్మదేవుడచటకు వచ్చి హనుమంతుని – 'నీవిప్పుడు (ఇంద్రజిత్ప్రయుక్తమైన) నా బ్రహ్మాస్త్రమును గౌరవించి (బంధింపబడినవాడవై) రావణుని చూచుటకు వెళ్ళు'–మని ప్రార్థించెను.

పిమ్మట మహాబలసంపన్నుడగు మేఘనాథుడు మఱియొక రథమునధిరోహించి వాయునందనుడగు హనుమంతునివద్దకు వచ్చెను.

గొప్పగమన వేగము గలిగి యుద్ధమునందు సమర్థులైన వారిరువురు సర్వప్రాణిమనోహ్లాదకరముగా యుద్ధము చేయుచుండిరి.

పిమ్మట అస్త్రప్రయోగకుశలుడగు ఇంద్రజిత్తు, వానరవీరుడగు మహాతేజస్వియునగు హనుమంతుడు, అవధ్యుడని తలంచి, అతని తత్త్వము నెఱింగినవాడు గావున అతనిపై బ్రహ్మాస్త్రమునభిమంత్రించి ప్రయోగించి అతనిని నిగ్రహించెను. అనగా బ్రహ్మాస్త్ర ప్రయోగముతో బంధించెనని భావము. మఱియు హనుమంతుడు హతుడయ్యెనని బిగ్గరగా సింహనాదము చేసెను.

21) శ్లో ॥ తేన బద్ధ స్తతోఽస్త్రేణ రాక్షసేన స వానరః ।
అభవన్నిర్విచేష్టశ్చ పపాత చ మహీతలే ॥

22) శ్లో ॥ తతోఽవబుద్ధ్వా న తదాస్త్రబంధమ్ ।
ప్రభోః ప్రభావా ద్విగతాత్మ వేగః ।
పితామహానుగ్రహ మాత్మనశ్చ ।
విచిన్తయామాస హరిప్రవీరః ॥

23) శ్లో ॥ గ్రహణే చాపి రక్షిభిర్మహాన్మే గుణదర్శనః ।
రాక్షసేంద్రేణ సంవాద స్తస్మాద్గృహ్ణన్తు మాం పరే ॥

భావము : వానరుడగు హనుమంతుడు రాక్షసుడగు ఇంద్రజిత్తుచే బ్రహ్మాస్త్రముచే కట్టబడినవాడై చేష్టలుడిగి నేలపై పడిపోయెను.

తెలివివచ్చిన పిమ్మట వానరవీరుడగు హనుమంతుడు ప్రభువగు శ్రీరామచంద్రుని ప్రభావముచేతను, పితామహుడగు బ్రహ్మదేవుని యనుగ్రహము చేతను అస్త్ర బంధము తొలగిపోయినదని తలంచి తనలోనిట్లు భావించెను.

రాక్షసులచే నేనిప్పుడు పట్టుకొనబడినను అది మంచికేయగును. దాని వలన రాక్షసేశ్వరుడగు రావణునితో మాట్లాడవచ్చును. కావున నన్ను ఈ రాక్షసులు పట్టుకొనిన పట్టుకొందురు గాక! అని తలంచెను.

24) శ్లో ॥ తతస్తం రాక్షసా దృష్ట్వా నిర్విచేష్ట మరిందమమ్ ।
బబంధు శ్శణవల్కైశ్చ ద్రుమచీరైశ్చ సంహతైః ॥

25) శ్లో ॥ బబంధు ర్లోహపాశైశ్చ బ్రహ్మాస్త్రస్తంభితం కపిమ్ ।
స బద్ధ స్తేన వల్కేన విముక్తోఽస్త్రేణ వీర్యవాన్ ।
అస్త్రబన్ధ స్స చాన్యం హి న బన్ధ మనువర్తతే ॥

26) శ్లో ॥ అథేంద్రజిత్తు ద్రుమచీరబద్ధమ్ ।
విచార్య వీరః కపిసత్తమం తమ్ ।
విముక్తమస్త్రేణ జగామ చింతామ్ ।
నాన్యేన బద్ధో హ్యనువర్తతేఽస్త్రమ్ ॥

27) శ్లో ॥ అహో మహాత్కర్మ కృతం నిరర్థకమ్ ।
న రాక్షసైర్మంత్రగతి ర్విమృష్టా ।
పునశ్చ నాస్త్రే విహతేఽస్త్ర మన్య-
త్ప్రవర్తతే సంశయితా స్స్మ సర్వే ॥

28) శ్లో ॥ యస్య నామ సతతం జపన్తి యేఽ
జ్ఞానకర్మకృత బంధనం క్షణాత్ ।
సద్య ఏవ పరిముచ్య తత్పదమ్
యాంతి కోటి రవిభాసురం శివమ్ ॥

29) శ్లో ॥ తస్యైవ రామస్య పదాంబుజం సదా ।
హృత్పద్మమధ్యే సు నిధాయ మారుతిః ।
సదైవ నిర్ముక్త సమస్తబంధనః
కిం తస్య పాశై రితరైశ్చ బంధనైః ॥

30) శ్లో ॥ హన్యమాన స్తతః క్రూరై రాక్షసైః కాష్ఠముష్టిభిః ।
సమీపం రాక్షసేంద్రస్య ప్రాకృష్యత స వానరః ॥

రాక్షసులు హనుమంతుని బంధించి రావణుని వద్దకు తీసికొనివచ్చుట

భావము : అంతట శత్రుమర్దనుడగు ఆ హనుమంతుడట్లు నిశ్చేష్టుడై యుండుటను గాంచి, జనపనారగుడ్డలచే, నారచీరములను ముప్పిరిగా మెలివెట్టి హనుమంతుని కట్టివేసిరి.

బ్రహ్మాస్త్రముచే స్తంభింప చేయబడిన ఆ వానరుని రాక్షసులు ఇనుప గొలుసుల చేతను వస్త్రముల చేతను కట్టివేయుటచే నతడు బ్రహ్మాస్త్ర బంధనము నుండి ముక్తుడయ్యెను. అది యుక్తమే! బ్రహ్మాస్త్రము వేరొక బంధనము ననువర్తింపదు.

పిమ్మట వీరుడగు ఇంద్రజిత్తు నారబట్టలచే కట్టబడిన హనుమంతుడు బ్రహ్మాస్త్ర వినిర్ముక్తుడయ్యెననిగ్రహించి బ్రహ్మాస్త్రము వేరొక బంధము ననువర్తింపదు కదాయని మిక్కిలి చింతించెను.

ఆహా! మంత్రగతిని తెలియనివారగుటచే బ్రహాస్త్రప్రయోగము అను యీ మహాకార్యము నిరర్థకమైపోయినది. మరల బ్రహ్మాస్త్రము మఱియెక సారి ప్రయోగింపబడజాలదు కదా యని ఇంద్రజిత్తు చింత్రాక్రాంతుడయ్యెను.

ఎవని నామమును యెల్లప్పుడు జపించుటచే అజ్ఞానకర్మకృత బంధనము క్షణములో త్రెళ్ళిపోవునో, మఱియు సర్వసంసార బంధ వినిర్ముక్తులై మంగళమైన సూర్యప్రకాశసదృశమైన పరమపదమును పొందుచున్నారో-

అట్టి రామపదాంబుజమును సదా తన హృత్పద్మ మధ్యమున ధ్యానించు మారుతి సంసార బంధ వినిర్ముక్తుడై, జీవన్ముక్తుడై యుండును. అతనిని బ్రహ్మాస్త్రాదులుగాని ఇతర పాశములుగాని ఎట్లు బంధింపగలవు? బంధింప జాలవని భావము.

(అయినను యాదృచ్ఛికముగా బంధనమును పొందిన) ఆ హనుమంతుని మిక్కిలి క్రూరులగు రాక్షసులు కఱ్ఱలతో కొట్టుచు, పిడికిళ్ళతో గ్రుద్దుచు రాక్షసేంద్రుడగు రావణుని సమీపమునకు తీసికొనిపోయిరి.

31) శ్లో ॥ తత స్స కర్మణా తస్య విస్మితో భీమవిక్రమః ।

హనుమా న్రోషతామ్రాక్షో రక్షోధిప మవైక్షత ॥

32) శ్లో ॥ భ్రాజమానం మహార్హేణ కాంచేన విరాజతా ।
ముక్తాజాలావృతేనాథ మకుటేన మహాద్యుతిమ్ ॥
33) శ్లో ॥ వివృత్తైర్దర్శనీయైశ్చ రక్తాక్షైర్భీమదర్శనైః ।
దీప్తతీక్షణ మహాదంష్ట్రైః ప్రలంబ దశనచ్ఛదైః ॥
34) శ్లో ॥ శిరోభిర్దశభిర్వీరం భ్రాజమానం మహౌజసమ్ ।
రత్నాంతరిత రుద్రాక్ష కంఠికాబద్ధకంధరమ్ ॥
35) శ్లో ॥ భస్మత్రిపుండ్రినిటలం భస్మక్షిప్తాక్షిపక్ష్మకమ్ ।
నానావ్యాళసమాకీర్ణై శ్శిఖరైరివ మన్దరమ్ ॥
36) శ్లో ॥ బాహుభిర్బద్ధ కేయూరై శ్చన్దనోత్తమ రూషితైః ।
భ్రాజమానాంగదైః పీనైః పంచశీర్షైరివోరగైః ।
37) శ్లో ॥ ఉత్తమాస్తరణాస్తీర్ణే సూపవిష్టం వరాసనే ।
అలంకృతాభిరత్యర్థం ప్రమదాభిః సమన్తతః ।
వాలవ్యజనహస్తాభి రారాత్సముపసేవితమ్ ॥
38) శ్లో ॥ దుర్ధరేణ ప్రహస్తేన మహాపార్శ్వేన రక్షసా ।
మన్త్రిభిర్మన్త్ర తత్వజ్ఞైర్నికుంభేన చ మన్త్రిణా ॥
39) శ్లో ॥ సుఖోపవిష్టం రక్షోభిశ్చతుర్భిర్బలదర్పితైః ॥
40) శ్లో ॥ అపశ్య ద్రాక్షసపతిం హనుమా నతితేజసమ్ ।
విస్మయం పరమం గత్వా రక్షోధిపమవైక్షత ।
41) శ్లో ॥ మనసా చింతయామాస తేజసా తస్య మోహితః ।
అహో రూప మహో ధైర్య మహో సత్వ మహోద్యుతిః ॥
42) శ్లో ॥ అహో రాక్షసరాజస్య సర్వలక్షణయుక్తతా ।
యద్యధర్మో న బలవాన్ స్యా దయం రాక్షసేశ్వరః ॥
43) శ్లో ॥ స్యా దయం సురలోకస్య సశక్రస్యాపి రక్షితా ।
అయం హ్యుత్సహతే క్రుద్ధః కర్తు మేకార్ణవం జగత్ ॥
ఇతి చిన్తాం బహువిధా౾మకరో న్మతిమాన్ హరిః ॥

ఇతి శ్రీ రామాయణ సారోద్ధారే సుందరకాండే చతుర్దశః సర్గః

హనుమంతుడు రావణుని వైభవమును ప్రశంసించుట

భావము : భయంకరమైన పరాక్రమముకల హనుమంతుడు రావణుని యొక్క ఈ పని (నీతి) చే మిక్కిలి కోపముతో నెఱ్ఱవారి కన్నులతో రాక్షసేశ్వరుడగు రావణుని చూచెను.

శ్రీపాదుక : హనుమంతుని రోషమునకు కారణము – రావణునియొక్క రాజసముతో కూడిన కర్మాచరణము. హనుమంతుడు రావణునికి ప్రియమైన ప్రమదవనమును భగ్నముచేసి అతనిని తన వద్దకు రప్పించుకొనదలచినాడు.

రావణుడతనిని నిగ్రహించుటకు తానుగా రాలేదు. భటులను సేనానులను ఇంద్రజిదాది పుత్రులనుపంపి, తనవద్దకే హనుమంతుని రప్పించుకొనినాడు. ఇట్టి నీతిమత్వము కర్మకౌశలమును చూచి హనుమంతుడు రోషతామ్రాక్షుడై రాక్షసేశ్వరుడగు రావణుని చూచినాడని భావము.

32) ఇట నుండి 'అపశ్యద్రాక్షసపతిం' అని 40వ శ్లోకము వరకు రావణుని రాజసముతో కూడిన వైభవము వర్ణింపబడినది.

స్వర్ణమయమై ప్రకాశించుచున్న ముక్తారత్నఖచిత ముకుటముతో శోభిల్లుచున్నవాడును.

భయంకరమై దృక్కులతో వివృతములైన సుందర నయనములతోను ప్రకాశించుచున్న సుతీక్షణ దంష్ట్రాగ్రములుకల దంతపంక్తులచేతను

రత్నములునడుమ రుద్రాక్షలు కూర్చబడిన కంఠమాలావృత కంఠము కలవాడును, భస్మ త్రిపుండ్రములలరు ముఖములు, కనుఱెప్పలు కల వాడును, బహువిధములై వ్యాళఘాతుక జంతు సమాకీర్ణశృంగములతోనొప్పు మందరాచలము వలెనున్నవాడును, చందనచర్చితములై భుజకీర్తులతో శోభిల్లు పంచశీర్షములగు సర్పముల వలె ప్రకాశించు భుజమండలము కలవాడును, బాగుగా నలంకరించుకొని వింజామరలు వీచుచున్న స్త్రీలతో సేవింపబడు రావణుని చూచెను. (32–38) అట్లే –

దుర్ధర, ప్రహస్త, మహాపార్శ్వ నికుంభులను నలువురు మంత్రులచే పరివేష్టింపబడినవాడు అగు రాక్షసేశ్వరుని వైభవమును చూచి హనుమ తన మనస్సులో –

ఆహా ! ఈ రావణుని రూప మత్యద్భుతము. ధైర్యమా నిరుపమానము! సత్త్వము ప్రశంసార్హము. తేజస్సు సాటిలేనిది. నిజముగా ఈ రాక్షసేశ్వరుడు సర్వలక్షణ సమన్వితుడు కదా !

బలీయమగు అధర్మమునకొడికట్టకున్నచో ఇతడు దేవేంద్రునితో కూడిన స్వర్గమున కేలికయై యుండెడివాడు.

ఇతడు కోపించినచో ముల్లోకములనేకార్ణవముగా చేయగలడు కదా! యని మనసా రావణుని వైభవమును ప్రశంసించెను.

ఇది శ్రీమాద్రామాయణసారోద్ధారము నందలి సుందరకాండమున పదునాలుగవ సర్గము.

సర్గాంతశ్లోకసంఖ్య-(722+43=765)



పంచదశస్సర్గః

1) శ్లో ॥ **త ముద్వీక్ష్య మహాబాహుః పింగాక్షం పురతః స్థితమ్ ।**
కోపేన మహతావిష్టో రావణో లోకరావణః ॥

2) శ్లో ॥ **శంకాహతాత్మా ధధ్యౌ స కపీంద్రం తేజసావృతమ్ ।**
కి మేష భగవాన్నందీ భవేత్సాక్షా దిహాగతః ॥

3) శ్లో ॥ **యేన శప్తోస్మి కైలాసే మయా సంచాలితే పురా ।**
సోఽయం వానరమూర్తిస్స్యాత్కింస్విద్బాణోఽపివా సురః ॥

4) శ్లో ॥ **తుష్టః పినాకీ దశభి శ్శిరోభి-**
స్తుష్టో న చైకాదశమో హి రుద్రః ।
అతో హనుమాన్దహతీతి కోపా-
త్పంక్తేర్హి భేదో న పున శ్శివాయ ॥

భావము : 1) లోకకంటకుడగు రావణుడెదురుగా పింగళవర్ణముకల కన్నులుగల హనుమంతుని చూచి మిక్కిలి కోపముతో..

2) తన మనసున సంశయమును పొందినవాడై ఆ తేజస్వియగు హనుమంతుని చూచి -

3) పూర్వము నేను కైలాసమును కదిలించినపుడు, నన్ను శపించిన నందీశ్వర భగవానుడే యీ వానరమూర్తియై యుండును లేదా బాణాసురుడై యుండును.

శ్రీపాదుక : పూర్వము రావణుడు కైలాసమును విచలితము గావించుచుండగా నందీశ్వరుడతనిని వారించెను. అప్పుడరావణుడతనిని కోతిముఖము కలవాడని పరిహసించెను. అప్పుడు నందీశ్వరుడు రావణుని- నా వంటి ముఖము కల వానరుల వల్లనే నీకు చేటు కలగునని రావణునికి శాపమిచ్చెను.

ఇట్లే బలిచక్రవర్తి యొక్క కుమారుడగు బాణాసురుడు కూడ రావణునకు శాపమునిచ్చిన ఐతిహ్యము కలదని శాస్త్రి గారి వచనము.

4) పినాకపాణియగు రుద్రుడు (నా దశశిరస్సులను హవిస్సులుగా వ్రేల్చబడగా స్వీకరించి) సంతుష్టుడయ్యెను. ఏకాదశరుద్రుడు మాత్రము సంతుష్టుడు కాలేదు. అతడే పంక్తి భేదమును సహింపని వాడై హనుమంతుని రూపమున వచ్చి యుండును!

5) శ్లో ॥ స రాజా రోషతామ్రాక్షః ప్రహస్తం మంత్రిసత్తమమ్ ।
కాలయుక్త మువాచేదం వచో విపుల మర్థవత్ ॥

6) శ్లో ॥ దురాత్మా పృచ్ఛతా మేష కుతః కిం వాఽస్య కారణమ్ ।
వనభంగే చ కోఽస్యార్థో రాక్షసీనాం చ తర్జనే ॥

7) శ్లో ॥ మత్పురీమప్రధృష్యాం వాఽఽగమనే కిం ప్రయోజనమ్?
ఆయోధనే వా కిం కార్యం? పృచ్ఛతా మేష దుర్మతిః ॥

భావము : 5) రాజగు రావణుడప్పుడు క్రోధముచే నెఱ్ఱబారిన కన్నులతో, మంత్రులలో ప్రధానుడగు ప్రహస్తుని విస్తృతార్థపూర్ణమగు వచనములలో దేశకాలానుగుణముగా నిట్లు ప్రశ్నించెను.

6) ప్రహస్తా ! ఈ దురాత్ముని – 'ఎక్కడి నుండి వచ్చినాడు? ఎందులకు వచ్చినాడు? వనమును భగ్నముచేయుటకేమి కారణము? రాక్షసస్త్రీలను ఎందుకు భయపెట్టినాడు?

7) ఎవ్వరికిని ప్రవేశింప శక్యముకాని ఈ లంకానగరము నెందులకు ప్రవేశించినట్లు? రాక్షసవీరులతో యుద్ధము చేయుటచే నేమి ప్రయోజనము? అని ప్రశ్నించుమని పలికెను.

8) శ్లో ॥ రావణస్య వచ శ్శృత్వా ప్రహస్తో వాక్య మబ్రవీత్ ।
తత్వతః కథయస్వాద్య తతో వానర మోక్ష్యసే ।
అనృతం వదత శ్చాపి దుర్లభం తవ జీవితమ్ ॥

భావము : ప్రహస్తుడు రావణుని వాక్యమును విని హనుమంతునితో – వానరా! నిజము చెప్పుము. నిజము చెప్పినచో నిన్ను విడిచి వేయుదుము. అసత్యమును చెప్పినచో నీవు బ్రతుకుట దుర్లభము.

9) శ్లో ॥ అథాహ రావణో రాజా హమామన్తం మహాబలమ్ ॥

10) శ్లో ॥ రే రే వానర కో భవా నహ మరే త్వత్సూనుహంతాఽఽహవే ।
దూతోఽహం ఖరఖండనస్య జగతాం కోదండ దీక్షాగురోః ।
యద్దోర్దండ కఠోరతాడనవిధౌ కోఽసౌ త్రికూటాచలః ।
కో మేరుః?క్వ చ రావణౌఘ గణనా? కోటిస్తు కీటాయతే! ॥

11) శ్లో ॥ శ్రీరామేణ సలక్ష్మణేన జయినా శ్రీ ఋష్యమూకే స్థితః ।
సీతాన్వేషణ కార్యసాధనవిధౌ ప్రస్థాపితో యత్నతః ।
లబ్ధ్వా చైవ వరం చిరా త్పురభిద స్సర్వత్ర గామీహ్యహమ్ ।
విద్ధి త్వం పవనాత్మజో దశముఖ శ్రీమాన్ హనుమానహమ్ ॥

12) శ్లో ॥ హత్వా వాలిన మాహవే కపిచమూమాశ్వాస్య సుగ్రీవకమ్ ।
రాజానం కృతినం సదా విజయినం సఖ్య స్సదానందకః ।
కృత్వా చైవ విశేషదైవనివహాఖ్యానస్య చిన్తాశ్రిత-
శ్శ్రీరామో జనకాత్మజాహరణతః కాలోపమో రాజతే ॥

13) శ్లో ॥ తావల్లంకేశ్వరో రాజా యావ న్నాయాతి రాఘవః ।
ఆయా తే రాఘవే వీరే లంకా లంకేశ్వరః కుతః? ॥

14) శ్లో ॥ వనం రాక్షసరాజస్య దర్శనార్థే వినాశితమ్ ।
జాతిరేవ మమ త్వేషా వానరోఽహ మిహాగతః ॥

15) శ్లో ॥ రక్షణార్థం తు దేహస్య ప్రతియుద్ధా మయా రణే ।
అస్త్రపాశైర్న శక్యోఽహం బద్ధుం దేవాసురైరపి ॥

16) శ్లో ॥ రాజానం ద్రష్టుకామేన మయాస్త్ర మనువర్తితమ్ ।
దూతోఽహ మితి విజ్ఞేయో రాఘవస్యామితౌజసః ॥

17) శ్లో ॥ అహం సుగ్రీవ సందేశా దిహ ప్రాప్తస్తవాలయమ్ ।
రాక్షసేంద్ర హరీశ స్త్వాం భ్రాతా కుశల మబ్రవీత్ ॥

18) శ్లో ॥ క్షిప్ర మానీయతాం సీతా దీయతాం రాఘవాయ చ ।
యావ న్న హరయో వీరా విధమన్తి బలం తవ ॥

19) శ్లో ॥ వానరాణాం ప్రభావో హి న కేన విదితః పురా ।
దేవతానాం సకాశం చ యే గచ్ఛన్తి నిమన్త్రితాః ॥

20) శ్లో ॥ ఇతి వానర రాజ స్త్వా మాహే త్యభిహితం హితమ్ ।
భ్రమతా చ మయా దృష్టా గృహే తే జనకాత్మజా ॥

21) **శ్లో ॥** త ద్భవాన్ దృష్టధర్మార్థ స్తపఃకృతపరిగ్రహః ।
పరదారా న్మహాప్రాజ్ఞ! నోపరోద్ధుం త్వ మర్హసి ॥

22) **శ్లో ॥** అవధ్యతాం తపోభి ర్యాం భవా న్సమనుపశ్యతి ।
ఆత్మన స్సాసురైర్దేవై ర్హేతు స్తత్రాప్యయం మహాన్ ॥

23) **శ్లో ॥** సుగ్రీవో న హి దేవోఽయం నాసురో న చ రాక్షసః ।
న దానవో న గన్ధర్వో న యక్షో న చ పన్నగః ॥

24) **శ్లో ॥** మానుషో రాఘవో రాజన్ సుగ్రీవశ్చ హరీశ్వరః ।
తస్మా త్ప్రాణపరిత్రాణం కథం రాజన్ కరిష్యసి? ॥

25) **శ్లో ॥** న తు ధర్మోపసంహార మధర్మఫలసంహితమ్ ।
త దేవ ఫల మన్వేతి ధర్మ శ్చాధర్మనాశనః ॥

26) **శ్లో ॥** ప్రాప్తం ధర్మఫలం తావత్ భవతా నాత్ర సంశయః ।
ఫలమస్యాప్య ధర్మస్య క్షిప్రమేవ ప్రపత్స్యసే ॥

27) **శ్లో ॥** జన స్థాన వధం బుద్ధ్వా బుద్ధ్వావాలివధం తథా ।
రామసుగ్రీవసఖ్యం చ బుధ్యస్వ హితమాత్మనః ॥

28) **శ్లో ॥** సర్వాన్ లోకాన్ సుసంహృత్య సభూతాన్ సచరాచారాన్ ।
పునరేవతథా స్రష్టుం శక్తో రామో మహాయశాః ॥

29) **శ్లో ॥** కశ్చ లక్ష్మణముక్తానాం రామకోపానువర్తినామ్ ।
శరాణా మగ్రత స్థాతుం శక్తో దేవాసురేష్వపి ॥

30) **శ్లో ॥** స్వాని మిత్రాణి మంత్రీంశ్చ జ్ఞాతీన్ భ్రాతౄన్సుతా న్హితాన్ ।
భోగాన్దారాంశ్చ లంకాం చ మా వినాశ ముపానయ ॥

భావము : 9) పిమ్మట రాజగు రావణుడు మహాబలియగు హనుమంతునితో నిట్లు పలికెను. (ఇది సంవాద శ్లోకము) రావణుడు.

10) ఓరోరీ వానరా ! నీవెవ్వడవురా! నేను యుద్ధమున నీ కుమారుని చంపినవాడనురా! మరియు ఖరుని సంహరించిన కోదండ దీక్షాధరుడగు

రాముని దూతనురా ! ఆ రాముని భుజదండ కఠోర ప్రహారముచే త్రికూటపర్వతమే నుగ్గగును. ఓరీ! రావణా నీ వంటి రావణులు కోట్లమంది కలసి వచ్చినను కీటకములను వలె మా రాముడు నులిమి చంపును.

11) శ్రీరాముడు జయశీలుడగు లక్ష్మణునితో కూడ ఋష్యమూకపర్వతము నందున్నవాడై సీతాన్వేషణ కార్యమునకై సుగ్రీవాదులద్వారా పంపబడినవాడను, త్రిపురాసురులను వధించిన పరమేశ్వరానుగ్రహముచే నంతటను అవలీలగా సంచరించు స్వభావముకలవాడను మరియు వాయుపుత్రుడగు హనుమంతునిగా నన్ను తెలిసికొనుము.

12) శ్రీరాముడు యుద్ధమున వాలిని వధించి, కపిసేనలనూరడించి, సుగ్రీవుని పట్టాభిషిక్తుని గావించి, సీతావియోగ దుఃఖసంతప్తుడై, ఆమె నపహరించిన నీ యెడ ప్రళయకాలాగ్ని వలె మండిపడుచున్నాడు.

13) రాముడు లంకలో నడుగిడునంతవరకే రావణుడు లంకేశ్వరుడు. రాఘవుడడుగిడిన మరుక్షణమున లంకగాని, లంకేశ్వరుడుగాని కనబడరు. (నశింతురని భావము)

14) రాక్షసేశ్వరుని దర్శించుటకొరకై వనమును భగ్నము చేసితిని. నాది వానరజాతి. నేను హనుమంతుడను పేరు గలవాడను. కావున వనమున సంచరించుటకై వచ్చితిని.

15) రాక్షసులు తొలుతనాపై యుద్ధమునకు రాగా దేహరక్షణార్థమై నేను వారి నెదుర్కొంటిని. దేవదానవులెవ్వరి చేతను ఏ విధములైన శస్త్రాస్త్ర ప్రయోగములచే నేనే విధముగాను నిగ్రహింపబడను. (నన్నెవరును బంధింపలేరని భావము).

16) రాజదర్శనార్థమై నేను బ్రహ్మాస్త్రమును గౌరవించి వశపడితిని. నన్నమేయ పరాక్రమశాలియగు శ్రీరామునిదూతగా నెఱుంగుము.

17) ఓ రాక్షసేశ్వరా ! నేను వానరేశ్వరుడగు సుగ్రీవుని సందేశమును గొని నీ నివాసమగు లంకకు వచ్చితిని. సోదరుడగు సుగ్రీవుడు ముందుగా నీ కుశలమును ప్రశ్నించినాడు.

18) వానర వీరులు నీ లంకను ప్రవేశించి నీ సైన్యమును మర్దించులోపలనే నీవు శీఘ్రముగా శ్రీరాముని యాహ్వానించి సీతను అతనికి సమర్పించుము.

19) వానరవీరుల ప్రభావమెవరికి తెలియదు గనుక ! వారు దేవతలచే అభ్యర్థింపబడి వారిని దర్శింతురు. ఇట్టి వానరులకు రాజైన సుగ్రీవుడు నీ హితమును (చెప్పుచున్నవాడు) అభిలషించుచున్నాడని భావము.

20) లంకలో సంచరించుచు నేను సీతనిచ్చట చూచితిని.

21) నీవు ధర్మశాస్త్రమును నీతి శాస్త్రమును తెలిసినవాడవు, తపస్సంపన్నుడవు. మహాప్రజ్ఞాశాలివగు నీ వంటి వానికి ఈ పరదారాపరిగ్రహము తగదు.

22) పూజ్యుడవగు నీవు తపః ప్రభావముచే దేవాసురాదులచే అవధ్యత్వమును భావించుకొనుచున్నావు. దానికి కూడ గొప్పదగు ప్రతికూలహేతువు అనగా మారణకారణము కలదు. అది యిది-

23) సుగ్రీవుడు నీవు అవధ్యత్వమును వరముగా పొందిన దేవ, దానవ, అసుర, గంధర్వ యక్షరాక్షసాదులలో నెవ్వడును కాడు.

24) శ్రీరాముడు నరేశ్వరుడు మరియు సుగ్రీవుడు వానరేశ్వరుడు కావున నీవు వీరిరువురినుండి ప్రాణములనెట్లు కాపాడుకొనగలవు?

25) ధర్మముతోడనే ధర్మఫలము మరియు అధర్మ ఫలమధర్మముతోనే చేరి యుండును. ధర్మమేవిధముగను అధర్మమును పరిహరింపజాలదు. దాని ఫలితమనుభవించియే తీరవలెను.

26) నీవింతవరకు ధర్మఫలానుభవముగా త్రైలోకాధిపత్యభోగములను అనుభవించియున్నావు. త్వరలో అధర్మఫలమైన సర్వనాశమును అనుభవింప బోయెదవు.

27) జనస్థానము నందలి ఖరదూషణాదుల వధను, వాలివధను, రామసుగ్రీవుల మైత్రిని యోచించి నీ హితమును కూడా నాలోచించుకొనుము.

28) చరాచర ప్రాణులతోకూడిన ఈ ప్రపంచమునంతను సంహరించి మరల అదే విధముగా మహాకీర్తిమంతుడగు రాముడు మరల సృష్టింపగలడు.

29) దేవదానవులలో నెవ్వడు రాముని కోపముననుసరించి చరించునవియు లక్ష్మణ వినిర్ముక్తములగు బాణముల నెదిరించి నిలువగలడు?

30) రావణా! నీ పుత్ర మిత్ర కళత్ర జ్ఞాతి, బంధు, ప్రియ, హిత, భోగదారాది సమూహములతో కూడిన ఈ లంకాపట్టణమును నశింపచేసుకొనవద్దు అని హితమునుపదేశించెను.

31) శ్లో ॥ (తచ్ఛ్రుత్వా రావణోఽప్యాహ హేలయా ప్రహసన్కపిమ్)
పంచాంగ పాఠక శ్చాయం పశ్య బ్రహ్మా కృతో మయా ।
ప్రతీహార స్త్వయం సూర్య శ్శశీ ఛత్రధరః కృతః ॥

32) శ్లో ॥ వరుణోఽయం జలగ్రాహీ మార్జకః పవన స్త్విహ ।
అగ్నిః కృతోఽయం రజకః మాలాకార శ్శచీపతిః ॥

33) శ్లో ॥ దండపాణిర్యమశ్చాత్ర దాస్య శ్చాత్ర సురస్త్రియః ।
మార్తాండో నాపిత శ్చాయం గణపః ఖరరక్షకః ॥

34) శ్లో ॥ మంగళాద్యా గ్రహా స్సప్త మే సోపానా ఇవాసనే ।
ఆందోళికశ్చ కైలాసః కుబేరోఽపి వినిర్జితః ॥

భావము : 30) హనుమంతుని మాటలను విన్న రావణుడవహేళన పూర్వకముగా నవ్వుతూ హనుమంతునితో–

31) హనుమంతుడా వినుము. బ్రహ్మ నాకు పంచాంగశ్రవణము చేయును. ఈ సూర్యుడు ద్వారపాలకుడై కావలికాయుచున్నాడు. చంద్రుడు ఛత్రమును చేబట్టి సేవకుడుగా నున్నాడు.

32) ఈ వరణుడిట నీటిని మోయుచున్నాడు. వాయుదేవుడూడ్చుచున్నాడు. అగ్నిదేవుడు చాకలివానిగాను, ఇంద్రుడు మాలాకరుడుగను చేయబడినారు.

33) దండధరుడగు యముడు రక్షకభటుడుగను, దేవతా స్త్రీలు దాసీ జనముగను సేవించుచున్నారు. మార్తాండుడు మంగలిగను, గణపతి గాడిదలు కాచువానిగను సేవించుచున్నారు.

34) మంగళుడు మొదలగు గ్రహనాథులు నాసింహాసన సోపానములుగా పడియున్నారు. కైలాసమును పల్లకిగా చేసికొని కుబేరుని జయించితిని అని పలికెను.

శ్రీపాదుక : ఈ విధముగా పరాక్రమార్జిత వైభవము కల నాకు రాజ్యభ్రష్టుడై అడవులపాలైన రాముని వలన భయమెట్లు కలుగునను దర్పము రావణుని మాటలలో కనబడుచున్నది.

35) శ్లో ॥ తం దృష్ట్వా రోషతామ్రాక్షో హనుమా నాహ రావణమ్ ।
రావణాలం కిం డంబేణ వ్రజ మౌనం న లజ్జసే ॥
శ్రుణు రామస్య మాహాత్మ్య మజ్ఞాత్వా త్వం వికత్థసే ॥

36) శ్లో ॥ బ్రహ్మ స్వయంభూశ్చతురాననో వా ।
రుద్ర స్త్రినేత్ర స్త్రిపురాన్తకో వా ।
ఇంద్రో మహేంద్ర స్సురనాయకో వా।
త్రాతుం న శక్తా యుధి రామవధ్యమ్ ॥

భావము : అట్లు గొప్పలు చెప్పుకొను రావణుని క్రోధముతో నెఱ్ఱబారిన కన్నులతో రావణుని పరికించుచు – రావణా ! బీరములు పలుకుటచే నేమి లాభము. ఇట్లు పలుకుటకు నీవెందుకు సిగ్గుపడకున్నావు? శ్రీరాముని గొప్పతనమును తెలియక పోవుటచే నీవిట్లు గొప్పలు చెప్పుకొనుచున్నావు. శ్రీరాముని మహాత్మ్యమును వినుము.

36) చతుర్ముఖుడు, ఆత్మభవుడునగు బ్రహ్మగాని, త్రినేత్రుడు, త్రిపురాంతకుడునగు రుద్రుడు గాని, దేవరాజు, మహేంద్రుడు అగు ఇంద్రుడు గాని యుద్ధమునందు రాముడు చంపదలచిన నిన్ను రక్షింపజాలరు.

శ్రీపాదుక : బ్రహ్మ, రుద్రేంద్రులు నిన్ను రక్షింపజాలరని చెప్పిన సరిపోవును. వారికొక్కరికి మరి రెండు విశేషణములు జోడించి చెప్పుట వారి యొక్క మహాత్మ్యాతిశయమును తెలుపుటకు అని గ్రహించాలి. ఇక్కడ వా శబ్దము వికల్పార్థము కాదు. సముచ్చయార్థకము అని గ్రహించాలి. ఆ పక్షమున రామ వధ్యుడగు రావణుని బ్రహ్మరుద్రేంద్రులు ముువ్వురు కలసి వచ్చినను రక్షింపజాలరు అని అర్థముసిద్ధించును.

37) శ్లో ॥ త్వం బ్రాహ్మణో హ్యుత్తమవంశ సంభవః ।
పౌలస్త్య పుత్రోఽసి కుబేరబాంధవః ।
దేహాత్మబుద్ధ్యాపి చ పశ్య రాక్షసో ।
నన్వాత్మబుద్ధ్యా కిము రాక్షసో న హి ॥

38) శ్లో ॥ అతో భజస్వాద్య హరిం రమాపతిమ్ ।
రామం పురాణం ప్రకృతేః పరం విభుమ్ ।
విసృజ్య మౌర్ఖ్యం హృది శత్రుభావనామ్ ।
భజస్వ రామం శరణాగతప్రియమ్ ॥

39) శ్లో ॥ శ్రుత్వామృతస్వాదసమాన భాషితమ్ ।
తద్వాయుసూనో దశ కంధరోఽసురః ।
అమృష్యమాణోఽతిరుషా కపీశ్వరమ్ ।
జగాద రక్తాన్త విలోచనో జ్వలన్ ॥

40) శ్లో ॥ కథం మమాగ్రే విలపస్య భీతవత్ ।
ప్లవంగమానా మధమోసి దుష్టధీః ।
క ఏష రామః కతమో వనేచరో ।
నిహన్మి సుగ్రీవ యుతం నరాధమ్ ॥

41) శ్లో ॥ త్వాం చాద్య హత్వా జనకాత్మజాం తతో ।
నిహన్మి రామం సహలక్ష్మణం తతః ।
సుగ్రీవ మగ్రే బలినం కపీశ్వరమ్ ।
సవానరం హన్మ్యచిరేణ వానర ॥

భావము : 37) రావణా! నీవు పులస్త్యబ్రహ్మ కుమారుడవు. ఉత్తమమగు బ్రాహ్మణవంశమున పుట్టితివి. కుబేరునకు బాంధవ్యమున సోదరుడవు. దేహాత్మ భావముకలవాడవైన నీవు రాక్షసుడవు. ఆత్మబుద్ధితో చూచిన రాక్షసుడవు కానేకావు.

38) కావున పురాణ పురుషుడు, ప్రకృతికి అతీతుడు, విభుడును, విష్ణు స్వరూపుడు, పరాత్పరుడును అగు శ్రీరాముని శరణువేడుము.

39) వాయుపుత్రునియొక్క అమృత రుచిరములైన వచనములను వినిన దశకంఠుడు ఆ వచనములను సహింపనివాడై, మిక్కిలి కోపముతో, కనుకొనలెఱ్ఱచేసి మండిపడుచు ఇట్లు పలికెను.

40) ఓరీ వానరాధమా ! నా ఎదుటనే నిలచి, నిర్భయముగా నిట్లు దుర్బుద్ధితో ఏమి ప్రేలుచున్నావు. వనచరుడగు రాముడు నాకే విధముగాను సాటికాడు. ఇప్పుడే నరాధముడగు రాముని లక్ష్మణసుగ్రీవులతో పాటుగా వధించెదను.

41) ఓ వానరా ! ఇప్పుడే నిన్ను, సీతను వధించెదను. తరువాత రామలక్ష్మణులను, అంతకన్నా ముందుగా నతని మిత్రుడు, బలవంతుడునగు సుగ్రీవుని వానరులతో కూడ చంపెదను.

42) శ్లో ॥ శ్రుత్వా దశగ్రీవవచ స్స మారుతి-
ర్వివృద్ధకోపేన దహన్నివాసురమ్ ।
న మే సమా రావణకోటయోఽధ ।
రామస్యదాసోఽహ మపారవిక్రమః ॥

భావము : ఈ విధముగా పలికిన రావణుని మాటలను విన్న హనుమంతుడు మిక్కిలి కోపించి నీ వంటి వారు కోటిమంది రావణులు వచ్చినను నాకు సాటికారు. నన్నెదుర్కొనలేదు. నేననంత విక్రమోపేతుడనగు శ్రీరాముని దూతనని పలికెను.

43) శ్లో ॥ ఏకోఽహం పవనాత్మజో దశముఖ స్త్వం చాపికోటీశ్వర-
స్త్వాం జిత్వా సమరే ప్రభోః ప్రణయినీం సీతాం చ నేతుం క్షమః।
కిం తు ప్రౌఢతయా పురా భగవతా రామేణ సుగ్రీవతో ।
దత్త్వా దక్షిణపాణినా వసుమతీం త్వాం హన్తు ముక్తం వచః ॥

భావము : రావణా ! వాయునందనుడను నేనొక్కరుడనే! నీవా దశముఖుడవు మరియు కోటీశ్వరుడవు. యుద్ధములో నిన్ను జయించి మా ప్రభువగు రాముని ప్రియురాలగు సీతమ్మను తీసికొని పోగలను. కాని మా శ్రీరాముడు కుడిచేతితో సుగ్రీవునకు రాజ్యమునిచ్చుచు ప్రాగల్భ్యముతో నిన్ను వధించెదనని చెప్పియున్నాడు. (కావున నిన్నిప్పుడు విడిచి పెట్టుచున్నానని భావము)

44) శ్లో ॥ శ్రుత్వాఽతికోపేన హనూమతో వచో,
దశాననో రాక్షస మేవ మబ్రవీత్ !
పార్శ్వే స్థితం మారయ ఖండశః కపిమ్ ।
పశ్యన్తు సర్వేఽసురమిత్ర బాంధవాః ॥

45) శ్లో ॥ నివారయామాస తతో విభీషణో ।
మహాసురం సాయుధ ముద్యతం వధే ।
రాజన్వధార్హో న భవేత్కథంచన ।
ప్రతాపయుక్తైః పరరాజవానరః ॥

46) శ్లో ॥ రాజధర్మవిరుద్ధం చ లోకవృత్తైశ్చ గర్హితమ్ ।
గృహ్యం తే యది రోషేణ త్వాదృశోఽపి విపశ్చితః ॥

47) శ్లో ॥ తత శ్శాస్త్రవిపశ్చి త్త్వం శ్రమ ఏవ హి కేవలమ్ ।
తస్మా త్ప్రసీద శత్రుఘ్న రాక్షసేంద్ర దురాసద ॥

48) శ్లో ॥ న ధర్మవాదే సచ లోకవృత్తే ।
న శాస్త్రబుద్ధిగ్రహణేషు చాపి ।
విద్యేత కశ్చి త్తవ వీర తుల్య-
స్త్వం హ్యుత్తమః సర్వసురాసురాణామ్ ॥

49) శ్లో ॥ యుక్తాయుక్తం వినిశ్చిత్య దూతదండో విధీయతామ్ ॥

ఇతి శ్రీరామాయణసారోద్ధారే సుందరకాండే
పంచదశ స్సర్గః

భావము : 44) ఈ విధముగా పలుకుచున్న హనుమంతుని వచనములను విని, దశకంఠుడగు రావణుడు ప్రక్కనేయున్న ఒక రాక్షసునితో – ఈ వానరుని మన మిత్రబాంధవులందరు చూచుచుండగా ముక్కలుగా నరికివేయుము అని పలికెను.

45) వెంటనే ఆయుధమును చేబూని అతనిని చంపుటకుద్యమించుచున్న ఒక రాక్షసుని విభీషణుడు వారించుచు, రావణునితో రాజా! ఈ వానరుడు శత్రువులవద్ద నుండి దూతగా వచ్చినవాడు కావున చంపదగినవాడు కాదు.

46) రాక్షసేశ్వరా ! రాజధర్మవిరుద్ధమును, లోకులందరు నిందించునట్టి, దూతవధయను ఇట్టి అకార్యము (చేయరానిపని) నీవంటి పండితులు కోపమునకు వశపడి చేయరాదు.

47) రాజా ! సకల శాస్త్రార్థ కోవిదుడవగు నీవే ఇట్లు చేయుచుండిన శాస్త్రజ్ఞాన పరిశ్రమయంతయు వ్యర్థమగును కదా! కావున శత్రునాశకుడవగు రాక్షసేంద్రా! ప్రసన్నుడవు కమ్ము.

48) వీరా ! ధర్మశాస్త్రములను విచారణచేయుటలోగాని, లోకాచార పరిరక్షణమున గాని, శాస్త్రములను మరువక బుద్ధితో!ధరించుటలో గాని, నీకు సరిసమానుడీ లోకములో నెవ్వరును లేడు. దేవాసురలందరిలోను నీవే సర్వోత్తముడవు.

దూతయగు ఈ వానరుని విషయమున యుక్తాయుక్తవిచారణ తరువాత నితనికి యథోచితమగు దండనమును విధింపుము.

ఇది శ్రీమద్రామాయణ సారోద్ధాము నందలి సుందరకాండలోని పదునైదవ సర్గము.

సర్గాంతశ్లోకసంఖ్య-(765+49=814)



షోడశ స్సర్గః

1) శ్లో ॥ తస్య త ద్వచనం శ్రుత్వా దశగ్రీవో మహాబలః ।
హనుమంతం స మీక్ష్యాథ స్వాత్మన్యేవ మమన్యత ॥

2) శ్లో ॥ కిం వానరం బ్రహ్మ పరం చ సత్యమ్ ।
సర్వస్య బీజం జగతోఽస్య విష్ణోః ।
యద్దేవదేవస్య పరం చ తేజః ।
తదేవ తేజః కపిరేష వీరః ॥

3) శ్లో ॥ వధాయ మే వైష్ణవ తేజ ఏవ ।
నిస్సంశయోఽయం కపిరూపధారీ ।
ఇత్యేవ మేత ద్బహుధా విచిన్త్య ।
విభీషణోక్తం వచనం సుపూజ్య ॥

4) శ్లో ॥ ఉవాచ రక్షోధిపతి ర్మహాత్మా విభీషణం శస్త్రభృతాం పరిష్ఠమ్ ।
దేశ కాలహితం వాక్యం భ్రాతురుత్తరమబ్రవీత్ ॥

భావము : 1) మహాబలవంతుడగు రావణుడు విభీషణుని వచనమును విని, హనుమంతుని కూడ చూచి తనలో నిట్లనుకొనెను.

2) ఈ వానరుడు నిజముగా పరబ్రహ్మమా? లేక సర్వవ్యాపియగు విష్ణువు యొక్క జగద్బీజమా? లేక దేవదేవుని యొక్క పరతేజమా? వీనిలో ఏదియో యొక తేజమీ వానరవీరుని రూపమున వచ్చియుండును.

3) నిశ్చయముగా వైష్ణవతేజమే వానర రూపమును ధరించివచ్చినది. సంశయము లేదు. ఇట్లు పలువిధములుగా నాలోచించి విభీషణుని వాక్యమును గౌరవించుచు–

4) శస్త్రధారులలో శ్రేష్ఠుడుగు విభీషణునితో దేశకాలానుగుణంగా నిట్లు పలికెను.

5) శ్లో ॥ సమ్యగుక్తం హి భవతా దూతవధ్యా విగర్హితా ।
అవశ్యం తు వధా దన్యః క్రియతామస్య నిగ్రహః ॥

6) శ్లో ॥ కపీనాం కిల లాంగూలమిష్టం భవతి భూషణమ్ ।
తదస్య దీప్యతాం శీఘ్రం తేన దగ్ధేన గచ్ఛతు ॥

7) శ్లో ॥ తతః పశ్యంత్విమం దీన మంగవైరూప్యకర్శితమ్ ।
సమిత్రజ్ఞాతయస్సర్వే బాంధవా స్ససుహృజ్జనాః ॥
లాంగూలేన ప్రదీప్తేన రక్షిభిః పరిణీయతామ్ ॥

8) శ్లో ॥ తస్య తద్వచనం శ్రుత్వా రాక్షసాః కోపకర్శితాః ।
వేష్టయన్తి స్మ లాంగూలం జీర్ణైః కార్పాసకైః పటైః ॥

9) శ్లో ॥ సంవేష్ట్యమానే లాంగూలే వ్యవర్ధత మహాకపిః ।
తైలేన పరిషిచ్యాథ తేఽగ్నిం తత్రాభ్యపాతయన్ ॥

10) శ్లో ॥ లాంగూ లేన ప్రదీప్తేన రాక్షసాం స్తా నపాతయత్ ॥

భావము : 5) దూతను చంపుట సమంజసముకాదని నీవు చెప్పినది యుక్తముగనే యున్నది. కావున చంపుట కన్న వేఱొక బంధనమువంటి దండనము విధింపవలసి యున్నది.

6) కోతులకు తోక చాలాయిష్టమైన అలంకారము. కనుక ఆ తోకను శీఘ్రముగా కాల్చుడు. ఆ కాల్చబడిన తోకతోనే ఇతడు తన ప్రభువువద్దకు వెళ్ళును.

7) పిమ్మట ఈ విధముగా అంగవైకల్యమును పొంది తిరిగి వచ్చిన ఇతని మిత్రులు జ్ఞాతులు బంధువులు చూతురు గాక!

8) రాక్షసులీతని తోకను జ్వలింపచేయుడని యాజ్ఞాపించిన వెంటనే కోపముతో కూడుకొన్నవారై –

9) చినిగిపోయిన గుడ్డపీలికలను తెచ్చి తోకకు చుట్టుసాగిరి. వారట్లు చుట్టుచున్న కొలది ఆ మహావానరుడు తన ఆకారమును పెంచసాగెను.

10) పిమ్మట వారాతోకకు గుడ్డలుచుట్టి నూనెతోతడిపి నిప్పును ముట్టించిరి. ప్రజ్వలించుచున్న తోకతో అతడు రాక్షసులను క్రిందపడద్రోసెను.

11) శ్లో ॥ రజ్జుభి స్సుదృఢం బధ్వా ధృత్వా తం బలినోఽసురాః ।
సమన్తా ద్భ్రామయామాసు శ్చోరోఽయ మితి వాదినః ॥

12) శ్లో ॥ తూర్యఘోషై ర్ఘోషయన్త స్తాడయన్తో ముహుర్ముహుః ।
హనూమతాపి త త్సర్వం సోఢం కించిచ్చికీర్షుణా ॥

13) శ్లో ॥ రాత్రౌ న హి సుదృష్టా మే దుర్గకర్మవిధానతః ।
అవశ్యమేవ ద్రష్టవ్యా మయా లంకా నిశాక్షయే ॥

14) శ్లో ॥ లంకా చారయితవ్యా వై పునరేవ భవేదితి ।
ఘోషయన్తి కపిం సర్వే చారీక ఇతి రాక్షసాః ॥

15) శ్లో ॥ స్త్రీబాలవృద్ధా నిర్జగ్ము స్తత్ర తత్ర కుతూహలాత్ ।
తం ప్రదీపిత లాంగూలం హనుమన్తం దిదృక్షవః ॥

16) శ్లో ॥ దీప్యమానే తత స్తస్య లాంగూలాగ్రే హనూమతః ।
రాక్షస్య స్తా విరూపాక్ష్య శ్శంసు ర్దేవ్యా స్తదప్రియమ్ ॥

17) శ్లో ॥ య స్త్వయా కృత సంవాద స్సీతే తామ్రముఖః కపిః ।
లాంగూలేన ప్రదీప్తేన స ఏష పరిణీయతే ॥

భావము : 11) పిదప కొందరు బలవంతులగు రాక్షసులు ఆ హనుమంతుని గట్టిగా త్రాళ్ళతో బంధించి 'ఇతడు దొంగ' ప్రకటించుచూ ఊరంతయు త్రిప్పజొచ్చిరి.

12) తూర్యవాద్యములతో నిట్లు చాటుచూ అతనిని మాటిమాటికి కొట్టసాగిరి. హనుమంతుడు కూడ తానేదియో చేయదలచినవాడై అంతను సహించెను.

13) రాత్రియగుట వలన నేను లంకాదుర్గ నిర్మాణ రహస్యములను చక్కగా చూడలేదు. రాత్రి గడచిన యీ పగటివేళ తప్పక లంకాపట్టణమును సంపూర్ణముగా సమగ్రముగా చూడవలసి యున్నది.

14) కావున మరల లంకను చూడవలయునని హనుమంతుడు తలచుచుండగా ఆ రాక్షసులు – "ఇతడు దొంగ దొంగ' యని చాటించిరి.

15) స్త్రీ బాలవృద్ధులగు జనులందరు తోకచివర నిప్పంటించబడిన హనుమంతుని చూడగోరినవారై రాసాగిరి.

16) పిమ్మట ఆ విధముగా హనుమంతుని తోకకు నిప్పంటించబడగా విరూపములు గల కన్నులు గల రాక్షస స్త్రీలు సీతకి అప్రియమగు దుర్వార్తను –

17) సీతా! నీతో మాట్లాడిన ఎఱ్ఱనిముఖముగల ఆ వానరుడు తోకకు నిప్పంటించబడినవాడై ఊరంతయు త్రిప్పబడుచున్నాడు అని చెప్పిరి.

18) శ్లో ॥ **శ్రుత్వా త ద్వచనం క్రూర మాత్మాపహరణోపమమ్ ।**
వైదేహీ శోకసంతప్తా హుతాశన ముపాగమత్ ॥

19) శ్లో ॥ **మంగళాభిముఖీ తస్య సా తదాఽఽసీ న్మహాకపేః ।**
ఉపతస్థే విశాలాక్షీ ప్రయతా హవ్యవాహనమ్ ॥

20) శ్లో ॥ ***యద్యస్తి పతిశుశ్రూషా యద్యస్తి చరితం తపః ।***
యది చాస్త్యేకపత్నీత్వం శీతో భవ హనూమతః ॥

21) శ్లో ॥ ***యది మాం వృత్త సంపన్నాం తత్సమాగమలాలసామ్ ।***
స విజానాతి ధర్మాత్మా శీతో భవ హనూమతః ॥

22) శ్లో ॥ **తత స్తీక్ష్ణార్చి రవ్యగ్రః ప్రదక్షిణ శిఖోఽనలః ।**
జజ్వాల మృగశాబాక్ష్యా శంస న్నివ శివం కపేః ॥

23) శ్లో ॥ **దహ్యమానే చ లాంగూలే చిన్తయామాస వానరః ।**
ప్రదీప్తోఽగ్ని రయం కస్మా న్న మాం దహతి సర్వతః ॥

24) శ్లో ॥ ***సీతాయాశ్చానృశంస్యేన తేజసా రాఘవస్య చ ।***
పితుశ్చ మమ సఖ్యేన న మాం దహతి పావకః ॥

25) శ్లో ॥ **వనం తావ త్ప్రమథితం ప్రకృష్టా రాక్షసా హతాః ।**
బలైక దేశః క్షపితః శేషం దుర్గవినాశనమ్ ॥

26) శ్లో ॥ **యో హ్యయం మమ లాంగూలే దీప్యతే హవ్యవాహనః ।**
అస్య సంతర్పణం న్యాయ్యం కర్తు మేభిర్గృహోత్తమైః ॥

27) శ్లో ॥ **గత్వా తు పశ్చిమద్వార సమీపం తత్ర మారుతిః ।**
సూక్ష్మో బభూవ బన్దేభ్యో విస్మృతః పునరప్యసౌ ॥

28) శ్లో ॥ బభూవ పర్వతాకార స్తత ఉత్ప్లుత్య గోపురమ్ ।

తత్రైకం స్తంభ మాదాయ హత్వా తా న్రక్షిణః క్షణాత్ ।

29) శ్లో ॥ తతః ప్రదీప్తలాంగూల స్సవిద్యుదివ తోయదః ॥

భవనాగ్రేషు లంకాయా విచచార మహాకపిః ।

భావము : 18) (రాక్షస స్త్రీలు చెప్పిన) ఆ మాటలను విని సీత సహానుభూతితో మిక్కిలి దుఃఖమును పొందినదై మనసా అగ్ని భగవానుని వేడుకొనెను.

19) మహావానరుడగు అతనికి శుభమును కోరుచున్నదై విశాలాక్షియగు వైదేహి ప్రయత్న పూర్వకముగా అగ్నిదేవునిట్లు ప్రార్థించెను.

20) అగ్నిదేవా! నే చేసిన పతిసేవ, పతిధ్యానము, నా ఏకపత్నీత్వరూప పాతివ్రత్యము అనువాని ఫలితముగా నీవు హనుమంతుని చల్లగా చూడుము. (తాపమును కలిగించవలదని భావము) మఱియు

21) ఓ హవ్యవాహనా! సచ్ఛీలతను, నా భర్త ృసమాగమాభిలాషను యదార్థముగా శ్రీరామచంద్రమూర్తి సంభావించుచున్నట్లైన హనుమంతునకు పరితాపమును కలిగింపక చల్లగా నుండుము.

22) సీతయావిధముగా ప్రార్థించిన పిమ్మట ఆ యగ్ని తీక్షణముగా ప్రకాశించుచున్నను ప్రదక్షిణముగా తిరుగుచున్న జ్వాలలతో వానరోత్తముడగు హనుమంతునకు హరిణనేత్రియగు సీత యొక్క మంగళాశాసనములను చెప్పువాని వలె చల్లగా నుండెను.

23) అట్లు బాధ లేకుండగనే తోక దహింపబడుచుండగా చూచి ఆహా! అగ్ని ఇట్లు జ్వలించుచున్నదే ! అయినను నన్నెందులకు దహించుట లేదు?

24) సీతాదేవి యొక్క అపారమగు దయచేతను, శ్రీరాముని తేజస్సు చేతను, నా తండ్రియగు వాయుదేవుని స్నేహముచేతను అగ్ని నన్ను దహించుట లేదు.

25) వనమంతయు నాచే భగ్నము గావింపబడినది. చాలామంది గొప్ప గొప్ప రాక్షసులు వధింపబడినారు. రావణుని బలములో నొక భాగము నశించినది. ఇక యీ లంకాపురి యొక్కకోటను నశింపచేయుట అను కార్యము మిగిలి యున్నది.

26) ఈ నా వాలాగ్రమున వెలుగొందుచున్న అగ్నిభగవానునకు ఈ కనబడుచున్న ఉత్తమ గృమసముదాయములచే సంతర్పణము చేయవలసి యున్నది అని తలచి –

27) లంకానగర పశ్చిమద్వార సమీపమునకు వచ్చిన తరువాత సూక్ష్మరూపమును ధరించెను. వెంటనే మరలనతడు బంధములనుండి విడివడెను.

28) తరువాత మరల పర్వతము వంటి ఆకారమును ధరించి, ఒక గోపురము పైకి ఎగిరి అక్కడనున్న ఒక స్తంభమును తీసికొని దానితో అచ్చటి రక్షకులగు రాక్షసులను క్షణకాలములో హతమార్చెను.

29) పిమ్మట ప్రజ్వలించుచున్న తోకతో మెరుపుతోనున్న మేఘమువలె లంకాపట్టణ భవనాగ్రములపై సంచరించెను.

30) శ్లో ॥ దదాహ లంకా మఖిలాం సాట్టప్రాకారతోరణామ్ ॥
అవప్లుత్య మహావేగః ప్రహస్తస్య నివేశనమ్ ॥

31) శ్లో ॥ అగ్నిం తత్ర వినిక్షిప్య శ్వసనేన సమో బలీ ।
తతోఽన్య త్పుప్లువే వేశ్మ మహాపార్శ్వస్య వీర్యవాన్ ॥

32) శ్లో ॥ వజ్రదంష్ట్రస్య చ తథా పుప్లువే స మహాకపిః ।
తథా చేంద్రజితో వేశ్మ దదాహ హరియూథపః ॥

33) శ్లో ॥ జంబుమాలే స్సుమాలేశ్చ దదాహ భవనం తతః ।
రశ్మి కేతోశ్చ భవనం సూర్యశత్రో స్తథైవ చ ॥

34) శ్లో ॥ హ్రస్వకర్ణస్య దంష్ట్రస్య రోమశస్య చ రక్షసః ।
కరాళస్య పిశాచస్య శోణితాక్షస్య చైవ హి ॥

35) శ్లో ॥ కుంభకర్ణస్య భవనం మకరాక్షస్య చైవ హి ।
వర్జయిత్వా మహాతేజా విభీషణగృహం ప్రతి ॥

36) శ్లో ॥ క్రమమాణః క్రమేణైవ దదాహ హరిపుంగవః ।
సర్వేషాం సమతిక్రమ్య రాక్షసేంద్రస్య వీర్యవాన్ ।

37) శ్లో ॥ ఆససాదాథ లక్ష్మీవాన్ రావణస్య నివేశనమ్ ।
తత స్తస్మి న్గృహే ముఖ్యే నానారత్న విభూషితే ॥

38) శ్లో ॥ మేరుమందర సంకాశే సర్వమంగళశోభితే ।
ప్రదీప్తమగ్ని ముత్సృజ్య లాంగూలాగ్రే ప్రతిష్ఠితమ్ ॥
ననాద హనుమా న్వీరో యుగాన్తజలదో యథా ॥

భావము : 30) హనుమంతుడీవిధముగా అట్టాలికాభవనప్రాకార తోరణములతో కూడిన లంకాపట్టణమునంతను పరికించి, మహావేగముతో ప్రహస్తుని ఇంటి పైకి దుమికి –

31) వాయుదేవునితో సమానమైన బలముకలవాడై ప్రహస్తుని భవనమును దహించి అట నుండి మహాపార్శ్వుని గృహమునకు అట నుండి –

32) వజ్రదంష్ట్రుని మఱియు ఇంద్రజిత్తుయొక్క ఇండ్లను దహించెను.

33) పిమ్మట జంబుమాలి, సుమాలి, రశ్మికేతువు అట్లే సూర్యశత్రుని –

34) హ్రస్వర్ణుడు, రోమశుడు, కరాళుడు, పిశాచుడు శోణితాక్షుడు అను రాక్షసుల ఇండ్లను దహించి, పిమ్మట –

35) కుంభకర్ణమకరాక్షుల ఇండ్లను దహించెను. మహేతేజస్వియగు హనుమంతుడు విభీషణుని భవనమును మాత్రము మినహాయించెను అనగా దహింప లేదు.

36) ఈ క్రమములో అందరి ఇండ్లను దహించుచూ కపిశ్రేష్ఠుడును

37) మహాపరాక్రమశాలియునగు హనుమంతుడు తుదకు రాక్షసేశ్వరుడగు రావణుని భవనమునకు వచ్చెను.

38) మేరుమందర పర్వతములను బోలిన ఆ భవనమునందు వాలాగ్రము నందు జ్వలించుచున్న అగ్నితో ప్రళయకాలాగ్నివలె ప్రజ్వరిల్లెను.

39) శ్లో ॥ లంకాధీశ్వర దివ్య సౌధనివహాన్ హైమాన్ మణిద్యోతితాన్ ।
అన్యా నాపణపుత్ర మంత్రి నిలయాన్ తాన్ కుంభకర్ణాలయాన్।
త్యక్త్వైకం తే విభీషణాలయ మసౌ సర్వాం చ లంకాపురమ్ ।
కల్పాంత జ్వలనోపమః కపిపతిః సమ్య గ్దదాహ ద్రుతమ్ ॥

40) శ్లో ॥ కాలాగ్నిరివ జజ్వాల ప్రావర్ధత హుతాశనః ।
ప్రదీప్త మగ్నిం పవనస్తేషు వేశ్మస్వచారయత్ ॥

41) శ్లో ॥ తతస్తు లంకా సహసా ప్రదగ్ధా సరాక్షసా సాశ్వరథా సనాగా ।
సపక్షిసంఘా సమృగా సవృక్షా రురోద దీనా తుములం సశబ్దమ్॥

42) శ్లో ॥ భవనాన్య వశీర్యన్త రత్నవన్తి మహాన్తి చ ।
తాని భగ్నవిమానాని నిపేతు ర్వసుధాతలే ॥

43) శ్లో ॥ క్వచి త్కింశుకసంకాశాః క్వచి చ్ఛాల్మలిసన్నిభాః ।
క్వచి త్కుంకుమసంకాశాః శిఖా వహ్నేశ్చకాశిరే ॥

44) శ్లో ॥ హనూమతా వేగవతా వానరేణ మహాత్మనా ।
లంకాపురం ప్రదగ్ధం త ద్రుద్రేణ త్రిపురం యథా ॥

45) శ్లో ॥ యాని వస్తూని లంకాయా మానీతాని దివౌకసామ్ ॥

46) శ్లో ॥ రావణేన పురా తాని వస్తూ న్యగ్నేః ప్రభావతః ।
దేవతానాం చ సంకాశం గతాని సుమహాన్తి చ ॥

47) శ్లో ॥ ఆదిత్యకోటీ సదృశస్సుతేజా లంకాం సమస్తాం పరివార్యతిష్ఠన్ ।
శబ్దై రనేకై రశనిప్రరూఢై ర్భిన్ద న్నివాండం ప్రబభౌ మహాఽగ్నిః॥

48) శ్లో ॥ అభిపేతు స్తదా ఘోరా హనూమన్తం నిశాచరాః ।
తం ప్రదీప్తైశ్చ శూలాగ్రైః పాశైః ఖడ్గైః పరశ్వథైః ॥

49) శ్లో ॥ హనూమన్తం మహావేగై రక్షిపన్నైరృతర్షభాః ।
నిహత్య చ స తాం స్తత్ర దివమేవోత్పపాత హ ॥

50) శ్లో ॥ స చ విక్రమ్య సహసా సంక్రామంశ్చ గృహా ద్గృహమ్ ।
లంకా మాదీపయాస వాయుపుత్రః ప్రతాపవాన్ ॥

51) శ్లో ॥ హా తాత హా పుత్రక కాన్త మిత్ర ।
హా జీవితం భోగయుతం సుపుణ్యమ్ ।
రక్షోభి రేవం బహుధా బ్రువద్భిః ।
శబ్దః కృతో ఘోరతర స్సుభీమః ॥

52) శ్లో ॥ అబ్ధిః కిం బడబానలేన తరణేర్బింబేన కిం వా వియత్ ।
మేఘః కిం చపలాంచలేన శశిభృత్కిం ఫాలనేత్రేణ వా ।
కాలః కిం క్షయం వహ్నినేంద్రధనుషా ధారాధరః కిం మహా-
న్మేరుః కిం ధృవమండలేన స కపిః పుచ్ఛేన ఖే రాజతే ॥

53) శ్లో ॥ ఉల్కాముఖానాం భయవిహ్వాలానామ్ ।
జలం జలం వ్యాహరతాం ముఖేభ్యః ।
నిర్గత్య వహ్ని ర్ద్విగుణప్రభావో ।
దదాహ లంకా మనిలాన్వితార్చిః ॥

54) శ్లో ॥ హా తాత పుత్ర నాథేతి క్రన్దమానా స్సమంతతః ।
వ్యాప్తాః ప్రాసాద శిఖరే ప్యారూఢా దైత్య యోషితః ॥

55) శ్లో ॥ దేవతా ఇవ దృశ్యన్తే పతన్త్యః పావకేఽఖిలాః ।
భ్రాన్త స్స రావణ స్తూర్ణం రాక్షసా నిద మబ్రవీత్ ॥

భావము : స్వర్ణమయములు, మణిప్రదీప్తములునగు లంకాధీశ్వరుని దివ్యభవనములను, మిగిలిన పణ్యవీధులను, పుత్రమిత్ర అమాత్య భవనములను, కుంభకర్ణ నివేశనములను, ఒక్క విభీషణుని భవనము తప్ప లంకాపట్టణమునంతను వానర శ్రేష్ఠుడగు హనుమంతుడు ప్రళయకాలాగ్ని సదృశుడై శీఘ్రముగా దహించెను.

హనుమంతుని వాలాగ్రమునందున్న అగ్ని ప్రళయకాలాగ్నివలె ప్రజ్వరిల్లెను. అతడా యగ్నిని ఆయా గృహములయందు ప్రసరింప జేయసాగెను.

ఈ విధముగా ఆ లంక అంతయు రాక్షసులతో, రథాశ్వగజ సమూహములు, అనేక మృగపక్షి సమూహములతోడను, వృక్ష సమూహములతో కాల్చివేయబడగా, చావగా మిగిలిన కొందరు ప్రాణులు రోదనము చేసిరి.

లంకలోని రత్నములను మహాసౌధములు, ఆ యగ్ని వేడిమికి పగిలి పోయినవి. భగ్నములైన గోపురములు భూమిపై పడిపోయినవి.

లంక దహింపబడుచున్నప్పుడు చెలరేగిన జ్వాలలు కొన్ని మోదుగ పూలవలెను, కొన్ని బూరుగుపూలవలెను మరికొన్ని కుంకుమపూవు వలెను ప్రకాశించినవి.

ప్రతాపశాలియగు హనుమంతుడు లంకానగరదాహసమయమున త్రిపురసంహారసమయమున రుద్రునిబోలి యుండెను.

పూర్వము రావణుడు స్వర్గమును జయించి దేవతలవద్దనుండి బలాత్కారముగా తీసికొని వచ్చిన వస్తువులన్నియు, అగ్నిదేవుని ప్రభావముచే నవి మరల దేవతలవద్దకే చేరినవి.

కోటిసూర్యప్రభాభాసమానమగు ఆ యగ్ని లంకను సంపూర్ణముగా చుట్టుముట్టి దహించునప్పుడు పిడుగుపాటు వంటి శబ్దములతో చెలరేగుచూ బ్రహ్మాండమును బ్రద్ధలుకొట్టుచున్నట్లుండెను.

అప్పుడు కొందరు రాక్షసులు ఆ హనుమంతుని భయంకార ఆకారములతో జ్వలించుచున్న శూల ప్రాసాద్యాయుధములను పరశువులను పట్టుకొని, హనుమంతుని దూషించుచూ నచటకు పరుగిడి వచ్చిరి.

వారినందరిని హనుమంతుడు చంపి, ఆకాశము పైకెగిరెను. అట నుండి పరాక్రమించుచూ ఒక ఇంటి నుండి మరియొక ఇంటి పైకి దుముకుచూ లంకనంతను కాల్చివేసెను.

మంటలలో చిక్కుకొని భయవిహ్వలురై, నీళ్ళు నీళ్ళని యరచుచున్న ఆ రాక్షసులయార్తనాదములతోపాటుగా వెలువడుచున్న గాలి ప్రభావముతో రెండింతలుగా మండుచూ లంకనంతను సులభముగా కాల్చివేసెను.

అప్పుడా రాక్షస స్త్రీలు హా తండ్రీ ! హా కుమారా ! నాథా ! యని ఆక్రోశించుచూ భవనముల శిఖరాగ్రములపైకెక్కి అట నుండి అగ్నిలో దుముకుచూ దేవతలవలె కనబడిరి.

అప్పుడు రావణుడు భ్రాంతితో రాక్షసులనందరిని పిలిచి ఇట్లు పలికెను.

56) శ్లో ॥ శీఘ్రం రక్షత వాజివారణ గృహాన్ శయ్యాగృహాన్ స్త్రీగృహాన్ ।
రత్నాగార ధనాలయం బలవతా వాతేన దీప్తో౽నలః ।
ధూమవ్యాకులనేత్ర వక్త్రయువతీవక్షః స్థలే తాడనాత్ ।
క్రన్దద్బాలక వృద్ధభీతవనితా హాహారవ శ్శ్రూయతే ॥

57) శ్లో ॥ నికుంభ కుంభోదర కుంభకర్ణ-
కుంభై రలం కేవలనామధేయైః ।
మండోదరీమందిర పావకో౽యం
పానీయమానీయన కై ర్వినీతః॥

భావము : ఓ సేవకులారా! వేగముగా పోయి గుఱ్ఱపుశాలలను, ఏనుగుల గృహములను, పడకటిండ్లను, అంతఃపురములను, రత్నాగారములను, ధనాగారములను సంరక్షించుడు. బలీయమగు అగ్ని, వేగముతో వీచబడుచున్న వాయువుతో ప్రజ్వలించుచున్నది. పొగలచే మండుచున్న కళ్ళు ముఖములు కల యువతులు గుండెను బాదుకొనుచుండగా భయముతో బాలురు, వృద్ధులు హాహాకారములు చేయుచున్న ఆక్రందనములు వినబడుచున్నవి.

నికుంభ, కుంభోదర, కుంభకర్ణ, కుంభులను పేర్లు పెట్టుకున్నంత మాత్రాన ప్రయోజనమేమున్నది. మండోదరీ మందిరమున జ్వలించుచున్న అగ్నిని ఆర్పుటకై యొక కడవెడు నీటిని తెచ్చువారలే కరువైరి గదాయని రావణుడు వాపోయెను.

58) శ్లో ॥ స రాక్షసాం స్తా న్సుబహూంశ్చ హత్వా,
వనం చ భఙ్క్త్వా బహుపాదపం తత్ ।
విస్సృజ్య రక్షోభవనేషు చాగ్నిమ్
జగామ రామం మనసా మహాత్మా ॥

59) శ్లో ॥ దేవాశ్చ సర్వే మునిపుంగవాశ్చ
గంధర్వ విద్యాధర నాగయక్షాః ।
భూతాని సర్వాణి మహాన్తి తత్ర,
జగ్ముః పరాం ప్రీతి మతుల్యరూపామ్ ॥

60) శ్లో ॥ చందనదారువినిర్మితభిత్తిమ్
కాంచనరత్న విచిత్రితక్లిప్తిమ్।
దైత్యపురీం పరిదహ్య కృతార్థ-
స్సిద్ధి ర్మహాన్ హనుమా న్నిరయాయ ॥

ఇతి శ్రీ రామాయణసారోద్ధారే సుందరకాండే
షోడశ స్సర్గః

భావము : హనుమంతుడీ విధముగా చాలామంది రాక్షసులనుచంపి, బహువిధములైన వృక్షములతో శోభిల్లు వనమునంతను భగ్నము గావించి, రాక్షసుల భవనములలో అగ్నిని నిక్షేపించి (యనగా వానిని దహించి), మనస్సుతో రాముని భజించుచు బయలు దేరెను.

అచట నా రావణ భవనములలో (బందీలుగా) నున్న దేవతలు, ముని ముఖ్యులు, గంధర్వులు, విద్యాధరులు, నాగులు, యక్షులు, సమస్తములగు భూతగణములు అందరును సాటిలేని అనగా చెప్పనలవికాని సంతోషమును అనుభవించిరి.

శ్రీ చందనదారు శకలములతో నిర్మించబడినవదియు, రత్న ఖచితములైన బంగారుగోడలు కలదియునగు లంకా పట్టణమును పూర్తిగా దహించుటలో కృతకృత్యుడైన హనుమంతుడు సిద్ధిని సాధించిన మహాత్ముని వలె మరలెను.

ఇది శ్రీమద్రామాయణ సారోద్ధారము నందలి సుందరకాండలో పదునారవ సర్గము.

సర్గాంతశ్లోకసంఖ్య-(814+60=874)

సప్తదశ స్సర్గః

శ్రీమహాదేవ :-

1) శ్లో ॥ లంకాం సమస్తాం సందీప్య లాంగూలాగ్నిం మహాబలః ।
నిర్వాపయామాస తదా సముద్రే హరిసత్తమః ॥

2) శ్లో ॥ అవేక్ష్య హనుమాన్ లంకాం చిన్తయామాస వానరః ।
వినష్టా జానకీ నూనం న హ్యదగ్ధః ప్రదృశ్యతే ॥

3) శ్లో ॥ లంకాయాం కశ్చి దుద్దేశ స్సర్వా భస్మీకృతా మయా ।
యదర్థ మయం మారంభ స్తత్కార్య మవసాదితమ్ ।
తస్య క్రోధాభిభూతేన మయా మూలక్షయః కృతః ॥

4) శ్లో ॥ ప్రథితం త్రిషు లోకేషు కపిత్వ మనవస్థితమ్ ।
ఇహైవ ప్రాణసన్న్యాసో మమాపి హ్యద్య రోచతే ॥

5) శ్లో ॥ కి మగ్నౌ నిపతా మ్యద్య ఆహోస్వి ద్బడబాముఖే ।
శరీర మాహో సత్వానాం దద్మి సాగరవాసినామ్ ॥

6) శ్లో ॥ ఇతి చిన్తయత స్తస్య నిమిత్తా న్యుపపేది రే ।
శుశ్రావ హనుమా న్వాక్యం చారణానాం మహాత్మనామ్ ॥

భావము : 1) మహాదేవుడు పార్వతికి చెప్పుచున్నాడు. వానరోత్తముడగు హనుమంతుడీ విధముగా లంకాపట్టణమునంతను దహించి, మహాబలియగు నతడు తన తోకను సముద్రమునందార్పివేసెను.

2) దహింపబడిన లంకను చూచి, హనుమంతుడు తనలో నిట్లాలోచించు కొనసాగెను. లంకలో దహింపబడని ప్రదేశమేదియును కానరాదు. కావున నిశ్చయముగా సీత దహింపబడియుండును.

3) లంకలో నేను దహింపని తావే లేదు. లంక పూర్తిగా నాచే దహింపబడినది. నేనెవరి కొరకీ కార్యమును చేసితినో అది నాచేతనే నశింపజేయబడినది. క్రోధావేశములకు లోబడి చేసిన ఈ పనిచే కార్యము మొదలంట నశించినది.

4) ముల్లోకములలో కూడ కపిత్వము కడుచంచలమైనదిగా ప్రసిద్ధమైనది. ఇప్పుడే ఇచ్చటనే ప్రాణత్యాగముచేయవలెనని యున్నది. అందులకై-

5) అగ్నిలోపడి మరణించెదను. లేనిచో బడబాగ్నిలో పడి, యీ నా శరీరమును, మత్స్యమకరాదిసముద్రజీవులకాహారముగా నిచ్చెదను గాక!

6) ఈ విధముగా నాలోచించున్న యతనికి కొన్ని శుభశకునములు కనబడెను. అపుడా హనుమంతుడాకాశమునసంచరించు చారణులను మహాత్ముల వాక్యములను వినెను.

7) శ్లో ॥ దగ్ధేయం నగరీ సర్వా సాట్టప్రాకారతోరణా ।
జానకీ న చ దగ్ధేతి విస్మయోఽద్భుత ఏవ నః ॥

8) శ్లో ॥ వాయోః ప్రియసఖిత్వాచ్చ సీతయా ప్రార్థితోఽనలః ।
న దదాహ హరేః పుచ్ఛం బభూవాత్యన్తశీతలః ॥

9) శ్లో ॥ యన్నామసంస్మరణధూత సమస్త పాపా ।
స్తాపత్రయానలమపీహ తరన్తి సద్యః ।
తస్యైవ కిం రఘువరస్య విశిష్టదూతః ।
కిం తప్యతే కథ మసౌ ప్రకృతానలేన ॥

10) శ్లో ॥ ఇతి శుశ్రావ హనుమాన్ వాచం తా మమృతోపమామ్ ।
బభూవ చాస్య మనసో హర్ష స్తత్కాల సంభవః ॥

భావము : 7) ఈ లంకాపురి బురుజులు, ప్రాకారములు, తోరణద్వారములతో సహా పూర్తిగా దగ్ధమయ్యెను. కాని సీతయొక్కతె మాత్రము దహింపబడకపోవుట మిక్కిలి ఆశ్చర్యకరమైన విషయము.

8) అగ్ని భగవానుడు వాయుదేవునకు మిత్రుడగుట చేతను, సీతచే ప్రార్థింప బడినవాడై వానరుడగు హనుమంతుని తోకను కాల్చలేదు. పైగా మిక్కిలి శీతలకరుడుగానయ్యెను.

9) శ్రీరాముని నామస్మరణమాత్రము చేతనే సమస్త పాపములు నశించుచుండగా (సంతత నామ పారాయణపరుడగు హనుమను) తాపత్రయ మెట్లు పరితపింప చేయగలదు! పైగా రామదూత యగు హనుమంతుని ఈ సాధారణాగ్ని ఎట్లు తపింపచేయగలదు!

10) ఈ విధముగా అమృతతుల్యములగు వాక్కులు వినుచున్న హనుమంతునకు తాత్కాలికముగా మహానందము కలిగెను.

11) శ్లో ॥ తతస్తు శింశుపామూలే జానకీం పర్యుపస్థితామ్ ।
అభివాద్యాబ్రవీద్దిష్ట్యా పశ్యామి త్వా మిహాక్షతామ్ ॥

12) శ్లో ॥ నీత్వా పున ర్ముద్రికాం త్వం రాఘవాయ సమర్పయ ।
ఇత్యుక్త్వా తత్క రే సీతా దదౌ శ్రీరామముద్రికామ్ ॥

భావము : 11) పిమ్మట శింశుపావృక్షమూలమున ఆసీనురాలైన సీతను చూచి, నమస్కరించి అమ్మా ! దైన యోగముచే నీకెట్టి హానియు సంభవించలేదు అని పలికెను.

12) అప్పుడు సీతమ్మ హనుమా! నీవీ శ్రీరామముద్రికను తీసికొని మరల రామునకు సమర్పించుమని పలికి, ఆ శ్రీరామాంగుళీయకమును హనుమంతుని చేతికిచ్చెను.

హనుమానువాచ –

13) శ్లో ॥ ఆజ్ఞాపయతు మాం దేవి భవతీ రామసన్నిధిమ్ ।
గచ్ఛామి రామ స్త్వాం ద్రుష్టు మాగమిష్యతి సానుజః ॥

14) శ్లో ॥ ఇత్యుక్త్వా త్రిః పరిక్రమ్య జానకీం మారుతాత్మజః ।
జగామ పర్వతస్యాగ్రం గన్తుం సారం మహోదదధేః ॥

15) శ్లో ॥ తత్రగత్వా మహాసత్వః పాదాభ్యాం పీడయన్గిరిమ్ ।
జగామ వాయువేగేన పర్వతశ్చ మహీతలమ్ ॥
గతో మహీసమానత్వం త్రింశద్యోజనమాయతః ।

భావము : హనుమంతుడిట్లు చెప్పుచున్నాడు.

13) దేవీ! నేనిప్పుడు శ్రీరామ సన్నిధికి పోవుచున్నాను. నాకు వెడలుటకనుజ్ఞ నిమ్ము, రాముడు తన తమ్మునితో కూడ నిన్ను చూచుటకు త్వరలో రానున్నాడు.

14) అని పలికి ముమ్మారామెకు ప్రదక్షిణమునుచేసి, మరల నమస్కరించి వాయునందనుడగు హనుమంతుడు సముద్రపుటావలియొడ్డును చేరుటకై పర్వతాగ్రము పైకి చేరుకొనెను.

15) అట్లా పర్వతశిఖరమునధిరోహించి మహాబలియగు ఆ హనుమంతుడు పర్వతమును పాదములచే త్రొక్కి వాయువేగముతో బయలుదేరగా ఆ పర్వతము భూతలముతో సమానమైన ఎత్తుకలదిగా నయ్యెను. అనగా కృంగి చదునైపోయెనని భావము. ఇట్లా ముప్పదియోజనముల యెత్తుగల పర్వతము నేలతో సరిసమానమైన చదరమయ్యెను.

16) శ్లో ॥ ఏతస్మిన్నంతరే బ్రహ్మా దదౌ పత్రం స విస్తరమ్ ॥
యద్యత్కృతం మారుతినా లంకాయాం తస్య సూచకమ్ ॥

17) శ్లో ॥ త ద్గృహ్య మారుతి ర్వేగా న్నత్వా పృష్ట్వా విధిం యయౌ ।
తత ఉడ్డీయ వేగేన యయా వాకాశవర్త్మనా ॥

18) శ్లో ॥ ఆప్లుత్య చ మహావేగః పక్షవానివ పర్వతః ।
మారుతి ర్గగనాంతస్థో మహాశబ్దం చకార సః ॥

19) శ్లో ॥ సమారుత ఇవాకాశం మారుతస్యాత్మ సంభవః ।
ప్రపేదే హరిశార్దూలో దక్షిణా దుత్తరాం దిశమ్ ॥

20) శ్లో ॥ తతో దృష్ట్వా కపీం స్తత్ర దృష్ట్వైకం మునిసత్తమమ్ ।
కంచిద్గర్వ సమాతిష్ట స్తం మునిం ప్రాహ మారుతిః ॥

21) శ్లో ॥ మయా శ్రీరామకార్యం తు కృత మస్తి మునీశ్వర ।
పానీయం పాతు మిచ్ఛామి దర్శయస్వ జలాశయమ్ ॥

భావము : 16) ఇంతలో బ్రహ్మ లంకాపట్టణములో వాయునందనుడు చేసిన కార్యమునంతను శ్లోక రూపమున సూచించు పత్రము నొకదానిని సవిస్తరముగా వ్రాసి ఆంజనేయునకిచ్చెను.

17) హనుమంతుడు దానిని గ్రహించి బ్రహ్మకభివాదనము చేసి అతని వద్ద సెలవు గొని మహావేగముతో అట నుండి మహావేగముతో పైకెగసి ఆకాశ మార్గమున బయలుదేరెను.

18) అప్పుడా హనుమంతుడు మహావేగముతో రెక్కలతో నున్న పర్వతము వలె ఎగురుచున్నవాడై ఆకాశమధ్యమునకు పోయి అట నుండి మహానాదమును చేసెను.

19) వాయుపుత్రుడగు హనుమంతుడు వాయువు ఆకాశములోనికి ప్రవేశించునట్లు దక్షిణ దిక్కునుండి ఉత్తరదిశ కేగెను.

20) పిమ్మట ఆ ప్రదేశమున అతడు వానరులను వారితోపాటుగా నొక మునీంద్రుని చూచెను. హనుమంతుడు ఆ మునిని చూచి కొద్దిగా గర్వమును పొందినవాడై యతనితో నిట్లనెను.

21) శ్రీ మునీశ్వరా! నేను శ్రీరామకార్యమును నెరవేర్చితిని. దాహము గొనిన నేను పానీయమును త్రాగగోరుచున్నాను. కావున జలాశయము నొకదానిని చూపుము.

22) శ్లో ॥ తర్జన్యా దర్శయామాస ముని స్తస్మై జలాశయమ్ ।
తత స్స మారుతి ర్ముద్రాం మణిపత్రం మునేః పురః ।
సంస్థాప్య నీరం పాతుం వై యయౌ కాసారముత్తమమ్ ॥

23) శ్లో ॥ తత స్తత్ర కపిః కశ్చి న్ముద్రికాం మునిసన్నిధౌ ।
కమండలౌ ప్రాక్షిప త్స యయౌ తావచ్చ మారుతిః ॥

24) శ్లో ॥ గృహీత్వా తం మణిం పత్రం మునిం పప్రచ్ఛ ముద్రికామ్ ।
ముని ర్భ్రూసంజ్ఞయా తస్మై కమండలు మదర్శయత్ ॥

భావము : 22, 23) అపుడా మునీశ్వరుడు తన చూపుడు వ్రేలితో మౌనముగా హనుమంతునకు ఎదురుగా నొక జలాశయమును చూచెను. హనుమంతుడు తన వద్దనున్న ముద్రికను, మణిని, పత్రమును ముని యెదట నుంచి తానొక్కడే నీటిని త్రాగుటకై ఆ యుత్తమ జలాశయమున కేగెను. హనుమంతుడా ముద్రికను ముని వద్ద నున్న కమండలములో నుంచి కాసారమునకు వెళ్ళెను.

24) తరువాత హనుమంతుడు తిరిగి వచ్చి మణిని పత్రమును తీసికొని ముద్రిక ఏదని మునినడిగెను. ముని కనుసన్నలతో అతనికి కమండలమును చూపెను.

25) శ్లో ॥ తావ ద్దదర్శాంజనేయ స్తస్మిన్ శ్రీరామముద్రికాః ।
దృష్ట్వా సహస్రశ స్తత్ర చకితః ప్రాహ తం మునిమ్ ॥

26) శ్లో ॥ కుతస్త్విమా ముద్రికాశ్చ వద కా మమ ముద్రికా ?
ఏ తాసు త్వం మునిశ్రేష్ఠ తదా తం ముని రబ్రవీత్ ॥

భావము : 25) అంతలో హనుమంతుడా కమండలమునందనేక శ్రీరామ ముద్రికలను చూచెను. అందులో వేలాది ముద్రికలను చూచి యాశ్చర్య చకితుడై ఆ మునితో నిట్లనెను.

26) ఓ మునిశ్రేష్ఠుడా ! ఇన్ని ముద్రికలెచ్చటి నుంచి వచ్చినవి? వీనిలో నా ముద్రిక యేదియో చెప్పుము అని యడిగెను. అప్పుడా ముని ఇట్లు చెప్పెను.

27) శ్లో ॥ యదా యదా వాయుపుత్రై స్సీతానాం రాఘవాజ్ఞయా ।
లంకాం గత్వా సమానీతా శ్శుద్ధిముద్రా స్తదా తదా ।

28) శ్లో ॥ నిక్షిప్తా స్త్విమా స్సర్వాః పశ్యై తాసు స్వముద్రికామ్ ॥

29) శ్లో ॥ త న్మునే ర్వచనం శ్రుత్వా గతగర్వ స్త మబ్రవీత్ ।
కియన్తో రాఘవా శ్చాత్ర సమాయాతా మునీశ్వర! ॥

30) శ్లో ॥ ముని స్తం ప్రాహ నిష్కాస్య గణయస్వాద్య ముద్రికాః ।
బహిః క్షిప న్మారుతి స్స నాన్తం తాసాం దదర్శ వై ॥

31) శ్లో ॥ పునః కమండలౌ కృత్వా మునిం నత్వా కపిః క్షణమ్ ॥
చిన్తయామాస మనసి మాదృశైః శతశః పురా ॥

32) శ్లో ॥ సమానీతాఽస్తి సీతాయా శ్శుద్ధిః కా గణనాస్య మే ।
ఇది నిశ్చిత్య మనసి గతగర్వ స్తదా కపిః ।

33) శ్లో ॥ పునరాకాశ మార్గేణ యయౌ యత్రాంగదాదయః ॥

భావము : 27, 28) పూర్వము ఎప్పుడెప్పుడు వాయునందనులైన ఆంజనేయులు శ్రీరాముని యాజ్ఞచే సీతాన్వేషణమునకై లంకకు వెళ్ళి ఆయా సీతల నుండి శుద్ధి ముద్రికలను తెచ్చిరో ఆయా ముద్రికలు అప్పుడప్పుడీ కమండలము నందుంచబడినవి. ఆయా ముద్రికలలో నీవు తెచ్చిన ముద్రికను నీవు చూచుకొనుము.

29) ఆ మునీశ్వరుని మాటలను విన్న హనుమంతుడు గర్వమును వీడి యతనితో "మునీశ్వరా! ఇట్లెందరు రాఘవులిచటికి విచ్చేసిరో తెలుపుమని పలికెను.

30) అప్పుడా ముని హనుమంతునితో ఆ ముద్రికలన్నింటిని బయటకు తీసి లెక్కపెట్టుమనెను. వానిని బయటకు తీయుచూ హనుమంతుడు వాని అంతయును కనుగొనలేకపోయెను.

31) మనుమంతుడు మరల నా ముద్రికలను కమండలములో వేసి, మునికి నమస్కరించి తనలో "ఇంతకు పూర్వము నా వంటి వారెందరో వందలాదిగా వానరులు –

32) ఇట్టి సీతాశుద్ధిముద్రికలెన్నింటినో తెచ్చియున్నారు. వానిలో నాదొక లెక్కయా అని మనసులో నిశ్చయించుకొని గర్వమును విడనాడెను.

33) తరువాత వానరవీరుడు హనుమంతుడు మరల ఆకాశమార్గమున అంగదాదులన్న చోటికి బయలుదేరెను.

శ్రీపాదుక : ఈ హనుమద్గర్వ నిర్వాపన వృత్తాంతము ఆనంద రామాయణము లోనిదిగా అథోజ్ఞాపికలో తెలియజేయబడినది. హనుమంతుడు సర్వకార్య నిర్వహణ దక్షుడు. బుద్ధిమద్వరిష్ఠుడు. అతనికి సాటి యగు మేటి వేఱొకడు లేదు. అతడు శ్రీరామ కార్యమును సాధించి కృతకృత్యుడైనాడు. ఈ విధమైన అతని యాత్మనిర్భరత అతనిలోని యహంతను మేల్కొల్పినది. అతనిలో సహజమగు దర్పముదయించినది. సాధక ప్రవరుడైన సిద్ధునికిది లక్ష్యసాధనలో అవరోధమును కలిగించును. నిరంతర రామనామ పరాయణుడు, రామకార్యనిరతుడునగు హనుమకీ మాయ అవరోధమును కల్పింపక జ్ఞానోదయమును కలిగించినది.

''మామేవ యే ప్రపద్యన్తే మాయామేతాం తరన్తి తే'' అని కదా భగవద్వచనము! ఇంతకుపూర్వము బుద్ధియోగమునను గ్రహించినట్లే శ్రీరామచంద్రప్రభువిప్పుడతనిని మాయావినిర్ముక్తుని గావించినాడని భావము.

34) శ్లో ॥ పర్వతేంద్ర సునాభం చ సముపస్పృశ్య వీర్యవాన్ ।
జ్యాముక్త ఇవ నారాచో మహావేగోఽభ్యుపాగతః ॥

35) శ్లో ॥ స కించి దనుసంప్రాప్త స్సమాలోక్య మహాగిరిమ్।
మహేంద్రం మేఘసంకాశం ననాద హరిపుంగవః ॥

36) శ్లో ॥ తం శ్రుత్వా వానరా స్సర్వే జ్ఞాత్వా మారుతి మాగతమ్ ।
హర్షేణ మహతాఽఽవిష్టా శ్శబ్దం చక్రు ర్మహాస్వనమ్ ॥

37) శ్లో ॥ తే ప్రీతాః పాదపాగ్రేషు గృహ్య శాఖాసు విష్ఠితాః ।
వాసాంసీవ ప్రశాఖాశ్చ సమావిధ్యన్త వానరాః ॥

భావము : 34) ఇట్లాకాశమార్గమున ప్రయాణించుచు మహావీరుడగు హనుమంతుడు బాణమువలె తీవ్రమైన వేగముతో పయనించసాగెను.

35) అట్లు మైనాకుని వీడి కొలది దూరములో ఒక మిట్ట ప్రదేశమును చూచి అటనుండి మహామేఘమును పోలిన పొడవు నిడివి కల మహేంద్ర పర్వతమును చూచి, మిక్కిలి సంతోషముతో గర్జించెను.

36) ఆ మహాగర్జనమును విని వానరులందరు హనుమంతుని తిరిగి వచ్చుచున్న వానినిగా గ్రహించి, గొప్ప సంతోషముతో కూడినవారై మహాశబ్దమును చేసిరి.

37) వారందరు చెట్టుకొమ్మల చివరల కెక్కి తమవారినాహ్వానించుటకు లోకాలు వస్త్రములనూపుచున్నట్లుగా, పూవులు పండ్లు కల చెట్లకొమ్మలను చేతధరించి అతనినాహ్వానింపసాగిరి.

38) శ్లో ॥ జాంబవా న్స హరీన్ సర్వా నిదం వచన మబ్రవీత్ ॥

39) శ్లో ॥ శబ్దేనైన విజానీమః కృతకార్య స్సమాతగతః ।
హనుమానేవ పశ్యధ్వం వానరా వానరర్షభమ్ ॥

40) శ్లో ॥ ఏవం బ్రువత్సు నీరేషు వానరేషు స మారుతిః ।
అవతీర్య గిరే ర్మూర్ధ్ని వానరా న్వీక్ష్య సాదరమ్ ॥

41) శ్లో ॥ దృష్టా సీతేతి విక్రాన్త స్సంక్షేపేణ న్య వేదయత్ ।
తతో దృష్టేతి వచనం మహార్థ మమృతోపమమ్ ।
నిశమ్య మారుతే స్సర్వే ముదితా వానరా భవన్ ॥

భావము : 38) అప్పుడు సంతోషించిన వానరులనందరును చూచిన జాంబవంతుడు వారితో నిట్లనెను. అతడొనరించిన సింహనాదము చేతనే అతడు కార్యమును నిర్వర్తించి వచ్చినాడను విషయము తెలిసినది.

39) వానరవీరులారా వానరోత్తముడగు హనుమంతుడతడే! చూడుడు. ఇటే వచ్చుచున్నాడు అని వారు పలుకుచుండగనే–

40) వాయునందనుడు వేగముగా గిరి శిఖరముపై దిగి, వానరులనందరను అమందానందముతో చూచుచూ– "చూచితిని సీత"నని సంక్షేపముగా పలికెను.

41) చూచితినను మహార్థవంతమగు అమృతతుల్యమగు వచనమును మున్ముందుగా మారుతి వచించుటచే వానర వీరులందరు మహానందము నందిరి.

శ్రీపాదుక : 'దృష్టా సీతా' యని ముందుగా దృష్టా అని పలుకుటచే సీత తనచే చూడబడినదను విషయమును సుస్పష్టముగా తెలియజేసి హనుమంతుడు అందరకు నమనందానందమును కలిగించెను. ఇది అతని వాగ్మిత్వమును సూచించును.

42) శ్లో ॥ ప్రహృష్టవదనా స్సర్వే త మరోగముపాగతమ్ ॥
43) శ్లో ॥ ఉపాయనాని చాదాయ మూలాని చ ఫలాని చ ।
ప్రత్యర్చయన్ హరిశ్రేష్ఠం హరయో మారుతాత్మజమ్ ॥
44) శ్లో ॥ క్ష్వేళ న్త్యన్యే నద న్త్యన్తే గర్జం త్యన్యే మహాబలాః ।
చక్రుః కిలకిలా మన్యే ప్రతిగర్జన్తి చాపరే ॥
45) శ్లో ॥ కేచి దుచ్ఛ్రితలాంగులాః ప్రహృష్టాః కపికుంజరాః ।
అంచి తాయతదీర్ఘాణి లాంగులాని ప్రవివ్యధుః ॥
46) శ్లో ॥ అపరే చ హనూమన్తం వానరా వారణోపమమ్ ।
ఆప్లుత్య గిరిశృంగేభ్యః సంస్పృశన్తి స్మ హర్షితాః ॥
47) శ్లో ॥ తతోంగదం హనుమన్తం జాంబవంతం చ వానరాః ।
పరివార్య ప్రముదితా భేజిరే విపులా శ్శిలాః ।
జాంబవాన్కార్య వృత్తాంత మపృచ్ఛ దనిలాత్మజమ్ ॥
48) శ్లో ॥ స నియుక్త స్తత స్తేన సంప్రహృష్టతనూరుహః
ప్రణమ్య శిరసా దేవ్యై సీతాయై ప్రత్యభాషత ॥

భావము : 42) ముఖములలో సంతోషము వెల్లి విరియుచుండగా ఆ వానర వీరులు క్షేమముగా తిరిగి వచ్చిన ఆంజనేయుని కంద, మూల, ఫలాదులను బహూకరించి..

43) ఆ వానరోత్తమునెంతగనో అభినందించిరి. వారిలో కొందరు సింహనాదము గావించిరి, కొందరు బిట్టరిచి బొబ్బలు వెట్టిరి, మరి కొందరు గర్జించిరి.

44-46) ఇంకొందరు కిలకిలారావములు చేసిరి, కొందరు ప్రతిగర్జనలు చేయుచూ, కొందరు తోకలను పెకెత్తి, మదగజముల వంటి మరి కొందరు తమ అతి పొడవైన లాంగూలములను విదిలించుచూ నేలను కొట్టసాగిరి. కొందరు మహాగజము వలె భాసించు అతని వద్దకు ఎగిరి వచ్చి, కొండకొనలపై నుండి దుమికి వచ్చి ఆనందముతో నతనిని స్పృశింపసాగిరి.

47) తరువాత వానరులందరు అంగద, హనుమంత, జాంబవంతుల చుట్టును సంతోషముతో చేరి అచ్చటనున్న విశాలములైన బండఱాళ్ళను ఆశ్రయించిరి. అప్పుడు జాంబవంతుడు వాయునందనుడగు ఆంజనేయుని జఱిగిన వృత్తాంతమును చెప్పవలసినదని కోరెను.

48) ఆ విధముగానతనిచే నాదేశింపబడినవాడై హనుమంతుడు ఆనందముతో శరీరము పులకించుచుండగా సీతమ్మకు తలతో నమస్కరించి ఇట్లు చెప్పనారంభించెను.

49) శ్లో ॥ దృష్టా సీతా మయా లంకా ధర్షితా చ సకాననా ॥

50) శ్లో ॥ తత్రాహం సర్వరాత్రం తు విచిన్వ న్జనకాత్మజామ్ ।
సంభాషితో దశగ్రీవ స్తతోఽహం పునరాగతః ॥

51) శ్లో ॥ తపసా ధారయే ల్లోకా న్క్రుద్ధో వా నిర్దహేదపి ।
సర్వథాతి ప్రవృద్ధోఽసౌ రావణో రాక్షసాధిపః ।
తస్య తాం స్పృశతో గాత్రం తపసా న వినాశితమ్ ॥

52) శ్లో ॥ త న దగ్ని శిఖాం కుర్యా త్సంస్పృష్టా పాణినా సతీ ।
జనక స్యాత్మజా కుర్యా ద్యత్క్రోధ కలుషీకృతా ॥

భావము : 49) సీతను నేను చూచితిని. లంక అశోకవనితో కూడ దహింపబడి భగ్నము గావించబడినది.

50) లంకను ప్రవేశించిన రోజున రాత్రంతయు సీతను వెదకుచూ పిమ్మట మరునాడు రావణునితో మాట్లాడి వచ్చితిని.

51) రావణుడు తన దుష్కరమైన తపోబలముతో లోకములనేలుచున్నాడు. అతడే కోపించినచో లోకములను దహింపగలడు కూడా. రాక్షసరాజగు రావణుడిట్టి తపోబలముతో వర్ధిల్లుచున్నాడు.

52) అంతటి తపోబలము కలిగినను సీతాసంస్పర్శముచే నతడు దహింపబడెడి వాడే కాని, అగ్నిశిఖాసదృశయైన సీతమ్మ పాతివ్రత్యసౌశీల్యములు కలది కావున అతనిని మన్నించినదని నా తలంపు.

53) శ్లో ॥ ఆర్యాయా స్సదృశం శీలం సీతాయాః ప్లవగర్షభాః ।
ఏత త్సర్వం మయా తత్ర యథావ దుపపాదితమ్ ॥

54) శ్లో ॥ అత్ర యన్న కృతం శేషం త త్సర్వం క్రియతా మితి ॥
అహ మేకోపి పర్యాప్త స్సరాక్షసగణః పురీమ్ ।

55) శ్లో ॥ తాం లంకాం తరసా హన్తుం రావణం చ మహాబలమ్ ॥
కిం పున స్సహితో వీరై ర్బలవద్భిః కృతాత్మభిః ।
కృతాస్త్రైః ప్లవగై శ్శూరైర్భవద్భి ర్విజయైషిభిః ॥

భావము : ఓ వానరోత్తములారా ! సీతాదేవికా స్వభావము తగినదే ఇదంతయు నున్న దున్నట్లు మీకు చెప్పితిని.

54) ఈ రామకార్యమున మిగిలియున్న దానిని మీరందరు కూడ చేయుడు అని చెప్పి మరల హనుమంతుడు వారితో –

55) నేనొక్కడనే బలముతో ఆ లంకానగరమును రాక్షససేనలతోపాటు రావణుని కూడ నశింపచేయగలను. అట్టి నాకు వీరులు, బలవంతులు, శూరులు, జయేచ్ఛ కలవారును దైవాంశ సంభూతులునైన మీ వంటి వారు సహాయముండగా రావణుని జయించుటలో సంశయమే లేదు.

56) శ్లో ॥ తస్య త ద్వచనం శ్రుత్వా వాలిసూను రభాషత ।
అయుక్తం తు వినా దేవీం దృష్టవద్భిశ్చ వానరాః ॥

57) శ్లో ॥ వాయుసూనో ర్బలేనైవ దగ్ధా లంకేతి న శ్రుతమ్ ।
న హి నః ప్లవనే కశ్చి న్నాపి కశ్చి త్పరాక్రమైః ॥

59) శ్లో ॥ తుల్యా స్సామర దైత్యేషు లోకేషు హరిసత్తమాః ।
జిత్వా లంకాం సరక్షౌఘం హత్వా తం రావణం రణే ॥
సీతా మాదాయ గచ్ఛామ స్సిద్ధార్థా హృష్టమానసాః ॥

60) శ్లో ॥ భవతా మననుజ్ఞాతో విక్రమో మే రుణద్ధి మామ్ ।
త మేవం కృత సంకల్పం జాంబవా న్వాక్య మబ్రవీత్ ॥

61) శ్లో ॥ న తావ దేషా మతి రక్షమాణో
యథా భవాన్పశ్యతి రాజపుత్ర ।
యథా తు రామస్య మతి ర్నివిష్టా
తథా భవాన్పశ్యతు కార్యసిద్ధిమ్ ॥

ఇతి శ్రీరామాయణసారోద్ధారే సుందరకాణ్డేసప్తదశ స్సర్గః

భావము : 56) హనుమంతుని వాక్యమును విన్న వాలిపుత్రుడగు అంగదుడు వారితో – 'సీతను చూచియు ఆమెను తీసికొని పోకుండుట మనకు తగదు'.

57) వాయుపుత్రుని బలముచే లంక దహించబడినదని వినియున్నాము. అతని వలె నెగిరి సముద్రమును దాటుటలో కాని, పరాక్రమమును చూపుటకు కాని సరియగువారులేరు.

58) ఓ వానరోత్తములారా ! దేవదానవులెవ్వరిలోను మనతో సమానులు లేరు. లంకను జయించి, రాక్షససేనలతోపాటు రావణుని యుద్ధములో చంపి–

59) సీతను తీసికొని కృతార్థులమై సంతుష్ట హృదయములతో, మీ యనుమతిలో తిరిగి వెళ్ళెదము. ఈ విషయమున పరాక్రమ ప్రదర్శనమే యుక్తమని నా తలంపు – అని పలికెను.

60) ఇట్లు సంకల్పించిన అంగదునితో జాంబవంతుడిట్లు పలికెను.

61) 'రాజకుమారా! నీ యాలోచనము సమంజసముగనే యున్నది. మనము ఈ కార్యమును చేయగలవారమే. కాని, శ్రీరాముని యనుమతిలేనిదే మన కిట్టి పనిచేయుట యుక్తము కాదు. కావున ఆ రామునిబుద్ధి ననుసరించి మనము ప్రవర్తించి కార్యసిద్ధిని చేకొనవలసి యున్నది' అని పలికెను.

ఇది శ్రీమద్రామాయణ సారోద్ధారము నందు సుందరకాండమున
పదునేడవ సర్గము.

సర్గాంతశ్లోకసంఖ్య–(874+60=934)

అష్టాదశ స్సర్గః

1) శ్లో ॥ తతో జాంబవతో వాక్య మగృహ్ణన్త వనౌకసః ।
అంగదప్రముఖా వీరా హనూమాంశ్చ మహాకపిః ॥

2) శ్లో ॥ ఇదానీమేవ గచ్ఛామో రామసుగ్రీవసన్నిధిమ్ ।
ఇత్యుక్త్వా వానరా స్సర్వే హర్షేణాలింగ్య మారుతిమ్ ॥

3) శ్లో ॥ కేచి చ్చుచుంబుర్లాంగూలం ననృతుః కేచి దుత్సుకాః ।
హనూమతా సమేతాస్తే జగ్ముః ప్రస్రవణం గిరిమ్ ॥

4) శ్లో ॥ గచ్ఛన్తో దదృశుర్వీరా వనం సుగ్రీవరక్షితమ్ ।
మధుసంజ్ఞం తదా ప్రాహు రంగదం వానరర్షభాః ॥

5) శ్లో ॥ క్షుధితాస్స్మ వయం వీర దేహ్యనుజ్ఞాం మహామతే ।
భక్షయామః ఫలా న్యద్య పిబామోఽమృతవన్మధు ॥
సంతుష్టా రాఘవం ద్రష్టుం గచ్ఛామోఽద్యైవ సానుజమ్ ॥

భావము : 1) వనవాసులగు అంగదప్రముఖులైన వానరవీరులు, మహాకపీశ్వరుడగు హనుమంతుడును అందరును జాంబవంతుని మాట నంగీకరించిరి.

2) 'ఇప్పుడే మనమందరము రామసుగ్రీవుల సన్నిధికేగుదుమని చెప్పి వానర వీరులందరు మిక్కిలి యానందములో వాయునందనుని కౌగిలించుకొనిరి.

3) వారిలో కొందరు తమ తోకలను ముద్దుపెట్టుకొనిరి. కొందరుత్సాహములో నృత్యము చేసిరి. ఇట్లా వానరులందరు అమందానందాతిశయముతో హనుమంతునితో కూడ ప్రస్రవణపర్వతమును చేరుకొనిరి.

4) అట్లు ప్రయాణించుచున్న యా వానరవీరులు మార్గములో సుగ్రీవునిచే సంరక్షింపబడుచున్న మధువనమును చూచిరి.

5) వారంతట అంగదునితో మహావీరా ! మనమందరము బాగుగా నాకలిగొని యున్నారము. ఇప్పుడే ఇచ్చట దిగి అమృతోపమమైన మధువును త్రాగి ఫలములను భుజించెదము. తరువాత సంతుష్టులమై తమ్మునితోగూడిన రాముని దర్శించుటకు వెళ్ళుదుము, అని పలికిరి.

అంగద ఉవాచ :-

6) శ్లో ॥ హనూమా న్కృతకార్యోఽయం పిబతైతత్ప్రసాదతః ।
భక్షధ్వం ఫలమూలాని త్వరితం హరిసత్తమాః ॥

7) శ్లో ॥ తతః ప్రవిశ్య హరయః పాతుమారేభిరే మధు ।
భక్షయన్తస్సుగంధీని మూలాని చ ఫలాని చ ॥

8) శ్లో ॥ గాయన్తి కేచిత్ప్రణమన్తి కేచి న్నృత్యన్తి కేచిత్ప్రహసన్తి కేచిత్ ।
పతన్తి కేచిద్విచరన్తి కేచి త్ప్లవన్తి కేచిత్ ప్రలపన్తి కేచిత్ ॥

9) శ్లో ॥ ద్రుమా ద్ద్రుమం కేచి దభిద్రవన్తే ।
క్షితౌ నగాగ్రా న్నిపతన్తి కేచిత్ ।
మహీతలా త్కేచి దుదీర్ణవేగా ।
మహాద్రుమాగ్రాణ్యభి సంపతన్తి ॥

10) శ్లో ॥ గాయన్త మన్యః ప్రహస న్నుపైతి।
హసన్త మన్యః ప్రరుద న్నుపైతి ।
రుదంత మన్యః ప్రణుద న్నుపైతి ।
నుదన్త మన్యః ప్రణద న్నుపైతి ॥

11) శ్లో ॥ తతో వనం త త్పరిభక్ష్యమాణమ్ ।
ద్రుమాంశ్చ విధ్వంసిత పత్రపుష్పాన్ ।
సమీక్ష్య కోపా ద్దధివక్త్రనామా ।
నివారయామాస కపిః కపీం స్తాన్ ॥

భావము : అంగదుడు పలికెను.

6) "ఓ వానరోత్తములారా! మన హనుమంతుడిప్పుడు కృతకృత్యుడై యున్నాడు. ఈతని యనుగ్రహము వలన ఫలమూలాదులను భుజింపుడు" అని పలికెను.

శ్రీపాదుక : ఇచ్చట అంగదుని యొక్క ఈ వచనము సాభిప్రాయము. వానరులకు సుగ్రీవాజ్ఞ అనుల్లంఘనీయము. ఉల్లంఘించిన వారెవరైనను మరణ

దండనము కర్హులగుదురు. ఈ విషయము నెఱిగి కూడ అంగదుడు వానరులను మధువనములోనికి ప్రవేశించి యధేచ్ఛగా విహరింపమనినాడు. కారణము లోగడ సుగ్రీవుడే –

"యస్తు మా సాన్నివృత్తోగ్రే దృష్టా సీతేతి వక్ష్యతి ।

మత్తుల్య విభవో భోగైః సుఖం స విహరిష్యతి ।

కృతాపరాధో బహుశః మమ బంధుర్భవిష్యతి ॥ (కిష్కంధ 40)

ఎవడు ఒక్క నెలలో తిరిగి వచ్చి **'చూచితిని సీతనని'** చెప్పునో వాడెంతటి అపరాధము నొనర్చినను నాతో సమానమైన వైభవమును పొందును. మఱియు నాకతడత్యంతాప్తుడగు బంధువు కాగలడని చెప్పెను. ఈ సుగ్రీవ వచనములను పరీక్షించుటకే అంగదుడు వానరులకు మధువనప్రవేశమున కనుమతించినాడని గ్రహించవలెను.

7) అప్పుడా వానరులందరును మధువనమును ప్రవేశించి మధువును త్రావనారంభించిరి. మరియు నచటనున్న మంచి సుంగంధభరితములైన ఫలములను, కందమూలములను భుజింపసాగిరి.

8) వారిలో మధుపాన మత్తులగు కొందరు పాడుచుండిరి. కొందరు ముందుకు బాగుగా తూలుచున్నారు. మరి కొందరు నర్తించుచున్నారు. కొందరు నవ్వుచున్నారు. ఇంకొందరు గాలిలో తేలుచున్నారు. కొందరిటునటు నడుచుచున్నారు. కొందరు గంతులు వేయుచున్నవారు కాగా మఱికొందరు వ్యర్థ ప్రలాపము లాడుచున్నారు.

9) కొందరొక చెట్టుపై నుండి వేరొకచెట్టు పైకెగురుచున్నారు. కొందరు వృక్షాగ్రముల నుండి భూమిపై దుముకుచున్నారు. ఇంకొందరు క్రింద నుండి చెట్లకొమ్మల పైకెగురసాగిరి.

10) ఒకడు ఆనందముతో పాడుచుండగా అతనినొకడు పళ్ళికిలించి పలకరించును. ఆనందముతో నవ్వుచున్న వానినింకొకడు ఏడ్చుచూ సమీపించును. ఏడ్చుచున్న వానికొకడేదియో పనిని పురమాయించుట కేగును. వానినింకొకడు బిగ్గరగా నరచుచూ సమీపించును.

11) ఇట్లు వనమంతయు పూర్తిగా భక్షింపబడుచుండెను. చెట్లు ఫలపుష్పాదులతోడి కొమ్మలు విరువబడి విధ్వస్తములు కాజొచ్చెను. ఇదంతయు చూచి కోపించిన దధివక్త్రుడను మహాకాయుడగు వానరుడు వానరవీరులను నివారించెను.

12) శ్లో ॥ తం సవృక్షం మహాబాహుం రూపవన్తం మహాబలమ్ ।
ఆర్యకం ప్రహర త్తత్ర బాహుభ్యాం కుపితోంగదః ॥

13) శ్లో ॥ మదాంధశ్చ న వేదైనమార్యకోఽయం మమేతి సః ॥

14) శ్లో ॥ హరయస్తా ననాదృత్య దధివక్త్రేణ చోదితాన్ ।
పిబత స్తాడయమాసు ర్వానరా న్వానరర్షభాః ॥

15) శ్లో ॥ తతో దధిముఖః క్రుద్ధ స్సుగ్రీవస్య చ మాతులః ।
జగామ రక్షిభి స్సార్థం యత్ర రాజా కపీశ్వరః ॥

భావము : అప్పుడు తన కెదురుగా మహావృక్షమును చేబూని వచ్చుచున్న పూజ్యుడగు అతనిని మహాబలసంపన్నుడగు అంగదుడు కోపించినవాడై రెండు చేతులతో కొట్టెను.

13, 14) మదముచే కన్నుగానని యంగదుడు మైకములో అతడు నాకు పూజ్యుడను విషయమును స్మరించలేదు. దధివక్త్రునిచే పంపబడిన వనపాలురను లెక్కచేయక వానరవీరులు వారినందరను త్రాగిన మైకములో పిడిగుద్దులను గ్రుద్దుచు హస్తపాదములతో మర్దించి కడుపుబ్బ మధువును సేవించిరి.

15) పిమ్మట చేయునది లేక వనపాలురతోపాటు సుగ్రీవుని మేనమామయగు దధిముఖుడు కోపముతో సుగ్రీవుని వద్దకు వెళ్ళెను.

16) శ్లో ॥ గత్వా త మబ్రవీ ద్దేవ చిరకాలాభిరక్షితమ్ ।
నష్టం మధువనం తేఽద్య కుమారేణ హనుమతా ॥

17) శ్లో ॥ నివార్యమాణా స్తే సర్వే భ్రువౌ వై దర్శయన్తి హి ॥

18) శ్లో ॥ ఇమే హి సంరబ్ధతరా స్తథా తై స్సంప్రధర్షితాః ।
పాణిభిర్నిహతాః కేచి త్కేచి జ్జానుభి రాహతాః ।
ప్రకృష్టాశ్చ యథాకామం దేవమార్గం చ దర్శితాః ॥

19) శ్లో ॥ శ్రుత్వా దధిముఖేనోక్తం రామః సుగ్రీవ మబ్రవీత్ ।
కి ముచ్యతే త్వయా రాజన్వచ స్సీతా కథాన్వితమ్ ॥

భావము : 16) సుగ్రీవుని వద్దకు వెళ్ళి దధిముఖుడాతనితో – చాలా కాలముగా రక్షింపబడుచున్న మధుమవనమిప్పుడు, అంగద కుమారునిచేతను, హనుమంతుని చేతను నాశనము చేయబడినది.

17) తమను నివారింపవచ్చిన కావలివారిని కనుబొమలు చూపుచు పరిహసించుచున్నారు.

18) మధువన పాలకులను వారు కొందరిని చేతులతో కొట్టిరి. కొందరిని మోకాళ్ళతో కొట్టి, ఇంకొందరిని పట్టి, లాగి, ఈడ్చి ఇచ్చమువచ్చినట్లుగా మోది తుదకు దేవమార్గము (తమ గుద ద్వారములను చూపినారు).

19) దధిముఖుడు చెప్పినది విని శ్రీరాముడు సుగ్రీవుని "సీతను గుఱించిన వృత్తాంతమునేమైనా చెప్పినాడా?" అని ప్రశ్నించెను.

20) శ్లో ॥ హే సుగ్రీవ హనూమతః కథ మహోవార్తాపి నాసాద్యతే ।
దుర్గమ్యో జలధిః పురీ చ విషమా తస్మా దిదం కల్యతే ।
దుష్టై ర్ధర్మ పరాఙ్ముఖై ర్దశముఖై స్సార్థం కిలాలాపతో
యాతో వా న హి వా న వాయుతనయః కాలానురూపక్రియః॥

భావము : సుగ్రీవా! హనుమంతునికి సంబంధించిన సమాచారమేమియు తెలియబడుటలేదు. సముద్రమా! దాటరానిది. లంకానగరమన్ననో విషమమైనది. చొరశక్యము కానిది. ధర్మవిముఖులైన దుష్టదశముఖాది రాక్షసులలో సంప్రదించుచున్నాడా? సమయానుకూలముగా కార్యములను నిర్వర్తించునట్టి ఆ వాయుపుత్రుడు లంకానగరమునకు పోయెనా? లేదా యని పల్కుచుండగనే –

లక్ష్మణః –

21) శ్లో ॥ కి మయం వానరో రాజన్ వనపః ప్రత్యుపస్థితః ।

కం చార్థ మభినిర్దిశ్య దుఃఖితో వాక్య మబ్రవీత్ ॥

భావము : లక్ష్మణుడు కూడ సుగ్రీవుని – రాజా సుగ్రీవా ! వనపాలుకుడగు ఈ వానరుడు (దధిముఖుడు) ఎందులకు అకారణముగా నిట్లువిచ్చేసినాడు? అతడెందులకిట్లు దుఃఖించుచున్నాడని ప్రశ్నించెను.

శ్రీపాదుక : దధిముఖుడు వానరభాషలో చెప్పినది తెలియక పోవుటచే లక్ష్మణుడిట్లు భాషించియుండును.

సుగ్రీవః –

22) శ్లో ॥ ఆర్య లక్ష్మణ సంప్రాహ వీరో దధిముఖః కపిః ।

విచిత్య దక్షిణామాశా మాగతైర్హరిపుంగవైః ॥

23) శ్లో ॥ అంగద ప్రముఖై ర్వీరైర్భక్షితం మధు వానరైః ॥

24) శ్లో ॥ దృష్ట్వాఽఽగతో న సందేహ స్సీతాం పవననందనః ।

నోచే న్మధువనం ద్రష్టుం సమర్థః కో భవే న్మమ ॥

25) శ్లో ॥ రక్షిణో వో భయం మాస్తు గత్వా బ్రూత మమాజ్ఞయా ।

వానరా నంగదముఖా నానయధ్వం మమాన్తికమ్ ॥

26) శ్లో ॥ సుగ్రీవేణైవ ముక్తస్తు హృష్టో దధిముఖః కపిః ।

వానరై స్సహితై శ్శూరైర్దివ మేవోత్పపాత హ ॥

27) శ్లో ॥ స ప్రవిష్టో మధువనం దదర్శ హరియూథపాన్ ।

విమదా నుత్థితాన్ సర్వాన్ మేహమానాన్మధూదకమ్ ॥

భావము : పూజ్యుడవగు లక్ష్మణా! ఇతడు దధిముఖుడను వనపాలాధ్యక్షుడు. సీతను వెదుకుటరై దక్షిణదిశకేగిన అంగదాదులగు వానరువీరులు మధువనంతను స్వేచ్ఛగా భక్షించిరని చెప్పుచున్నాడు.

వాయుపుత్రుడగు హనుమంతుడు సీతను చూచి వచ్చియుండవలెను. లేకున్నచో నా మధువనమును కన్నెత్తి చూచుటకు కూడ వారికి ధైర్యము చాలదు.

పిమ్మట సుగ్రీవుడు దధిముఖుని వైపు చూచి – ఓ వనపాలకులారా! మీరు భయపడవలదు. మరల మధువనమునకు పోయి నా యాజ్ఞగా అంగద ప్రముఖులగు వానరులనందరను నా వద్దకు తీసికొని రండు అని పలికెను.

సుగ్రీవుడు ఇట్లు పలికినదే తడవుగా దధిముఖుడు మిక్కిలి సంతోషించి శూరులైన వనపాలురతో సహ ఆకాశము పైకెగిరిపోయెను.

అతడు మధువనమును ప్రవేశించి యచట తామిది వరకు త్రాగిన మధువు పూర్తిగా జీర్ణమై మూత్రరూపమున విసర్జించి, మత్తు దిగి లేచి తిరుగాడుచున్న వానరవీరులను చూచెను.

28) శ్లో ॥ అజ్ఞానా ద్రక్షిభిః క్రోధా ద్భవన్తః ప్రతిషేధితాః ।
మౌర్ఖ్యా త్పూర్వం కృతో దోష స్తం భవాన్ క్షన్తు మర్హసి ॥

29) శ్లో ॥ ఆఖ్యాతం హి మయా గత్వా పితృవ్యస్య తవానఘ ।
ప్రహృష్టో న తు రుష్టోఽసౌ వనం శ్రుత్వా ప్రధర్షితమ్ ॥

30) శ్లో ॥ ద్రష్టుమిచ్ఛతి సుగ్రీవ స్సరామో లక్ష్మణాన్వితః ।
యుష్మా నతీవ హృష్టా స్తే త్వరయన్తి మహాబలాః ॥

31) శ్లో ॥ శ్రుత్వా దధిముఖస్యేదం వానరా నంగదోఽబ్రవీత్ ।
శంకే శ్రుతోఽయం వృత్తాంతో రామేణ హరియూథపాః ।
అయం చ హర్షా దాఖ్యాతి తేన జానామి హేతునా ॥
తత్ క్షమం నేహ న స్థాతుం కృతే కార్యే పరంతపాః ॥

32) శ్లో ॥ కిం శేషం గమనం తత్ర సుగ్రీవో యత్ర మే గురుః ।
నాజ్ఞాపయితు మీశోఽహం యువరాజోఽస్మి యద్యపి ॥

భావము : ఓ అంగదా ! అజ్ఞానము వలన, క్రోధపరవశులమై మేము మిమ్ములను అడ్డగించితిమి. మూర్ఖత్వమువలన మేముచేసిన అపరాధము క్షమింపవలసినది.

పాపరహితుడవైన ఓ అంగదా! మీ పినతండ్రికి విషయము నంతనూ విన్నవించితిని. మధువనము వినష్టమైనదని విని కూడా అతడు కోపగించ లేదు పైగా మిక్కిలి సంతోషించెను.

సుగ్రీవుడు శ్రీరామలక్ష్మణులతో కూడా మిక్కిలి ఆనందముతో మిమ్ము చూడగోరుచున్నారు.

దధిముఖుని మాటలను విని అంగదుడు వానరులతో ''ఓ వానరయూధవరులారా! ఈ వృత్తాంతమును శ్రీరాముడు సైతము వినియుండవచ్చును. దధిముఖునిసంతోషము ఈవిషయమును తెలియజేయుచున్నది.

ఓ అరివీరభయంకరులారా ! సుగ్రీవుడాజ్ఞాపించిన కార్యము నెరవేరినది. మన కిచట కర్తవ్యమేమియు లేదు. నా పినతండ్రియగు సుగ్రీవుని వద్దకే మనమిప్పుడు వెళ్ళవలెను. యూథపతిగా, యువరాజుగా నియమించబడినను, నేను మిమ్ములనాజ్ఞాపించుట లేదు.

వానరాః -

34) శ్లో ॥ ఏవం వక్ష్యతి కో రాజన్ ప్రభుస్సన్ వానరర్షభ !

ఐశ్వర్య మదమత్తో హి సర్వోఽహ మితి మన్యతే ॥

35) శ్లో ॥ తవ చేదం సుసదృశం వాక్యం నాన్యస్య కేనచిత్ ।

బాఢం గచ్ఛామ ఇత్యుక్త్వా ఖముత్పేతు ర్మహాబలాః ॥

ఇతి శ్రీ రామాయణ సారోద్ధారే సుందరకాండే అష్టాదశః సర్గః

భావము : అంగదుని సౌమ్య వచనములను విన్న వానరులు అంగదునితో ఓ రాజా ! నీ వలె ప్రభువైయుండి కూడా ఇట్లెవరు పలుకుదురు? ఐశ్వర్యమదగర్వితులైన వారు, అంతకును తామేమూలము అని అహంకారపూరితులై యుందురు.

ఇట్లు వినయపూర్వకముగా పలుకుట నీకు మాత్రమే తగియున్నది. ఇతరులకెవ్వరికినీ ఇట్లు పలుకుట సాధ్యము కాదు. తప్పక మనమందరము సుగ్రీవుని వద్దకు పోయెదము, అని పలుకుచు ఆకాశమార్గమున కెగిరిపోయిరి.

ఇది శ్రీమద్రామాయణ సారోద్ధారము నందలి సుందరకాండమున

పదునెనిమిదవ సర్గము

సర్గాంతశ్లోకసంఖ్య-(934+35=969)

ఏకోనవింశః సర్గః

1) శ్లో ॥ హనూమన్తం పురస్కృత్య యువరాజం తథాంగదమ్ ।
రామసుగ్రీవయోరగ్రే నిపేతు ర్భువి సత్వరమ్ ।

2) శ్లో ॥ హనూమా న్రాఘవం ప్రాహ దృష్టా సీతా నిరామయా ॥

3) శ్లో ॥ దృష్టా సా జనకాత్మజా రఘుపతే యుష్మత్ప్రసాదాన్మయా ।
లంకానామ్ని పురే సముద్రజఠరే తత్ర స్థితా జానకీ ।
రాహుగ్రస్తనిశాకరాచ్చ్యుత కళాలావణ్యహీనా ప్రభో ।
సీతాజీవన కారణం వద కపే రామామృతం జీవనమ్ ॥

4) శ్లో ॥ కరం కపోలే వదనే చ మౌనమ్।
దృశో ర్జలం ధూళిచయః కచేషు ।
అణుత్వ మంగే హృదయే దవం తమ్।
సా బిభ్రతీ శోకదవానలస్థా ॥

5) శ్లో ॥ హనుమాంశ్చ మహాబాహుః ప్రణమ్య శిరసా తతః ।
నియతా మక్షతాం దేవీం రాఘవాయ న్యవేదయత్ ॥

భావము : 1) ఆ విధముగా బయలుదేరిన వానరులందరు హనుమంతుని యువరాజగు అంగదుని ముందుంచుకొని శ్రీరామ సుగ్రీవులకెదురుగా భూమిపైకి శీఘ్రముగా దిగిరి.

2) పిదప హనుమంతుడు శ్రీరామునితో–**"చూచితిని క్షేమముగా నున్న సీత"**నని పలికి – అటుపై

3) ఓ రాఘవా! తమ యనుగ్రహమువలన నేను సముద్రగర్భమునందున్న లంకాపట్టణములో నున్న జనకరాజపుత్రియగు సీతను, రాహువుచే కబళింపబడిన చంద్రకళ వలె, కళావిహీనమై నిస్తేజస్వినిగా జూచితిని అని పలికెను. రాముడావిధమైన జీవన కారణమేమని యడుగగా రామామృతమేనని బదులు పలికెను.

4) ఆమె చేతులలో చెక్కిళ్ళను, ముఖములో మౌనమును, కళ్ళలో కన్నీటిని, కొప్పును ధూళిరేణువులలో, శరీరములో కృశత్వమును, హృదయములో దావాగ్నిని నింపుకొనినదై దుఃఖమనియెడి కార్చిచ్చులో పరితపించుచున్నది.

5) పిమ్మట హనుమంతుడు శిరసా రామునకు ప్రణమిల్లి సీతయొక్క తరగని పాతివ్రత్యనియతిని విన్నవించెను.

6) శ్లో ॥ రావణాన్తః పురే రోధం రాక్షసీభిశ్చ తర్జనమ్ ।
రామే సమనురాగం చ య శ్చాయం సమయః కృతః ॥

7) శ్లో ॥ సీతాయై ముద్రికాదానం రామసందేశ వేదనమ్ ।
వనభంగం చ తత్పుత్రమారణం రావణేక్షణమ్ ॥
పుచ్ఛేగ్నిదీపనం స్వస్య లంకాదాహం తదగ్నినా ।
పునర్దేవీం సమాలోక్య ప్రత్యాగమన మాహ సః ॥

భావము : 6) రావణుని యంతఃపురములో సీతయొక్క నిర్బంధము, రాక్షసస్త్రీలామెను భయపెట్టుట, ఆ స్థితిలోకూడ రామునియందు సడలని యనురాగము, రావణుడు పరుషములాడి రెండుమాసములు గడువు పెట్టుట.

7) సీతకు తాను ముద్రికనిచ్చుట, రాముని సందేశమును విన్నవించుట, అశోకవన భంజనము, రావణసుతుడగు అక్షకుమారునివధ, రావణసందర్శనము, తన తోకకు నిప్పంటిచుట, అదే యగ్నితో లంకను దహించుట, మరల సీతను సందర్శించి ఇచటకీ విధముగా మరలివచ్చు వరకుగల వృత్తాంతమును శ్రీరామునకు విన్నవించెను.

8) శ్లో ॥ లక్ష్మణః ప్రీతిమా న్ప్రీతం బహుమానా దవైక్షత ॥

9) శ్లో ॥ పృష్టోఽహం సీతయా కస్త్వ మిత్యాది బహువిస్తరమ్ ।
మయా సర్వం క్రమేణైవ విజ్ఞాపిత మరిందమ ॥

10) శ్లో ॥ పశ్చా న్మయార్పితం దేవ్యై భవద్దత్తాంగులీయకమ్।
ఇదానీమేవ గత్వాఽహం స్థితిం రామాయ తే బ్రువే ॥

11) శ్లో ॥ అభిజ్ఞాం దేహి మే దేవి యథా మాం విశ్వసేత్ప్రభుః ।
ఇత్యుక్తా సా శిరోరత్నం చూడాపాశే స్థితం ప్రియమ్ ॥

12) శ్లో ॥ దత్త్వా కాకేన య ద్వృత్తం చిత్రకూటగిరౌ పురా ।
తదప్యాహా౽శ్రుపూర్ణాక్షీ కుశలం బ్రూహి రాఘవమ్ ॥

13) శ్లో ॥ లక్ష్మణం బ్రూహి మే కించి ద్దురుక్తం భాషితం పురా ।
తత్ క్షమస్వాజ్ఞభావేన భాషితం కులవర్ధన (నందన) ॥

14) శ్లో ॥ ఇత్యుక్త్వా రుదతీ సీతా దుఃఖేన మహతా వృతా ।
మయా ప్యాశ్వాసితా రామ వదతా సర్వమేవ తే ॥

15) శ్లో ॥ తతః ప్రస్థాపితో రామ! త్వత్సమీపముపాగతః ।
తదాగమన వేళాయా మశోకవనికాం ప్రియామ్ ॥

16) శ్లో ॥ ఉత్పాట్య రాక్షసాం స్తత్ర బహూన్హత్వా క్షణాదహమ్ ।
రావణస్య సుతం హత్వా రావణేనాభిభాష్య చ ॥

17) శ్లో ॥ లంకా మశేషతో దగ్ధ్వా పునరప్యగమం క్షణాత్ ।
జీవితం ధారయిష్యామి మాసం దశరథాత్మజ!

18) శ్లో ॥ ఊర్ధ్వం మాసా న్న జీవేయం రక్షసాం వశమాగతా ।
ఇతి మా మబ్రవీత్సీతా కృశాంగీ ధర్మచారిణీ ॥

19) శ్లో ॥ తం మణిం కాంచనం దివ్యం దీప్యమానం స్వతేజసా ।
దత్త్వా రామాయ హనుమాంస్తతః ప్రాంజలి రబ్రవీత్ ॥

భావము : 8) అప్పుడు సంతుష్టుడైన లక్ష్మణుడు ప్రీతిభాజనుడగు హనుమంతుని మిక్కిలి యాదరముతో చూచెను.

9) అప్పుడా హనుమంతుడు మరల శ్రీరామునితో శత్రుమర్దనా! నన్నా సీత నీవెవడవు ఇత్యాది బహు ప్రశ్నలనడుగగానే నామెకు క్రమముగా విషయము నంతను విన్నవించితిని.

10) పిమ్మట నీచే నీయబడిన ఉంగరము నామెకిచ్చి ఇప్పుడే నేను వెనుకకు మరలి నీయీ స్థితిని రామునకు తెలియచేసెదను.

11) దేవీ ! ప్రభువగు శ్రీరాముడు నన్ను విశ్వసించునట్లు నాకొక ఆనవాలు నిమ్ము అని నేనడుగగా యామె తన కొప్పుముడిలో నిమిడి యున్న చూడామణిని నాకిచ్చి–

12) పూర్వము చిత్రకూట పర్వతమున జరిగిన కాకాసుర వృత్తాంతము అశ్రు పూర్ణములైన నేత్రములతోచెప్పి జాలిగా శ్రీరామునకు నా కుశలమును తెలుపుము. మఱియు మా లక్ష్మణునితో-

13) "పూర్వము నేనాతనినాడిన దుర్భాషలను క్షమింపుము. ఓ ఇక్ష్వాకుకుల వర్ధనా! అజ్ఞానముచే నేను పలికిన మాటలకు నన్ను క్షమింపుము".

14) రామా ! ఇట్లేడ్చుచూ పలికిన సీతను, మీ క్షేమములను తెలిపి ఓదార్చితిని.

15) తరువాత నామెచే వీడ్కొల్పబడినవాడనై నీ యొద్దకిట్లు వచ్చితిని.

16) నేను వచ్చునప్పుడు రావణునకు ప్రియమైన అశోకవనిని పెల్లగించి, అడ్డు తగిలిన చాలామంది రాక్షసులను వధించి,

17) ఆ క్షణముననే నన్నెదిరించిన రావణుని కుమారుని వధించి, రావణునితో మాట్లాడి లంకనంతను పూర్తిగా తగులబెట్టి శీఘ్రముగా నిచటకు వచ్చితిని.

18) అప్పుడు కృశాంగియు, నీ సహధర్మచరియగు సీత నీతో – ఓ దశరథ నందనా ! ఈ రాక్షసుల వశంగతనైన నేను ఒక్క నెల మాత్రమే జీవించెదను. ఆపై మరణించెదను. కావున నన్నీ చెఱనుండి విడిపించుము, అని చెప్పమని నన్నభ్యర్థించెను అని చెప్పుచునే...

19) తేజస్వంతమై వెలుగొందుచున్న ఆ శిరోరత్నమును రామునికిచ్చి, అంజలిఘటించి శీఘ్రముగా సముద్రమును దాటుటకు ప్రయత్నము గావింపుమని ప్రార్థించెను.

20) శ్లో ॥ సర్వథా సాగరజలే సంతారః ప్రవిధీయతామ్ ।

తౌ జాతాశ్వాసౌ రాజపుత్రౌ విదిత్వా ।

త చ్చాభిజ్ఞానం రాఘవాయ ప్రదాయ ।

దేవ్యా చాఖ్యాతం సర్వ మేవానుపూర్వ్యా

ద్వాచా సంపూర్ణం వాయుపుత్రః శశంస ॥

భావము : హనుమంతుడీ విధముగా సీత ఆనవాళ్ళను రామునకిచ్చి, రామలక్ష్మణులనోదార్చి, సీతచెప్పిన విషయములనదేక్రమములో సంపూర్ణముగా వారికి తెలియజేసెను.

21) శ్లో ॥ ఏవముక్తో హనుమతా రామో దశరథాత్మజః ।
తం మణిం హృదయే కృత్వా ప్రరురోద సలక్ష్మణః ॥

భావము : హనుమంతుడిట్లు చెప్పుచుండగనే శ్రీరాముడా మణిని గుండెలపై ధరించి భోరున విలపించెను. లక్ష్మణుడును రాముని చూచి రోదించెను.

22) శ్లో ॥ మణిరత్న మిదం దత్తం వైదేహ్యా శ్వశురేణ మే ।
వధూకాలే యథాబద్ధ మధికం మూర్ధ్ని శోభతే ॥

23) శ్లో ॥ అయం హి జలసంభూతో మణి స్సజ్జనపూజితః ।
యజ్ఞే పరమతుష్టే స దత్త శ్శక్రేణ ధీమతా ॥

24) శ్లో ॥ ఇమం దృష్ట్వా మణిశ్రేష్ఠం యథా తాతస్య దర్శనమ్ ।
మణిం పశ్యామి సౌమిత్రే వైదేహీమాగతాం వినా ॥

25) శ్లో ॥ చిరం జీవతి వైదేహీ యది మాసం ధరిష్యతి ।
క్షణం సౌమ్య న జీవేయం వినా తా మసితేక్షణామ్ ॥

26) శ్లో ॥ యో భార్యాం ప్రణతాం పాపో నానుమాన్యేత మూఢధీః ।
స షండో భవతీ త్యత్ర దశజన్మాని సప్త చ ॥

భావము : 22) మణిని గుఱించి రాముడు సుగ్రీవునితో – ఈ రత్నమణిని వివాహసమయమున మా మామగారైన జనకమహారాజు నాచే శిరోభూషణ మగునట్లు సీత శిరమున కట్టించెను అని చెప్పెను.

23) యజ్ఞసమయమున పరమతుష్టిని పొందిన దేవేంద్రుడీమణిని జనక మహారాజునకిచ్చెను. సజ్జనపూజితమగు ఈ మణిజలములనుండి ఆవిర్భవించినది.

24) లక్ష్మణా! ఈ మణిని చూచినంతనే నేను తండ్రిని దర్శించినంతగా సంతోషించుచున్నాను. కాని వైదేహినివీడి వచ్చినందులకీ మణి మిక్కిలి దుఃఖించుచున్నట్లున్నది.

25) సీత నెలకాలము జీవింపగలదేని చిరకాలము జీవింపగలదని చెప్పవచ్చును. సౌమ్యుడా! లక్ష్మణా! సీత లేనిదే నేను క్షణకాలమైనను బ్రతుకజాలను.

26) అణుకువతో ప్రణమిల్లు భార్యనంగీకరింపనివాడు, పదునేడు జన్మలు నపుంసకుడుగా జన్మించును.

హనుమానువాచ –

27) శ్లో ॥ అథాహ ముత్తరం దేవ్యా పునరుక్త స్ససంభ్రమః ।
గతే హి త్వయి విక్రాన్తే పునరాగమనాయ వై ॥

28) శ్లో ॥ ప్రాణానా మపి సందేహో మమ స్యా న్నాత్ర సంశయః ।
అయం చ వీర సందేహ స్తిష్ఠతీవ మమాగ్రతః ॥

29) శ్లో ॥ కథం ను ఖలు దుష్పారం తరిష్యన్తి మహోదధిమ్ ।
తాని హర్యృక్షసైన్యాని తౌ వా నరవరాత్మజౌ ॥

30) శ్లో ॥ త్రయాణామేవ భూతానాం సాగరస్యాస్య లంఘనే ॥
శక్తిస్స్యా ద్వైన తేయస్య తవ వా మారుతస్య వా ।

భావము : 27) హనుమంతుడు పల్కెను. “సీత మన ఇద్దరి యాత్మీయతను పురస్కరించుకొని నీవు వెడలిన పిమ్మట మరల త్వరగా వచ్చుటెట్లు సంభవమా? యని సంశయింపసాగెను.

28) హనుమంతుడా! ఏదన– నీరాక కెదురు చూచుచుండగనే నా ప్రాణములు పోవచ్చును. ఇది నా ఎదుట నున్న యొక సందేహము (సవాలు)

29) దాటశక్యము కాని యా మహాసముద్రమును, వానర, ఋక్షసైన్యములతో రామలక్ష్మణులు, కపీశ్వరుడగు సుగ్రీవుడును దాటి ఎట్లురాగలరు. ఇది నా రెండవ సంశయము.

30) వైనతేయుడు అనగా గరుత్మంతుడు, నీవు, మీ తండ్రియగు వాయుదేవుడు ఈ ముగ్వురకు మాత్రమే సముద్రమునుల్లంఘించు సామర్థ్యము కలదు.

31) శ్లో ॥ నిశమ్యాహం తత శ్శేషం వాక్య ముత్తర మబ్రువమ్॥
మద్విశిష్టాశ్చ తుల్యాశ్చ సంతి తత్ర వనౌకసః ।

32) శ్లో ॥ మత్తః ప్రత్యవరః కశ్చి న్నాస్తి సుగ్రీవసన్నిధౌ ॥
అహం తావ దిహ ప్రాప్తః కిం పున స్తే మహాబలాః ।

33) శ్లో ॥ న హి ప్రకృష్టాః ప్రేష్యన్తే ప్రేష్యన్తే హీతరే జనాః ॥

మమ పృష్ఠగతౌ తౌ చ చంద్రసూర్యా వివోదితౌ ।

34) శ్లో ॥ త్వత్సకాశం మహాభాగే నృసింహో వాగమిష్యతః ॥

భావము : 31) ఆమె యిట్లు చెప్పుచుండగనే సమాధానముగా నేను నాకంటె నుత్తమబలవంతులు సుగ్రీవుని కొలువులో నున్నారు.

32) అందరిలో నేనే బలహీనుడను. నేను ఇట్లిచటకు రాగా వారి విషయము చెప్పనవసరము లేదు (వానరులందరు తప్పకరాగలరని భావము)

33) లోకములో దౌత్యమునకు దుర్బలులగు వారిని మాత్రమే పంపుదురు. బలాఢ్యులను కార్యకుశలురను రాయబారమునకు పంపరు.

34) ఓ మహానుభావురాలా! రామలక్ష్మణుల నిరువురను సూర్యచంద్రులవలె భుజములపైకెక్కించుకుని సముద్రమును దాటింపగలను. వారు తప్పక అచిరకాలములోనే నీ సన్నిధానములో నుందురు.

35) శ్లో ॥ అరిఘ్నం సింహసంకాశం క్షిప్రం ద్రక్ష్యసి రాఘవమ్ ।

లక్ష్మణం చ ధనుష్పాణిం లంకాద్వార ముపస్థితమ్ ॥

36) శ్లో ॥ సుగ్రీవ సహితం శూరం వానరైః పరివారితమ్ ।

వానరా న్వారణేన్ద్రాభాన్ క్షిప్రం ద్రక్ష్యసి సంగతాన్ ॥

37) శ్లో ॥ నివృత్తవనవాసం చ త్వయా సార్ధ మరిందమమ్ ।

అభిషిక్త మయోధ్యాయాం క్షిప్రం ద్రక్ష్యసి రాఘవమ్ ॥

భావము : 35) శత్రుహన్తయు, సింహతుల్య పరాక్రముడు అగు శ్రీరామున ధనుర్ధరుడగు లక్ష్మణునితో పాటుగా శీఘ్రమే లంకాద్వారమునకు చేరినవారిగా చూచెదవు.

36) వానర వీరులతో కూడ పరాక్రమశాలియగు సుగ్రీవుని, ఏనుగుల వలె మహాకాయములు గల సైన్యముతో కూడి వచ్చుచున్నట్లు త్వరలోనే చూడగలవు.

37) వనవాసమును పూర్తి చేసుకొని, శత్రువులను పరిమార్చి నీతోపాటు అయోధ్యలో పట్టాభిషిక్తుడైన శ్రీరాముని అతి త్వరలో చూడబోవుచున్నావు.

38)శ్లో ॥తతో మయా వాగ్భి రదీన భాషిణా శివాభి రిష్టాభిరభిప్రసాదితా ।

జగామ శాన్తిం మమ మైథిలాత్మజా తవాపి శోకేన తదాஉభి పీడితా॥

39) శ్లో ॥ ఇషీకస్తవ సంకల్పా దేతావత్కుర్తు మర్హతి ।

అహం కిముత లోకేశ దాసోஉహం చేతనః ప్రభో ॥

ఇతి శ్రీ రామాయణసారోద్ధారే సుందరకాండే

ఏకోనవింశః సర్గః

భావము : 38) ఇట్టి విధము దైన్యమును పోగొట్టి ధైర్యమును సమకూర్చునట్లుగా నేను పలుకుచుండగా, మంగళకరములైన మరియు అభీష్టద్యోతకములగు వచనములతో మైథిలి, నిన్ను వీడినందుకు నన్ను వీడుచున్నందుకు కలిగిన దుఃఖమును వీడి నన్ను వీడ్కొల్పెను.

39) శ్రీరామచంద్రా! నీ సంకల్పముచే అభిమంత్రింపబడిన అచేతనమగు తృణాంకురమే (గడ్డిపోచయే) ఎంతటి మహాకార్యమునైనను సాధింపగలదు. జగత్ప్రభూ! నీ దాసుడను పైగా చేతనుడనైన నేనీమాత్రపు స్వల్పకార్యమును నిర్వర్తించుటలో ఆశ్చర్యమే ముండును (ఎట్టి అసాధ్యమునైనను సాధించి తీరగలనని హనుమంతుని హృదయము).

శ్రీపాదుక : ఈ హనుమత్సంకల్పమే శ్రీరామదాసుడగు హనుమయొక్క సర్వసిద్ధిప్రదమైన

“అసాధ్య సాధకః స్వామిన్!అసాధ్యం తవ కిం వద !

రామదూత! కృపాసింధో!మత్కార్యం సాధయ ప్రభో!”

అను **అసాధ్యసాధకహనుమన్మహామంత్రముగా** రూపొంది అశేషభక్తబృందములను హనుమదనుగ్రహపాత్రులను గావిస్తున్నది.

ఇది శ్రీమద్రామాయణ సారోద్ధారములోని సుందరకాండలో

పందొమ్మిదవ సర్గము

సర్గాంతశ్లోకసంఖ్య-(969+39=1008)

సుందరకాండము సమాప్తము

శ్రీపాదుకా ప్రచురణలు

1. పాణినీయ శిక్ష (తెలుగు) ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి ఆర్థిక సహాయంతో ముద్రించబడినది.
2. ఆంధ్ర దేశీయ ద్రావిడుల చరిత్ర మరియు సంస్కృతి
   శ్రీసారంగధరేశ్వరాలయచరిత్ర
3. జ్ఞానపూర్ణిమ
4. శివోఽహం శివోఽహం
5. శివఃకేవలోఽహమ్
   ఐశ్వర్యవిద్యాసర్వస్వము
6. ఆంజనేయముపాస్మహే
7. అయ్యప్పదర్శనమ్
8. శ్రీపాదుకాకల్పము
9. హనుమత్తత్వరహస్యోపనిషత్తు
10. 'శర్మద' – సంపాదకీయాల
11. షష్టిపూర్తిసంచిక
    సూర్యశతకము
12. అమ్మతో ముఖాముఖి
13. ఐశ్వర్యశ్రీకల్పము
14. శివశతకము
15. ఉపనయనం ఎందుకు?
16. శ్రీపాదుకాకామేశ్వరమ్
17. శ్రీపాదుకాసత్యదేవమ్
18 పూర్ణమీమాంస
19. విశ్వనాథపంచశతి
20. శ్రీపాదుకాన్నపూర్ణమ్
21. శ్రీపాదుకావిశ్వనాథమ్
22. శ్రీ అన్నపూర్ణావ్రతము
23. శ్రీఅన్నపూర్ణావ్రతకల్పము(హిందీ)
24. శ్రీ పాదుకాకల్పము
25. కాశీకేదారేశ్వరశ్రీపాదుక
26. యజ్ఞ ప్రసాదము (జయ శ్రీరామ)
27. యజ్ఞ ప్రసాదము(జయాంజనేయ)
28. యజ్ఞప్రసాదము(జయరాధేశ్యామ్)
29. సాంబపంచాశికా
30. శివానందలహరి
31. శ్రీదేవీమహాత్మ్యము–దుర్గానవశతి
32. శ్రీపాదుకాభీమనాథమ్
33. శ్రీపాదుకా శ్రీకృష్ణమ్

అముద్రితములు

1. శ్రీబాలాశతకము
2. శ్రీచక్రసంచారిణీశతకము
3. సౌందర్యలహరి (తెలుగు పద్యానువాదము)
4. మందాక్రాంతా సౌందర్యలహరీ(సం.)
5. దశ మహావిద్యాదిస్తోత్ర కదంబము
6. భగవద్గీత–శంకరహృదయము
7. మంగళచణ్డీశతకము
8. శ్రీ హనుమత్‌శతకము
9. శ్రీరామశతకము
10 శ్రీపాదుకాపాండురంగమ్

సుందరే సుందరో రామః సుందరే సుందరీ కథా।
సుందరే సుందరీ సీతా సుందరే సుందరం వనమ్।
సుందరే సుందరం కావ్యం సుందరే సుందరః కపిః।
సుందరే సుందరం మంత్రం సుందరే కిం న సుందరమ్ ?

'శ్రీపాదుక'
ఆచార్య కొల్లూరు అవతారశర్మ (కాశీవాసి)